ఓం దుర్గాయైనమః

శ్రీ దేవీభాగవతము

రచన

సుబ్రహ్మణ్యం పిళ్ళై గిరిధరన్

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2019

SRI DEVI BHAGAVATHAM

by
Subrahmanyam Pille Giridharan, M.A., B.Ed., B.P.Ed.,

T.T.D. Religious Publications Series No. 1377
© All Rights Reserved

First Edition : 2019

Copies : 500

Price :

Published by :
Sri Anil Kumar Singhal, I.A.S.
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

D.T.P:
Publication Division,
T.T.D., Tirupati.

Printed at :
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

ముందుమాట

ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్.

వేదం చెప్పినధర్మం, అధర్మం మొదలయిన అంశాలను సామాన్యులకు కూడా అందుబాటులోకి తేవడానికి ఇతిహాసాలు, పురాణాలు ఏర్పడ్డాయి. అఖండంగా ఉన్నవేదాన్ని విభాగం చేసి, నాలుగువేదాలుగా ఏర్పరచడం వలన ఈమహర్షి వేదవ్యాసుడు అయ్యాడు. **తత్ర భాగవతం పుణ్యం పంచమం వేదసమ్మితమ్.** (1.16) పురాణాలు వేదసమ్మితంగా రచించాడు.

అష్టాదశపురాణాని చ కృత్వా భగవాన్ మునిః, దేవీభాగవతం తత్ర పురాణం భోగమోక్షదమ్. (దేవీభాగవతమాహాత్మ్యం. స్కాందం. 4.17,18) దేవీభాగవతం అష్టాదశపురాణాలలోనిది అని చెప్తున్నది.

అంతకు ముందు **'పురాణ ముత్తమం పుణ్యం శ్రీమద్భాగవతాభిధం, అష్టాదశసహస్రాణి శ్లోకా స్తత్ర తు సంహితాః** (2.11) అని దేవీభాగవతాన్ని కూడ పురాణంగా పేర్కొన్నాడు. తరువాత **'మాహేశ్వరం భాగవతం వాసిష్టం చ సవిస్తరమ్, ఏతా న్యుపపురాణాని కథితాని మహాత్మభిః'** (3.16) అని దేవీభాగవతాన్ని ఉపపురాణంగా చెప్పినట్లుంది. పురాణసంజ్ఞ సాధారణం కాగా ఉపపురాణసంజ్ఞ విశేషం.

ఏది ఏమయినా, దేవీభాగవతమహిమ విశిష్టం.

య స్తు భాగవతం దేవ్యాః పఠేద్ భక్త్యా శృణోతి వా,
ధర్మ మర్థం చ కామం చ, మోక్షం చ లభతే నరః.

శ్రీమద్దేవీభాగవతాన్ని చదివినా, విన్నా, మానవుడు ధర్మం, అర్థం, కామం, మోక్షం అనేనాలుగుపురుషార్థాలు పొందుతాడు. ఇది కూడా చేయలేనివాడు ఇంట్లో దేవీభాగవతగ్రంథాన్ని ఉంచుకుని, యథాశక్తి పూజించినా, కనీసం ఒక్కపువ్వు ఉంచినా, ఆఇల్లు పవిత్రపుణ్యక్షేత్రమై, అందులో ఉన్నవారి పాపాలు నశించిపోతాయి.

శరదృతువులో అందులోనూ ముఖ్యంగా నవరాత్రులపర్వదినాలలో దేవీభాగవతాన్ని పారాయణం చేయడం ప్రసిద్ధం. ఎవరైనా, కేవలం భక్తితో ఉపాసించ దగినది కావడంచేత దేవీభాగవతం అందరిఇళ్లలో పారాయణలోనూ, పండితులపురాణప్రవచనాలలోనూ ప్రసిద్ధ మయింది.

సప్తశతిలోని మధుకైటభవధ, మహిషాసురాదివధ, శుంభ నిశుంభవధ అనేప్రధానచరిత్రలు మూడూ దేవీమాహాత్మ్యంలో ఉన్నాయి. దీనివలన దేవీమాహాత్మం సప్తశతీసారం అవుతున్నది.

మహాలక్ష్మిఉపాఖ్యానం లక్ష్మీదేవి మాహాత్మ్యాన్ని తెలుపుతుంది. తులసి, షష్ఠి, మంగళచండి మానస, భ్రామరి మొదలుగా దేవి ఆయారూపాలచరిత్ర ఇందులో చెప్పబడింది. గాయత్రికి సంబంధించిన విశేషాలు దేవీభాగవతంలో అధికంగా లభిస్తాయి. సంతానం లేనివారు షష్ఠీదేవిచరిత్రను 40 రోజులు పారాయణం చేసి సంతానం పొందటం ప్రత్యక్షం. దేవీమహిమ ఇందులో బహుముఖంగా వర్ణింపబడింది. విభూతి, రుద్రాక్షమహిమలు, మొదలుగా అనేక విషయాలు దేవీభాగవతంనుండి తెలుసుకోవచ్చు. అవన్నీ గ్రంథం చదివి తెలుసుకోవలసినవే కాని ఒకటిరెండుమాటలలో చెప్పడానికి అవకాశం లేదు.

సంస్కృతంలో ఉన్నఆబృహద్గ్రంథాన్ని శ్రీ సుబ్రహ్మణ్యం పిళ్లై గిరిధరన్ గారు అందరికీ సులువుగా అర్థమయ్యే విధంగా తెలుగువచనంలో అనువదించారు. నిత్యమూ, ముఖ్యంగా దేవీ శరన్నవరాత్రులలో ప్రతిరోజూ పారాయణం చేసుకోడానికి వీలుగా రూపొందించిన రచయిత ప్రశంసనీయులు.

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురిస్తున్న మహత్తరమైన ఈగ్రంథాన్ని పాఠకులు పారాయణాదులలో శ్రద్ధగా ఉపయోగించుకొని సకలశ్రేయస్సులు పొందా లని ఆకాంక్షిస్తున్నాను.

సదా శ్రీవారిసేవలో

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

ఒక చిన్నమాట

మిత్రులు శ్రీ ఎస్. గిరిధరన్ మరో మంచి రచన మనకందిస్తున్నారు. ఇదివరలో ఏడురోజులలో ముక్తికోసం పరీక్షిత్తుకు శుకబ్రహ్మ చెప్పిన భాగవత కథలను, ద్వాదశ స్కంధాలను మనమూ ఏడురోజులలో చదువుకోవటానికి ఏడుభాగాలు వ్రాసి పాఠక లోకానికందించియున్నారు. ఇప్పుడు అదే పద్ధతిలో శ్రీదేవీభాగవతాన్ని, తొమ్మిది భాగాలుగా చేసి మనకందిస్తున్నారు. ఇది చాలా అభినందనీయమైనది. ఆధ్యాత్మిక సాహితీఫలాలను అందరికీ పంచిపెట్టడం లాంటిది.

శ్రీ గిరిధరన్ శ్రీ వేదవ్యాస మహర్షి ప్రణీతమైన శ్రీదేవీ భాగవతంతోబాటు అనేక ప్రామాణిక అనువాదాలు, తత్సంబంధమైన ఇతర రచనలు తీసుకొని, పాఠకులకు చక్కని నిర్దేశం చేశారు. ఈ దేవీభాగవత కథనంద్వారా మిత్రులు శ్రీ గిరిధరన్ సందర్భోచితంగా పద్యాలను పేర్కొంటూ వేదవ్యాసులవారి హృదయాన్ని చక్కగా ఆవిష్కరించారు.

దీన్ని విద్వల్లోకం ఒక నిత్యపారాయణ గ్రంథంగా ఆదరిస్తుందన్న పూర్ణవిశ్వాసంతో ఈ నాలుగు మాటలు రాస్తున్నాను.

కలియుగదైవం శ్రీ వేంకటేశ్వర ప్రభువు కరుణాకటాక్షాలు శ్రీ గిరిధర్‌పై నిరంతరం ప్రసరించాలని ప్రార్థిస్తున్నాను.

ప్రొ॥ వి. అరుణాచలం
ఫౌండర్ వైస్-చాన్సిలర్
ద్రవిడ యూనివర్శిటి, కుప్పం.

నా మాట

విశ్వవిఖ్యాతిగాంచిన భారతావనిలో హైందవమతమందు వాసుదేవ మహర్షి వంశగోత్రాన బొమ్మసముద్రం, కోటూరు గ్రామమందు శ్రీ సుబ్రహ్మణ్యం పిళ్ళై, సావిత్రమ్మల తనయుడిని గిరిధరన్ అను నేను భక్తితో శ్రీదేవీభాగవతం నందలి కథలను విస్తరించి రచించినాను. శ్రీ దుర్గాదేవికి నేను నా కుటుంబీకుల మెల్లవేళల ప్రణతుల నొనర్చుచుంటిమి. తల్లీ! నీ సేవలో నీ స్మరణలో నన్ను అనుగ్రహింపుము జగదీశ్వరీ! సప్తమాతృకాస్వరూపిణీ!!

దేవీనవరాత్రులందు విధిగా ప్రతియొక్కరు చదువుకోవడానికి తొమ్మిదిరోజుల కథగా విభజించి వ్రాయుటకు పూనుకొనగా ఆ కనకదుర్గయే నన్ను ముందుకు నడిపించింది. శ్రీ వేంకటేశ్వరులు, శ్రీ భూదేవి, శ్రీదేవిలతో నన్ను ఆశీర్వదించమని కోరుతున్నాను.

పండితులు నా తప్పొప్పులను మన్నించి, ఆశీర్వదించాలని కోరుతూ...

– సుబ్రహ్మణ్యం పిళ్ళై గిరిధరన్

ఓం దుర్గాయైనమః

శ్రీదేవీ భాగవతము

విషయానుక్రమణిక

మొదటి రోజు కథ (1-57)

1. శ్రీ దేవీభాగవత మహిమ
2. శమంతకమణి కథ
3. సుద్యుమ్నుని కథ
4. రేవతీనక్షత్ర జననం
5. శ్రీదేవీభాగవత - ఫలితం
6. శ్రీదేవీభాగవతం
7. కలియుగం - నైమిశారణ్యం
8. దేవీఉపాసనం
9. హయగ్రీవ అవతారం
10. బ్రహ్మ శ్రీహరిని స్తుతించుట
11. మధుకైటభులు
12. వ్యాసుడు శంకరుని వరమడుగుట
13. పురూరవుని వృత్తాంతం
14. శ్రీ శుకుని జననం
15. వ్యాసుడు శుకుని మిథిలకు పంపుట
16. జనకుని వలన శుకునికి సందేహనివృత్తి
17. శుకుని కుమారులు, కుమార్తె
18. వ్యాసునికి శంకరుని అనుగ్రహము
19. వ్యాసుని ద్వారా సంతానోత్పత్తి ప్రసంగము

20. సత్యవతికి వ్యాసుల జననం
21. మహాభిషుడు, శంతనుడు, భీష్ముడు

రెండవ రోజు కథ (58 - 108)

1. భీష్మ ప్రతిజ్ఞ
2. కౌరవ పాండవుల వంశచరిత
3. పరీక్షిత్తు రాజు - శాపగ్రస్థుడగుట
4. ప్రమద్వర - రురుల కథ
5. పరీక్షిత్తు మరణము
6. జనమేజయుని సర్పయాగము
7. అస్తీకముని వృత్తాంతము
8. భగవతి యొక్క దివ్య ద్వీపము
9. త్రిమూర్తులు జగదంబ స్తుతి
10. మహాసరస్వతి, మహాలక్ష్మి, మహాకాళి
11. బ్రహ్మదేవుడు చెప్పిన త్రివిధ సృష్టి
12. ఉతథ్యుడు - సత్యవ్రతుడుగా పరిణతి
13. వివిధ యజ్ఞములు
14. అంబికా యజ్ఞము
15. సుదర్శనుడు
16. దేవీనవరాత్రి మహిమ
17. కుమారి స్తోత్ర శ్లోకాలు

మూడవ రోజు కథ (109 - 168)

1. నవరాత్రి ప్రసంగమున శ్రీరామ చరిత్ర
2. జనమేజయుని సందేహాలు - వ్యాసునిచే నివృత్తి
3. కృష్ణావతార పవిత్ర గాథ - ప్రస్తావన

4. నరనారాయణులు - ఊర్వశి జననం
5. విష్ణువు శుక్రమాతను వధించుట
6. దేవదానవుల యుద్ధము
7. భగవంతుని అవతారములు
8. భూదేవి త్రిమూర్తులకు విన్నవించుట
9. శ్రీకృష్ణ బలరాములు
10. శ్రీకృష్ణుని చరిత్ర - సంక్షిప్తము
11. శ్రీకృష్ణుడు శివుని తలచి తపము చేయుట
12. మహిషాసుర వధ
13. శత్రుఘ్నుని రాజ్యపాలన
14. శుంభ నిశుంభులు
15. కౌశికిగ కాళికా రూపమున దేవి పరిణతి చెందుట
16. చండ ముండులు
17. రక్త బీజుడు
18. నిశుంభుడు
19. శుంభుడు
20. సుమేధుని ద్వారా దేవి మహిమ
21. భగవతి పూజావిధానము

నాల్గవ రోజు కథ (169 - 218)

1. వృత్రాసురుడు
2. వృతుడు దేవతలను జయించుట
3. యుగధర్మములు, వివిధ కర్మలు, తీర్థముల మాహాత్మ్యము
4. వశిష్ఠుడు - నిమి

5. కార్తవీర్యుడు – ఏకవీరుడు
6. వ్యాస నారదుల సంవాదము
(నారద, పర్వతుల శాపములు)
7. నారదుడు స్త్రీ రూపము పొంది స్వస్వరూపము పొందుట
8. వ్యాసుడు జనమేజయునకు భగవతి మహిమను తెలుపుట

ఐదవరోజు కథ (219 - 271)

1. వ్యాసుడు చెప్పిన సృష్టి వివరణ
2. శర్యాతి కథ – సుకన్య చ్యవనుల వివాహము
3. అశ్వనీ కుమారులకు సోమరసం ప్రాప్తించుట
4. రేవతి బలరాముల వివాహము
5. సత్యవ్రతునకు త్రిశంకుడను పేరు కలుగుటకు కారణము
6. శతాక్షి చరిత్ర
7. సిద్ధ పీఠములు
8. హిమవంతునింట దేవి ఆవిర్భావము
9. దేవి జ్ఞానోపదేశము – యోగముల వర్ణన
10. దేవిచే హిమవంతునకు బ్రహ్మస్వరూప వర్ణన
11. దేవి భక్తి విధానము – జ్ఞానప్రాప్తియొక్క మహిమ
12. దేవి తీర్థములు – వ్రతములు – పూజా విధానములు
13. దేవి ప్రసంగములు – పూజలు

ఆరవరోజు కథ (272 - 337)

1. వరాహావతారము
2. మనువు ప్రజాసృష్టి
3. భూమండలము – నదులు

4. అనంతుడు, హయగ్రీవుడు, నృసింహ, మత్స్య ప్రస్తావన
5. కచ్ఛప, వరాహ, శ్రీరామచంద్ర, నారాయణ ఉపాసనలు
6. ప్లక్ష, శాల్మలి, కుశ, క్రౌంచ, ద్వీపముల వర్ణన
7. సూర్యుని గమనము
8. గ్రహముల గమనము
9. అనంతుని యశస్సు
10. నరకముల వివరణ
11. దేవ్యారాధన విధానము
12. ప్రకృతి అంశము కళ వివరణ
13. సరస్వతి పూజా విధానము
14. యాజ్ఞవల్క్య సరస్వతి స్తుతి
15. లక్ష్మి, సరస్వతి, గంగా శాపములు
16. భక్తుల గొప్పదనము
17. కలియుగ విపరీతములు
18. భూమి
19. గంగ పవిత్రత
20. తులసి కథ

ఏడవరోజు కథ (338 - 402)

1. శంఖచూడుడు శంకరుల సంభాషణ
2. శంఖచూడుని యుద్ధము – గోపకుడై గోలోకమును చేరుట
3. తులసీమహిమ
4. తులసీపూజ – నామాష్టకము
5. వేదవతి – సీత – ద్రౌపది పూర్వజన్మలు
6. సావిత్రీదేవి పూజా విధానము

7. సావిత్రీ సత్యవంతుల కథ
8. భువనేశ్వరీ మాహాత్మ్యము
9. మహాలక్ష్మీ పూజ
10. ఇంద్రుడు లక్ష్మీదేవిని స్తుతించుట
11. స్వాహాదేవి, స్వధాదేవి – పూజ – స్తోత్రములు
12. భగవతి దక్షిణ స్తోత్రము – ఫలశ్రుతి
13. షష్టిదేవి, ధ్యాన – స్తోత్రములు
14. భగవతి మంగళచండి ఉపాఖ్యానము
15. ఆదిధేనువు – సురభి కథ
16. శ్రీరాధ, దుర్గా, స్తోత్రములు

ఎనిమిదవరోజు కథ (403-476)

1. శ్రీ దుర్గామంత్రములు – పూజలు – స్తోత్రములు
2. స్వాయంభువమనువు జననము
3. వింధ్యాచల వృత్తాంతము
4. మనువంశ క్రమము
5. సదాచారము
6. రుద్రాక్షల మాహాత్మ్యము
7. భూతశుద్ధి – భస్మము – ప్రాతఃసంధ్యలు
8. గాయత్రీమహిమ – పూజలు చేయుట
9. మధ్యాహ్న సంధ్య – సాయంసంధ్య
10. గాయత్రి – ప్రాణాగ్నిహోత్ర విధానము
11. ప్రాజాపత్యాది వ్రతము
12. శాంతి కొరకు గాయత్రీమంత్రము

13. గాయత్రీ ప్రాముఖ్యత
14. గాయత్రీ ధ్యానము – గాయత్రీకవచము
15. గాయత్రీ హృదయము
16. గాయత్రీ స్తోత్రము
17. గాయత్రీ సహస్రనామములు

తొమ్మిదవరోజు కథ (477 - 530)

1. గాయత్రీ దీక్షావిధానము
2. దేవతల గర్వమును గమనించి దేవి జ్ఞానోపదేశము చేయుట
3. గాయత్రీదేవి – గౌతముడు – బ్రాహ్మణుల శాపము
4. మణిద్వీపము
5. జనమేజయుడు అంబాయజ్ఞము చేయుట
6. శ్రీ దేవీభాగవత మహిమ
7. శ్రీ దేవీభాగవతంలో ఇమిడి ఉన్న సంక్షిప్త విషయాలు
8. శ్రీ దుర్గాష్టోత్తరశతనామ స్తోత్రమ్
9. మహిషాసురమర్దినీ స్తోత్రమ్

* * *

పరిశీలించిన గ్రంథములు

1. శ్రీ వ్యాసులవారి శ్రీ దేవీభాగవతము (సంస్కృతం)
2. శ్రీ దేవీభాగవతము (పద్యకావ్యం) (మహాకవి దాసు శ్రీరాములు గారు)
3. శ్రీ దేవీభాగవతము (శ్రీ దేవులపల్లి శివరామయ్యగారు) (ఆంధ్రానువాదం)
4. శ్రీ దేవీభాగవతము గోరఖ్‌పూర్ వారి వచన ప్రతి (గుండ్లూరి నారాయణ)
5. శ్రీ దేవీమాహాత్మ్యం (శ్రీ గౌరి పెద్దిరామ సుబ్బశర్మ గారు)
6. శ్రీ దేవీభాగవతము (ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారు)
7. శ్రీ దేవీభాగవతము (శ్రీ మైథిలి వెంకటేశ్వరరావు గారు)
8. శ్రీ దేవీభాగవతము (ఐనంపూడి గురునాధ రావు, ఎమెస్కో ప్రచురణ)

శ్రీదేవీ భాగవతము

దేవీనవరాత్రులు - మొదటి రోజు కథ

శ్రీదేవీ భాగవతము విశిష్ట స్థానము పొందియున్నది. పరమాత్మ తత్వముతో జీవితమునకు మోక్ష ప్రాప్తి కలిగించును. పరబ్రహ్మను ఆ తల్లి రూపముగా కొలుచుటయే గొప్ప విషయము.

ఇందు ఆశ్చర్యమును కలిగించే కథలచే దేవి మహిమలు గాథలు పాఠకులకు ఆనందము కలుగచేయును. దేవి లీలలు చదివినపుడు, విన్నప్పుడు, వ్రాసినప్పుడు గాని దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ఆ దేవి వలననే జరుగుతుందని మన కర్థమవుతుంది. శివుని ద్వారానే సకల సృష్టి జరిగిందని విష్ణు పురాణము.

శ్రీదేవీ పరాశక్తి వల్లనే బ్రహ్మ, విష్ణు, మహేశుల ఆవిర్భావం అని ఇపుడు శ్రీదేవీ భాగవతమువల్ల మనకు తెలుస్తుంది.

మనం మన ఇష్టదైవమును నిత్యం స్మరిస్తూ ఉండాలి. ఇతర దేవతలను ద్వేషించుట, తర్కించుట, చులకన చేయుట చేయరాదు.

వ్యాసులవారు రచించిన అన్ని పురాణముల సారము పరమాత్మవైపు మన ప్రయాణం సాగవలెనని వారి కోరిక.

దేవీ భాగవతమును - శాక్త భాగవతమని, శ్రీమద్భాగవతమును విష్ణు భాగవతమని నేటికి వాద వివాదములు జరుగుచునే యున్నవి.

ఈ రెండు భాగవతములకు కల్పములు వేరువేరుగా ఉన్నవి. దేవీ భాగవతము సారస్వతకల్పము, శ్రీమద్భాగవతము పద్మకల్పమున గుర్తింపు పొందినది. ఈ భాగవత ద్వయములను గూర్చి విద్వాంసులు మహాపురాణములుగా స్వీకరింపవలెనని ధ్రువపరుస్తున్నారు. ఏదైతేనేమి పురుషుడు, ప్రకృతి లేకుండా ఈ జగత్తు ముందుకు పోదు. గీతలో ఇది

సుస్పష్టము చేయబడినది. శ్రీదేవీ భాగవతములో ప్రకృతి (స్త్రీ) ప్రాధాన్యత, శ్రీమద్భాగవతమునందు పురుష ప్రాధాన్యతతో సనాతన ధర్మమునకు పట్టుకొమ్మలుగా హిందూసంస్కృతికి భాగవత ద్వయమును మహాపురాణములుగా గుర్తించవలెను.

బుద్ధి, సంపద, కాంతి, క్షమ, శాంతి, శ్రద్ధా, మేధా, ధృతి, స్మృతి, ఈ పేర్లతో శ్రీదేవిని పిలుస్తున్నాము. గాయత్రిలో ప్రణవస్వరూపిణి, జయ, విజయా, ధాత్రీ, లజ్జా, కీర్తి, స్పృహ, దయా ఈ నామములు కలిగినది ఆ దేవియే.

బ్రహ్మలో ఉన్నటువంటి సృజనశక్తి
విష్ణువులో గల పాలనా శక్తి
శివునిలోగల సంహార శక్తి
శేషుడు, కూర్మములలో పృధివిని ధరించే శక్తి
అగ్నికి దహించే శక్తి
వాయువుకు చలన శక్తి

దేవతలైనా రాక్షసులైనా ఆరాధించునది జగదంబికను మాత్రమే. ఈ మాట సత్యము, దేవి వటపత్రశాయిగా బాలరూపంగా విష్ణువుతో అన్న మాటలు – ఈ జగత్తునందు ఉన్నది నేనే – అంటుంది.

ఒక్క శ్లోకంతో దేవీభాగవతము ఈలా చెబుతుంది.

అర్ధశ్లోకాత్మకం యత్తు దేవివక్త్రాబ్జనిర్గతమ్
శ్రీమద్భాగవతం నామ వేద సిద్ధాన్త బోధకమ్ ॥
ఉపదిష్టం విష్ణవే యద్వటపత్ర నివాసినే
శతకోటి ప్రవిస్తీర్ణం తత్కృతం బ్రహ్మణాపురా ॥ (12/14/1-2)

భగవతి జగదంబికయే సనాతన పరబ్రహ్మతత్వము అని దేవీభాగవతములో తెలుపుచున్నది. జగన్మాత బ్రహ్మదేవునితో అన్న మాటలు. బ్రహ్మమూ నేనూ ఒక్కటే. నాలో బ్రహ్మములో భేదము లేనేలేదు. ఇది గ్రహించినవారే ముక్తులు కాగలరు. మంచివారిని కాపాడుటకు, వేదములను కాపాడుటకు దుష్టులను శిక్షించుటకు దేవి చాలా అవతారాలు ఎత్తేది.

ఈ సృష్టి మొదలయ్యేటప్పుడు ఒక్క దేవి మాత్రమే ఉండేది. ఆ పరాశక్తి ద్వారా బ్రహ్మ, విష్ణు, రుద్రులు ఉత్పన్నమైనారు. మరుద్గణములు, గంధర్వులు, అప్సరసలు, కిన్నరులు, పరాశక్తి ద్వారానే పుట్టినారు.

అన్ని పదార్థములు అండజ, స్వేదజ, ఉద్భిజ, జరాయుజములు, స్థావరజంగమ, మనుష్యాది ప్రాణులన్నియు పరాశక్తి నుండే పుట్టాయి. ఆ మహాదేవిని ఆరాధించేవారు భారత దేశంలో గాయత్రీ రూపంతో "సదా సేవ్యం సదాసేవ్యం దేవీభాగవతం నరైః" అని చదివి విని, వ్రాసి దేవీకృపకు పాత్రులగుచున్నారు.

1. దేవీభాగవత మహిమ

వ్యాసుడు సత్యవతీ పరాశరుల పుత్రుడిగా, విష్ణు అంశతో జన్మించాడు. ఆయనే వేదములను నాలుగు భాగములుగా విభజించి, వేదవ్యాసుడయ్యాడు. ఆ తర్వాత పదునెనిమిది పురాణములను, భారతమును వ్రాసి శిష్యులకు వినిపించెను.

దేవీభాగవతమును మాత్రము వ్యాసులవారు జనమేజయ మహారాజుకు వినిపించెను. జనమేజయుల తండ్రి పరీక్షిత్తు తక్షకుడనే పామునే కరవబడి దుర్మరణము పొందగా, జనమేజయుడు దేవీభాగవతము విని, తొమ్మిది దినములు ఆద్యాదేవిని విధి విధానముగా పూజించి తండ్రి పరీక్షిత్తుకు భగవతిచే పరమధామము ప్రాప్తించగా జనమేజయుడు ఆనందంగా వ్యాసుల వారిని ఉచిత రీతిన పూజించెను.

సత్య (కృత) యుగము, త్రేతాయుగము, ద్వాపర యుగములందు అనేక ధర్మములతో అలరారగ, కలియుగమునందు పురాణ శ్రవణముచే మాత్రమే మానవులు ముక్తి పొందగలరు. ఆశ్వయుజ, చైత్రము, వైశాఖము జ్యేష్ట మాసములందు నాలుగు నవరాత్రులందు విని విశేష ఫలముతో ముక్తిని పొందెదరు.

దేవీభాగవతము నిత్యము పూజింపబడు ఇల్లు తీర్థ స్వరూపమగును. దేవీ భాగవతము పఠించు బ్రాహ్మణుడు – విద్వాంసుడుగా, క్షత్రియుడు – శూరుడుగా, వైశ్యుడు – ధనవంతుడుగా, శూద్రుడు–సర్వోత్తముడవుతాడు.

2. శమంతకమణి కథ

రాజగు సత్రాజిత్తు ద్వారకలో ఉన్నప్పుడు సూర్యునిచే ప్రసన్నత చెంది శమంతకమణిని పొందగా దానితో మిగుల సంతోషించి ద్వారకకు వచ్చినప్పుడు సూర్యుడే దిగివస్తున్నాడని ప్రజలు భావించి కృష్ణునకు తెలుపగా ఇది శమంతక మణి వెలుగు, ఇది రోజుకు ఎనిమిది బారువులు (1920 కిలోలు) బంగారమును ప్రతిరోజు నిస్తుంది అని చెప్పి సత్రాజిత్తును పిలిపించి ఆ మణిని పూజించి దానిని ఇమ్మని కోరగా సత్రాజిత్తు నిరాకరించి తిరిగి వెళ్ళిపోయెను.

తన తమ్ముడైన ప్రసేనుడు శమంతకమణిని ధరించి అడవికి వెళ్ళగా సింహము అతనిని చంపి మణిని తన వశము చేసికొనెను. భల్లూకపతి సింహమును చూచి దానిని చంపి మణిని పొంది తన పుత్రికకు ఆట వస్తువుగా ఇవ్వగా అక్కడ ప్రసేనుడు కనబడకపోగా శ్రీకృష్ణుడే చంపాడని నీలాపనిందలు వేయడం మొదలుపెట్టారు.

శ్రీకృష్ణుడు ఆ మణిని వెదుకుచూ వెళ్ళగా ప్రసేనుని శవం, మరణించిన సింహము శవం కనబడగా ఆ గుహ లోపలికి శ్రీకృష్ణుడు వెళ్ళి జాంబవంతుని కనుగొనెను.

మణికోసం జాంబవంతునితో కృష్ణునికి యుద్ధము ప్రారంభమైనది. పన్నెండవ రోజు అనుచరులందరు వెనుదిరిగి వచ్చి కృష్ణుడు కనబడలేదని చెప్పిరి. అపుడు వసుదేవుడు కుమారుని గాథను నారదునికి చెప్పగా అతని సూచన మేరకు వసుదేవునితో అంబికాదేవిని ఆరాధించిన శుభమగునని తెలిపెను.

తొమ్మిది రోజులు ఆ దేవిని ఆరాధించి శ్రీ మద్దేవీభాగవత పురాణము వినమని చెప్పగా వసుదేవుడు పూర్వగాథను కూడా గుర్తుకు తెచ్చుకొని దేవకితో 'కృష్ణ జనన సమయమున గూడా దేవీగాథను గర్గుని ద్వారా విని సఫలత నొందాము' అన్నాడు.

'నారదా! మీరు ఆ కథను వినిపించండి' అని వసుదేవుని కోరికపై ప్రథమ స్కంధమునుండి ప్రారంభించి తొమ్మిది దినములలో పూర్తి చేసెను. అదే సమయమున అక్కడ కృష్ణునితో జరుగుచున్న యుద్ధమునందు జాంబవంతుడు డస్సిపోయెను. ఆనాటి రాముడే ఇప్పుడు శ్రీకృష్ణుడయ్యాడని గ్రహించి తనను క్షమించమని ప్రార్థించాడు.

మణిని శ్రీకృష్ణునకు అందిస్తూ తన కుమార్తె జాంబవతిని కూడా పాణి గ్రహణము చేయమని ప్రార్థించెను. శ్రీకృష్ణుడు జాంబవతిని పత్నిగా స్వీకరించి ద్వారకకు తిరిగి వచ్చి నీలాపనిందను తొలగించుకొని నగర వాసులకు ప్రీతిని కలిగించెను. ఈ కథను చదివినవారు, వినినవారు ముక్తిని పొందెదరని ప్రజలను నారదుడు దీవించి బ్రహ్మలోకమునకు వెళ్ళెను.

3. సుద్యుమ్నుడు స్త్రీగా మారి దేవి అనుగ్రహముతో పురుషుడుగా మారుట

అగస్త్యుడు తన పత్ని లోపాముద్రతో కలిసి కార్తికేయుని వద్దకు వెళ్ళి దేవీభాగవతము వినిపింపుమని కోరెను. దేవీభాగవతము చదువు వారికి లభించనిది ఏదీ ఉండదు. వివశ్వంతుడను మనువు పుత్రుడు శ్రాద్ధదేవుడు,

వశిష్ఠుడు పుత్రేష్టి యజ్ఞము చేయగా హోత మనస్సులో 'కన్య జన్మించుగాక'యని సంకల్పించగా 'ఇల' అను పేరుగల కన్య ఉదయించెను. అపుడు వశిష్ఠుడు భగవంతుని అనుగ్రహముతో 'ఇల' పురుషుడుగా మారిపోయెను. అతనికి సుద్యుమ్నుడు అని పేరు పెట్టిరి. విద్వాంసుడయ్యెను.

శంకరుడు పార్వతితో విహారము సలుపుచుండగా ఆ ప్రదేశమునకు మునులు వచ్చి చూచి తిరిగి వారు వైకుంఠమునకు వెళ్ళిపోయిరి. కాని తన ప్రేయసిని సంతోష పరచు కోరికతో నేటి నుండి పురుషుడెవరైన ఈ వనమున ప్రవేశించిన స్త్రీగా మారిపోవుగాక యనెను. అప్పుడే ఆ ప్రదేశమునకు వచ్చిన సుద్యుమ్నుడు స్త్రీగా మారిపోయెను. వెంట వచ్చిన వారు గూడా స్త్రీలుగా మారిపోయిరి.

ఈ స్త్రీ రూపమున నున్న సుద్యుమ్నుడు బుధుని ఆశ్రమమున నివసించ సాగెను. బుధుని వలన పురూరవుడు జన్మించెను. కొంత కాలమునకు ఆమెకు తన పూర్వ వృత్తాంతం గుర్తునకు రాగా వశిష్ఠుని ఆశ్రమమునకు చేరి తాను మరల పురుషుడుగా మారవలెనని కోరెను. వశిష్ఠుడు శంకరుని ప్రార్థించగా ఒక నెల పురుషుడుగా ఒక నెల స్త్రీగా నుండునట్లు పలికెను. ఆ తరువాత పార్వతి, దుర్గాదేవి అయిన నారాయణిని స్తుతించెను.

సుద్యుమ్నుని స్తుతి

వాంఛత్యహో హరిరశోక ఇవాతి కామం
పాదాహతిం ప్రముదితః పురుషః పురాణః
తం త్వకరోషి రుషితా ప్రణతం చ
పాదే దృష్ట్వా పతిం సకల దేవసుతం స్మరార్ధమ్॥ (వ్యాసులవారి దే.భా.)

దేవీ! నీవు అనంతశక్తివి. ఏమని వర్ణించను ఎలా వర్ణించను? నువ్వు పురుషుడివా, స్త్రీవా? సగుణవా, నిర్గుణవా? ఏమైనా కానీ, నేను మాత్రం నిరంతరం నీ పట్ల భక్తినే కోరుకుంటున్నాను, శరణు, శరణు

ఉ. దేవి భవత్స్వ రూపము నిదే కనుగొంటిని దివ్యసుందరీ!
సేవితపావనాంఘ్రి, సరసీరుహము ల్భజియించి మ్రొక్కెదన్
కావలె నన్న సర్వమును గాచెడి నీకొక భార మైతినే
నీవకదమ్మ నావ భవనీరధికిం గరుణా రసాంబుధీ ॥

ఉ. నిన్ను నుతింప నే మునులు నేర్తురు మర్త్యులికెంతవారు నీ
మన్నన గాదె దేవతలు మర్త్యులు భూతిసమేతు లౌట నీ
యున్నతి నీదయోదయము నూర్జితశక్తి యుదారధర్మ సం
పన్నత కన్నతల్లి నిజభక్త సురద్రుమ వల్లి సాధ్యమే ॥

ఉ. వెన్నుడు దమ్మిచూలియును వెన్నెలరాయనికూనతాలుపున్,
బన్నగరాజు నగ్ని రవి పంకజవైరి సురేంద్రు డార్కియున్
మున్నగు దేవతానికరము ల్గణియింపగలేరు నీ ప్రభా
వోన్నతి నెవ్వ రే యితరు లోపుదురో జగదంబ తెల్పుమా!

ఉ. ఓ జగదంబ! నిన్ను సుగుణోజ్వలుడైన మురారి తొమ్మునన్
దేజరిలంగ దాల్చి నియతిన్ భజియించు గదమ్మ నీ పదాం
భోజము నమ్మికాదె జగమున్ బరిపాలను జేయు సంతత
శ్రీ జయలబ్ధి నీవకద శ్రీపురు సాత్వికి వార్య పోషిణీ!

ఉ. ఓ సకలేశ్వరీ! జలరుహోద్భవుడెంతయు భక్తి వక్రమున్
వాసముగా నొసంగి నిరవద్య గతిన్ నినుగొల్చి కాదె సం
భాసితుడయ్యె సంతతము మానుగ విష్టప సృష్టికర్తయై
నీసరి యెవ్వరమ్మ రమణీయ విలాసిని రాజసీసతీ!

ఉ. ఓ కరుణామయీ వృషహయుండు నిజార్ధ శరీరమందు ని
ర్భీకత నిన్నుదాల్చి కడుబ్రీతి మెయింబరిచర్యసేయుడే
నీకు నతండు నీవు నతనిన్ లయకర్త నొనర్చి ప్రోచె ది
చ్ఛా కృత పద్మజాండ విలసద్గుణ తామసి భూత పాలనీ!

తే.గీ. నీవు పురుషుండవుంగావు స్త్రీవి కావు
రూఢి సగుణవు కావు నిర్గుణవు కావు
సత్స్వరూపిణివి వాద్యవు సాధ్వివెన్న
నట్టి నిను గొనియాడెద నఖిలజనని
(దేవీభాగ. మహాకవి దాసు రామదాసు)

అపుడా జగజ్జనని మునివరా! నీవు వెళ్ళి దేవీభాగవతము వినిపింపుమని చెప్పి అదృశ్యురాలయ్యెను. ఆశ్వయుజమాస శుక్ల పక్షమునందు నవరాత్ర విధానము పాటించుచు కథాక్రమము సమాప్తమగుటతో శాశ్వతముగా పురుషుడయ్యెను. సుద్యుమ్నుడు తన రాజ్యము కుమారుల కప్పగించి పరమధామము చేరుకొనెను. ఈ కథను చదివిననూ, వినిననూ, వ్రాసిననూ సకల కోరికలు నెరవేరును.

4. రేవతి నక్షత్ర జననం

అగస్త్యుడు కార్తికేయునితో ఋతువాకుని కథ చెప్పుమని కోరగా – ఋతువాకుడను మునికి ఒక కొడుకు రేవతీ నక్షత్రమున నాల్గవ పాదమున జన్మించెను. ఆ బాలుడు కూడా ఉద్ధండుడై దుర్మార్గుడు కాగా అతడు గర్గుని చెంతకు వెళ్ళి యిలా అడిగెను. మేము భార్యాభర్తలు ఇరువురు చేసిన పాపమేమి ఈ పుత్రుని వల్ల మాకు అశాంతి కలుగుచున్నదని కోరెను.

మీరెవరును కారణము కాదు. రేవతీ నక్షత్రము గండమగుటయే కారణము. నీవిపుడు దుర్గాదేవిని పూజించిన మంచిదని చెప్పెను. కాని ఋతువాక మహాముని రేవతీనక్షత్రమును నేల రాలిపొమ్మని శపించెను. అందరూ చూచుచుండగనే కుముదాద్రిపైకి జారిపడెను. అందువలననే ఆ పర్వతమునకు రైవతకమని పేరు వచ్చెను. గర్గుడు చెప్పినట్లు ఋతువాకుడు జగదంబను ఆరాధించి సుఖముగా ఉండెను.

రేవతి నక్షత్రము ఆ పర్వతముపై పడగానే ఆ తేజస్సుతో ఒక కన్య జన్మించెను. ఆ కన్యపై ప్రముచుడు అనే ఋషి యొక్క దృష్టిపడెను. ఆ కన్యను ఋషి తెచ్చి పుత్రికవలె కాపాడెను. ఆ కన్యకు వరుడు ఎవరా అని ఆలోచిస్తూ అగ్ని దేవుని ఉపాసించగా అగ్నిదేవుడు ప్రసన్నమై దుర్దముడనే వీరుడు భర్త కాగలడని చెప్పెను.

ఒకనాడు దుర్దముడు ముని ఆశ్రమము చూడనెంచి అచటికి వెళ్ళెను. ముని దుర్దముని గమనించి ఇతడు మన కల్లుడు. అర్ఘ్యమును పొందుటకు అర్హుడు అనెను. అపుడు ఆ కన్య మునితో తండ్రీ మీరు నా వివాహము రేవతి నక్షత్రముననే జరిపించుడు అని కోరెను.

ప్రముచుడనే ముని రేవతిని మునుపటివలె నక్షత్రమండలమున స్థాపించి అదే నక్షత్రమున వివాహ విధిని నిర్వర్తించి దుర్దమునికి రేవతిని అప్పజెప్పెను. దుర్దముడు లోమశుని ద్వారా దేవీభాగవతమును విని భగవతి కృపతో రైవతుడను పుత్రుని బడసిరి. రైవతుడు మన్వంతర స్వామియై ధర్మముగ పృధివిని పరిపాలించ సాగెను. ఈ కథ చదివిన, వినిన, ముక్తిని పొందగలరని మునులు మనకు తెలియజేశారు.

5. శ్రీదేవీభాగవతం మనము ఎప్పుడు చదవాలి – ఫలితం ఏమిటి?

జ్యేష్టమాసము మొదలుకొని ఆరుమాసములు ఉత్తమము. అశ్విని, మూల, పుష్యమి, రోహిణి, శ్రవణము, మృగశిర, అనూరాధ నక్షత్రములు జగదంబికను ప్రసన్నము చేసుకొనుటకు నాలుగు నవరాత్రులందు దీనిని వినవలెను.

బ్రాహ్మణాది నాలుగు వర్ణములవారు, స్త్రీలు, ఈ కథామృత ఆస్వాదమునకు అర్హులు, కథాస్థలము గోమయముతో అలుకవలెను. అరటి స్తంభములతో పచ్చటి తోరణములతో ఉండవలెను. ఉత్తరాభి ముఖముగా కూర్చొని ప్రవచనము చేయువారు దేవీ ఉపాసకుడుగా ఉండవలెను. కోరికలు లేనివాడుగా దయా స్వభావుడుగా విద్వాంసుడుగా ఉండవలెను.

కథ నిర్విఘ్నముగా, కొనసాగుటకు అయిదుగురు బ్రాహ్మణులు నవార్ణ మంత్రము జపిస్తూ 'దుర్గాసప్తశతి' పఠించువారై ఉండవలెను. ధర్మ, అర్థ, కామ, మోక్షములను పొందుటకు మితాహారము చేసి తొమ్మిది దినములు నిష్ఠతో వినినచో జనన మరణ రహితుడగును.

కథా సమాప్తి దినమున గాయత్రిసహస్ర నామమును లేక విష్ణుసహస్ర నామమును పఠించవలెను. బ్రాహ్మణులను పూజిస్తూ బాలకుడైనను పురాణ జ్ఞానము కలవాడు నమస్కారమునకు పూజ్యుడగును.

శ్రీదేవీభాగవతము అర్ధశ్లోకమును గాని, అర్ధ పాదమును గాని శ్రవణము పఠనము చేసినవారు పరమ పదమునకు అధికారులు కాగలరు. మొదట జగదంబిక శ్రీముఖము నుండి అర్ధ శ్లోకమే వెలువడినది. ఆ మణిదీపము అధిష్ఠించిన జగదంబిక జగత్తునకు శ్రేయస్సును చేస్తుందని గట్టి నమ్మకం.

6. శ్రీదేవీభాగవతం

ఓం సర్వచైతన్యరూపాం తామాద్యాం విద్యాం చ
ధీమహి! బుద్ధిం యానః ప్రచోదయాత్ ॥

చైతన్యం కలిగించే జగదంబికను ధ్యానించిన సద్బుద్ధిని ప్రసాదిస్తుంది. నైమిశారణ్యమునకు విచ్చేసిన సూత మహర్షీ! పురాణ సంబంధమైన గాథలను వినుటకు మా కర్ణేంద్రియములు మహదానందము చెందుచున్నవి. నేడు కలి భయముతో గొప్ప దుఃఖములు కలుగుచున్నవి.

వేదాంతమును సాత్విక మనియు, మీమాంసను రాజసమని, న్యాయమును తామస శాస్త్రమని చెప్పెదరు. దేవీభాగవతము అయిదవ పురాణము, దీనిని వినుట వలన ముక్తిని చెందగలవు. దివ్యమైన మంగళకరములైన భాగవత పురాణము విస్తృతముగా తెలుపుడు.

సూతుడు దేవీభాగవతము చెప్పుటకు పూనుకొనెను. ఈ పురాణము సకల శ్రుతుల యొక్క అర్థములచేత ఆమోదింపబడినది. ఉపనిషత్తులలో విద్యయను పేరుతో ప్రసిద్ధమైనది. ఆద్యా, పరా, సర్వజ్ఞా అను నామాంతరములు కలిగినది.

మ. మునివర్యుల్వినుఁడీర లాదరమునన్ మున్నాట పద్దెన్మిదై
చను నధ్యాయములున్ గణింప దినరాట్సంఖ్యాకమౌ స్కంధముల్
పొనరన్ శ్లోకములున్ బదెన్మిదగు వేలున్ సంస్కృతంబందునున్
దనరన్ వ్యాసుడు సెప్పె భాగవతమున్ దాక్షిణ్య సంయుక్తుడై
(మహాకవి దాసుశ్రీరాములు)

శ్రీదేవీభాగవతము 18,000 శ్లోకములు గలది. వేదవ్యాసుడు 12 స్కంధములతో రచించగా ఇందు 318 అధ్యాయములు. స్కంధముల వారిగా 20, 12, 30, 25, 35, 31, 40, 24, 50, 13, 24, 14 మొత్తం అధ్యాయములు = 318 కలవు.

పురాణ లక్షణమైన సర్గ, ప్రతిసర్గ, వంశము, వంశాను కీర్తనం, మన్వంతర వర్ణనలతో అలరారుతుంది. ఆ భగవతి మహాలక్ష్మి, మహాసరస్వతి, మహాకాళి, రూపమున ప్రకటితమైనది. అస్తవ్యవస్థను తొలగించుటకే యీ దేవి అవతరించెను.

సర్గ శ్చ ప్రతిసర్గ శ్చ వంశో మన్వంతరాణి చ
వంశానుచరితం చైవ పురాణం పంచలక్షణమ్ (2-18)

సర్గ : ఈ సృష్టి యొక్క అస్తవ్యస్తతను తొలగించుటకు దేవి అవతరించెను.

ప్రతిసర్గ : బ్రహ్మ, విష్ణు, రుద్ర రూపములలో ఆ ఆద్యాశక్తియే ప్రకటితురాలయ్యెను.

వంశము : చంద్రవంశ, సూర్య వంశముల ఉపాఖ్యానములు కలది.

వంశానుచరిత : మనువులు వంశానుచరితతో కూడు కొన్నది.

మన్వంతరం : మనువుల వర్ణన, కాలనిర్ణయము, మన్వంతరముగా ప్రసిద్ధి చెందింది.

శ్లో॥ మ ద్వయం భ ద్వయం చైవ బ్ర త్రయం వ చతుష్టయమ్
అ నా ప లిం గ కూ స్కాని పురాణాని పృథక్ పృథక్ (3-2)

వ్యాసుడు సూతునికి చెప్పిన పురాణములు పదునెనిమిది ఇవియే

మద్వమం	– మత్స్య పురాణం	– 14000	శ్లోకాలు
	– మార్కేండేయ పురాణం	– 9000	”
భద్వయం	– భవిష్య పురాణం	– 14500	”
	– భాగవత పురాణం	– 18000	”
బ్రత్రయం	– బ్రహ్మ పురాణం	– 10000	”
	– బ్రహ్మాండ పురాణం	– 12000	”
	– బ్రహ్మ వైవర్త పురాణం	– 18000	”
వచతుష్టయం	– వామన పురాణం	– 18000	”
	– వాయు పురాణం	– 14600	”
	– విష్ణు పురాణం	– 14600	”
	– వరాహ పురాణం	– 24000	”
అ	– అగ్ని పురాణం	– 16000	”
నా	– నారద పురాణం	– 25000	”
ప	– పద్మ పురాణం	– 55000	”
లిం	– లింగ పురాణం	– 11000	”
గ	– గరుడ పురాణం	– 19000	”
కూ	– కూర్మ పురాణం	– 17000	”

స్కాం – స్కాంద పురాణం – 8100 ”

ఉప పురణాలు – సనత్కుమారపురాణము, నృసింహ పురాణము

– నారద పురాణము, శివ పురాణము

– దూర్వాస పురాణము కపిల పురాణము

– మను పురాణము ఉశనః పురాణము

– వరుణ పురాణము కాళికా పురాణము

– సాంబ పురాణము నంది పురాణము

– సౌర పురాణము పరాశర పురాణము

– ఆదిత్య పురాణము మహేశ్వర పురాణము

– భాగవత పురాణము వశిష్ఠ పురాణము
మొదలగునవి

కం. ప్రతి ద్వాపరమున విష్ణుం
డతులమతి వ్యాసరూపుఁడై పుణ్యము లౌ
శ్రుతులం బహు విధములు దా
నతికించు శ్లోకమునకు నతిహిత మొదవన్ (మ.క.దా.శ్రీ)

ప్రతి ద్వాపర యుగమున విష్ణువు అవతారము దాల్చేది వ్యాసుడే. ఇపుడు ఇరువది ఎనిమిది ద్వాపరమున ఏడవ మన్వంతరము జరుగుచున్నది. ఇప్పటి వరకు ఇరవై ఏడుగురు వ్యాసులుండిరి.

మొదటి ద్వాపరమందు వేదమును బ్రహ్మయే విభజించెను.

రెండవ ద్వాపరమున – ప్రజాపతి వ్యాసుని కార్యము చేసెను.

మూడవ ద్వాపరమున – ఉశనుడు

నాలుగవ ద్వాపరమున – బృహస్పతి

అయిదవ ద్వాపరమున – సవిత
ఆరవ ద్వాపరమున – మృత్యు దేవుడు
ఏడవ ద్వాపరమున – మఘువుడు (దేవేంద్రుడు)
ఎనిమిదవ ద్వాపరమున – వశిష్ఠుడు
తొమ్మిదవ ద్వాపరమున – సారస్వతుడు
పదవ ద్వాపరమున – త్రిధాముడు
పదకొండవ ద్వాపరమున – త్రివృషుడు
పన్నెండవ ద్వాపరమున – భరద్వాజుడు
పదమూడవ ద్వాపరమున – అంతరిక్షుడు
పదునాల్గవ ద్వాపరమున – ధర్ముడు
పదహైదవ ద్వాపరమున – త్రైయారుణియుడు
పదహారవ ద్వాపరమున – ధనంజయుడు
పదిహేడవ ద్వాపరమున – మేధాతిథియు
పదునెనిమిదవ ద్వాపరమున – వ్రత్తి
పందొమ్మిదవ ద్వాపరమున – అత్రి
ఇరవై ద్వాపరమున – గౌతముడు
ఇరవై ఒకటవ ద్వాపరమున – హర్యాత్ముడను ఉత్తముడు
ఇరవై రెండవ ద్వాపరమున – హర్యాత్ముడగు వేనుడు
ఇరవై మూడవ ద్వాపరమున – ఆయుష్యాయణ సోముడు
ఇరవై నాల్గవ ద్వాపరమున – తృణబిందువు
ఇరవై ఐదవ ద్వాపరమున – భార్గవుడు

ఇరవై ఆరవ ద్వాపరమున – శక్తి

ఇరవై ఏడవ ద్వాపరమున – జాతూకర్ణ్యుడు

ఇరవై ఎనిమిదవ ద్వాపరమున – కృష్ణ ద్వైపాయనుడు

ఆ కృష్ణద్వైపాయనుడనే వ్యాసుడు చెప్పగా శ్రీ దేవీభాగవతమును వినే భాగ్యం నాకు కలిగింది. ఇది సకల వేదముల సారమే శ్రీ దేవీభాగవతము. దీనిని వ్రాయటం పూర్తిచేసి తన కుమారుడైన శుకునికి వ్యాసుడు వినిపించెను. స్వర్గమునందలి కల్పవృక్షంలో బాగుగా పండిన ఫలమే శ్రీ దేవీభాగవతము.

పక్షి రూపమున గల శుకదేవుడు శ్రీదేవీభాగవతమును రుచి చూచెను. ఎవరైతే వినుటయందు ఆసక్తి కలిగి ఉంటారో వారి హృదయమున జగదంబిక నివాసముండును.

7. కలియుగం – నైమిశారణ్యం

సూతునకు శౌనకుడు ఇలా చెప్పెను. బ్రహ్మ ఒక చక్రము నిర్మించుకొని ఈ చక్రము వెంట వెళ్ళుము. ఇది ఎచటపడి పోవునో ఆ ప్రదేశము పవిత్ర స్థలమగునని చెప్పగా, ఆ చక్రము పడినచోటునే నైమిశారణ్యము అని చెప్పబడింది. ఇక్కడ మాత్రం కలి ప్రభావము ఉండదు. ఈ నైమిశారణ్యమున మునులు సిద్ధులు, మహాత్ములు ఇప్పటికి నివసించుచున్నారు. సత్యయుగం రాకకోసం సదా ఎదురు చూస్తున్నారు.

కం. ఇది సంశీర్ణంబగునే
పదమున నది పావనంబు పట్టదు కలియా
పదమున నుండుడీ కలి
తుదదనుకన్ సత్యయుగముతోచెడి నంతన్

(దేవీభా–దాసు శ్రీరాములు)

8. దేవీఉపాసన

వ్యాసునికి ఏ భార్యయందు శుకదేవుడు ప్రకటమయ్యెను. శుకుడు అయోనిజుడు. అరణియందు జన్మించెనని మీరే చెబుతున్నారు. మాకా సందేహము తీర్చి వివరముగా తెలపండని ఋషులు సూతుని అడిగారు.

వ్యాసుడు సరస్వతీ తీరమున ఉన్న సమయంలో పిచ్చుక పిల్లలు గ్రుడ్డు నుండి బయటకు వచ్చుటను చూచెను. రెండు పక్షులు పిచ్చుక పిల్లలకు ఆహారము తెచ్చిపెట్టుట ప్రేమతో వాటిని ముద్దాడుట గమనించి మనుష్యుల సంగతి ఇంకెట్లుండునని ఆలోచించి మందరాచలమునకు వెళ్ళుటకు సిద్ధమయ్యెను.

నారదుడు వీణను మీటుతూ వ్యాసుని దగ్గరకు వచ్చి నీ వ్యాకులమునకు కారణమేమి అని అడిగెను. పుత్రహీనునకు సద్గతులు ఉండవని విన్నాను. నేను ఏదేవిని ఆరాధించిన నా కోరిక ఈడేరునో తెలపండి అని కోరగా నారదుడు అప్పుడు చెప్పెను. నా తండ్రి కూడా శ్రీహరిని ఇదేమాట అడిగెను.

ఆ సమయములో శ్రీహరి గొప్పతపము ఆచరించుచుండగా భగవాన్! మీరెందుకు తపము చేయుచున్నారు. మీరే సకల సృష్టిని శాసించువారు కదా! మీ నాభి కమలము నుండి నేను జన్మించితిని. మీవంటి సర్వ సమర్థ పురుషునికి మించిన విశిష్టదైవమెవరు? ఈ రహస్యమును తెలుపుడు అని కోరగా శ్రీహరి చెప్పుటకు పూనుకొనెను.

'బ్రహ్మదేవా! దేవతలు, మానవులు, దానవులు, వీరందరినీ నీవు సృష్టి చేస్తున్నావు. నేను వారిని పాలించెదను. శంకరుడు సంహరించును. సృష్టి చేయటం, పాలించటం, సంహరించటం ఈ కార్యములన్నియు మనకు లభించినవి'.

'అయితే దీనికంతటికి అధిష్టాత్రిశక్తి దేవియని తెలియజేస్తున్నాను. నీలో రాజసశక్తి నెలవయ్యెను. నాకు సత్వగుణము ప్రాప్తించెను. రుద్రునకు తామసశక్తి లభ్యమయ్యెను'.

బ్రహ్మదేవా! మన మందరము ఆశక్తి సహాయముతోనే సఫలమగు చున్నాము. నేను రెండు ఉదాహరణములను తెలిపెదను వినుము. నేను శేషునిపై నిదురిస్తూ అవసర సమయములందు దానవులతో యుద్ధం చేసి వారిని తునుమాడుట, అప్పుడప్పుడు లక్ష్మితో విహరించుట చేయుచుందును.

చాలాకాలము క్రిందట నాలుగు వైపుల జలము నిండియుండెను. అయిదు వేల సంవత్సరములు యుద్ధము చేయవలసి వచ్చెను. నా చెవి కల్మషము నుండి మధుకైటభులను దానవులుత్పన్నములైరి. భగవతియగు ఆద్యాశక్తి చేతనే నేను వారిని సంహరించితిని.

తే.గీ. కాన నద్దేవియే సర్వకారణమని
శక్తి రూపిణియని సుఖశాలిని యని
యీవు నెఱుగుదువట్లయ్యు నింక నింక
నడుఁగ నేటికి సుధ్యేయ మదియ నాకు (మ.క.దా.రా.)

నేను ప్రతియుగమునందు కచ్ఛప, వరాహ, నృసింహ, వామన రూపములను ధరించెదను. నా ధనస్సున ఉన్న అల్లెత్రాడు తెగినప్పుడు తగిలిన దెబ్బకు నా తల మొండెము నుండి వేరయ్యెను.

నీవు గొప్ప శిల్పివి కాబట్టి నాకు గుఱ్ఱము తలను నా మొండెమునకు అమర్చినపుడు నేను హయగ్రీవుడుగా పిలువబడితిని. బ్రహ్మదేవా! భగవతిని మించిన శక్తి వేరొక దేవతకు లేనేలేదు. అని ఈ కథనంతా తెలిసినవాడు భగవంతుడైన విష్ణువేనని నారదుడు చెప్పెను.

'ఓ వ్యాసమహర్షీ! నీవు పురుషార్థ సిద్ధికొరకు ఆ భగవతి చరణకమలములను హృదయమునందు నిలిపి ధారణ చేయుము, నీ కోరిక జగదంబిక తప్పక సఫల మొనర్చును' అని నారదుడు చెప్పగా వ్యాసుడు తపస్సు చేయుటకు వెళ్ళెను.

9. హయగ్రీవ అవతారము

శ్రీహరి గుఱ్ఱపు తలతో హయగ్రీవుడుగా ఏర్పడుటకు కారణమేమని అడుగగా సూతుడు ఇలా చెప్పెను. సనాతన పరమప్రభువు శ్రీహరి దానవులతో పదివేల సంవత్సరములు యుద్ధము చేయవలసి వచ్చెను. బాగా అలసిపోయి బాణమును ఎక్కుపెట్టి అలానే నిద్రపోవుచుండెను.

ఇంద్రుడు, బ్రహ్మ, శంకరుడు సకల దేవతలు యజ్ఞము చేయుటయందు ఆసక్తి కలవారై శ్రీహరిని దర్శించుటకు వైకుంఠమునకు వెళ్ళిరి. యజ్ఞేశ్వరుడగు విష్ణుభగవానుని దర్శింపలేకపోయిరి. శ్రీహరి యోగ నిద్రాధీనుడై చైతన్య రహితునివలె పడియుండుటను చూచిరి. ఇప్పుడు మనము శ్రీహరి ఎలా మేల్కొలిపేది అని దేవతలు ఆలోచించసాగిరి.

బ్రహ్మ ఆ సమయమున వమ్రీ అను పేరుగల కీటకమును ఉత్పన్నము చేయును. ఆ కీటకము ధనస్సుకున్న తాడును కొరికి వేయును. అప్పుడు శ్రీహరికి నిద్రాభంగమై పైకిలేవగానే మనము మన కార్యమును నిర్విఘ్నముగా చేసికొన వచ్చును అని పలికెను.

వమ్రీ నాకు వచ్చు ఫలితమేమి? స్వార్థము లేకుండా ఎవరు ఏ పనిని చేయరు కదా! అని పలుకగా యజ్ఞమునందు హవనము చేయునపుడు చుట్టు ప్రక్కల హవ్యము పడుచుండును. అది నీ భాగము అని తలంపుము అని పలుకగా వమ్రీ వెంటనే అల్లెత్రాడును కొరికి వేసెను.

ధనస్సు నుండి అల్లె త్రాడు తెగిపోగా పెద్ద శబ్దముతో అంధకారము వ్యాపించెను. సూర్యుని ప్రభ క్షీణించెను. విష్ణుభగవానుని తల మొండెము

నుండి వేరై సముద్రమున పడిపోయెను. శంకరుడు బ్రహ్మయును దేవతలు మిగుల దుఃఖితులైరి.

మనము ఇపుడు నిర్గుణ స్వరూపియైన భగవతిని ధ్యానించినచో మనకు పరిష్కారము తెలుపగలదు, అని సకల దేవతలు ఆ దేవిని స్తుతించసాగిరి.

తల్లీ! కాంతి, క్షమ, శాంతి, శ్రద్ధ, మేధస్సు, ధృతి, స్మృతి, జయ, విజయ, ధాత్రి, లజ్జ, కీర్తి, స్పృహ, దయ, ఈ పేర్లతో మీరు ప్రసిద్ధులు, ఓంకారము మీ రూపము. గాయత్రి యందలి ప్రణవము మీరే!

దండకము

దేవీ సమస్త ప్రపంచాత్మ వస్తు ప్రశస్తత్వ విస్తారిణీ! నిస్తులానన్త దీస్తుత్య దారప్రకార ప్రచార ప్రభాకార సంచార సంశోభినీ! నిర్గుణా! దుర్గమానర్గళా! సర్గదా! వర్గ దాత్రీ జగజ్జాల కర్త్రీ! సమజ్జీవ భర్త్రీ! ద్విషజ్జాతి హర్త్రీ! కనన్, శ్రీవి నీవే యికన్ ధీవి నీవే క్షమాశాంతి కాంత్యాదులు న్నీవే మేధా ధృతుల్ నీవె యుద్గీధ మంధర్థ మాత్రంబు నీవే! యాసత్తునుం జిత్తు నానందము న్నీవె కావాక్స్మృతి (వాక్‌స్మృతి) హ్రీవరేణ్యాది రూపంబులం బొంది పాపంబులం జెండి కారుణ్యమూర్తిత్వముం గల్గి బ్రహ్మచ్యుతేశేంద్రే వాగ్వహ్ని భాస్వద్ది గీశాదులం దుండి శక్తి స్వరూపంబునన్ సర్వకార్యంబులంజేయు తల్లీ సృజింపగ బ్రహ్మన్ భరింపంగ విష్ణున్ హరింపంగ శంబున్ బసంగించితీ వెవ్వఁడైనంభవత్పాద పద్మంబులం గొల్చినన్ వాని నిస్సార సంసార శోకాబ్ధికిన్నావయై తేల్చి తీరంబునం జేర్తు వీవె కదా నిన్నుఁ గీర్తింప నెవ్వాఁడు నేర్చున్నమస్తే నమస్తేయటంచుం భవత్పాద పద్మంబులంగొల్తుశ్రీ శ్రీ (మహాకవి దాసురామదాసు).

మీరు తల్లులకు తల్లి. వాగ్బీజము మీ స్థానము. బ్రహ్మ, విష్ణువు, మహేశుడు, ఇంద్రుడు, అగ్ని, సరస్వతి, సూర్యుడు, వీరందరిని మీరే

నియమించితిరి. దేవీ! వాస్తవమునకు మీ రూపమొక్కటే దేవతలలో కూడా మీ విభూతిని తెలిసికొనిన వారెవరును లేరు.

దేవీ! ఈ జగత్తు 'మిథ్య' అఖిల జగత్తుకు ఉత్పత్తికి కారణమయ్యేది మీరే! ఇప్పుడు విష్ణు భగవానుని మస్తకము మొండెము నుండి వేరై పోయినది. ఇలా విష్ణుని మస్తక హీనునిగా చూచి ఆనందించుచున్నారా? మీరు జగదంబిక మీ తేజస్సు నుండే శ్రీలక్ష్మి ప్రకటితురాలైనది గదా!

లక్ష్మిని అనుగ్రహించి విష్ణు భగవానునకు ప్రాణదాన మొసగుడు, అని ప్రార్థింపగా మీరు వేద ప్రతీతమైన స్తోత్రము పారాయణము చేసిన మీరు కోరుకొన్నవి లభించుగాక! అనగా విష్ణుదేవుని తల ఇలా వేరగుటకు కారణము చెప్పెదను, వినుడు అని లక్ష్మీదేవితో విరాజమానుడైన విష్ణువు లక్ష్మీదేవిని చూచి ఆయనకు నవ్వు వచ్చెను.

నా ముఖము చూచి మీరు నవ్వుచున్నారు. మీ తల నేలమీద పడిపోవుగాక యని ఆమె నోటినుండి వెలువడెను, ఇలా జరుగుటకు మరియొక కారణము కూడా కలదు. హయగ్రీవుడనే దైత్యుడు ఒకడుండెను. అతడు ఏకాక్షర మంత్రబీజముతో వెయ్యి సంవత్సరములు తపమాచరించు చుండెను.

అపుడు దేవీమాత అతనికి దర్శనమివ్వగా తల్లీ! పృథివి, జలము, తేజస్సు, వాయువు, ఆకాశము, వీటన్నిటికి కారణము మీరే! అని పలుకగా నేను ప్రసన్నత చెంది వరము కోరుకోమని హయగ్రీవునకు చెప్పగా మృత్యుముఖము చూడని అమర యోగిని కావలెనని అతడడుగగా కుదరదని నేను చెప్పాను.

ఎవరైతే గుఱ్ఱపు తలతో (హయగ్రీవుడుగా) ఉంటారో వానితోనే నాకు మృత్యువు సంభవింపవలెనని కోరెను. అలానే అని ఆనాడు నేను రాక్షసుడైన హయగ్రీవునకు వరము ఇచ్చియున్నాను. కనుక ఇపుడు ఈ గుఱ్ఱపు తలను

విష్ణువునకు అమర్చుడని దేవి బ్రహ్మను ఆదేశించెను. దేవతలు మిగుల సంతోషపడిరి.

బ్రహ్మదేవుడు దేవతల సమక్షమున గుఱ్ఱము యొక్క తలను ఖండించి విష్ణువు మొండెమునకు అమర్చెను. అపుడు దేవి అనుగ్రహమున హయగ్రీవుడుగా అవతరించెను. దానవుడైన హయగ్రీవుడు ఎప్పుడూ దేవతలతో శత్రుత్వము నెరపుచుండగా విష్ణువు హయగ్రీవుడై యుద్ధమొనరించి రాక్షసుడైన హయగ్రీవుని వధించెను.

ఈ పుణ్య కథను ఎవరు ఆసక్తితో వింటారో అట్టివారు సకల దుఃఖముల నుండి ముక్తులగుదురు, ఎవరు చదివినా, వినినా, వ్రాసినా సకల సంపదలు సులభమగును.

10. బ్రహ్మ శ్రీహరిని స్తుతించుట

సర్వత్ర జలమే యున్నప్పుడు విష్ణువు మధుకైటభులను రాక్షసులతో అయిదు వేల సంవత్సరములు యుద్ధము చేయవలసి వచ్చెను అనగా ఋషులు సూతునితో ఏకార్ణవ జలమునందు దానవులు ఎట్లు ఉత్పన్నులైరో మేము వినగోరుచున్నామన్నారు. సాత్విక శ్రవణము కూడా ఉత్తమ, మధ్యమ, నికృష్టములను మూడు భేదములను తెలుపుతూ మోక్షము ఒసగు శ్రవణము ఉత్తమమని స్వర్గము నిచ్చునది మధ్యమమని, భోగములనొసగునది అధమమని చెప్పిరి.

సాహిత్యము కూడా మూడు విధములు అని తెలుపుతూ నాయికా శృంగార వర్ణనము గలది ఉత్తమమని వేశ్య శృంగార వర్ణన గలది మధ్యమమని, పరస్త్రీ శృంగార వర్ణన చేయుసాహిత్యము అధమమని చెప్పబడినది పురాణ శ్రవణము అన్నిటికంటె శ్రేష్ఠమైనది.

విష్ణు భగవానుడు శేషశయ్య మీద నిదురించి ఉండెను. ఆ స్వామి చెవి యందలి మైలనుండి మధుకైటభులను దానవులు ఉదయించిరి. వారికి ఈ అగాధ జలమునకు ఆధారమేదనే సందేహము వచ్చెను.

మేము ఎట్లు జన్మించితిమి మాకు తండ్రి ఎవరు? అను ప్రశ్న మనస్సున ఉదయించెను. కైటభుడు తన అన్న మధుశంకతో జలమునందు మన ఉనికిని స్థిరపరచునది కేవలము భగవతీ శక్తియే! మన జన్మకు కారణమైనది ఆ దేవియే!

అలా వారివురు సతమతమవుతుండగా ఆకాశము నుండి ప్రతిధ్వనించుచు సుందరమైన వాగ్బీజము వినిపించెను. మెరపు మెరసినట్లు ఆకాశమునందు ప్రకాశించెను. ధ్యానమగ్నులైన వారికి సగుణమంత్రపు ఆభాస ప్రాప్తించెను. వారు అదే మంత్రమును ధ్యానించి జపించుటయందు లగ్నమైరి. ఒక వెయ్యి సంవత్సరములు వారు కఠినమైన తపస్సుచేసిరి.

వారి తపస్సుకు మెచ్చి ఆరాధ్యమైన శక్తి ప్రసన్నత చెంది, మీకేమి వరము కావలయునో అడుగుడు అనగా స్వేచ్ఛా మరణమును కోరిరి. మీరు కోరినపుడే మరణము సిద్ధించునని వరము ప్రసాదించినది.

మధుకైటభులు గర్వంతో బ్రహ్మదేవునిపై దృష్టిని నిలిపిరి. నీవు మాతో యుద్ధము చేయుము లేదా ఈ బ్రహ్మ స్థానమును వదలి వెళ్ళుము అని వారు గద్దించగా బ్రహ్మ వారితో మిన్నకుండి బ్రహ్మకమల నాళమును పట్టుకొని శ్రీహరిని శరణు వేడుటకు వెళ్ళగా విష్ణువు యోగ నిద్రలో వుండగా బ్రహ్మ ఆలోచించి భగవతీశక్తి మాత్రమే నన్ను రక్షింపగలదని విశ్వసించెను.

విష్ణువు ఆ దేవి ప్రభావాంతర్గతుడై నిద్రలో జడునివలె పడియున్నాడు. నేనిపుడు భగవతి యోగనిద్రను స్తుతించెదను అని తల్లీ! ప్రాణులకు సత్ అసత్‌ల జ్ఞానమును కలిగించు బుద్ధివి నీవే! ఈ జగత్తునందు కీర్తి, ధృతి, కాంతి, మతి, రతి, శ్రద్ధారూపములో విలసిల్లుచున్నావని బ్రహ్మ కీర్తించాడు.

ఉ. ఓ పరమేశ్వరీ! వినుమహోమొఱ యింతట లెమ్ములెమ్మనీ
రూపము సూపు మమ్మ సితరోచిమరీచిక లీను నీముఖం

బోపికు జూచి మ్రొక్కెద నయోన్నతి విష్ణుని వీడు మమ్మ నా
యాపదు బాపుమమ్మ నిరతాయత చిత్ర విచిత్ర వర్తనీ!
(మ.క.దా.రా)

భవానీ! నేను నీ అద్భుత లీలను తెలిసికొంటిని నేను దైత్యులచేత ఒకవేళ చంపబడినచో నాకు అపకీర్తి కలుగును కదా! అని స్తుతించగా నిద్రాదేవి భగవంతుడగు విష్ణువు శ్రీ విగ్రహము నుండి బయటకు వచ్చి ప్రక్కన నిలుచుండెను. శ్రీహరి యొక్క సమస్త అంగముల నుండి నిద్రాదేవి ఆధిపత్యము తొలగిపోయెను. విష్ణువు శరీరము మెల్లగా కదల్చుచుండగా బ్రహ్మ ఆనందపరవశుడయ్యెను. ఋషులు ఇలా అడిగారు. శ్రీమహావిష్ణువు వివశుడై నిదురించుచూ నిద్రతో అచేతనుడెట్లయ్యెను? అని అడుగగా సూతుడు చెప్పెను.

నారాయణుని కొందరు, శంకరుని కొందరు ఉపాసించెదరు. సూర్యోపాసనమే ఉత్తమమైనదని సకల వేదములు అంగీకరించును. అగ్ని, ఇంద్ర, వరుణులు కూడా పూజ్యులే, గంగ ధారగా మనకు ప్రవహించుచుండును.

సూర్యుడు జగత్తుకు వెలుగును ప్రసాదించును. శేషుడు, కచ్ఛపము వారికందరికి భూభారమును వహించెదరు. అగ్ని దహించు శక్తిని, గాలి కదలించు సామర్థ్యమును కలిగియున్నవి. శక్తి కృపలేకపోయినచో బలహీనులగుదురు. ఆద్యాశక్తియే యీ అఖిల బ్రహ్మాండమును ఉద్భవింపజేయును.

బ్రహ్మ, విష్ణువు, శంకరుడు, ఇంద్రుడు, వాయువు, వీరందరును స్వతంత్రముగా వారివారి కార్యములను నిర్వహింపలేరు. అందుకు ఆద్యాశక్తి సహాయపడినప్పుడే వారు తమ కార్యములను నిర్వహింతురు.

ఆ దేవి శాంత స్వరూప, ధర్మ, అర్థ, కామ, మోక్ష ప్రదాయిని పరబ్రహ్మ స్వరూప, సనాతన, సకల జగత్తునందు ఆ శక్తినే సర్వోత్తమమైనదిగా తలంచవలెను.

11. మధుకైటభులతో మహావిష్ణువు యుద్ధము చేయుట

విష్ణువు భయముతో నిలుచున్న బ్రహ్మను చూచి మీరు చాలా భయకంపితులై ఉండుటకు కారణమేమి? అనగా ప్రభూ! మధుకైటభులను ఇరువురు దైత్యులు మీ చెవియందలి మైలచే ఉద్భవించిరి. వారిరువురు మిక్కిలి బలవంతులై నన్ను సంహరించుటకిపుడు ఉద్యుక్తులైనారు మీరే నన్ను ఇపుడు రక్షించవలెనని కోరుకొనెను.

బ్రహ్మదేవా! మీరిపుడు ప్రశాంతంగా ధైర్యమును సడలిపోనివ్వక విశ్రమింపుడు. మధుకైటభులను సంహరించు సమయ మాసన్నమైనదని విష్ణువు పలుకుచుండగా బ్రహ్మను వెదుకుచూ మధుకైటభులిరువురు అచటికి వచ్చిరి.

విష్ణువుతో బ్రహ్మను చూచి సర్పము పడగల మీద ఆసీనుడగు ఇతనిని కూడా మేమిరువురు సంహరించెదము అని వాగ్బాణములు సంధించు చుండగా, విష్ణువు దానవ శ్రేష్ఠులారా! మీరు యుద్ధమును కోరినట్లైతే రండు, మీ అభిమానమును నుగ్గునుగ్గు చేసెదనని ముందుకు సాగెను.

మధుకైటభులు ఏ ఆధారము లేకుండగానే జలమునందు నిలిచి శ్రీహరితో యుద్ధము చేయుటకు సిద్ధమైరి మొదట మధు మల్లయుద్ధమునకు విష్ణువును పిలిచెను. వారిరువురికి గొప్పపోరు జరిగింది.

మధు అలసిపోగానే కైటభుడు తలపడు చుండెను. ఈ విధముగా ఐదువేల సంవత్సరములు యుద్ధము కొనసాగెను. బ్రహ్మభగవతి ఈ దృశ్యమును తిలకించు చుండెను. విష్ణుభగవానుడే అలసిపోవుట దేవతలు గమనించారు.

దానవులు 'విష్ణూ! నీకు బలము లేనపుడు "నేను నీకుదాసుడను", అని చెప్పి లొంగి పొమ్ము!' అని వెకిలిగా పలికిరి. నీతోపాటు ఈ బ్రహ్మను కూడా వధింతుము.

అనగా విష్ణువు 'అపుడు నేను ఒంటరివాడను. మీరిరువురు కొంతసేపు విశ్రమించి నాపైపోరు సలువుచున్నారు. అలసి పోయినవాని మీద ఎవరూ ఆయుధములను ఎక్కుపెట్టరు గదా! కొద్దిసేపు ఆగుడు, నేను విశ్రమించి తదుపరి మీతో యుద్ధము చేయుటకు రాగలనని' విష్ణువు పలికెను.

మధుకైటభులు కూడా విష్ణుదేవుని మాటలను ఆలకించి శాంతించిరి. బ్రహ్మ ఇదంతయు గమనించి ఈ మధుకైటభులు తాము కోరినపుడే మరణము సిద్ధించుననెడి వరము శ్రీదేవి ఇచ్చియున్నది గదాయని బ్రహ్మ సకల మనోరథములను నెరవేర్చు విద్యామయియగు శక్తిని శరణు వేడెదనని అనుకొనెను.

ఉ. దేవినమోస్తుతే యనుచు ధీరజన ప్రణుతాంఘ్రిజేహ మా
ద్యే వరదే పరే యనుచు దేహి ముద మ్మమ తే పదంతు వం
దే విబుదార్చితే యనుచు దివ్యశరీరిణి రక్షరక్ష వి
ద్యావతి యంచు విష్ణుడు వియద్గత శక్తికి మ్రొక్కె భక్తితోన్
(మ.క.దా.రా.)

అదే సమయమున భగవతి యోగనిద్ర ఆ స్వామికి దర్శనమయ్యెను. శ్రీహరి యోగ జ్ఞాన సంపన్నుడుగా భగవతి భువనేశ్వరిని స్తుతించెను.

శా. ఈ వేళన్ గడు స్రుక్కి మ్రొక్కితిని దేవీ! నన్ను రక్షింపవే!
వేవేగం గడుపార ముజ్జగము నీవె కంటి విచ్చారతిన్
నీవే తప్ప ని కెవ్వరమ్మ జననీ నిక్కంబు మాబోంట్లకున్
రావే యీశ్వరి లోకసుందరి సపర్యాకార్యకృతే చరీ! (మ.క.దా.రా.)

ఆ దేవి చిరునవ్వుతో ఈ దానవులు మోసముచేతనే సంహరింప బడుదురు. నారాయణా! నామాయచేత మోహితులైన వీరిని శీఘ్రముగా చంపివేయుము అని చెప్పగా విష్ణువు మళ్ళీ ఆ దానవులతో యుద్ధము జరుపసాగెను.

ఆ దానవులను చూచి భగవతి విరగబడి నవ్వెను. ఆ పాపాత్ములు ఆమె వక్ర చూపులకు మోహితులైరి. దైత్యులు మోహితులైనారని దేవి అభిప్రాయమును పసిగట్టెను వీరులారా! నేను మీ యుద్ధ కౌశలమునకు మెచ్చితిని.

మధుకైటభులు కామాతురులైయుండిరి. విష్ణుదేవుని వచనములు విని కూడా వారి కనులు ఆ దేవి మీదనే యుండెను. శ్రీహరితో ఇట్లు చెప్పసాగిరి. విష్ణు! మేము యాచించుటకు రాలేదు.

హృషికేశా! నీకేమి వరము కావలెనో మమ్ములను ప్రార్థింపుము. మీరు నా యెడల ప్రసన్నులైనచో నాకు వరము నియ్యనభిలషించినచో వినుడు మీరిరువురూ నాచేతులతోనే మీ మరణము స్వీకరించవలెను అనెను.

మధుకైటభులు ఆశ్చర్యమునకు లోనై మనమిపుడు మోసపోయాము అని అంగీకరించి నిలబడిరి. జనార్దనా! జలశూన్యమగు విశాల ప్రదేశమునందు మమ్ములను వధింపుము అని పలుకగా భగవంతుడు సుదర్శన చక్రమును స్మరించెను.

విష్ణుభగవానుడు తన విశాలమగు తొడలను విస్తరింపజేసి జలమునందే జలరహిత స్థానము తయారుచేసి మధుకైటభులకు చూపెను. మీమీ మస్తకములను ఇచట ఉంచుడు అనగా తమ నాలుగు క్రోసుల విశాల శరీరమును మృత్యుముఖమున పడవేసిరి.

భగవంతుడపుడు తొడలను ముడుచుకొనగా దైత్యులు ఆ తొడలపై శిరసులనుంచగా తన చక్రము చేత వారి తలలను ఖండించెను. మధుకైటభుల ప్రాణములు గాలిలో కలిసిపోయెను. అప్పటినుండి మన్ను

తినుట నిషేధింపబడినందు వలన పృథివికి మేథిని అని పేరు వచ్చెను. త్రిలోకములందు భగవతికంటే శ్రేష్ఠరాలగు దేవత ఇంకెవరునూ లేరు. అని సూతుడు మునులకు మధుకైటభుల కథను వినిపించెను.

12. వ్యాసుడు శంకరుని వరమడుగుట

మునులు సూత మహర్షితో వ్యాసులకు శుకమహర్షి జననము విశదపరచుమని కోరగా శుకుడు సాక్షాత్తు ఉన్నతశ్రేణికి చెందిన యోగి. వ్యాసుడు పుత్రునికోసం మేరు పర్వతముపై తపము చేయుచుండగా అతని తేజస్సు అచట వ్యాపించియుండెను.

అపుడు ఇంద్రుడు భయమునకు లోనై శంకరుని వద్దకు వెళ్ళి స్వామీ! వ్యాసుడెందుకు తపమాచరించు చున్నాడు. అతని మనస్సులోని కోరిక ఏమిటి? అనగా శంకరుడు సమాధానమొసగెను.

వ్యాసుడు వంద సంవత్సరములుగా తపస్సు చేయుచున్నాడు. ఇపుడతనికి చక్కటి కుమారు నొసగెదనని చెప్పెను. వ్యాసా! లెమ్ము నీకొక చక్కటి పుత్రుడు ప్రాప్తించును. అతడు సాత్విక గుణములతో సత్యపరాక్రముడై యుండును. అనగా వ్యాసుడు సంతోషముతో ఆశ్రమమునకు వెళ్ళిపోయెను.

వ్యాసుడు తపము ఆచరించుట వలన అలసిపోయి యుండెను. పుత్రుని ఉదయింపజేయుటకు అరణి (అనగా కామిని) నా దగ్గర లేనేలేదు. స్త్రీతో బంధము కాళ్ళకు సంకెళ్ళు వేసుకొనుటయే కదా! అని ఆలోచిస్తుండగా ఘృతాచి అను అప్సర దివ్య రూపమును ధరించి ఆయన దృష్టికి గోచరించెను. చాలా కాలము క్రితము నారదుడు చెప్పిన కథ గుర్తుకు వచ్చినది.

13. పురూరవుని వృత్తాంతం

ప్రతిష్ఠానపురమును పురూరవుడు పాలిస్తూ ప్రజల రక్షణయందు నిమగ్నుడై ఉండెను. ఆయన రూపగుణ వైభవములకు ఊర్వశి

ఆసక్తురాలయ్యెను. ఐతే ఆమె రెండు షరతులతో రాజును పతిగా చేసుకొనెను, మొదటి షరతు నేను నీవద్ద రెండు మేకలనుంచెదను. వాటిని రక్షింపవలెను. ప్రతి దినము నేను ఘృతమునే తిందును.

మైథునమున తప్ప నేనెప్పుడును నిన్ను నగ్నముగా చూడ జాలను, ఇది రెండవ షరతు. ఈ రెండు షరతులు నీవు మీరినావంటే నిన్ను వదలి వెళ్ళిపోవుదును అనెను.

ఊర్వశి కోరికలకు అంగీకరించి ఆమెతో వసింపసాగెను. ఆమెయందు మిగుల అనురక్తుడై యుండెను. ఇంద్రునకు ఊర్వశి కనిపించకపోయేసరికి గంధర్వులతో ఊర్వశిని ఇచటకి తీసుకొని వచ్చుటకు ప్రయత్నము చేయుడు అనెను. పురూరవుని దగ్గర గల మేకలను మీరు దొంగిలించినచో ఈ పని తప్పక జరుగగలదు. ఇక్కడ ఊర్వశి లేకుండా ఇంద్రసభ చిన్నపోయి ఉన్నదని చెప్పెను.

ఇంద్రుడు చెప్పినట్లు విశ్వావసుడు గంధర్వులు పురూరవుని భవనమునకు వెళ్ళిరి. గంధర్వులు మేకలను అపహరించిరి. మేకల శబ్దము వినబడెను. ఊర్వశి పురూరవునితో మేకలను దొంగలించి తీసుకొని వెళ్ళుచున్నారు. నీవు నపుంసకుడా ఏమిటి మిన్నకున్నావు అని విలపించెను.

పురూరవుడు వెంటనే లేచి తన శరీరముపై బట్టలేదనుట కూడా మరచి నగ్నముగా దొంగల వెనక పరుగిడెను. రాజు వచ్చుట గమనించి మేకలను వదలి గంధర్వులు పరుగులెత్తిరి. పురూరవుని నగ్నముగా చూచిన ఊర్వశి వెళ్ళిపోయెను.

పురూరవుడు ఊర్వశి కనిపించక పోయేసరికి పిచ్చివానివలె నుండెను. భూమండలమంతా తిరుగుచుండగా అతనికి కురుక్షేత్రమున ఊర్వశి కనిపించగానే సర్వాంగములు పులకించిపోయెను. కాని ఊర్వశి, మహారాజా! నీవు గొప్ప మూర్ఖుడవు. నీవు విషాదము చెందుట వ్యర్థమని

చెప్పెను. దానికి ఈ కథను మీకు సంక్షిప్తముగా చెప్పుచున్నాను అని సూతుడు చెప్పెను.

14. శ్రీ శుకుని జననము

ఘృతాచి అను పేరుగల అప్సరసను చూచి వ్యాసుడిట్లు ఆలోచించెను. ఈ దేవకన్యయగు అప్సరస నాకు తగినది కాదు. అని ఆలోచిస్తున్న వేళ ఘృతాచి శుకిగా మారి పక్షి రూపముతో ముని ఎదుట నుండియే వెళ్ళెను. అపుడు వ్యాసుడు పక్షి రూపములో నున్న ఆమెను చూచి విస్మితుడయ్యెను. అప్సరను చూచిన తోడనే వ్యాసునకు కామ సంచారము కలిగెను.

అగ్నిని రగుల్చు ఉద్దేశ్యముతో వ్యాసుడు ప్రయత్నిస్తుండగా ఆకస్మికముగా ఆ కర్రమీద ఆయన వీర్యము పడిపోయెను. ముని యొక్క అమోఘ వీర్యముతో శుకదేవుడావిర్భవించెను. శుకదేవుని రూపము కూడా మిగుల దివ్యమైయుండెను. ఆ అగ్ని నుండి ఉదయించిన ఆ బాలకుడు వ్యాసుని మనస్సును ఆశ్చర్య మొనరించెను.

శుకదేవుని చూచి విశ్వావసుడు, నారదుడు, తుంబురుడు వారికి ఆనందము కలిగెను. శుకదేవుని కోసం దండము, చక్కని కృష్ణ మృగచర్మము, కమండలము ఆకాశమునుండి వచ్చెను. వ్యాసుడు శుకునకు యజ్ఞోపవిధిని పూర్తి చేసెను.

శుకదేవుడు బృహస్పతిని విద్యాగురువుగా చేసికొనెను. గురుకులము నందుండి ధర్మశాస్త్రముల నన్నింటిని చక్కగా అభ్యసించెను. గురువుకు దక్షిణలిచ్చి తండ్రి దగ్గరకు తిరిగి వచ్చెను.

వ్యాసుడు శుకునకు వివాహము చేయవలెను గదా అని ఆలోచించసాగెను. వ్యాసుడు కుమారునితో నన్ను పుత్ర ఋణమునుండి ముక్తుని చేయుట నీ ప్రథమ కర్తవ్యము అని కోరెను. శుకదేవుడు తండ్రీ! నేను వివాహము చేసికొనినచో స్త్రీకి వశుడగుదును.

భార్యాపుత్రుల సంకెళ్ళతో బంధింపబడిన వాడు ఏ విధముగా ముక్తుడు కాజాలడు, నేను అయోనిజుడను. మరల యోనియందు చిక్కుకొనుటకు నా బుద్ధి ఎట్లు సమ్మతించును. భవిష్యత్తులో కూడా నేను ఏదేని యోనియందు జన్మించవలెనని కోరుకొనుట లేదు.

ఆత్మానందము ననుభవించెడి పురుషుడు లౌకిక సుఖములకు ఎట్లు ఆసక్తుడగును. నేను మొదట వేదములను అధ్యయనము చేసి వాటి గురించి ఆలోచించితిని. కాని శాంతి లభించలేదు.

నేను బృహస్పతిని గురువుగా చేసికొనగా, ఆయన మీద కూడా గార్హస్థ్య మయమగు సముద్రపు అలలు నిరంతరము తరంగితము లగుచున్నవి. అవి నన్నెట్లు ఉద్ధరించగలవు.

వైద్యుడు రోగముచే ఉండగా ఇతరులకు వైద్యము చేయబూనుట సాధ్యమా? నా గురువుగారు స్వయముగా ముక్తిమార్గమును వెదుకుచున్నాడు. వస్తుస్థితిని గురించి విచారించగా సంసారము నందేమి సుఖము ఉన్నది.

వేదశాస్త్రములను అధ్యయనము చేసియుండి కూడా కుటుంబము నందే లగ్నమైయుండు వానికంటే గొప్ప మూర్ఖుడుండడు. పురుషుని నిరంతరము బంధించి యుంచునది కనుకనే గృహమును గ్రహమని చెప్పుదురు.

గార్హస్థ్య జీవనమనిన నా మనస్సు భయముతో వణకిపోవుచున్నది. అనగా వ్యాసుడు గృహస్థాశ్రమము నందు మనస్సులగ్నము కానిచో గృహస్థుడయి కూడా ముక్తుడగును. వేదముల ఆదేశము ననుసరించి సత్కర్మలయందు లగ్నము కావలెను.

గృహస్థుని ధర్మము మధ్యాహ్నము తరువాత భిక్షకు వచ్చెడివారికి శ్రద్ధతో అన్నము పెట్టుట, మధురముగా మాట్లాడుట ముఖ్యము

వశిష్ఠాదులగు మునులు కూడా ఈ గృహస్థాశ్రమమున ఉండినవారే. స్వర్గము, మోక్షము, ఉత్తమ కులమునందు జన్మ ఇవన్నియును అతనికి సులభమగును.

నీవు మొదట గృహస్థాశ్రమము ఆశ్రయించి పుత్రుని ఆవిర్భవింపచేసి దేవతలను, పితరులను, మానవులను సంతుష్టుని చేసి, గృహమును పరిత్యజించి వనమునకు వెళ్ళి వానప్రస్థమునందుండి సన్యాసాశ్రమము స్వీకరింపుము.

నీవిపుడు ఉత్తమజాతి కన్యను వివాహమాడి వైదిక మార్గము నాశ్రయించుము అని వ్యాసుడు గట్టిగా కుమారునికి చెప్పెను.

తండ్రీ! గృహస్థాశ్రమము సదా కష్టములను కలిగించును. ఏ కోరికలులేని భిక్షకునకు లభించు సుఖము దేవేంద్రునకు కూడా లభ్యము కాదు.

తండ్రీ! నేను ఔరసపుత్రుడను. ప్రతిసారీ జన్మించు సమయమున గర్భము నందున్నప్పుడు పడియుండుటకు నా కిష్టము లేదు. సుఖము నిచ్చునది యోగశాస్త్రములు, జ్ఞాన శాస్త్రములే. ప్రారబ్ధము, సంచితము, వర్తమానము ఇవి మూడును అవిద్యనుండి కలుగును. అనగా వ్యాసుడు చింతాక్రాంతుడయ్యెను. మాయయొక్క బలము అన్నిటికంటె మించినది.

సత్యవతీనందనుడు వ్యాసుడు గొప్ప పండితుడై కూడా ఆ మాయకు చిక్కుబడిపోయెను. ధాత, విధాత, రుద్రాది దేవతలు కూడా మాయాదేవి వలలో చిక్కుకొని ఉన్నారు. విష్ణువుకూడా యోగమాయ నుండి వేరు కాలేదు.

శుకదేవుడు వ్యాసమహర్షితో మహానుభావా! నీవు పరాశరుని యొక్క ఔరసపుత్రుడవు. స్వయముగా అందరకును జ్ఞానము ప్రసాదించుటయే మీ స్వభావము. సామాన్య మానవునివలె ఎందుకు శోకించుచున్నారు.

విషాదముతో మనస్సును అలజడికి గురిచేయుట సముచితము కాదు. గత జన్మలో మీరెవరో? నేనెవరో? ఎవ్వరికి తెలియదు. పితాపుత్రాది వ్యవహారము మోహజాలమని తలచి శోకించుట వదలిపెట్టుడు.

మీరు మిగుల బుద్ధిమంతులు, జ్యోతిశ్శాస్త్రము నెఱిగినవారు, మీ వివేకశక్తితో నా అజ్ఞానము తొలగినపుడు ఈ జగత్తు కర్మభూమి, మానవ జన్మ లభించుట సులభము కాదు. ఉత్తమ కులమున బ్రాహ్మణుని ఇంట జన్మించుట మిగుల దుర్లభము అని చెప్పెను.

శుకుడు మానసికముగా సన్యాసి అయి ఉండెను. వ్యాసుడు పుత్రా! నీవు మిగుల భాగ్యశాలివి. నేను దేవీ భాగవతమును రచించితిని. దీనిని అధ్యయనము చేయుము. ఇది పన్నెండు స్కంధములతో సకల పురాణములకు ఆభరణము వంటిది. దీనిని వినుట వలన సత్ అసత్ వస్తువుల జ్ఞానము సమగ్రముగా అవగాహన కలుగును.

విష్ణువు బాలకుని రూపమున వటపత్రమునందు నిదురించుచుండెను. నేనెందుకు బాలకునిగా రూపొందితినని విష్ణువు మనస్సులో రేగసాగెను. భగవతి యోగమాయ అర్ధ శ్లోకమునందు సకల పురుషార్థములను సిద్ధింపజేయు యీ వచనము పలికెను. ఈ సకల జగత్తును నేనే, నేను తప్ప యింకయే ఇతర అవినాశమగు వస్తువును లేనే లేదు.

"సర్వం ఖల్విదమేవాహం నాన్యదస్తి సనాతనమ్" విష్ణువు భగవతి చెప్పిన వాక్యాన్ని అర్థము చేసుకొనెను. వటపత్రము మీద నిదురించెను. భగవతి యోగమాయ ఆయన ఎదుట ప్రత్యక్షమయ్యెను.

ఆ జననికి నాలుగు భుజములుండెను. ఆ దివ్యవిగ్రహము శంఖ, చక్ర, గదా, పద్మాది అనుపమ ఆయుధములను ధరించి శోభితమై యుండెను. భగవతి మహాలక్ష్మి సాటిలేని తేజస్సుతో శ్రీ విష్ణువు ఎదుట ప్రత్యక్షమయ్యెను.

రతి, భూతి, బుద్ధి, మతి, కీర్తి, స్మృతి, ధృతి, శ్రద్ధ, మేధ, స్వాహా, స్వధా, క్షుధా, నిద్ర, దయ, గతి, తుష్టి, పుష్టి, క్షమ, లజ్జ, జృంభా, తంద్రా మొదలగు శక్తులు ఆ మహాదేవి వెంట నలువైపుల వేరువేరుగా విరాజమానులై యుండిరి.

అప్పుడక్కడ సర్వత్రా జలమే. ఆ జలార్ణవము నందు భగవతి మహాలక్ష్మి హృదయము ఆశ్చర్య భరితమయ్యెను. ఈ స్త్రీ ఎవరు? వటపత్రశాయినగు నేనెవరు? ఈ జలార్ణవమునందు ఈ వటవృక్షము ఎట్లు ఉద్భవించినది? నేను బాలస్వభావముతో ఇచటనే పడియుందునా యని ఆలోచిస్తూ ఉండెను.

15. వ్యాసుడు శుకుని మిథిలకు పంపుట

విష్ణువును చూచి భగవతి చిరునగవుతో విష్ణూ! నీవెందుకు ముగ్ధుడవగు చున్నావు? భగవతి మహాశక్తి ప్రభావమున నన్ను నీవు గుర్తించలేకున్నావు? ఆ పరాశక్తి నిర్గుణ, నీవు సగుణ పరబ్రహ్మవు, అట్లే నేను కూడా సగుణశక్తిని, ఇప్పుడే నీ నాభి కమలము నుండి ప్రజాపతియగు బ్రహ్మ సృష్టి జరుగును. రజోగుణ సంపన్నుడై ఆయన సకల జగత్తును సృష్టించును. త్రిలోకములను రచించుటయందు సఫలుడగును. బ్రహ్మరజోగుణమును ధరించి యుండును.

ఈ విశ్వమును రక్షించు కార్యమును నిర్వహించుము "నీ కనుబొమ్మల మధ్య నుండి రుద్రుడవతరించును. ఆయనకు తామస శక్తి ప్రాప్తించును. ఆ రుద్రుడే కల్పాంతమునందు ఈ సృష్టిని సంహరించును.

మధుసూదనా! నేనిచటనే ఉందును. ఎల్లప్పుడును నీ దగ్గరనే ఉందును. నీ హృదయము నాకు నివాసస్థానము, అనగా విష్ణువు దేవీ! కొంచెము సేపటిముందు నేను అర్ధశ్లోకమును వింటిని. అది మిగుల స్పష్టము.

పరమ రహస్యమైన ఆ వాణి ఎవరినోట నుండి వెలువడెను? దయతో దానిని తెలుపుము. అపుడు విష్ణువు మాటలను విని లక్ష్మీదేవి ముఖము వికసితమయ్యెను. ఆమె నవ్వుచు మిగుల ప్రేమతో చెప్పసాగెను.

విష్ణూ! నేను సగుణరూపనగు చతుర్భుజ భగవతిని, నీవు నిర్గుణ ఆద్యాశక్తిని ఎరుగవా? ఆ నిర్గుణభగవతియే ఈ అర్ధశ్లోకమును వచించెనని తెలుసుకొనుము. దీనిని పరమపవిత్రమగు దేవీభాగవత పురాణమని అర్థము చేసికొనవలెను. కళ్యాణప్రదమగు ఈ పురాణము వేదరహస్యముతో పరిపూర్ణమయినది.

మహాదేవి యొక్క నోటినుండి వెలువడిన ఈ వాక్కు సంపూర్ణ శాస్త్రముల సారము. ఆదేవి భగవతి నీ యెడల మిగుల ప్రేమ కలిగియుండును. అపుడు వ్యాసుడు మహాలక్ష్మి వచనములను వినిన తరువాత భగవంతుడగు విష్ణువు దానిని మహామంత్రముగా భావించి హృదయమునందు శాశ్వతముగా నిలుపుకొనును.

ఆ స్వామినాభికమలము నుండి బ్రహ్మ ప్రకటితుడయ్యెను. ఆయన దైత్యులకు భయపడి విష్ణువును శరణుజొచ్చెను. శ్రీహరి ఘోర యుద్ధము చేసి మధుకైటభులను దైత్యులను సంహరించెను.

భగవతిని ఆద్యాశక్తిగా భావింపుము. ఆమె నాధారముగా జేసికొని ఈ అగాధజలమునందు సకల జగత్తు సిర్థమైయున్నది. ఆ భగవతి యొక్క చిత్‌శక్తి నుండే నేను, నీవు, సమస్త ప్రాణులు ఉత్పన్నమైతిమని తెలిసికొనుము. ఆ దేవి చెప్పిన అర్ధశ్లోకమే ద్వాపరయుగారంభమున విశదముగా వ్యాఖ్యానింపబడి దేవీభాగవతమను పేరుతో ప్రసిద్ధిచెందును.

విష్ణువు నాభికమలమున బ్రహ్మ విరాజమానుడై యుండును. బ్రహ్మతన పుత్రుడగు నారదునకు దీనిని బోధించెను. నారదుడు దీనిని నాతో చదివించగా నేను పండ్రెండు స్కంధములలో విశదముగా దీనిని

వ్యాఖ్యానించితిని. ఈ పురాణము నీవు అధ్యయనము చేయుము, పవిత్రతయందు ధర్మశాస్త్రముతో పోల్చబడును. వృత్రాసురవధ, ఇతర అనేక కథలు కూడా వర్ణింపబడినవి.

శ్లోకార్ధేన తయా ప్రోక్తం భగవత్యాఖిలార్థ దం
సర్వంఖల్విరకమే వాహం నాన్యదస్తి సనాతనమ్ (శ్లో॥ 15-52)

సంసార రూప సముద్రమునుండి ఉద్ధరించునటువంటి బ్రహ్మవిద్యకు నిలయము. ఇందు పదునెనిమిది వేల శ్లోకములున్నవి. ఈ విధంగా పలికిన వ్యాసుడు శుకదేవునకు నాకును (సూతునకు) దేవీభాగవతమును ఉపదేశించెను. కాని శుకదేవుడు అలజడికి లోనై యుండెను.

నేను చెప్పిన మాటలు నీకు శాంతి
గలుగదేనియు మిథిలానగరమునందు
జనకరాజర్షి గలఁడు వే చనుము పుత్ర
ధర్మపరుఁడాతడెఱిగించుఁ తత్వమెల్ల

వ్యాసుడు శుకునితో పుత్రా! నీవు మిథిలా నగరమునకు మహారాజగు జనకుని దగ్గరకు వెళ్ళుము. జనకుడు ధర్మాత్ముడని ప్రసిద్ధి కలదు.

జనకుడు జీవన్ముక్తుడు, నీ అజ్ఞానమును దూరము చేయును. నీవు ఆతేని దగ్గరకు వెళ్ళి నీ సందేహమును తీర్చుకొనుము. అతడు బ్రహ్మజ్ఞాని, పరమ పవిత్రుడు, సత్యవాది, సదాశాంతమూర్తి, యోగాభ్యాసి, నిరంతరము యోగమునందు ప్రీతిగలవాడు అని చెప్పెను.

శుకదేవుడు తండ్రీ! రాజగు జనకుడు సంతోషముతో రాజ్యము చేయుచు అతడెట్లు జీవన్ముక్తుడయ్యెను. జలము నందుండు కమల పత్రమువలె దానినంట కుండ ఈ జగత్తులో ఆ మహారాజెక్కడ ఉన్నాడో చూడవలయునని కోరిక యున్నది.

భోగము స్వీకరించినవాడు ఉత్తమోత్తమ పదార్థములను అనుభవిస్తూ సుఖదుఃఖములను తెలుసుకుంటూ అతడెట్లు జీవన్ముక్తుడు కాగలడు.

తండ్రీ! నేను ఏ రాజును జీవన్ముక్తుడగుట చూడలేదు. నా మనస్సు శంకించుచున్నది. నేను నా సందేహము తీర్చుకొనుటకు మిథిలకు వెళ్ళుదునని పలుకగా కుమారుని వ్యాసుడు కౌగలించుకొని ఇట్లు పలుకసాగెను.

14-36 కిం సుఖం మానుషే లోకే బ్రూహి తాత నిరామయమ్
దుఃఖవిద్దం సుఖం ప్రాజ్ఞ న వదంతి సుఖంకిల

కుమారా! జనకుని ద్వారా నీ సందేహము నివారింపబడిన తరువాత వెంటనే ఇచటకు రమ్ము. ఆ తరువాత వేదాధ్యయన తత్పరుడవై సుఖముగా నా వద్ద నుండుము. అనగా శుకుడు తండ్రికి నమస్కరించి ప్రదక్షిణ చేసి వేగముగా వెళ్ళిపోయెను.

శుకునకు మార్గమధ్యమున యోగులు, వాన ప్రస్థులు, శివోపాసకులు, సూర్యోపాసకులు, శక్తి ఉపాసకులు, విష్ణువును ఉపాసించువారు కనిపించిరి. అతడు క్రమముగా సుమేరు పర్వతమును, హిమాలయములను దాటి మిథిలకు చేరుకొనెను.

ప్రధానద్వారము దగ్గర ద్వారపాలకుడుండెను. అతడు శుకదేవుని అడ్డగించి మీరెవ్వరు? ఇచటకెందుకు వచ్చితిరి. ఏ కార్యము సఫలము చేసికొనుటకు రావలసివచ్చెను? అని అడిగెను. శుకదేవుడేమియు సమాధానమొసగలేదు. ఎండిపోయిన వృక్షము వలె చలించక నిలుచుండెను.

అపుడు ద్వారపాలకులు బ్రాహ్మణోత్తమా! మీరు మహాతేజస్సంపన్నులుగా తెలియుచున్నది. మీ వంశమును, మీరు వచ్చిన ప్రయోజనమును తెలిపి తదుపరి స్వేచ్ఛగా దయచేసి నగరమునందు ప్రవేశింపుడు అనగా శుకదేవుడు ద్వారపాలకా! నీవు ప్రభుకార్యమును చక్కబెట్టు సేవకుడికిదే ముఖ్యకర్తవ్యము.

అనగా ద్వారపాలకుడు శుకునితో బ్రాహ్మణోత్తమా! సుఖ దుఃఖము లెట్లుండును? శ్రేయస్సును కోరువారు ఏమి చేయవలయును? శత్రువు ఎవరు? శ్రేయోభిలాషి ఎవరు? ఈ విషయములన్నియు నిర్ణయించి దయచేసి నాకు తెలుపుడు అని కోరగా మనుజులు రెండు తెగలు, ఒకడు రాగి, వేరొకడు విరాగి. విరాగులు మూడు విధములుగా నుందురు. వారు ఎవరంటే తెలిసినవాడు, తెలియనివాడు, మధ్యముడు. రాగిజనులు మూర్ఖుడు, చతురుడు, అని రెండు విధములుగా ఉందురు.

చాతుర్యము – రెండు రకములు, శాస్త్ర చాతుర్యము, బుద్ధి చాతుర్యము, బుద్ధియును, యుక్తము, అయుక్తముగా విభజింపవచ్చును.

శుకదేవుని ద్వారపాలకుడు బ్రాహ్మణోత్తమా! నేను అర్థజ్ఞానశూన్యుడను. అన్ని విషయములను స్పష్టముగా వివరంగా చెప్పుమని కోరెను.

శుకుడు ద్వారపాలకా! సారములేని సంసారమునందు అనురాగము కలవాడు రాగియని చెప్పబడును. భార్యను, పుత్రులను, ధనమును, గౌరవ మర్యాదలను, విజయమును పొంది అతడు సుఖించును. ఇవి సమకూరనపుడు దుఃఖమును అనుభవించును. దానియందు విఘ్నము కలుగజేయువాడే శత్రువని తెలిసికొనుము.

అనురాగియైన పురుషుడు సదా సుఖమును చేకూర్చు మిత్రుడని చెప్పబడును. మోహితుడు కానివాడే చతురుడు, మోహితుడయ్యేవాడు మూర్ఖుడు.

ఏకాంతమున ఉంటూ ఆత్మచింతన చేయుట వేదాంతమును స్వాధ్యాయనము చేయుట, విరాగియైన పురుషునకు సుఖమును గూర్చును. జగత్తును గూర్చి చింతన చేయుట అందు ఆసక్తి చూపుట, విరాగి జనులకు దుఃఖకరములగును.

విద్వజ్జనులను కామక్రోధ ప్రమాదాదులు రకరకములగు శత్రువులుగా జెప్పబడును. ఆనందమే బంధువు. మిత్రుడగును అని చెప్పగా అప్పుడు ద్వారపాలకుడు ఇతడు మహాజ్ఞాని యని నిశ్చయించుకొని శుకునకు దారి వదలి మిథిలానగర ప్రవేశము కల్పించెను.

శుకుని రెండవ ప్రవేశ ద్వారము నుండి విలాస భవనమునకు తీసికొని వెళ్ళెను. అక్కడ శుకదేవునకు విధి పూర్వకముగా అతిథి సత్కారములు చేయబడెను. అనేకమంది సౌందర్యవతులు విధి పూర్వకముగా స్వాగత సత్కారములు చేసిరి. పవిత్ర ఆత్మయగు శుకదేవుడు ఆ స్త్రీలను తల్లులవలె భావించుచుండెను.

ఆ స్త్రీలు శుకదేవునకు సుందరమైన శయ్యను సంసిద్ధము చేసిరి, అయితే శుకదేవుడు దర్భలు చేత బట్టుకొని సాయంకాలపు సంధ్య చేయుటకు ఆ సీనుడయ్యెను. సంధ్య తరువాత ఆయన ధ్యానస్థుడుగా రాత్రియందలి ఒక జాము సమయమున సంధ్యాధ్యానములందుగడిపెను. రెండవ జామున నిదురించి లేచెను. చివరి నాలుగవ జామున మరల ధ్యానములో గడిపెను. ఆ తరువాత స్నానం చేసి ప్రాతఃకాల సంధ్యావందనాది కార్యములు నిర్వహించి నిశ్చింతుడయ్యెను.

16. జనకుని వలన శుకునికి సందేహ నివృత్తి

శుకదేవుని రాకను విని జనకమహారాజు తన మంత్రులతో కూడి ఆయన దగ్గరకు వచ్చెను. సకల మర్యాదలు పూర్తయిన పిమ్మట శుకుడు సుఖాసనమున కూర్చుండగా జనకుడు మునివర్యా! మీరు ఏ కార్యమున ఇచ్చటికి ఏతెంచితిరి అని అడుగగా శుకుడిట్లు బదులిచ్చెను.

మహారాజా! నా తండ్రిగారగు వ్యాసుడు నన్ను వివాహము చేసుకొనుమని నుడివెను. అన్ని ఆశ్రమములలో గృహస్థాశ్రమము ఉత్తమమైనదని పలికెను. అది బంధకారకమని నేను భావించి ఆయన ఆజ్ఞను తిరస్కరించితిని.

ఇది బంధము కాదు అని ఆయన బోధించినను, నేను వినలేదు. అపుడు నా త్రండి నీవు మిథిలకు వెళ్ళుము, శోకించవలదు, అచట జనక మహారాజు కలడు, ఆయన జీవన్ముక్తుడు. ఆయన విదేహకుడను నామముతో సకల జగత్తుకు సుపరిచితుడు అనెను. జనకుని స్థితిని అవలోకించి చూచి నీకు కలిగిన మానసిక ఆందోళనను తొలగించుకొనుము. వివాహము చేసుకొనుట నీకిష్టము లేదను చుంటివి. జనకుడు నీకున్న సందేహములు తీర్చగలడని చెప్పెను. ఆ జనక మహారాజు చెప్పిన మాటలు విని తరువాత తిరిగి నా వద్దకు రమ్ము, అని చెప్పెను. నేనేమి చేయవలయునో నాకానతి నిండు అని కోరెను.

రాజేంద్రా! తపస్సు, తీర్థములు, వ్రతములు, యజ్ఞములు, స్వాధ్యాయము, తీర్థవాసముల, జ్ఞానము, ఈ సాధనములలో దేనిని ఆశ్రయించినచో ముక్తి సులభమగును అని కోరగా జనకుడు మునీంద్రా! మోక్ష మార్గముననుసరించి బ్రాహ్మణుడు మొదట యజ్ఞోపవీత సంస్కారము సంపన్నము చేసుకొనవలెను. విద్య నభిలషించుటకు గురువు నాశ్రయింపవలెను.

వేద వేదాంతములు, అధ్యయనము చేసి గురువునకు దక్షిణ ఒసగవలెను, సమావర్తనము పరిపూర్ణము కావలెను. అపుడతడు గృహస్థాశ్రమము స్వీకరించవలెను.

అగ్నిహోత్రాది కర్మలనొనరించవలెను. సత్యమును పలుకవలెను. పుత్రపౌత్రులు ఉదయింపగా వానప్రస్థమును స్వీకరించవలెను. తదుపరి పుత్రుని దగ్గర నుండుటకు భార్యను నియమింపవలెను. సమస్త అగ్నులను తనలో లీనమొనర్చుకొని నాల్గవ ఆశ్రమమున అడుగిడవలెను.

విరక్తుడైన పురుషుడే సన్యాసమునకు అర్హుడగును, సన్యాసమునకు విరాగి అయి ఉండాలి. వేదముల ప్రకారం నలుబది ఎనిమిది సంస్కారములు

చెప్పబడినవి. అందు గృహస్థులకు నలుబది సంస్కారములు మహాత్ములచే నిర్ణయింపబడినవి.

శమదమాది ఎనిమిది సంస్కారములు ముక్తిని కోరువారికి నిశ్చయింపబడినవి అని చెప్పగా శుకుడిట్లు అడిగెను.

బుద్ధియందు వైరాగ్యము కలిగినపుడు గృహస్థాది ఆశ్రమములందుండుట అవసరమా? అనగా జనకుడిట్లు శుకునకు చెప్పెను. పరిపక్వముకాని బుద్ధి గల మానవునియందు చాలా వికారములు ఉత్పన్నములగు చుండును. అట్టివాడు సన్యాసమును స్వీకరించినచో కామవాసన జాగృతము కావచ్చును. వాసనలు మిగుల బలవత్తరమైనవి. వాటినెట్లు శాంతింప చేయుటకు వీలగును?

ఒక్క ఉదాహరణ పైన నిదురించువాడు ఎప్పుడో ఒకప్పుడు క్రిందపడును. క్రింద నిదురించువానికి పడుటకు అవకాశమే ఉండదు. సన్యాసి అయిన తరువాత భ్రష్టుడైనచో అతనికి ఇంక ఏ మార్గమును సహజముగా లభించదు. క్రమముగా వర్ణాశ్రమ ధర్మములను పాటించుచు మనస్సును జయింపవలెను. గృహస్థాశ్రమము నుండియే సదా శాంతుడై యుండవలెను.

సుఖదుఃఖములను సమానముగా చూడవలెను. భగవంతునిపై ధ్యాస వలన కలుగు ప్రసన్నతను హృదయమునందు పొంది భవ బంధములనుండి నిస్సందేహముగా ముక్తుడగును. అనగా! నేను రాజ్యపాలనము చేయుచు కూడా జీవన్ముక్తుడనైనాను.

వివిధములగు భోగములు అనుభవించుచు నేను సమతుల్యముగా నుందును. ద్విజవర్యా! సుఖదుఃఖములను అగాధ సముద్రములో ముంచునది యీ మనస్సే, సకల తీర్థములందు పదేపదే మునుగవచ్చును కాని, మనస్సు పవిత్రము కానంత వరకు చేసినదంతయు వ్యర్థము.

మానవులు ముక్తులగుటకు దేహము, జీవాత్మ ఇంద్రియములు కారణములు కావు, మనస్సే ముక్తులను చేయుటకుగాని, చిక్కులలో పడవేయుటకు గాని నిమిత్తమగును.

ఆత్మ ఎప్పుడునూ శుద్ధము, అది ఏ బంధమునకు చిక్కుపడదు. అయితే మనస్సు శాంతముగా నుండినచో బంధ మోక్షములు శాంతించును. శత్రుత్వము, మిత్రత్వము, ఉదాసీనత, మొదలగు భేదములన్నియును మనస్సునందుండును.

మహానుభావా! యీ అవిద్య విద్యచేత బ్రహ్మజ్ఞానముచేత తొలగి పోవును. ఎండలేక పోయినచో నీడవలన సుఖమెట్లు అనుభవమునకు వచ్చును. అవిద్య లేనిచో విద్యయొక్క మహత్వం ఎట్లు తెలుసుకొనగలము.

వేదమార్గమున నడుచువారు మాత్రమే శ్రేయస్సును పొందెదరు. అని చెప్పగా శుకుడు మహారాజా! నాకున్న సందేహము నాలుగు వైపుల మాయ ఆవరించియుండగా దాని స్పృహ ఎట్లు శాంతించును.

మహారాజా! జాగృతి, స్వప్న, సుషుప్తి, మొదలగు మూడు అవస్థలు సమయానుకూలముగా మీకు తోడ్పడుచుండును. అట్టి తరి మీలో సామ్య భావన ఎట్లుండును. పుష్పమాలయందును సర్పములందును మీకు సమదృష్టి ఎట్లుండును. మట్టిపెళ్ళ, రాయి, బంగారమును సమదృష్టితో చూచువాడే అన్నిటియందును ఒకే బుద్ధిని కలిగియుండును.

గృహమునందుగాని, స్త్రీ వ్యామోహమునందుగాని, నా మనస్సు లగ్నమగుటలేదు. నిస్సంగుడనై మమతానురాగములు లేనివాడనై ఫలములను ఆకులను, దొరికిన వాటిని తిందును. ఎల్లప్పుడు శాంతితో మృగమువలె విహరించెదను.

ముని గణములు అల్పాహారములను భుజించుచూ వ్రతములను దృఢముగా పాటించుచు, వనములందు తపమొనరించుచు సంసారమును మిథ్యయని తలంచువారు కూడా యీ జగజ్జాలమున చిక్కుకొనియుందురు.

రాజా! మీ కులమున ఉత్పన్నమగు వారికి 'విదేహ' మను పేరుపెట్టబడు చున్నది. మీరు అనేక విషయములలో ఆసక్తులై కూడా జీవన్ముక్తులని చెప్పుకొనుచున్నారు. ఇది పూర్తిగా విరుద్ధముగా తలంతును. మూర్ఖునకు విద్యాధరుడని, అంధునకు దివాకరుడని, దరిద్రునకు లక్ష్మీధరుడని నామకరణము చేసినచో అవి అనర్థములేయగును కదా!

అప్పుడు జనకుడు ద్విజశ్రేష్ఠా! భోజనమును గురించిన ఆలోచనలు మనలను వదలిపెట్టలేదు, వనము నందుండి కూడా నీకు నీ దండము, మృగచర్మము ప్రియమైనట్లు నాకునూ నా రాజ్యమును గురించిన చింతయుండును. మన మిరువురము చింత కలిగియుండుటలో సమానమే కదా!

19-35 దేహోఽయం మమ బంధోఽయం న మమేతి చ ముక్తతా
తథా ధనం గృహం రాజ్యం న మమేతి చ నిశ్చయః

ఈ దేహము నాది, అనుటయే బంధము. ఈ దేహము నాది కాదు అనుటయే ముక్తి. ధనమునందు, గృహమునందు, రాజ్యమునందు, మమతానురాగములను కలిగియుండటయే నిస్సందేహముగా బంధమగును.

మమత లేకపోయినచో ఎక్కడనూ ఏ బంధమునూ ఉండదు. బంధము శరీరమునందుకానీ, గృహమునందుగానీ లేదు. ఇది అహంకార మమకారముల యందే యుండును.

ఇపుడు శుకదేవునికి అన్ని సందేహములు తొలగిపోయెను. జనకుని ఆదేశముతో మునీంద్రుడు వ్యాసాశ్రమమునకు వెళ్ళిపోయెను. వ్యాసుడు కుమారుని రాకతో మిగుల ఆనందమును పొందెను.

శుకదేవుని తన ఒడిలో కూర్చోబెట్టుకొని అతని తలను మూర్కొనెను. తండ్రితో ఆశ్రమమున నివసింపసాగెను. జనకుని స్థితినంతా గమనించినవాడై తండ్రి ఆశ్రమమున ఉండుటయే అతని అభీష్టమయ్యెను.

17. శుకదేవునికి కుమారులు, కుమార్తె పుట్టుట

వ్యాసులవారి ఆజ్ఞతో సౌభాగ్యవతియగు 'పీనరీ' అను పేరుగల కన్యను యోగుల మార్గమున సంచరించుచు కూడా శుకదేవుడు తనకు పత్నిగ చేసికొనెను. వారికి కృష్ణుడు, గౌరప్రభుడు, భూరి, దేవశ్రుతుడును నలుగురు కుమారులును, కీర్తియను పేరుగల ఒక కన్యయును జన్మించిరి.

మహాధీయుతుడగు అణుహీనితో ఆ కన్యకు వివాహము జరిపించెను. అణుహీని పుత్రుడు శ్రీమాన్ బ్రహ్మదత్తుడు. శుకదేవుని దౌహిత్రుడు బ్రహ్మదత్తుడు, ఇతడు గొప్ప పరాక్రమశాలి, అంతేగాక బ్రహ్మజ్ఞాని కూడా. నారదుడాతనికి బ్రహ్మ జ్ఞానము ఉపదేశించెను. గొప్పయోగమార్గమును అనుసరించెను.

ఆ తరువాత అతడు తన పుత్రునకు రాజ్యము అప్పగించి బదరి కాశ్రమమునకు వెళ్ళిపోయెను. నారదుని కృపవలన మిగుల శీఘ్రముగా అతడు ముక్తినొసగు జ్ఞానమునకు అర్హుడయ్యెను.

కొంత కాలమునకు శుకదేవుడు తండ్రియగు వ్యాసుని వదలిపెట్టి కైలాస పర్వతమునందలి రమ్యమగు శిఖరము మీదికి వెళ్ళెను. అతనికి పరమ సిద్ధిలభించుట తోడనే శుకుని ఆసనము శిఖరము నుండి పైకిలేచెను.

శుకదేవుడు సూర్యుడు వెలిగినట్లు ఆకాశమునందు వెలుగు చుండెను. పైకి ఎగయునప్పుడు పర్వత శిఖరము పగిలి రెండు భాగములుగా విభజింపబడెను. ఆకాశమునందు అనేక ఉత్పాతములు కలిగెను. ఋషిగణము స్తుతింపసాగిరి. శుకదేవుడు రెండవ సూర్యునివలె మిగుల దేదీప్యమానముగ నుండెను.

19-48 ఉత్పపాత గిరేః శృంగాత్ సిద్ధిం చ పరమాం గతః
ఆకాశగో మహాతేజా విరరాజ యథా రవిః

వ్యాసుడు దుఃఖముతో ఓ కుమారా! ఓ కుమారా! అని విలపించగా శుకదేవుడు తండ్రిదీన నాదము గుర్తించి వ్యష్టి శరీరము నుండి సమిష్టియందు కలిసి ఆకాశము చేరెనని అందరును తెలిసికొనిరి. ఆ పర్వత శిఖరమునందు పుత్రా! పుత్రా! అను ధ్వని ఇప్పటికి వినిపిస్తుంటుంది.

18. వ్యాసుని శంకరుడు అనుగ్రహించుట

వ్యాసుని స్థితిని చూచి భగవంతుడగు శంకరుడు అచటికి వచ్చి అతనికి నచ్చచెప్పసాగెను. వ్యాసా! నీవు శోకించవలదు, నీ పుత్రుడగు శుకదేవుడు యోగశాస్త్రమునందు గొప్ప పండితుడు.

అకృతాత్మను పొందలేని ఉత్తమ గతిని అతను పొందెను. ఇట్టి యోగ్యుడైన పుత్రుని పొంది నీ కీర్తి విస్తృతమయ్యెను. అనగా వ్యాసుడు దేవేశా! నేనేమి చేయుదును. వివశుండనైతిని. పుత్రుని చూచి తృప్తిపొందని నా నేత్రములు ఎప్పుడు కూడా అతనిని దర్శించుటకు తహతహలాడుచునే ఉండును. అనగా శంకరుడు ఇట్లు పలుకుతూ,

నీ కుమారుని చేతినీడ నీ సమీపముననే కనిపించును. నీవు గొప్ప తపము నాచరించుము. నీ చిత్తము ప్రశాంతత చెందగలదని చెప్పి అంతర్ధానముకాగా వ్యాసుడు తన ఆశ్రమమునకు వెళ్ళిపోయెను.

19. వ్యాసుని ద్వారా సంతానోత్పత్తి ప్రసంగము

వ్యాసుని ఆశ్రమమునందు అసితుడు, దేవలుడు, వైశంపాయనుడు, జైమిని, సుమంతుడు మొదలగు అనేకమంది శిష్యులు వ్యాసుని వద్ద వేదాభ్యాసము చేయుచుండిరి. వారందరు గురువు ఆజ్ఞను స్వీకరించి భూమిమీద ధర్మమును ప్రచారము చేయుటకు వెళ్ళిపోయిరి. శుకదేవుడు అంతరిక్షమునకు వెళ్ళెను గదా. వ్యాసుడు శోకముతో ఉండగా తల్లియగు సత్యవతి జ్ఞాపకము వచ్చెను.

మునివరుడగు వ్యాసుడు జన్మభూమికి తిరిగి వచ్చి పుణ్యమయియగు తల్లి ఎక్కడకు వెళ్ళినదని దాసరాజును అడిగెను. ఆ కన్య రాజగు శంతనునకు అప్పగింపబడినదని చెప్పిరి. దాసరాజు వ్యాసునకు సకల మర్యాదలు చేసెను.

వ్యాసుడు సరస్వతీనది యొక్క రమ్యతీరమునందు ఆశ్రమమును నిర్మించుకొని నివసింపసాగెను. అక్కడ శంతనుడు సత్యవతి ఇరువురు కుమారులకు జన్మనొసగిరి. శంతనుడు ప్రథమపుత్రునకు చిత్రాంగదుడు, రెండవ పుత్రునకు విచిత్రవీర్యుడని పేరు పెట్టెను.

శంతనునకు అందరికంటే పెద్దవాడగు గంగాపుత్రుడు భీష్ముడు మహాబలపరాక్రమశాలి, సత్యవతీ కుమారులగు చిత్రాంగద, విచిత్రవీర్యులు, భీష్మునితో సమానమైన బలవంతులు. తన ముగ్గురు పుత్రులను చూచి మహానుభావుడగు శంతనుడు తనను దేవతలకు కూడా అజేయుడని తలంచు చుండెను. కొంతకాలమునకు శంతనుడు శరీరమును పరిత్యజించెను. పెద్దవాడైనా భీష్ముడు స్వయముగా రాజ్యపాలనము స్వీకరించక చిత్రాంగదుని రాజును చేసెను.

చిత్రాంగదుడు విశాల సైన్యముతో వనమునకు బయలు దేరెను. అపుడే వనమునందు తిరుగాడుచున్న చిత్రాంగదుడనే గంధర్వరాజు యుద్ధమునకు చిత్రాంగ రాజును ఆహ్వానించెను. ఇరువురు బలవంతులు మూడు సంవత్సరములు పోరాడగా చిత్రాంగదరాజు గంధర్వుని చేతిలో మరణించి స్వర్గవాసియయ్యెను. ఆ తరువాత విచిత్రవీర్యునకు రాజ సింహాసనమును అప్పగించెను.

విచిత్రవీర్యుడు యువకుడుగా ఉన్నప్పుడే వివాహము చేయతలపెట్టిన సమయములోనే కాశీరాజు తన కుమార్తెలు ముగ్గురికి స్వయంవరము జరుపు చుండెను. స్వయంవరమునకు వచ్చిన రాజులందరిని భీష్ముడు ఓడించి ఆ కన్యలను తీసుకొని హస్తినాపురమునకు వెళ్ళెను.

తన చిన్న సోదరుడైన విచిత్రవీర్యునకు ఆ కన్యలతో వివాహము జరుపుటకు ప్రయత్నము జరుగుచుండెను. అప్పుడు పెద్దదైన అంబ సిగ్గుతో భీష్ముని చెంతకు వెళ్ళి నేను సాల్వుని మనసునందు వరించియున్నాను అని చెప్పగా భీష్ముడు వృద్ధ బ్రాహ్మణులను మంత్రులను తల్లి సత్యవతిని పిలిపించి వారితో సంప్రదించెను.

అందరి మనసుల నెరిగి వరాననా! నీవు స్వేచ్ఛగా వెళ్ళవచ్చును అని అనుమతి నివ్వగా ఆ కన్య సాల్వుని దగ్గరకు వెళ్ళెను. నరశ్రేష్ఠా! నేను నీ ధర్మపత్నిని, నిన్ను నా హృదయమునందు నిలుపుకొంటిని. నీ హృదయము కూడా నాచే నిండియున్నది. ఇది నిశ్చితమైన విషయము, అని తన మనస్సులోని మాటను పలుకగా సాల్వు డీవిధంగా చెప్పెను.

ఇతరులచే వదలిపెట్టబడిన కన్యను వివాహము చేసుకొను బుద్ధిమంతు డెవడు ఉండును? భీష్మునకు నీయందు మాతృ భావన ఉన్నప్పటికీ నీవాతని దగ్గరనే ఉంటివి కదా! కనుక నాతో వివాహము జరుగుట అసంభవము అని సాల్వుడు పలుకగా ఆ కన్య విలపిస్తూ భీష్ముని వద్దకు వచ్చెను.

భీష్మునితో వీరవరా! నీచే వదలిపెట్టబడిన దానినని సాల్వుడు నన్ను స్వీకరించలేదు. నీవు నన్ను దాసిగా చేసికొనుము. లేనియెడల నేను నా యీ శరీరమును పరిత్యజించెదను అని పలికెను.

భీష్ముడు అపుడు సుందరీ! నీ హృదయమునందు పరపురుషుడు నిండియున్నాడు. కనుక నీవు నిశ్చింతగా నీ తండ్రి దగ్గరికి వెళ్ళుము. అని పలుకగా ఆ కన్య అడవికి వెళ్లిపోయెను. వనమున నిర్జన ప్రదేశము నెంచుకొని తపమునకు పూనుకొనెను.

విచిత్రవీర్యునకు ఇరువురు కన్యలైన అంబాలిక అంబికలతో భీష్ముడు దగ్గరుండి వివాహము జరిపించెను. తొమ్మిది సంవత్సరములు ఇద్దరు

భార్యలను పొందిన విచిత్రవీర్యుడు సుఖముగా జీవితమును గడిపి క్షయ రోగగ్రస్తుడై మరణించెను.

సత్యవతి అంతులేని దుఃఖముతో భీష్ముని పిలిపించి నీ తండ్రియైన శంతనుని వంశము నీదే కనుక రాజ్యభారము నీదే కదా! వంశమును రక్షించి యయాతి యొక్క వంశము నశించకుండా ప్రయత్నింపుము అని సత్యవతి పలికెను.

భీష్ముడు తల్లీ! నేను తండ్రికొరకు ప్రతిజ్ఞ చేసితిని. నేను రాజ్యమును పరిపాలించను. వివాహము చేసికొనను. అనగా సత్యవతి చింతాక్రాంతు రాలయ్యెను. భీష్ముడామెతో తల్లీ! నీవు శోకమును వదలిపెట్టి విచిత్రవీర్యుని క్షేత్రము నుండి పుత్రుని జన్మింపచేయుటకు ప్రయత్నింపుము అని పలికెను.

సత్యవతి భీష్ముని మాటలను విని శుద్ధాత్ముడగు తన పెద్ద కుమారుడైన వ్యాసుని మనస్సులో తలంచగానే వెంటనే వ్యాసమహర్షి అచటికి వచ్చెను.

తల్లియైన సత్యవతి తన కుమారుడైన వ్యాసునితో నాయనా! ఇప్పుడు నీవు విచిత్రవీర్యుని క్షేత్రమునందు ఒక చక్కటి కుమారుని జన్మింపచేయవలెను. కురువంశమునకు దాపురించిన ఈ దుర్గతిని నీవే కాపాడగలవు అని సత్యవతి పలుకగా వ్యాసుడు ఇది ఆమె ఆప్తవచనముగా భావించి అంగీకరించెను.

అంబిక ఋతుకాలస్నానమొనర్చి ఉండగా ముని యొక్క మానస సంయోగము వలన పుత్రుడు కలిగెను. కాని నేత్రహీనుడుగా ఉండెను, సత్యవతి దిగులు చెంది రెండవకోడలైన అంబాలికతో మునితో కుమారుని కనుమని కోరెను.

అంబాలిక అదే విధంగా చేయగా కొడుకు పుట్టెను. అతడు పాండురోగంతో ఉండెను. మళ్ళీ కోడలిని ప్రేరేపించగా ఆమె అతని దగ్గరకు వెళ్ళక దాసిని పంపెను.

ఆ దాసి గర్భము నుండి ధర్మము యొక్క అంశతో విదురుడు జన్మించెను. వ్యాసుడు యయాతివంశమును నిలపడానికి ఈ కథలన్నిటిని మీకు వినిపించితిని. వ్యాసుని కృపతో ఆ వంశము సురక్షితమయ్యెను.

20. వ్యాసుల జననం

సూత మహర్షీ! తండ్రియింట వున్నప్పుడే పతివ్రతయగు సత్యవతికి వ్యాసుడెట్లు జన్మించెను. తదుపరి యీ పరిస్థితిలో శంతనుడామెను వివాహమాడి యిరువురు కుమారులనెట్లు పొందెను. ఈ కథనంతా విశదపరచుమని ఋషులు కోరిరి.

సీ. ఏదేవినామంబు నిచ్చతో నుచ్చరించినమాత్ర సంకల్పసిద్ధి యొదవు
ఏపుణ్యవతి కాళ్ళ కెరిగినంతనె చతుర్వర్గము ల్పొసగుననర్గళముగ
ఏయమ్మ వాగ్బీజ మెనసి స్మరించినప్పుడే సర్వకామముల్ పూర్తములగు
ఏ శక్తి చారిత్ర మెఱిఁగి పఠించిన నాడె సంసరణార్తి నాశమందు

తే.గీ. నట్టి సర్వేశ్వరికి జగదాదిమూల
జననకారణమూర్తికి జ్ఞానమయికి
సకలసంపత్ప్రదాత్రికి ప్రకృతిభూతి
కేను మ్రొక్కెదు జెప్పెద నిటువినుండు

(దేవీభాగవతం - దాసు శ్రీరాములు)

భగవతియగు జగదంబికను నిరంతరము జపించవలెను. ఉపరిచరుడను ఒక రాజు ఉండెను. ఆయన బ్రాహ్మణ భక్తుడు. ఇంద్రుని ఆరాధించెను. ఇంద్రుడు ఒక దివ్య విమానమును అతని కొసగెను. ఆయన పత్ని పేరు గిరిక. ఆమె ఉపరిచరుని భార్య, ఋతుమతియై యుండెను. పుంసవ్రతము నాచరించి తన కోరికను తెలిపెను. రాజునకు పితరుల ఆదేశమున వేటకై అడవికి వెళ్ళవలసి వచ్చెను. కాని తన భార్యను పదేపదే స్మరించుచుండెను. అతనికి వీర్య స్ఖలనము అయ్యెను. అతడు ఆ వీర్యమును వటపత్రమునందు భద్రపరచెను.

ఏ విధముగానైనా, యీ వీర్యము వ్యర్థము కాకూడదు, దీనిని నేను నా భార్యకు పంపెదను అని అతడు ఆలోచించెను. వటపత్ర పుటమునందు దానినుంచి డేగద్వారా తన భార్యయగు గిరికకు వెంటనే అందచేయవలసినదిగా కోరెను.

డేగ ఆ పుటమును తీసుకొని వేగముగా ఆకాశమార్గమున ఎగిరిపోయెను. మరొక డేగ ఇదంతా గమనించి మాంసఖండమని తలంచి దానిమీద దాడి చేసెను. ఆ వీర్యపుటము జారి యమునానది జలమునందు పడిపోయెను. అదే సమయమున అద్రికయను పేరుగల అప్సర ఆ నదిలో స్నానమాచరించుచుండెను.

ఒక బ్రాహ్మణుడు అదే నదిలో ప్రాణాయామము చేసుకొనుచుండెను. నీటిలో మునిగిన అద్రిక బ్రాహ్మణుని పాదములు పట్టుకొనగా బ్రాహ్మణుడు కోపముతో నా తపస్సు భంగమొనరించి నందులకు నీవు చేపవై పడివుండుము అని శపించెను.

అపుడు అద్రికయను అప్సరస చేపగా మారి యమునానదిలో పడివుండెను. ఆ డేగ ముక్కునుండి ఆ వీర్యపుటము జారి నీటిలోపడెను. మత్స్యరూపమున వున్న అప్సరయగు అద్రిక దానిని మ్రింగెను. కొంతకాలమునకు మత్స్యకారునికి చేప చిక్కగా మత్స్యకారుడు చేపను చీల్చుటకు ఉద్యమించగా అందుండి ఇరువురు, మానవాకార శిశువులుగా బయటపడిరి.

ఒక బాలుడు బాలిక లభించగా ఆ శిశువులను మత్స్యకారుడు రాజుకు అప్పగించెను. ఆ రాజు బాలుని తాను ఉంచుకొనగా, కాలక్రమమున మత్స్యుడను పేరుగల మహారాజుగా ప్రసిద్ధి చెందెను. బాలికను ధీవరుడనే మత్స్యకారుని కిచ్చెను. ఆ కన్యయే కాళి, మరియు 'మత్స్యోదరి' అను పేర్లతో ప్రసిద్ధి చెందెను. ఈమేకే మత్స్యగంధి అనికూడా పేరు వచ్చెను.

ఆ దివ్య అప్సరయగు అద్రిక చేపగా పరిణమించుట మత్స్యకారుడు ఆ చేపను చీల్చినపుడు ఏమయ్యెను. శాపము పరిసమాప్తము చెంది స్వర్గమునకెట్లు చేరెను? దయచేసి ఈ విషయములను తెలుపుము అని కోరెను.

అద్రికకు ఇరువురు శిశువులు జన్మించిన వెంటనే మత్స్య రూపమును పరిత్యజించి దివ్యరూపమున స్త్రీయై స్వర్గమునకు వెళ్ళెను. మత్స్యగంధి యౌవనావస్థకు చేరుకొనగా ఆమె ధీవరుడైన మత్స్యకారుడి పనులన్నియు చేయుచుండెను.

ఒకనాడు మునీంద్రుడగు పరాశరుడు తీర్థయాత్ర చేయుచు యమునా నదీతీరమునకు చేరి ఆవలి ఒడ్డుకు చేర్చుము అని ముని కోరగా, మునిని పడవమీద కూర్చోపెట్టుకొని మత్స్యగంధి వెళ్ళసాగెను. మత్స్యగంధిని చూసిన ముని తనకు కామవాసన జాగృతమయ్యెను.

మునీంద్రుడు ఆమె దక్షిణ హస్తమును పట్టుకొనగా మునీంద్రా! మీరు ఉత్తమ కులమున జన్మించిన వారు. శ్రోత్రియ బ్రాహ్మణులు తపస్సంపన్నులు నేను మీకు తగిన దాననా? మీరు వశిష్ఠుని వంశమున జన్మించితిరి.

మనుష్యుడై బ్రాహ్మణ కులమునందు జన్మించుట అన్నింటికంటే దుర్లభమైన విషయము అని నాకుతోచును. నా శరీరము నుండి చేపల దుర్గంధము వచ్చు చుండును అని మత్స్యగంధి పలుకు చుండగానే పరాశరుడు తన తపోబలముచే ఆమెను కస్తూరి యొక్క సువాసనలు వెదజల్లు దానిగ చేసెను.

ఆ సుగంధము నాలుగు క్రోసుల వరకు వ్యాపించెను. మునిశ్రేష్ఠా! జనులందురు చూచుచుండగా మీరు ఈ పాశవిక చర్యచేయుట అందున పగలు నిషిద్ధము. రాత్రిమాత్రమే ఈ పని చేయవలయును. జగత్తునందు గొప్ప అపవాదము చేసిన వారగుదుము అని చెప్పగా పరాశరుడు ఆ ప్రదేశము నంతటిని మంచుతో కప్పివేసెను.

బ్రాహ్మణోత్తమా! నేను కుమారిని, కన్యను మీరు కోరిక తీర్చుకొని వెళ్ళి పోయినచో గర్భవతినైనచో తండ్రితో నేనేమని చెప్పుదును. మీ వీర్యము వ్యర్థము కాజాలదు. నా కర్తవ్యమేమి? అని పలుకగా ముని అందులకు నీవు కన్యాత్వము చెడకుండా ఉందువు.

నీకిష్టమైన వరము కోరుకొనుము అనగా మత్స్యగంధి ఈ సంగతి నా తల్లిదండ్రులు ఎరుగజాలకుండునట్లు నన్నుగ్రహింపుము. అదియేగాక శక్తిశాలియైన పుత్రుడు ఉదయించవలయును.

నేనెల్లకాలము నవయువతిగానే ఉండవలెనని కోరెను. పరాశరుడు మత్స్యగంధితో నీపుత్రుడు విష్ణుభగవానుని అంశతో జన్మించును. త్రిలోకమునందు సాటిలేని ప్రసిద్ధిని పొందును.

సుందరీ! అప్సరసలు ఎందరో నాముందుకు వచ్చిరి, ఏదో రహస్యము దాగియున్నది. దుర్గంధమగు నిన్ను చూచి నేను మోహితుడనెట్లు అగుదును. ప్రసన్న వదనా! నీ పుత్రుడు పురాణములు రచించువాడగును. వేద రహస్యములను క్షుణ్ణముగా నెఱిగి వాటిని నాలుగు భాగములుగా విభజింపగలడు, అని చెప్పి మునివరుడు వెళ్ళిపోయెను.

సత్యవతి కూడా తండ్రి గృహమునకు మరలి వెళ్ళిపోయెను. ఆ తరువాత యమునా ద్వీపమునందే సత్యవతి పుత్రుని కనెను. పుట్టగానే తేజస్సంపన్నుడగు ఆ కుమారుడు పెద్దవాడయ్యెను తన తల్లి కిట్లు చెప్పెను.

తల్లీ! నాయందు అపరిమితశక్తి కలదు. తపోనిష్ఠతో నేను గర్భమున ప్రవేశించితిని, నేనిపుడు తపము చేయుటకు వెళ్ళుదును. నీవెపుడు స్మరించినను ఆక్షణముననే నీ ఎదుట నుందును. అని చెప్పి వ్యాసుడు వనములకు వెళ్ళిపోయెను.

వ్యాసుడు ద్వైపాయనుడని ప్రసిద్ధిపొందెను. ఆయన విష్ణు భగవానుని అంశకదా! కలియుగము వచ్చెను. ఆయన వేదములను శాఖలుగా విభజించి వేదవ్యాసు డయ్యెను.

పురాణ సంహితలు, శ్రేష్ఠమగు మహాభారతము, అన్నియు ఆయన రచనలే! సుమంతుడు, జైమిని, పైలుడు, వైశంపాయనుడు అసితుడు, దేవలుడు పుత్రుడగు శుకదేవుడు వీరందరును అయన శిష్యులే.

మునివరులారా! సత్యవతి, వ్యాసుని జననం ఇవన్నియు ప్రత్యేక కారణములతో కూడినవి. మహానుభావుల చరిత్రలను విమర్శించుట అనుచితము పరాశరుడు ధర్మము నెరిగినవాడు. ఆశ్చర్యము కలిగించే ఈ ప్రసంగమును నీకు వినిపించితిని. ఈ పవిత్ర ఉపాఖ్యానమును వినువానికి ఎప్పటికిని దుర్గతి కలుగదు. అతడు సర్వథా సుఖముగా ఉండును.

21. మహాభిషుడు, శంతనుడు, భీష్ముల జననము

విచిత్రవీర్యుని మరణానంతరము శోకాకులయై సత్యవతి తన కోడండ్రతో యిరువురు గోళక (వితంతు పుత్రులు) పుత్రులను ఎందులకు జన్మింపచేసినది. మా సందేహములను నీవే తీర్చగలవని సూతుడు అడిగెను. ఇక్ష్వాకువంశమున జన్మించిన మహాభిషుడను పేరుగల రాజు ప్రసిద్ధుడు. నూరు వాజపేయ యజ్ఞములు, వెయ్యి అశ్వమేధములను చేసి దేవేంద్రుని సంతుష్టపరచెను.

ఒకరోజు మహాభిషుడు బ్రహ్మసభకు వెళ్ళగా దేవతలు, మహానదియగు గంగాదేవి కూడా అచటనే యుండగా గాలి వేగముగా వీచుచుండెను. అప్పుడు గంగాదేవి వస్త్రములు ఇటు అటు జారిపోయెను. దేవతలు తలలు వంచుకొనగా మహాభిషుడు మాత్రం రెప్పవాల్చక ఆసక్తిగా చూచుచుండగా గంగాదేవి కూడా అతనివైపు చూచు చుండెను. ఇరువురును ప్రణయబంధమున చిక్కుకొనిరి.

ఈ సన్నివేశమును బ్రహ్మ చూచి మిగుల కోపము కలిగి మహాభిషుని చూచి రాజా! నీవు మర్త్యలోకమున జన్మించెదవు గాక. అనేక పుణ్యములు

చేసుకొన్న తరువాతనే తిరిగి స్వర్గమునకు వచ్చెదవు గాక అని శాపము ఒసగెను. గంగకు కూడా అదే శాపమును ఇచ్చెను.

మహాభిషుడు మర్త్యలోకమున ధర్మాత్ములగు రాజులను గురించి పరిశీలించెను. ప్రతీపుని ఇంట జన్మించుట సముచితమని నిర్ణయించుకొనెను. అదే సమయమున అష్టవసువులు వశిష్ఠుని ఆశ్రమమునకు వచ్చి వుండిరి.

పృథువు మొదలగువారు అష్టవసువులు. వారిలో 'ద్యౌ' అను నతడు ప్రముఖ వసువు. 'ద్యౌ' యొక్క భార్య నందినీ ధేనువును చూచెను. ఈ ఉత్తమ కామధేనువగు గోవు ఎవరిది? అని తన భర్తనడిగెను. సుందరీ! ఈ ఉత్తమ కామధేనువు వసిష్ఠునిది.

స్త్రీకాని, పురుషుడు కాని ఎవరైనను ఈ గోవుపాలు త్రాగినచో నిశ్చయముగా పదివేల సంవత్సరములు జీవించగలరు. వారియౌవ్వనము స్థిరముగా నుండును అని చెప్పగా ఆ వచనములు విని ఆ స్త్రీ ఇట్లు పలికెను.

నా స్నేహితురాలు ఈ మర్త్యలోకమున నున్నది. ఈ నందినిపాలు నా స్నేహితురాలుకు ఇచ్చి వృద్ధాప్యము, రోగములు రాకుండా చేయుటకు నందినిని మన ఆశ్రమమునకు తీసుకొని పోవుదము అని కోరెను.

స్త్రీ మాటలు విని నందినీ ధేనువును దొంగలించెను. ఈ పనిలో పృథువు మొదలగు వారందరు సహకరించిరి. వసిష్ఠుడు ఆశ్రమమునకు రాగానే నందిని, దూడ కనిపించలేదు. ధ్యానమగ్నుడై వసుగణములు నందినిని అపహరించినారని గ్రహించెను. కోపముతో వసిష్ఠుడు ఈ వసుగణములు మనుష్య యోనియందు జన్మించెదరని శాపమొసగెను.

ఇదంతా విని వసువులు ఖిన్నులై వసిష్ఠుని ప్రసన్నత పొందడానికి వెళ్ళి శరణు జొచ్చిరి. మీరందరును ఒకరి తరువాత ఒకరు శాప

విముక్తులగుదురు. అందు ఒక్కొక్కరికి సంవత్సరము వ్యవధి యుండును. నందినిని అపహరించిన 'ద్యౌ' అను వసువునకు అనేక దినములు మానవ జన్మయుండవలసి వచ్చును. ఈ విధముగా శాపమును పొందిన వసువులు వస్తూ మార్గమధ్యమమున గంగను చూచిరి.

తల్లీ! గంగాదేవి! నీవు మానవ లోకమున దయచేసి మాకు తల్లివగుము. శంతనుడను పేరుతో ప్రసిద్ధుడైన రాజర్షిగలడు. అతనిని నీవు భర్తగా స్వీకరింపుము. మేము మీకు జన్మించగనే మమ్ములను తీసికొని వెళ్ళి నీటిలో విసరివేయు చుండుము. అని వారు కోరగా గంగ అంగీకారమును తెలిపెను. వసుగణములు గంగ వారి వారి స్థానములకు వెళ్ళిరి.

మహాభిషుడు ప్రతీపుని ఇంటిలో పుత్రుడుగ జన్మించెను. అతనికి శంతనుడు అని పేరు పెట్టిరి. రాజగు ప్రతీపుడు సూర్యుని స్తుతించెను. అప్పుడు గంగా జలము నుండి స్త్రీ బయటకు వచ్చెను.

మ. మెఱుపా యేమిది కాదు కాదు చదల న్మేఘుంబులే లేవు బం
గరునీరా యిది కాదు కాదు కొలుముల్ కాఱుల్ కనన్ రావు, చం
దురు రేకా యిది కాదు కాదు దివనాధం డెక్కెనట్టాకసం
బెఱుగం జాలక యుంటిఁగాక నవలాయే సందియం బేటికిన్

శా. ఔరా దీని యొయారమేమి వగలే మహా సుధాంధోజగ
న్నా రీరత్నమొ కిన్నరీమణియొ గంధర్వాంగ నారత్నమో
యేరీ మధ్యమలోకమందు సరివా రీ కన్నెకుం గల్గిరో
లేరో భోగవతీపురంబును గన ల్లీలాకలాపంబులన్

క. ఎవ్వతెయో యిది యీ యెల
జవ్వనమే మిట్టు లొంటి సాహసమునుదా
నివ్వని జూఱుగతమేమో
నవ్వని గలగలని జారు నవరత్నంబుల్ (మహాకవి దాసురామదాసు)

మిగుల సౌందర్యవతియైన ఆమె ప్రతీపుని కుడితొడపై కూర్చొనెను. ప్రతీపుడు ఆ కన్యతో కళ్యాణీ! నా అనుమతి లేకుండా పవిత్రమైన నా తొడమీద కూర్చున్నావు. నీవేమి కోరుచున్నావు. అనగా రాజా! నేను నిన్ను పతిగా పొందవలెనని కోరుచున్నాను. దయచేసి నా సేవను అంగీకరించుమనెను.

అందుకు ప్రతీపుడు నీవు నా కుడితోడ మీద కూర్చున్నావు. కనుక నాకు కోడలు కావచ్చు నాకు పుత్రుడు కలిగినపుడు నా కోడలు అగుదువు అని చెప్పగా గంగ సమ్మతించి వెళ్ళి పోయెను. కొంతకాలమునకు ప్రతీపునకు పుత్రు డుదయించెను.

యౌవ్వనవంతుడై వనమునకు వెళ్ళు కోరికను తండ్రికి తెలుపగా నీవు అక్కడ నిన్ను పతిగా పొందవలెనని కోరినచో ఆ కన్యనే నీవెవరవు? అని ప్రశ్నించక ధర్మపత్నిగా స్వీకరించుము నీ జీవితము సుఖమయమగునని చెప్పెను.

కొంత కాలానికి ప్రతీపుడు శంతనునకు రాజ్యము అప్పజెప్పి తపము చేయడానికి వెళ్ళిపోయెను. భగవతిని ఉపాసించి స్వర్గమున కర్తడయ్యెను. ఒకరోజు శంతనుడు వేటకు వెళ్ళగా చక్కటి కన్య గంగాతీరమున కనిపించెను. ఆ అందాల భామను నీవు నా ధర్మపత్ని స్థానమును స్వీకరించి నన్ను ధన్యుని చేయుము అని కోరెను.

గంగ రాజు ప్రస్తావనను అంగీకరించి రాజా! నీవు ప్రతీపుని కుమారుడవు. రాజాధి రాజులు నా ప్రతిజ్ఞను కూడా వినుము. నేను ఏ పని చేసినను అది చెడ్డదైనను మంచిదైనను ఆపరాదు. మీరు తిరస్కరించిన రోజు నేను వెళ్ళిపోదును. అని చెప్పగా అందాల రాశియైన కన్య కోరికను అంగీకరించగా, మానవ రూపమున అవతరించిన గంగ శంతనుని వివాహమాడెను.

కొంత కాలమునకు శంతనుని సంయోగము వలన గంగాదేవి గర్భమును ధరించెను. వసువునకు జన్మనిచ్చెను. ఆ బాలుని వెంటనే గంగలో విసరివేసెను. ప్రతిసారి అదే విధముగా ఏడుమంది బాలకులను గంగలో పడవేసెను. రాజు ఈమె చేసెడు కృత్యములకు బదులు పలుకుటకు ధైర్యము లేకుండా ఊరకుండెను. గంగ ఉదరమున ఇపుడు ఎనిమిదవ కుమారుడు జన్మించెను.

అతడే 'ద్యౌ' అను పేరుగల వసువు. అపుడు శంతనుడు గంగాదేవితో దేవి! ఈ బాలునికి జీవన దానము చేసి నన్ను అనుగ్రహింపుమని ప్రార్థించెను. కాని ఈ మాటలన్ని విన్న తరువాత కూడా గంగ ఆ బాలుని తీసుకొని వెళ్ళుటకు పూనుకొనెను.

తే.గీ. ఓసి పాపిష్ఠరాల నీయుల్లమునకు
నల్లఱాయియె సరిపోల్పు జెల్లుఁగాక
కులము నిలిపెడి నా ముద్దుకొమరు నిచట
వైచి నీయిచ్ఛకొలదిని లేచిపొమ్ము! (మ.క.దా.రా)

రాజు మిక్కిలి కోపోద్రేకుడై ఓసీ! దుర్మార్గురాలా! నీవేమి చేయుచున్నావు. నీవు ఉంటే ఉండుము లేదా నీ యిష్టము వచ్చిన చోటుకు వెళ్ళుము. ఈ బాలుని మాత్రం నీకు ఇవ్వను అని చెప్పగా గంగ రాజుతో రాజా! ఈ బాలుని రక్షించు కొనుము, అనెను. ఇప్పుడే వెళ్ళిపోవుచున్నాను.

అయితే నీవు నాకిచ్చిన మాట తప్పావు. చాలా కాలము క్రిందట మానవ జన్మపొందుడు అని వసువులను వసిష్ఠుడు శపించెను. ఆ వసువులందరు నిస్సహాయులై నన్ను వారికి తల్లిగా వుండమని కోరిరి.

దేవ కార్యము సిద్ధించుట కొరకే నేను నీకు సతినైతిని. ఏడుగురు వసువులే నాకు పుత్రులైన వెంటనే శాపవిముక్తులైరి. ఈ వసువు మాత్రం నీకు పుత్రుడై యశస్సును తెచ్చి పెట్టగలడు. గాంగేయుడనే పేరుతో ప్రసిద్ధి

చెందగలడు. అయితే ఈ బాలుని నేను పెంచి పెద్దచేసి సకల విద్యలు నేర్పించి ఆ తరువాత నీకు అప్పగించెదను అని గంగ అదృశ్యమయ్యెను.

ఆ.వె. ఓ మహాకుమార యో మన్మథాకార, శరశరాసప్రచార ధీర
చిన్నబిడ్డ నిన్నుగన్న వారెవ్వరో, తెలుపుమయ్య ప్రీతిఁ గొలుపుమయ్య!

కొంత కాలమునకు రాజు వేటకై వెళ్ళగా అతనికి ఒక బాలుడు కనిపించెను. గంగాతీరమున ఆడుకొను చుండెను. శంతనుడు బాలుని సమీపించి బాలకా! నీవెవరి పుత్రుడవు అని శంతనుడు అడుగగా ఆ బాలుడు అంతర్ధానమయ్యెను. అపుడు గంగను స్తుతింపనారంభించెను. గంగసుందర రూపముతోనే ఆమె ప్రకటితు రాలయ్యెను.

గంగా! ఇపుడిచట నుండి కనపడకుండా పోయిన బాలకుడెవడు. దయతో అతనిని నాకు చూపించుమని కోరెను. అపుడు గంగ రాజేంద్రా! ఇతడు నీ పుత్రుడే! ఈ బాలకుని వసిష్ఠుని ఆశ్రమమున ఉంచి సకల వేదములు, ధనుర్వేదము అధ్యయనము చేయించాను. సకల విద్యలందు సంపూర్ణ జ్ఞానవంతుడయ్యాడు అని చెప్పి ఆ బాలకుని శంతనునకు అప్పగించి అదృశ్యమయ్యెను.

శంతనుడు పుత్రుని ఒడిలో నుంచుకొని అతని తలను మూర్కొనెను. హస్తినాపురమునకు బాలుని తీసుకొనివెళ్ళి గొప్ప ఉత్సవములు జరిపించెను. కుమారుని రాజ్యమునకు వారసుని చేసి మిగుల ఆనందించెను.

మునులారా! భీష్ముని జననము, గంగ పుట్టుటకు కారణము వసువుల పుట్టుక, శంతనులతో గంగ జీవనము, ఈ ప్రసంగమునంతయు వినినవారు సమస్త పాపములనుండి ముక్తులగుదురు. వ్యాసులవారి ముఖతః వినిన వారి నేను మీకు చెప్పాను అని సూతుడు ఋషులకు వివరించెను.

సర్వే జనా స్సుఖినో భవంతు - ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

* * *

దేవీభాగవతము

దేవీనవరాత్రులు - రెండవ రోజు కథ

1. భీష్మ ప్రతిజ్ఞ

సూత మహర్షీ! నీవు లోమహర్షుని కుమారుడవు. మాకు ప్రీతి పాత్రుడవు. సత్యవతి బోయవాని ఇంట పెంచబడినది కదా! శంతనుడేమో గొప్ప రాజు, ఎందువలన సత్యవతిని పెండ్లి చేసుకొనెను. ఆ కథను మాకు సవిస్తరముగా తెలుపుడని ఋషులు సవినయముగా కోరిరి.

శంతనుడు ఎల్లవేళల వేటాడుటయందు ఉత్సాహము చూపుచుండెను. ఒకనాడు యమునానదీ పరీవాహక ప్రాంతమందు ఏదో తెలియని ఉత్తమ పరిమళమును గ్రహించెను. ఆ వనమునందు శంతనుడు నలువైపులకు తిరుగాడు చుండెను. ఆ తీరమున ఒక సుందర స్త్రీ కనిపించెను. ఆమె శరీరమునుండే ఆ పరిమళము వచ్చుచున్నదని స్థిరపడెను. ఆమెను చూసి ఈమె ఎవరు? ఎచట నుండి వచ్చినది? ఈమె దేవాంగనయా? మానవ స్త్రీయా? లేక గంధర్వ కన్యయా? లేక నాగ కన్యయా? అని ఆలోచించసాగెను.

నది ఒడ్డున కూర్చుని ఉన్న నిషాదపుత్రితో రాజు, ప్రియమైనదానా! నీవెవరవు? నీ తల్లిదండ్రులు ఎవరు? నీవు వివాహితవా? అని శంతనుడు అడుగగా ఆ యువతి నవ్వుచూ రాజా! నేను దాశరాజు పుత్రికను, ఇక్కడ నేను నా తండ్రి నావ నడుపుతూ ఉంటాము. అని సత్యవతి పలుకగా శంతనుడు తన మనసులోని కోరికను వెల్లడించెను.

ఓ మృగనయనీ! నేను కురువంశమున భూపతిని. నా భార్యనన్ను వదలిపెట్టి వెళ్ళి పోయెను. మా యింటి యందు స్త్రీ ఎవరును లేదు. ఇప్పుడు నీవు నా ధర్మపత్ని స్థానమును అలంకరింపుము. నేనిపుడు ఒంటరిగానే జీవితమును గడుపుచున్నాను. అని శంతనుడు పలికెను.

దాశకన్యయైన సత్యవతి శంతనునితో రాజా! నేను స్వతంత్రురాలను కాను. నేను నిరంతరము తండ్రి ఆజ్ఞను పాటింతును.. మా తండ్రి నన్ను మీకు అప్పగించినచో నేను కాదనను అని విన్నవించెను. సత్యవతి మాటలను విని శంతనుడు వెంటనే దాశరాజు గృహమునకు వెళ్ళెను. దాశరాజు శంతనమహారాజుకు ప్రణమిల్లి మీ రాకకు కారణము తెలియ చేయుడు. మీరాకతో నన్ను కృతార్థుని చేసితిరి. అని దాశరాజు చెప్పగా శంతనుడు అనఘా! వీలైనచో నీవు నీ కుమార్తెయైన సత్యవతిని నాకిమ్ము? ఆమెను నేను ధర్మపత్నిగా స్వీకరించెదను. నీతో నేను సత్యమునే పలుకుచున్నాను అనెను.

అపుడు దాశరాజు మహారాజా! నేను ఈ కన్యను ఇవ్వవలయునంటే ఒక షరతు. అది ఏంటంటే ఈ కన్యకు పుట్టేవాడే ఈ రాజ్యమునకు రాజు కావలెను. మీకు ముందటి కుమారునకు సింహాసనము ఇవ్వనని ప్రమాణము చేయవలయును అని కోరెను.

శంతనుడు వెంటనే చింతతో ఇంటికి మరలెను. ఎల్లప్పుడు దిగులుతో ఏమియు తినక, నిద్రలేక ఇబ్బందిపడుతున్న తండ్రిని చూచి మీరు ఏ విషయము మీదనో చింతించుచున్నారు. తండ్రిదుఃఖమును తొలగించని కొడుకు పుట్టియుండియు ప్రయోజనము లేదు. అని దేవవ్రతుడు (భీష్ముడు) పలుకగా కుమారా! నీవు ఒకడవే కుమారుడన్న చింతనన్ను వేధించుచున్నది. అందువలన నేను దిగులు పడుచున్నానని తెలిపెను.

రాజగు శంతనుని మాటలను విని భీష్ముడు వృద్ధమంత్రులతో నా తండ్రి ఇపుడు విషయమును చెప్పుటలేదు. మీరు మెల్లగా వారి చింతకు కారణమేమిటో తెలుసుకొని నాకు తెలియ జేయుమని ఆజ్ఞాపించెను. రాజు శంతనుడు చెప్పిన విషయములను మంత్రులు భీష్మునకు చెప్పగా, వెంటనే దాశరాజు చెంతకు సత్యవ్రతుడు వెళ్ళెను. దాసరాజుతో నీ పుత్రిక

నాకు తల్లి కాగలదు. నేను ఎల్లప్పుడు ఆమెను సేవించగలవాడను. అని పలుకగా దాశరాజు యోచన చేయుచుండగా వెంటనే భీష్ముడు నేను ఎప్పుడు రాజ్యపాలన చేయను. సర్వదా ఈమె పుత్రుడే రాజ్యమునకు అధికారి కాగలడు అనెను.

దాశరాజు అందులకు నీవు సత్యపాలకుడవు. కాని నీవు పెళ్ళి చేసుకొన్నప్పుడు నీకు పుట్టే కుమారుడు బలవంతుడైతే మళ్ళీ రాజ్యమును వశపరచుకొనును గదా! అని శంకించగా భీష్ముడు నేనెప్పుడు వివాహము చేసుకొనను.

కం. నావుడు భీష్ముండిట్లను
నో వివిధవిధిజ్ఞ పెండ్లి నొల్లక ధృతియై
గావించెద భీష్మవ్రత
మీ వింకం జింతనొంద నేటికి జెపుమా॥

(దేవీభాగ - మహాకవి దాసు శ్రీరాములు)

నేను ప్రతిజ్ఞ చేయుచున్నాను. అని భీష్మ ప్రతిజ్ఞ చేయగా దేవతలు పూల వర్షం కురిపించ సాగారు.

దాశరాజు భీష్ముని ప్రతిజ్ఞకు ముగ్ధుడయ్యెను. సత్యవతిని మహారాజగు శంతనునితో వివాహము జరిపించెను. అయితే ఈ సత్యవతికి ఇంతకు మునుపే వ్యాసుడు జన్మించినాడని శంతనునకు తెలియదు.

శంతనునకు సత్యవతికి ఇరువురు కుమారులు కలిగిరి. కాని వారిరువురు మరణించుట ఇంతకు మునుపే మీకు చెప్పాను. వ్యాసునివలన నేత్రహీనుడగు ధృతరాష్ట్రుడు. పాండురోగగ్రస్థుడయిన పాండురాజు, విదురుడు జన్మించిరి. విదురుడు సత్యవాది. ధర్మావతారుడు. మంత్రులు పాండును రాజును చేసారు. గ్రుడ్డివాడు కనుక ధృతరాష్ట్రుడు రాజ్యాధికారి కాలేకపోయాడు. అయితే పాండురాజు రాజుగా, విదురుడు మంత్రిగా భీష్ముడే అంగీకరించాడు.

ధృతరాష్ట్రునకు సుబలరాజపుత్రిక గాంధారి మొదటి భార్యగా, రెండవ భార్యగా వైశ్యకన్యతో గృహకార్యములు చక్కబెట్టు చుండిరి. పాండురాజునకు శూరసేనుని కుమార్తె కుంతీదేవితో, మద్రరాజు కుమార్తె మాద్రిదేవితో వివాహము జరిగెను.

గాంధారి కుమారులకు జన్మనిచ్చెను. వైశ్యకన్యకు ఒక కుమారుడు కలిగెను. కుంతి పితృ గృహమున ఉన్నపుడే కర్ణునకు జన్మనొసెగెను. ఆ తరువాతనే కుంతి పాండు రాజుకు భార్య అయ్యెను.

సూత మహర్షితో కుంతికి కర్ణుని జననం వివరించుమని ఋషులు కోరిరి. శూరసేనుని కుమార్తెయగు కుంతిని కుంతిభోజుడు తెచ్చి పెంచుకొనెను. ఒకనాడు చాతుర్మాస్య దినములలో దుర్వాసుడు కుంతి భోజుని ఇంటికి వచ్చెను. దుర్వాసునికి సేవ చేయుటకు కుంతిని కుంతిభోజుడు నియమించెను. కుంతి సేవలతో దుర్వాసుడు మిగుల సంతసించెను. కుంతిదేవికి ఒక ఉత్తమ మంత్రమును ఉపదేశించెను.

కుంతి ఒకనాడు మంత్రశక్తిని పరిశీలించదలచి సూర్యనారాయణుని స్మరించెను. వెంటనే భాస్కరుడు అంతఃపురమునందు కుంతి ఎదుటికి వచ్చెను. సూర్యుని దర్శనముతో కుంతి సంతోషించటంతో ఇక మీరు వెళ్ళిపొండి అని కోరగా సూర్యభగవానుడు నీవు నన్ను స్వాగతించనిచో నీకు మంత్ర మొసగిన వానిని నిన్నునూ శపించెదను అనగా కుంతి భయముతో వణకిపోయెను. అప్పుడు నావంటి తేజస్సంపన్నుడైన కొడుకు నీకు పుట్టగలడు. నీకు కన్యాధర్మము చెడదు అని చెప్పి భువన భాస్కరుడు తన లోకమునకు వెళ్ళిపోయెను. కుంతి గర్భవతి అయ్యెను. ఆమె ఎల్లవేళలా రహస్య భవనముననే ఉండసాగెను. ఆ భవనమునందే బాలకుడు ఉదయించెను.

ఆ.వె. కవచకుండలములు గడుసొంపుమీరంగ
భువిని బొడుచు సూర్యుపోల్కినపర

శక్తిధరుని చాయ జను బాలకుని దాది
కరములందు నిడుక కన్య కనియె (మ.క.దా.శ్రీ.)

కవచ కుండలాలతో మిగుల సుందరుడుగా ఉండెను. కుంతి ఆ శిశువును పెట్టెలో భద్రపరచి దాసికిచ్చెను.

3. వసంత తిలక

రక్షించుమమ్మ శ్రుతిపారగ కామదాత్రీ
రక్షాకరీ జగదుదారపురాణకర్త్రీ
ప్రేక్షావళీ లలితమూర్తి సమ స్తధాత్రీ
పక్షీంద్రవాహన శివాబ్జకుమారభర్త్రీ

కం. అమ్మా ముజ్జగముల గ
న్నమ్మా యీచిన్నబిడ్డ డాకలిఁ గొనుఁ బా
లిమ్మా నమ్మితినమ్మా
ముమ్మాటికి నీదుపాదములె దిక్కమ్మా।। (మ.క.దా.శ్రీ.)

దాసి ఆ పెట్టెను ప్రవహించుచున్న నదియందు పడవేసెను. అది అతిరథుడను సూతునకు దొరికెను. అతని భార్య రాధ. ఆ బాలుడే కర్ణుడు అను పేరుతో ప్రసిద్ధి చెందెను. కుంతి స్వయంవరమున పాండురాజుకు ధర్మపత్ని అయ్యెను.

పాండురాజు వేట నిమిత్తమున అడవికి వెళ్ళెను. ఒక మునీంద్రుడు మృగరూపమున తన ధర్మపత్నితో రమించుచుండగా, పాండురాజు అది మృగమేయని తలచి బాణము వేయగా మృగరూపముతో ఉన్న ముని పాండురాజునకు శాపమొసగెను. స్త్రీతో సంభోగము చేయదలచినచో నీవు ప్రాణములు కోల్పోదువుగాక అని పాండురాజుతో అనెను.

పాండురాజు తన పత్నులతో కలవక వనమున నివసించసాగెను. అక్కడ కథా ప్రసంగములు జరుగుచుండెను. ఒక మునీంద్రుడు

పాండురాజుతో సంతానహీనునకు గతులుండవు. ఏదో ఒక విధముగ పుత్రుని పొందుట మిక్కిలి అవసరము. పుత్రులు 11 రకములుగా చెప్పుదురు. అవి ఏవనగా

1. అంశజుడు – తన వీర్యము నుండి ఉత్పన్నమైనవాడు
2. పుత్రికాపుత్రుడు – తన పుత్రికకు ఉదయించిన బాలుడు
3. క్షేత్రజ్ఞుడు – అన్యపురుషుని నుండి పుట్టినవాడు
4. గోళకుడు – భర్త చనిపోయిన తరువాత పుట్టినవాడు
5. కుండుడు – భర్త ఉండగానే జార పురుషుని నుండి పుట్టినవాడు
6. సహోడుడు – వివాహమునకు ముందే కన్య గర్భవతియై భర్త ఇంటికి వెళ్ళిన తరువాత పుట్టినవాడు
7. కానీనుడు – కన్యగా తండ్రి ఇంట యందే ఎవరికీ తెలియకుండా పుట్టినవాడు
8. క్రీతుడు – మూల్యము నిచ్చి కొనబడినవాడు
9. ప్రాప్తుడు – వనములలో లభించినవాడు
10. ఎవరి ద్వారానైన ఈయబడినవాడు – దత్తపుత్రుడు
11. ఒక దరిద్రునికి ధనమునిచ్చి కొనబడిన వాడు.

సీ. మందాకినీ తీరమందు ఋష్యాశ్రమంబుల నుండి
తపమును సలుపుకొనుచు
మునిముఖ్యులు పురాణములు ధర్మశాస్త్రముల్
చదువంగు జెవులొగ్గి చాలవినుచు
సుతులు లేకున్నను గతులు లేవను నట్టివాక్య
మొక్కటి విని వనటు బగిలి
అంశజుండును మహితాత్మజుండును
క్షేత్రజుండును మరి గోళకుండు కుండు

తే.గీ. డును సహోడుండు కానీనుడును దలంప
గ్రీతుడును బ్రాప్తుడును బరికింప దత్తు
డనెడువా రుత్తరోత్తర మల్పతరులు
ననుచు దానెంచి కుంతితో ననియె నిట్లు (మ.క.దా.శ్రీ.)

ఈ విధంగా పదకొండుమంది పుత్రులున్నారని మునులు చెప్పగా పాండురాజు తన ప్రియురాలగు కుంతికి ఈ విషయమును తెలిపెను.

కుంతి పాండురాజుతో ప్రభూ! నా వద్ద మన కోరిక నెరవేరుటకు దుర్వాస మహాముని చెప్పిన మంత్రముతో సకల దేవతలను ఆహ్వానించవచ్చును. మీరనుమతివ్వండి అని కోరగా పాండురాజు కుంతిని మంత్రప్రయోగ మొనరించుటకు అనుమతి నొసగెను.

కుంతి ధర్మదేవతను స్మరించగా అతడు ప్రత్యక్షమయ్యెను. అపుడు ఆమె కుమారుడు కావలెనని కోరగా యుధిష్ఠిరుడు జన్మించెను. వాయుదేవుని కృపచేత భీముడు, ఇంద్రుని కృపతో అర్జునుడు, కుంతికిప్పుడు ముగ్గురు కుమారులు కలుగుట చూచి మాద్రి తనపతిని ఆశ్రయించి తనకు మంత్రోపదేశము చేయవలెనని కోరెను. పాండురాజు కుంతితో మాద్రి కోరిక తీర్చమని చెప్పగా మాద్రి కూడా మంత్రము జపించగా అశ్వనీ దేవతలు ప్రత్యక్షమై ఇరువురు కుమారులను ప్రసాదించిరి. వారే నకుల సహదేవులుగా జన్మించిరి.

ఒకనాడు మాద్రిని చూచి వికారమునకు లోనై ఆమెను స్పృశించి కౌగలించుకొనెను. వెంటనే పాండురాజు విగతజీవుడై పడిపోయెను. మునీంద్రులు పాండుని శరీరమునకు గంగాతటమునందు దహన సంస్కారములొనరించిరి. మాద్రి సతీసహగమనము చేసెను. కుంతి రాజ్యమునకు పిల్లలతో వెళ్ళెను.

కుంతి రాకను విని భీష్ముడు విదురుడు, ధృతరాష్ట్రుడు పురజనులు అచటికి చేరిరి. పాండురాజు శాప రహస్యమును తెలిసికొని కుంతితో వీరు ఎవరి కుమారులు అని అడుగగా అందుకు కుంతి వీరు కురువంశమునందు జన్మించిన దేవతామూర్తులు ఈ బాలురు అనెను. అదే సమయమున దేవతలందరు ఆకాశమున విరాజమానమై "నిస్సందేహముగా వీరు మా పుత్రులే" అనగా భీష్ముడు ఆ కుమారులను ఉచిత రీతిన ఆదరించెను. ఆ కుమారుల పాలనను, పోషణను భీష్ముడు స్వీకరించెను.

2. కౌరవ పాండవుల వంశానుచరిత్ర

పాండురాజు యొక్క పుత్రులు ఐదుమంది కదా, వారిని పాండవులు అనేవారు, స్వయంవరములో ద్రౌపది పాండవు లైదుగురకూ భార్య అయ్యెను. పాండవుల వలన ద్రౌపదికి అయిదుగురు కుమారులు కలిగిరి. సుభద్రకు అర్జునునితో వివాహము జరిగెను. సుభద్ర శ్రీకృష్ణని చెల్లెలు, సుభద్రను శ్రీకృష్ణని అనుమతితో అర్జునుడు అపహరించి తీసికొని వచ్చెను. సుభద్రకు మహావీరుడగు అభిమన్యుడు జన్మించెను. అభిమన్యుడు కౌరవపాండవులకు జరిగిన యుద్ధములో వీరమరణము పొందెను. కాని అభిమన్యునకు ఉత్తరతో వివాహమై యుండెను.

అశ్వత్థామ యుద్ధానంతరము అపాండవం చేయదలచి బ్రహ్మాస్త్రము వదలగా ఉత్తర గర్భముననున్న బాలకునిపై అస్త్ర ప్రభావం జరిగింది. అపుడు కృష్ణుడు ఆ బాలకుని గర్భమునందే కాపాడెను. అభిమన్యుని మరణానంతరము ఉత్తర బిడ్డను కనెను. అతడే పరీక్షిత్తు. కౌరవపాండవుల యుద్ధములో కౌరవులందరూ మరణించగా ధృతరాష్ట్రుడు మిగుల దుఃఖితుడయ్యెను. ధృతరాష్ట్రుని ప్రతిరోజు ఓదార్చుటయే విదురుని విధి.

ధృతరాష్ట్రుని భీముడు తన వాగ్బాణములతో బాధించుచుండెను. ఈ లజ్జాహీనుడగు గ్రుడ్డివానికి మేము ఇచ్చు భోజనమే ఆధారమైనది.

అని భీముడు ప్రతిదినము మిగుల కఠిన వచనములతో ధృతరాష్ట్రుని నొప్పించుచుండెను. ధృతరాష్ట్రుడు ఆ విధంగా కౌరవ పాండవుల యుద్ధానంతరము పదునెనిమిది సంవత్సరములు అచటనే ఉండి కష్టప్రదమగు జీవితమును గడిపెను.

ధృతరాష్ట్రుడు ఒకనాడు ధర్మరాజుతో 'నేను ఇపుడు నా కుమారులకు విధి పూర్వకముగా పిండ దానాది కార్యక్రమములు నెరపవలెను అని కోరగా యుధిష్ఠిరుడు ఇచ్చిన ధనముతో ఆ కార్యములెల్ల పూర్తిచేసి వనములకు వెళ్ళెను.

ధృతరాష్ట్రునితో గాంధారి, కుంతి, విదురులు, వారికి సహకరించుటకు సంజయుడు వనములకు వెళ్ళిరి. అచట సుందరమైన ఒక ఆశ్రమమును నిర్మించు కొనిరి. తపో జీవనముతో ఆరు సంవత్సరములు గడిచినవి.

ధర్మరాజు ఒకనాడు స్వప్నమునందు తల్లియైన కుంతిని చూచి ఆమెను చూడవలెనను కోరిక ప్రబలముగానున్నదని సోదరులకు తెలిపెను. సోదరులు అంగీకారము తెలుపగా సుభద్ర, ద్రౌపది, ఉత్తర అనేక పురజనులు కలిసి ధృతరాష్ట్రుని చెంతకు బయలు దేరిరి.

శతయూపాశ్రమమునకు చేరి వారందరిని కలిసిరి. కాని విదురుడు కనిపించలేదు. విదురుడెక్కడ వున్నాడని ధృతరాష్ట్రుని అడుగగా విదురుడు ఎప్పుడూ గుహలలో కూర్చొని శ్రీహరిని ధ్యానిస్తూ ఉంటాడు అని చెప్పెను.

ధర్మరాజు ఒకచోట ఏకాంతమున తప మొనరించుచున్న విదురుని చూచి, నేను యుధిష్ఠిరుడను మీకు నమస్కారములు అనగా విదురుని ముఖమునుండి ఒక దివ్యతేజము యుధిష్ఠిరుని యందు కలిసిపోయెను. వారిరువురు ధర్మము యొక్క అంశజులు కనుక ఒకరిలో ఒకరు కలిసిపోయిరి.

అప్పుడు యుధిష్ఠిరుడు విదురునకు దహన సంస్కారములు చేయుటకు పూనుకోగా రాజా! మీ విదురుడు మిగుల త్యాగి ఇతనికి దహన సంస్కారములు చేయరాదు. మీరు స్వేచ్ఛగా వదలిపొండు అని ఆకాశవాణి పలికెను.

అదే సమయమున వ్యాసుడు, నారదుడు అనేకులు ధర్మనందనుని కలియుటకు అచటికి వచ్చిరి. కుంతీదేవి వ్యాసునితో ఈ విధంగా పలికెను. నేను నా కుమారుడగు కర్ణుని చూడాలని ఉన్నది నా మనోరథము నెరవేర్చుము అనెను.

సుభద్ర నేను నా కుమారుడైన అభిమన్యుని చూడాలన్న కోరికను తెలిపెను. అప్పుడు వ్యాసుడు జగదంబికను ప్రార్థించెను.

ఉత్సాహ. ప్రకృతివీవ పురుషుడీవ పాంచ భౌతిక ప్రపం
చకమునీవ సకలమీవ చంద్రుఁడీవ తిగ్మరో
చికుఁడవీవ నభమునీవ క్షితివినీవ నేరమెం
చకుము నన్ను బ్రోవుమమ్మ శక్తి దేవి భగవతీ!

ఉత్సాహ. అజుడవీవ శివుడవీవ హరివినీవ యా హవి
ర్భుజుడవీవ పాశివీవ పుణ్యమీవ యాజక
వ్రజమునీవ యాజివీవ వాయువీవ కశ్యప
ప్రజవునీవ బ్రోవుమమ్మ భగవతీ మహామతీ!

కురంగ. మణిద్వీపనేత్రీ మహామంత్రశక్తీ
ప్రయాతం గుణోపేతగాత్రీ గురుశ్రీకమూర్తి
ఘృణాశాలినీ నీ కిదే మ్రొక్కినాడన్
బ్రణామంబు లాధార శక్తీ సుయుక్తీ

భుజంగ. సమస్తంబు నీయందు సంభూతమయ్యెన్
ప్రయాతం సమస్తంబు నీయందు సంపుష్టమయ్యెన్

సమస్తంబు నీయందు సల్లీనమయ్యెన్
మముంబ్రోవ నీవె యుమాశక్తి రావే

కం. మృతులం జూపుమనుచు ని
య్యతివలు ప్రార్థించి రెట్టులగు నాచేతన్
గతి నీవె యని నమ్మితి చతు
రత జూపింపుమమ్మ చయ్యన దల్లీ ॥

తే.గీ. కుంతి సంతోషమందెను గొడుకుc జూచి
చెలగె గాంధారిబిడ్డలు జేరి కాంచి
యలరెనుసుభద్రతనయునొయ్యదిలకించి
దేవి మహత్వమును వ్యాసు తెలివి గనుడి ॥ (మ.క.దా.శ్రీ.)

మిగిలిన అందరు కూడా జగజ్జననియగు దుర్గాదేవిని స్తుతించిరి.

వ్యాసుడు భగవతీ! జగదంబికా! తల్లీ ఈ ప్రాణులు మరణించిన తమ వ్యక్తులను మరలా చూడవలెనని నన్ను ప్రార్థించుచున్నారు. నాలో అట్టి సామర్థ్య మెక్కడిది. వీరికి స్వర్గవాసులైన వీరి పరిజనులను శీఘ్రముగా చూపించుము అని కోరెను.

ఆ జగన్మాత దివంగత నరేశులను పిలిపించి వారి ఎదుట నిలిపెను. తిరిగి వచ్చిన తమ పరిజనులను చూచి కుంతి, గాంధారి, సుభద్ర, ఉత్తర, పాండవులందరును మోహ పరవశులైరి. తదుపరి స్వర్గవాసులైన వీరులు తిరిగి వెళ్ళిపోవుటకు ఆ దేవి ఏర్పాటుగావించెను. ఇదంతయు గమనించిన మునిగణములు వ్యాసుని గురించి చర్చించుకొనుచు హస్తినాపురమునకు తిరిగి వెళ్ళిపోయిరి.

మరికొన్నాళ్ళకు ఉన్నట్లుండి వనమునందు అగ్ని రగుల్కొనెను. అందులో ధృతరాష్ట్రుడు గాంధారి, కుంతి అందరును కాలి భస్మమైరి.

సంజయుడు ధృతరాష్ట్రుని వదలిపెట్టి అప్పటికే తీర్థయాత్రలకు వెళ్ళిపోయెను. నారదుడు ఇదంతయు ధర్మరాజుకు చెప్పగా చాలాసేపు దుఃఖించెను.

కౌరవులు అంతమైన ముప్పది ఆరు సంవత్సరములకు యాదవులు కూడా వారిలో వారికి తగువులు వచ్చి అంతమైరి. శ్రీకృష్ణుడు, బలరాముడు యాదవులు పోట్లాడుకొని గతించుటను చూస్తూ ఉండిపోయిరి.

బలరాముడు శరీరమును పరిత్యజించెను. పూర్వశాప వశమున శ్రీకృష్ణుడు ఒకనాడు చెట్టుక్రింద పడుకొని కాలుపైన కాలు పెట్టుకొని యున్న సమయమును దూరమునుండి చూసిన వ్యాధుడు మృగమని తలచి బాణము సంధించగా అది తగిలి భగవంతుడగు శ్రీకృష్ణుడు తనువును వీడెను. శ్రీకృష్ణుడు అంతర్ధానమైన విషయము తెలిసి వసుదేవుడు దేహపరిత్యాగము చేసెను.

అదే సమయమున అర్జునుడు ప్రభాస క్షేత్రమునకు వెళ్ళెను. అప్పుడు మరణించిన వారికందరికి దహన సంస్కారములు చేయవలసి వచ్చెను. ద్వారకా నగరము మునిగిపోవుననే విషయమును అర్జునుడు తెలిసికొని వారందరిని తీసికొని బయలుదేరెను. కొంత సమయమునకే సముద్రుడు ద్వారకానగరమును ముంచివేసెను. అర్జునుడు ద్వారకానగర స్త్రీలను తీసుకొని వస్తుంటే దారి మధ్యలో దొంగలు వారి వైభవమునంతయు హరించిరి. అప్పుడు అర్జునుని బలము అంతయు అంతరించి సామాన్యునిగా అయిపోయెను.

ఇంద్ర ప్రస్థపురమునకు చేరి అర్జునుడు అనిరుద్ధ కుమారుడగు వజ్రనాభుని అచట రాజును చేసెను. వ్యాసునికి తన దుఃఖమునంతా తెలియచేసెను. అపుడు వ్యాసుడు అర్జునునితో భగవంతుడు ఈ భూమిపై అవతరించును. అపుడు నీ తేజస్సు ప్రదీప్తమగును అనగా ప్రశాంతత కలిగే మాటలు విని అర్జునుడు హస్తినాపురమునకు చేరెను.

కృష్ణుడు గతించుట, యాదవుల సంహారము అన్నియు తన అన్న ధర్మరాజుకు వివరించెను. యుధిష్ఠిరుడు వెంటనే పరీక్షిత్తుకు పట్టాభిషేకము చేసి ద్రౌపదిని తన సోదరులను వెంటనిడుకొని హిమాలయములకు యాత్రకు బయలుదేరెను.

పరీక్షిత్తునకు అప్పుడు వయస్సు ముప్పది ఆరు సంవత్సరములు. ధర్మరాజు తన సోదరులు ద్రౌపది హిమాలయమున వారి శరీరములను పరిత్యజించిరి. ఆ తర్వాత పరీక్షిత్తు అరువది సంవత్సరముల వరకు సమస్త ప్రజలను పరిపాలించెను.

3. పరీక్షిత్తు – రాజగుట శాపగ్రస్థుడగుట

ఒకనాడు పరీక్షిత్తు వేటాడు తలంపుతో ఒక దట్టమైన వనమున ప్రవేశించెను. మృగమును వెదుకుచు చాలా అలసిపోయెను. ఆకలి దప్పులకు లోనయ్యెను. ఆ పరిసర ప్రాంతములోనే ఒక ముని ధ్యాననిష్ఠలో ఉండెను. ఆ మునిని ఉద్దేశించి దాహము తీర్చుమని కోరెను. కాని ముని ధ్యానమగ్నుడై వున్నందున సమాధాన మేదియు ఇవ్వలేదు.ఆకలి, కోపము కలిగిన పరీక్షిత్తు మునిపై అపారమైన కోపముతో అక్కడ పడిఉన్న మృతసర్పమును ముని మెడలో వేసెను. దీనితో కలి ప్రభావము ప్రారంభమైనదని మనము తెలుసుకొనవచ్చును. పరీక్షిత్తు చేయునది ఏమిలేక ఇంటికి తిరిగి వచ్చెను.

ఆ మునికి గవిజాతుడను పేరుగల ఒక మహాతేజస్వియైన పుత్రుడుండెను. సమీపముననే ఉన్న ముని బాలకులు ముని కుమారునితో "మీ తండ్రి మెడలో ఎవరో మరణించిన సర్పము వ్రేలాడ తీశారని" వెళ్ళి చెప్పిరి. వెంటనే ముని కుమారుడు కోపోద్రిక్తుడై నా తండ్రి మెడలో మృతసర్పమును వేసిన ఆ నరాధముడు నేటినుండి ఏడవ దినమున రాత్రి తక్షక సర్పముచేత కాటువేయబడును అని శాపమొసగెను.

పరీక్షిత్తు ఇంటికి చేరిన కొంతసేపటికి ముని కుమారుడు పరీక్షిత్తుకు ఇచ్చిన శాపము తెలిసెను. పరీక్షిత్తు వృద్ధ మంత్రులతో నేను అపరాధిని, చేయకూడని పని చేసాను. నాకు మృత్యువు అనివార్యము. మనము ఉపాయము చేసినచో దుర్లభమైన కార్యము గూడా సిద్ధించునని విద్వాంసులెందరో తెలిపియున్నారు. మనము అభ్యాసము చేసినచో కానిదేమియు లేదనిపిస్తుంది.

ఒకనాడు ఒక ముని భార్యను సర్పము కాటువేసెను. ఆమె మరణించెను. ముని మంత్రప్రభావమున ఆమెను బ్రతికించుకొనెను. తన అర్ధ ఆయువు నొసగెను. కనుక వివేకియైన పురుషునకు తన తెలివి మీదనే సర్వధా ఆధారపడవలెను అని అనగా మునులు మహారాజుతో రాజా! తన ప్రియ పత్నిని పునరుజ్జీవితురాలిగా చేసికొనిన ఆ ముని ఎవరు? ఆ స్త్రీ ఎట్లు మరణించెను? ఈ ప్రసంగమును మాకు వివరంగా తెలియచేయవలసిందిగా కోరారు.

4. ప్రమద్వర – రురుల కథ

భృగువు యొక్క భార్య పులోమ. పులోమ గర్భము నుండి చ్యవనుడను ముని ఆవిర్భవించెనని వింటిమి. చ్యవనుని భార్యపేరు సుకన్య. సుకన్య రాజగు శర్యాతి యొక్క పుత్రిక. సుకన్య గర్భమున ప్రమతి పుత్రరూపమున జన్మించెను. ప్రమతి భార్య పేరు ప్రతాపి. ప్రతాపి గర్భమునుండి రురుడు జన్మించెను. అదే సమయమున స్థూలకేశుడను పేరుతో ప్రసిద్ధుడైన మునియుండెను. ఒకనాడు మేనక యనుపేరుగల దివ్య పరమ సుందరియగు అప్సర నదీ తీరమునకు వచ్చెను. అప్సరకు వివశుడగు మునికి సమాగమమయ్యెను. ఆమె గర్భవతియై వెళ్ళిపోయెను. స్థూలకేశుడను ముని ఆశ్రమ సమీపమునకు చేరి మేనక కన్యకను ప్రసవించెను. ముని ఆమెకు 'ప్రమద్వర' అని నామకరణము చేసెను. మునివరుడు రురుడు ఆ ప్రమద్వరయను కన్యను చూచి ఆశ్రమమునకు వెళ్ళి దీనుడై

ఉండగా తండ్రి రురూ! నీవెందుకు ఉదాసీనంగా ఉన్నావు అని అడుగగా, నేను స్థూలకేశుడను ఆశ్రమమునందు ప్రమద్వరయను కన్యను చూచి ఆమెను పెండ్లాడదలిచాను అని చెప్పెను.

రురుని తండ్రి ప్రమతి మునివరుడగు స్థూలకేశుని దగ్గరకు వెళ్ళెను. అతనికి నచ్చచెప్పి రురునితో ప్రమద్వర వివాహము జరిపించుటకు తగు ఏర్పాట్లు చేయుచుండిరి. ఒకనాడు ఇంటి ఆవరణమునందు తిరుగుచుండగా పాముకాటుకు గురియై నేలకొరిగెను. మరణించి పడివున్న ప్రమద్వరను చూచి రురుడు ఏడ్చుచూ అచటికి చేరెను.

ఈ ప్రమద్వరను పాణిగ్రహణము చేయదలచితిని నేనిపుడు ప్రాణములు వదలుటయే ఉచితము. అయితే ప్రాణములు పరిత్యజించినచో అనేక దోషములు కలుగును. అని పరిపరి విధములుగా ఆలోచించి ఒక నిర్ణయమునకు వచ్చెను. రురుడు స్నానమొనరించి, ఆచమనము చేసి పవిత్రుడై, చేతియందు జలము తీసికొనెను. "నేను దేవ యజనాది పుణ్యకర్మలు చేసితినేని అనగా భక్తితో గురువును, దేవతలను పూజించితినేని, జప, తప హవనములు చేసితినేని, వేదములన్నటిని అధ్యయనము చేసితినేని, పుణ్యమయియగు గాయత్రిని జపించి, సూర్యుని ఆరాధించితినేని ఆ పుణ్య ప్రభావమున నా యీ ప్రియురాలు మరల జీవించుగాక! నా ప్రియురాలి ప్రాణములు రాకపోయినచో నేను ప్రాణత్యాగమును చేసెదనని దేవతారాధనతో జలమును నేలకు వదలెను.

అప్పుడు దేవదూత వచ్చి రురునితో మరణించిన స్త్రీ పునరుజ్జీవితురాలు ఎట్లగును? అనగా ఈమె లేనిదే నేను బ్రతకను, మరణించెదనని గట్టిగా చెప్పెను. దేవదూత ప్రసన్నతతో నీవు నీ ఆయుష్షునందలి సగభాగము నొసగిన ప్రమద్వరను బ్రతికించుకొనగలవు అనగా వెంటనే రురుడు తన ఆయస్సునందు సగభాగము ప్రమద్వరకిచ్చుటకు ఇష్టపడెను. విశ్వావసుడు ప్రమద్వర తండ్రి, అతడు

యమధర్మరాజుతో వీరి విషయమును విన్నవించగా ధర్మదేవత ప్రమద్వరను బ్రతికించి తక్షణమే రురునకు సమర్పించెను. ప్రమద్వరతో రురుల వివాహము సుఖాంతమయ్యెను.

5. పరీక్షిత్తు మరణము

పరీక్షిత్తు ప్రమద్వర రురుల వివాహము విషయమునంతయు మంత్రులకు చెప్పి మనము ఏదో ఆలోచన చేయవలెనని భావించి ఏడంతస్థుల భవనము నిర్మింపచేసి పై అంతస్థుకు తనుచేరి గట్టి భద్రతతో నివశిస్తూ ఉండెను.

కశ్యపుడు అను గొప్ప బ్రాహ్మణుడు ధనాశపరుడు పరీక్షిత్తుకు ఏర్పడిన శాప విషయము తెలుసుకొని తన మంత్రశక్తితో కాపాడి ధనము పొందవచ్చునని భావించి పరీక్షిత్తు వద్దకు బయలుదేరెను. అదే సమయమున తక్షకుడు కశ్యపుని కలుసుకొని ఎక్కడికి మీరు వేగిరముగా వెళ్ళుచున్నారని అడుగగా పరీక్షిత్తును ప్రాణాంతకము నుండి కాపాడదలిచాను అని చెప్పెను. తక్షకుడు (పాము) మానవ రూపమున ఉండెను.

కశ్యపునితో నేను తక్షకుడను, పరీక్షిన్మహారాజును నా విషాగ్నిచేత భస్మము చేయగలను. దానికి చికిత్స చేయుశక్తి నీయందు లేదు తిరిగి వెళ్ళిపొమ్ము అని చెప్పెను. నీ మంత్ర బలముతో ఈ వటవృక్షమును కాటువేయుము చూతము అని తక్షకునికి కశ్యపుడు చెప్పగా తక్షకుడు ఆ వటవృక్షమును కాటువేసి బూడిద చేసెను. అపుడు కశ్యపుడు సర్పరాజా! ఇపుడు నా మంత్రబలమేమిటో చూడుము అని జలమును మంత్రించి ఆ బూడిదపై చల్లెను. వెంటనే వటవృక్షము యథాస్థితిని పొందెను.

తక్షకుడు మిగుల ఆశ్చర్యము చెంది కశ్యపునితో ద్విజవరా! నీవెంత ధనమును కోరుచున్నావో దానిని నా నుండి తీసుకొనుము నేనిచ్చెదను అనెను.

కశ్యపుడు ఆలోచించుకొని ధనము పుచ్చుకొనుట మంచిది ఎందుకనగా పరీక్షిత్తు యొక్క ఆయుస్సు సమాప్తమైనదని నాకు అనిపిస్తున్నది. ధ్యానము వలన ఈ విషయము నాకు స్పష్టమగుచున్నదని భావించి కశ్యపుడు తక్షకుని నుండి ధనమును తీసికొని ఇంటికి తిరిగి వెళ్ళెను.

కశ్యపుని మరలించిన ఏడవ దినమున పరీక్షిత్తు ప్రాణములను హరించుటకు తక్షకుడు హస్తినాపురమునకు వెళ్ళెను. తక్షకుడు తన దగ్గరవున్న చాలామంది నాగులను తాపసుల రూపమున రాజుదగ్గరకు పంపెను. వారంతా ఫలమూలములను తీసికొని రాజభవనమునకు వెళ్ళిరి. తక్షకుడు ఒక చిన్నక్రిమియై ఒక ఫలమునందు కూర్చొనెను.

తాపసుల వేషమున నున్న నాగులు "మేము మహారాజును దర్శించుటకు తపోవనము నుండి వచ్చితిమి" మీరు వెళ్ళి "మిమ్ములను కలియుటకు ముని గణములు వచ్చిరని మహారాజుకు చెప్పండి మేము ఆశీర్వాదమునొసగి ఆయనకు మేలును చేకూర్చెదము" అని చెప్పిరి.

ఈ మాటలు రాజుకు చెప్పగా రేపు వారికి ప్రాతఃకాలమున రమ్మని ప్రార్థింపుము. వారు తెచ్చిన ఫలమూలములను తీసుకొని రండు అని చెప్పగా వారి నుండి ఫలమూలములను తీసికొని మిగుల ఆదరముతో మహారాజు వద్దకు చేర్చిరి.

పరీక్షిత్తు కొన్ని ఫలమును అక్కడ ఉన్న బ్రాహ్మణులకిచ్చి ఒక పండిన ఫలమును చేతికి తీసికొని దానిని కోసెను. దానినుండి ఒక చిన్న పురుగు బయటకు వచ్చెను. ఆ పురుగు తక్షక నాగరాజుగా పరిణతి చెందెను. రాజు శరీరమునకు చుట్టుకొని కాటువేసెను. తక్షణమే మహారాజు ప్రాణములు ఎగిరిపోయెను. అక్కడనున్న వారందరు దుఃఖితులైరి.

6. జనమేజయుని సర్పయాగము

పరీక్షిత్తునికి పారలౌకిక కర్మలొనర్చిరి. అప్పటికి జనమేజయుడు చిన్నవాడైనప్పటికి మంత్రులు ఒక శుభముహూర్తమున సింహాసనమునకు

అధికారిగా చేసిరి. కృపాచార్యుడు జనమేజయునకు సంపూర్ణ ధనుర్వేదమును బోధించెను. యుధిష్ఠిరుడు రాజ్యము చేసినట్లు ధర్మాత్ముడగు జనమేజయుడు రాచకార్యములను నిర్వహించుచుండెను.

కాశీరాజు సువర్ణవర్మాక్షుడు, వపుష్టయను పేరుగల తనకన్యను జనమేజయునకిచ్చి వివాహమొనరించెను. రాజ కార్యములనన్నింటిని యోగ్యులైన మంత్రులు నిర్వహించు చుండిరి. ఉత్తంకుడనే మునిని తక్షకుడు మిగుల కష్టపెట్టు చుండెను. ఈ ఉత్తంకుణ్ణే "ఉదంకుడు" అనికూడా అంటారు. జనమేజయుని ద్వారా తక్షకునకు అపకారము చేయవచ్చునని తలచి ముని ఆయన దగ్గరకు చేరెను.

ఉత్తంకుడు జనమేజయరాజుతో రాజా! తక్షకుడను గొప్ప దుర్మార్గుడు కలడు. అతడు నీ తండ్రిని చంపివేసెను. మంత్రులను పిలిపించి నీ తండ్రి మృత్యువుకు కారణమడిగి తెలుసుకొనుము. అపుడు జనమేజయుడు తన మంత్రులను ఈ విషయమడిగెను. "బ్రాహ్మణ శాపమున తక్షకుడు మహారాజును కాటు వేసెను. దాని వలన ఆయన మరణించెను" అని మంత్రులు సమాధాన మిచ్చిరి. ఉత్తంకుడు రాజా! ఇప్పుడు చెప్పుము ఆ తక్షకుడు నీకు వైరికదా?

ప్రాచీన కాలమున తన ప్రేయసి ప్రమద్వరను పాముకాటు వేసిచంపెను. అని రురుడు పాములపై పగతో నేటికిని పాములను చంపుచున్నాడు. ఒకనాడు అజగరము అనుపామును చంపపోగా నేను నీకు ఏ అపకారము చేయలేదు నన్నెందుకు చంపబూనావు అనగా తన ప్రేయసి ప్రమద్వర పాముకాటుచే చంపబడుట, ఆ తరువాత తన ఆయుస్సు సగమిచ్చి బ్రతికించుకొనుట వివరించెను. ఇంతకూ నీవెవరవు? నీకీ అజగరయోని ఎట్లు ప్రాప్తించినది అని అడుగగా అజగరము తన కథను చెప్పెను.

మునుపు నేను బ్రాహ్మణుడను నాకు ఖేచరుడను మిత్రుడుండేవాడు. నేను ఒకనాడు మూర్ఖుడనయి గడ్డితో సర్పమును తయారు చేసి అతని మెడలో వేసితిని. నా మిత్రుడు అగ్నిశాలయందు కూర్చొని అగ్నిహోత్రము చేయువాడు. అతడు నేను చేసిన పనికి భయకంపితుడై "సర్పముతో నన్ను భయభీతుని చేసితివి నీవు కూడా సర్పము కమ్ము" అని శపించెను. వెంటనే నేను సర్పముగా మారితిని. నేను ఖేచరుని ప్రార్థించగా రురుడు నిన్నీ శాపవిముక్తి చేయగలడు అని చెప్పెను. అజగరుడనే సర్ప రూపం నాకు నీ దర్శనముతో పోయినది అనెను.

ఉత్తంకుడు మళ్ళీ జనమేజయునితో రురుడు సర్పజాతిపైన క్రోధము పెంచుకొని సర్పములను చంపుతుండెను. ఆ తరువాత అజగరుడనే పాము చెప్పిన మాటలతో సర్పములను చంపుట మానివేసెను. కానీ నీవేమో తండ్రిని చంపిన వారి యెడల క్రోధమున వహించకున్నావు. తండ్రి వైరమును విస్మరించిన ప్రాణి ఎవ్వరైనను బ్రతికి యుండియు చచ్చిన వానితో సమానమని పండితులు చెప్పుదురు అనెను.

అపుడు జనమేజయుడు సర్పములను అంతమొందించుటకు సర్పయాగము చేయుటకు పూనుకొనెను. జనమేజయుని మంత్రులు యజ్ఞసామాగ్రియంతయును సిద్ధము చేసిరి. సర్పముల ఆహుతి ప్రారంభమయ్యెను. తక్షకుడు ఇంద్రుని శరణు వేడెను. ఇంద్రుడతనికి అభయమిచ్చెను.

తక్షకుడు యాయావర కులమునందు జన్మించిన అస్తీకుని తలంచెను. జరత్కారువనే మునికుమారుడైన అస్తీకుడు అచటికి విచ్చేసెను. అస్తీకుడు జనమేజయుని గొప్పగా ప్రశంసించెను. అస్తీకునితో జనమేజయుడు మీకేమి కావలయునో తెలుపుడు దానిని తప్పక మీకొసగుదును అనెను. అస్తీకుడు మహారాజా! మీరు ఈ సర్పయాగమును వెంటనే ఆపివేయుమనెను, జనమేజయుడు ముని వచనములను గౌరవించి సర్పయాగము ఆపివేసెను.

ఆ తరువాత జనమేజయుడు వ్యాసునితో నా మనస్సు ఎందుకో ప్రశాంతంగా లేదు. దుర్మరణము పొందిన నా తండ్రి శీఘ్రముగా స్వర్గమునకధికారి యుగునట్లు చక్కని శాంతి సమకూరుటకు ఏదైనా ఉపాయము దయచేసి తెలియజేయ వలసిందిగా కోరుతున్నాను అనెను. నా తండ్రి ఆత్మకు శాంతి కలిగే ఉపాయమును దుర్గతి నుండి స్వర్గమునకు వెళ్ళునట్లు తెలియజేయుమని కోరెను. అపుడు వ్యాసుడు శ్రీదేవీభాగవతమును చెప్పుటకు పూనుకొనెను.

7. అస్తీకముని వృత్తాంతము

ఈ అస్తీకుడెవరి కుమారుడు, సర్పములను రక్షించడానికే ఇచటికి వచ్చాడా? ఈ విషయము నాకు తెలుపుము అని జనమేజయుడు కోరగా వ్యాసుడు ఇలా చెబుతున్నాడు.

మరో కథ : కశ్యప మునీంద్రులకు కద్రువ, వినతలను ఇద్దరు భార్యలుండిరి. ఒకనాడు కద్రువ వినతతో ఇప్పుడీ గుర్రము ఏ రంగు కలిగియున్నది? అనగా వినత ఇది తెల్లగా ఉన్నది అని చెప్పెను. కద్రువ నల్లగా ఉన్నదని వాదులాడుకొనిరి. పందెమున ఓడినవారు దాసిగా ఉండుటకు నియమములు పెట్టుకొనిరి. కద్రువ తన నల్లని సర్పములతో మీరంతా గుర్రమునకు చుట్టుకొని నల్లగా చేయుడు అని చెప్పగా అవి తిరస్కరించినవి. అపుడు కద్రువ తన పిల్లలైన సర్పములను జనమేజయుడు చేయు సర్పయాగమునందు పడి భస్మము కండని శపించెను. కొన్ని మాత్రము అశ్వమునకు చుట్టుకొని కద్రువను గెలిపించెను. వినత దాసి అయ్యెను.

వినతకు గరుడుడు, సూర్యుని రథమును నడుపు అనూరుడు కుమారులు వీరిరువురు తల్లితో మీకు కలిగిన దాసిత్వం మేము తొలగించగలము అని చెప్పి గరుడుడు పెదతల్లి కద్రువతో నాతల్లి వినత

దాస్యము పొగొట్టుటకు నేనేమి చేయవలయునో సెలవివ్వుమని కోరగా కద్రువ స్వర్గములో వున్న అమృతము తెచ్చి యిమ్మని కోరెను. గరుడుడు ఇంద్రలోకమునకు వెళ్ళి అమృత కలశము తెచ్చి ఇచ్చెను. అమృత కలశము దర్భలపై వుంచి సర్పములు స్నానము చేయుటకు వెళ్ళగా ఇంద్రుడు అమృతమును అపహరించెను. సర్పములు వచ్చి చూసి అమృతము ఉంచివున్న దర్భలను నాకగా నాలుకలు రెండుగా చీలిపోయెను. ఇదంతయు గమనించిన వాసుకి బ్రహ్మను శరణు వేడెను

వాసుకీ! నీవు జరత్కారువు అనే నీ చెల్లెలిని జరత్కారువు అనే మునికిచ్చి వివాహము చేయుము. వారిరువురికి పుట్టేవాడు అస్తీకుడు మిమ్ములను కాపాడును అని చెప్పెను. ఈ జరత్కారు మునికి యాయవరుడు అనే మరోపేరు కూడా ఉంది.

వాసుకి సహోదరియైన జరత్కారువును జరత్కారువనే మునికిచ్చి వివాహము చేసెను. అయితే ఆమెను తనకు అడ్డు చెప్పిన రోజు నేను వదలివేయుదును అనే షరతుపై పెండ్లాడెను. ఒకనాడు మునివరుడగు జరత్కారు భోజనము చేసి నిదురించు చుండెను. ప్రియురాలా! ఎట్టి పరిస్థితులలోను నన్ను మేల్కొలపవద్దు అని పలికి ముని నిద్రాదేవికి అధీనుడయ్యెను.

సూర్యుడు అస్తమించు చుండెను. సంధ్యా సమయము ఆసన్నమయ్యెను. ముని మేల్కొనలేదు. జరత్కారువు నేనేమి చేయుదును మునిని మేల్కొల్పినచో అతడు నన్ను పరిత్యజించును. సంధ్యా సమయము వ్యర్థముగా పోవును. అని తలచి జరత్కారు తన పతిదేవుడగు జరత్కారువును మేల్కొలిపెను. జరత్కారువు ముని తన సతిని వదలి వెళ్ళిపోయెను. జరత్కారు తన అన్నయైన వాసుకి చెంతకు వెళ్ళిపోయెను.

ఆ తరువాత జరత్కారు గర్భమున పుత్రుడు ఉదయించెను. ఆ పుత్రుడే 'ఆస్తీకుడు' రాజేంద్రా తల్లి వంశమును రక్షించుటకై యజ్ఞశాలకు వచ్చి తక్షకుని రక్షించెను. ఈతడే యాయవరకుల దీపకుడగు ఆస్తీకుడు.

జనమేజయ రాజా! నీవిపుడు నవరాత్రివ్రతమును చేసి శ్రీదేవీభాగవత పురాణము శ్రవణము చేయుము.

తే.గీ. భూమి నాయక వినుము దేవీముఖంబు
నీవొనర్పుము నిఖిలంబు నీద సుమ్ము
పరమపావనమైనట్టి భాగవతము
వినుము విన్పింతు నేను సవిస్తరముగ

తే.గీ. పరమపావనమైనది భాగవతము
రాగలోభాదుల నడంచు భాగవతము
భవభయంబులు దొలగించు భాగవతము
భగవతీ భక్తి ఫలదంబు భాగవతము

కం. దేవీపాదాబ్జంబులు ।
సేవించినవారు సుఖము జెందుదురు ధరన్
దేవీ పాదాబ్జంబులు ।
సేవింపనివారలఘము జెందుదురు నృపా!

చ. భగవతి విష్ణుదేవునకు భాగవతంబునుఁ జెప్పెఁగావునన్
దగ నిది తక్క నన్యమగు దారిని బోయిన మోక్షమబ్బునేఁ
జగతి నరాధముల్ తెలియఁజాలరుగాక నరేంద్ర నీకు నే
భగవతిఁ గొల్చి చెప్పెదను భాగవతం బిది చిత్తశాంతికిన్

మహారాజా! మహామాయాస్వరూపిణి, భగవతియగు జగదంబికను నిరంతరము ఉపాసించనివారు ఈ భారతదేశమునందు మిక్కిలి దుఃఖముల పాలగుదురు.

ఈ సర్వోత్కృష్ట పురాణమును ప్రప్రథమముగా అర్ధశ్లోకమునందు భగవతి ఆద్యాశక్తి విష్ణుదేవునకు చెప్పినది. రాజా! దీనిని వినుట వలన నీ చిత్తము శాంతించును. పితరులకు సదా స్వర్గమునందుండెడి సౌకర్యము లభించును.

8. భగవతి దివ్యద్వీపము

జనమేజయరాజుతో బ్రహ్మాదులఉత్పత్తిని గురించి వ్యాసుడు చెబుతున్నాడు. విష్ణువే, బ్రహ్మయే, శంకరుడే ప్రధాన కారకులుగా ఉంటున్నారని చెప్పబడుతున్నాయి. వేదవిదులు సర్వేశ్వరుడు సూర్యుదేవుడని, జగుత్తుకు సృష్టికర్తయని తెలుపుదురు. ఇంద్రుని ప్రధానముగా తలచి యజ్ఞములందు ఆయనను ఉపాసించెదరు.

వరుణుని, సోముని, అగ్నిని, వాయువును, యముని, కుబేరుని, గణరాజగు గణేశుని ప్రధానదేవతలుగా భావించెదరు. ఆచార్యులు భవానిని సకల మనోరథములను నెరవేర్చునదని నుడువుదురు.

దేవీస్వరూపము సత్త్వము, రజస్సు, తమస్సు అను ఈ మూడు గుణములకు అతీతమైనది. నిరంజన, నిర్వికార, నిర్లిప్త, నిర్గుణ, అరూప వ్యాపక బ్రహ్మవలననే జగుత్తు సృష్టింపబడినదని ఎంతోమంది మునులు చెప్పుదురు. వేదములందు, ఉపనిషత్తులందు ఆ బ్రహ్మయే తేజోమయుడని తెలిపియున్నారు. ఆకాశము శ్రీ విష్ణువు యొక్క చరణమని స్పష్టముగా చెప్పబడినది.

బ్రహ్మనైన నేను సర్వత్ర జలమునిండి ఉండగా కమలము నుండి నేను ఉద్భవించితిని. ఎక్కడా భూమి కనిపించలేదు. అప్పుడు నేను జలములోనికి దిగితిని. వెయ్యేండ్లు వెతికినా భూమి కనపడలేదు. ఆకాశము నుండి తపము చేయుము అను శబ్దము వినిపించెను. నేను తపమే వెయ్యి సంవత్సరముల చేయగా సృష్టి చేయుము అను వాక్యము ఆకాశవాణి నుండి వినిపించెను.

నేను చేయవలసినది ఏమని ఆలోచిస్తుండగా మధుకైటభులను దానవులు నా ఎదుటకు వచ్చిరి. వారు నాతో యుద్ధము చేయుమని కోరిరి. నేను భయపడి జలములోపలికి వెళ్ళగా శేషశాయియగు విష్ణువు నాకు దర్శనమిచ్చెను.

భగవతి యోగనిద్ర నాకు జ్ఞాపకము వచ్చెను. నేను ఆమెను స్తుతించితిని. భగవతి విష్ణువు యొక్క విగ్రహము నుండి వెలువడి అచింత్య రూపధారిణియై ఆకాశమునందు విరాజమానురాలై యుండెను.

సీ. దివ్యరూపముతోడ దేవి తాఁ బొడ గట్టె ముగురము సూడంగ
గగనమందు
చూచి యేము స్తుతింపఁజూపుల దయగల్క నా మహాదేవి
యిట్లనుచు బల్కెఁ
గాజేశులార మీ రోజఁ జనుండిక మీ మీ పనుల మీద మెళకువడర
రక్కసుల్సచ్చిరి నిక్కంబు మీకొక్క భయములేదిఁకు బొండు భవనములనుఁ

తే.గీ. దగినచోటులు బసగించి జగము నాల్గు
విధములగు సృష్టి సలుపుండు వేగ ననిన
భగవతీ వాక్యమును విని భక్తిమీర
నివ్విధంబును బల్కితి మృదుతరముగ

తే.గీ. కావలసినంత మన్నేది కన్నతల్లి
యేడజూచిన జలమాయెనేడ నిప్పు
మొదలుగాఁగల నింద్రియమ్ములును లేవు
తెలియు దన్మాత్రలు లేవు దిక్కులేదు

కం. ఏలాగు సృష్టిసేయం
జాలుదు మో యమ్మ యనిన శక్తి సరగునన్
లీలావిమాన మిదిగో
మేలై నది రండు దీనిమీది కనంగన్ (మ.క.దా.శ్రీ.)

శ్రీహరి మధుకైటభులతో అయిదువేల సంవత్సరములు భయంకరమైన పోరు సలిపెను. అప్పుడాదైత్యులు మరణించిరి. అపుడు నేనును, విష్ణుదేవుడు మాత్రమే అచట నుంటిమి. అప్పుడు రుద్రదేవుడు కూడా ప్రకటితుడయ్యెను.

మామువ్వురతో ఆ ఆద్యాశక్తి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులారా! సృష్టి, స్థితి, సంహారములు మీ కార్యములు. మీ సామర్థ్యముతో నాలుగు విధములైన ప్రజలను సృష్టింపుడు.

అనగా, బ్రహ్మ దేవితో తల్లీ! మేమెట్లు ప్రజలను సృష్టించుట మొదలగు కార్యములను చేయుటలో సఫలతను పొందగలము, అనగానే భగవతి వెంటనే మమ్ములను చూచి చిరునవ్వుతో వుండగానే ఒక చక్కని విమానము ఆకాశము నుండి దిగివచ్చెను. దేవతలారా! నిర్భయులై స్వేచ్ఛగా ఈ విమానము ప్రవేశింపుడు, బ్రహ్మ, విష్ణు, రుద్రులారా! నేడు నేను మీకొక అద్భుత దృశ్యమును చూపెదను అని చెప్పగానే రత్న ఖచిత విమానము నధిరోహించి మేము విశ్రాంతిగా కూర్చుంటిమి. దేవి తన సామర్థ్యముతో విమానమును ఆకాశమునందు ఎగురునట్లు చేసెను.

ఆ విమానము ఒక అపరిచిత స్థలమునకు వెళ్ళెను. స్త్రీ, పురుషులు, పశువులు, పవిత్ర నదులు, సెలయేర్లు, వాపీకూపతటాకములు, నీటి సరస్సులు అచట అంసంఖ్యాకములుగా నుండెను.

ఆ తరువాత మరో సుందర ప్రదేశమునకు చేరుకొంటిమి. అచట పారిజాత వృక్షములు, కామధేనువు, ఐరావతము, అప్సరసలు, యక్షులు, గంధర్వులు విహరించు చుండిరి. ఇంద్రుని కూడా మేము చూచితిమి. శచీదేవి కూడా విద్య మానమైయుండెను. వరుణుడు, కుబేరుడు, యమధర్మరాజు, సూర్యుడు, అగ్ని మొదలగు దేవతలు కూడా యుండిరి.

ఆ దివ్యవిమానమున దివ్య ధామమగు బ్రహ్మలోకమును చేరితిమి. అచట సకల దేవతలు, సకల వేదములు తమ తమ అంగములతో సభయందు కూర్చొని యుండిరి. శంకరుడు, విష్ణువు నాతో చతురాననా! అవినాశియగు ఈ బ్రహ్మ ఎవరు? అని నన్ను అడిగిరి.

ఆ దివ్యవిమానము మళ్ళీ కైలాస శిఖరమును చేరెను. అక్కడ త్రినేత్రధారి భగవంతుడగు శంకరుడు నందిపై కూర్చొని యుండెను. శంకరునికిరువైపుల గణేశుడు, కార్తికేయుడు అనుపమ శోభాయమానులై యుండిరి. అక్కడ శంకరుని ఇతర గణములను చూచిన మా ఆశ్చర్యమునకు అవధులు లేకుండెను.

ఆ దివ్యవిమానము వైకుంఠలోకమును చేరెను. అక్కడ శ్రీహరి విరాజమానుడై యుండెను. పీతాంబరుడు గరుడుని మీద విరాజమానుడై యుండెను. లక్ష్మి చామరమును వీచుచుండెను.

ఇంతలో వాయువేగమున ఆ విమానము అచట నుండి బయలుదేరెను. మధుర జలములు గల సముద్రము, ఒక ద్వీపము, వనములు, పక్షులు, సుందరమగు మంచములున్నచోట ఆ దేవి భగవతి భూషణములు ధరించియుండెను. అసంఖ్యాకులగు సాధకులు 'హ్రీం' అను మంత్రమును జపించుచుండిరి.

ఆ దేవిని చూచి మేము మహదాశ్చర్యమగ్నులమైతిమి. "ఈ సుందరిఎవరు? ఈమె పేరేమి"? ఈ దేవిని గురించిన విషయము మాకు తెలియనే తెలియదు. అప్పుడు విష్ణు భగవానుడు చారుహాసినియగు భగవతిని చూచి వివేక పూర్వకముగా ఆ దేవి భగవతి జగదంబికయని నిర్ణయించెను. ఈమెయే సంపూర్ణ ప్రకృతి.

ఈమెను 'విశ్వేశ్వరీ', 'వేదగర్భా', శివా అని పిలువబడును. తాపసులకు మాత్రమే కళ్యాణ స్వరూపిణి, భగవతియగు భువనేశ్వరి దర్శనము లభించును. రాగులైనవారికి ఆ దేవి దర్శనము లభించదు.

ఈ ఆదిశక్తి మహామాయ. సమస్తమునకు అధిష్ఠాత్రిదేవి, ప్రళయార్ణవము నందు నాకు దర్శన మొసగినది. ఈ దివ్యాంగనయే. నేను శిశువు రూపమున ఉంటిని. వటపత్రమునందు దృఢమైన శయ్యను

నిర్మించెను. దానిమీద పరుండి కాలిబొటన వ్రేలును కమలమువంటి నోటిలో వేసుకొని చప్పరించు చుంటిని.

నా అంగములన్నియు మిగుల కోమలములైయుండెను. నేను బాలకుడనై నిదురించు చుంటిని. ఆ జననియే ఈదేవి. ఈమెను చూచి నాకు మునుపటి విషయము జ్ఞాపకమునకు వచ్చినది. ఈమె మనందరకును తల్లి, ఈ విషయమున నాకు తెలిసిన దానిని నేననుభవించిన దానిని మీకు తెలిపెదను వినుడు అని విష్ణువు చెప్పెను.

9. త్రిమూర్తులు జగదంబ స్తుతి

మనము భగవతి చరణోపాసనయందు లగ్నమయ్యెదము అని విష్ణువు చెప్పగానే బ్రహ్మ, శంకరుడు మువ్వురమూ ద్వారము వద్ద విమానము దిగితిమి. ఆ దేవి మమ్ములను ద్వారము దగ్గరనే స్త్రీలుగా చేసెను.

ఒకరినొకరు చూసుకొనగా మా రూపము స్త్రీలుగా పరిణమించెను. అచటనే ఒక పాద పీఠము కనిపించినది. నేనును, విష్ణువు, శంకరుడు – మువ్వురము అచటనే ఆగిపోతిమి.

భగవతి నఖమునందే నాకు స్థావర జంగములు, సమస్త బ్రహ్మాండము, బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, వాయువు, అగ్ని, యమధర్మరాజు, సూర్యచంద్రులు, వరుణకుబేరులు, త్వష్ట, ఇంద్రుడు, పర్వతములు, సాగరములు, నదులు, గంధర్వులు, అప్సరసలు, విశ్వావసులు, చిత్రకేతుడు, శ్వేతుడు, చిత్రాంగదుడు, నారదుడు, తుంబురుడు, హాహా, హూహూలును, అశ్వినీ కుమారులు, వసుగణములు, సిద్ధులు, సాధ్యులు, పితరుల సమూహములు, శేషుడు మొదలగు సకల నాగరాజులు, కిన్నరులు, ఉరగులు, రాక్షసులు, వైకుంఠ బ్రహ్మలోకవాసులు, పర్వతశ్రేష్ఠుడగు కైలాసుడు, వీరందరు కనిపించిరి. స్త్రీ వేషమున పరిణతి చెందిన విష్ణువు భువనేశ్వరి దేవిని స్తుతింపసాగెను.

విష్ణువు భగవతికి పదేపదే వందనము తెలుపుతూ సృష్టి, స్థితి, సంహార, అనుగ్రహ, తిరోభావములను అయిదు కార్యములను చేయు భగవతి భువనేశ్వరికి వందనములు. ఈ జగత్తు యొక్క సృష్టి సంహారములకు హేతువు. నీవే పదహారు మరియు ఏడు తత్వములతో నీ విగ్రహము సుసంపన్నమైనది.

నీ శక్తి లేనిదే ఏ వస్తువును తన రూపమున భాసించదు. నీ ప్రభావమున సకల జగత్తును సంతోష పరచుటకు సదా నిమగ్నులైయుందువు. మాతా! మమ్ములను మధుకైటభుల బారి నుండి నీవు రక్షించితివి. మేము కోట్ల కొలది దివ్య దృశ్యములను నీ వలననే చూడగలిగితిమి. భవానీ,! ఇదంతయు నీ కృపా విశేషమే.

భగవతీ! నీశక్తి చేత సంపన్నమగుటచే సూర్యుడు జగత్తును ప్రకాశింప చేయును. కీర్తి, కాంతి, కమల, నీ నామములే. వేదముల ముఖ్య విషయమునకు గాయత్రివి నీవే. స్వాహా, స్వధా, భగవతి, ఓం అను రూపములు నీవే. నీవు సకల మనోరథములు సిద్ధింపచేయుదువు. విష్ణువు ఇట్లు స్తుతించాడు.

శంకరుడు దేవి! విష్ణువు నీ నుండియే ప్రకటితుడయ్యెను. బ్రహ్మ కూడ నీ బాలకుడే, శంకరుడైన నన్ను ఆవిర్భచేసినది కూడా నీవే.

ఉత్సాహ. నీవు సర్వలోకములకు నేత్రివై రహింప శ్రీ
మావరుండు నీకుఁగల్గె మహిము జెంది వాగ్వధూ
టీవరుండు నీకుఁగల్గె ఠీకుమీఱ నేను గౌ
రీవరుండు గల్గితిన్ భరింపవమ్మ భగవతీ!

ఉత్సాహ. నీవె భూమి నీవె నీరు నీవె గాలి నీవె ని
ప్పీవె నింగి యీవె గంధ మీవె రసము నీవె సో
కీవె రూప మీవె శబ్ద మీవె ఘ్రాణ మీవె నా
ల్కీవె త్వక్కు నీవె కన్ను లీవె వీను భగవతీ!

ఉత్సాహ. ని న్నెరుంగనట్టివారు నేరకండ్రు వేఱుగా
నన్ను బ్రహ్మాజక్రపాణి నాథులంచు మూఢులై
చెన్ను మీఱ నీవ మమ్ము చేసినావు తల్లివై
పన్నుగా నజాండభాండ పఙ్క్తినేను భగవతీ

ఉత్సాహ. తల్లి యీ ప్రపంచమెల్ల ధాత్రిచేతఁ గల్గునే
నీళ్లచేతఁగల్గునేని నిప్పుచేతఁ గల్గునే
మొల్లమౌ నణుప్రకాండము ల్ప్పొటంబు లెట్టు
జెల్లియుండు నీ కళా విశేషమొండు భగవతీ!

ఉత్సాహ. అమ్మ నీవె సర్వ మీ చరాచరమ్ము నమ్ము మా
యమ్మ నీవె సుమ్మ బమ్మ వచ్యుతుండ వీవె నా
యమ్మ నీవె యెందరమ్మలైన సమ్ముఖమునన్
బొమ్మలాటలోనివారె పొ మ్మనాదిభగవతీ!

ఉత్సాహ. నీపదంబు లాశ్రయించి నేను శౌరి బ్రహ్మయున్
రూపు నీజగంబులకును రూఢినిచ్చు వేళలన్
కాపు నీవకాదె మాకుఁ గామ దాత్రివై సదా
చూపులం గృపారసంబు చూపుమమ్మ భగవతీ!

ఉత్సాహ. నీ దయారసంబుచేతనే విరించి దా రజం
బూదెనమ్మ శౌరి సత్త్వమూనె నేను నత్తమం
బాదుకొంటినమ్మ పద్మజాండకర్త్రి, భర్త్రి నీ
వాదిశక్తివమ్మ ప్రోవవమ్మ మమ్ము భగవతీ!

ఉత్సాహ. రాజటంచు నొక్కరుండు రాజునొద్ద బంటుగాఁ
దేజరిల్లు నొక్కరుండు దీనుఁడొక్కరుండుగా
నోజ భాగ్యవంతుడొక్కఁ డుండునట్లు వింతగా
నీ జగంబు జేసితీ విదేమి తల్లి భగవతీ! (మ.క.దా.శ్రీ.)

పృథివి, నీరు, తేజము, వాయువు, ఆకాశము. ఈ అయిదు సగుణ తత్త్వములతో జగత్తు స్వయముగా ఉత్పన్నము కాగలదు. మాతా! బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుల రూపమును ధరించి నీవె సృష్టి రచనను చేసెదవు.

ప్రపంచ సృష్టి స్థితి సంహారములు చేయుటకు నీ గుణములు సదా సమర్థవంతములగును. ఆ మూడు గుణములచేత ఉత్పన్నములైన మేము బ్రహ్మ, విష్ణు, శంకరులము నియమానుగుణముగా కార్యములు చేసెదము.

తల్లీ! నీ చరణ కమల ధూళిని సేవించుట వలన అత్యంత శీఘ్రముగా సంసార సాగరము నుండి ఉద్ధరణ జరుగును. దేవి! దయతలచి నాకు పవిత్ర నవార్ణవ మంత్రమును ఉపదేశించి అనుగ్రహింపుము.

శంకరుడు ఇట్లు స్తుతించగ భగవతి జగదంబిక నవార్ణవ మంత్రమును స్పష్టముగా ఉచ్చరించెను. దానిని విని మహాదేవునకు అపరిమితానందము కలిగెను. బ్రహ్మ ఆ నవాక్షర మంత్రమును జపించనారంభించెను. బ్రహ్మ ఆ తల్లితో నీవు నన్ను బ్రహ్మ పదవియందు నియమించితివి. నా ద్వారా అండజ, పిండజ, స్వేదజ, ఉద్భిజములనెడి నాలుగు విధములైన ప్రాణులను రూపొందింప జేసితివి.

మాతా! ఎప్పుడైనను ఏ నెపముతోనైనను నీ నామమును ఉచ్చరించ గలిగినచో ముక్తి సంభవమగునని వారికి తెలియదు. ఆదిదేవుడు భగవంతుడు విష్ణువు నీతోడులేనిదే ఏమియును చేయజాలడు.

'ఏకమే వాద్వితీయం బ్రహ్మ' అని వేదము చెప్పుచున్నది. అయితే మరి ఆ ఆత్మ స్వరూపవు నీవేనా లేక ఇంకొక పురుషుడెవరైనా ఉన్నారా? అను నా సందేహమును నివృత్తి చేసి నన్ను కృపచూడుము. నీవు స్త్రీవా, లేక పురుషుడవా? ఈ విషయం నాకు విపులముగా వివరింపుము.

10. మహాసరస్వతి, మహాలక్ష్మి, మహాకాళి

శ్రీదేవి, బ్రహ్మయు ఒకరమేయని చెప్పెను. ఆయన ఎవరో నేనును అదియే. నేనెవరో ఆయనయు అదియే. పరబ్రహ్మమొకటే దృశ్యా దృశ్య

భేదములుగా దృష్టి గోచరమగుట సర్వథా సముచితమనియే అంగీకరించవలెను. ప్రపంచము లేనప్పుడు స్త్రీ యని గాని పురుషుడని గాని, నపుంసకుడని గాని భేదమే లేదు.

ప్రపంచమున నేను తప్ప ఇతర పదార్థమేదియును లేనే లేదు. బ్రహ్మదేవా! అంతయును నా రూపమే. అన్నిటియందు నేనే ఉన్నాను. గౌరి, బ్రాహ్మి, రౌద్రీ వారాహి, వైష్ణవి, శివ, వారుణి, కౌబేరి, నారసింహి, వాసవి ఇవన్నియు నా రూపములే.

జలమునందు శీతలత్వము, అగ్నియందు ఉష్ణత, సూర్యునియందు ప్రకాశము, చంద్రునియందు చల్లదనము కలిగింపచేసి వారందరి లోపల నేనే ప్రవేశించెదను. నేను తొలగిపోయినచో జగత్తునందలి ఏ ప్రాణియు కదలలేదు.

శక్తినగు నేను వేరైనచో శంకరుడు దైత్యులను సంహరించుటతో సదా అసమర్థుడగును. నీవు సృష్టి యొనరించుటకు అభిలషించెదవు. నేను నీవు తోడుగా నుండినచో నీవు సకల జగత్తును సృష్టించెదవు. నేను సహకరించినప్పుడే పృథివి స్థిరత్వము పొంది జగత్తును ధరించును. నేను తొలగిపోయినచో ఒక్క పరమాణువు కూడా ధరించుటకు అది అసమర్థురాలగును.

బ్రహ్మదేవా! నీకామహత్తత్వము నొసగెదను. స్వీకరింపుము. ఈ శక్తిని నీవు నీ పత్నిగా చేసికొనుము. ఆమె సాటిలేని సౌందర్యవతి, ఈమె ముఖము నిరంతము చిరునవ్వుతో నిండియుండును. ఈమె 'మహాసరస్వతి' యను పేరుతో ఖ్యాతి చెందును. ఈమె దివ్యశరీరము స్వచ్ఛమైనవస్త్రములతో సుశోభితమై యుండును. క్రీడించుటకు యీమె నీకు సహచరియగును. యీ సుందరి సదా నీకు పత్నియై యుండును. నీ భార్యను కూడా నా విభూతియే యని తలచి ఆదరమున నెఱపుము.

ఈమెను వెంటనిడుకొని సత్యలోకమునకు వెళ్ళుము. నాలుగు విధములగు సృష్టిని చేయుటయందు తత్పరుడవు కమ్ము. విష్ణువు నీతో సదా ఆదర సత్కారములను పొందుటకు అధికారియగును. కష్టసమయములందు ప్రకటమై దానవులను సంహరించుట ఆయన స్వాభావిక గుణమగును.

బీజము, ధ్యానముతో కూడా ఈ తొమ్మిది అక్షరములను నవార్ణవ మంత్రము అందురు. ఈ మంత్రము అన్ని మంత్రములకంటె శ్రేష్ఠమైనదని తలంపుము. ఇట్లు నన్నాదేశించిన భగవతి విష్ణువుతో అన్న మాటలు.

విష్ణూ! మనస్సును ముగ్దము చేయు ఈ మహాలక్ష్మిని తీసికొని ఇపుడు నీవు కూడా బయలుదేరుము. ఈమె ఎల్లప్పుడును నీవక్షఃస్థలమున విరాజమానమై యుండును. లక్ష్మీనారాయణుడని నిన్ను పిలుచుటకు అర్హుడవగుదువు.

విష్ణువే సాక్షాత్తూ శివుడు. శివుడే స్వయముగా శ్రీహరి, వీరిలో భేద భావము దర్శించు మానవుడు నరకమునకు అర్హుడగును. అట్లే బ్రహ్మ విషయమున కూడా అవగతము చేసికొనవలెను.

రమాకాంతా!

మొదటి వాగ్బీజము – ఐం

రెండవది కామబీజము – క్లీం

మూడవది మాయాబీజము – హ్రీం

నేను సకల చరాచర విశ్వమును నాలో లీనము చేసుకొనునప్పుడు మీరు కూడా నాయందు ప్రవేశించెదరు. భక్తిని, ముక్తిని ప్రసాదించు ఈ మంత్రమును సదా స్మరించవలెను. శుభమును కోరు పురుషులు 'ఓం' అను ప్రణవముతో కూడి మంత్ర జపము చేయవలెను.

ఓం – ఐం – క్లీం – హ్రీం

నీవు వైకుంఠమును రచించి అచటనే విరాజమానుడవు కమ్ము. నేను ఆద్యాశక్తిని, నన్ను చింతన చేయుచు స్వేచ్ఛగా విహరింపుము.

విష్ణువు భగవానునితో ఈ మాటలు చెప్పిన తరువాత శంకరునితో ఓ శంకరా! మనస్సును ముగ్ధ మొనరించు ఈ 'మహాకాళి' గౌరీ నామముతో ప్రసిద్ధురాలు. ఈమెను నీవు పత్నిగా స్వీకరింపుము. కైలాసము సృష్టించి అసుర సంహారములు చేయుము. అహంకారము, శబ్ద, స్పర్శ మొదలగునవి మహత్తత్వము యొక్క గుణములు.

సమస్త సృష్టియందును పంచ భూతములు సాత్త్విక అంశతో అయిదు కర్మేంద్రియములు, అయిదు జ్ఞానేంద్రియములు, అయిదు మహాభూతములు, పదహారవది మనస్సు ఇవన్నియు ఉత్పన్నమగును. ఈ పదహారు విభిన్న పదార్థముల సముదాయము ఈ ప్రాణియగును. పరమాత్ముడు ఆదిపురుషుడు.

మహానుభావులైన దేవతలారా! నా కార్యమును సిద్ధి చేయుటకు మీమీ స్థానములకు చేరి, మీ పనులలో ఏదైన కఠిన కార్యము మీకు తారసపడినపుడు నన్ను స్మరింపుడు.

విష్ణు భగవానునకు మహాలక్ష్మిని, శంకరునకు మహాకాళిని, నాకు మహాసరస్వతిని, పత్నులుగా కమ్మని వారి నాదేశించెను. దేవి యొక్క స్వరూపమును మేము సతతము స్మరించు చుంటిమి. ఆ ద్వీపము, ఆ దేవి, సుధాసాగరము అన్నియును అదృశ్యములయ్యెను.

అచట జలము పూర్తిగా నిండి ఉండెను. మధుకైటభులను మహావీర దానవులు శ్రీహరి చేతులలో మృత్యువునకు ఆహారమై పోయిరి.

11. బ్రహ్మదేవుడు చెప్పిన త్రివిధ సృష్టి

బ్రహ్మనైన నేను, విష్ణువు, శంకరుడు ఆ దేవిని దర్శించితిమి. నారదుడు బ్రహ్మతో నిర్గుణశక్తి ఎట్లుండును? ఆ దేవి రూపమెట్లున్నది? పరమ పురుషుని రూపమెట్లుండును. బ్రహ్మ నారదునితో నిర్గుణుని యొక్క రూపమును ఈ కనులతో చూడలేము. రూపమేదియు ఉండదు.

సకల ప్రాణులలో నున్న చైతన్యమే పరమాత్మ భిన్నభిన్న ప్రాణులలో వ్యాపించి సదా విరాజమానుడై యుండును. ఆద్యాశక్తిని సర్వత్ర వ్యాపించినదిగా తలపోయవలెను. జగుత్తునందు ఏ వస్తువునుకును ఉనికి లేదు. శక్తియే పరమాత్మ, పరమాత్ముడే శక్తి అని సిద్ధాంతము.

నీవు సగుణ పరమాత్మనే ఆరాధించవలెను. సాత్విక, రాజస, తామస భేదములతో అహంకారము మూడు రూపములు, జ్ఞానశక్తి, క్రియాశక్తి, అర్థశక్తి అను నామములతో ఉన్నవి. జ్ఞానశక్తి సాత్వికాహంకారముతో, క్రియాశక్తి రాజసాహంకారముతో ద్రవ్యశక్తి తామసాహంకారముతో సంబంధము కలిగియున్నది.

ద్రవ్యశక్తితో శబ్ద, స్పర్శ, రూప, రస గంధములను పంచతన్మాత్రల యొక్క ఉత్పత్తి తెలుపబడినది. ఆకాశము యొక్క గుణము శబ్దము, వాయువు గుణము స్పర్శ, అగ్ని గుణము రూపము, జలమునకు రసము, పృథ్వీగుణము గంధము అగును.

తామసాహంకారముతో ఉత్పన్నమైన "సృష్టి"యగునని చెప్పుదురు. చెవులు, చర్మము, నాలుక, కనులు, నాసిక ఈ అయిదు జ్ఞానేంద్రియములు, వాక్కు, చేతులు, కాళ్ళు, ఉపస్థ, గుదము, ఈ అయిదు కర్మేంద్రియములు, ప్రాణము, అపానము, వ్యానము, సమానము, ఉదానము ఇవన్నియు క్రియాశక్తి నుండి ఉత్పన్నములగును. వీటినే రాజస సృష్టి అని చెప్పుదురు.

సాత్వికాహంకారమునకు సంబంధించినది జ్ఞానశక్తి, దిశలు, వాయువు, సూర్యుడు, వరుణుడు, అశ్వినీ కుమారులు వీటికి అధిష్ఠాన దేవతలు, చంద్రుడు, బ్రహ్మ, రుద్రుడు, క్షేత్రజ్ఞుడు, ఇవి సాత్విక సృష్టి అను పేరుతో ప్రసిద్ధి చెందినది.

పరమ పురుషుడగు పరమాత్మ సూక్ష్మ శరీరమే. ఆ స్వామి స్థూల శరీరముగా చెప్పబడును. పంచ భూతముల సముదాయమగు శరీరము ఉత్పన్నమగును. వాయువునకు శబ్ద స్పర్శలను రెండు గుణములు కలవు.

శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములను అయిదు గుణములతో పృథివి పరిపూర్ణమైనది. సకల వస్తువుల సమ్మేళనము చేతనే బ్రహ్మాండము ఉత్పన్నమగునని చెప్పబడును. ప్రాణులు ఎనుబది నాలుగ లక్షలని చెప్పబడినది.

నారదా! సత్వగుణము ప్రీతి మయమని తెలసికొనుము. సత్వ గుణముకాని, రజోగుణముకాని, తమోగుణముకాని, ఒక్కటే ఉండదు. మూడును వెనువెంటనే ఉండును. శాస్త్రాధ్యయనము వలన శ్రేష్ఠమగు సత్వగుణము ఉత్పన్నమగును. సత్వగుణము వృద్ధి చెందునపుడు మనస్సులో ధార్మిక భావములు జాగృతమగును. యజ్ఞములందు అభిరుచి కలుగును.

సత్వగుణము నందాసక్తి కలవాడు, రాజస పదార్థములను కోరడు, తామస పదార్థముల జోలికి పోనేపోడు. రజముతో కలిసి సత్వము, సత్వ గుణముతో కలిసి రజోగుణము, ఈ రెండింటితో కలిసి తమోగుణము జంట జంటలుగా వ్యవహరించుచుండును.

నూనె, వత్తి, జ్వాల యీ మూడును విరుద్ధ ధర్మములు గలవి, దేనికిని దేనితోను సాహచర్యము లేదు. అట్లే గుణముల విషయమున కూడా అవగతము చేసికొనవలెను.

రాజా! ఆ పరమేశ్వరియే జగత్తునకు కారణము. ఆమెయే మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి, సకల ప్రాణులకు అధిష్ఠాత్రి. శాంత స్వరూపిణి, ఆ జనని నామము ఉచ్చరించగానే మనకభీష్ట వస్తువును ఒసగును.

అడవియందు వ్యాఘ్రము మొదలగు వాటిని చూచి భయపడి 'ఐ, ఐ' అని ఉచ్చరించినను ఆ దేవి మన మనో రథములను నెరవేర్చును.

సత్యవ్రతుడను పేరుగల ఒక మహామూర్ఖుడు అడవి పంది నుండి బీజాక్షరమును వెలువడిన 'ఐ' అనే ఉచ్చరించి గొప్ప విద్వాంసుడుగా మారిపోయెను. భగవతి అతని యెడల మిగుల ప్రసన్నురాలయ్యెను. ఆ బ్రాహ్మణుని ఒక కవిరాజుగా మార్చివేసెను.

12. ఉతథ్యుడు పండితుడై సత్యవ్రత బ్రాహ్మణుడుగా పరిణతి

జనమేజయునితో వ్యాసుడు కురుశ్రేష్ఠా! తీర్థాటన మొనరించుచూ నేను నైమిశారణ్యము చేరితిని. జీవన్ముక్తులైన బ్రహ్మమానస పుత్రులందరునూ అచటకు వచ్చియుండిరి. జమదగ్ని మునీంద్రులతో ఏ దైవమును శీఘ్రముగా ప్రసన్నత చేసుకొనగలము అని అడుగగా లోమశుడు ఇట్లు చెప్పెను.

సర్వత్రా విరాజమానమై యున్నది దేవి మాత్రమే. పరమ పవిత్రమైన ఒక కథ మీకు చెప్పెదను వినుడు. కోసలదేశము నందు దేవదత్తుడనే బ్రాహ్మణుడుండెను. అతడు సంతానము కొరకు పుత్రేష్టియాగమునందు సంలగ్నుడై యుండెను.

గోభిలుడు ఉద్గాతగా మంత్రము జపించుచుండగా అతనికి స్వరభంగ మయ్యెను. దేవదత్తుడు కోపముతో నీవు ఈ సకామ యజ్ఞమునందు స్వరహీన మంత్రమునుచ్చరించితివి. అనగానే గోభిలుడు కుపితుడై సకల ప్రాణులందు ఉచ్ఛ్వాస నిశ్వాసములు జరుగుచునే యుండును.

స్వరభంగమగుటకు నా అపరాధము ఏ మాత్రము లేదు. నీకు శబ్దశూన్యుడు, ప్రచండమూర్ఖుడగు పుత్రుడు జన్మించుగాక యని శాపమునిచ్చెను.

దేవదత్తుడు గోభిలునితో మూర్ఖుడైన పుత్రుడు పుట్టుటకంటె పుత్రహీనుడగుటయే ఉత్తమమని విద్వాంసులు తెలిపెదరు. మూర్ఖుడగు బ్రాహ్మణుడు శూద్రునివలెనుండును. మూర్ఖ బ్రాహ్మణునితో ఎప్పుడును శ్రాద్ధ విధులను నిర్వహింపరాదు. మీరు నన్ను అనుగ్రహించి శాపమునుండి ఉద్ధరింపుడని, దేవదత్తుడు గోభిలుని పాదములపై వ్రాలెను.

గోభిలుని హృదయము దయాపూర్ణమై దేవదత్తునితో నీ పుత్రుడు మూర్ఖుడై పిదప విద్వాంసుడగుననెను. కొంతకాలమునకు దేవదత్తుని భార్య రోహిణి గర్భము దాల్చెను. శుభలగ్నమున బాలుడు జన్మించెను. పుత్రునకు ఉతథ్యుడని పేరిడిరి. పన్నెండు సంవత్సరములు వచ్చినా ఉతథ్యుడు సంధ్యావందనం చేయుట తెలుసుకోలేదు, ఉతథ్యుడు మూర్ఖుడని ప్రచారము జరిగినది.

తల్లిదండ్రుల మాటలకు విసుగుచెంది ఉతథ్యుడు వనమునకు వెళ్ళిపోయెను. బ్రాహ్మణుడైయుండి కూడా ఉతథ్యుడు వేదాధ్యయనముగాని, జపముగాని ఎరుగడు. అయితే ఎప్పుడూ సత్యమునే మాట్లాడేవాడు, అతని నోటి నుండి ఎప్పుడును అసత్యము వెలువడలేదు. అతనికి 'సత్యవ్రతుడు' అనే పేరు వచ్చింది.

సత్యవ్రతుడు నేను ఉత్తమ కులమునందు పుట్టికూడా ఎందుకు పనికిరాని వాడయ్యాను. దైవమే నన్ను మూర్ఖునిగా చేసింది. పూర్వజన్మమున ఒక పుస్తకమునైనను వ్రాసి శ్రేష్ఠుడగు బ్రాహ్మణునకు దానమొసగలేదు. ఎవ్వరికిని ఉత్తమవిద్యను బోధించలేదు. ఉతథ్యుడు విపరీతమైన చింతతో గంగానది తీరమునందు కుటీరమున పదు నాలుగు సంవత్సరములు గడిపెను.

ఒకనాడు అడవి మనిషి ధనుర్బాణములతో పందిని కొట్టెను. దాని శరీరము గడగడ వణుకుచు ఉతథ్యుని సమీపమునకు చేరెను. ఉతథ్యుని నోటినుండి సారస్వత బీజమగు 'ఐ' అను ఉచ్చారణ వెలువడెను. ఆ ఆశ్రమమున పందివచ్చి దాగుకొనెను. వేటగాడు నా బాణముచే కొట్టబడిన ఆ సూకరమెట్లు పోయినదో తెలుపుమని ఉతథ్యుని అడిగెను.

ఇపుడు నిజము చెప్పవలెనా? అసత్యము చెప్పవలెనా? అని ఆలోచిస్తూ దయతో కూడిన అసత్యము కూడా సత్యముగానే భావింపబడును అని మనస్సులో అనుకొనెను. 'ఐ' అనునది భగవతి యొక్క వాగ్బీజ మంత్రము, వాగ్బీజ మంత్రము ఉతథ్యునకు సకల విద్యలు స్ఫురించెను. వ్యాధునితో చూచిన కళ్ళు మాట్లాడలేవు. మాట్లాడెడివాణి చూడలేదు, ఇప్పుడు నన్ను మాటమాటికి అడుగు చున్నావు అనెను. అప్పుడా ఉతథ్యుడే రెండవ వాల్మీకివలె ప్రకాండ పండితుడయ్యెను.

ఉతథ్యుని విషయమంతా తెలుసుకొన్న అతని తండ్రి ఆదరముతో తన ఇంటికి తీసుకొనివచ్చెను. జనమేజయరాజా! భగవతి యజ్ఞము ఆరంభించుము. భక్తి పూర్వముగా స్మరించినను, పూజించినను, ధ్యానించినను, నామము ఉచ్చరించినను, స్తుతించినను, భగవతి కోరిన ప్రయోజనములు సిద్ధింపచేయును. కనుకనే ఆమెను 'కామద' అని పిలిచెదరు. రాజా! భగవతిని నిరంతరము ఆరాధించుటకు నిమగ్నుడవు కమ్ము.

13. వివిధ యజ్ఞములు

యజ్ఞములు మూడు విధములు : సాత్వికము, రాజసము, తామసము. మునుల కొరకు సాత్విక యజ్ఞము, రాజులకు రాజస యజ్ఞము, రాక్షసులకు తామస యజ్ఞము. ద్రవ్యశుద్ధి, క్రియాశుద్ధి, మంత్రశుద్ధి చేత యజ్ఞము సంపన్నమైనచో అది సంపూర్ణ ఫలమొసగును. న్యాయముతో సంపాదించిన ధనముచేతనే సదా పుణ్యకార్యము చేయవలయును.

పాండవులు రాజసూయ యజ్ఞమును చేసిరి. యజ్ఞమునందు అనుచిత కార్యము తప్పక జరిగియుండును. ఆ ఫలితమే వారికి జూదమునందు ఓటమి, ధనమును అన్యాయముగా భీతిచెంది రాజులు రాజసూయయాగమప్పుడు సమర్పించిన ధనము దానము చేసినా, ఫలితము నివ్వజాలదు.

సాత్విక యజ్ఞము మునులు చేయగలరు. తామస యజ్ఞము దానవులకు తగినదని చెప్పెదరు. మానస యజ్ఞమునందు సమస్త సాధనలు సమకూరజాలవు. మనస్సులోనే విధి విధానముగా అగ్ని స్థాపన చేయవలెను. బ్రాహ్మణులకందరకు మానసిక పూజ చేయవలయును.

జగదంబిక నిర్గుణ శక్తి రూపమున వచ్చి ఫలమునొసగును. బ్రాహ్మణుడు ఆ భగవతి జగదంబికను తలంచి కల్పించిన వస్తువులను బ్రహ్మాగ్నియందు హవనము చేయవలయును. సమస్త ప్రాణులయందు పరబ్రహ్మ విరాజమానుడైయున్నాడని పరబ్రహ్మయందే సకల ప్రాణులు ఉన్నవి అని భావించి పరబ్రహ్మను దర్శించవలెను.

సర్వభూతస్థ మాత్మానాం సర్వభూతాని చాత్మని ।
యదా పశ్యతి భూతాత్మా తదా పశ్యతి తాం శివామ్ ॥

స్వర్గమును కోరు పురుషులు అగ్నిష్టోమ యజ్ఞము చేయవలయునని వేదములు ఆదేశించును. అక్షయ పుణ్యఫలమొసగు మానసిక యజ్ఞమే సర్వశ్రేష్ఠము. జనమేజయ మహారాజా! నీవు సర్పయాగము చేసితివి. తామస గుణము ఆచరించితివి.

మహారాజా! విస్తృతముగా దేవి యజ్ఞమును చేయుము. దేవి యొక్క బీజమంత్ర స్వరూపమును తెలుసుకొనుము. బ్రాహ్మణునే యాజకునిగా చేయవలయును. నీ తండ్రి మరణించు సమయమున స్నానదానాదులేవియును చేయలేక ఒక గదిలోవుండి అచటనే శ్వాసగమనము ఆగిపోయెను.

ప్రాణియెక్కడవున్న తలమీద మృత్యువు నాట్యమాడు చుంటుందని గమనములో ఉండవలెను. వైరాగ్యము అవలంబించవలెను. నేను వేరు, శరీరము వేరు, నేను నిర్గుణ అవినాశినగు ఆత్మను మాత్రమే అని గుర్తించవలెను.

వికారములేని బ్రహ్మనేకాని, సంసారినికాను. మంచి చెడులతో కూడిన ధర్మములన్నియు నాతో వేరైనవే. ఇట్లు చింతన చేయుచు మరణించుప్రాణి స్నానదానాది సకల సత్క్రియలతో వంచితుడైనప్పటికి నీవలన అతడు పునర్జన్మ దుఃఖములననుభవింపవలసిన అవసరముండదు. అయితే ఇది యోగులకు కూడా దుర్లభమే. అని చెప్పగా జనమేజయుడు అయ్యో! "నా జీవితము వ్యర్థము అయినది. నా తండ్రి దివ్యస్వర్గమునకు ఎట్లు అధికారి కాగలడు అని వ్యాసుని అడిగెను.

14. అంబికా యజ్ఞము

జనమేజయుడు వ్యాసునితో మునీంద్రా విష్ణు భగవానుడు ఏ విధముగా అంబికాయజ్ఞము చేసెను అని కోరగా, రాజా! భువనేశ్వరీదేవి తన శ్రీ విగ్రహము నుండి మూడు శక్తులను ప్రకటించెను. ఆ ముగ్గురు శక్తులే బ్రహ్మ, విష్ణు, శంకరుని రూపములు వారి ద్వారానే పృథివిని శేషనాగుని పడగలమీద నిలబెట్టెను.

దక్ష ప్రజాపతికి పదముగ్గురు కన్యలు ఉద్భవించిరి. కశ్యపుని ద్వారా దక్షకన్యలకు దేవతలు, దానవులు జన్మించిరి. బ్రహ్మయొక్క అర్ధ శరీరమునుండి స్వయంభువమనువు జన్మించెను. వామార్ధభాగం నుండి శతరూప ఆవిర్భవించెను. ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడను ఇరువురు పుత్రులు ఉదయించిరి.

సుమేరు సర్వత శిఖరము మీద బ్రహ్మలోకమును నిర్మించెను. విష్ణు భగవానుడు మనోవినోదమునకు వైకుంఠము ఏర్పడెను. శంకరుడు

ఉత్తమ స్థానము కైలాసము ఏర్పాటు చేసుకొనెను. మర్త్యలోకము, పాతాళలోకమేగాక స్వర్గలోకము కూడా ఏర్పడెను. అది మేరుగిరిపై విరాజమానమైయుండెను.

శ్రీహరి మనస్సులో అంబికాయజ్ఞము చేయుతలంపు కలిగెను. యజ్ఞశాల నిర్మింపబడెను. బ్రాహ్మణులు దేవి యొక్క బీజమంత్రము జపమొనరించసాగిరి. పదార్థములు హవనము చేయుచుండిరి. అప్పుడాకాశవాణి ఇట్లు పలికెను. విష్ణూ! నీవు ఎల్లవేళల దేవలందరిలోను సర్వోత్తమ స్థానమును పొందెదవు.

యాజకులెల్లరును నిన్ను పూజింతురు. వరదాత వగుదువు. అందరికి పరమ ఆరాధ్య దైవమగుదువు. ధర్మము లోపించినపుడు నీవు నీ అంశావతారమును ధరించి ధర్మమును రక్షించెదవు. చాలా అవతారములతో ఈ కార్యమును నెరవేర్చెదవు. అన్ని అవతారములలలో ఆదిశక్తి అంశ నీకు తోడ్పడును. మానవులు పూజా సమయమున వైదిక మంత్రముల ద్వారా నామ జపములతో ఆరాదిస్తుంటారు. ఇదంతయు చెప్పి ఆకాశవాణి అంతర్ధానమైనది.

15. సుదర్శనుడు

అందరి మనస్సులలో భగవతి యెడల భక్తి జాగృతమయ్యెను. దేవి భగవతిని ఆరాధించుటయందు ఆసక్తులైరి. భగవతి యొక్క మహిమను తెలిపెదను వినుము. కోసల దేశమునందు పుష్యుని కుమారుడు ధ్రువసంధి. అయోధ్య అతని రాజధాని, రాజు యొక్క ధర్మపత్నులు మనోరమ, లీలావతి. మనోరమ కుమారుని పేరు సుదర్శనుడు. లీలావతి పుత్రుని పేరు శత్రుజిత్తు.

ధ్రువసంధికి చిన్న భార్యయైన లీలావతి కుమారుడైన శత్రుజిత్తుపై అమితమైన ప్రేమ. వేటాడు కోరికతో ధ్రువసంధి ఒకనాడు వనమునకు వెళ్ళెను. పొదనుండి ఒక సింహము రాజుపై విరుచుకొనిపడెను.

ధ్రువసంధిని చీల్చి సింహము పడవేసెను. అతని శ్వాస ఆగిపోయెను. సైనికులు సింహమును కూల్చివేసిరి.

వశిష్ఠుడు సుదర్శనుని రాజును చేయుటకు ప్రయత్నములు జరిపెను. వయోవృద్ధులైన మంత్రులు కూడా ఏకీభవించిరి. రెండవ భార్య లీలావతి ఈ వార్తను తన తండ్రియైన యుధాజిత్తుకు చేరవేసెను.

మనోరమ తండ్రి కళింగదేశపురాజు వీరసేన మహారాజు కూడా తన దౌహిత్రుడైన సుదర్శనుని రాజును చేయు తలంపుతో అచటకు చేరుకొనెను.

రాజ్యాధికారము సుదర్శనునకా, శత్రుజిత్తుకా యని వాదోప వాదములు జరిగెను. అదే సమయమున నిషాదులు రాజు యొక్క ధనాగారము కొల్లగొట్టుటకు అచటకు చేరిరి.

యుధాజిత్తుకు, వీరసేనునకు యుద్ధము భీకరముగా సాగెను. వీరసేనుడు విగతజీవుడై శాశ్వతముగా నేలకొరిగెను. వీరుసేనుని మరణవార్త తెలిసిన మనోరమ మంత్రులతో సంప్రదించగా ప్రధానమంత్రియైన విదలుడు మనోరమతో మనము ఇప్పుడు రక్షణ చెందవలెనంటే మా మామ సుబాహుని చెంతకు వెళ్ళవలయునని చెప్పెను.

మనోరమ ఒకదాసిని వెంటనిడుకొని విదలునితో బాలకుడైన సుదర్శనునితో కలిసి గంగాతీరమున చిత్ర కూటమును చేరెను. అక్కడ భరద్వాజాశ్రమమునకు వెళ్ళెను.

భరద్వాజుడు మనోరమతో ఈ బాలకునితో ఈ వనమునకు వచ్చుటకు కారణమేమని అడిగెను. విదలుడు మునితో ఈమె ధ్రువసంధియను రాజు భార్య మనోరమ. ఈ బాలుడు మహారాజు యొక్క పుత్రుడు సుదర్శనుడు. ధ్రువసంధి సింహముతో పోరాడి మరణించెను. రాజ్యం కోసం యుధాజిత్తుకు, వీర సేనునకు యుద్ధం జరిగింది. ఇరువురు తమ

మనుమలను రాజును చేయుటకు పోరాడగా వీరసేనుడు మరణించెను. యుధాజిత్తు నుండి తప్పించుకొని మిమ్ములనిపుడు మనోరమ శరణువేడు తున్నది.

దుఃఖితులైన ప్రాణులను రక్షించుట వలన యజ్ఞమునకంటే అధిక ఫలము సమకూరునని విజ్ఞులు వచింతురు. అనగా భరద్వాజుడు మనోరమతో కళ్యాణీ! నీ కుమారుడు రాజగును. ఈ కుటీరమునందు సుదర్శనుని పెంచుకొనుచు కాలము గడుపమని కోరెను.

అక్కడ యుధాజిత్తు శత్రుజిత్తును శాస్త్రోక్తముగా సింహాసనాసీనుని చేసి మంత్రులకు కార్యభారము నప్పగించెను. సుదర్శనుడు మునుల ఆశ్రమమున ఉన్నాడని వేగుల ద్వారా తెలిసికొనెను. బాలకుని సంహరించుటకు యుధాజిత్తు వచ్చుచున్నాడని మనోరమకు తెలిసినది. భరద్వాజునితో మునీంద్రా! నన్ను, నా బిడ్డను మీరే కాపాడవలయునని కోరెను.

యుధాజిత్తు – మనోరమను బయటకు పంపుము నేనామెను బలవంతముగా తీసికొని వెళ్ళెదను అని చెప్పగా భరద్వాజుడు నీలో శక్తి ఉన్నచో బలవంతముగా ఆశ్రమమునందున్న మనోరమను తీసికొని వెళ్ళుము అనెను.

యుధాజిత్తు తనతోవున్న వృద్ధమంత్రితో గత్యంతరమేమియని కోరెను. మంత్రి తాపసులతో సంగ్రామము తన కులమునకు కీడు వచ్చునని చెప్పెను. మునితో ద్వేషించుటవలన ప్రయోజనము ఉండదు అని చెప్పగా యుధాజిత్తు భరద్వాజముని చరణములకు ప్రణమిల్లెను. మనోరమ సుదర్శనుని పెంచుకొనుచూ కాలము గడుపుకొను చుండెను.

ఒకనాడు ఒక ముని కుమారుడు నవ్వులాటకు 'క్లీబ' శబ్దముతో సంబోధించెను. సుదర్శనుని 'క్లీ' శబ్దము మాత్రము మళ్ళీ మళ్లీ

పలుకుచుండగా అది భగవతి బీజమంత్రమై సుదర్శనుని స్మృతి పథమునందు నిలిచిపోయెను.

ఆ కామ బీజమంత్ర ప్రభావముననే సుదర్శనునకు సాంగోపాంగ ధనుర్వేదము, నీతిశాస్త్రము, సకల విద్యలు ప్రాప్తించెను. సుదర్శనునకు భగవతి సాక్షాత్కరించి దర్శనమొసగి కృతార్థుని చేసెను. జగజ్జనని కృపతో దివ్యములగు ధనుర్బాణములు తూణీరము కవచము లభించెను.

కాశీనగరమున శశికళయను కన్యయుండెను. ఆమె ముని ఆశ్రమమున సర్వలక్షణ సంపన్నుడగు రాజకుమారుడైన సుదర్శనుడున్నాడని వినియుండెను. ఆమె తనపతిగా చేసుకొనవలెనని కోరిక కలిగి ఉండెను.

ఒకనాటి అర్ధరాత్రి సమయమున శశికళకు భగవతి సాక్షాత్కరించి ఓ సుశ్రోణీ! సుందరీ ఆ సుదర్శనుడు నా భక్తుడు. ఆతడే నీకు పతికాగలడు. ఇక నీవు కోరిన వరము కోరుకొనుము అనెను.

ఒకనాడు శశికళ చెలికత్తెలతో వనమునకు వెళ్ళెను. అక్కడ ఒక బ్రాహ్మణుడు సుదర్శనుని గుణగణములు చెపుతూ అతడు నీకు భర్తయగుటకు శ్రేష్ఠుడు అని చెప్పెను.

చెలికత్తెతో సుదర్శనుడైన రాజకుమారుని స్వప్నమునందు చూచితినని శశికళ చెప్పెను. శశికళ తండ్రి సుబాహువు తన కుమార్తెకు స్వయంవరమునకు ఏర్పాట్లు చేయుచుండెను.

కోరిన వరుని ఎన్నుకొనుట – ఇచ్ఛా స్వయంవరము

ఒక పద్ధతికి కట్టుబడి ఉండేది – ప్రతిజ్ఞా స్వయంవరము

శూరత్వము ప్రదర్శించునది – శౌర్యశుల్కము

కాని సుబాహువు 'ఇచ్ఛా స్వయంవరము' ఏర్పాటు చేసెను.

శశికళ తన తల్లితో సఖిని పంపుతూ 'తను సుదర్శనుని ఇష్టపడుతున్నాను' అని చెప్పెను. చెలికత్తె కశికళ చెప్పిన మాటలను ఆమె తల్లికి వినిపించగా అది మహారాజునకు చేరెను. సుబాహువు తన కుమార్తెతో 'సుదర్శనుడు నిరుపేద నీకు ఎంత మాత్రము సరిపోలడు' అని వాదించెను. కాని శశికళ ఆ వరుని వరించుమని భగవతి నన్ను ఆదేశించినదని ఎదురుతిరిగెను.

ఈ విషయమునంతటిని శశికళ ఒక బ్రాహ్మణుని ద్వారా సుదర్శనునకు చేరవేసినది. భరద్వాజ ఆశ్రమమున సుదర్శనుడు తల్లికీవిషయం తెలుపగా మొదట అచటకి వెళ్ళవలదని వారించినా చివరకు ఆశీర్వాదాలతో భగవతి నిన్ను రక్షించును, దుఃఖములో దుర్గాదేవి కాపాడును, కలహములో కాళిక, భయములో భగవతి, పరమేశ్వరి, మాతంగి, సౌమ్య, భవాని, రాజులమధ్య నిన్ను రక్షించును. విషమ స్థలములందు గిరిజ, నాలుగు త్రోవలకూడలియందు భగవతి చాముండ, అడవులలో శ్రీకామగాదేవి నిన్ను రక్షించును. వివాదము చెలరేగిన వైష్ణవీదేవి, శత్రువులతో తలపడునపుడు భగవతిభైరవి నిన్ను రక్షించును, భువనేశ్వరీదేవి సదా నిన్ను కాపాడును.

మనోరమ, దాసితో, సుదర్శనుని వెంటబెట్టుకొని ఒకే రధమున కాశి చేరుకొనిరి. యుధాజిత్తు కూడా దౌహిత్రునితో (శతృజిత్తు) అచటికి వచ్చెను. వచ్చినటువంటి రాజులతో యుధాజిత్తు 'ఈ శశికళ రాజకుమారి కొరకు నేను సుదర్శనుని సంహరింతును' అనెను. కేరళ నరేశుడు యుధాజిత్తుతో 'కన్యకు తనకు ఇష్టము వచ్చిన వారిని వరించుటే ఇచ్చా స్వయంవరము, కనుక నీవు దౌహిత్రుని కోసం అన్యాయముగా రఘువంశీకుడైన సుదర్శనునికి కీడు తలపెట్టుట మానుము' అనెను.

సుబాహుడు రాజులు కొలువు తీరిన స్థలమునకు వెళ్ళి నా కుమార్తె శశికళ మనస్సులో సుదర్శనుని వరించినది. అనగా అందరు రాజులు

సుదర్శనుని పిలిపించి తను అక్కడికి రావటానికి కారణమేమి నువ్వు కడు నిరుపేద గదా?అనిరి.

సుదర్శనుడు నాకు ధనాగారము లేదు. రాజభవనము లేదు, భగవతి ఆనతిపై చూచుటకు వచ్చితిని, నాకు శత్రువులు లేరు. యుధాజిత్తు కూడా నాకు శత్రువు కాదు. అనగా అందరు రాజులు తమ తమ విడిదికి వెళ్ళిరి.

రెండవ దినము రాజులందరు గౌరవ పూర్వకంగా తమ సభా భవనమున తమ స్థానములందు చేరుకోగానే శశికళతో తండ్రి నీకు నచ్చిన వారిని భర్తగా స్వీకరింపుమని కోరగా, శశికళ తండ్రితో నేనిచటనున్న రాజుల ఎదుటికి వెళ్ళను. స్త్రీ ధర్మమును తప్పక పాటించెదను. నేను కోరునది సుదర్శనునితో వివాహము అని గట్టిగా చెప్పెను.

సుబాహువు వ్యాకులతకు లోనై రాజుల వద్దకు వెళ్ళి తన కుమార్తె స్వయం వరమునకు వచ్చుటకు నిరాకరిస్తున్నది. ఈ రోజు మీరు మీ భవనములకు వెళ్ళుడు అని చెప్పి శశికళ వద్దకు భార్యా భర్తలిద్దరు వెళ్ళి నచ్చచెప్పుటకు చాలా ప్రయత్నించిరి.

శశికళ తండ్రీ! ఈరోజు రాత్రే సుదర్శనునితో నాకు పాణిగ్రహణము చేయించుము. ఆ దేవి కృపచే అన్ని శుభములు కలుగును అని ధైర్యము చెప్పగా సుదర్శనుడు అంతఃపురమునందే సుదర్శనునితో శశికళల వివాహము జరిపించి భక్తి శ్రద్ధలతో హవనము చేయించి అగ్నికి ప్రదక్షిణలను చేయించెను.

సుబాహుడు శశికళను మనోరమకు అప్పగించి ప్రణామములు చేసెను. సుబాహును మనోరమ మిగుల ప్రశంసించెను. సుబాహుడు ఈ కాశీరాజ్యమును స్వీకరింపుడు లేదా అర్ధరాజ్యమిచ్చెదను, నేను సైన్యాధిపతిగా ఉండగలను. మీరు వనములలో నుండుటకు నేనంగీకరించను అనెను. వీరిలా మాట్లాడుచుండగానే సూర్యోదయమయ్యెను.

శశికళ సుదర్శనులకు వివాహమైనదని తక్కిన రాజుల కందరకు తెలిసిపోయెను. శాస్త్రోక్తముగా ఆరు దినముల వరకు సుదర్శనునకు విందులు ఏర్పాటు చేసి వివిధ కట్నములతో శశికళ, సుదర్శనులను వీడ్కోలిచ్చెను. మార్గమధ్యమున యుధాజిత్తు, శత్రుజిత్తులు సుదర్శనుని ఆపి యుద్ధమునకు దిగిరి.

సుదర్శనుడు కామబీజమంత్రమును జపించగానే ధైర్యముతో ఎదురు నిలిచెను. కాశీ నరేశుడు కూడా సుదర్శనునకు తన సైన్యముతో సహాయపడెను. ఇరువర్గముల వారికి ఘోరయుద్ధము జరుగుచుండగా భగవతి దుర్గ సాక్షాత్కరించెను.

భగవతి దుర్గ యుధాజిత్తుని లక్ష్యముగా చేసికొని బాణములను కురిపించ సాగెను. కొద్దిసేపటిలోనే యుధాజిత్తు, శత్రుజిత్తు నేలకొరగి మరణించిరి. మిగిలిన రాజులు, సుబాహుడు, అందరు సంతోషముతో దుర్గను స్తుతింపసాగిరి.

సీ. వాగ్దేవతవు నీవు వారాహి వీవు
వైష్ణవి వీవు సచ్చిదానంద వీవు
ధృతి నీవు గతివీవు మతివీవు కృతివి వీవు
శ్రుతివీవు సుగుణసంతతివి వీవు
బ్రహ్మయు విష్ణుండు భవుఁడు సమస్తదేవతలు నిన్
బొగడికా బ్రతుకుచుండ్రు
నీ గుణములనెన్న నేరకయుండిరి
వారలే నే నెంతవాడ దల్లి

తే.గీ. యల్లుఁడీతడు గాబట్టి యఖిలమాత
వైన నీ దర్శనంబు నా కాయెఁగాక
కలుగునే వేయివర్షముల్ ఘనతపంబు
జేసినను నాదు పుణ్యంబుఁజెప్పదరమె

తే.గీ. ఇట్టి నిన్నుఁ గనుంగొంటి నెంతవాడ
నైతి నాభాగ్య మేమందు నఖిలవాంఛి
తార్థములు దీరెనమ్మ మాయమ్మ నీ ప
దాంబుజంబుల దాసానుదాసుడ జుమి! (మ.క.దా.శ్రీ.)

కళ్యాణస్వరూపిణి భగవతి జగదంబ ప్రసన్నురాలయ్యెను. సువ్రతా! వరమడుగుము! అని ఆ తల్లి మహారాజగు సుబాహునితో పలికెను.

అమ్మా! నీ దర్శనమునకు సరితూగగల పదార్థమేదియును త్రిలోకములందు లేదు. నీయందు భక్తి నిరంతరము ఉండునట్లు కోరుచున్నాను. కాశీనగరమునందు పృధివి ఉన్నంతకాలము ఉండుమనికోరగా దేవి అంగీకరించెను.

సుదర్శనుడు జగదంబకు ప్రణమిల్లి తన కర్తవ్యమును కోరగా భాగ్యశాలీ నీవు అయోధ్యకు వెళ్ళుము. నన్ను ధ్యానము చేయుచుండుము, అష్టమి, చతుర్దశి, నవమి దినములందు శాస్త్రోక్తముగ పూజించుట మిగుల అవసరము.

ఆశ్వయుజమాసమునందు నవరాత్రవిధానము విశిష్ట పూజ జరుగవలెను. చైత్ర, ఆశ్వయుజ, ఆషాడ, మాఘ మాసములందు నవరాత్రి మహోత్సవములు జరిపింపవలెను. కృష్ణపక్ష చతుర్దశి, అష్టమి దినములందు నా పూజ చేయవలయును. ఇట్లు ఆదేశించి దుర్గ అదృశ్యమయ్యెను. సుదర్శనునితో రాజులందరు మీ కృపవలన జగదంబ దర్శనము ప్రాప్తించినది. నీవు నౌకగా సంసార సాగరమునుండి మమ్ములను ఉద్ధరింపమని కోరిరి.

సుదర్శనుడు రాజులతో 'క్లీ' అను మంత్రము నిరంతరము జపించుటవలన ఆ దేవి నాకు ప్రసన్నమైనదని చెప్పగా సంతోషంతో అందరు వారి వారి స్థలములకు తిరిగి వెళ్ళిరి. అయోధ్య ప్రజలు సుదర్శనుని

రాజుగ అంగీకరించిరి. సుదర్శనుడు అయోధ్యలో శత్రుజిత్తు తల్లిని చేరి ప్రణమిల్లి శత్రుజిత్తు, యుధాజిత్తుల మరణము దుర్గ చేతిలోనే జరిగినది నా అపరాధమేమియు లేదని చెప్పెను.

తల్లీ! నేను నీ సేవకుడను. ఈ భారతదేశము పుణ్యభూమి. ఇందు జన్మించుట పూర్వజన్మ పుణ్యం. జగదంబిక కృపవలన ఈ రాజ్యము నాకు లభించినది. లీలావతి సుప్రతా! నాకు నీపై క్రోధము లేదు. నేను నిన్ను ఆశీర్వదిస్తున్నాను అని తమ తమ భవనములకు వెళ్ళిరి.

సుదర్శనుడు దేవిని గొప్ప సింహాసనముపై నిలిపి నిత్యము పూజించవలెనని ప్రజలకు ఉపదేశించి ధర్మపాలన చేసెను. కోసలదేశమునందు ఆనాడు దిలీపుడు, రఘుమహారాజును పోలిన ధర్మము నాలుగు పాదములతో నడుచుచుండెను.

సుబాహుడు కూడా కాశీనగరమున దేవిని ప్రతిష్ఠించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించెను.

16. దేవీనవరాత్రి మహిమ

వసంత ఋతువు, శరదృతువులందు దేవీనవరాత్రులు ప్రజలు జరపడం శుభదాయకం. చైత్రమాసం, అశ్వయుజమాసం మొదటిదినం నుండి ఏక భుక్తవ్రతంతో పచ్చటితోరణాలు కట్టించి పాడ్యమినాటి ఉదయం నుండి బ్రాహ్మణ వేదపండితులను ఆహ్వానించి యథాశక్తితో సింహవాహనాధిష్ఠిత అయిన దేవి ప్రతిమను ఉంచి కలశ స్థాపన చేసి మామిడి, నేరేడు, వెలగ, మాదీఫలం, బిల్వ (పంచ పల్లవాలు) తో తొమ్మిది రోజులు నిత్యార్చన జరపాలి.

మొదటి దినమున ఒక కన్యను, రెండవ దినమునమందు ఇద్దరిని ఇలా పెంచుతూ తొమ్మిదవ రోజులన తొమ్మిది మంది కన్యలను పూజించవలెను. ఒక సంవత్సరము కన్య పనికిరాదు.

రెండు సం॥ కన్య – కుమారి,

మూడు సం॥ కన్య – త్రిమూర్తి

నాలుగు సం॥ కన్య – కళ్యాణి,

ఐదు సం॥ కన్య – రోహిణి,

ఆరు సం॥ కన్య – కాళిక,

ఏడు సం॥ కన్య – చండిక

ఎనిమిది సం॥ కన్య – శాంభవి,

తొమ్మిది సం॥ కన్య – దుర్గ

పది సం॥ కన్య – సుభద్రయని చెబుతూ,

పది సంవ॥ పైబడిన కన్యను పూజింపరాదు.

అంగవైకల్యములు కల కన్యను పూజింపరాదు. కార్యసిద్ధికి బ్రాహ్మణ కన్యను, విజయమునకు క్షత్రియ కన్య, వ్యాపార లాభమునకు శూద్రకన్యను పూజించవలెను.

భగవతి భద్రకాళి అష్టమి తిథియందే అవతరించెను. సప్తమి, అష్టమి తిథులందు ఉపవాసముతో దేవిని పూజించిన సకల ఫలములు ప్రాప్తించును.

నవరాత్రి వ్రతమును పాటించని వారే మరు జన్మమునందు రోగులు, దరిద్రులు, సంతానహీనులు, వంధ్యలు, విధవలు, ధనహీనులుగా మనము విశ్వసిస్తున్నాము.

మంగళప్రదురాలగు భగవతి చండిక సకల కోరికలను సిద్ధింపచేయును. ధర్మ, అర్థ, కామ, మోక్షములను ఈ నాలుగు ఫలములను అభిలషించు వారెవ్వరును ఆ దేవిని ఆరాధించని వారుండరు.

17. కుమారి స్తోత్ర శ్లోకాలు

కుమారస్య చ తత్వాని యా సృజత్యపి లీలయా
కాదీనపి చ దేవాంస్తాన్కుమారీం పూజయామ్యహమ్
సత్యాదిభిస్తిమూర్తిర్యా తైర్వినానాస్వరూపిణీ
త్రికాలవ్యాపినీ శక్తిస్త్రిమూర్తిం పూజయామ్యహమ్
కల్యాణకారిణీ నిత్యం భక్తనాం పూజితాఅనిశమ్
పూజయామి చ తాం భక్త్యా కల్యాణీం సర్వకామదామ్
రోహయన్తీ చ బీజాని ప్రాగ్జన్మసఞ్చితాని వై
యా దేవీ సర్వభూతానాం రోహిణీం పూజయామ్యహమ్
కాళీ కాలయతే సర్వం బ్రహ్మాండం సచరాచరమ్
కల్పాన్తసమయేయా తాం కాళికాం పూజయామ్యహమ్
తాంచణ్డపాపహరిణీం చణ్డికాం పూజయామ్యహమ్
అకారణాత్సముత్పత్తిః ర్యన్మయైః పరికీర్తితా
యస్సాస్తాం సుఖదాం దేవీం శామ్భవీం పూజయామ్యహమ్
దుర్గా త్రాయతి భక్తం యాసదా దుర్గతినాశినీ
దుర్జేయా సర్వదేవానాం తాందుర్గాం పూజయామ్యహమ్
సుభద్రాణి చ భక్తానాం కురుతే పూజితా సదా
అభద్ర నాశినీం దేవీం సుభద్రాం పూజయామ్యహమ్

(3 స్కం) (26 అ 53-61)

ఎంతపాపియైనను నవరాత్ర వ్రత మాచరించినచో సకల పాపముల నుండి ఉద్ధరింపబడి శ్రేష్ఠుడగును.

సర్వే జనా స్సుఖినో భవంతు - ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

* * *

దేవీ భాగవతము

దేవీనవరాత్రులు - మూడవ రోజు కథ

1. నవరాత్రి ప్రసంగమున శ్రీరామ చరిత్ర

అయోధ్యరాజు దశరథుడు. అతనికి ముగ్గురు భార్యలు, కౌసల్యకు శ్రీరాముడు, కైకేయికి భరతుడు, సుమిత్రకు లక్ష్మణ, శత్రుఘ్నులు. విశ్వామిత్రుడు యజ్ఞమును రక్షించుటకు రామచంద్రుని పంపుమని దశరథుని అడుగగా వశిష్ఠుని సలహాపై రామునితో లక్ష్మణుని పంపుటకు దశరథుడు అంగీకరించెను.

రామలక్ష్మణులు మార్గమధ్యమున తాటకిని సంహరించిరి. యజ్ఞరక్షణ సమయమున సుబాహుని తునుమాడి మారీచుని సముద్రమున పడవేసిరి.

రాముడు అహల్యను శాప విముక్తురాలిని చేసెను. జనకుని ఇంట శివధనస్సును విరిచి తల్లిదండ్రుల అనుమతితో రాముడు జానకీదేవిని పరిణయ మాడెను. లక్ష్మణుడు ఊర్మిళను, భరత, శత్రుఘ్నులు కుశధ్వజుని కుమార్తెలను పెండ్లాడిరి.

రామునికి రాజ్యభారము అప్పగించుటకు దశరథుడు పట్టాభిషేకపు ఏర్పాట్లు చేసెను. కైకేయి దశరథుని ఎప్పుడో ఇచ్చిన వరములను రెండింటిని ఇపుడు తీర్చమని కోరెను అవి భరతునికి పట్టాభిషేకము, శ్రీరాముని పదునాలుగేండ్లు వనవాసమునకు పంపుమని కోరెను.

శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతుడై దండకారణ్యమునకు చేరెను. దశరథుడు దిగులుతో ప్రాణములను పరిత్యజించెను.

వనములకు వెళ్ళిన సీతారాములు లక్ష్మణునితో పంచవటిలో వున్న సమయమున శూర్పణఖను ముక్కు చెవులు కోసి లక్ష్మణుడు అవమానించెను.

ఖరదూషణాది దైత్యులతో శ్రీరామునకు సంగ్రామము జరిగినది. శూర్పణఖ అన్నయైన రావణునకు తన వృత్తాంతము తెలిపి సీతను అపహరించుమని ప్రోత్సహించెను.

రావణుడు మారీచుని హరిణముగా మారి సీతారాములను వంచింపుమని ఆదేశించెను.

మారీచుడు బంగారుజింకగా మారి సీత తిరుగాడు ప్రదేశములందు వారికి కనబడెను. సీత రామునితో ఈ బంగారు లేడినిగాని చర్మమును తెచ్చి ఇమ్మని కోరగా, రాముడు లక్ష్మణుని సీతకు రక్షణగా నిలిపి లేడివెంట పరుగెత్తెను.

రాముడు లేడిపై తీక్షణమైన బాణమును సంధించగా లేడి 'హా లక్ష్మణా, హా సీతా' అని బిగ్గరగా అరుస్తూ చనిపోయెను. సీత రామునికేదో ఆపద వాటిల్లినదని భావించి లక్ష్మణుని చూచి రమ్మని కోరెను. లక్ష్మణుడు 'నిన్ను ఒంటరిగా వదలి నేను వెళ్ళను' అని చెప్పగా సీత కఠోర వచనములు పలుకగా రామచంద్రుని వెదుకుటకు లక్ష్మణుడు వనము లోపలికి వెళ్ళెను.

అదే సమయమున రావణుడు భిక్షకుడుగా సీతతో 'భిక్షాం దేహి' అని పర్ణశాల ముందుకు వచ్చెను. సీత భిక్ష వేయుటకు రావణుని ముందుకు రాగా 'నేను రావణుడను నిన్ను పొందుటకు ఈ రూపమును ధరించితి ననెను.

అపుడు సీత రావణుని మాటలను తిరస్కరించగా రావణుడు సీతను బలవంతముగ పట్టుకొని రథముపై ఉంచి ముందుకు వెళ్ళగా జటాయువు రావణుని ఎదిరించెను. రావణుని చేతులతో జటాయువు యొక్క శక్తి సడలిపోయెను. లక్ష్మణుని చూచిన రాముడు సీతను వదలిపెట్టి నీవెందుకు వచ్చావు? అని కీడు శంకిస్తూ రామలక్ష్మణులు ఇరువురు పర్ణశాలకు వెళ్ళిరి.

అక్కడ సీత కనిపించకపోగా వెదుకుచూ పక్షిరాజైన జటాయువును చేరుకొని జటాయువు చెప్పిన మాటలువిని నిర్ఘాంతపోయిరి. కొద్దిసేపటి క్రితం రావణుని ద్వారా జనకనందన జానకీదేవి హరింపబడెను! అని రామునికీ వార్త అందించి అతని స్పర్శచే జటాయువు ప్రాణములు విడిచి పవిత్రుడయ్యెను. పక్షిరాజుకు అంత్యక్రియలు పూర్తిచేసి రామలక్ష్మణులు ముందుకు సాగగా త్రోవలో కబంధుడు ఎదురుపడగా అతనికి శాప విముక్తి చేసిరి.

హనుమంతుని సలహాతో సుగ్రీవునికి రామునికి మైత్రి ఏర్పడెను. కార్యసాధనను ఆశించి శ్రీరాముడు కిష్కింధకు సుగ్రీవుని రాజును చేయుటకు వాలిని చంపెను.

లక్ష్మణునితో రాముడు సౌమిత్రీ! నాకు రాజ్యము చేజారిపోయెను. వనవాస జీవితము గడుపవలసి వచ్చినది. తండ్రి స్వర్గస్థుడాయెను. భార్య అపహరింప బడెను. జానకి జీవితము దుర్మార్గుడైన రావణుని చేతిలో ముగిసిపోయినచో నేనెందుకు బ్రతకాలి? అని కుపితుడై విలపించసాగెను.

ఇంతలో ఆకాశమునుండి నారదుడు దిగివచ్చెను. శ్రీరాముడు లేచి మునీంద్రునకు పవిత్ర ఆసనముతో అర్ఘ్యపాద్యములు నేర్పాటు చేసెను.

నారదుడు రాఘవా! నీవు సామాన్య మానవునివలె దుఃఖించుచున్నావు. రావణుడు సీతను అపహరించెనని నాకు తెలుసును. ఆ రావణుని వధించుటయే నీ అవతారమునకు ప్రయోజనము.

జానకి పూర్వజన్మమునందు మునిపుత్రిక, రావణుడు ఆమెను చూచి భార్యవు కమ్మని బలవంతముగ లాగెను. అపుడు నీవు స్పృశించిన శరీరము అంతము చేసికొని నిన్ను సంహరించుటకు మరోజన్మలో అయోనిజగా జన్మింతును అని శరీరము వదలి పెట్టెను.

ఆమెయే ఈ సీతాదేవిగా ప్రకటితమయ్యెను. రావణుని వధించుకు దేవతలు శ్రీహరిని ప్రార్థించిరి. నీవు రఘుకులమునందు శ్రీహరి అంశతో జన్మించితివి. సీతాదేవి ఎవ్వరికి వశము కాదు.

దేవేంద్రుడు స్వయముగ కామధేనువు పాలను ఒక పాత్రలో ఉంచి సీతకు పంపి ఆకలి దప్పులు లేకుండా స్వయముగా చూసెను.

రావణవధకు ఆశ్వయుజమాసమున నవరాత్రి వ్రతమాచరించి సమాయత్తమగుము అని నారదుడు వివరించెను.

రాఘవా! విశ్వామిత్రుడు, భృగువు, వశిష్ఠుడు, కశ్యపుడు, యీ వ్రతమును అనుష్ఠించిరి. వృత్రాసురుని వధించుటకు ఇంద్రుడు, త్రిపురవధకు శంకరుడు కూడా ఈ వ్రతమును శ్రద్ధతో జరిపిరి. మధువను రాక్షసుని సంహరించుటకు శ్రీహరి కూడా యీ వ్రతమును చేసెను.

రాముడు నారదునితో ఆ దేవి ఎవరు? ఎచటనుండి అవతరించినదని సవివరంగా తెలుపుమని కోరెను. రామా! ఆ దేవి ఆద్యాశక్తి, ఆ జనని కృపవలన సకల కోరికలు సిద్ధించును. బ్రహ్మమొదలగు సమస్త ప్రాణులకు కారణము ఆ దేవియే. ఆ దేవిని అనంత నామములతో ఆరాధించెదరు.

రాముడు వ్రత విధానము తెలుపమని కోరగా శ్రీరామా! జగదంబికను ఆవాహనము చేయవలెను. తొమ్మిది రాత్రులు ఉపవాసము చేయుచూ ఆ దేవిని ఆరాధించవలెనని చెప్పెను.

రామచంద్రుడు భగవతి జగదంబ విగ్రహమును ప్రతిష్ఠింపచేసి దేవిని పూజించెను. అప్పటికి ఆశ్వయుజ మాసము కూడా వచ్చియుండెను. కిష్కింద పర్వతమున తొమ్మిది దినములు ఉపవాసముతో సుసంపన్నం చేసెను.

అష్టమి తిథియందు అర్ధరాత్రమున ఆదేవి ప్రత్యక్షమయ్యెను. ఆ దేవి గంభీర స్వరముతో ఇట్లు పలుక సాగెను.

రామా! నీవు చేసిన వ్రతమువలన నేను మిగుల సంతుష్మరాలయ్యాను. నారాయణుని అంశతో మను వంశమున నీవు ప్రకటితమైనావు. రావణ సంహారం నీవు పూనుకోవలసి వుంది.

దేవతలు ప్రార్థించగా మత్స్యావతారంతో రాక్షసుని సంహరించితివి. అప్పుడే నీవు వేదములు రక్షించితివి కచ్చపరూపమున మందరా చలమును వీపున ధరించితివి. సముద్రమును మధించి అమృతము ద్వారా దేవతలను శక్తి సంపన్నులను చేసితివి, వరాహ రూపమున ఈ భూమిని నీ దంష్ట్ర అగ్రభాగముతో లేవనెత్తితివి. హిరణ్యాక్షుని జీవనలీల సమాప్తమయ్యెను.

నృసింహ రూపమును ధరించి హిరణ్యకశిపుని వధించితివి. ప్రహ్లాదుని రక్షించితివి. వామనుడవై బలిని వంచించి, ఇంద్రుని కనిష్ఠ సోదరుడవై విరాజిల్లితివి. విష్ణ్వంశతో సంపన్నుడవై జమదగ్ని పుత్రుడవై క్షత్రియులను చంపి పృథివిని దానమొనరించితివి.

ఇపుడు దశరథ పుత్రుడవై పుట్టటం దేవతల కోరిక మేరకే జరిగింది. ఈ వానరులు దేవతాంశతో నీకు సహాయపడగలరు.

లక్ష్మణుడు శేషనాగుని అవతారము, రావణపుత్రుడైన మేఘనాధుని తప్పక వధించును. నీవు రావణుని వధించి రాజభోగములు అనుభవింపుము ధరాతలమునందు నీ రాజ్యము పదుకొండువేల సంవత్సరములు స్థిరమై యుండును. ఇట్లు పలికి దేవి అంతర్ధానమయ్యెను.

రాముడు విజయదశమి పూజను శ్రద్ధగా నిర్వహించి యుద్ధయాత్రకు బయలుదేరెను. సముద్రము మీద సేతువును నిర్మించెను. లంకకు చేరి రావణుని వధించి సీతను తీసుకొని అయోధ్యకు చేరెను.

ఈ నవరాత్ర ఉత్తమచరిత్ర వినిన వారికి సకల భోగానుభవములు కలిగి సంతోషించగలరు.

2. జనమేజయుని సందేహాలు – వ్యాసునిచే నివృత్తి

శ్రీహరి కారాగారంలో పుట్టుటకు కారణమేమి? దేవకీ వసుదేవులు కారాగారంలో ఉండటానికి కారణమేమి? బ్రాహ్మణుని శాపంతో యాదవ వంశం నశించిందా? గాంధారీశాపం వల్ల కృష్ణుని వంశం అంతరించిందా? భూ భారాన్ని తొలగించుటకు విష్ణువే కృష్ణుడుగా అవతారమెత్తాడా? పాండవులు కృష్ణుడు తోడుండగా అడవులపాలు కావటం, ద్రౌపది నిండు సభలో అవమాన పడటం, పాండవులు భీష్మ ద్రోణులను మోసంతో సంహరించటం సమంజసమేనా? నా తండ్రి పరీక్షిత్తు తాపసిని అవమానించటం ఎందుకు చేయవలసి వచ్చింది?

నాకు కలిగిన సందేహాలను తీర్చుము అని జనమేజయుడు, వ్యాసుని అడిగాడు. అప్పుడు వ్యాసుడు.

శ్లో॥ రాజన్ కి మేత ద్వక్తవ్యం కర్మణాంగహనో గతిః ।
దుర్జ్ఞేయా కిలదేవానాం మానవానాం చ కాకథా ॥ (4-2-2)

జనమేజయా! కర్మలు మూడు రకములు సంచితకర్మ, ప్రారబ్దకర్మ, ఆగామికర్మ, విష్ణువు కూడా గర్భవాసాలు చేశాడు. తపస్సువల్ల దాన ధర్మాదులతో మానవుడు ఉద్ధరింపబడుతున్నాడు.

రామావతారంలో వానరులు, కృష్ణావతారంలో యాదవులుగా దేవతలంతా స్వయంగా తోడైనారు. ఇపుడు కృష్ణావతార విశేషాలు వినునీకే సమాధానం దొరుకుతుంది.

3. కృష్ణావతార పవిత్రగాథ ప్రస్తావన

వసుదేవుడు కశ్యపముని యొక్క అంశమున జన్మించెను. కశ్యపునకు అదితి, సురస అను ఇరువురు భార్యలుండిరి. అదితి, సురసలే దేవకి, రోహిణి అను అక్క చెల్లెండ్ర రూపమున ప్రకటనమైరి. వాసుదేవుడు, దేవకి, రోహిణి అవతారముల కారణము తెలిపెదను వినుము.

కశ్యపుడు యజ్ఞము చేయదలచి వరుణుని దివ్య ధేనువును తీసికొని వచ్చెను. ఆ ధేనువును వరుణునికి తిరిగి కశ్యపుడు అప్పచెప్పలేదు.

అప్పుడు వరుణుడు కోపించి కశ్యపునితో "నీవును, నీ భార్యలిరువురు మానవ వంశమున జన్మించి గోపాలకులై జీవితము గడుపమని' శాపమిచ్చెను. బ్రహ్మ కూడా అలానే కశ్యపునికి, భార్యలిరువురికి యదుకులమున జన్మింపుమని శాపమిచ్చెను.

దక్షప్రజాపతికి దితి, అదితి అను కన్యలు కశ్యపునకు వారిరువురు భార్యలైరి. అదితికి ప్రతాపవంతుడైన ఇంద్రుడుదయించెను. దితి కశ్యపునితో ఇంద్రుడులాంటి పుత్రుడు తనకు కావలయునని కోరగా, దితిని వ్రతము పాటించమని ఆదేశించెను. దితి గర్భము ధరించగా అదితి ఇంద్రునితో పుత్రా! నీవు దితి గర్భమును విచ్ఛిన్నం చేయమని ప్రోత్సహించెను. ఇంద్రుడు పినతల్లియైన దితి వద్దకు వెళ్ళి సేవ చేతునని అక్కడ చేరెను.

దితి గాఢ నిద్రలో ఉండగా ఇంద్రుడు ఆమె ఉదరమును చేరి గర్భమును ఏడు భాగములుగా మళ్ళీ ఏడు ఏడు ముక్కలుగా ఖండించెను. వారు మరుత్తుల రూపంలో స్థిరపడిరి.

అప్పుడు దితి ఇంద్రుని నీవు రాజ్యభ్రష్టుడవగుదువని శపించెను. అదితితో నీకు జన్మించే బాలకులు జన్మించిన తోడనే పదేపదే మృత్యువాత పడుదురని ఒకరికొకరు శాపములిచ్చు కొనిరి. ఆ అదితియే ఇప్పుడు దేవకి అయ్యెను.

జనమేజయుడు ఇంద్రుడు చేయరాని పనులు చేసినచో ఇతరుల విషయము ఏమని చెప్పేది. బలిచక్రవర్తిని విష్ణువు కపటముతో వామనుడై మోసం చేశాడు కదా? ఇక్కడ విష్ణువు గెలిచాడా? బలిచక్రవర్తి గెలిచాడా? అనగా బలిచక్రవర్తి పృధివినంతా భగవంతునికి దానం చేసి విజయుడైనాడు.

త్రిగుణాత్మకమైన మాయ అనేక రూపములలో నుండును. ప్రాణులన్నిటి మీద మాయ ఆధిపత్యమును వహించును. పురుషుడు ఎల్లప్పుడు నేను, నేను అని పలుకు చుండును.

మానవుని దృష్టి సక్రమమైన పద్ధతిలో సంపాదించే ద్రవ్యము మీద ఉండవలెను. ధనమే ధార్మిక కార్యములందు శ్రేష్ఠముగ తలంచవలెను. ద్రోహముతో సంపాదించిన ధనముతో పుణ్యకార్యములు చేసినను అవి విపరీత ఫలములనే ఇచ్చును.

ఉత్తమకార్యమేది, నిషిద్ధమేది అను తారతమ్య మెరుగని వాడు స్వార్థపరుడగును. దేవతలు సత్వగుణముతో మానవులు రజోగుణముతో పశువులు తమో గుణముతో జన్మించెదరని వేదములు చెప్పుచున్నవి.

ఈ ప్రపంచమే అహంకారముతో జన్మించినది. ఎవరి మనస్సునందు ప్రసన్నత ఉండదు.

4. నరనారాయణులు – ఊర్వశి జననం

వ్యాసుడు జనమేజయునితో సాత్విక స్వభావము కొరకు సత్యయుగము, రాజసగుణము కలవారికి త్రేతాయుగము, తామసస్వభావము కలవారికి కలియుగము ఎప్పుడు ప్రత్యక్షములుగా ఉన్నవి.

ధర్ముడు ధర్మపాలనతో దక్షప్రజాపతి యొక్క పదిమంది కన్యలను వివాహమాడెను. అనేక పుత్రులను పొందెను. హరి, కృష్ణుడు, నరుడు, నారాయణుడు వారిపేర్లు – హరి, కృష్ణుడు నిరంతరము యోగాభ్యాసము చేయుచుండిరి. నరనారాయణులు బదరికాశ్రమమున తపస్సు ప్రారంభించిరి. వెయ్యి సంవత్సరములు కొనసాగెను.

ఇంద్రుడు నరనారాయణులపై ఈర్ష్యతో వారిని భయముతో ప్రలోభపెట్టెను. నారాయణులు జగదీశ్వరిని ఆరాధించుచున్నారు. దేవీ

ఉపాసకులకు ఎట్టి ఆటంకములు కలుగలేదు. వాగ్బీజము, కామబీజము, మాయాబీజము, ఆ దేవి యొక్క ప్రముఖ మంత్రములు.

ఇంద్రుడు కామదేవా! నీవు ఈ నరనారాయణులకు ఆటంకములు కలుగ జేయుమనెను. అపుడు కామదేవుడు "నేను అసమర్థుడను "క్లీం" అను మంత్రము ధ్యానించువారు నా శక్తికి అతీతులు" అని చెప్పి బదిరికాశ్రమము చేరుకొనెను.

రతీదేవితో పంచబాణములను సంధించెను. రంభ, తిలోత్తమలు కూడా అక్కడికి రాగా వారి నృత్యములతో నరనారాయణులకు సమాధి భంగము కలిగినది. అప్సరలు నరనారాయణులకు కనిపించిరి.

నారాయణుడు అప్సరసతో అతిథి సత్కారములు స్వీకరింపజేసి తన చేతితో తొడమీద కొట్టి ఊర్వశిని ఆవిర్భవింపచేసెను. అప్సరసలును మేము ఇంద్రుడు పంపగా ఆ స్వామి కార్యము నెరవేర్చు తలంపుతో ఇచటకు వచ్చితిమి. మేము అపరాధమును చేసితిమని శపించక వదలిపెట్టుమని కోరిరి.

అప్పుడు నారాయణుడు, వారితో ఊర్వశిని వెంట నిడుకొని స్వర్గమునకు వెళ్ళుడు. ఇంద్రుని సంతోషపెట్టుటకు ఇచ్చుచున్నాను అని చెప్పెను. మేము పదహారు వేలమంది అప్సరసలు మిమ్ము పూజించెదము అనగా, వెయ్యి సంవత్సరములు మేము తపమాచరించి ఎట్లు నష్టపరచుకొందుము అని దీర్ఘముగా ఆలోచించెను. నరుడు నారాయణునితో శాంతముగా ఉండవలెనని కోరెను. ప్రశాంతత పొందెను.

జనమేజయుడు మునివర్యా! నరనారాయణులు ప్రహ్లాదునకు సంగ్రామము ఎందుకు జరిగినదని అడుగగా హిరణ్యకశిపుని మరణముతో ప్రహ్లాదుడు పాతాళమున ప్రజలను పరిపాలించు రాజయ్యెను.

చ్యవనుడు భృగునందనుడు, నర్మదానదిలో దిగెను. విషసర్పము చ్యవనుని పట్టుకొనగా, అతడు విష్ణువును స్మరించెను. దానితో విషసర్పము విషమంతయు సమాప్తమయ్యెను. చ్యవనుడు దానవులు నివసించు ప్రదేశమున తిరుగుచుండగా ప్రహ్లాదుడు ఎదురుపడెను.

చ్యవనమునితో ప్రహ్లాదుడు భూమిమీద గల తీర్థములను గురించి తెలుపుమనెను. నైమిశారణ్యము, చక్రతీర్థము, పుష్కర తీర్థములను వివరించెను. ప్రహ్లాదుడు నైమిశారణ్యమునకు వెళ్ళుటకు నిర్ణయించుకొనెను. దైత్యులతో కలిసి తీర్థములన్నిటిని తిరుగుసాగెను. సరస్వతీనది మీద అతని దృష్టిపడెను.

ప్రహ్లాదునకు నరనారాయణులు అక్కడ ఎదురుపడిరి. మీరిరువురు తాపసులుగా ఉండి దనుర్బాణములను చేపట్టియున్నారు. ఇది ఏలా సాధ్యము అని ప్రహ్లాదుడు అడుగగా యుద్ధము, తపస్సు రెండింటియందు మాగమనమున్నది. అనగా ప్రహ్లాదుడు తపోధనులారా! మీ వద్ద అట్టి శక్తి ఏమి కలదు? సమరాంగణమున నాకు చూపుడు అని ధనుష్టంకారము గావించెను.

నరుడు ప్రహ్లాదునిపై బాణ వర్షములు కురిపించసాగెను. నరనారాయణులు ప్రహ్లాదునితో వెయ్యిసంవత్సరములు యుద్ధము చేసిరి. అపుడు విష్ణుభగవానుడు నరనారాయణుని ఆశ్రమమునకు రాగా "నేను ఈ తాపసులను జయింపలేకున్నాను" అని ప్రహ్లాదుడు విష్ణువుతో చెప్పెను.

విష్ణువు ప్రహ్లాదా! నరనారాయణులు నా అంశతో అవతరించిరి. నీవు వీరిని జయింపలేవు. నీవు అసురులను వెంట నిడుకొని మరలిపొమ్మని ఆదేశించెను. వెంటనే ప్రహ్లాదుడు వెళ్ళిపోగానే నరనారాయణులు తపస్సును ప్రారంభించిరి.

5. విష్ణువు శుక్రమాతను వధించుట

జనమేజయ మహారాజా! భృగుమహర్షి భగవంతుడగు విష్ణువును శపించుటకు కారణమయ్యెను. ప్రహ్లాదునకు ఇంద్రునకు వంద సంవత్సరములు పోరు జరుగుచుండెను. ప్రహ్లాదుడు ఓడిపోయెను. సనాతనధర్మము యొక్క వైశిష్ట్యము అతనికి అవగతమయ్యెను.

దైత్యులు రాజ్యభ్రష్టులయిరి. విష్ణువు వరాహరూపమును ధరించి హిరణ్యాక్షుని చంపెను. నరసింహావతారమున హిరణ్య కశిపుని సంహరించెను. శుక్రాచారి నేనిపుడు బృహస్పతి వద్దలేని మంత్రములను పొంది వస్తానని శంకరుని చేరెను.

శంకరుడు శుక్రాచారితో మిగుల కష్టమైన వ్రతము వెయ్యి సంవత్సరములు చేయవలెనని చెప్పగా శుక్రాచారి అందుకు అంగీకరించి వ్రత నిమగ్నుడయ్యెను. ఆ సమయమున దైత్యులంతా కపట తాపసుల వేషమును ధరించి ఉండిరి.

దానవులు శుక్రమాతను చేరి ఆదుకొమ్మని వేడుకొనిరి. శుక్రమాత ఇంద్రునితో సహా దేవతలనందరిని నిద్రాదేవి ఆవరించునట్లు చేసెను. ఇంద్రుడు విష్ణువుతో ప్రభూ! ఇప్పుడీ శుక్రమాతను అణచివేయుమని ప్రార్థింపగా భగవంతుడైన హరి చక్రాయుధము చేబూని శుక్రమాత తలను ఛేదించెను.

విష్ణువుతో భృగువు "నీవు ఆమెను వధించావు కదా! నీవు మర్త్య లోకమున అనేక అవతారములు ధరించెదవు గాక" అని శాపమిచ్చెను.

బృహస్పతి భార్య తలను మొండెముపై వుంచి "నేను సకల ధర్మములు తెలిసివుంటే ఈదేవి పునరుజ్జీవితురాలు అగుగాక" అని పలుకగా శుక్రమాత మృత శరీరమునందు ప్రాణములు తిరిగివచ్చెను.

ఇంద్రుడు శుక్రాచారి తపమును విఘ్నము చేయుటకు తన కుమార్తెయైన జయింతిని నియమించెను. జయంతి తండ్రిఆజ్ఞతో శుక్రాచారికి సేవలు చేసెను. శుక్రాచారి తపము వెయ్యి సంవత్సరములుకాగా శంకరుడు ప్రసన్నుడయ్యెను. శుక్రాచారితో నీవు కోరిన వరము ఇచ్చెదనని చెప్పి దేనిని నీవు పొందాలనుకొన్నావో నీవు వాటిని అన్నిటిని జయించగలవు. నిన్నెవరు సంహరింపరు అని చెప్పి శంకరుడు అంతర్ధానమయ్యెను.

శుక్రాచార్యుడు జయంతితో నాకు సపర్యలు చేయడంతో నేను ప్రసన్నత చెందాను, కావలసిన వరము కోరుకొమ్మనెను. జయంతి మునీంద్రా! నా తండ్రి నన్ను మీకు సమర్పించెను. పది సంవత్సరములు నాతో ఆనందమును అనుభవించమని కోరగా శుక్రాచారి ప్రాణిగ్రహణము చేసెను. పది సంవత్సరములు ముని జయంతితో గడుపగా దైత్యులవచ్చి చూసి తిరిగి వెళ్ళిపోయిరి. ఇంద్రుడు దైత్యులను వంచించమని బృహస్పతిని కోరగా, బృహస్పతి శుక్రాచార్యుని రూపముతో దైత్యులుతో చేరి వారిని తన వశము చేసుకొనెను. జయంతి వద్దనున్న శుక్రాచారి దైత్యుల వద్దకు తిరిగి రాగా తన వేషములోవున్న బృహస్పతిని చూచి అతను దేవతల గురువని దానవులకు చెప్పినా పట్టించుకోలేదు.

కోపంతో శుక్రాచారి దైత్యులతో మీరు ఓటమి పాలగుదురు అని చెప్పి వెళ్ళిపోయెను. బృహస్పతి ఇంద్రుని వద్దకు వెళ్ళి నీవు చెప్పిన కార్యము పూర్తి చేసితిని. ఇప్పుడు శుక్రాచారి కూడా దైత్యులను శాపగ్రస్థులను చేసెను, అని చెప్పి యుద్దసన్నాహముతో దైత్యులను ఓడించమని చెప్పెను.

దానవులందరు శుక్రాచారి వద్దకు వెళ్ళి తమ తప్పును మన్నించుమని మౌనముగా నిలుచుండిరి. ప్రహ్లాదుడు కూడా శుక్రాచారిని మమ్మనుగ్రహింపమని కోరగా జ్ఞానదృష్టితో తెలిసికొని శుక్రాచారి ప్రసన్నుడయ్యెను.

శుక్రాచారి ప్రహ్లాదా! నీవు ఇపుడు దేవతలతో ఓడిపోయినా సావర్ణి మన్వంతరమున మీకు రాజ్యము ప్రాప్తించును. నీ పౌత్రుడు బలి రాజ్యమును పాలించును. అపుడు విష్ణువు వామనరూపమును ధరించి బలిచేత రాజ్యము ధరాతలమంతా లాగుకొనును. ఇదంతయు సావర్ణిమన్వంతరమును జరుగును అనెను.

6. దేవ దానవుల యుద్ధము

ప్రహ్లాదుడు దానవుల వైపు అధ్యక్షత వహించగా ఇంద్రునకు, ప్రహ్లాదునకు వంద సంవత్సరముల వరకు సంగ్రామము కొనసాగుచుండెను. ప్రహ్లాదునిదే పై చేయిగా యుండెను.

దేవేంద్రుడు, బృహస్పతి ఆదేశానుసారం భగవతిని మనస్సులో ఆరాధించెను. దేవి! నీ హస్తములందు త్రిశూల, శంఖ, చక్ర, గదా, పద్మ, ఖడ్గాది ఆయుధములు విరాజమానములై యున్నవి. ప్రాణము, అగ్నిహోత్రములను రెండు మహాయజ్ఞములు నీ రూపములే అని దేవేంద్రుడు దేవిని స్తుతించెను.

సీ. జయజయ కళ్యాణి జయశూలధారిణి జయఖడ్గశంఖాబ్జ చక్రపాణి
దశతత్వరూపిణి దారిద్ర్యనాశని మాతర్మహాబిందు మహితమూర్తి
దర్శననాయికే తతభువనేశాని సచ్చిదానందిని సకలకర్తి
ప్రాణాగ్నిహోత్రమంత్ర ప్రకాశిని దేవి దీపశిఖాత్మికే దివ్యకుండ

తే.గీ. లిని మహాబిందురూపిణి వినుత పంచ
కోశమధ్యగతే హసాంకురవిలాస
ముఖి మహానందకలికే నమోస్తుతే య
టంచు బలుమారు మ్రొక్కి యనంతరమ్ము

సీ. భువనంబు లన్నియు బుట్టింప గిట్టింప నీవకా కెవ్వరు దేవదేవి
నీ మహత్వము నెన్న నేరరు బ్రహ్మయు నాదిత్యుడు శివుండు
నచ్యుతుండు

చంద్రుండు వరుణుండు శమనుండు పవనుండు
నిగమాగమములు ముని ప్రవరులు
తల్లి నిన్గొల్చిన ధన్యులు సంసారబంధవిముక్తులై పరగుచుండ్రు

తే.గీ. నిన్నుఁ గొలువని వారలు నిఖిలదుఃఖ
భాజనంబైన సంసృతి పాలగుదురు
నీదు శక్తికి బ్రతియొండు లేదు లేదు
మమ్ము గన్నమ్మ బంగారు బొమ్మవమ్మ ॥

ఈ విధంగా దేవేంద్రుడు స్తుతించగా సింహారూఢయు చతుర్భుజయు శంఖచక్ర గదా పద్మాద్యాయుధ ధారిణియు, అరుణలోచనయు, రక్తాంబర ధరయు విశ్వేశ్వరి ప్రకటితమైంది. అపుడు దానవులు భయపడి మేము పాతాళమున చేరెదము అని ప్రహ్లాదుని వేడుకొనగా ప్రహ్లాదుడు ఆ దేవిని స్తుతించుట.

కం. ఇష్టార్థధాత్రి దేవిన్ । సృష్టి స్థితిలయవి ధాత్రి జిన్మయమూర్తిన్
గష్టభయశోకనాశిని । విష్టపవందిని దలంతు వేడుకమీఱన్

సీ. సర్వంబు నీవయై జగమును గల్పింప జేత్రాడు సర్పంబు జేసినావు
సర్వంబు నీవయై జగములు గల్పింప గొందఱు కర్తలు గూర్చినావు
సర్వంబు నీవయై జగములు గల్పింప ఖేదము ల్మాయచే బెంచినావు
సర్వంబు నీవయై జగములు గల్పింప ద్రిగుణంబులకు బేరు తెచ్చినావు

తే.గీ. మేము నీ భక్తజనులము గామె తల్లి । దేవతల జూచినట్టి యా దృష్టితోడ
గనుగొనుగరాదె మమ్ముల గన్నయమ్మ । వీవకద బిడ్డలము మేము దేవదేవి

కం. వేడుక కై భేదంబులు వాడుక గావించితీవ వైరములంచుం
జోడించి సురల నసురుల నాడించెదు బొమ్మలాట యట్టులు తల్లీ!

తే.గీ. మొదలు జగములు బాలింప
మురవిరోధి నేర్పరిచినావు కావున నెల్ల సురలు

నసురులును గూడి మధియింప నబ్ధియందు
బుట్టు మహనీయవస్తువుల్ పట్టిశౌరి

దేవీ! నీవు దేవతల ఎడల దానవుల ఎడల సమభావముతో వ్యవహరించ వలెను. అంబికా! నీవు తప్ప ఇంకెవరును ఈ సృష్టియందు ఏకైక శాసకులు లేరు అని శరణు జొచ్చిరి.

శ్రీదేవీమాత దానవులతో మీరిప్పుడే పృథివిని వదలి పాతాళమునకు వెళ్ళుడు అనగానే ఆమె ఆజ్ఞను శిరసావహించిరి. దేవదానవులందరు వైరభావమును పరిత్యజించిరి. ఈ కథ వినువారు, ప్రవచించువారు, వ్రాయువారు గొప్ప భాగ్యశాలు రగుదురు. సకల దుఃఖములు తొలగిపోవును.

7. భగవంతుని అవతారములు

జనమేజయ మహారాజా! చాక్షుషమన్వంతరమున శ్రీహరి "ధర్మావతారము". ధర్ముని పుత్రులు. వారే ఇరువురు నరనారాయణులు. వైవస్వత మన్వంతరమున అత్రికి పుత్రుడై" "దత్తాత్రేయ అవతారము" దాల్చాడు. అత్రిపత్నియగు అనసూయ కోరికతో బ్రహ్మ చంద్రుని రూపంలో, శ్రీహరి దత్తాత్రేయ రూపంలో శంకరుడు దుర్వాసుడై అవతరించెను.

నాల్గవ చతుర్యుగమునందు "నృసింహఅవతారము" జరిగెను. హిరణ్యకశిపుని వధించెను.

వామన రూపమున బలిచక్రవర్తి రాజ్యమును హరించెను. త్రేతాయుగము నందు శ్రీహరి పరశురామావతారముతో క్షత్రియసంహారము చేసెను. అదే త్రేతాయుగమున రామావతారము జరిగెను.

ద్వాపరమునందు నరుడు అర్జునుడుగా, నారాయణుడు కృష్ణుడుగా అవతరించిరి. ప్రతియుగమునందు భగవంతుని అనేక అవతారములు జరుగుచుండును.

భగవతి ప్రకృతి ఆదేశానుసారము అనేక అవతారములు జరుగుచుండును. కల్పాంతమునందు సంహార మొనరించుట కూడా ఈ దేవి కార్యమే.

8. భూదేవి త్రిమూర్తులకు విన్నవించుట

ఒకానొక సమయమున పృథివి దుష్టుల భారముచేత అణగద్రొక్కబడెను. గోవు రూపమును ధరించి కనుల నీరుగార్చుచు స్వర్గమునకు చేరుకొనెను. ఇంద్రుడు వసుంధరా! నీకేమి కష్టము కలిగెను. అనగా భూదేవి! రాజుల దుశ్చర్యలను మోయలేకున్నాను. జరాసంధుడు మగధ దేశమును, శిశుపాలుడు చేది దేశమును కాశిరాజు, రుక్మి, కంసుడు, నరకాసురుడు, సాళ్వుడు, కేశి, ధేనుకాసురుడు, బకాసురుడు ధర్మమునకు విముఖులు.

దేవేంద్రా! ఇంతకు మునుపు కూడా నేను ఆపదలలో చిక్కుకొని ఉంటిని. శక్తిశాలియగు శ్రీహరివరాహావతారమున నన్ను ఉద్ధరించెను. హిరణ్యాక్షుడు నన్ను (భూమి) దొంగలించి అగాధ సముద్రమున పడవేసెను. సూకరరూపుతో విష్ణువు ఆ రాక్షసుని సంహరించెను. దురాచారములతో నిండిన రాజులను మోయుటకు నేను అసమర్థురాలను.

పృథివి ఇంద్రుని సలహాతో బ్రహ్మను, విష్ణువును స్తుతించసాగెను. అపుడు బ్రహ్మ విష్ణుదేవా! మీరు భూమండలమున అవతరించి దుష్టులైన రాజులను వధించి భూదేవి భారమును తగ్గించవలయునని నా మనవి అని కోరెను.

అప్పుడు విష్ణువు "నేను స్వతంత్రుడను కాను. ఈ సకల జగత్తు యోగ మాయ ఆధీనమున ఉన్నది" అని చెప్పగా దేవతలందరును భగవతి భువనేశ్వరిని మనస్సులలో ధ్యానించసాగిరి. స్మరించుట తోడనే భగవతి భువనేశ్వరి వారి ఎదుట ప్రత్యక్షమయ్యెను.

దేవతలు – దేవేశ్వరీ! శేషనాగుడు కూడ నీశక్తి లోపము కలిగినచో పృథివి మోయుటకు అసమర్థుడు. సరస్వతి, బ్రహ్మ, లక్ష్మి, విష్ణువు, ఉమ, రుద్రుడు, అందరియందు శక్తి రూపములో నీవే నిండియున్నావు.

శ్రీదేవి దేవతలతో నేను అవతరించుటకు ముందే కశ్యపుడు తన పత్నితో యదుకులమున జన్మించును. వసుదేవుడు అతని పుత్రుడుగా యశోద గర్భమున కృష్ణుడుగా అవతరించెదను కారాగారమున దేవకి వసుదేవులకు శేషుని దేవకి గర్భము నుండి లాగికొని రోహిణి ఉదరమున ప్రవేశింపచేయుట కూడా నా కర్తవ్యమేయగును. ఇంద్రుడు కూడా అర్జునుడై ధరాతలమునకు విచ్చేయును. ధర్మము యొక్క అంశతో యుధిష్ఠిరుడు, వాయువు అంశతో భీమసేనుడు, అశ్వని కుమారుల అంశతో నకుల సహదేవులు వసువుల అంశతో భీష్ముడు జన్మించును.

దేవతలందరు పత్నులతో కూడి విష్ణువుకు సహాయముగ మధుర, గోకులములందు జన్మించెదరు గాక, యోగమాయ యీ మాటలను పలికి అంతర్ధానమయ్యెను. భూదేవి యోగమాయ పలుకులతో శాంత చిత్తురాలయ్యెను.

9. శ్రీకృష్ణ బలరాములు

జనమేజయమహారాజా! విష్ణువు యదుకులమునందు అవతరించెను. యయాతి యొక్క వంశజుని పేరు శూరసేనుడు అతడు మధురా నగరమునకు రాజయ్యెను. శూరసేనుని పుత్రుడు వసుదేవుడు. ఉగ్రసేనుని పుత్రుడు కంసుడు, వరుణుడు అదితికి ఇచ్చిన శాపమువలన కశ్యపుని ధర్మపత్నియై ఈ జగత్తునకు వచ్చెను. దేవకుడు తన కుమార్తెయగు దేవకిని వసుదేవునకు ఇచ్చి వివాహము చేసెను. వసుదేవుడు దేవకిని స్వయంగా రథముపై తీసుకొని వెళ్ళు సమయమున ఆకాశవాణి కంసా! దేవకి అష్టమపుత్రుడు నిన్ను సంహరించును అని పలికెను.

కంసుడు దేవకిని తుదముట్టించినచో నాకు కీడు జరుగదు అని ఆలోచించి దేవకిని ఖడ్గముతో చంపపూనెను. అపుడు వసుదేవుడు దేవకికి పుట్టే బిడ్డలనందరిని నీకు అప్పజెపుతానని మాట ఇచ్చెను. ఆ మాటతో దేవకిని విడిచిపెట్టి కారాగారమున ఉంచెను.

దేవకి వసుదేవులు అన్యోన్యతతో ఒక పుత్రుడుదయించెను. అయితే వసుదేవుడు మాట ప్రకారం ఆ బిడ్డను కంసునికి అప్పగించగా కంసుడు వసుదేవుని ధైర్యము చూచి ఈ బాలుడు నాకు మృత్యువు కాదు. ఎనిమిదవ బాలకుడే నాకు మృత్యువు కనుక ఈ బాలుని తీసికొని వెళ్ళుము అని చెప్పెను.

కంసుడు ఇంటికి చేరుకోగానే నారదుడు వచ్చి కంసా! దేవతల మాయ నీకు తెలియదు. తెలిసి తెలిసి శత్రువును వదలిపెట్టావు అని చెప్పి తన దారిన వెళ్ళిపోయెను. కంసుడు బాలకులను తెప్పించుకొని రాతిమీద విసరి కొట్టెను. దేవకి గర్భమున జన్మించిన ఆరుగురు బాలకులు వధింపబడిరి.

ఏడవసారి శేషనాగుడు తన అంశతో దేవకి గర్భాన చేరెను. యోగమాయ బలవంతముగా ఆ గర్భమును తీసుకొని రోహిణి గర్భమునందు ప్రవేశపెట్టెను. దేవకి 5వ నెల గర్భములోనే గర్భస్రావమయ్యెను అని అందరికి, కంసునికి తెలిపిరి.

దేవకి గర్భమునందు భగవంతుడే అష్టమశిశువుగా ప్రకటమయ్యెను. బలరాముడుగా శేషుని అంశ, ఇంద్రుడు అర్జునుడై భూతలమునకు వచ్చెను. సూర్యుని అంశతో కర్ణుడు, విదురుడుగా యమధర్మరాజు అంశ, ద్రోణాచార్యుడు బృహస్పతి అంశ. అశ్వత్థామ రుద్రుని అంశ, సముద్రుడు శంతనుడయ్యెను. శంతనుని సతి గంగ.

దుర్యోధనుడు కలి యొక్క అంశ, శకుని ద్వాపరఅంశయని, దుష్ట ద్యుమ్నుడు అగ్ని అంశతో, శిఖండి రాక్షసఅంశతో, ప్రద్యుమ్నుడు

సనత్కుమారుని అంశ, ద్రుపదుడు వరుణునిఅంశ, భగవతి లక్ష్మిఅంశ ద్రౌపదియై, ద్రౌపది యొక్క కుమారులు విశ్వదేవుని అంశలు. సిద్ధి కుంతిగా, ధృతి మాద్రిగా, మతి గాంధారిగా ఈ భూమండలమున శోభను పెంపొందింప సాగిరి. శ్రీకృష్ణుని ధర్మపత్నులుగా స్వర్గమునందలి దివ్య రమణీమణులు ఇంద్రుని ప్రేరణతో రాజులు, రాక్షసులు జన్మించిరి.

హిరణ్యకశిపుని అంశతో శిశుపాలుడు, విప్రచిత్తి అంశతో జరాసంధుడును జన్మించిరి. ప్రహ్లాదుడు శల్యుడై అవతరించెను. కాలనేమి కంసుడయ్యెను. అరిష్టాసురుడు కువలయ పీడనమను ఏనుగుగా విఖ్యాతి గాంచెను.

బలిపుత్రిక పూతన అయ్యెను. ఆమె కనిష్ఠ సోదరుడు బకాసురుడయ్యెను. యముడు, రుద్రుడు, కాముడు, క్రోధుడు నాలుగు అంశలతో మహాబలశాలియైన అశ్వత్థామ జన్మించెను.

సీ. కలకల నవ్విరి చెలగి దేవతలెల్ల! మునులు చేతులుమోడ్చి మ్రొక్కులిడిరి
గుసగుసలాడిరి గూడి రాక్షసులెల్ల! దుష్టరాజుల కొంటి తుమ్ముదగిలె
బుసబుస నాకసంబునకెక్కె జలరాశి! కాంతిమించెను దిశాకాంతలకును
గడగడ వడకి ప్రక్కల దూరెఁగలిరాజు! శాకిని ముఖ పిశాచములు పరచె

గీ. దేవకీ వసుదేవు లుద్దీప్త లైరి। కంసుఁడనువాడు కన్నీళ్ళుగార్చి యేడ్చె
చారుతరమైన కృష్ణావతారవేళ। గుంభినీనాథ మానితాకుంఠ బోధ

నల్లని వెంట్రుకలతో బలరాముడు శ్వేతవర్ణుడై ప్రకటమైరి.

భగవదంశావతార ప్రసంగమును వినిన వారు సమస్త పాపముల నుండి విముక్తులగుదురని మనకు గట్టి నమ్మకం.

10. శ్రీకృష్ణుని చరిత్ర - సంక్షిప్తము

కంసుడు దేవకి యొక్క ఆరుగురు కుమారులను చంపివేసెను. పదవ మాసము శుభకరమైన శ్రావణముగా యుండెను. శ్రావణ శుక్లపక్షము

మొదలుకొని భాద్రపద అమావాస్య వరకు శ్రావణమని అంగీకరించువారి సిద్ధాంత కథనము ఇది. ఆ మాసమున కృష్ణపక్ష అష్టమీ తిథియందు రోహిణీ నక్షత్రము ప్రవేశించెను.

ఆకాశవాణి వసుదేవుని సంబోధించుచూ ఇట్లు పలికెను. వసుదేవా! నీవు యీ బాలకుని తీసుకొని వెంటనే గోకులమునకు వెళ్ళుము. ఈ బాలుని నీవు నందుని భవనమున వదలి అచట నుండి యోగమాయను తీసుకొనిరమ్ము అని చెప్పగా వసుదేవుడు సునాయాసముగా యమునను దాటెను. యశోద యోగమాయతో దివ్య రూపమును ధరించి ఆ దేవి పూర్ణ అంశతో వేంచేసియుండెను. సర్వేశ్వరి భగవతి స్వయముగా దాసీవేషమును ధరించియుండెను. ఆమె బాలిక నెత్తుకొని బయటకు వచ్చెను.

దేవకి శయ్యమీద ఆ బాలికను పరుండ బెట్టెను. కన్య ఏడుపుని విని కంసునికీవార్తను తెలిపిరి. వసుదేవుడు ఆ కన్యను కంసుని చేతులలో పెట్టెను. అతడాకన్యను రాతిమీద విసరికొట్టుటకు ఉద్యమించెను. అంతలోనే ఆ కన్య చేతినుండి జారి ఆకాశమునకు వెళ్ళిపోయెను.

ఓరీ! పాపీ! నన్ను చంపుట వలన నీకే ప్రయోజనము సిద్ధించును. నీ ప్రబల శత్రువైనవాడు జీవించి యున్నాడు. ఇట్లు పలికి కళ్యాణ స్వరూపిణియగు దేవి స్వేచ్ఛగా ఆకాశమునందు విరాజమానురాలయ్యెను.

కం. కంసా కులపాంసా నా
హింసవలన నేమి ఫలము హీనతరమహో
హంసుండు గలడు నీకున్
ధ్వంసకుడై వెట్టివాడ తరలుము వేగన్

కం. అని యంతర్హితయై చన
గని విస్మయమంది యపుడు కంసుడు గేహం

బునకుం జని వెఱపు వగపు
బెనుగొనగా దానవులను బిలిచి వచించెన్

బకాసురుడు, ధేనుకాసురుడు, వత్సాసురుడు మొదలుగాగల సకల దానవులను పిలిపించెను. వారితో ఇట్లు పలికెను. బాలుడు ఎక్కడ పుట్టినను చంపివేయుడు, పూతన, నందునింటకి వెళ్ళి కృష్ణుని చంపుటకు పాలిచ్చెదనని ఒడిలో తీసుకొనగానే ఆమె శరీరములోని రక్తమునంతయు త్రాగి ప్రాణములు తీసివేసెను.

కొంత కాలమునకు బకాసురుడు, వత్సాసురుడు, ధేనుకాసురుడు, ప్రలంబుడు శ్రీకృష్ణుని చేతిలో ఆహారమైరి. శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతమును చిటికెన వ్రేలుతో ఎత్తెను.

శ్రీకృష్ణ బలరాములను తీసికొని రమ్మని అక్రూరుని కంసుడు ఆదేశించెను. అక్రూరుడు మహద్భాగ్యంగా భావించి శ్రీకృష్ణ బలరాములను మధురకు రథముపై తీసుకొని వచ్చెను. కువలయాపీడనమను ఏనుగును. చాణూరముష్టికుల ప్రాణములను హరించెను. కంసుని వధించి తల్లిదండ్రులకు బంధముక్తులను గావించెను.

ఉగ్రసేనుని రాజ్య సింహాసనమున కూర్చుండబెట్టెను. సాందీపని ఆశ్రమమున శ్రీకృష్ణ బలరాములు సకల విద్యలను అభ్యసించిరి. జరాసంధుడు పదునేడుసార్లు మధురపై దండెత్తెను.

జరాసంధుని ఆగడములకు భయపడి సముద్రమునందుగాని, పర్వతములపైగాని తలదాచుకొనవలెనని యాదవులందరు భావించిరి. యాదవులందరు మధురను వదలి ద్వారకా నగరమును నిర్మించి నివసింపసాగిరి.

ఒకనాడు కాలయవనుడు కృష్ణుని తరుమసాగెను. అక్కడ ఒక గుహలో ముచుకుందుడు అను ముని నిదురించుచుండెను. శ్రీకృష్ణుడు వెంటనే

గుహలో దూరి అంతర్ధానము కాగా, నిదురించుచున్నది శ్రీకృష్ణుడేయని తలచి ముచుకుందుని కాలితో తన్నెను.

ముచుకుందుడు కండ్లు తెరవగానే ఎదురుగా వున్న కాలయవనుడు కాలి భస్మమాయెను. ముచుకుందునకు శ్రీకృష్ణుని దర్శన భాగ్యమయ్యెను.

రుక్మిణి స్వయంవరమున శిశుపాలునకు ఇచ్చి వివాహము చేయుటకు సన్నాహములు జరుగుచున్నవని తెలిసికొని శ్రీకృష్ణుడు రుక్మిణిని అపహరించి రాక్షస వివాహ పద్ధతిన పరిణయమాడెను.

జాంబవతిని, సత్యభామను, మిత్రవిందను, కాళిందిని, లక్ష్మణను, భద్రను, నాగ్నజితిని ఎనిమిదిమంది భార్యలను చేసికొనెను.

రుక్మిణిగర్భము నుండి ప్రద్యుమ్నుడు జన్మించెను. ప్రద్యుమ్నుని పురిటింటిలో నుండగానే శంబరాసురుడు అపహరించి తీసికొనిపోయెను.

శ్రీకృష్ణుడు వృత్రాసురాది దైత్యులను మట్టుబెట్టి భగవతిని శరణు జచ్చెను. భగవతితో మాతా! ఎవరో మాయావి నా కుమారుని అపహరించెను. జననీ! నీ చరిత్ర అత్యంత గుప్తము. దీనిని తెలిసికొనుటలో నేనును, అసమర్థుడనైతిని. అంబికా! ఇది నీవు రచించిన మాయయే. నేను పుత్రోత్సాహముతో ఉండగానే విరహబాధను నా తలమీద రుద్దితివి.

కృష్ణుడు భగవతిని స్తుతించుట

వసంత తిలక వృత్తము :

ధర్మాత్మజుండనయి తల్లి భజించి నిన్నుం
శర్మ ప్రదాత్రివని చాలగ నమ్మియుంటిన్
వర్మంబువోలె ననుబాలనజేసి తీవున్
గీర్మాత్రవేద్యవొ సుకీర్తి వెరుంగవే మున్
ఎవ్వాడు నీ మహిమ లెన్నగలండు నీకుం

దవ్వైన వానికిని దప్పక ముప్పుగల్గున్
అవ్వా కృపాకలితవై ననుఁబ్రోవ వమ్మా
యెవ్వారు నన్నిక భరింతురు చెప్పుమమ్మా
నీవె గదమ్మ భువి నింగి భుజంగ లోకం
బేవేళ గాచుచు నటించెద వంబరీతిన్
నీ విచ్చినావు సుతునిన్ సుఖమందు మంచున్
నీవె హరింపదగు నే కరుణించి యమ్మా!

శ్రీకృష్ణుడు భగవతిని స్తుతించగా ఆయన ఎదుట సాక్షాత్కారమయ్యెను. దేవేశ్వరా! శోకింపవలదు, ఇది పూర్వజన్మ శాపము. శంబరాసురుడు నీ కుమారుని అపహరించి తీసికొని వెళ్ళెను. పదహారు సంవత్సరములు నిండగనే నీ కుమారుడు శంబరాసురుని వధించి తిరిగి రాగలడు. ఇట్లు పలికి ప్రచండ పరాక్రమ సంపన్నురాలగు భగవతి చండిక అదృశ్యమయ్యెను.

11. శ్రీకృష్ణుడు శివుని తలచి తపము చేయుట

జనమేజయుడు వ్యాసునితో శ్రీకృష్ణునియందు సకల శక్తులు ఉన్నప్పటికి తన పుత్రుడు అపహరింపబడెను. శంబరాసురునికి ఈ శక్తి ఏలా సాధ్యమయిందని అడిగెను.

వ్యాసుడు రాజా! మాయయందు చాలా గుణములు మానవునికి ప్రవేశించును. ఆకలిదప్పులు, నిద్రాభయములు, అలసత్వము, శోకమోహములు, సంశయములు, సంతోషములు, అభిమానము, వృద్ధాప్యము, మృత్యువు, అజ్ఞానము, గ్లాని, వైరము, ఈర్ష్య, దంభము, దర్పము, మదము, శ్రమ, ఇవన్నియు దేహము వెంటనే ఉత్పన్నములగును.

జాంబవతి శ్రీకృష్ణునితో ప్రభూ! నాకు కూడా యోగ్యుడైన పుత్రుని ప్రసాదించుమని వేడుకొనెను. భగవంతుడు పుత్రాభిలాషియై తపస్సునకు పూనుకొనెను. శంకరుడు ప్రసన్నుడై సౌమ్యరూపమున దర్శనమొసగెను.

శ్రీకృష్ణా! నేను నీ ఉత్తమ తపస్సుచేత ప్రసన్నుడనైతిని, వరమును కోరుకొనుము నెరవేర్చెదను అనెను. శంకరుని చూచి దేవకీనందనుడు నంది వాహనుని స్తుతించెను.

సీ. శివుని భక్తుండయి చెలువొందు నుపమన్యు! గురువుగా నొనరించికొని సపర్య
లొనరించి పాశుపతోరుదీక్షంగొని మొండియై వెండియు దండియగుచు
నుగ్రతపంబు దా నొక మాసమున మంచి ఫలభక్షణముచేసి భక్తినిల్పి
శివమంత్రము జపించి చెలగుచు రెండవ నెల జలంబుల గ్రోలినియతి నేక
పాదంబుననె నిల్చి పరగ మూడవనెల గాలిని భక్షించి కాలవ్రేల
నిలచి నియమంబు సలిపిన నలరి శివుడు దేవతలతోడగూడి తా దివ్యదర్శ
నం బొసంగి యదూద్వహ నాకు దృప్తియయ్యె వాంఛితమెద్దియో
యడుగుమనిన

శంకరుడు శ్రీకృష్ణా! నీకు అనేకమంది పుత్రులు కలుగుదురు. పదహారు వేలమంది భార్యలు నీతో సుఖింతురు. వారికి పదేసి మంది పుత్రులు కలిగి బలవంతులగుదురు. పార్వతీదేవి శ్రీకృష్ణా! నీవు వంద సంవత్సరములు గడిపిన తరువాత బ్రాహ్మణ శాపము, గాంధారి శాపముతో నీ కులము అంతమొందును.

నీ పుత్రులు తమలో తాము పోట్లాడుకొని మరణించెదరు. నీవు బలరామునితో కలిసి పరమధామమును చేరుకొందువు, అని చెప్పి పార్వతి పరమేశ్వరులు అంతర్ధానమయిరి.

భగవతి భువనేశ్వరి శాసనము మాత్రమే అమలు జరుగును. మనము భగవతి చరణకమలములను నిరంతరము ధ్యానించు చుండవలెనని తెలిసికొన వలెను. ఈ పురాణము వినినవారు గొప్ప భాగ్యశాలురగుదురు.

12. మహిషాసుర వధ

జనమేజయుడు భగవతి యోగీశ్వరి చరిత్రను వివరింపుమని వ్యాసుని అడుగగా ధరాతలమున మహిషాసురుడు అను రాజు ఉండెను.

మహిషాసురుడు సుమేరుపర్వతమునకు వెళ్ళి అతడు తపమాచరించెను. పదివేల సంవత్సరముల తపస్సునకు బ్రహ్మ ప్రసన్నత చెంది నీ మనోరథమును సంపూర్ణ మొనరించుటకు వరము కోరుకొనుమనెను.

బ్రహ్మదేవునితో మహిషాసురుడు నాకు అమరత్వము ప్రసాదించి మృత్యు భయము కలుగకుండ వరమును కోరుతున్నాను. దేవతలు, దైత్యులు, మానవులు వీరెవరితోనూ నాకు మృత్యువు సంభవింపరాదు. స్త్రీ చేతులలో నేను మరణించునట్లు వరమును ప్రసాదింపుడు. స్త్రీ అబలయగును. ఆమె నన్నెట్లు చంపును అని కోరగా బ్రహ్మ తాను కోరిన వరమునొసగి బ్రహ్మ సత్యలోకమునకు వెళ్ళెను.

రాజా! దనువుకు జగత్ప్రసిద్ధులగు ఇరువురు పుత్రులుండిరి. వారు రంభ కరంభులను పేర్లుగలవారు. వారివురు సంతానముకోసం కరంభుడు జలములో మునిగి దుష్కర తపము చేయగా, రంభుడు ప్రశస్తమైన పాలు గలిగిన వటవృక్షము క్రిందకు వెళ్ళి తపము ప్రారంభించెను. దైత్యుల తపమును గమనించి ఇంద్రుడు పంచనదమును చేరుకొనెను. మొసలి వేషమును ధరించెను. కరంభుని కాలు పట్టుకొనెను. కరంభుని జీవనశైలి ముగిసిపోయెను.

కరంభుని మరణ వార్త విని రంభుడు క్రోధముతో తన మస్తకమును అగ్నికి కానుకగా సమర్పించవలయునని అతని మనస్సులో కోరిక కలిగెను.

దక్షిణ హస్తమునందు పదునైన కరవాలమును పట్టుకొని తన శిరస్సును ఖండించుకొనుటకు ఉద్యుక్తుడయ్యెను. అప్పుడు అగ్నిదేవుడు ప్రకటితమై ఈ నీచ కార్యమును మానుము. నీకు శుభమగును. నీకొక వరమునిస్తాను. నీ మనస్సులో ఉన్న దానిని అడుగుము అనగా రంభుడు దేవేశా! మీరు ప్రసన్నులైనచో నాకిష్టమైన వరమును ప్రసాదింపుడు. నేను మూడు లోకములను జయించు పుత్రుని కోరుచున్నాను. అతనిని ఎవ్వరూ ఓడించలేకుండురుగాక! అని కోరెను.

అగ్నిదేవుడు రంభునితో నీ కోరిక నెరవేరును గాక! నీకు ఏ భార్యయందు మనసు నిలుచునో ఆమెకు పరాక్రమవంతుడగు పుత్రుడు జన్మించును.

రంభుడుండు స్థలములో పశుభావముగల రాక్షసులుండిరి. రంభునికి కామ భావముతో ఒక మహిషి (గేదె) మీదపడెను. అతని వీర్యముతో ఆ మహిషి గర్భవతి అయ్యెను. ఇంకొక మహిషము ఈ మహిషి మీద విరుచుకుపడెను. ఆ మహిషమును చంపుటకు రంభుడు దానిమీదికి ఉరికెను.

అది తన పదునైన కొమ్ములతో రంభుని గుండెను గట్టిగా పొడిచెను. ఆ దానవుడు మూర్ఛితుడై భూమి మీదపడి అసువులను బాసెను. రంభుడు మరణించగా ఆ మహిషిని రక్షించుటకు యక్షులు మహిషము నెదిరించిరి. ఆ మహిషము నేలకూలెను. యక్షులకు ప్రియమైనవాడు రంభుడు కనుక అతని శవము దహనముచేయగా భర్తతో సతినయ్యెదనని మండుచున్న మహిషి చితియందు ప్రవేశించెను.

మహిషి భర్తయైన రంభుని (భర్తను) హృదయమునకు హత్తుకొనగా ఆ చితి మధ్య నుండి మహాబలవంతుడైన మహిషాసురుడు ప్రాదుర్భవించెను.

రంభుడు కూడా రెండవ శరీరమును ధరించి రక్తబీజుని రూపములో చితి నుండి వెలువడెను. రక్తబీజుడు, మహిషాసురుడు మహాబలవంతులుగా రంభుని నుండి ఆవిర్భవించిరి.

మహిషాసురుడు ఇప్పుడు దేవతలకును, దానవులకును, మానవులకును అవధ్యుడు. సకల పృథివిని అతడు తన బాహుబలముతో జయించెను. అతనిది ఏకచ్ఛత్రాధిపత్యమైన రాజ్యము. అతని సైన్యాధ్యక్షుని పేరు చిక్షురుడు. కోశాధ్యక్షుడు తామ్రుడు.

బ్రాహ్మణులు కూడా మహిషాసురుని ఆధిపత్యమును స్వీకరించింది. వరగర్వితుడై అభిమానమదమున అతడు స్వర్గమును జయించుటకు నిశ్చయించు కొనెను.

మహిషాసురుడు ఇంద్రుని వద్దకు దూతను పంపి ఇంద్రుని సేవకునిగా ఉండి వెళ్లుమని ఆదేశించెను. ఇంద్రుడు దూతతో మహిషాసురుని మదమణిచెదనని చెప్పెను.

దూత మాటలను విన్న మహిషాసురుడు దైత్యులతో దేవేంద్రుడు యుద్ధము చేయగోరుతున్నాడు. సమరాంగణమున విష్ణువు, ఇంద్రుడు, శంకరుడు నన్నెదిరించలేరు. వరుణుడు, యముడు, కుబేరుడు, అగ్ని, సూర్యచంద్రులు అందరును నాచే పరాజితులగుదురు.

దానవులారా! సకల దేవతలను జయించుటకు నేనొక్కడనే చాలుదును. నా గౌరవప్రతిష్ఠలు కాపాడుటకు అందరిని దేవాసుర సంగ్రామమున భాగస్వాములుగా ఉండమని కోరుతున్నాను. నా కొమ్ములతో దేవతలను హత మార్చెదను.

నేను చేయు యుద్ధఫలితముగా పారిజాతపుష్ప పరిమళములు, కామధేనువు పాలు, అమృతమునుగ్రోలి మీరందరు ఆనందమునను భవింతురు.

మనకు ఆప్తుడు శుక్రాచారిని పిలిచి ఈ యజ్ఞమునకు ఆచార్యునిగా నియమించవలెను అని ఆజ్ఞాపించెను.

అక్కడ దేవేంద్రుడు బృహస్పతిని పిలిచి మహిషాసురుని యుద్ధ ప్రయత్నములు వివరించి కర్తవ్య నిర్దేశము చేయమని కోరెను.

బృహస్పతి దేవరాజా! ప్రారబ్ధకర్మలు అనుభవించకుండ తొలగిపోవు అనేది స్పష్టము. ఈ సమయమున యోగ్యులైన మంత్రులతో

సంప్రదించుము అనగా ఇంద్రుడు నేనిపుడు మహిషాసురునిపై యుద్ధము చేయుటకు సిద్దమై యున్నాను అనెను.

బృహస్పతి దేవేంద్రా! ఇప్పుడు నిన్ను నేను యుద్ధమునకు వెళ్ళమని ప్రేరేపించనూ లేను, ఆపనూ లేను. అనగా ఇంద్రుడు బృహస్పతి చెప్పకనే సార గర్భితములైన సత్యవచనములను వినెను. బ్రహ్మను చేరి నాకు ఉ పాయము చెప్పమని అభ్యర్థించెను.

బ్రహ్మ ఇంద్రునితో విష్ణువు, శంకరులతో సంప్రదించి నిర్ణయించెదమని కైలాసమునకు ఆ తరువాత విష్ణులోకమునకు వెళ్ళి శ్రీహరి భగవానుని స్తుతించిరి.

విష్ణువు అచటనున్న బ్రహ్మాది దేవతలతో "మనకు మహిషాసురునితో భయంకరమైన యుద్ధము జరుగవలెను. దానిలో ఆ దానవుని వధింపవలెను" అని పలికెను.

హంస వాహనంపై బ్రహ్మ, వృషభ వాహనంపై శంకరుడు, గరుడ వాహనంపై విష్ణువు, ఐరావతముపై ఇంద్రుడు, నెమలి వాహనుడై కార్తికేయుడు, యమధర్మరాజు మహిషమును అధిరోహించి దానవసేనను ఎదిరించిరి.

సేనాధిపతి చిక్షురునికి ఇంద్రునికి జరిగిన పోరులో చిక్షురుడు మూర్ఛిల్లెను. మహిషాసురుడు బిడాలుని ఇంద్రునిపైకి పంపగా వారి యుద్ధములో బిడాలుడు డస్సిపోయి వెళ్ళిపోగా దేవతల సైన్యము విజయ ఘోషతో నిండిపోయెను.

తామ్రుడు సమరాంగణమున దేవతలతో పోరుకు దిగెను. యమరాజు విసిరిన దండముతో మూర్ఛితుడయ్యెను. మహిషాసురుడు ఇంద్రుని సమీపించెను. ఇంద్రుడు తన వజ్రాయుధముతో ఆ దానవుని గదను ఖండించెను. సకల జగత్తును నాశనమొనరించు శక్తిగల శంబరాసురుడు

మాయను సృష్టించెను. ఇంద్రునకు, వరుణునికి, కుబేరునకు, యమునకు, అగ్ని, సూర్యచంద్రుల మనస్సులు భీతిచెందెను.

మోహమును కలిగించు ఆసురీమాయను విష్ణు భగవానుడు చూచి సుదర్శన చక్రము దాని మీద ప్రయోగించెను. అప్పుడా మాయా రచన పటా పంచలయ్యెను.

వరుణుడు ఇంద్రునకు సహాయముగా నిలువగా అగ్నిదేవుడు, చంద్రుడు, సూర్యుడు ఒక్కసారిగా వచ్చి మహిషాసురునిపై దూకగా అతను దేవతలను గాయపరుచు చుండెను.

దేవేంద్రుడు భయపడి పరుగిడిపోగా వరుణుడు, కుబేరుడు, యమ ధర్మరాజు, చలించిపోగా మహిషాసురుడు ధైర్యముతో స్వర్గము మీద దాడి జరిపి నూరు సంవత్సరములు యుద్ధము చేసి ఇంద్రపదవిని చేజిక్కించుకొనుటలో సఫలత నొందెను.

దేవతలు స్వర్గమును వదలిపెట్టి బ్రహ్మను శరణుజొచ్చిరి. బ్రహ్మ వారితో శంకరుని, విష్ణువును సంప్రదించెదము అని వారికడకు వెళ్ళిరి.

మహిషాసురుని పురుషులు వధింపలేరు. స్త్రీ మాత్రమే చంపగలదు. అనగా శంకరుడు బ్రహ్మదేవా! మీరే కదా! అతనికి వరమిచ్చి ఉన్నారు. మనమిపుడు వైకుంఠం చేరి విష్ణువును శరణు వేడుదుము అని అక్కడికి చేరి శ్రీకృష్ణా! దేవతలను ఉద్ధరించుటకు మీరే సమర్థులు. పార్వతి, లక్ష్మి, శచీదేవి వీరిలో ఎవరు సమర్థులు అని ఆలోచించవలసి ఉన్నది.

విష్ణుభగవానుడు దేవతలతో ఇప్పుడు యోగ్యురాలైన ఒకానొక దేవి ప్రకటితము కావలెను. సంపూర్ణతేజస్సుతో బలసంపన్నురాలై ఆ దేవి రకరకములైన ఆయుధములను గైకొని ఆ దురాచారి మదోన్మత్తుడు నీచుడైన రాక్షసుని తప్పక సంహరించును అని చెప్పి విష్ణువు మౌనము వహించెను.

బ్రహ్మదేవుని శరీరము నుండి అద్భుతమైన తేజఃపుంజము, శంకరుని నుండి తేజస్సు, విష్ణువు నుండి తేజస్సు, ఇంద్రుని నుండి తేజస్సు, వరుణ, కుబేర, యమధర్మరాజు, అగ్నిదేవుల తనువుల నుండి, ఇతర దేవతల తేజస్సు ఒకటిగా అందరునూ చూచుచుండగనే పరమ సౌందర్యవతి స్త్రీగా పరిణతమయ్యెను. ఆమెలో సత్వ, రజ, స్తమోగుణములు విద్యమానములై యుండెను.

సకలదేవతల తేజస్సులతో పదునెనిమిది భుజములతో విరాజిల్లు చుండెను. అంతేకాదు అవసరమును బట్టి వెయ్యి భుజములతో వెలుగొందుచుండును.

త్రిగుణయు, త్రివర్ణయు, విశ్వమోహినియు, శ్వేతాననయు, కృష్ణనేత్రయు, రక్తోదరయు, తామ్రపాణియు, దివ్యభూషణ భూషితయు, సహస్రకరయు, అష్టాదశ భుజములతో యమ్మహా దేవి రూపంబు ఒప్పారెను.

సీ. మంచిచెందిరికావి మడుగులు రెండిచ్చె । వేడుక తా పాలవెల్లి రేడు
నిగనిగల్ చకచకల్ ధగధగల్ గొలిపెడి। చూడామణి నొసంగె సూర్యుడెలమి
కంకణంబులు దుద్దుగవ కంటె రతనాల । బేసరి యిచ్చెను విశ్వకర్మ
కుంకుణుకుణి నినాదాంకిత కింకిణీ। కసఖంబులగు నందె లొసగె ద్రష్ట

గీ. ముద్దుటుంగరములు మంచిముత్తెసరులు ।
వైజయంతి జలజమాల వరుణు డిచ్చె ॥
పుష్యరాగంబులును గెంపు పొడులు రవలు ।
సమదసింహంబునొసగెను జందమామ

కం. ఈగతి నొసగిన సొమ్ముల
బాగుగ ధరియించి దేవి భాసిల్లెను బ్రో
ద్యోగినియై సింగముపై
రాగలడే యెదుటి కొక్క రాక్షసుడనుచున్

సీ. చక్రంబులోనుండి చక్రంబు నొకదానిc । దివిచి దేవికి విష్ణుదేవు డిచ్చె
శూలంబులోనుండి శూలంబు నొకదాని । దివిచి దేవికి మహదేవు డిచ్చె
వజ్రంబులో నుండి వజ్రంబు నొకదాని । దివిచి దేవికి సురాధీశుడిచ్చె
దండంబులో నుండి దండంబు నొకదాని । దివిచి దేవికి ధర్మదేవుడిచ్చె

వరుణుడు దరంబొసగె శక్తి జ్వలును డిచ్చె
విల్లు వాయువొసగె జెంబు విధి యొసంగె
పాశఖడ్గ పరశుపాన పాత్ర గదల
దేవతలొసంగి రా మహాదేవి కపుడు

బృందారకుల దేవీ స్తుతి

గీ. పరమ కళ్యాణి రుద్రాణి భద్రమూర్తి
భగవతీ దేవి యీశాని పరమసాధ్వి
కాళరాత్రి మహాదేవి కాళి శక్తి
మ్రొక్కెదము నీకు త్రైలోక్యమోహనాంగి

గీ. పుష్టిమతి ధృతి గతి సిద్ధి బుద్ధియంబ
నిత్య నిరుపమ నిరవద్య సత్యవాచ
వైష్ణవి భవాని వాణి శర్వాణి తల్లి
మ్రొక్కెదము నీకుత్రైలోక్య మోహనాంగి

గీ. మాయలోనన యుండియు మాయచేత
నెఱుగబడనట్టి దేవికి నిందు నందు
ననక యెల్లెడనున్న మా యమ్మ కిపుడు
మ్రొక్కెదము నీకు త్రైలోక్య మోహనాంగి

గీ. మాకు శుభమమ్ము రక్షించుమమ్మ నిన్ను
నమ్మియున్నాము మాయమ్మ యమ్మలమ్మ
సమ్మదమ్మున నా యోధనమ్మునందు
నెమ్మి మహిషాసురేంద్రు జయించుమమ్మ

గీ. దున్నపోతుసోకు దొలగించవమ్మ వా
డార్తికరుడు దేవతాళికెల్ల
ఖలుఁడు నారిచేతగాని హతుడుగాడు
దేవి నీవ దిక్కు దేవతలకు (మ.క.దా శ్రీ)

దేవి దేవతలతో సమరాంగణమున మహిషాసురుని వధించెదనని బిగ్గరగా నవ్వెను. ఆ దేవి అట్టహాసముగా గర్జించెను. మహిషాసురుడు ఆ ధ్వనిని విని ఆ విశిష్టధ్వని చేయువానిని తీసుకొని రండు, అంతమొందించెదను అని దూతలను ఆజ్ఞాపించెను.

మహిషాసురుని ఆదేశముతో దూతలు జగదంబ వద్దకు వచ్చిరి. ఆ దేవి రూపము చూచి దూతలు భీతిల్లిరి. మహిషాసురుని చెంతకుచేరి ఆ దేవి సింహముపై మధుపానముతో సకల ఆయుధములను ధరించి, అవివాహితగా కనుపించు చున్నది. అద్భుత రసము నొలికించు ఆ సుందర స్త్రీ భయంకరముగ కన్పట్టుచున్నది. మేము ఆమెతో మాట్లాడకనే తిరిగి వచ్చితిమి.

మహిషాసురుడు ప్రధానమంత్రితో సామదాన బేధముల నుపయోగించి ఆ సుందరిని నా వద్దకు తీసుకొనిరండు, నేను సంతోషముతో పట్టమహిషిని చేసుకొందును.

మహిషాసురుని ప్రధానమంత్రి గజ, రథ తురగదళములతో బయలుదేరి మనస్విని భగవతి చెంతకు వెళ్ళి దూరము నుండి మా ప్రభువుకు బ్రహ్మదేవుని వరమున్నది. వారిని కలియుటకు నీవు వచ్చెదవా? వారినే ఇచటకు తీసుకొని వచ్చెదను సుందరీ ఆజ్ఞాపింపుడు అని పలికెను.

మంత్రివర్యా! నేను దేవతల జనని, నా పేరు మహాలక్ష్మి. మహిషాసురుని సంహరించుటకు నన్ను సకల దేవతలు ప్రార్థించిరి. నేను ఆ ప్రయత్నమునందే లగ్నమైయున్నాను. అనగా ఆ మహిషాసురుని

ప్రధానమంత్రి దేవీ! నీవు ఒంటరి దానవు, యౌవ్వన దశయందు అడుగిడు చున్నావు. నిన్ను యుద్ధమునందు అంత మొందించుటకు ఎక్కువ సమయము పట్టదు. నీయందు శ్రద్ధ చూపుతున్నాడు, మహిషాసురునికి పట్టపురాణివి కమ్ము అని పలికెను.

దేవి వానితో మూర్ఖా! నేను స్త్రీ స్వభావము కలదానినిగా భావించావు. మీరు నాతో యుద్ధమొనరింపుము అనెను. మంత్రి యీ వనితతో యుద్ధమొనరించుట అనుచితము అని తిరిగి వెళ్ళి మహారాజుతో దేవి చెప్పిన మాటలను అట్లే విన్నవించెను. ప్రభూ! ఆ స్త్రీ అపార అభిమాన బలమద గర్వితయై యున్నది. మనమిప్పుడు పారిపోవడమో, యుద్ధము చేయడమో నిర్ణయించవలసి యున్నది.

మహిషాసురుడు వృద్ధులైన మంత్రులను రావించి కింకర్తవ్యము తెలుపమనగా విరూపాక్షుడు నేను ఒంటరిగానే వెళ్ళి ఆ చండీశ్వరిని అంత మొందించెదను అనగా దుర్ధనుడు ఆ మాటను సమర్థించెను.

తామ్రుడు మాత్రము రాజా! ఆ దేవి రూపము కూడా మిగుల విలక్షణమైనది. పదునెనిమిది భుజములుగల స్త్రీని ముల్లోకములందు ఎవ్వరునూ చూడలేదు. ప్రతికూల ఘటనలు వాటిల్లునని నానమ్మకము, నేను అనిష్టకరమగు స్వప్నమును చూచితిని. యమ రాజిక్కడ బసచేయు చున్నాడని నాకు తెలియచున్నది. ఇంటి ప్రాంగణమునందు నలుపురంగు చీరను ధరించిన ఒకానొక స్త్రీ విలపించు చుండెను. ఏమైననూ యుద్ధము చేయుటయే సముచితము.

తామ్రుని మనస్సు మృత్యువు కూడా దగ్గరవుతుందేమో అనే కలవరపాటు ఐనా ముందుకు సాగగానే భగవతిని చూచెను. ఆమెతో మహిషాసురుడు నిన్ను వివాహమాడవలెనని తహతహలాడు చున్నాడు. నీవు నీ భర్తగా వరింపుము అనెను.

భగవతి తామ్రునితో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులనే భర్తగా స్వీకరించను. పశువుగా వున్న మహిషాసురుని వరింతునా? అని భగవతి గొప్ప గర్జన కావించెను. ఆ శబ్దమును విని తామ్రుని మనస్సు భయముతో నిండిపోయెను. సింహము కూడా భయంకరముగా గర్జించెను. ఆ భైరవ నాదముతో దైత్యుల రోమములందు భయము నిండిపోయెను. మంత్రిమండలి హితకరమైన అభిప్రాయము చెప్పండి, ఈ యువతి యుద్ధమునకు పదేపదే మనలను ఆహ్వానించు చున్నది.

పిరికివారే దైవము నాశ్రయించెదరు. శక్తి శాలురగు పురుషులు ఆ దైవమును గురించి ఆలోచించరు. మనము యుద్ధము చేయుటయే ప్రస్తుత కర్తవ్యము విజయమో వీరస్వర్గమో ఈ రెండే జరుగును అని చెప్పిరి.

బాష్కల, దుర్ముఖ దైత్యులు దేవిమీద బాణవర్షము కురిపించ సాగిరి. బాష్కలుని ప్రాణము లెగిరిపోవునట్లు చేసెను. దుర్ముఖుడు యుద్ధమునకు రాగా వాని తలను ఖండించి మొండెము నుండి వేరు చేసెను. చిక్షురాఖ్యుడు దేవితో తలపడగా తామ్రాక్షుడు కూడా తనకుతోడయ్యెను. ఇరువురును ఒకేసారి నిహతులైరి.

మహిషాసురుడు వెంటనే అసిలోముడు, బిడాలాక్షుడు అనే దైత్యులను దేవిపైకి పంపెను. దేవి పదునైన మూడు బాణములతో బిడాలాక్షుని శాశ్వతముగా నిదురింప చేసెను. అసిలోముని తల తెగనరకెను.

చివరికి మహిషాసురుడే నేరుగా దేవి దగ్గరకు వెళ్ళదలచి అందమైన పురుష రూపమును ధరించి నన్ను చూచిన వెంటనే ఆమె హృదయములో ప్రేమ ఉదయించును అని తలచి దేవీ! నీ రూపము నా మనస్సును మోహింపచేయు చున్నది, నన్ను కరుణించి నీ వానిగా చేసుకొనుము అని పలికెను.

దేవి ఆ దైత్యునితో పరమాత్ముడు తప్ప అన్యులు ఎవరూ నాకు ఇష్టులు కారు. మూర్ఖుడా! నీ బుద్ధి నీచమైనది. కేవలము స్త్రీని సేవించుటకై

ఇంత ఆతురత ఎందుకు పొందుచున్నావు. జీవించవలెనన్న కోరిక ఉన్నచో పాతాళమునకు వెళ్ళిపొమ్ము. మరణించుటయే అభీష్టమైనచో మిగుల ఆనందముతో యుద్ధమొనరింపుము.

మహిషాసురుడు దేవితో సుందరీ! నీకు అభిమతము ఐనచో నాకు సహధర్మచారిణివై నా సేవయందు ఆసక్తురాలు గావడం ఉచితము. విష్ణువు లక్ష్మితో, బ్రహ్మ సావిత్రితో, శంకరుడు పార్వతితో ఇంద్రుడు శచీదేవితో ఉండియే సుశోభితులగు చున్నారు. నీవు నావంటి శ్రేష్ముడైన భర్తను తిరస్కరిస్తున్నావు. పూర్వము మండోదరి మూర్ఖునకు భార్యకావలసివచ్చెను. ఆ గతియే నీకును పట్టగలదు. అనగా దేవి ఆ కథను చెప్పవలసినదని కోరెను.

సింహళదేశమను ప్రసిద్ధ నగరమునకు చంద్రసేనుడు మహారాజు. అతని ఇల్లాలు గుణవతి. వారిరువురికి ఒక కన్య జన్మించెను. ఆ బాలికకు మండోదరియని పేరిడిరి. వివాహ వయసు వచ్చు సమయము గమనించి తండ్రి వరుని అన్వేషించసాగెను.

మద్రదేశమును పాలించు సుధన్వుని కుమారుడు కంబుగ్రీవుడు గొప్ప పరాక్రమవంతుడు, అతనినే తన కుమార్తెకు తగిన వరునిగా చేయమని బ్రాహ్మణులు తెలిపిరి. చంద్రసేనుడు గుణవతితో నీకిది సమ్మతమేనాయని అడిగెను. గుణవతి వెంటనే కుమార్తెతో తండ్రి చెప్పిన విషయమును ప్రస్తావించెను. మండోదరి తల్లితో అమ్మా నేను వివాహమునకు సుముఖురాలును కాను. నా ప్రతి క్షణము తపస్సునందే వినియోగించెదను. భర్త వలన కలుగు సుఖమును నేను ఆశించదలచలేదు. అది దుఃఖప్రదమని భావించెదను. అనగా గుణవతి భర్తతో యీ మాటలు అట్లే చెప్పెను.

ఒకనాడు రాజకుమారి మండోదరి ఉద్యానవనమందు క్రీడసలుపు చుండెను. ఆ ప్రదేశమున కోసల దేశపురాజు వీరసేనుడు ఆ వనిత

దృష్టిలోపడెను. వీరసేనుడు దాసితో యీ బాలిక ఎవరు? ఈమె ఎవరి పుత్రిక తొందరగా తెలుపమనెను. దాసి వీరపురుషా! మీరెవరు? ఏ కార్యము కొరకు ఇటువచ్చారని అడిగెను.

వీరసేనుడు నేను కోసల దేశమునకు ప్రభువును అని చెప్పగా దాసి రాజా! ఈ రాకుమారి మహారాజగు చంద్రసేనుని పుత్రిక. ఈమె పేరు మండోదరి అని చెప్పెను.

వీరసేనుడు ఓ సైరంధ్రీ! నేను కుకుత్సవంశమున జన్మించితిని. రాజ కుమారివగు నిన్ను కోరుచున్నాను. నీవు గాంధర్వ విధిని నన్ను భర్తగా స్వీకరింపుము. సుశ్రోణీ! రాజకుమారివగు నిన్ను కోరుచున్నాను. నేను అనుకూలమగు భర్త నగుదును అని చెప్పెను.

మండోదరితో సైరంధ్రి ఈ మహారాజు సూర్యవంశ కులదీపకుడు. నీ వివాహమునకు సమయము ఆసన్నమైనది. మాతో "దాసీగణములారా మీరు రాజకుమారికి వివాహము చేసికొనునట్లు నచ్చచెప్పుడు భర్తను సేవించుటయే పరమధర్మమని మనువు పలికెను. శాస్త్రోక్తముగా వివాహము చేసుకొనుము అనగా మండోదరి నేను రాజును తిరస్కరిస్తున్నాను, లజ్జా విహీనుడై నాయందే ఎందుకు దృష్టి నిలిపియున్నాడు. వివాహము గురించి నాకు ఏమాత్రం చింతలేదు.

సైరంధ్రి వీరసేనునితో రాజా! మా రాజకుమారి మీవంటి యోగ్యుడైన రాజునే వరించుటకు ఇష్టపడలేదు అని చెప్పగా రాజు ఉదాసీనుడై తన దేశమునకు తిరిగి వెళ్ళిపోయెను.

మండోదరికి ఒక సోదరి ఆమె పేరు ఇందుమతి. తండ్రి చంద్రశేనుడు ఇందుమతికి వివాహము చేయదలచగా సభామండపమున ఒక మహారాజు మెడలో పూలమాల వేసెను. ఇదంతయు చూసిన మండోదరి కామపీడిత అయ్యెను. తండ్రీ! నాకు కూడా వివాహమును జరిపించుడు అనెను. మద్రరాజగు చారుదేష్ణునిపై నాకు కోరిక కలిగెను.

వివాహ విధిని సంపన్నముచేసి మండోదరి నతనికిచ్చారు. చారుదేష్ణనితో వరకట్నము నొసగి సాగనంపెను. కామినియగు మండోదరితో అతడు ఆనందము నను భవించెను. అయితే అతడు దుష్టచరిత్ర కలిగినవాడు. నా జీవితము గొప్ప అఘాతముగా మారిపోయెనేయని చింతించుచు కాలము గడుపసాగెను. సాంసారిక సుఖము నామమాత్రముగానే ఉండెను.

ఓ దేవి! నీవిపుడు నావంటి మహారాజును ఆదరించకపోయినచో మూర్ఖుడైన చారుదేష్ణని మండోదరి జీవితములాగా నీవు కూడా మిగుల దుఃఖింపవలసి వచ్చునని మహిషాసురుడు పలికెను.

దేవి మహిషాసురునితో ఓరి! మూర్ఖుడా! నేను దేవతలను రక్షించుటకు మాత్రమే ఈ జన్మను ధరించుటకు అంగీకరించితిని. నీవు యుద్ధమైనా చేయుము. లేదా పాతాళమునకైనా వెళ్ళుడు అనగా వాడు భగవతి మీద బాణములు వేయుటకు సిద్ధపడి ముందుకురికెను.

దుర్దనుడనే రాక్షసుడు రాగా అతనిని కూల్చివేసెను. త్రినేత్రుడనే వాని తలను ఖండించెను. అంధకుడు రాగా నఖములతో చీల్చివేసెను.

మహిషాసురునిపై దేవి తలపడుచుండగా సింహము వానిని నఖములతో చీల్చివేయుటకు సిద్ధపడగా మహిషాసురుడు కూడా సింహరూపము పొంది తలపడెను. వెంటనే ఏనుగు రూపముతో పోరాడి మనుష్య రూపముతో, శరభ రూపముతో మనిషి రూపముతో కొమ్ములతో ఆ దేవిని కొట్టసాగెను.

వారిరువురి పోరును చూచుటకు ఋషులు, గంధర్వులు, పిశాచులు, నాగులు, చారణులు, కిన్నర, ఆకాశమున ఎదురు చూచిరి. త్రిశూలముతో శ్రీదేవి వాని వక్షఃస్థలమును కొట్టెను. మహిషాసురుడు భూమి మీద పడిపోయెను. భగవతి చండిక చక్రముతో మహిషాసురుని తల మొండెము వేరయ్యెను.

ఆ దానవుడు వధింపబడగా దేవతలు, మునులు, మానవులు, సత్పురుషులకు హర్షము కలిగెను. మహిషాసురుడు హతమగుటను చూచి ఇంద్రాది సమస్త దేవతలకు సంతోషము కలిగెను. వారంతా కలసి భగవతి జగదంబను స్తుతింపసాగిరి.

జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయకారకములు నీ మీదనే ఆధారపడి యుండును. కీర్తి, మతి, స్మృతి, గతి, కరుణ, దయ, శ్రద్ధ, ధృతి, వసుధ, కమల, అజప, పుష్టి, కళ, విజయ, గిరిజ, జయ, తుష్టి, ప్రమ, బుద్ధి, ఉమ, రమ, విద్య, క్షమ, కాంతి మేధ ఇవన్నియు నీ నామములే భగవతీ! ధారణాశక్తివి కూడ నీవే.

దేవీ! దేవదానవులకు వాగ్దేవివి నీవే. కలియుగమునందు కవిత్వమును అభిమానించువారు నిన్ను మరుగుపరచి నీచేత ఆవిర్భవింపబడిన దేవతలను స్తుతించుటయందే లగ్నమగుదురు. నీవు ముక్తిని ప్రసాదించు పరావిద్యవు.

యజ్ఞములందు మునులచేత చేయబడు హోమములందలి పదార్థములను దేవతలు పొందెదరు. ఆ సమయమున "స్వాహా" అని నీ రూపమును ప్రయోగింపక పోయినచో వారు తమ యజ్ఞభాగములను పొందగలరా? ఇది అసంభవము, దురాత్ముడైన శత్రువు ప్రాణములను హరించి జగత్తునందు గొప్ప పని చేసితివి. దయతో మమ్ము రక్షింపుము. అప్పుడు దేవి దేవతలారా! మీకష్టములు తీర్చుటకు నేను మీకు అండగా నుందును నన్ను స్మరింపుడు అనెను. దేవతలు "తల్లీ! నీ చరణ కమలములు మాకు నిరంతరము శరణ్యము. ఇట్లు దేవతలు స్తుతించగా భగవతి జగదంబ అంతర్ధానమయ్యెను.

13. శత్రుఘ్నుని రాజ్యపాలన

జనమేజయుడు భాగ్యశాలీ! భగవతి భువనేశ్వరి అంతర్ధానమయినదని మీరు తెలిపితిరి. ఆ దేవి మర్త్యలోకమునకు వెళ్ళెనా? స్వర్గలోకమునకు

వెళ్ళెనా? ఆమె నివాసమెక్కడ? ఈ విషయమును వివరింపమని వ్యాసుని అడిగెను.

మణిద్వీపమున దేవి సదాక్రీడించు చుండును. దేవికి ఆ స్థలము ప్రియమైనది. సముద్రమునకు మధ్య భాగమున విరాజిల్లుచున్నది. ఆ స్థలమున నిరంతరము దేవి కీర్తన జరుగుచుండును, ఆమె ఆ ధామమునకు వెళ్ళిపోగా భూమండలమున సూర్యవంశము నందలి శత్రుఘ్నుని రాజును చేసిరి. అతడు అయోధ్యయందుండి రాజ్యపాలన చేయుచుండెను.

ఋతువులలో సక్రమమైన వర్షము, గోవులందు సమృద్ధియైన పాలు, బ్రాహ్మణులు యజ్ఞములు చేయుచు, క్షత్రియులు ధార్మిక భావముతో, ప్రజలు కలిసిమెలసి జీవనము సాగించుచుండిరి. అప్పుడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శూద్రులందరునూ దేవీ ఉపాసకులే. వాద వివాదములు పోట్లాటలు ఉండెడివి కావు.

చోరులు, పాషండులు, ధూర్తులు, డాంబికులు ఎక్కడను కనిపించెడివారు కాదు. వేదములను ద్వేషించువారు, దురాచారులు పేరుకైనా లేకుండిరి. నిరంతరము బ్రాహ్మణసేవ జరుగుచుండెను.

యజ్ఞమునందు పశుబలి లేకుండెను. క్షత్రియులకు పౌరోహిత్యము చేయుట, దానము తీసుకొనుట, దానము నిచ్చుట, వేదములను చదువుట, చదివించుట, ఆరు కార్యములందు బ్రాహ్మణులు జ్ఞానసంపన్నులై యుండిరి. మానవులందరు చండికను సేవించుటయందే నిమగ్నులై వుండిరి.

14. శుంభ నిశుంభులు

శుంభ నిశుంభులను దానవులు యిరువురును సహోదరులు. చండ, ముండులు, రక్తబీజుడు, ధూమ్రలోచనుడు, వీరందరూ దానవులు, వీరు పాతాళము నుండి భూతలమునకు వచ్చిరి. పది సంవత్సరములు నిరంతరము తపమునందు లగ్నమై యుండిరి. బ్రహ్మ వారితపస్సునకు

సంతసించి వరముల నిచ్చుటకు ఏతెంచెను. శుంభ నిశుంభులు ఆస్వామికి సాష్టాంగ ప్రణామమొనర్చిరి. "బ్రహ్మదేవా! నేడు మాకు జనన మరణముల నుండి విముక్తి కలిగే భయమును తొలగించండి" అని కోరిరి.

కృపాసింధూ! దేవతలు, మానవులు, మృగములు, పక్షులు, ఎవ్వరిచేతనైనను మేము మరణించరాదు. ఇదిమా అభీష్టము. మా ఇరువురు సోదరులకు పురుషుని చేత వధింపకుండ వరము కావలెను. స్త్రీ సహజముగానే అబల కనుక ఆమెతో మాకెట్టి భయమును లేదు అని చెప్పిరి.

బ్రహ్మదేవుడు వారు కోరిన వరములొసగి సంతోషముగా తమ ధామమునకు వెళ్ళిపోయెను. శుంభనిశుంభులు తమ గృహముకేగి శుక్రాచార్యుని తమకు పురోహితునిగ చేసుకొనిరి. శుంభుడు అగ్రజుడు కనుక రాజసింహాసనము నధిష్ఠించు అధికారము కలిగెను.

చండముండులను గొప్పవీరులు శుంభుని సేవించుటకు వచ్చిరి. ధూమ్రలోచనుడు సైన్యసమేతుడై శుంభుని వద్దకు వచ్చిచేరెను. రక్తబీజుడు వచ్చి చేరెను. ఇతని శరీరము నుండి రక్తపు బిందువులు రాలినచో అంతమంది పురుషులు ఉత్పన్నమయ్యెదరు.

నిశుంభుడు ఇంద్రుని ఓడించుటకు తన సైన్యమును సన్నద్ధము చేసి స్వర్గము మీదకు దాడి చేసెను.

ఇంద్రుడు వజ్రాయుధముతో వాని వక్షఃస్థలమును గాయపరచెను. శుంభుడు తన బాణవర్షముతో సకల దేవతలను, దిక్పాలురను, ఇంద్రుణ్ణి పారిపోవునట్లు తరిమెను. శుంభుడు ఇంద్రపదవిని చేజిక్కించుకొనెను. అమృతపానముతో శుంభుని ఆనందమునకు అంతము లేకుండెను.

శుంభుడు కుబేరుని జయించి అతని సంపదలను చేజిక్కించుకొనెను. సూర్యచంద్రులు అధీనులై ఉండిరి. అగ్ని వరుణుడు, వాయువును

శాసింపదొడగెను. దేవతలు అడవుల పాలైరి. శుంభుడు దేవలోకమును వెయ్యి సంవత్సరములు రాజ్యము చేసెను.

దేవతలు బృహస్పతిని సమీపించి దానవులను నిర్మూలించి మమ్ములను రక్షించుట మీకు పరమ కర్తవ్యము అని కోరగా బృహస్పతి దేవతలారా! భక్తి శ్రద్ధలతో చండికను ఆరాధింపుడు మీ దుఃఖములను సమాప్తమొనరించగలదు. భగవతి చండిక హిమాలయమునందు ఉంటుందని వినియున్నాను అని చెప్పిన వెంటనే **దేవతలు హిమాలయమునకు వెళ్ళి దేవిని ఆరాధింపసాగిరి.**

తల్లీ! విష్ణువు, శంకరుడు, దేవతలు సదా నీ సేవయందే లగ్నమై యుందురు.

దండకము

నమో దేవి విశ్వేశ్వర ప్రాణనాథే సదానంద రూపే నమో దానవాంతప్రదే మానవానా మనేకార్థదే భక్తి గమ్యస్వరూపే నతే నామసంఖ్యా నతే రూప మీదృక్కథా కోపి వేదాదిదేవాదిరూపే త్వమేవాసిసర్వేషుశక్తి స్వరూపా ప్రజాసృష్టి సంహారకాలే సదైవ స్మృతిస్త్వం ధృతిస్త్వం త్వమేవాసిబుద్ధిర్జరాపుష్టి తుష్టీద్యుతిః కాంతిశాంతీ నువిద్యా నులక్ష్మీర్గతిః కీర్తివేధే మేవాసిత్వవిశ్వస్యబీజప్రమాణమ్ యదా యై స్స్వరూపైః కరోషీహకార్యం నురాణాంచతేభ్యో నవోవోద్యశాంత్యైక్షమా యోగ నిద్రా దయాత్వంవివక్షాస్థితాసర్వభూతేషుశస్తైస్స్వరూపైః కృతం కార్యమాదౌ త్వయా యత్సురాణాం హతోసామహారి ర్మదాంధో మయారి ర్దయాతే సదాసర్వదేవేషు దేవి ప్రసిద్ధాపురాణేషు వేదేషు గీతా కిమత్రాస్తిచిత్రం యదంబాసుతం స్వం ముదాపాలయే త్పోషయే త్సమ్యగేవ యత స్త్వంజని త్రీ సురాణాంసహాయా కురుష్వైక చిత్తేన కార్యం సమగ్రం సమగ్రం నవా తేగుణానామియత్తా స్వరూపంవయం దేవి జానీమహే విశ్వవంద్యే కృపాపాత్రమిత్యేవ మత్వా

తథాస్మానృయేభ్యస్సదా పాహి పాతుం సమర్దే వినాబాణపాతై ర్వినాశూలఖడ్గై ర్వినాశక్తిదండైర్విపూన్ హంతు మేవాసిశక్తా వినోదా త్తథాపీహలోకోపకారాయ లీలా ఇదం శాశ్వతం నైవ జానన్తిమూఢా నకార్యంవినాకారణం సంభవేద్వా వయంతర్కయామోను మానం ప్రమాణం త్వమేవాస్య విశ్వస్య కర్త్రీ త్వజ సృష్టి కర్తా ముకుందో వితాయం హరోనాశ కృద్వై పురాణే ప్రసిద్ధః నకింత్వత్తృ సూతాస్త్ర యస్తేయుగాదౌ త్వమేవాసి సర్వస్య లోకస్య మాతాత్రిభిస్త్వం పురాసేవితాదేవి దత్తాత్వయాశక్తి రుగ్రాచతేభ్యస్స మగ్రా త్వయాసంయుతాస్తే ప్రకుర్వంతి కామం జగత్పాలనోత్పత్తిసంహారమేవేతి మన్యామహే సర్వలోకేశ్వరీ త్వం నమస్తుభ్య మంచు న్సదా మ్రొక్కుచున్నాము శ్రీశ్రీ జయశ్రీ.

కం. మందమతులు నిను గొలువక
నిందాస్పదు లగుచు పరమ నీచు లగుచు నా
నందము నొందంజాలరు
వందనములు భక్త కల్పవల్లీ తల్లీ!

కం. కొందఱు వైష్ణవులును మఱి
కొందరు పాశుపతు లంబ కోరరు నిన్నుం
గుందుదురు నరకములబడి
వందనములు భక్త కల్పవల్లీ తల్లీ!

కం. మందరధరు డంభోనిధి
నందనకును శివుడు శైలనందనకును మ్రొ
క్కుం దక్కినవా రెక్కుడె
వందనములు భక్తకల్పవల్లీ తల్లీ! (మహాకవి దాసు శ్రీరాములు)

భగవతి జగదంబ కరుణార్ద్రయై వెంటనే ప్రకటిత అయ్యెను. దేవతలారా! మీరిపుడు నన్నెందుకు స్తుతించుచున్నారు? అని అడుగగా దేవతలు దేవీ! మమ్ములను రక్షించు సమయము ఆసన్నమైనది. శుంభ,

నిశుంభులను రాక్షసులు బలగర్వితులై దేవతలను బాధించుచున్నారు. వారిని నశింపచేయుటకు నీవు తప్ప మరెవ్వరు మాకు అన్యులు లేరు అని పలికిరి.

15. కౌశికి గా, కాళిక గా దేవి పరిణతి చెందుట

భగవతి పార్వతిశరీరము నుండి జగదంబ సాకారరూపమున ప్రకటితురాలు కాగా, సకల జగత్తు ఆ దేవిని కౌశికీ నామముతో పిలువసాగిరి. శరీరము కృశించి నల్లబడియుండెను. అందుచే దేవి కాళికానామముతో ప్రసిద్ధురాలయ్యెను. భగవతి జగదంబ నవ్వుచూ దేవతలతో మీరు మీ స్థానములకు వెళ్ళుడు, నేను శుంభ నిశుంభులను వధించెదను అనెను.

భగవతి కౌశికి సింహారూఢయయ్యెను. కాళికను కూడ తన వెంట రమ్మని ఆదేశించెను, శుంభునకు చండముండులను ఇరువురు సేవకులుండిరి. ఆ దేవి కాళికకు తన ఎదుట స్థానము నిచ్చియుండెను. చండముండులు మహదాశ్చర్యమునకు లోనైరి.

చండముండులు శుంభ నిశుంభుల వద్దకు వెళ్ళి రాజా! కామదేవుని మోహింపచేయు ఒక సుందర స్త్రీ హిమాలయ పర్వతము నుండి వెలువడెను. దానవ రాజా! త్రిలోకమునందెచట కూడా అట్టి సుందర స్త్రీ లభించదు. ఈ స్త్రీని మీరు శీఘ్రముగా తీసికొనివచ్చి మీ భార్యగా చేసికొనుడు.

శుంభుడు సుగ్రీవునితో నీవు నమ్రతతో వెళ్లి ఆమెతో మాట్లాడి కార్యమును సఫలము చేయుము. అనగా మధురవాణితో శుంభుని గురించి తెలుపుటకు జగదంబయున్న చోటికి వెళ్ళి శుంభుడు మహాపరాక్రమశాలి అతని మనస్సు నీ మీద లగ్నమయ్యెను అనెను.

శుంభుడు చెప్పిన ఈ మాటలు వినుము. "నేను సకల దేవతలను పరాజితులను చేసితిని. నీవు నన్ను పతిగా అంగీకరింపుము. నేను నీ

అధీనుడై యున్నాను. నీవు ఎల్లకాలము సౌభాగ్యవతివై యుందువు" అని సుగ్రీవుడు పలికెను.

దేవి దూతతో శుంభుని నేనెరుగుదును. అతడు సకల దేవతలను జయించెను. నీవు ఏకాంతమున నా సందేశము వినిపింపుము. పూర్వము బాలస్వభావముతో నన్ను జయించిననే భర్తగా వరించెదనని ప్రతిజ్ఞ చేసితిని. రాజేంద్రా! నన్ను జయించి నీ కోర్కెను తీర్చుకొనుము అని చెప్పెను.

భగవతి జగదంబ మాటలను విని సుగ్రీవునికి ఆశ్చర్యము కలిగెను. శుంభుని జయించగల వాడెవ్వడును ఈ త్రిలోకములందు లేడు, నీ రూపమునకు మోహితుడై నిన్ను ప్రార్థించుచున్నాడు. సారహీనమైన ఆలోచనలు వదలి శుంభుని గాని, నిశుంభునిగాని నీ భర్తగా చేసుకొనుము అనెను.

రాజేంద్రా! నాతో యుద్ధము చేసి నన్ను ఓడించి నా అభిమానమును రూపుమాపినవానినే నేను భర్తగా స్వీకరించెదను అని నేను ప్రతిజ్ఞ చేసితిని. నన్ను యుద్ధమున జయించి నీ అధీనురాలనుగా చేసికొనుము అని ఆమె చెప్పిన విషయములను మీ సేవయందు నివేదించితిని. మీకు సముచితమైన దానినే చేయుడు.

శుంభుడు సోదరుడగు నిశుంభునితో నీవు మిగుల బుద్ధికుశలుడవు. మనమేమి చేయవలయునో తెలుపుము అని కోరగా నిశుంభుడు ధూమ్రలోచనుని పంపినచో అతడు వెళ్ళి సుందరనేత్రిని ఇక్కడకు తీసుకొని వచ్చును ఆమెను మీరు వివాహము చేసికొనండి అనగా ధూమ్రలోచనుని దేవి వద్దకు పంపెను.

ధూమ్రలోచనుడు వెంటనే రణమునకు ఉద్యుక్తుడయ్యెను. దృఢమైన ధనస్సును చేబూని దేవి మీద బాణ వర్షము కురిపించెను. జగదంబ ఒక హుంకారము చేయగా ధూమ్రలోచనుడు కాలి బూడిద అయ్యెను. అతడలా

మరణించుటను చూచి దేవతల హృదయములు అపారహర్ష భరితములయ్యెను.

యుద్ధభూమియందు విగతజీవులై పడియున్న దానవుల శరీరమును గ్రద్దలు, కాకులు, నక్కలు, డేగలు, పిశాచములు తినుటయందు నిమగ్నమయ్యెను. ధూమ్రలోచనుడు ఏమైనాడని శుంభనిశుంభులు అడిగిరి. ఇప్పుడు వినుచున్న శంఖధ్వని ఎవరిదని అడుగగా ధూమ్రలోచనుని ప్రాణములు అనంతవాయువులలో కలిసిపోయినవి.

కాళికచేత ఈ అమానుష ఘటన ఘటిల్లినది. దేవి యొక్క సింహము సైనికులందరిని చంపివేసెను. దేవతల ఆనందమునకు పరిమితిలేకుండెను. విజయము చేకూరుట అసంభవమని గ్రహించితిమి. జగదంబిక ఒంటరిగానే ఉన్నది. విష్ణువు శంకరుడు కూడా సమయానుకూలముగా ఆమె సమీపముననే ఉన్నారని తెలిసుకొన్నాము.

మిగిలిన కొద్దిమంది దానవులను సంహరించుట ఆమెకొక లెక్కలోనిది కాదు, మీ బుద్ధికి తోచినట్లు చేయుడు, సత్యమైన విషయము నివేదించుటయే సేవకుల కర్తవ్యము.

అనుచరుల మాటలను విని శుంభుడు తన సోదరుడగు నిశుంభునితో ఏకాంత స్థలమునకు వెళ్ళిపోయెను. నిశుంభునితో వీరవర్యా! మనమిపుడు పారిపోవుట క్షేమమా? యుద్ధము చేయుటయా? తెలుపుము అనగా నిశుంభుడు ధైర్యముతో ఈ స్త్రీతో యుద్ధము చేయుట పరమశ్రేయస్సును చేకూర్చును. నేనిప్పుడే సైన్య సమేతముగా సమరాంగణమునకు వెళ్ళి ఆ అబలను చంపి తిరిగి వచ్చెదను అనెను.

నిశుంభుని మాటలను విని శుంభుడు నీవిపుడు వెళ్ళవలదు. కుందేలును పట్టుటకు ఏనుగును వదలుట శోభాయమానము కాదు, చండముండులు గొప్పశక్తి వంతులు వారిని కాళితో సమరాంగణమున ఓడించి తెమ్మని ఆజ్ఞాపించెను.

16. చండ ముండులు

శుంభుని ఆజ్ఞను శిరసావహించి చండ ముండులు రణభూమికి తరలిపోయిరి. దేవీ! పదునెనిమిది భుజములు కలిగియున్న దానినని అభిమాన పడుచున్నావేమో అందతయునూ వ్యర్థమే. శుంభుడు దేవతలనే పరాజితులను చేసెను. అతని యెదుట యీ భుజములు వ్యర్థములు. కాంతా! నీవు వ్యర్థముగా గర్వించుచున్నావు.

దేవగణములు నిన్ను వ్యర్థముగా ప్రేరేపించుచున్నారు. శుంభుని చేతిలో విజయలక్ష్మి ఉన్నది. ఆ స్వామిని భర్తగా వరింపుము. అని చండుడు పలుకగా భగవతి మేఘ గంభీరస్వరముతో గర్జించి ఇట్లు పలికెను. విష్ణువు, శంకరుడు మొదలగు వారిని వదలి నేను దానవుడగు శుంభుని నిస్వనముతో గర్జించి ఇట్లు పలికెను. ఇంతకుముందు వందలకొలది దైత్యులను మట్టుబెట్టితిని.

ఓ బుద్ధిమంతుడా! నీవు యుద్ధము చేయుటయందు నిరతుడవగుము. శుంభనిశుంభులు మిగుల దుష్టులు, వారి వలన నీకేమి ప్రయోజనము కలుగును. నీవు వధింపబడిన తరువాత నీ సోదరుని కూడా మృత్యుముఖమును చూసెను. రక్తబీజుని కూడా సంహరింతును.

దేవి ఇట్లు పలుకగా చండముండులు క్రోధముతో నిండిపోయిరి. చండముండులు దేవితో యుద్ధము చేయుటకు సన్నద్ధమైరి. ముండుడు రోషముతో బాణ ప్రయోగము చేయుచుండెను.

కాళీవేషమున విరాజమానురాలై యుండెను. పులి చర్మమును కప్పుకొని గజ చర్మము దుప్పటిగా చేసుకొని వక్షస్థలము నర కపాలమాలతో అలంకరింపబడి యుండెను. ఖట్వాంగమును, కత్తిని, పాశమును ధరించి కాళికాదేవి మిగుల భయంకరముగా కన్పించుచుండెను. రెండవ కాళరాత్రి ప్రాదుర్భవించినట్లుండెను. నోరు విశాలమై మాటమాటికి నాలుక అర్రులు

జూచుచుండెను. అసురులను చేతితో పట్టుకొని నోటిలో వేసుకొని పళ్ళతో నమిలివేయుచుండెను.

చండుని చక్రము సూర్యునివలె తేజస్సంపన్నమై యుండెను. దానిలో సుదర్శనచక్రము వంటి శక్తియుండెను. కాళిక మీద దానిని ప్రయోగించెను. కాళి చండుని మూర్ఛితుని చేసెను. దేవి ముండుని మీద వేసిన బాణములు సహింపలేక భూమిమీద కొఱగెను.

చండముండు లిరువురిని భద్రకాళి కుందేళ్ళనువలె భగవతి జగదంబ వద్దకు ఈడ్చుకొనివచ్చెను. ఈ సంగ్రామమున బలి ఇచ్చుటకు తెచ్చితినని భద్రకాళి పలికెను. యుద్ధరూపమైన ఈ యజ్ఞమునందు చండముండుల తలలు తెగనరికెను.

జగదంబ ప్రసన్నరాలై భద్రకాళీ! నీవు దేవతల గొప్ప కార్యమును నెరవేర్చితివి. వీరిని వధించినందున జగత్తునందు "చాముండ" అను పేరుతో ఖ్యాతివహింతువు అనెను.

సైనికులందరు శుంభుని వద్దకువెళ్ళి ఒక్క స్త్రీ వలన సకల రాక్షసులు మృత్యువునకు ఆహారమైరి. పూర్వము మీరు తపమొనరించి బ్రహ్మను కోరిన వరము గుర్తుకు తెచ్చుకొనుడు. దైత్యులు, దేవతలు, మానవులు, సర్పములు, యక్షులు సంహరింప లేకుండునట్లు కోరితిరి కాని ఇప్పుడు వచ్చినది స్త్రీ ఈమెలో సకల శక్తులు నిహితములైయున్నవి.

ఈమెను వేదమాత, గాయత్రి, సంధ్య అని కూడా పిలిచెదరు. ఈమె కృపవలననే దేవతలు ఎల్లప్పుడును భయము లేకుండ విహరించెదరు. ఈమె ఆజ్ఞను శిరసావహించి మీ కులమును రక్షింపుడు అని కోరిరి.

శుంభుడు దానవులు మాటలను విని వీరత్వముతో మూర్ఖులారా! జీవితము మీకు ప్రియమైనచో యుద్ధభూమి నుండి 'పారిపొండు, ఈ జగత్తంతయు ప్రారబ్ధము యొక్క శాసన సూత్రమునందు

బంధింపబడియున్నది. నేను నా ధర్మమును పాటించెదను. గెలుపోటములు ఏమైనను వాటిని స్వీకరించెదను.

పిండిని విసరవలయునని తిరుగలి వద్ద కూర్చొని పిండి విసురుటకు ప్రయత్నించనిచో పిండి ఎట్లు తయారగును? ప్రయత్నించుట వలననే సాఫల్యము లభించును. ప్రయత్న లోపమే ప్రధాన కారణమగును అని చెప్పి శుంభుడు రక్తబీజుని యుద్ధభూమికి వెళ్ళుమని ఆదేశించెను.

17. రక్తబీజుడు

రక్తబీజుడు మహారాజా! నేను ఆ స్త్రీని వధించి నీ అధీనురాలిని చేసెదనని యుద్ధభూమికి బయలుదేరెను. అతని రాకను చూచి దేవి శంఖమును పూరించెను. అది విని రక్తబీజుడు దేవీ! నన్ను చూచి ధూమ్రలోచనునిగా తలచితివా? నాపేరు రక్తబీజుడు. ఇంతవరకు నీ దగ్గరకు వచ్చిన వారంతా పిఱికివారే.

సాహిత్య శాస్త్రమును నీవు గ్రహించివుంటే రసములు తొమ్మిది కలవు. రెండు ప్రధానములని గ్రహించుము. శృంగార రసము, శాంతరసము, దీని ప్రభావముననే విష్ణువు లక్ష్మితోనూ బ్రహ్మ సావిత్రితోనూ విరాజమానులై యుందురు. ఇంద్రుడు శచిదేవితో, శంకరుడు పార్వతి దేవితో విహరించుచుందురు. సకల ప్రాణులు సంయోగ మత్తుననుభవించు చుందురు. కామ, క్రోధ, లోభ, మోహముల మీద విజయమును పొందుట మిగుల కష్టము. శుంభుడుగానీ, నిశుంభుడు గాని నీకు తగినవరులు, వారు సకల దేవతల మీద అధికారము కలిగి ఉన్నారు అని పలుకగా చాముండ, కాళిక, అంబిక లేచి అట్టహాసము చేయసాగిరి.

దేవి నవ్వి రక్తబీజునితో నీవు శుంభ నిశుంభులతో "మహారాజా"! మీరు యుద్ధమునందు ఆ దేవిని ఓడించి వివాహము చేసుకొనుడు" అని చెప్పుము. దేవి వానితో యుద్ధమునైనా చేయుము లేదా పాతాళమునకు

వెళ్ళము అనెను. దేవి మాటలతో రక్తబీజుడు సింహము మీద బాణములు కురిపించసాగెను. దేవి వదలిన బాణములు తగిలి ఆ దానవుడు రథము మీద పడిపోయెను. మూర్ఛితుడయ్యెను. శుంభుడు కాంభోజదేశమునందలి 'కాలకేయుల'ను పేరుగల శూరవీరులగు దైత్యులు రణభూమికి తరలి రావలయునని ఆదేశించెను. శత్రువుల గుండెలు వణికిపోవుచుండెను. ఆ ధ్వని ప్రభావముతో విశాలముఖముగల ఒక కాళిక ప్రాదుర్భవించెను.

ఆ యుద్ధమునందు బ్రహ్మ యొక్క శక్తి హంసరూఢయై విష్ణువు యొక్క శక్తి గరుడ వాహన రూఢయై శంఖ, చక్రగదా పద్మములు ఆమె భుజముల యందు సుశోభితములై యుండెను. శంకరుని శక్తి త్రిశూలమును చేబూని వృషభ రూఢయై వచ్చెను.

కార్తికేయుని శక్తి కార్తికేయి మయూర వాహనమై ఇంద్రుని శక్తి ఐంద్రి వజ్రమును చేబూని ఐరావతము నెక్కివచ్చెను. శ్రీహరి వారాహిక వేషముతో ప్రేతమునెక్కి వచ్చెను. యమరాజు శక్తి దండముతో, వరుణ కుబేరుల శక్తికూడా, సకల దేవతల శక్తులు తరలివచ్చిరి. లోక శంకరుడు పరమశివుడు దేవతలను వెంట నిడుకొని రణ రంగమునకు ఏతెంచెను.

నీవు దేవతల కార్యసిద్ధికై దానవులను సంహరింపుమని చండికతో పలికెను. అప్పుడే చండిక శరీరము నుండి ఒక విచిత్రమైన శక్తి ఆవిర్భవించెను. శుంభునిశుంభులకు చెప్పమని దూతగా తన మాటలను శంకరుని ద్వారా స్వర్గమును వదలి పాతాళమునకు వెళ్ళి పోవలసిందిగా చెప్పి పంపెను.

శంకరుడు శంభుని సభకు వెళ్ళి దానవులందరిని బలిచక్రవర్తి నివసించే పాతాళ లోకమునకు వెళ్ళిపోవలసినదిగా దేవి మాటలను వినిపించెను. కాని దైత్యులందరు యుద్ధమునకు బయలుదేరి వచ్చిరి.

భగవతి బ్రాహ్మణి, మహేశ్వరి వృషభారూఢయై వైష్ణవి చక్ర గదా ప్రహారములతో ఇంద్రి తన వజ్ర ప్రహారముతో దానవులను మట్టుపెట్టు చుండెను.

'వారాహి' యొక్క సర్వాంగములు క్రోధముతో ప్రజ్వరిల్లుతుండెను. 'నారసింహ' తన భయంకర నఖములతో చీల్చిచెండాడు చుండెను. 'శివదూతి' యొక్క అట్టహాసము చేత రాక్షసులు నేలకొరుగు చుండిరి.

చాముండ, కాళిక వారిని తినుటయందు లగ్నమైయుండెను. కౌమారి సమరాంగణమున వెలుగొందుచుండెను. వారుణి పాశహస్తురాలై సమరభూమి కేతెంచెను. మాతృగణములచేత దానవులు నష్టభ్రష్టమై పారిపోవుచుండిరి.

రక్తబీజుని శరీరము నుండి రక్తము భూమి మీద పడినచో ఆ రక్తపు బొట్టుల నుండి వెంటనే దానవులుద్భవించెదరు. విష్ణుశక్తియగు వైష్ణవి గరుడ వాహనము మీద విరాజిల్లుచున్నదని దైత్యుడు చూచెను.

వైష్ణవీదేవి దైత్యరాజగు రక్తబీజుని తన చక్రములో గాయపరచెను. ఐంద్రిరక్తబీజుని మీద వజ్రాయుధమును ప్రయోగించెను. బ్రహ్మాణి బ్రహ్మ దండముతో అతనిని కొట్టెను. మహేశ్వరి త్రిశూలముతో చీల్చిచెండాడు చుండెను. కౌమారి శక్తితో వాని వక్షఃస్థలమున ప్రహారము చేసెను. చండిక దానవుని శస్త్రములను తుత్తునియలు చేసెను.

రక్తబీజుని నుండి రాలుతున్న రక్తబిందువులతో వేలమంది శూరులు, వీరులు ఉత్పన్నులై పృథివి అంతానిండి ఉండెను. దైత్యులను చూచి దేవతలు భయముతో ఆలోచింపసాగిరి. ఇప్పుడు నిశుంభుడు, శుంభుడు కూడా ఆకస్మికముగా సమర భూమికి వచ్చెదరు. గొప్ప అనర్థము జరుగుతుందేమోయని కలత చెందిరి.

భగవతి జగదంబ భద్రకాళితో చాముండా! రక్తబీజుని శరీరమునుండి వెలువడిన రుధిరమును త్రాగుచు పొమ్ము, ఒక్క బొట్టు కూడా నేలపై పడకుండా చూడుము. నేను ఈ దైత్యుని చంపగనే వెంటనే భక్షింపుము. చండిక రక్తబీజుని అంగములను తినసాగెను. కాళిక రక్తబీజుని రుధిరమును

త్రాగుచునే ఉండెను. అతడు ఈ దెబ్బలతో పడిపోయెను. శరీరము తుత్తునియలు అయ్యెను. దైత్యులందరూ శుంభుని దగ్గరకు పరిగెత్తిరి. అంబిక చేతులలో రక్తబీజుడు రణరంగమున మరణించెను.

18. నిశుంభుడు

దైత్యులందరు భద్రకాళికి ఆహారమైరి. ఇంద్రాణి మొదలగు దేవిమణులు ఈ యుద్ధమున పాల్గొనిరి. ఇప్పుడు ఆ దేవితో యుద్ధము చేయుటవలన మేలు జరుగదు. దేవకార్యమును సిద్ధింప చేయుటకు ఇచ్చటికి వచ్చినది. పారిపోయి వచ్చిన దైత్యుల మాటలు శుంభుడు విని భయపడు వారందరు పాతాళమునకు పొండు, నా పార్షదులను దేవితో యుద్ధము చేయించి వారంత చనిపోయిరి కదా!

నిశుంభా! నేను సమరాంగణమునకు వెళ్ళుదును. ఒకవేళ చంపక పోయినచో నీవు ఆ స్త్రీని వధించి మృత్యువు దగ్గరకు పంపుము. అపుడు నిశుంభుడు ఒక స్త్రీ విషయమున చింతించవలదు. నీవు నేనుండగా యుద్ధభూమికి వెళ్ళుట అనుచితము అని శుంభునితో చెప్పి నిశుంభుడు దేవినెదురించెను.

దేవి భద్రకాళితో వీరిరువు ఎంత మూర్ఖులో కదా! కాళికా! శుంభ నిశుంభులకు ఇపుడు మృత్యువు తప్పదు. దేవి మాటలను విని నిశుంభుడు శస్త్రములు వేయుచుండెను. తన ఖడ్గముతో భగవతి చండిక నిశుంభుని మస్తకమును మొండెమునుండి వేరుచేసెను. కాళ్ళు చేతులు నరికివేసెను. అతని అనుచరు లందరిని చంపివేసెను.

19. శుంభుడు

దైత్యులందరు శుంభునితో తమ దీనావస్థను గజగజ వణకుచు వెళ్ళి చెప్పిరి. నిశుంభుని వధించిన స్త్రీతో ఇక యుద్ధము చేయనవసరము లేదు. దైత్యుల సంహారమే ఆ దేవి అవతారమునకు ప్రయోజనము.

ఇపుడామె రెండవ కాళరాత్రిని తలపించు చున్నది. మనమిపుడు పారిపోవుటయే ఉచితమని మీకు తెలియజేస్తున్నాము.

రాజా! కాలము దాతను యాచకునిగా యాచకుని దాతగా చేయును. అనుకూలమైన కాలము కొరకు మీరు నిరీక్షించుడు. ఇపుడు కాలము దేవతలకు అనుకూలముగా దైత్యులకు ప్రతికూలముగా ప్రవర్తిల్లుచున్నది. ఇంద్రాది దేవతలు మీకు కానుకలొసగు చుండిరి. అపుడు సమయము మీకు అనుకూలముగా నుండెను. ఇందుకు కారణము భద్రకాళి కాని సనాతన దైవము కాని కాదు.

పారిపోయివచ్చిన దైత్యుల మాటలను విని శుంభుడు వారితో మూర్ఖులారా! మీరు నీచపు మాటలు మాటలాడుచున్నారు. సోదరులను మంత్రులను చంపివేసి లజ్జావిహీనుడై పారిపోవుదునా? జనన మరణముల చిక్కులోపడి నా మనస్సు ఎప్పుడు చింతకు లోను కాదు.

నిశుంభుడు, రక్తబీజుడు ఈ స్త్రీ చేతులలో మరణించిరి. సూర్యుడు, చంద్రుడు, పృధివి, పర్వతములు వీటన్నిటికి మృత్యువు నిశ్చితము. జన్మించిన వానికి మృత్యువు, మరణించిన వానికి జన్మ పూర్తిగా నిశ్చితము. ఈ శరీరము క్షణభంగురమే అని చెప్పి శుంభుడు వెంటనే భగవతి జగదంబ విరాజమానురాలై యున్న హిమాలయమునకు వెళ్ళెను.

ఆ సమయమున సింహ వాహనారూఢయై దేవి ఒక పరమ సుందర స్త్రీ రూపమున విరాజమానురాలై యుండెను. దేవతలు, యక్షులు, గంధర్వులు, కిన్నరులు, ఆకాశమునందు ఆమెను స్తుతించుచుండిరి.

సీ. ఉదయించుచున్న సూర్యునిబోలె మెరిసెడి వేణిపై రాగిడి బిళ్ళతోడ
తళతళత్త ళిత ముక్తాఫలసౌవర్ణ లలితమౌ ముక్కుబులాకితోడ
కుణుకుణుప్రచుర నిక్వణన ఘంటారత్న కలితమైన జఘన కాంచితోడ
కులుకు చందురుకావు లలరారు సరిగంచువలె పుట్టము వలెవాటుతోడ

తే.గీ. నిర్జరనికాయపూజాప్రణిహిత పారి
జాత మందారపుష్పవిస్తారశోభి
తంబులయి తగు సర్వాంగ తతులతోడ
నొప్పి భుమ్మని శంఖంబునొత్తె దేవి (మ.క.దా.రా)

సీ. వాసవాదులు పూల వానలు గురిసిరి పాడిరి గంధర్వ పంజ్తు లెలమి
దెసలెన్మిదియు జాల దెల్పితో నలరారె మరుదంకురము వీచె మందగతిని
నచ్చర పూబోడు లాడిరి వేడ్కతో సిద్ధసంఘంబులు చేసెస్తవము
మునులెల్ల గేలెత్తి మ్రొక్కిరి నదులెల్ల నకలంక జలములై యలరె బారె

తే.గీ. యజనహోమాగ్నులెల్ల నత్యంత దీప్తి
వెలిగెను బ్రదక్షిణశిఖాళి విస్తరించి
లోకవిద్రావణ క్రియాలోలుడగుచు
నడరు శుంభుని గాళిక హతుని జేయ

తే.గీ. ఆయుధంబులు విడిచి నిరాశు లగుచు
దేవికిని మ్రొక్కి హతశేష దితిజులెల్ల
వీక నరిగిరి పాతాళలోకమునకు
కలుగు పుణ్యంబు జగదంబ కథను వినిన (మ.క.దా.రా)

శుంభుడు గద చేబూని కాళిక మీద ప్రహారము చేసెను. దేవి శుంభుని ఎడమ భుజము, దక్షిణ భుజము పాదములను నరికివేసెను. దానవుడు చేతులు కాళ్ళు తునిగిపోయినా దేవిని నిలువుము, నిలువుము అని దొర్లుచు వచ్చుచుండెను. దేవి కమలమువలె శోభలొలుకు వాని కంఠమును వెంటనే ఖండించెను. విశాలమైన శుంభుని శరీరము భూమి మీదపడి పోయెను.

ఇంద్రాది దేవతలు భగవతి చండికను కాళిని స్తుతింపసాగిరి. మిగిలిన దానవులు భగవతికి ప్రణమిల్లి పాతాళమునకు వెళ్ళిపోయిరి.

మానవులు ఈ ఉపాఖ్యానములను పఠించిన, వినినా, వ్రాసినా వారి సకల కోరికలు సిద్ధించును. పుత్రహీనులు పుత్రవంతులగుదురు. రోగులు రోగ విముక్తులగుదురు. శత్రుభయముండక ముక్తిని పొందగలరు.

20. సుమేధుని ద్వారా దేవి మహిమ

జనమేజయుడు వ్యాసునితో మునీంద్రా! దేవిని ఎవరు ఆరాధించిరి? ఎవడు మహాఫలమును పొందెను? ఆ తల్లిని మొదట ప్రసన్నురాలునిగా చేసుకొన్నది ఎవరు? ఈ మూడు విధానములను దయచేసి వివరింపుము అని కోరెను.

పూర్వము స్వారోచిషమన్వంతరమునందు సురథుడనే రాజుండెను. అతడు ప్రజాపాలన తత్పరుడు, మహోదారుడు, నిత్యసత్యవ్రతుడు, సత్కర్మ నిరతుడు, బ్రాహ్మణ పూజకుడు, గురుభక్తి పరాయణుడు, ఏకపత్నీరతుడు, దానశీలి, అజాత శత్రువు దనుర్విద్యాపారంగతుడు.

పర్వతవాసులగు మ్లేచ్ఛులతో కారణము లేకుండగానే యుద్ధము చేయవలసి వచ్చెను. మ్లేచ్ఛులకు, సురథునకు జరిగిన యుద్ధమునందు సురథుడు ఓడిపోయెను. ఇప్పుడు దుష్టబుద్ధిగల మంత్రిమండలి అంతా శత్రువర్గము నాశ్రయించినదని సురథుడు గ్రహించి ఒంటరిగ నిర్జన వనమునకు వెళ్ళిపోయెను.

మూడు యోజనముల దూరమున సుమేధుడను పేరుగల తపస్సంపన్నుడైన మునీంద్రుని పవిత్ర ఆశ్రమము గలదు అని అతనికి జ్ఞాపకము రాగానే సురథుడు ఆ ఆశ్రమమున ప్రవేశించి చూడగా సాలవృక్షము నీడన కృష్ణాజినము మీద ఆ మహాముని విరాజమానుడై యుండెను. రాజు మనస్సులో అతని యెడల అపారమైన శ్రద్ధ కలిగెను.

మహారాజు మునికి సాష్టాంగప్రమాణము చేయగానే ముని అతనిని లేపి "నీకు శ్రేయస్సు కలుగుగాక" యని ఆశీర్వదించి "మీరెవరు? ఎచటి

నుండి వచ్చితిరి. ఎందుకు చింతితులైయున్నారు? మీ మనోరథము నెరవేర్చుటకు సంపూర్ణముగా ప్రయత్నించెదను" అనెను.

రాజు మునితో "నేను సురథుడను పేరు గల రాజు. శత్రువులచేత పరాజితుడనైతిని. భార్యను రాజ్యమును సమస్తమును వదలి ఒంటరిగా మిమ్ములను శరణు జొచ్చితిని" అనగా ముని "మహారాజా! ఇచటికి నా తపః ప్రభావమున ఎవ్వరును రాలేరు, మీరు నిర్భయులై ఇక్కడ వసింపుడని" చెప్పెను.

సుమేధముని ఆశ్రమమునందు సురథుడు జీవితము గడుపసాగెను. అతని మనస్సు ఇంటివైపునకు వెళ్ళి అక్కడ తమ ప్రజలు మ్లేచ్ఛులవల్ల ఇబ్బందులకు గురియై వుందురు గదా! అని ఆలోచించసాగెను.

చింతాక్రాంతుడైయున్న రాజు దగ్గరకు కోమటి ఒకడు దుఃఖార్తుడై వచ్చెను. రాజు, కోమటితో "నీవెవరవు? నీకు వచ్చిన దీనపరిస్థితి ఏమిటి? ఏడు పదముల చేతనే నరులు పరస్పర మిత్రములగుదురు. కాన నేను నీకిపుడు మిత్రుడను. నీకున్న కష్టములను తెలుపుము అనగా నాకు మంచి మిత్రుడు దొరికెను అని భావించి" మిత్రమా నేను జాతికి కోమటిని. నా పేరు సమాధి. ధనికుడను, ధర్మనిరతుడను, సత్యవాదిని, అసూయలేని వాడను".

నా భార్యాపుత్రులు నన్ను పిసినిగొట్టునని నన్ను ఇంటినుండి గెంటివేసిరి. నేనిపుడు నిన్ను కలియుట సంభవించినది. మీరెవరో తెలపండని కోరగా రాజు "నన్ను సురథుడంటారు. మ్లేచ్ఛులు, నా మంత్రులు, నన్ను రాజ్యభ్రష్టుని చేయగా నేను ఈ వనమునకు వచ్చి చేరితిని. ఇప్పుడు నాకు నీవు మిత్రుడైతివని" చెప్పెను.

వైశ్యుడపుడు "నాభార్యాపుత్రులు ఎట్లున్నారోయని చింతించుచున్నాను" అనగా రాజు నిన్ను పుత్రులు తిరస్కరించినారు. వారికోసం నీవు చింతించిన

నీకు శాంతి కలుగదు. "దుఃఖము కలిగించు మిత్రుని కంటె మేలు చేయు పగవాడు గొప్పవాడు" అనెను.

హితకారీ వర్ణ శత్రుర్దుఃఖదా సుహృదః కుతః
తస్మాత్స్థిరం మనః కృత్వా విహరస్వ మయా సహ॥ 5-32-59

వైశ్యుడందుకు నరుడెంత చెడ్డవాడైనను తన కుటుంబమును గురించియే సదా చింతించుచుండును. అనగా రాజు కూడా నా మనసును కలతపడుచునే యున్నది. మనమిరువరుము పరమ శాంతుడగు మునిని చేరి శోక నాశనమగు తగిన ఔషధము నడిగెదము అని ముని వద్దకు వెళ్ళి రాజు మునితో ఇతడు వైశ్యుడు. పుత్రులతనిని వెడలగొట్టగా శాంతిని కోల్పోయి యున్నాడు. నేను రాజ్య భ్రష్టుడై సదా చింతాగ్రస్తులై ఇరువరుము యున్నాము.

మమ్ములను శోకసంద్రము నుండి విముక్తులను చేయుటకు జ్ఞానబోధ చేయవలసినదిగా కోరుతున్నామనగా మీకిరువురికి బంధ మోక్షముల కారణము వివరింతుము.

అన్ని ప్రాణులకు త్రిగుణముల సమావస్థ మహామాయ యనబడును. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, ఇంద్రాగ్ని వరుణులు, సకల దేవతలు, గంధర్వోరగ రాక్షసులు, మనుజులు, మృగ, పశు, పక్షులు, చెట్లు ఈ తీగలు మహామాయ కధీనములు. నీవొక క్షత్రియుడవు. రజోగుణముతో మలినుడవు. గొప్ప జ్ఞానుల చిత్తమును కూడా యీ మాయ సదా మోహింప చేయుచుండును అనగా సురధుడు ఆ దేవి మహోన్నతను తెలుపమని కోరెను.

రాజా! ఈ భగవతి మహామాయ, దేవికి జన్మ లేదు. నిత్య స్వరూపిణి. సర్వాత్మ రూపమున సకల ప్రాణులయందును విరాజమానమై యుండును. దేవతలు, మనుష్యులు ఈ దేవిని స్తుతించెదరు. ఈమె పూర్ణ స్వతంత్రురాలు.

బ్రహ్మ మొదలగు వారు కేవలము దర్శకులు మాత్రమే. సకల కార్యములకు కర్త, భర్త భగవతి జగదంబయే. సురథుడు భగవతి జగదంబను ఆరాధించు పద్ధతిని దయతో సమగ్రముగా తెలుపుమని కోరెను.

21. భగవతి పూజా విధానము

భగవతిని పూజించిన మానవుల మనోరథములన్నియు ఫలించును. స్నానమాచరించి, స్వచ్ఛమైన వస్త్రములను ధరించి ఆచమనము చేసి శరీరమును పవిత్రమొనరించు కొనవలెను. అలికిన భూమిమీద కూర్చుని ప్రసన్నచిత్తుడై, పూజాద్రవ్యములను సమకూర్చుకొని ప్రాణాయామము చేసి భూతశుద్ధి చేసుకొని, మంత్రమును చదివి, పూజాద్రవ్యము మీద నీటిని చల్లవలెను. ప్రాణప్రతిష్ఠ చేసి, సమయ జ్ఞానము ధ్యాసయందుంచుకొని, మాతృకాన్యాసము చేయువలెను.

రాగి పాత్రను తీసుకొని దానియందు శ్వేత చందనము అష్టగంధముతో షట్కోణయంత్రమును లిఖించవలెను. ఎనిమిది బీజాక్షరములను ఎనిమిది కోణములందు వ్రాయవలెను. తొమ్మిదవ అక్షరమును కర్ణిక మధ్యభాగమున లిఖించవలెను. యంత్రమునకు ప్రాణప్రతిష్ఠ చేయవలెను. యంత్రము చేయలేకపోయినచో ధాతువుతో భగవతి ప్రతిమను నిర్మించు విధానమున్నది.

పూజామంత్రములను పఠించుచు భగవతిని పూజింపవలెను. నవావర్ణమంత్రమును జపించవలెను. దశాంశ హవనము, హోమమునకు దేవి తర్పణమును బ్రాహ్మణ భోజనమును నిష్ఠతో జరుపవలెను. ప్రతిదినము దేవియొక్క మూడు చరిత్రలు పఠనము జరుగవలయును.

నవరాత్ర వ్రతమును చేయు పద్ధతి కూడ ఆశ్వీయుజ చైత్రమాసముల శుక్ల పక్షమున నవరాత్ర వ్రతమును చేయవలెను. హవనము విస్తృతముగ చేయవలెను. మంత్రములను పఠించి పాయసముతో హోమము

చేయవలయును. ఆ పాయసమునందు నెయ్యి, చక్కెర, తేనెను కలుపవలయును. ఉత్తమ బిల్వ పత్రముతో కూడా హోమము చేయవచ్చును. చక్కెరతో నువ్వులను కలిపి కూడా హోమము చేయు విధానము కలదు. అష్టమి, నవమి, చతుర్దశి తిథులందు విశేషముగా భగవతిని పూజింపవలెను.

పూజ నిర్విఘ్నముగా చేసినచో ధనహీనుడు ధనవంతుడగును. రోగి ఆరోగ్యవంతుడగును. తండ్రి ఆజ్ఞను పాలించు సుపుత్రుడు జన్మించును. శత్రువులను ఓడించు శక్తి రాజుకు, విద్యార్థులకు ఉత్తమ విద్య ప్రాప్తించును.

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు శూద్రులు జగదంబను పూజించుటకు అధికారులగుదురు. ఆశ్వయుజ శుక్లపక్షమునందు నవరాత్రులందు చేసిన సకల కోరికలు సిద్ధించును.

పూజాస్థానమును నిర్మించి వేదమంత్రములతో కలశస్థాపన చేసి, నాలుగు వైపుల బియ్యమును పోయవలెను. పూలమాలలతో భగవతిని స్థాపించు ఇల్లు ధూపదీపములతో సదాసంపన్నమై యుండవలెను. ప్రాతఃకాలము, మధ్యాహ్నము, సంధ్య ఈ మూడు కాలములందు భగవతిని పూజింపవలెను.

చండిక పూజయందు శక్తికి తగిన ధనము ఖర్చు చేయవలెను. గీత వాద్యములు, స్తోత్రపాఠము, వేద పారాయణము, సకల ఉపచారములు చేసి దేవి పూజ జరుగవలెను, కన్యలను శాస్త్రోక్తముగా పూజింపవలెను.

రాజా! నీవు ఈ విధముగా చండికను ఆరాధింపుము. శ్రేష్ఠమగు రాజ్యమును పొందుదువు. నీ భార్యాపుత్రులు నీకు లభ్యమగుదురు.

వైశ్యశిరోమణీ! నీవు కూడా మహామాయ భగవతిని ఆరాధింపుము. భగవతి అనుగ్రహమున నీవు ఇంటికి వెళ్ళగానే బంధుభాంధవులు నిన్ను

ఆదరించెదరు. సాంసారిక భోగములను యథేచ్ఛగా అనుభవించెదవు. దేవి యొక్క పవిత్ర లోకమునకు వెళ్ళుదువు.

బిల్వపత్రము, గన్నేరు, కమలము, చంపకాది పుష్పములతో భగవతి జగదంబను పూజింపవలెను. వేదమంత్రములతో దేవిని ఆరాధించువారు ధనవంతులుగ, సద్గుణవంతులుగా, తలమానికము కలిగిన రాజుగా ఉండగలడు.

సుమేధమహాముని మాటలను విని రాజగు సురథుడు, వైశ్యుడగు సమాధియు భక్తికి జాగృతులైరి. మంత్రోపదేశము చేసి మమ్ములను ఉద్ధరింపుమని వేడుకొనిరి. అప్పుడు సుమేధుడు ధ్యానబీజముతో గూడిన నవాక్షర మంత్రమును ఉపదేశించెను.

మంత్రోపదేశము పొందిన రాజును, వైశ్యుడును నిర్జన ప్రదేశమున శాంతచిత్తులై జపతత్పరులైరి.

ధ్యానమొనరించుచూ ఒకమాసము, నిరంతరము లగ్నమై సంవత్సర కాలము, రెండు సంవత్సరములు గడిచిన తరువాత స్వప్నమందు వారికి భగవతి జగదంబ యొక్క మనోహర దర్శనభాగ్యము కలిగెను.

మూడవ సంవత్సరము కూడా గడిచిపోగా దుఃఖితులై శరీరమును వదలిపెట్టుదుమని నిశ్చయించుకొనగా అపుడు భగవతి ప్రత్యక్షమయ్యెను.

రాజుతో నీవు నీ రాజ్యమునకు వెళ్ళుము. నీ శత్రువులు, నీ మంత్రులు నీ పాదములపైపడి శరణువేడుదురు. నీవు పదివేల సంవత్సరములు రాజ్యము పాలించి, తదుపరి నీవు సూర్యుని వద్ద జన్మించి మనువు పదమును పొందెదవు.

వైశ్యుడు దేవితో నాకు ఇల్లు, భార్య, ఇవన్నియు బంధములే కనుక జ్ఞానము ప్రసాదించి బంధవిముక్తిని గావించుమని కోరుకొనెను. అదేవిధంగా దేవి అతని కోరికను తీర్చి అంతర్ధానమయ్యెను.

సుమేధ మునికి సురథుడు నమస్కరించి రాజధానికి చేరుకొని పృథివిని పాలించసాగెను. ముక్తుడై వైశ్యుడు పరమజ్ఞాని అయ్యెను.

ఈ పవిత్ర ఉపాఖ్యానము వినుట వలన జ్ఞానము, మోక్షము, యశస్సు, సుఖము, అన్నియును సులభమగును. సకల మనోరథములను నెరవేర్చు ఈ గాథ ధర్మార్థకామ మోక్షములకు కారణమని అంగీకరింపబడినది. జనమేజయ మహారాజుకు వ్యాసుడీకథను వినిపించెను.

సర్వే జనా స్సుఖినో భవంతు - ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

* * *

దేవీ భాగవతము

దేవీనవరాత్రులు - నాల్గవరోజు కథ

1. వృత్రాసురుడు

ఋషిగణములు సూతమహర్షీ! త్వష్టపుత్రుడు వృత్రాసురుడు. ఇంద్రుడు వృత్రాసురుని యుద్ధములో వధించెను. అతడు బ్రహ్మవంశమున జన్మించెను కదా. ఇంద్రుడు కపటముతో నీటినురుగు ద్వారా వధించడం బ్రహ్మహత్యాపాతకం ఇంద్రునకు సంక్రమించెనా? దీని యందలి రహస్యమేమి? అని కోరిరి.

వృత్రాసురుని వధించిన గాథ ప్రాచీనమైనది. దేవతలు తమ ప్రయోజనము సిద్ధింపచేసుకొనుటకు ఈ పనికి పూనుకొనిరి. త్వష్టను ప్రజాపతిగా నియమించిరి. ఆయన దేవతల కార్యములన్నియును వ్యవస్థీకరింపబడుచుండెడివాడు. త్వష్ట ఒక పుత్రుని ఆవిర్భవింపజేసెను. అతనికి మూడు తలలుండెను. విశ్వరూపుడను పేరుతో ప్రసిద్ధిచెందెను. అతడు ఒక ముఖముతో వేదములను పఠిస్తూ, రెండవ ముఖముతో మధుపానము చేస్తూ, మూడవ ముఖముతో సకలదిశలను చూచెడివాడు.

విశ్వరూపుడు అన్ని భోగములకు విరక్తుడై, తాపస జీవితమునకు పూనుకొని, వేసవికాలమునందు పంచాగ్నుల మధ్య, వర్ష ఋతువునందు వృక్షములనీడలో, శరత్ హేమంత ఋతువులందు నీటిలో తపస్సు చేసెడివాడు. విశ్వరూపుడు చేస్తున్న తపస్సును చూసి ఇంద్రునకు భయం వేసింది.

ఇంద్రుడు త్రిశిరుని (విశ్వరూపుడు) తపస్సు భంగపరచుటకు ఏదైనా ఉపాయమును చేయవలయునని తలచి ఊర్వశి, మేనక, రంభ, ఘృతాచి, తిలోత్తమ మొ॥ అప్సరసలను పిలిపించెను. మీరిపుడు అతని తపస్సు

భంగము కావించవలెనని కోరగా, అప్సరసలు త్రిశిరుని మోహింప చేయుటకు మేము అన్ని ప్రయత్నములు చేసెదమనిరి. వారు త్రిశిరుని దగ్గరకు వెళ్ళి మురిపింప ప్రయత్నించిరి. ఆ మునీంద్రుని దృష్టిని మరల్చలేక విఫలమై వారు ఓటమిని అంగీకరించి ఇంద్రుని దగ్గరకు వెళ్ళి, ఆ మునీంద్రుడు అగ్నివలె తేజరిల్లుతున్నాడు. మేమెట్లో శాపమునకు గురికాలేదు అని చెప్పి వెళ్లిపోయిరి.

ఇంద్రుడు ఐరావతమునెక్కి త్రిశిరుని దగ్గరకు వెళ్లి, ఇతడు నా సింహాసనమును చేజిక్కించుకొనవలెనని కోరుచున్నాడు. ఉపేక్షింపకూడదని భావించి వజ్రాయుధముతో మునీంద్రుని నేలకొరుగునట్లు ఒక్క దెబ్బతో వధించెను.

అపుడక్కడ ఉన్న మునులు అయ్యో! ఈ ఇంద్రుడు మహాపాపి. మునీంద్రుని చంపి బ్రహ్మహత్యవలన కలుగు పాపఫలమును ఇంద్రుడు తప్పక అనుభవించును అనిరి. మునీంద్రుడు ప్రాణముండినవానివలె వెలుగుచుండెను. ఇంద్రుని ఎదుట తక్షుడనువాడుండెను. తక్షా! నీవు మునీంద్రుని మస్తకమును త్రుంచివేయుమనెను. తక్షుడు ఇంద్రునితో నీవు చంపినవానిని మళ్ళీ నేను చంపుట పాపకార్యము అనగా ఇతనిని నీవు చంపిన యెడల సకల యజ్ఞములందు భాగమునిచ్చుటకు నిర్ణయించినాను అని చెప్పెను.

తక్షుని మనస్సులో లోభము చోటుచేసుకొని త్రిశిరుని మూడు శిరస్సులు మళ్ళీ ఖండించెను. ఆ తలలు క్రిందపడగానే ముఖమునుండి పావురములు, తిత్తిరిపక్షులు, గోరువంకలు వేరువేరుగా పుట్టెను. అపుడు ఇంద్రుడు సంతోషముతో స్వర్గమునకు వెళ్ళిపోయెను.

త్వష్ట కుమారుడు సంహరింపబడగా క్రోధాగ్ని బయల్వెడలెను. నేను మరలా పుత్రుని పొందుదునని వేదమంత్రమును ఉచ్చరించుచు అగ్నిలో హవనము చేయనారంభించెను. ఎనిమిది రాత్రులు ఆ యజ్ఞము

జరుగుచుండెను. ఆ అగ్నినుండి ఒక పురుషుడు ప్రకటమయ్యెను. త్వష్ట బాలకా! నీవు ఇంద్రుని శత్రువువు. నీవు తపఃప్రభావముతో అత్యంత శక్తిశాలివగుము అనెను.

ఆ బాలుడు తండ్రీ! నేనేమి చేయవలయునో ఆజ్ఞాపింపుడు. "నేను సూర్యుని గమనమును ఆపివేయమందువా? ఇంద్రుని, యమరాజును సంహరింపవలెనా? సముద్రమును విసరివేయుదునా?" అని అడుగగా త్వష్ట పుత్రా! నీవు నా కొరకు జింకచర్మమును తీసికొని రమ్ము. నీవు సమర్థుడవగుదువు. 'వృత్రు'డను పేరుతో ఈ జగత్తునందు ప్రసిద్ధుడవగుదువు. నీకు త్రిశిరుడను పేరుతో సోదరుడుండెను. వానికి మూడు మస్తకములుండెను. ఇంద్రుడు తన వజ్రముతో అతనిని వధించెను.

పురుషవ్యాఘ్రా! ఆ పాపియగు ఇంద్రుని నీవు ఓడించవలెనని నా కోరిక. ఇంద్రుని వధించుటకు గొప్ప ఆయుధములను సిద్ధము చేసి, సుదృఢమైన రథమును వృత్రాసురునకు ఇచ్చెను. అతనిని యుద్ధము చేయుమని ఆదేశించెను.

వృత్రాసురుడు ఇంద్రుని వధించుటకు బయలుదేరెను. ఇంద్రుని గుప్తచరులు తెలిసికొని వెళ్ళి వృత్రాసురుని రాకను గురించి తెలిపిరి. త్వష్ట ఈ వృత్రాసురుడనే రాక్షసుని ఆవిర్భవింపచేసెను. మఘవా! స్వర్గమునందు అనేక విధములైన అపశకునములు కలుగుచున్నవి. అనిష్టసూచకముగ అంగములు అదరుచున్నవి అని చెప్పగా ఇంద్రుడు బృహస్పతిని పిలిపించి తన మనస్సులోనున్న విషయమును తెలిపెను.

ఇంద్రుడు బృహస్పతితో మీరు దేవతలకు గురువులు. ఈ శత్రువులను నశింపచేయుటకు శాంతి ఉపాయమేదైనను నాకు తెలుపుడు. అనగా బృహస్పతి సహస్రాక్షా! ఇపుడు నేనేమి చేయుదును. నీవు నిరపరాధియగు మునీంద్రుని వధించి ఈ చెడు ఫలితమునకు భాగస్వామివి ఎందుకైతివి.

పరోపతాపనం కర్మ నకర్తవ్యం కదాచన
న సుఖం విందతే ప్రాణీ పరపీడా పరాయణః ॥
(స్కం.6 - అధ్యా.3 - శ్లో. 23)

నీవు మోహలోభములకు లోనై బ్రహ్మహత్యనొనరించితివి. దేవతలంతా కలిసినా ఈ వృత్రాసురని సంహరించలేరు. ఇట్లు బృహస్పతి పలికిన మాటలను విని దేవతలందరును ఇళ్ళను వదలి వెళ్ళిపోయిరి. అపుడు ఇంద్రుడు వసువులను, రుద్రులను, అశ్వినీకుమారులను ఆదిత్యులను ఇచటకు తీసికొనిరండు, పూషా, భగుడు, వాయువు, కుబేరుడు, వరుణుడు, యముడు మొదలుగా గల సకల ప్రముఖ దేవతలు అస్త్రశస్త్రములతో రావలసినదిగా ఆదేశించి ఇంద్రుడు వారితో యుద్ధమునకు బయలుదేరెను.

వృత్రాసురుడు దానవులను వెంటనిడుకొని మానస పర్వత ఉత్తర భాగమును చేరుకొనెను. ఇంద్రునకు, వృత్రాసురునకు గొప్ప సంగ్రామము జరుగసాగెను. వంద సంవత్సరములు యుద్ధము జరుగుచుండెను. ఋషుల మనస్సులలో భయము నెలకొనెను. వరుణునకు శృంగభంగము కలిగెను. వాయుగణములు విచలితము లయ్యెను. యముడు, అగ్ని, ఇంద్రుడు, సకల దేవతలు యుద్ధభూమినుండి పారిపోయిరి.

వృత్రాసురుడు సంతోషముతో త్వష్టదగ్గరకు తిరిగివెళ్ళెను. తండ్రీ! నేను నీ కార్యమును సఫలమొనర్చితిని. ఇంద్రాది సకల దేవతలు యుద్ధమునందు నిలువ జాలక పరాజితులై పారిపోయిరి. ఇంద్రుడు కాలినడకనే పారిపోయెను. అతని ఏనుగును నేను పట్టి తెచ్చితిని. ఈ ఐరావతమును మీరు స్వీకరింపుడని కోరెను.

వృత్రాసురుని మాటలను విని త్వష్ట ఆనందమునకు అవధులు లేకుండెను. నాయనా! పుత్రా! నీవు నన్ను పవిత్రుని చేసితివి. నీవిపుడు

తపమొనరించుట ఆవశ్యకము. నీ శత్రువగు ఇంద్రుడు మహా కపటి. తపస్సువలన లక్ష్మి ప్రాప్తించును. తపఃప్రభావముననే ప్రాణి యందు బుద్ధియును, బలమును చేకూరును. నీవిపుడు మహాత్ముడగు బ్రహ్మదేవుని ఆరాధింపుము.

నీవు శ్రేష్ఠములైన వరములను పొంది ఇంద్రుని ఉనికిని నశింపచేయుము. శంకరుడు గొప్ప దానగుణ సంపన్నుడు ఆ స్వామిని ఉపాసింపుము. బ్రహ్మదేవుని సంతుష్టుని చేసి నీవు అమరత్వమును పొందుము. ఆ పాపియగు ఇంద్రుని పరాజితుని చేయుమనెను.

త్వష్ట ఆదేశముతో వృత్రాసురుడు తపమొనరించుటకు బయలుదేరెను. గంధమాదనపర్వతమును చేరుకొనెను. అచట పుణ్యసలిల గంగ ప్రవహించుచుండెను. శాంతచిత్తుడై యోగాభ్యాసము నందు మనస్సును నిలిపి బ్రహ్మను ధ్యానింపసాగెను. వృత్రాసురుని తపమును గురించి తెలిసికొని ఇంద్రుడు చింతించసాగెను.

వృత్రాసురుని తపము విఘ్నము చేయుటకు ఇంద్రుడు గంధర్వులను పంపెను. వారు తపస్సునకు నష్టము కలిగించుటకు అన్ని విధముల ప్రయత్నించిరి. వృత్రాసురుని లక్ష్యమునుండి ఏ కొంచమైనను విచలితుని చేయ జాలకపోయిరి.

2. వృత్రుడు దేవతలను జయించుట

వృత్రాసురుడు వంద సంవత్సరములు తపస్సు చేయగా బ్రహ్మ అచటికి వచ్చెను. త్వష్టనందనా! నేను నీ కోరికను తీర్చుటకు వచ్చాను అనగానే వృత్రుడు వినయంగా బ్రహ్మచరణములకు ప్రణమిల్లి ప్రభూ! నన్ను లోహముతో కాని, కట్టతోగాని తయారైన ఎండిన, తడిసిన దేనితోనైనా, ఇవేగాక ఇతర వేటితోనైనా శస్త్రాస్త్రములతోనైనా నాకు మృత్యువు కలుగరాదు అని కోరగా బ్రహ్మ అతనికి వరములనిచ్చి తన లోకమునకు వెళ్ళిపోయెను.

వరప్రసాదితుడైన పుత్రుని పొంది త్వష్ట మిగుల ప్రసన్నుడయ్యెను. కుమారునితో ఇప్పుడు నా శత్రువగు ఇంద్రుని ఓడింపుము. స్వర్గమును శాసించు అధికారమును చేజిక్కించుకొనుము. తండ్రి మరణించినచో గయ యందు పిండప్రదాన మొనరింపుము.

జీవతో వాక్యకరణాత్ క్షయహే భూరిభోజనాత్
గయాయాం పిణ్డదానా చ్చ త్రిభిః పుత్రస్యపుత్రతా ॥
(6వ స్కం. 4వ అధ్యా. 15వ శ్లో.)

వృత్రాసురుడు యుద్ధయాత్ర చేసెను. అతని విశాలసైన్యముయొక్క గర్జనతో అమరావతి భీతిల్లెను. వృత్రాసురుడు వస్తున్నాడని తెలిసి ఇంద్రుడు లోకపాలురను రప్పించెను. గరుడ వ్యూహమును నిర్మించి దాని మధ్యభాగమున స్వయముగ ఇంద్రుడే విరాజమానుడయ్యెను.

వృత్రాసురుడు ఇంద్రుని పట్టుకొని తన నోటిలో వేసుకొనెను. వృత్రాసురుడు ఇంద్రుని మ్రింగివేయుటను చూచి దేవతలు ఇంద్రుడు వధింపబడెను, దేవరాజు వృత్రాసురుని నోటిలో దాగి ఉన్నాడని సకలదేవతలు తెలుసుకొనిరి.

వారు బృహస్పతికి ప్రణామమొనర్చి ప్రభూ! మీరు ఇంద్రుని ఉ ద్ధరించుటకు ఏదైనా అనుష్ఠానము చేయుము. వృత్రాసురుడు ఇంద్రుని మ్రింగినను ఇంకను జీవించియేయున్నాడు అనిరి.

అంతట బృహస్పతి ఆవులింతను సృష్టించెను. వృత్రాసురుడు ఆవులించుటకై పెద్దగా నోరు తెరచెను. అపుడింద్రుడు తన అంగములను చిన్నవిగా చేసి నోటి నుండి బయటకు వచ్చెను. అప్పటి నుండియే జగత్తు నందు ఆవులింత ఉద్భవించెను.

భయంకరమగు దేవ దానవ సంగ్రామము పదివేల సంవత్సరముల వరకు జరుగుచుండెను. వృత్రాసురునకు జయము కలుగగా సకల దేవతలు

యుద్ధభూమిని వదలి పారిపోయిరి. వృత్రాసురుడు దేవలోకమున తన అధికారమును స్థాపించెను.

ఐరావతగజమును తన వాహనముగా చేసికొనెను. ఉచ్చైశ్రవమను అశ్వము, కామధేనువు, పారిజాతవృక్షములు, అప్సరలతో వృత్రాసురుడు అధికారము కలిగియుండెను. దేవతలందరూ పర్వత గుహల నాశ్రయించిరి. వారికి యజ్ఞ భాగములు లభించుట కూడా ఆగిపోయెను.

దేవతలందరు శంకరుని ప్రణమిల్లిరి, స్థానభ్రష్టులమైన మేము దేవతలందరము ఏమి చేయవలయును? అనగా అపుడు శివుడు బ్రహ్మను ముందిడుకొని దేవతలందరు శ్రీహరి దగ్గరకు వెళ్ళవలెను. వాసుదేవుడు సర్వసమర్థుడు. ఆ దేవేశ్వరుని శరణు పొందకుండ ఏ కార్యమును సిద్ధించదు.

సకల దేవతలు విష్ణుధామమును చేరుకొని పురుష సూక్తమంత్రముచేత విష్ణు భగవానుని స్తుతింపసాగిరి. అపుడు రమాపతి వారి ఎదుట ప్రత్యక్షమై మీరందరు ఇక్కడకు వచ్చుటకు కారణమేమని అడిగెను. నేను మీ కష్టమును తొలగించుటకు ప్రయత్నముచేసెదను.

వృత్రాసురుడు తపస్సు చేసి బ్రహ్మను మెప్పించి వరములను పొందెను. మీరందరూ ఆ దానవుని దగ్గరకు వెళ్ళి సామనీతిని ఆశ్రయించుడు. నేను వజ్రాయుధము నందు గుప్తరూపమున ప్రవేశించెదను. మీరు భగవతి యోగమాయ వద్దకు వెళ్ళుడు. ఆమెను శరణు జొచ్చి మంత్రమును పఠించి స్తుతింపుడు. ఆ దేవి కామరూపిణి. దుష్టులకు ఆ తల్లి దర్శనము దుర్లభము. ఆ దేవిని ఆరాధించుట వలన కేవలము ఇంద్రుడే సంగ్రామరంగమున శత్రువులను వధించగలడు.

పరమ పూజ్యురాలగు జగదంబ ఆవిర్భవించినప్పుడే ఇదంతయును జరుగగలదు. సాత్విక దృష్టిని అవలంబించి ఆ ప్రకృతిదేవిని ఆరాధింపుడు.

పూర్వము మధుకైటభుల సంహార విషయమున భగవతి జగదంబనే స్తుతించితిని. మధుకైటభులను దేవి మోహింపచేయగా నేను వారిని వధించగలిగితిని అని చెప్పెను.

విష్ణువు మాట విని దేవతలు సుమేరు పర్వతమునకు వెళ్లి ధ్యానమును ప్రారంభించిరి. దేవిని స్తుతించుటయందు దేవతలు లగ్నమైరి. వృత్రాసురుని వలన మేము మిగుల ఇడుములు పొందితిమి. ఈ చరాచర త్రిలోకముల సృజన కార్యము మీమీదనే ఆధారపడియున్నది. పుత్రుడు సాక్షాత్తు అపరాధి అయినను వానిని రక్షించుట తల్లి కర్తవ్యము.

జననీ మునుపు మహిషాసురుని మీరే వధించితిరి. మీ చేతులలోనే శుంభ నిశుంభులు వధింపబడిరి. ఇపుడు గూడా వృత్రాసురుని వధించి మమ్ములను రక్షింపవలెను. భవాని! మేము మీ చరణ కమలములకు ప్రణమిల్లుటయే మా కర్తవ్యమని తలుచుకొందుము.

యోగిజనులు కూడా ముక్తిని పొందకోరుచు హోమము చేయునపుడు వారి ద్వారా సదా మీ స్మరణయే జరుగుచుండును. దేవతలను సంతుష్టులను చేయుటకు "స్వాహా", పితరులను సంతుష్టులను చేయుటకు "స్వధా". ఈ శబ్దములు ఉచ్చరింపబడును. మేధా, కాంతి, శాంతి, అట్లే గొప్ప మనోరథములను నెరవేర్చు ప్రసిద్ధమైన బుద్ధి కూడా మీరే.

వసంత తిలక – దేవీ మముం గనగదే దయ లోకధాత్రీ
నీవేగదా సకలనేత్రి విజ్ఞానమూర్తీ
యీ విశ్వమందు ఘను లెవ్వరు మమ్ము నెప్డున్
బ్రోవంగ జాలుదురు భూతవితానభర్త్రీ.

వనమయూర బిడ్డలము మేము మము పెంచినది నీవకా
యెడ్డెలగు రాక్షసుల నెట్లు వధియించి మా
యడ్డములు దీర్చెదవొ యమ్మ నిన్నువేడుటే
దొడ్డపని వేరొకటితోచదు పరాకొకో

చిన్న బిడ్డలు తప్పు జేసినను వారిన్
గన్న తల్లులు సూచి కాచెదరుగా నీ
కన్న మాకిక దిక్కొకండు గలదే ని
న్నె న్న నెవ్వరు శక్తులీశ్వరివి నీవే

మ.కో. మున్ను మహిషుని జంపి మమ్ముల మోదమందగఁ జేయవే
యెన్న శుంభ నిశుంభులన్ వధియించి దుఃఖము దీర్పవే
బన్న మొందితమమ్మ వృత్రుని బాధ లెన్నడు దప్పునో
నిన్ను వేడితిమమ్మ యిప్పుడు నిశ్చలాత్ములమై కడున్

ఇట్లు దేవతలు స్తుతించగా భగవతి ప్రత్యక్షమయ్యెను. సకలాభరణములు ధరించి, పాశము, అంకుశము, అభయముద్రల చేత సంపన్నురాలై నాలుగు భుజములతో శోభిల్లుచుండెను. మస్తకము నందు మకుటమును ధరించియుండెను. ఆ దేవి విగ్రహము సత్, చిత్, ఆనందమయము.

జగదంబ ఆ దేవతలతో మీకు కలిగిన కష్టము తొలగుటకు వృత్రాసురుని మోహింపజేయుటకు ఏర్పాట్లు చేసుకొనుడు. దేవతల యెడల విశ్వాసము కలిగినచో అతనిని తుదముట్టించవచ్చును అని చెప్పి అంతర్ధానమైనది.

దేవతలంతయు వృత్రాసురుని స్థలమునకు వెళ్ళి ప్రియవచనములతో తమ కార్యమును పూర్తి చేసుకొనుటకు సామనీతిని ఉపయోగించిరి. వృత్రాసురునితో సంధి చేసుకొనుటకు ప్రసన్నుని చేసుకొనిరి.

వృత్రాసురుడు దేవతలతో దేవేంద్రుడు వజ్రముతో గాని, ఎండిన, తడిసిన అస్త్రములతో నన్ను చంపడానికి పూనుకోకపోతే మనము సంధి చేసికొనవచ్చును అనెను.

ఆ మాటతో ఇంద్రుడు, వృత్రాసురుడు మిత్రులై గంధమాదన పర్వతముపై, నందనవనమున, సముద్రతీరమున విహరించుచుండిరి. కాని ఇంద్రుడు మాత్రం వృత్రాసురుని వధించుటకు సమయమెప్పుడా అని ఎదురు చూచుచుండెను.

వృత్రునితో త్వష్ట ఇట్లు పలికెను. ఇంద్రుడు నీకు పూర్వవైరి. ద్వేషించు బుద్ధి కలిగిన ఇంద్రుని నీవు విశ్వసింపరాదు అని చెప్పగా మృత్యువు తలమీదనున్న కారణమున అతడా మాటల మీద ధ్యానమునుంచలేదు. ఇంద్రుడు వృత్రాసురుని సముద్రతీరమున చూచెను. ఇపుడు సంధ్యాసమయము. ఇది రాత్రియును కాదు, పగలును కాదు. ఈ నిర్జన ప్రదేశమున ఇతడు ఒంటరిగనే నాకు లభించినాడు అని తలచెను.

ఇంద్రునకు సముద్రమున ప్రవహించుచున్న నీటి మీద ఉన్న నురుగు మీద దృష్టిపడెను. నురుగు ఎండినది కాదు, తడిసినది కాదు, ఇది శస్త్రము కూడా కాదు అని భగవతిని ధ్యానించుటయందే ధ్యాస నిలపగా భగవతి అచటికేతెంచెను

దేవతలందరు ఒకచోటికి చేరి స్తోత్రము చేయుచు దేవిని ప్రసన్నురాలను చేసికొనిరి. భగవతి మూర్తిని తమ దివ్య రూపము ఉపవనమునందు ప్రతిష్ఠించిరి. ప్రాతః, మధ్యాహ్న, సాయంత్రం మూడు సమయములందు విశేషముగా దేవిని అర్చించిరి. ఇంటింటా ఆ దేవిని ఉపాసించుట అనివార్యమయ్యెను. విష్ణువును కూడా ఇంద్రుడు పూజించెను. గంధర్వులు, యక్షులు, రాక్షసులు, కిన్నరులు అందరును ఉత్సవములు చేసికొనసాగిరి. పరాశక్తి ప్రవేశించిన నురుగు ద్వారా వృత్రాసురుని సంహరించుటకు ఇంద్రునకు మిగుల సులభమయ్యెను.

వృత్రుని వధించిన హత్యాభయముతో ఇంద్రుడు మిగుల వ్యాకులతకు లోనయి అమరావతిని చేరెను. మునుల మనస్సులో భయము

వ్యాపించియుండెను. మనము ఈ నీచకార్యమునకు తోడ్పడితిమి. ఇపుడు 'ముని' అను శబ్దము నిరర్థకమయ్యెను.

ధర్మ, అర్థ, కామ మోక్షములను పదార్థములందు ధర్మమోక్షములు మాత్రమే సారవంతములు. నేడు ఇవి కూడా నశించెను కదా అని ఆలోచించసాగిరి.

మంత్రకృద్ బుద్ధి దాతా చప్రేరకః పాపకారిణామ్
పాపభాక్ సభవేన్నానం పక్షకర్తా తథైవచ ॥

(3వ స్కం. 15వ అధ్యా. 57వ శ్లో.)

త్వష్ట తన కుమారుడైన వృత్రాసురుని మరణవార్త తెలిసికొని అతనికి పరలోక సంస్కారములు చేసి మిగుల వ్యాకులతతో ఈ 'ఇంద్రుడు అనేక దుఃఖములను అనుభవించుగాక' అని శపించి తను సుమేరు పర్వతమునకు వెళ్లిపోయెను.

జనమేజయుడు పితామహా! వృత్రుని వధించిన ఇంద్రునకు ఏ గతి పట్టినది అని అడుగగా వ్యాసుడు కర్మఫలమును దేవతలైనా, దానవులైనా, మానవులైనా అనుభవించవలసినదే.

తే.గీ. సంపదలు గల్గినప్పుడు సకలజనులు
తోడుగా నుండుదురుగాని గోడుగుడుచు
నాడు గన్నుల కగపడ రేడనేని
పారిపోవుదురు లోకస్వభావమిదియు,

తే.గీ. కలిమి గలిగిన దనకాంతగాళ్ళు గడిగి
యౌదలను జల్లుకొను గొంచె మాపదైన
మూతి చిట్లించు విరచును మునుమెటికల
యిడుమలందు సహాయులై యెవ్వరుండ్రు.

ఉ. నిందకు బాత్రుడయ్యె సురనేత యసత్యములాడె నౌర గో
విందుడు దోడుగా స్వహితవృత్తుని వృత్రుని మాయజేసి తా
కొందలపెట్టి చంపె నిది కూడదటంచు జగంబులాడ వే
సందుల గొందులన్ మరియు చాటుల మాటుల నెల్లచోటులన్

అపుడు ఇంద్రుని తేజస్సు మిగుల క్షీణించి యుండెను. "ఈ ఇంద్రుడు బ్రహ్మఘాతి" అని దేవతలందరును అతనిని నిందించుచుండిరి, వృత్రుని వధించవలెనను కోరికతో ఇంద్రుడు ఈ దుష్కర్మకు పాల్పడెనని అందరును చెప్పుకొనసాగిరి.

తన కీర్తిని నశింపచేయు మాటలను ఇంద్రుడు వినుచుండెను. అతనిని చూచి శత్రువులు నవ్వుటను గమనించెను. ఇంద్రద్యుమ్నుడను రాజర్షి పాపమును చేయలేదు. అతనిని స్వర్గమునుండి వెడలగొట్టిరి. యయాతిని స్వర్గము నుండి బహిష్కృతుని చేసిరి. పదునెనిమిది జన్మలవరకు కర్కట యోనిలో ఉండవలసివచ్చెను. ఇంద్రుని స్థితిని గమనించి ఇంద్రాణి ఇంద్రునితో మీరు ఇంత చింతించుటకు బలమైన శత్రువులెవ్వరును లేరు కదా! అని అడిగెను.

దేవీ! నన్ను బ్రహ్మహత్యాదోషము వెంటాడుచున్నది. నా అంతఃకరణము నందు అగ్నిరగుల్కొనుచున్నది అని శచీదేవితో అనెను. ఇంద్రుడు మానస సరోవరము చేరుకొని కమళనాళము నందు దాగెను. అనేక ఉపద్రవములు కలుగుచుండెను. సకల జగత్తునకు శాసకుడెవరును లేరు. మేఘములు వర్షించుటనాపివేసెను. పృథివియందు ధాన్యమును పండించు శక్తి లేకుండెను. అరాచకము వ్యాపించియుండెను.

దేవతలు, మునులు పరస్పరము ఆలోచించి నహుషుని ఇంద్రపదవి యందు నియమించిరి. నహుషుడు ఇంద్రపదవి యందు నియమితుడవగానే రాజస వృత్తి ఉత్పన్నమయ్యెను. శచీదేవి గుణములను

విని నహుషుని మనస్సులో ఆమెను పొందవలయునన్న కోరిక ఉద్భవించెను.

ఋషులతో దేవతలారా! నన్ను సేవించుటకు శచీదేవిని కూడా ఇచటకు పంపుడు. నన్ను శచీదేవి సంతోషపెట్టవలయునని చెప్పగా ఋషులకు బాధకలిగెను. నహుషుడు నిన్ను పొందు కోరికను వెలిబుచ్చుచున్నాడు అని ఋషులు తెలుపగా శచీదేవి ముఖము వాడిపోయెను. బృహస్పతి వద్దకు వెళ్లి నన్ను కాపాడమని కోరగా శచీదేవిని కాపాడుదునని మాట ఇచ్చెను.

అప్పుడు నహుషుడు బృహస్పతిని వధించెదనని పలుకగా దేవతలు, ఋషులు సామనీతిని ఉపయోగించుచు నహుషునితో చెప్పిరి. రాజేంద్రా! శచీదేవి పరమపతివ్రత. ఇతర స్త్రీని పొందు కోరికను విడనాడుము. మీరు నీచకర్మను వదలిపెట్టి సాత్వికబుద్ధిని ఆశ్రయింపుము అనిరి.

నహుషుడు కామాతురుడైనందున ఇంద్రాణిని మీ దగ్గరకు తెచ్చెదము అని దేవతలు పలికిరి. బృహస్పతి వద్దకు వెళ్ళి శచీదేవి నహుషునితో పతిదేవుడు జీవించియున్నచో నేను ఇంకొకరిని భర్తగా ఎట్లు స్వీకరింతును అని చెప్పునట్లు అంగీకరింపచేసిరి.

శచీదేవి దేవతలతో కలిసి నహుషుని వద్దకు వెళ్ళి నా భర్త ఉన్నాడా లేదా నాకు తెలియవలయును అని కోరెను. దేవతలు ఇంద్రుని గురించి తెలుసుకొను ప్రయత్నములో విష్ణుధామమునకు చేరిరి. విష్ణువు దేవతలతో బ్రహ్మహత్యాపాతకము నుండి ముక్తుడగుటకు ఇంద్రుడు అశ్వమేధయజ్ఞమును చేయవలయును. అప్పుడతనికి ఇంద్రపదవి లభించుననెను.

అశ్వమేధయజ్ఞము భగవతి జగదంబను సంతుష్టురాలను చేయుటకు ఒక గొప్ప సాధనము. జగదంబ బ్రహ్మహత్య మొదలగు సకలపాపములను

నశింపచేయును. ఇంద్రాణి కూడ భగవతి జగదంబను ఆరాధించుట యందు సంలగ్నురాలు కావలయును. ఈ నహుషుడు చేసిన పాపముల వలన తొందరగా సంహరింపబడును. ఇంద్రుడు తన సంపదలను తిరిగిపొందును. అతని సింహాసనము మరలా లభ్యమగును.

విష్ణువు చెప్పిన మాటలను విని బృహస్పతితో కలిసి ఇంద్రుని వద్దకు వెళ్ళి యజ్ఞము సంపన్న మొనరించగానే బ్రహ్మహత్యను విభజించి వృక్షముల మీద, నదుల మీద, పర్వతముల మీద, స్త్రీలమీద విసరివేసెను. ఇప్పుడు ఇంద్రుడు పరిశుద్ధుడయ్యెను. మంచిదినములు కోసం కమలనాళమును ఊతగా చేసుకొని ఎవరికి కనిపించక జలము నందే ఉండిపోయెను. ఇంద్రాణి దుఃఖము అట్లేయుండెను.

బృహస్పతితో నేను నా భర్తను తిరిగి పొందుటకు తగిన ఉపాయము తెలుపవలసినదిగా కోరుతున్నాననగా బృహస్పతి పౌలోమీ; నీవు జగదంబను ఆరాధింపుము. ఆమె మాత్రమే నహుషుని శక్తిని కుంఠితము చేయగలదు అనగా ఇంద్రాణి భువనేశ్వరిని చక్కగా ఆరాధింపసాగెను. పూర్ణ తపస్విని అయ్యెను.

ఇంద్రాణి ప్రాణనాథుని దర్శించు కోరికతో జగదంబను ఆరాధిస్తుండగా ఆ దేవి ప్రసన్నురాలై దర్శనభాగ్యం కలిగించింది. ఆమె నాలుగు వేదములతో సుశోభితురాలై ఇంద్రాణితో నీకు వరములిచ్చుటకే నేను వచ్చాను. అనంతకోటి జన్మల పుణ్యఫలముననే ప్రాణులకు నా దర్శనము కలుగును అనెను.

సీ. పాశాంకుశాభయవరములు ధరియించి నాలుగు భుజములీల దనర
కోటిసూర్యులతోడ దీటైన ప్రభలతో శశికోటి శీతలస్వాంత యగుచు
క్షణిక ప్రభాకోటి సమమైనకాంతితో జారుచతుర్వేద సమితితోడ
నాపాదలంబిముక్తాపూర్ణమాలతో రమణీయలోచనత్రయముతోడ

గృప గనుంగొని యాబ్రహ్మకీటసజనని చతుర కూటస్థమాతృకాకృతి మహేశి
శచికి బ్రత్యక్షమై యా విశాలనేత్ర వర మడుగుమన్న నిట్లని పలికె బ్రీతి

గీ. అమ్మ జగములకెల్ల నీవమ్మ వమ్మ
కంటి నే నిన్ను గన్నుల కరువు దీర
బూర్వభవమున నేజేయు పుణ్యమునను
గలిగె శుభములు దుఃఖంబు దొలగిపోయె

గీ. మూడు వరములు నాకిమ్ము ముఖ్యముగను
సురవిభుని పొందు నాకిమ్ము సురలకెల్ల
నహుషు భయమును దీర్చుము నాకలోక
రాజ్య మింద్రున కిమ్ము సర్వప్రపంచ
ధాత్రినావుడు జగదంబ దాని కలది

కం. ఈ నా దూతిం దోడ్కొని ।
మానస సరమునకు బొమ్ము మఘువుని కూర్మిం
బూనుము నహుషుం భ్రష్టుం।
గా నొనరించెద మహేంద్రు గావింతుఁ బతిన్ (మ.క.దా.శ్రీ)

ఇంద్రాణీ! నీవు నా దూతవెంట మానస సరోవరమునకు వెళ్ళుము. అక్కడ ఇంద్రుని కలిసికొందువు. నేను రాజగు నహుషుని మోహింపచేయుటకు ఏర్పాట్లు చేసెదను. నా ప్రయత్నముతో నహుషుడు మోహితుడగును. వెంటనే అతనికి ఇంద్రపదవి తొలగి పోవును అని చెప్పెను.

ఇంద్రాణి అదేవిధంగా పతిదేవుని దర్శించెను. ఇంద్రుడు ప్రియురాలా! నీవెట్లు వచ్చితివి? నా ఉనికిని ఏ ప్రాణియూ తెలుసుకొనజాలదు. వరాననా! నీవిపుడు ఏకాంతముగ నహుషుని దగ్గరకు వెళ్ళి జగత్ప్రభూ! మీరు ఋషులు మోసెడి పల్లకినెక్కి రండు. అపుడు నన్ను స్వీకరింపుడు, నేను మీ

వశమగుదునని చెప్పుము. నహుషుడు తాపసులతో అదేవిధంగా చేసి వారికోపమునకు కాలి భస్మమైపోవును అనెను.

శచీదేవి నహుషుని దగ్గరకు వెళ్ళి దేవా! దేవతలందరి వాహనములకు భిన్నముగా మునిగణములతో నీ పల్లకిని మోయించి నా కడకు రమ్ము. అప్పుడు నేను మిమ్ములను పతిగా అంగీకరింతును అనగా మూర్ఖుడైన నహుషుడు మునుల వద్దకు వెళ్ళి శచిదేవిపై నా మనస్సు పడినది. కనుక మీరు నా పల్లకిని మోయు బోయిలుగా వుండినచో శచిదేవి నా కోరిక నెరవేర్చునట. మీరు ఈ మహత్కార్యము చేయుడు అని చెప్పెను. అందుకు అగస్త్యుడు నహుషుని మాటలను విని ఆలానే చేయుటకు అంగీకరించి దివ్య మునులను దానిని మోయుటకు నియమించి, 'సర్ప-సర్ప' అనగా నడువుడు, నడువుడు అని పలుకుచుండెను.

కామాతురుడైన నహుషుని బుద్ధి హరింపబడియుండెను. కాలితో అగస్త్యమహాముని యొక్క మస్తకమును తన్నెను. లోపాముద్ర యొక్క ప్రాణపతి, వాతాపియను రాక్షసిని ఒకప్పుడు భక్షించెను. సముద్రమునంతా త్రాగివేసెను. అట్టి అగస్త్యుని కొరడాతో కొట్టి గాయపరచెను. అగస్త్యుడు కోపముతో ఓరి నీచుడా! నీవు అడవియందు భయంకర శరీరముగల ఒక గొప్ప సర్పముగ పడియుండుము. అనేక వేల సంవత్సరములు కష్టములను అనుభవింపుము. యుధిష్ఠిరుడు అను పేరుగల పుణ్యాత్ముడు నిన్ను కలిసి అతని నోటి నుండి వెలువడిన ప్రశ్నలకు సమాధానములను వినిన తరువాత నీవు ముక్తుడవగుదువు అని శపించెను.

వెంటనే నహుషునికి సర్పాకారము వచ్చెను. స్వర్గము నుండి పడిపోయెను. దేవతలందరు దేవేంద్రుని వద్దకు వెళ్ళి ఊరడించి అతనిని స్వర్గమునకు తీసికొనిపోయి సింహాసనమున కూర్చుండబెట్టిరి. భగవతి జగదంబ కృపా ప్రసాదమున ఇంద్రుడు మరల యథాస్థానము నందు ప్రతిష్ఠితుడయ్యెను.

జనమేజయ మహారాజా! ఎవరు ఎట్టికర్మను చేయుదురో వారట్టి ఫలమునే అనుభవించెదరు.

గీ. కాన ఖేదంబు గనరాదు మానవులకు
దేవతలకును సుఖదుఃఖభావములను
భారతము వింటికాదె మీవారి చరిత
దేవతాంశజు లేరీతి దీనులైరి

గీ వాసుదేవుండు నిజకర్మవశత నెంత
లేసి గొడవలపాలాయె నెఱుగనొక్కొ
రామకథ కృష్ణకథ భృగురాము కథయు
నింద్రుకథకును వింతాయనె నృపాల! (మ.క.దా.శ్రీ)

3. యుగధర్ములు, వివిధ కర్మలు, తీర్థముల మాహాత్మ్యము

జనమేజయుడు వ్యాసునితో – ఇంద్రుడు నూరు అశ్వమేధయజ్ఞములు చేసి సింహాసనమునకు పాత్రుడై పదవీచ్యుతుడగుటకు కారణమేమి అని అడుగగా – వ్యాసుడు రాజా! సంచితము, ఆగామి, ప్రారబ్ధము అనుభేదములతో కర్మ మూడు గతులని తెలిపిరి.

పురాతన కర్మను 'సంచిత' కర్మయని, అది కూడా సాత్విక, రాజస, తామసములని మూడు విధములు. క్రియామాన కర్మనే 'వర్తమాన' కర్మయని చెప్పెదరు. కాలము యొక్క ప్రేరణతో కర్మల క్రమము కొనసాగుచుండును. ప్రారబ్ధకర్మలనగా అనుభవించిన తరువాత ఇంకేమియు మిగిలియుండదు. కర్మ పూర్తిగా ముగిసిపోయినచో ప్రాణులు జన్మించుట అనునది ఆగిపోవును. ప్రారబ్ధమునకు అనుగుణముగానే ఇంద్రునకు కష్టములు అనుభవింపవలసి వచ్చెను.

రాజా! నరనారాయణులిరువురూ ధర్మునికి పుత్రులుగా శ్రీకృష్ణ, అర్జునులుగా జన్మించిరి. పాండవులు రాజసూయ యాగము చేసినప్పటికి

వనవాసము ప్రాప్తించి కష్టములు పాలైరి. మానవులందరునూ కర్మఫలమును అనుభవింపవలయును.

యుగమును బట్టి ప్రజలందరికి ధర్మమునందు అనురాగము కలవారికి సత్యయుగమున జన్మ ప్రాప్తించును. ధర్మార్థములను రెండింటిని ఇష్టపడువారు త్రేతాయుగమున, ధర్మార్థ కామములను ప్రేమించు జీవులు ద్వాపరయుగము నందు జన్మించెదరు. అర్థమునందు కామమునందు ఆసక్తి గలవారే యీ కలియుగము నందు పుట్టుదురు. యుగధర్మము మాటిమాటికి పరివర్తన చెందదు.

జనమేజయుడు పితామహా! సత్యయుగమున గల పుణ్యాత్ములు ఎచ్చట ఉన్నారు? త్రేతాయుగ, ద్వాపరయుగమునందలి మునీంద్రులు ఏమయ్యారు? వేదములను నిందించువారు, దురాచారులు, పాపాసక్తులు కలియుగమందు జన్మించిరి గదా? ఈ యుగముల ధర్మములు నాకు సమగ్రముగా వివరింపుమని అడిగెను.

రాజేంద్రా! నీ తండ్రికి కలిప్రభావముతో బుద్ధి హతమార్చబడినది. యయాతియొక్క ఉన్నత వంశమున జన్మించిన ఆ నరేంద్రుడు తాపసి యొక్క మెడయందు మరణించిన సర్పమునెందుకు వేసెను. ఇదంతయు యుగప్రభావము.

ప్రజలను పాలించి పోషించుట సత్యయుగము నందలి క్షత్రియుల ప్రధాన కర్తవ్యమైయుండెను. వైశ్యులు వ్యవసాయ వ్యాపారములందు, గోసేవనయందు తత్పరులైయుండెడివారు. ఇతరులకు సేవ చేయవలయునను భావనయే సత్యయుగమునందలి శూద్రులు మనస్సులందు పూనిక కలిగియుండెను. అన్ని వర్ణముల వారు భగవతి జగదంబను పూజించుచుండిరి.

త్రేతాయుగము నందు కూడా ధర్మమటులనే ఉండెను. కాని కొంచెము తగ్గియుండెను. ఈ స్థితి ద్వాపరమందు విశేషముగ తక్కువ అయ్యెను.

ఇప్పుడున్న చాలామంది బ్రాహ్మణులకు ఇతరులను మోసము చేయుట, అసత్యమాడుట, వైధిక ధర్మములకు దూరముగనుండుట, కలియుగమున సహజమైన గుణముగానున్నది.

కలికాలము వృద్ధి చెందుచుండుగా సత్యధర్మములు క్రమముగ లోపించుచుండును. క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు కూడా అట్లే ధర్మభ్రష్టులగుదురు. రాజా! తిండి తీర్థములు పరిశుద్ధములైనచో చిత్తములు పవిత్రములగును. అన్ని ధర్మములను వదలి కలియుగమున ప్రాణులు వర్ధిల్లుదురు. కలి యొక్క స్వభావము అదియే.

జనమేజయుడు భగవన్! అధర్మపరాయణులగు మానవులగతియేమి కాగలదు? సంస్కరించుటకేదైనా ఉపాయముండినచో దయతో తెలుపుము అని కోరగా, మహారాజా! సకల దోషముల నుండి ముక్తులగుటకు భగవతి జగదంబ చరణకమలములను ధ్యానింపవలెను. భగవతి నామ ప్రభావమున ఏమేమి లభించునో వాటిని తెలుసుకొనుటకు రుద్రాది సకల దేవతలు కూడా అసమర్థులగుదురు.

శ్లో॥ న సంతృప్తాని తావంతి యావతీ శక్తిరస్తి హి
నామ్నిదేవ్యాః పాపదాహే తస్మాద్ భీతిః కుతోనృప
అవశేనాపి యన్నామ లీల యోచ్చరితం యది
కింకిం దదాతి తత్ జ్ఞాతుం సమర్థా న హరాదయః
(6వ స్కంధము, 12వ అధ్యాయము, 58వ శ్లోకము)

కలి భయముతో భీతిచెందిన మానవులు ఏ పుణ్యక్షేత్రమునందు నివసించినా, జగదంబ నామము చింతన చేసి, అన్ని పదార్థములపై విరక్తుడై ముక్తుడగును. గాయత్రి మంత్రము భగవతి జగదంబ నామమే. గాయత్రి మంత్రము సాధారణ మంత్రమని జపించువారికి ముక్తి లభించదు. ఇప్పటివరకు యుగధర్మముల గురించి తెలిపితిని అని చెప్పెను.

జనమేజయుడు మునీంద్రా! పవిత్ర క్షేత్రములను, పవిత్ర తీర్థములను, ఆ తీర్థములందు స్నానదానము లొనరించిన ఎట్టి ఫలితము లభించును. నియమములు తెలుపమని కోరగా రాజా! నదులలో అన్నిటి కంటె శ్రేష్ఠమైనది గంగ, యమున, సరస్వతి, నర్మద, గండకి, సింధు, గోమతి, తమసా, కావేరి, చంద్రభాగ, పుణ్యా, నేత్రవతి, చర్మన్వతి, సరయూ, తాపీ, సాభ్రమతీ, ఇవన్నియు గంగానది వలె మిగుల పెద్దవి. సముద్రము వరకు చేరు నదులు అధిక పవిత్రములని అంగీకరింపబడును. సముద్రము వరకు వెళ్ళని నదులను అల్ప పుణ్యాయని అందురు.

పుష్కరము, కురుక్షేత్రము, ధర్మారణ్యము, ఇవి పరమ పవిత్ర క్షేత్రములుగా విలసిల్లినవి. మహిమ, ప్రభాస, ప్రయాగ, నైమిశారణ్యము, అర్బుదారణ్యము గొప్పక్షేత్రములు.

శ్రీశైలము, గంధమాదనము, సుమేరు పర్వతము ఇవి పుణ్యమును చేకూర్చు పర్వతములు. సరోవరములలో మానస సరోవరము సర్వోత్కృష్టముగా చెప్పబడినది. బిందుసరము, అచ్ఛోదసరము పరమ పావనమని చెప్పుదురు. బదరికాశ్రమము అత్యంత పవిత్రస్థానము. ఈ స్థానమున నరనారాయణులు కఠోర తపము చేసిరి. వామనాశ్రమము, శతయూపాశ్రమము కూడ ప్రసిద్ధమైనవి.

భూపతీ! ఈ స్థలములందు సర్వత్ర భగవతి జగదంబ మందిరములు నియమముగ దర్శించినచో ఆ తీర్థములు సకల పాపములను పెళ్ళగింప చేయును.

దానము, వ్రతము, యజ్ఞము, తపస్సు, ఇవన్నియు పుణ్యకర్మలే తీర్థములు, తపములు, దానములు, ద్రవ్యశుద్ధి, క్రియాశుద్ధి, మనశ్శుద్ధి, వీటిమీదనే ఆధారపడియుండును. దయాశుద్ధి, క్రియాశుద్ధి లభించవచ్చును కాని మనశ్శుద్ధి అందరికి లభించదు. మనస్సు ఎప్పుడూ చంచలమైనది.

కామ, క్రోధ, లోభ, మోహ, మద, అహంకారములు, తపస్సునకు, తీర్థయాత్రలకు, వ్రతములకు, విఘ్నమును కలిగించును. రాజా! తన ధర్మమును పాలించినచో దానివలన సకల తీర్థములను దర్శించిన ఫలము లభించును. అయితే తీర్థములు దేహ సంబంధమైన కల్మషమును కడిగివేసి శుభ్రము చేయును.

చిత్తశుద్ధిని చేయు తీర్థము ప్రాప్తించుటకు జ్ఞానియైన పురుషునకు సత్సంగము విశేషముగ అవసరమగును. వేదములు, శాస్త్రములు, వ్రతములు, తపస్సులు, యజ్ఞములు, దానముల వలన చిత్తశుద్ధి తీర్థము ఫలితము ప్రాప్తించుట మిగుల కష్టము, వశిష్ఠుడు, బ్రహ్మకుమారుడు, వేదములను విద్యలను సమగ్రముగ అధ్యయనము చేసెను.

అయినప్పటికి ద్వేషము వలన విశ్వామిత్రునితో ఆయనకు శత్రుత్వముండెను. ఇరువురి మధ్య భయంకరమైన యుద్ధము జరుగుచుండెను. బ్రహ్మ ఉపదేశ ప్రభావమున ఆ ఇరువురు మునులు మరల ప్రేమ భావముతోనుండిరి.

సత్కర్మ, సత్సంగము, వేదాంత శ్రవణాది ప్రభావములతో చిత్తము నందలి వాసనలను దూరము చేసికొని తీర్థములందు నివశించు ఏర్పాట్లను చేసికొనవలెను. కలియొక్క దోషములతో భయభీతులై సదా భగవతి నామములు ఉచ్ఛరింపవలెను. సత్కర్మశీలుడైన మనుష్యుడు ఎప్పుడు కూడా కలి యొక్క భయముతో బాధపడడు. సులభముగ సంసారము నుండి ముక్తుని చేయగలదు.

4. వశిష్ఠుడు – నిమి

జనమేజయుడు మహానుభావా! వశిష్ఠుడు మైత్రావరుణి అని ఎందుకు పిలువబడెను. నాకు సవిస్తరముగా తెలియజేసి ధన్యుని చేయుము అని అడిగెను.

వశిష్ఠుడు బ్రహ్మపుత్రుడై నిమి శాపవశమున పునర్జన్మనొందుటకు వివశుడయ్యెను. ఆ మునీంద్రుడు తన శరీరమును వదలిపెట్టెను. మిత్రుడు వరుణుని వలన అతడు జన్మించెను. 'మైత్రావరుణి' అను పేరుతో ప్రసిద్ధి చెందెను. వారి కథను వివరించెదను వినుము.

రాజులు ధర్మముతో రాజ్యమొనరించవలెను. తాపసులు తపస్సు చేయవలయును. రాజులయందు కామక్రోధములు, మునుల హృదయములందు లోభము, అహంకారములు, చోటుచేసుకొన్నవి. వశిష్ఠుడు నిమిని శపించెను, నిమి వశిష్ఠునకు శాపమొసగెను. త్రిలోకములందు భగవతి మహామాయ యొక్క రహస్యమును పూర్తిగా ఎరిగినవారు ఎవ్వరును లేరు.

భక్తియందు రాగద్వేషములు, డాంబికము చోటు చేసికొనినచో ఫలము విపరీతమగును. ఇక్ష్వాకు కులము నందు నిమి అను రాజు జన్మించెను. ఇక్ష్వాకు వంశమున వండ్రెండవ సంతానముగ (పుత్రుడుగ) యజ్ఞము చేయుటకు నిరంతరము ఆలోచించెడివాడు.

గౌతమముని ఆశ్రమమునకు దగ్గరలోనే జయంతపురమను పేరు గల ఒక నగరముండెను. నిమి అచటనే నివసించుచుండెను. అతనికి రాజసయజ్ఞము చేయవలెనన్న తలంపు కలిగెను. తండ్రియగు ఇక్ష్వాకు ఆజ్ఞతో భృగువు, అంగిరసుడు, వామదేవుడు, గౌతముడు, వశిష్ఠుడు, పులస్త్యుడు, ఋచీకుడు, పులహుడు, క్రతువు, వేదపారంగతులను యజ్ఞము చేయుటకు సమర్థులైన తాపసులందరికి ఆహ్వానములు పంపెను.

నిమి తన గురువగు వశిష్ఠుని పూజించి "నేను యజ్ఞమును చేయ సమకట్టితిని. ఈ కార్యము మీ మీద ఆధారపడియున్నది. అయిదు సంవత్సరములు యజ్ఞదీక్షితుని కావలెనని తలంచితిని. ఈ యజ్ఞము నందు భగవతి జగదంబను విశేషముగ ఆరాధించవలెను. ఆ దేవి

ప్రసన్నతయే ఈ యజ్ఞము యొక్క ముఖ్య ఉద్దేశ్యము. అనగా వశిష్ఠుడు రాజేంద్రా! నీకన్నముందుగనే ఇంద్రుడు తన యజ్ఞమును చేయుటకు నన్ను ఎన్నుకొనెను.

పరాశక్తి అనుయజ్ఞమును చేయించుటకు అయిదు వందల సంవత్సరములవరకు పూర్తి చేయుటకు దీక్ష వహించెను. ఇంద్రుని యజ్ఞము పూర్తికాగానే ఆ కార్యము నుండి ముక్తుడనై నేను నీ దగ్గరకు వచ్చెదను అనెను.

రాజు వశిష్ఠునితో ద్విజవరా! నాతో యజ్ఞము చేయించకుండ వేరొక చోటికి వెళ్ళుటకు మీకు శోభాయమానము కాదు అని చెప్పినను వశిష్ఠుడు ఇంద్రుని యజ్ఞము చేయుటకే వెళ్ళిపోయెను.

నిమి గౌతమమునిని ఆచార్యునిగ చేసుకొని హిమాలయ పర్వతమున యజ్ఞదీక్షితుడయ్యెను. ఋత్విజులను పూజించి గోదానములు ఇచ్చి సంతృప్తుడయ్యెను. అచట వశిష్ఠుడు ఇంద్రుని యజ్ఞము పూర్తిచేసి నిమి రాజు దగ్గరకు వచ్చి చూడగా గౌతమమునితో యజ్ఞము పూర్తియైనదని గ్రహించి కోపోద్రిక్తుడై రాజునకు శాపమొసగెను.

"నీవు నావంటి గురువును వదలి వేరొకతనిని గురువుగా చేసికొంటివి. ఇట్లు నన్ను అవమానించి యజ్ఞ దీక్షితుడవయితివి. ఓరీ! మూర్ఖుడా! నేను ఆపినను నీవు ఆగలేదు. నేటి నుండి నీవు దేహరహితుడవగుదువు. ఈ శరీరము నశించును. దేహము లేని వాడవగుదువు" అని వశిష్ఠుడు నిమిని శపించెను.

ముని శాపమును నిమి తెలిసికొని "ధర్మమును సంపూర్ణముగా నెఱిగిన గురుదేవా! నా మాటను తిరస్కరించి లోభవశులై మీరు ఇంకొక చోటికి వెళ్ళిపోతిరి. ఈ పనిచేయుట వలన మీ మనస్సునకు సంకోచము లేదా? బ్రాహ్మణుడు సదా సంతుష్టుడై యుండవలెను. అకారణముగ నాకు శాపమొసగితిరి. విద్వాంసులై యుండి మీరు క్రోధమును విడనాడలేదు.

"కోపముతో నిండిన మీ యొక్క శరీరము శీఘ్రముగ నశించును" అని నిమి వశిష్ఠునికి ప్రతి శాపమునిచ్చెను. ఈ విధముగ ఒకరికొకరు శాపగ్రస్థులైరి.

వశిష్ఠుడు బ్రహ్మ దగ్గరకు వెళ్ళి నిమిరాజు తనకు ఇచ్చిన శాపమును గూర్చి తెలిపెను. "తండ్రీ! నేను మరల శరీరమును ధరించునపుడు నాకు తండ్రి ఎవరగుదురు? నాకు వేరొక శరీరముతో సంబంధమున్నప్పటికి ఈ రెండవ శరీరము నందు కూడా అట్టి జ్ఞానమే నాకు కలుగవలయును" అని వినయ పూర్వకముగ అడిగెను.

బ్రహ్మ తన మానసపుత్రుడైన వశిష్ఠునితో "మునీంద్రా! నీవు మిత్రావరుణుని తేజము నందు ప్రవేశింపుము. అయోనిజపుత్రుడ వగుదువు. సుహృదుడవై, వేదవేత్తవై సమస్త జ్ఞానమును పొందినవానివై గౌరవమును పొందుటకు అర్హత కలిగియుందువు అని చెప్పగా వశిష్ఠుడు వరుణుని ఆశ్రమమునకు వెళ్ళిపోయెను.

సూక్ష్మశరీరముతో మిత్రావరుణుల శరీరమునందు ప్రవేశించెను. ఊర్వశి మిత్రావరుణుల ఆశ్రమమునకు వచ్చెను. ఆ మిత్రావరుణులు ఊర్వశితో నీవు దేవకన్యవు. మమ్ములను వరింపుము, ఆనందముననుభవింపుము" అని పలికిరి. అపుడు ఊర్వశి అచట ఉండుటకు అంగీకరించెను. మిత్రావరుణుల వీర్యము స్ఖలితమై ఆ కుండలో పడిపోయెను. ఆ కుండనుండి ఉదయించినవారే అగస్త్యుడు, వశిష్ఠుడను పేరుతో ప్రసిద్ధిగాంచిరి.

అగస్త్యునికి తపస్సు నందు ఎనలేని శ్రద్ధయుండెను. బాల్యము నందే వనమునకు వెళ్ళిపోయెను. రెండవ బాలకుడగు వశిష్ఠుని ఇక్ష్వాకు మహారాజు తనకు పురోహితునిగా చేసికొనెను. శాపము వచ్చుటచే వశిష్ఠుడు మిత్రావరుణుని కులమునందు రెండవ శరీరమును ధరించెను.

జనమేజయుడు మునీంద్రా! నిమికి మరల శరీరమెట్లు ప్రాప్తించెను. మునిశాపమొసగునపుడు రాజు యజ్ఞదీక్షితుడైయుండెను. బ్రాహ్మణులు ఋత్విజులుగా ఆలోచించిన విషయము ఈ రాజు చేస్తున్న యజ్ఞకార్యము అసంపూర్ణముగానే యున్నది. ఈ మధ్యలో మునియొక్క శాపముతో ఇతడు కాలిపోవుచున్నాడు.

అప్పుడు ఋత్విజులు అనేక విధములైన మంత్రములను ప్రయోగించిరి. నిమి శరీరమును సురక్షితముగ నుంచిరి. మంత్రశక్తి చేత నిర్వికారమైన ఆత్మశరీరమునందు ప్రతిష్ఠితమైయుండెను. ఇంద్రాదిదేవతలు అచటికేతెంచిరి. రాజు యొక్క స్థితిని దేవతలకు విన్నవించిరి.

నిమిరాజుతో దేవతలు యజ్ఞప్రభావము వలన నీకు సర్వోత్తమమైన జన్మ లభించగలదు. దేవతలిట్లు పలుకగా నిమి ఆత్మ మిగుల సంతసించెను. దేవతలారా! జనన మరణములకు లోనైన ఈ శరీరమున ఉండుటకు ఏ విధముగను ఇష్టపడుట లేదు.

నేను అన్ని భూతముల కన్నులపై వాయురూపమును దాల్చి చరించుచుండవలెనని అభిలషించుచున్నాను. అనగా వారు నిమి ఆత్మతో మహారాజా! దీని కొరకు సమస్తమును శాసించు కళ్యాణ స్వరూపిణియగు భగవతి జగదంబను నీవు ప్రార్థింపుము. ఆ తల్లి కృప వలన నీ మనోరథము సిద్ధించును అని చెప్పగా నిమి దేవిని ప్రార్థించెను.

కం. అనిన విని దేవి ప్రార్థన
మును భక్తి నొనర్ప నంబ మోదంబున ద
ర్శన మిచ్చిన నిమి సంతస
మున జ్ఞానంబు భవమోక్షమును వరియించెన్

గీ సర్వభూతనేత్ర సంవాసమడిగిన
నట్లయౌ నటంచు నంబ పలికి

నిమి వసించుకతన నిమిషముల్ సర్వజం
తువులయందు గల్గు దివిని లేవు

కం. అని వరము వొసంగి జగ
జ్జనని సనియె నంత సర్వ సంయములును త
త్తను వరణిజేసి మధియిం
చిన జనకుడు బుట్టె జనక చిహ్నంబులతోన్ (మ.క.దా.శ్రీ)

నిమికి దేవి దర్శనమొసగగా ఆ దేవితో తల్లీ! నేను సకల ప్రాణుల నేత్రములందు నివసించు భాగ్యమును నాకు కలుగజేయవలయునని అడిగెను. రాజా! ప్రాణుల కనురెప్పలు మూయుటకు తెరచుటకు శక్తి సమకూరును. అయితే దేవతలు రెప్పలు వాల్చని కారణమున వారికి "అనిమిష" నామము కలుగును అని చెప్పి ఆ దేవి అచటనే అంతర్ధానమయ్యెను.

నిమి యొక్క స్థూలశరీరము అరణితో మధించిరి. అపుడు నిమి వంటి సర్వ లక్షణ సంపన్నుడగు కుమారుడు ఉదయించగా ఆ బాలకుని మిథియనియు జనకుడనియు లోకమున ప్రసిద్ధిచెందెను. నిమి విదేహుడు (దేహము లేనివాడు) ఆ కులమున ఉద్భవించిన వారందరిని "విదేహుల"ని పిలువబడిరి. అదే నిమినుండి మహారాజుజనకుడు ఉద్భవించెనని చెప్పుదురు. అతడే గంగాతీరమున 'మిథిల' అను నగరమును నిర్మించెను. పరమ జ్ఞానులయిన ఆ రాజులను విదేహులని కూడ ప్రజలు ప్రస్తుతించిరి.

జనమేజయుడు వ్యాసునితో వశిష్ఠుడు నిమికి పురోహితుడు గదా! గురువని కూడా ఆలోచించక నిమి క్రోధముతో వశిష్ఠుని శపించెను? అని అడిగెను. వ్యాసుడు రాజా! దేనియందును ఆసక్తుడు కాక తపస్సు చేసికొను స్వభావము మునీంద్రులకుండవలెను. నిద్ర ఆకలిదప్పులను జయించి వేదాభ్యాసము నందు తత్పరులై ఉండవలెను.

మహాత్ముడయిన కపిలుడు సాంఖ్యశాస్త్రమును సంపూర్ణముగ తెలిసినవాడుగ పరిగణింపబడెను. యోగాభ్యాసనము నందు సమయమును సదా గడుపుచుండెను. అయినా సగరుని పుత్రులు కాలిబూడిద అయిరి.

సకల ప్రాణుల గుణములను వ్యక్తీకరించువాడు ఆ భగవంతుడు శంకరుడు, నిర్గుణుడు, నిర్లిప్తుడు, అవినాశి, అప్రమేయుడు, సనాతన స్వరూపుడు, పరబ్రహ్మ, పరమాత్మ, పరాశక్తి వీరందరును ఒకరే.

ప్రాణి బంధములలో చిక్కుకొనకుండునట్లు చేయునదే కర్మ. ముక్తిని సాధించునదే విద్య. విద్య (చదువు) కేవలము నేర్పరితనమునే బోధించును. ప్రాణికి వాస్తవిక లాభమేదియును ఉండదు. సదాచారమును పాటించుట, ఇతరులకు హితమును కూర్చుట, మనస్సులో క్రోధమునకు అవకాశమివ్వకుండుట, క్షమాగుణము కలిగియుండుట, ధైర్యము, సంతోషము, ఇవి విద్య యొక్క మిగుల ఉత్తమ ఫలములుగ పరిగణింపబడును.

మనస్సు మీద నియంత్రణ కలిగి ఉన్నంతకాలము ఈ వికారములు పొడసూపవు. రాజగు నిమి వశిష్ఠుని క్షమింపలేకపోవుటకు ఇదియే కారణము. ఎప్పుడో జరిగిన విషయం – శుక్రాచార్యుడు యయాతిని "నీకు ముసలి తనము వచ్చుగాక యని" శపించెను. యయాతిరాజు బదులు పలుకక వృద్ధాప్యమును స్వీకరించెను. కొందరు రాజులు శాంతస్వభావులైరి. అందరి స్వభావము ఒకే విధంగా ఉండదు గదా!

5. కార్తవీర్యుడు – ఏకవీరుడు

భృగువంశ బ్రాహ్మణులు హైహయ కులమునందలి క్షత్రియులకు పురోహితులుగనుండిరి. క్రోధముతో క్షత్రియులు ధనలోభముతో బ్రాహ్మణులనందరిని సంహరించిరి.

జనమేజయుడు పితామహా! క్షత్రియులు పూజ్యులయిన బ్రాహ్మణుల నెందుకు సంహరించారు కారణమేమని అడిగారు. వ్యాసుడు రాజా! హైహయ వంశమున ఒకరాజు కార్తవీర్యుడు. అతనికి వెయ్యి భుజములుండెను. 'సహస్రార్జునుడు' అని పిలిచెడి వారు. దత్తాత్రేయుని వద్ద మంత్రదీక్షను పొంది విష్ణుభగవానుని అవతారముగా భావించబడుచుండెను. జగదంబ ఆ నరేశునకు ఇష్టదైవము. అతడు అనేక యజ్ఞములు చేసి తన సంపదనంతయు బ్రాహ్మణులకు పంచిపెట్టెను.

కొంతకాలమునకు హైహయవంశము వారు ధనహీనులయిరి. వారు భృగువంశ బ్రాహ్మణుల దగ్గరకు వెళ్ళి ధనమును యాచించిరి. ఆ బ్రాహ్మణులు ధనమును ఇవ్వక భూమిలో పాతిపెట్టిరి. క్షత్రియులు అందరు కలిసి ధనముకోసం భూమిని త్రవ్వనారంభించిరి. వారు చుట్టుప్రక్కలనున్న బ్రాహ్మణుల ఇళ్ళను కూడా త్రవ్విరి.

కొంతమంది బ్రాహ్మణులు పర్వతగుహలకు పారిపోయిరి. భృగుకుల బ్రాహ్మణులను సంహరించుచు క్షత్రియులు తిరుగసాగిరి. ఆ బ్రాహ్మణులు ధనమును దానము చేయక, భోగములను అనుభవింపక, నాశనమునకు కారకులైరి.

లోభియైన మానవుడు ధనమును దానముచేయడు. తిండి తీర్థములకు ఖర్చు చేయడు. కేవలము ప్రోగుచేయుచునే యుండును. లోభము చేత మానవులు సదాచారములను, కులధర్మములను విడనాడుదురు. పాపియైన మానవుడు చేయలేని దుష్కర్మ ఏదియునులేదు. హైహయ వంశము నందలి క్షత్రియులు నీచమైన బుద్ధి కలిగియుండి భార్గవ కులమునందలి బ్రాహ్మణులనందరిని సంహరించిరి.

భార్గవ కులమునందలి స్త్రీలు హిమాలయ పర్వతములకు వెళ్ళిపోయిరి. మట్టితో గౌరిదేవిని చేసి స్థాపించి ఆరాధింపసాగిరి. ఆ స్త్రీలకు స్వప్నమునందు దేవిదర్శనమొసంగెను. వారితో "మీలో ఒక స్త్రీ

తొడనుండి ఒక పురుషుడుదయించును. నా ఆంశతో జన్మించిన అతడు మీ కార్యమును సంపన్నమొనర్చును" అని పలికి అదృశ్యమయ్యెను.

కొంత కాలమునకు స్త్రీ గర్భమును ధరించుటను ఆ క్షత్రియులు చూచిరి. ఆమెను పట్టి వధించుటకు తరమగా వణుకుచున్న తల్లిని చూచి శిశువు క్రోధముతో ఆమె తొడను చీల్చుకొని బయటకు వచ్చెను. ఆ బాలకుని చూచిన క్షత్రియులందరు అంధులైపోయిరి.

ఆ హైహయక్షత్రియులందరు ఆ బ్రాహ్మణిని శరణువేడిరి. ఆ బ్రాహ్మణి వారితో నా ద్వారా మీ దృష్టి హరింపబడలేదు. భృగుకుల దీపకుడగు ఈ బాలుడు భృగువంశమును ఉద్ధరించుటకే పుట్టెను. ఇతడు భగవతి కృపావిశేషమున జన్మించెను. అతని తేజస్సు వలననే మీ కనులు పోయినవి. అతను మీ నేత్రములను తప్పక ప్రసాదించును అని పలికినది.

ఆ బాలకుడు వారినంతా గృహములకు వెళ్ళుడు. మీ నేత్రములు మీకు వచ్చును అని పలుకగా వారట్లే ఇంటికి వెళ్ళిన తడవుననే కంటి వెలుగువచ్చెను అని వారి కథను ముగించెను.

జనమేజయుడు వ్యాసునితో హైహయులను క్షత్రియులకు జగత్తునందు ఈ నామమెందుకు ప్రసిద్ధమయ్యెను? యదువంశమునందు జన్మించిన వారు యాదవులని భరతుని నుండి భారతులని ప్రసిద్ధి కలిగినది. వీరికి హైహయులని పేరెట్లు వచ్చెను. కారణము తెలుపమని కోరగా వ్యాసుడిట్లు చెప్పెను.

ఒకసారి విష్ణుదేవుడు లక్ష్మీదేవిని ఆడుగుఱ్ఱము అగుము అని శాపమొసగెను. శ్రీ లక్ష్మీ మర్త్యలోకమునకు వెళ్ళిపోయెను. సూర్యుడు తపమొనరించిన సుపర్ణాక్షము అను స్థలమునకు వెళ్ళెను. ఇది యమున, తమసానదుల సంగమము. అచటనే లక్ష్మీదేవి శంకరుని ధ్యానింపసాగెను. భగవతి గౌరి అర్ధాంగియై ఆ స్వామి శోభను పెంపొందించుచుండెను.

అంటే లక్ష్మి అశ్వరూపమును ధరించి మిగుల కఠినతరమైన తపమొనరించెను.

లక్ష్మీదేవి తపము వెయ్యి సంవత్సరములు కొనసాగగా శంకరుడు దర్శనమిచ్చెను. దేవీ! వాసుదేవుని వదలిపెట్టి నీవు నన్నేల ధ్యానించుచున్నావు అని అడగగా లక్ష్మి "నా పతిదేవుడు నాకు శాపమొసగెను. శాపము నుండి ముక్తిని పొందు ఉపాయమును కూడ నాకు తెలిపెను. నీకొక పుత్రుడు పుట్టగానే నీవు వైకుంఠమును చేరుదువు" అనెను.

"ధర్మపత్నినగు నన్ను వదలి ఆ స్వామి వైకుంఠమును విరాజిల్లుచున్నాడు. ఆ ప్రభువు లేకుండా నేను పుత్రవతి నెట్లగుదును? శంకరా మీరు ప్రసన్నులైనచో నాకీ వరమును ప్రసాదింపుడు. మీరే వారు, వారే మీరు అన్న విషయం నాకు బాగుగా తెలుసును" అని చెప్పగానే శంకరుడు "దేవీ! దేవతలు, మునులు ఈ ఏకత్వరహస్యమును అర్థము చేసికొనజాలకున్నారు".

నాయందు, శ్రీహరి యందు సమగ్రమైన ఏకత్వము కలదు. ఈ రహస్యము నీవెట్లు తెలిసికొంటివి అని లక్ష్మీదేవిని అడగగా – లక్ష్మీదేవి ఒక కథ చెప్పెను.

ఒకనాడు విష్ణువు పద్మాసీనుడై ధ్యానము చేయుచుండగా నేను ఆ స్వామిని అడిగితిని. దేవతలు, దానవులు బ్రహ్మ మొ॥వారందరు కలిసి పాలసముద్రము మధించిరి. నేనప్పుడు ప్రకటితనైతిని. మిమ్ములను పతిదేవులుగా వరించితిని. దేవేశ్వరులు మీరు గదా! ఎవరిని ధ్యానించుచున్నారు? అని అడిగాను.

విష్ణువు నాతో "ప్రియురాలా!" శంకరుడు సర్వశ్రేష్ఠుడుగా పరిగణింపబడును. ఆయన ప్రియమైన ప్రాణము నేను. నాకు ప్రియమైన ప్రాణము ఆ స్వామి. మా ఇరువురిలో ఏ మాత్రము భేదము లేదు. శంకరుని ద్వేషించువారు నరకము పాలగుదురు" అని చెప్పెను.

ఈ విషయములన్నియు నాకు తెలుసును. అందుకే నేను నా పతిదేవుని కలిసికొనుటకు సులభమైన మార్గము తెలపండని మిమ్ములను కోరుతున్నాను అనెను.

శంకరుడు లక్ష్మితో "నీ కోరికను తీర్చుటకు నీ పతి అశ్వరూపమున నీ చెంత కేతెంచును. నీవు నీ భర్తతో కూడి వైకుంఠమునకు వెళ్ళుదువు. నీకొక పుత్రుడు కలిగి ఏకవీరుడనే పేరుతో ప్రసిద్ధి చెందును. అతని పుట్టుకతో హైహయవంశము విస్తారము పొందును. నీవిపుడు జగదంబను శరణుపొందుమని పార్వతితో కలిసి శంకరుడు అంతర్ధానమయ్యెను.

లక్ష్మీదేవి తన భర్త హయరూపమున ఎప్పుడు వచ్చునో అని నిరీక్షించుచూ జగదంబను ధ్యానించుచుండెను. శంకరుడు లక్ష్మి కోరిక సఫలమగుటకు చిత్రరూపుడనే దూతను విష్ణుదేవుని వద్దకు పంపెను.

చిత్రరూపుడు వైకుంఠమునకేగి శంకరుని మాటలన్నియు లక్ష్మీదేవి యమున, తమసానదుల సంగమము నందు తపమాచరించుచున్న విషయము, ఆమె కోరిక తీర్చుటకు అశ్వరూపమును ధరించి రమాదేవిని చేరుకొని పుత్రోత్పత్తి జరిగిన తరువాత ఆ దేవిని తీసికొని వైకుంఠమునకు రమ్మని దూతగా తాను వచ్చిన కార్యమును వివరించెను.

విష్ణువు అశ్వరూపముతో లక్ష్మీదేవి తపము చేయుచున్న స్థలము చేరుకొనెను. ఆ దేవి దృష్టి కూడా భగవంతుడగు విష్ణువు మీద పడెను.

అశ్వరూపమునన్న లక్ష్మీదేవి అంతస్సత్వరాలయ్యెను. ఇరువురు సుందరమైన పుత్రులకు జన్మనిచ్చిరి. విష్ణువు లక్ష్మీదేవితో "మనమిపుడు ఈ బాలుని వదలిపెట్టి వాస్తవిక రూపములతో వైకుంఠమునకు వెళ్ళిపోవుదము.

యయాతి వంశమునందు హరివర్మయను రాజు కొరకే ఈ పుత్రునికి జన్మనిచ్చాను. ఈ బాలుని అతనికి అప్పచెప్పిన తరువాత మనము

వైకుంఠము చేరవలయునని లక్ష్మితో కలిసి వెళ్ళిపోయెను. ఆ బాలుని పేరే ఏకవీరుడు.

లక్ష్మీనారాయణులు అదృశ్యమైన వెంటనే చంపకుడనే విద్వాంసుడు మదనాలస అను భార్యతో అచటికి వచ్చి బాలుని చూచి అక్కున చేర్చుకొని ఇంద్రుని వద్దకు వెళ్ళి ఈ బాలుడెవడు, దానవుడా, గంధర్వుడా, యమున, తమసానదుల సంగమమందు ఇతడు లభించెను అని అడుగగా ఇంద్రుడు వారితో ఇతడు హైహయుడు.

రాజగు తుర్వసునకు అప్పచెప్పుటకు లక్ష్మీనారాయణుల తలంపు. కనుక మీరు వెంటనే ఈ బాలుని అక్కడే ఉంచండి. తుర్వసుడు ఈ బాలుని గైకొనును అని ఇంద్రుడు చెప్పెను.

చంపకుడు బాలకుడు లభించిన చోటుననే వదలిపెట్టివచ్చెను. కొంతసేపటికి లక్ష్మీనారాయణులు రాజైన హరివర్మ వద్దకు వెళ్ళగా హరివర్మ భక్తిభావముతో స్తుతించెను.

దండకం

దేవాదిదేవా జగన్నాథ దీనార్తి విచ్ఛేద మత్స్యావతారా లసత్కచ్ఛపాకార వారాహమూర్తీ నృసింహాకృతీ వామనా రామ రామా బలా యౌబలా నీమహోదారరూపంబు దర్శించితిన్ నే కృతార్థుండ నైతిన్ జడుండున్ మునీంద్రుల్ సురేంద్రుల్ కనంజాల రీ దివ్యరూపంబు నా పూర్వపుణ్యంబునంజేసి నీయంతట న్నీవ విచ్చేసి నావయ్య యాశాపరత్వంబునన్ జిక్కి సంసార వారాశిలో మున్గియున్నట్టి పాపాత్ముడన్

గామము క్రోధముల్ లోభమున్ మోహమున్ మత్సరంబున్ మదంబున్ గడున్ రాగమున్ ద్వేషమున్ దృష్ణయుం గల్గి నీ సేవ గావింపగానేర కీ లాగు వర్తిల్లుచున్నారమయ్యా మముం బ్రోవుమయ్యా నమస్తే నమస్తే నమస్తే యటంచున్

అప్పుడు విష్ణువు హరివర్మతో నీ తపస్సునకు మెచ్చి గొప్పవరమును ఇవ్వడానికే వచ్చాను. అనగా హరివర్మ మురారీ! నేను పుత్రుని కొరకే తపమాచరించాను అని విన్నవించగా విష్ణువు అతనితో "నీవు యమున తమసానదుల సంగమ తీర్థమునకు వెళ్ళుము. నేను నీ కొరకు ఒక పుత్రుని వదలివచ్చాను. అతనిని నీవు స్వీకరించుము అని చెప్పి లక్ష్మీసమేతుడై వెళ్ళిపోయెను.

హరివర్మ ఆ చోటుకు వెళ్ళి బాలుని చూచి ఇతడు నారాయణాంశతో మిగుల శక్తిమంతుడుగా నున్నాడని గ్రహించి ఆ బాలునితో పలికిన మాటలు

తరళ కాలిబొటనవ్రేలు నోటను గట్టిగా నిడి కుడ్చుచున్
బాలు లేవని డీల నొందక పాణిపాదము లార్చుచున్
లీల గూర్చుచు నోలి నవ్వుచు లేచి చూచుచు బొరలుచున్
బాలుఁ డాడగఁ జూచె న జ్జన పాలుఁడర్మిలి దేలుచున్

ఉత్సా ముఱువదెంత హరువదెంత మురిపెమెంత చాగరే
మెరుగులెంత హురుగులెంత మేనివన్నె లెంత హా
పరువ మెంత గరువ మెంత పంతమెంత బాపురే
నిరుతకూన ముద్దువగలు చెప్ప శక్యమా భళీ!

ఉత్సా తమ్మివంటి నెమ్మొగమ్ము తద్దముద్దులొల్కగా
ముమ్మరమ్ములమ్ము రొమ్ము ముందు సిరుల దెల్పఁగా
కమ్మదనము లొల్కి పాలుగారు చెక్కు లొప్పగా
చిమ్మచీకటు ల్తొలంగు చిట్టికూన వన్నెలన్

ఉపేంద్ర వజ్రము

తపంబులో నెంతయు దుష్కర స్థితిన్ బ్రపూర్ణనిష్ఠన్ బహుహాయనంబుల్
బ్రపన్న వృత్తిన్ బడియుండగా దా గృపన్ సృజించెన్ గిరిధారి నిన్నున్
నీ తల్లి శ్రీదేవి కనెంగదా నిన్ నీ తండ్రి పంకే రుహనేత్రు డెన్నన్
బ్రీతిన్ మదర్ధంబుగ వీడ్వడె ని న్నీ తావునందుం గృప నెంబి నాకై

నన్నుద్ధరించు నా యన్న రారా కన్నార నిన్ను గన్గొంటి తండ్రి
యెన్నాళ్ళ కీశ్వరేచ్ఛాప్తి గల్గెన్ చిన్నారి ముద్దు చిల్కా కుమారా!
(మ.క.దా.శ్రీ)

హరివర్మ పుత్రుని తీసికొని వస్తున్నాడని పురప్రజలు తెలుసుకొని వంధి మాగధులు, గాయకులు పుష్పవృష్టితో స్వాగతము పలికిరి. రాజైన హరివర్మ రాణితో ప్రియురాలా! శ్రీ లక్ష్మీనారాయణులు నాకీ పుత్రుని ప్రసాదించిరి అని రాణి కొసగెను.

పుత్రజనిత సాంసారికి సుఖములను పుష్కలముగ అనుభవించు చుండెను. ఆరవ మాసమున బాలునకు అన్నప్రాశనము, మూడవ సంవత్సరమున కేశఖండనము జరిపిస్తూ పదకొండవ సంవత్సరమున యజ్ఞోపవీత సంస్కారము ధనుర్వేదము, సకలవిద్యలు నేర్పి పట్టాభిషేక మహోత్సవము జరిపించెను. తదనంతరం హరివర్మ రాణితో కూడి వనములకు వెళ్ళిపోయెను.

మైనాక పర్వతమునందు వానప్రస్థము గడుపసాగిరి. ప్రారబ్ధ కర్మముగా పాంచభౌతిక శరీరమును పరిత్యజించిరి. తండ్రి స్వర్గస్థుడయ్యెనని తెలిసి హైహయుడు (ఏకవీరుడు) వైదిక విధానమునసరించి వారికి ఊర్ధ్వదైహిక క్రియలను సంపన్నమొనరించెను.

ఒకనాడు ఏకవీరుడు అశ్వారూఢుడై గంగాతీరమునకు వెళ్ళెను. అచట మునీంద్రుల దివ్య ఆశ్రమములనేకములుండెను. అక్కడికి సమీపముననే ఒక కన్య ఏడ్చుచు కనబడెను. రాజగు ఏకవీరుడు ఆమెతో శోక కారణము నడిగెను. ఆ కన్య రాజా! మీ రాజ్యమునకు వెలుపల పరమధార్మికుడయిన ఒకరాజు కలడు. అతనిపేరు రైభ్యుడు. అతని భార్య రుక్మరేఖ.

రైభ్యుడు పుత్రేష్టియజ్ఞము సంపన్నమొనర్చెను. యజ్ఞాగ్ని నుండి ఒక సుందరమైన కన్య వెలువడెను. హోత రైభ్యుని వద్దకు వచ్చి రాజా! ఈ

పుత్రికను స్వీకరింపుము. ఈ కన్య ఏకావళి అనుపేరుతో ప్రసిద్ధురాలగును. విష్ణువు ఈ కన్యను ప్రసాదించెను అనగా రైభ్యుడు తన భార్యయగు రుక్మరేఖకు అప్పగించెను. ఆమె తనకు పుత్రుడు ఉత్పన్నమైనట్లే భావించెను.

నేను ఆ రాజు రైభ్యుని మంత్రి కుమార్తెను. నా పేరు యశోవతి. నేనును ఏకావళియును ఒకే వయస్సు వారము. మహారాజు రాజకుమారితో ఆడుకొనుటకు నన్ను నియమించెను. ఆ రాజకన్య మనోవినోదము కొరకు గంగా తీరమునకు నిరంతరము వచ్చిపోవుచుండును.

ఒకనాటి విషయము ఏకావళియును ఆడుకొనుటయందు నిమగ్నులమైయుంటిమి. అప్పుడొక భయంకర దానవుడు అచటకు వచ్చెను. అతనిపేరు కాలకేతువు. అతడు ఏకావళిని తీసికొనిపోవుటకు ప్రయత్నించెను. మా రక్షక భటులకును కాలకేతువునకును రణము జరిగెను. ఆ దైత్యుడు రక్షక భటులనందరిని సంహరించెను. రాజకుమారి అతని వశమయ్యెను.

కాలకేతువు ఎచటికి తీసుకొని వెళ్ళుచుండెనో నేను కూడా అచటికి వెళ్ళుచుంటిని. ఆ దానవుడు నన్నును ఏకావళిని ఒక దివ్య భవనము నందుంచెను. రెండవ దినము కాలకేతువు నాతో చెప్పెను. నీ సఖియగు ఏకావళి విరహముతో వ్యాకులత చెందుచున్నది. ఈమెకు నీవు నచ్చజెప్పుము అనగా నేను చెప్పితిని. రాజా! ఇట్టి అప్రియమైన మాటలు నా నోటినుండి వెలువడజాలదు. నీవు స్వయముగనే ఈమెతో చెప్పుము.

కృశోదరీ! నేను నీ వశమైతిని, నన్ను పతిగా వరింపుము. నన్నునుగ్రహింపుము అని అతను అడుగగా ఏకావళి కాలకేతువుతో హైహయుడు మిగుల భాగ్యశాలి. అతనితో నా వివాహము చేయుటకు మా తండ్రి నిశ్చయించెను. నేనును అతనిని వరించితిని. శాస్త్రీయ సిద్ధాంతము మీకు తెలియనిది కాదు. తండ్రి కన్యనెవరికి సమర్పించునో

అతనిని తాను భర్తగా వరించవలెను. కన్య సదా పరతంత్రురాలు అని పలికెను.

కాలకేతువు నగరము పాతాళము నందలి ఒక లోయలో విశాలమైన కోట కలిగివున్నది. నా ప్రాణసఖి అచటనే అత్యంత కష్టములు గడుపుచున్నది. నేనిపుడు అపారదుఃఖమును అనుభవించుచున్నాను అని యశోవతి పలికెను.

ఏకవీరుడు అపుడు ఏకావళి చెలికత్తెతో నీవు కాలకేతుని నగరము నుండి నీవిచటికి ఎట్లు వచ్చితివి. ఇచట ఏకావళి తండ్రి ఏకావళికి హైహయునకు వివాహము చేసెదనని చెప్పినట్లు పలుకుచున్నావు. నేనే ఆ హైహయరాజును. నేను ఆ రాక్షసుని వధించి ఏకావళిని తప్పక తీసికొని వచ్చెదను. నీవు ఏకావళి తండ్రి రైభ్యునికి రాజకుమారి కష్టములు పాలైన విషయమును తెలిపినావా? అత్యంత దుర్గమమగు కాలకేతువు నగరమును చేరు ఉపాయమును నీ వలన తెలుసుకొనవలెనని కోరుచున్నాను అనెను.

యశోవతి రాజా! నేను చిన్నతనము నుండి భగవతిజగదంబ బీజమంత్రము జపించుచుంటిని. ఒక సిద్ధ బ్రాహ్మణుడు నాకీ మంత్రమును ఉపదేశించెను. నా భక్తికి సంతుష్టురాలైన భగవతి చండిక స్వప్నమున నాకు దర్శనమిచ్చెను. నీవు ఇప్పుడే గంగానది పవిత్ర తీరమునకు వెళ్లి ఏకవీరుడనే నరేశుని కలువుము.

ఏకవీరునికి దత్తాత్రేయుడు నా బీజ మంత్రమును అతనితో గొప్ప అభ్యాసము చేయించెను. నా ఉపాసన తప్ప అతడింకేమియు ఎరుగడు. రాజగు ఏకవీరుని చేతులలో కాలకేతువు మృత్యువునకాహారమగును. ఏకావళి బంధముక్తయగును. రాజకుమారునితో ఏకావళి వివాహమునకు నీవు ఏర్పాట్లు చేయుము అని ఆ దేవి నాతో పలికి అదృశ్యమయ్యెను.

అపుడు ఏకావళికి దేవి కనిపించిన విషయమునంతా తెలుపగా ఆ సఖి నన్ను ప్రేమతో మనమింపుడు ఆ తల్లికృపతో తప్పక బంధముక్తులగుదుము. కార్యోన్ముఖురాలుగా కమ్మని ఆదేశించెను.

భగవతి కృప వలన మార్గమునెరుగుట సులభమయ్యెను. శీఘ్ర గమనమునకు శక్తి కలిగెను. వీరవర్యా! నీవెవరవు? తెలుపుము అనగా అప్పుడు ఏకవీరుడు లక్ష్మీదేవియే నా తల్లి. ఏకావళి కాలకేతుదైత్యుని ఎదుట తాను హైహయుని వరించితినని నుడివెను.

రాజకుమారి మాటలవలన ఆమెకిపుడు నేను దాసుడనయితిని. కాలకేతువు నివసించు స్థలము నాకు తెలియదు. ఏకావళి ఉండు స్థలమునకు వెళ్ళుటకు ఏర్పాటు చేయుము. ఆ రాక్షసుని వధించి ఆమెను విడిపించి తెచ్చెదనని నీవు నిశ్చితముగ నమ్ముము. ఏకావళిని నేను ఆమె తండ్రియొద్దకు చేర్చెదను. రాజగు రైభ్యుడు తన పుత్రిక వివాహము శాస్త్రోక్తముగా జరిపించగలడు అని పలికెను.

ఏకవీరుని మాటలను విని యశోవతి కాలకేతు నగరమునకు వెళ్ళుటకు ఆమె ఉపాయమును తెలుపసాగెను. రాజేంద్రా! భగవతి యొక్క బీజమంత్రము సిద్ధిని ప్రసాదించును. నీవు దీక్ష తీసికొనిన కాలకేతు నగరమునకు మార్గమును చూపెదను. మంత్రమునభ్యసించియే నీవు నావెంట రమ్ము. రాజా! ఆ దుష్టుని శీఘ్రముగ వధింపుము అని యశోవతి పలికెను.

ఏకవీరుడు మంత్రదీక్షితుడు కాగానే దత్తాత్రేయుడు భాగ్యవశమున అచటికి వచ్చెను. దత్తాత్రేయుడు రాజునకు యోగీశ్వరి మంత్రమును ఉపదేశించెను. రాజగు ఏకవీరునకు సమస్తమును తెలిసికొనుటకు అనుకూలత లభించెను.

యశోవతితో ఏకవీరుడు ఆ నగర సమీపమునకు చేరుకొనెను. దూతలు కాలకేతువు దగ్గరకు వెళ్ళి యశోవతితో ఒక రాజకుమారుడు

వస్తున్నాడు. అతడు ఎట్లున్నాడంటే ఇంద్రుని కుమారుడో, శంకరుని పుత్రుడు కార్తికేయుడో తెలియదు గొప్ప సైన్యముతో మనపై యుద్ధమునకు వస్తున్నాడు. మీరు ఈ కమలనయనతో స్నేహము వదలిపెట్టుటయో లేదా యుద్ధమునకు సైన్యమును సమాయత్తము చేయవలసిన సమయము ఆసన్నమైనదని తెలిపిరి.

కాలకేతువు దైత్యులతో శత్రువును ఎదుర్కొనుమని చెప్పి ఏకావళితో ఆ వచ్చుచున్నవారెవరు? ఆ వచ్చువాడు నీ తండ్రి అని తెలిసినచో నేనతనితో యుద్ధము చేయను. అతనికి అతిథిసత్కారము చేయుదును. ఇతరులు ఎవరైనా వచ్చియుండిన పక్షాన వారి ప్రాణములు హరించుట తథ్యము.

ఏకావళి కాలకేతుతో ఇప్పుడిచటికి వచ్చుచున్నది ఎవరని నాకు తెలియదు. ఎవరో పరాక్రమవంతుడైన పురుషుడు కావచ్చును. మాతండ్రి మాత్రము కారని గట్టిగా చెప్పెను.

కాలకేతువు వెంటనే రథమునధిరోహించి తన నగరము వెలుపలికి వచ్చెను. తన ఎదురుగా పోరాడుచున్న ఏకవీరునితో యుద్ధమునకు దిగెను. ఏకవీరుని గదాఘాతము చేత కాలకేతుని ప్రాణములు హరింపబడెను. యశోవతి వెంటనే ఏకావళి దగ్గరకు వచ్చెను. సఖీ ఏకవీరుడు నిన్ను చూడవలెనని నిరీక్షించుచున్నాడు.

అతడు సుందర స్వరూపము కలిగి నీ యందు అనురక్తుడైయున్నాడు అనగా ఏకావళి ఏకవీరుని దగ్గరకు వెళ్ళుటయే మంచిదనిపించి ఏకవీరుని దాపుకు చేరుకొనగా ఆ రాజకుమారిని చూచి ఏకవీరుడు ఆమెతో ఇట్లు పలికెను.

తన్వంగీ! నిన్ను చూచుటకు నానేత్రములు తృష్ణతో నున్నవి అనగా యశోవతి ఏకవీరునితో రాజేంద్రా! ఏకావళిని తండ్రి దగ్గరకు పంపుటకు ఏర్పాట్లు చేయుము. ఈమె తండ్రియే వైవాహిక విధానమును సంపన్నము

చేసి నీతో ఈమె వివాహము జరిపించగలదు అని చెప్పగా ఏకవీరుడు యశోవతిని ఏకావళిని వెంటనిడుకొని రైభ్యుడుండు స్థలమునకు వెళ్ళెను.

రైభ్యుడు కుమార్తెను చూచి స్వాగతించెను. యశోవతి అన్ని విషయములను తన తండ్రికి తెలిపెను. ఏకవీరుడు రైభ్యుడు పరస్పరము కలిసికొనిరి. ఏకవీరునితో ఏకావళికి ఒకనాడు శుభముహూర్తము చూసి శాస్త్రోక్తముగ పాణిగ్రహణ సంస్కారము సంపన్నము చేయించెను.

ఏకావళితో ఏకవీరుడు వివిధములైన భోగములు అనుభవింపసాగెను. ఏకావళి గర్భమున పుత్రుడు ఉదయించెను. ఆ కుమారునికి "కృతవీర్యుడు" అని నామకరణము చేయించిరి. కృతవీర్యుని కొడుకు కార్తవీర్యుడు.

6. వ్యాసనారదుల సంవాదము (నారద, పర్వతుల శాపములు)

జనమేజయుడు వ్యాసునితో భగవాన్! మీరు హైహయవంశపు రాజుల ఆవిర్భావమును విస్తృతముగ వినిపించితిరి. ఈ గొప్పగొప్పదేవతలు కూడా మోహమునకు ఎందుకు లోనైరి అని అడుగగా నారదుడు బ్రహ్మమానసపుత్రుడు గదా! ఒకనాడు వీణను వాయించుచు విహరించుచుండెను. వాద్యగీతములచే నా ఆశ్రమమునకు విచ్చేసెను. అప్పుడు నేను శమ్యప్రాసమను గొప్ప తీర్థమునందుంటిని.

నారదుని రాకను చూచి నేను నిలుచుంటిని. నేను అతనిని చక్కగా పూజించితిని. సమర్థుడగు నారదమహర్షి మార్గాయాసము తొలగగా శాంతచిత్తుడయ్యెను. నేనతనితో నీవడిగిన ప్రశ్ననే అతనిని అడిగితిని. ఈ మిథ్యాప్రపంచమున ప్రాణులకేమి సుఖము ఉన్నది. నాకు కనిపించుటలేదు. నేను ఊయల మీద కూర్చునియున్నను మనస్సు నిలకడగా లేకున్నది.

అప్పుడు నారదుడు చిరునగవుతో ప్రాణులను మోహితులను చేయు కారణమును నాకు తెలుపసాగెను. పరాశరనందనా! ఈ జగత్తు నందు

ఏ ప్రాణియూ మోహమును స్పృశింపనివాడు లేనేలేదు. నేను నా అనుభవములనే తెలుపుచున్నాను - వినుము. నేను మహాదుఃఖము అనుభవించితిని. దానికి కారణము స్త్రీని పొందుటకై నేను మోహమున చిక్కుకొనుటయే.

ఒకరోజు నేనునూ, పర్వతమునీంద్రుడును భూమిమీది కేతించితిమి. మేమిరువురమూ భూమండలమున తిరిగితిమి. ఒక ప్రతిజ్ఞ చేసుకొంటిమి. ఎవరి మనస్సులో ఏ తలంపు వచ్చినను దానిని ఒకరితో ఒకరు చెప్పుకొనవలెను. దాచరాదు అని ఒప్పందము చేసుకొని స్వర్గము నుండి దిగివచ్చి భూమిపై విహరించుచుంటిమి.

రాజగు సంజయుని ఇంటి నుండియే చాతుర్మాసమును గడిపితిమి. అది వర్ష ఋతువు కనుక బయట తిరుగాడుటకు సాహసించలేకపోతిమి. ఆ రాజునకు ఒక కన్య కలదు. ఆమె పేరు దమయంతి. రాజాజ్ఞతో ఆ కన్య మాకు సపర్యలు చేయుచుండెడిది.

ఆమెవలన మాకు అనుకూలమైన భోజనము, అన్ని ఏర్పాట్లు జరుగుచుండెను. నేను వీణ చేబూని ఉత్తమస్వరముతో సామవేదమును గానము చేయుచుంటిని. గానము విని రాజకుమారి దమయంతి నాయందు ఆసక్తురాలయ్యెను. ఆమెపై నాకు బలమైన ప్రేమ ఉదయించెను.

దమయంతి నాపై చూపెడు ప్రేమ పర్వతముని చూడలేకపోయెను. పర్వతముని ఒకనాడు నాతో నారదా! దమయంతి నీపై చూపుచున్న శ్రద్ధను గమనిస్తే నిన్ను పతిగా వరించవలెనని నిశ్చయించుకొన్నదని నాకు కనుపిస్తున్నది. మునీంద్రా! నీవిపుడు సత్యమును చెప్పవలసిన సమయము ఆసన్నమైనది. మనమిరువురము చేసుకొన్న ప్రతిజ్ఞ గుర్తుకు తెచ్చుకొనుము అని అడిగెను.

నారదుడు అతనితో పర్వతా! విశాలనేత్రములు గల రాజకుమారి నన్ను భర్తగా చేసుకొనవలెనని కోరుకొనుచున్నది వాస్తవమే. నా మానసిక

పరిస్థితి కూడా అట్లే యున్నది అని చెప్పగా పర్వతునకు మిక్కిలి కోపము వచ్చి నారదా! మొదట ప్రతిజ్ఞ చేసి నీవు నన్ను మోసగించితివి. నీవు మిత్రద్రోహివి. నీకు శాపమొసగుచున్నాను. నీవు ఇప్పుడే కోతిముఖము గలవాడవగుదువు అని శాపమునిచ్చెను.

నారదుడు పర్వతుని క్షమించలేక ఇప్పటినుండి నీవు కూడా స్వర్గమున అధికారమును కోల్పోయి మర్త్యలోకమున తిరుగాడుచుండుము అని శపించెను. నారదుడు కోతి ముఖముతో తిరుగుచుండుట చూచి రాజకుమారి జుగుప్సకు లోనయ్యెను.

రాజకుమారియగు దమయంతి శరీరమునందు యౌవ్వన లక్షణములు స్పష్టముగ కన్పింప సాగెను. సంజయుడు ప్రధానమంత్రితో నా కుమార్తె దమయంతికి తగిన వరుడు లభించినచో వివాహము చేయవలయునని అనుకొంటున్నాను అనగా దమయంతి తన దాది ద్వారా తండ్రికి తన అభిప్రాయమును తెలిపెను.

దాది రాజుతో నీ కుమార్తె దమయంతి నారదుని వరించిన విషయమును తెలుపమని నాతో చెప్పినదని చెప్పగా రాజు తన రాణి కైకేయితో ప్రియురాలా! దమయంతి మునీంద్రుని మీద ఆసక్తురాలయివున్నది. యుక్తియుక్తముగా నచ్చచెప్పి ఆమెను తన హఠము నుండి ముక్తురాలను చేయుము.

అనగా కైకేయి దమయంతితో రూపలావణ్యవతియైన నీకు వానరముఖము కలిగిన ముని మీద ఎట్లు మనసుపోయినది. జగత్తు నందు ఏ మూర్ఖుడు కూడ కోమలమైన తమలపాకులను ఒంటెకు తినిపించడు కదా! ఈ నారదునితో చివరి వరకు నీవు జీవితమునెట్లు గడుపుదువు? అని మందలించెను.

దమయంతి తల్లితో సంసారిక విషయముల జ్ఞానమెంత మాత్రము ఇతనికి లేదు. తల్లీ సప్తస్వరమైన సంగీత జ్ఞానము నారద మునీంద్రుని

సొత్తు. శివునికి తప్ప మూడవవానికెవ్వనికి ఈ జ్ఞాన పరిచయభాగ్యము లేదు.

సర్వజ్ఞానము నందు పరమప్రవీణుడైన పురుషుని కైలాసము వరకు తీసుకొని వెళ్ళి గంగా సరస్వతులతో పోల్చవచ్చును. విషదర సర్పము మనోహరగానమును విని మత్తిల్లును. గాన రహస్యము నెరుగని వృద్ధుడు కూడా నీచుడుగానే భావింపబడును. అమ్మా! నీవు నా తండ్రితో చెప్పుము. నేను మునీంద్రుని వరించితిని. నా వివాహము మునీంద్రునితోనే జరిపింపుడు అనెను.

కైకేయి రాజుతో దమయంతి వివాహము మునీంద్రునితో జరిపించుమని ప్రేరేపించగా రాజు దమయంతితో నారదుని వివాహము సంపన్నము చేసెను.

ఒకనాడు పర్వతముని నారదుడున్నచోటికి వచ్చి దమయంతి, నారదులున్న పరిస్థితిని గమనించి మిగుల దుఃఖించి మునివరా! నారదా! క్రోధముతో నీకు నేను శాపమొసగితిని. నీవు నా పుణ్యప్రభావమున సుందరముఖము గలవాడవు కమ్ము అనగా నారదుడు కూడా పర్వతునకిచ్చిన శాపము ఉపసంహరించగా పర్వతుడు స్వర్గమునకు వెళ్ళెను.

నారదుని ముఖము కూడా వానరత్వము తొలగిపోయెను. దమయంతి తల్లితో అమ్మా నీ అల్లుడు సుందరముఖము గలవాడయ్యెను అని చెప్పగా రాజగు సంజయుడు పుత్రిక మాటలను విని సంతోషించి పర్వతమునికి కానుకలు సమర్పించెను.

మహానుభావా! ఈ ప్రపంచము పూర్తిగా అసత్తు. ఏ ప్రాణియు సుఖముగ ఉండజాలదు. కామ, క్రోధ, లోభ, మత్సర, మమత, అహంకారము, మదము ఇవి అన్నియు బలోపేతములు. వీటి మీద విజయమును పొందవలెను.

వ్యాసమహర్షీ! నేను భగవంతుడగు విష్ణువు వెంట వనములో తిరుగుచుంటిని. నేను ఆకస్మికముగ స్త్రీగా మారిపోతిని. నేను ఒక రాజునకు భార్యనైతిని. అనేక పుత్రులకు జన్మనిచ్చితిని అని చెప్పగా వ్యాసుడు నారదునితో మీరు స్త్రీరూపముగా పరిణతి చెంది మరల పురుషులెట్లైతిరో తెలుపమని కోరెను.

7. నారదుడు స్త్రీ రూపము పొంది స్వస్వరూపము పొందుట

వ్యాసునితో నారదుడు మునివరా! చరాచర సకల జగత్తూ, బ్రహ్మనుండి స్తంభమువరకు అందరును మాయకు అధీనులే. నేను మనోహరమగు శ్వేత ద్వీపమునకు వెళ్ళుచుంటిని. అపుడు నారాయణుని దర్శనభాగ్యము కలిగినది. అక్కడ లక్ష్మీదేవి నన్ను చూచి అచటనుండి వెళ్ళిపోయెను.

నేను వచ్చుటను చూచి భగవతి వెళ్ళిపోవుటకు కారణమేమని మాయ యొక్క ఏవిధమైన ప్రభావము నామీద ఉండదు కదా! అని విష్ణువును అడిగితిని.

విష్ణువు నాతో నారదా! "నేను మాయను జయించితినని నీవు నాతో చెప్పుచున్నావు" ననకాది మునీంద్రులు కూడా మాయను జయించలేకపోయిరి. ఎవ్వరికిని మాయను జయించుటకు సంభవము కాదు. అనగా నారదుడు శ్రీహరిని మాయాస్వరూపము ఎటువంటిది? నేను ఆ మాయను చూడవలెనని ఆశ నాకు కలుగుచున్నది.

విష్ణువు నాతో నారదా! నీకు చూడవలయునన్న కోరిక ఉన్నట్లయితే గరుడుని అధిష్ఠింపుము. మనమిరువురము అన్యలోకమునకు వెళ్ళెదము అని చెప్పెను. విష్ణువు గరుడుని స్మరించి నన్ను గరుడునిపై కూర్చుండబెట్టుకొని వివిధ ప్రాంతములను దర్శించుకొంటూ కన్యాకుబ్జనగరమునకు దగ్గరగా చేరుకొంటిమి. అచట దివ్య సరోవరము చేరుకొనగానే అక్కడ శ్రీహరి నవ్వుచు నా వ్రేలు పట్టుకొనెను.

భగవంతుడు నావీణను, మృగచర్మమును తీసికొనెను. ఆ జలములందు మునుగగనే నా పురుషాకృతి లుప్తమయ్యెను. శ్రీహరి నా వీణను తీసికొని తనధామమునకు వెళ్ళిపోయెను. నేను సుందరమైన స్త్రీరూపమును పొందితిని. ఆ క్షణము నుండి పూర్వశరీర స్మృతి కూడా నా మనస్సు నుండి తొలగిపోయెను. అప్పుడే రాజగు తాలధ్వజుడు నా ఎదుటకు వచ్చెను.

తాలధ్వజుడు నన్ను చూచి నీవు కామదేవుని మోహింపచేయ యోగ్యత కలిగియున్నావు. నీవు ఇంకను కుమారివేయైనచో నన్ను భర్తగా పొంది నా సహయోగమున మనస్సు అభిలషించెడి భోగములను పొందుమనెను.

నేను భూపాలా! మీరు ధర్మజ్ఞులు. మీ ఇష్టానుసారము చేయుడు అనగా నన్ను అగ్నిసాక్షిగా వివాహమాడెను. "సౌభాగ్యసుందరి" అని నాకు పేరిడెను. తాలధ్వజుని మీద నేను అపారమైన అనురాగమును కలిగియుంటిని.

సతీ సాధ్వినై విలాసములననుభవించుచున్నాను. నా జీవితము పండ్రెండు సంవత్సరములు గడచిపోయెను. నాకొక పుత్రుడు ఉదయించెను. ఆ తరువాత పండ్రెండు పుత్రులకు జన్మనొసగితిని.

పెద్దకుమారునకు వీరవర్మయనియు, చిన్నవానికి సుధన్వుడని నామకరణము చేసితిని. రాజు కుమారులకందరికిని వివాహములు జరిపించితిని. కోడండ్రు కూడా వచ్చిరి. పుత్రులకు కూడా పుత్రులు జన్మించిరి. కుమారులకు కోడండ్రకు పోట్లాటలు జరుగుచుండెను. ఉత్తమమైన జ్ఞానము శాస్త్రపరిజ్ఞానము నాకెంత మాత్రమును లేకుండెను. నేను మిగుల భాగ్యశాలిని అని ఆలోచించుచుంటిని. నేను నారదుడను భగవంతుని మాయ నా బుద్ధిని హరించినది అన్న ఆలోచనయే నాకు వచ్చెడిది కాదు.

కాలప్రభావమున నా కుమారులందరూ శత్రువు చేత సంహరింపబడిరి. నా పుత్ర పౌత్రులను చూచి నాకు కలిగిన దుఃఖమునకు అంతు లేకుండెను. ఆ విధంగా నేను విలపించుచుండగా విష్ణుభగవానుడు ఒక వృద్ధ బ్రాహ్మణుని రూపమున అచటికి వచ్చెను.

ఆ బ్రాహ్మణ రూపమున ఉన్న విష్ణువు నాతో మరణించిన బంధువుల ఆత్మశాంతి కొరకు తీర్థము నందు స్నానము చేసి తర్పణము వదలవలెను. ఈ కార్యమునంతయు ఇంటి వద్ద చేయరాదు అని నన్ను ఓదార్చెను.

ద్విజరూపదారియైన భగవంతుడు నన్ను పుంతీర్థమునకు తీసుకుని వెళ్ళి కార్యములను పూర్తిచేసి ఇప్పుడు నీకు పుత్రులు, తండ్రులు, భర్తలు, సోదరులు, అల్లుండ్రు మరణించిరి. నీవు శోకించుట వ్యర్థచింతన. కష్టములను కలిగించునదియే యగును అని విష్ణువు ముఖము నుండి వెలువడిన మాటలను వింటిని. అతని ప్రేరణకు తీర్థము నందు స్నానమొనరించుటకు తీర్థము నందు మునుగగనే నాకు ముందటి పురుషాకారము సిద్ధించెను.

జలాశయ తీరమున విష్ణువు వీణను చేతపట్టుకొని దర్శనభాగ్యము కలిగించెను. అపుడు నేను విష్ణువుతో ఈ మాయప్రభావమున స్త్రీ రూపము చెంది మళ్ళీ నేను పురుషుడుగా మారుట ఏమి? అని ఆశ్చర్యము కలిగినది.

8. వ్యాసుడు జనమేజయునకు భగవతి మహిమను తెలుపుట

తాలధ్వజుడు నా భార్య ఎచటికి వెళ్ళినది? నారదుడు ఎచట నుండి వచ్చెను అని ఆలోచింపసాగెను. ఓ ప్రియురాలా! నీవు లేని నా జీవితము, గృహము, రాజ్యము ఇవన్నియు వ్యర్థములు, భామినీ! నీవు నీటిలో మునిగితివా? లేక చేపలు, తాబేళ్ళు నిన్ను భక్షించెనా? నన్ను వదలి నీవు స్వర్గమునకు వెళ్ళుట శోభాయమానము కాదు.

నేను పుత్రులను, ప్రాణప్రియమగు నిన్నును పోగొట్టుకొని దుఃఖించుచున్నాను. సమాన చిత్తముగల స్త్రీ పురుషుల మరణమును విభిన్న కాలములలో ఎందుకు చేస్తున్నాడు. పతి మరణించిన తరువాత స్త్రీ అతనితో చితియందు భస్మము కావలెనని మునులు స్పష్టముగా నుడివిరి. స్త్రీలకు ఇదొక ఉపకారము కాదా అని తాలధ్వజుడు విలపించుచుండగా శ్రీహరి అతనిని శాంతింపచేసెను.

రాజేంద్రా! ఎందుకు రోదించెదవు? జ్ఞానులైన పురుషుల సాంగత్యమున నీవు కాలమును గడపలేదా? సంసారరూప సముద్రము నందు మానవులు నౌక యందు కూర్చొని ఉన్న పథికుల వంటివారు. మానవుల సంయోగవియోగములు సదా దైవాధీనములు. ఈ సుందరితో సంబంధము ఈ సరోవరము నందు నీవు కలియుటవలన జరిగినది.

రాజా! నీవు ఇంటికి వెళ్ళి రాచకార్యము నిర్వహింపుము. యోగసాధన చేయుటకు ప్రయత్నింపుము. ఘటికా యంత్రమువలె సుఖదుఃఖములు వచ్చుచుపోవుచుండెను. మానవ జన్మమున ఆత్మకళ్యాణము చేసికొనవలెను. స్త్రీవలన కలిగిన దుఃఖమును విడనాడి ఇంటికి వెళ్ళిపొమ్ము. ఇది భగవతి జగదంబ యొక్క మహామాయ.

అప్పుడు తాలధ్వజుడు స్నానవిధులను నిర్వహించి తన గృహమునకేగెను. వైరాగ్యము ఉదయించెను. తన పౌత్రునకు రాజ్యమప్పగించి వనమునకు వెళ్ళిపోయెను. తత్వజ్ఞానమును సంపూర్ణముగ పొందెను.

నారదుడు శ్రీహరీ! నేను సరోవరమున మునిగినవెంటనే పూర్వ స్మృతి నశించెను. స్త్రీ శరీరమును పొంది నేను మోహితుడనైతిని. దేవేశ్వరా! అప్పటి ఆ మనస్సు చిత్తము, దేహము ఆ గుర్తులు స్మృతిపథము నుండి ఎట్లు దూరము కాగలవు? నాకున్న జ్ఞానము పూర్తిగా లుప్తమయ్యెను.

స్త్రీరూపముతో నేను అనేక విధములైన భోగములను అనుభవించితిని. ఇపుడు ఆద్యోపాంతము స్మరణకు వచ్చుచున్నవి.

విష్ణుభగవానుడు అప్పుడు నారదా! ఇదంతయు మహామాయ యొక్క మనోరంజనము. నిదురించిన పురుషుడు ఏమియు ఎరుగడు. నిద్ర నుండి మేల్కొనిన వెంటనే అతని చిత్తము విడిపోవును. మహామాయ యొక్క ఐశ్వర్యము అవగతమగుట మిగుల కఠినమైన విషయము.

మహాకవి దాసు శ్రీరాములు ఈ విషయం వచనంలో –

మునీంద్రా! తెలిపెద వినుము మహామాయావిలాసంబని దీనిం తెలియుము సర్వజంతుదేహంబుల యందును దశాభేదంబు లనేకంబులు గలవు, జాగ్రత్స్వప్న సుషుప్తి తురీయంబు లనునవి దేహధారుల దశభేదంబులు

సుప్తుండగు నరుండు శ్రవణజ్ఞానాది రహితుండై యుండు, ప్రబుద్ధుండై మరలి యెరుంగుచుండు. నిద్రలో చిత్తంబు చలించుట స్వప్నంబులు పుట్టు. చిత్తవృత్తులు నానా భేదంబులు గలిగియుండు. నేనుగు వెంబడించెడి నన్నుం జంపవచ్చుచున్నది. నే నెందుబోవుదు ననియు, మృతుండైన పితామహుండు గృహాగతుండైన మాటలాడితి ననియు, వేలుకొనినప్పుడు తెలుసుకొనుచున్నాడు, స్వప్నంబున భ్రమంబని తెలిసికొన నేరండు, కావున మాయామోహితుండవై యున్నంత మట్టుకు నీకుం బూర్వస్మృతి లేకయున్నయది. మోహంబు విడిచి యిప్పుడు పూర్వస్మృతి కలవాడవైతివి, శంకరాదుల కేని దుర్జేయంబగు మాయం దెలిసికొన నేరి తరంబు? గుణత్రయాత్మకంబైన జగంబున సంసారంబు గుణరహితంబై యుండునే? సమస్తంబు మాయామోహంబని యెరుంగుము. న న్నేల యడిగెద వని నారదుండు నాకుం జెప్పెనని వ్యాసుండు జనమేజయునకు మరియునిట్లనియె.

నారదా! మహామాయ యొక్క గుణములు వాటి పరిధిని శంకరుడు, బ్రహ్మయు కూడా తెలిసికొనలేరు.

కం. మాయావిశిష్టమైనది
యీ యఖిలం బనుచు దెలియు మీశ్వరియే తా
మాయారూపిణిసుమ్మీ
మాయకు మిక్కిలియ లేదు మానవనాథా!

కం. హరిమాయ హరుడుమాయ య
సురవిభుడును యముడు సోమ సూర్యులు దిక్కుల్
సురులును నరులును మాయ య
నర యన్నే నీవు నిదియు నది మాయ సుమీ!

కం. ఈ విశ్వంబున మాయకు
దాపలమై ధాత్రియై సదా పోషిణియై
దేవియను భావమున్నది
యో వసుధాదీశ కొలువు మోపిక జననిన్

కం. ఆదేవి కరుణ గల్గిన
లేదు సుమీ మాయ నీకు లేశంబైనన్
రాదు సుమీ నీ జోలికి
బాదుసుమీ శుభమునకును బరసుఖమునకున్ (మ.క.దా.శ్రీ)

బ్రహ్మయందు రజోగుణము ప్రధానమైనది. తమోగుణ సత్వగుణములు కూడ ఆయనలో ఉన్నవి. శివునిలో తమోగుణము విశేషముగా ఉన్నది. సృష్టి, స్థితి, సంహారము లొనరించు మహామాయను తెలిసికొనుట అందరికి దుస్సాధ్యము. కాలము, కర్మము, స్వభావము మొదలగునవి నిమిత్తకారణములై దానికి సహకరించును.

నారదుడు వ్యాసునితో కౌరవులలో సర్వోత్తముడవైన నీవు కూడా మోహమును విడనాడుము. మన వలన పుణ్యకర్మలు గాని, నీచకర్మలు గాని జరిగినచో వాటి ఫలము తప్పక అనుభవింపవలసి వుండును అని చెప్పెను.

వ్యాసుడు జనమేజయునితో నారదుడు ఈ మాటల్ని నాకు చెప్పి వెళ్ళిపోగానే సరస్వతీనదీ తీరమున నేను బసచేసితిని. అప్పుడు ఉత్తమమైన సారస్వత కల్పము జరుగుచుండెను. నేను శ్రీమద్దేవీభాగవతమును రచించుటకు పూనుకొంటిని.

రాజా! ఈ దేవి భాగవతము అన్ని సందేహములు తీరుస్తూ, అనేక ఉపాఖ్యానములతో, వేద ప్రమాణములు కలిగివుంటుంది.

దారము లేని వస్త్రము ఎక్కడైనా ఉంటుందా?

మట్టిలేకుండ కుండ ఉనికి అసంభవము కాదా? దేవతలు, మానవులు, పశువులు శరీరములు గుణరహితములై పనిచేయజాలవు.

గుణసంయోగము చేతనే బ్రహ్మాదిదేవతల మనస్సులలో కూడా అప్పుడప్పుడు ప్రసన్నత, ఉదాసీనత, విషాదములు జరుగుచున్నది.

సూర్యవంశము, చంద్రవంశము నందలి పదునలుగురు మనువులు ప్రతి యుగమునందు తమ కార్యములు నిర్వహించుచుందురు.

ఆ మాయను సహచారిణి రూపమున స్వీకరించి భగవతి పరమేశ్వరి సదా దానిని వెంటనిడుకొనియే యుండును.

సచ్చిదానందమయ విగ్రహరూపమైన ఆ భగవతిని "మహేశ్వరి" అని పిలిచెదరు. "భువనేశి" అని కూడా అందురు.

రాజా! ఆ దేవి రూపమును ధ్యానించుట యందు నిరంతరము చిత్తమును లగ్నము చేయవలయును. అంధకారము ఇంకొక దట్టమైన

అంధకారమును దూరమొనర్చుటకు సమర్థము కాదు. కాని సూర్యుడు, చంద్రుడు, అగ్ని వాటి తేజస్సు దానిని తొలగించగలదు.

మాయేశ్వరి భగవతి జగదంబయే తన ప్రకాశము చేత మాయను దూరమొనర్చునని తెలిసికొనవలెను.

కం. దేవిస్మరణము ధ్యానము
దేవిపూజనము స్తవము దేవిభజనమున్
దేవీ కీర్తనమును భ
ద్రావహములు నమ్ము నమ్ము మునివరా!

గీ. సచ్చిదానంద రూపిణి శాశ్వత ప్ర
బోధమయి లోకజనయిత్రి భూతభావి
వర్తమానవినోదిని వంద్య నింద్య
జనవిభేదినిఁ గొలువు మో జనవరేణ్యా! (మ.క.దా.శ్రీ)

రాజేంద్రా! వృత్రాసురవధ మొదలగు కథావిషయములను గూర్చి నీవడిగిన ప్రశ్నలకు సమాధానములిచ్చితిని. శ్రీమద్దేవీభాగవతము నందు పూర్వార్ధము నేను వినిపించితిని.

భగవతి జగదంబ యొక్క ఈ రహస్యమును అందరికి వినిపించరాదు.

భక్తులు, శాంతస్వభావులు, దేవి భక్తి యందు శ్రద్ధగలవారు శిష్యులకు, తన పెద్ద కుమారునకు గురుభక్తి కలిగిన వారికి చెప్పవలెను.

మానవులు భక్తితో ఉన్నతములైన ఆలోచనలతో దీనిని పఠించవలెను. శ్రవణము చేయవలెను. దేవి అనుగ్రహంతో సకల శ్రేయస్సులు సిద్ధించును.

సర్వే జనా స్సుఖినో భవంతు - ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

* * *

దేవీ భాగవతము

దేవీనవరాత్రులు - ఐదవరోజు కథ

1. వ్యాసుడు చెప్పిన సృష్టి వివరణ

జనమేజయుడు వ్యాసమహర్షితో సూర్యవంశపు, చంద్రవంశపు రాజుల పరిచయమును కోరగా వ్యాసుడు రాజా! విష్ణుభగవానుని నాభికమలము నుండి బ్రహ్మ ప్రకటితుడయ్యెను. ఆ బ్రహ్మకు భగవతి వరముల నొసగెను, సృష్టి చేయుటకు సమర్థుడయ్యెను. మానవ సృష్టియందు అతనికి సఫలత లభించలేదు.

బ్రహ్మ, ఏడుగురు మానసపుత్రులను ఆవిర్భవింపజేసెను. 1) మరీచి 2) అంగిరసుడు 3) అత్రి 4)వశిష్ఠుడు 5) పులహుడు 6) క్రతువు 7) పులస్త్యుడు అను పేర్లతో ఆ మానస పుత్రులు ప్రసిద్ధులైరి. బ్రహ్మ యొక్క రోషము నుండి రుద్రుడు, ఒడి నుండి నారదుడు, బొటనవ్రేలి నుండి దక్షప్రజాపతి ఉదయించిరి. సనకాది మానసపుత్రుల ఆవిర్భావము జరిగెను. ఎడమచేతి బొటన వ్రేలి నుండి దక్షుని పత్ని ప్రకటిత అయ్యెను. "వీరిణి" అనియు "అసిక్ని" అని పిలిచెడువారు.

దక్షప్రజాపతి వీరిణి గర్భము నుండి అయిదు వేల పుత్రులనావిర్భవింప చేసెను. నారదుడు ఆ కుమారులను చూచి ఈ పృథివి ఎంత పొడవు వెడల్పు కలిగియున్నదో తెలిసికొనకయే మీరు ప్రజలను సృష్టించు కార్యములను ఎట్లు పూనుకొనుచున్నారు. మీరు పృథివి యొక్క పరిమితిని తెలిసికొనుడు, అనగా దక్ష కుమారులగు హర్యక్షులు పృథివిని గురించి తెలిసికొనుటకు బయలుదేరిరి. కొందరు తూర్పుకు, దక్షిణమునకు పడమటి దిశకు, ఉత్తర దిశకు బయలుదేరిరి. తన కుమారులు వెళ్లిపోవుటను చూచి దక్షుడు కోపముతో నారదునకు శాపమొసగెను.

దక్షుడు నారదునితో నీవు నా కుమారులను నశింపచేసితివి. నేను నిన్ను నశింప చేయుదును. ఈ పాపమునకు నీవు కూడా గర్భమునందుండెదవు అనగా నారదుడు వీరిణి గర్భము నుండి ప్రకటితుడయ్యెను. మరియు దక్షుడు వీరిణి గర్భము నుండి అరువది మంది కన్యలను ఉత్పన్నము చేసెను. పదమూడుగురిని కశ్యపున కిచ్చి వివాహము చేసెను.

పదిమంది కన్యలను ధర్మునకు, ఇరవై ఏడుగురిని చంద్రునకు, ఇరువురిని భృగువునకు, నలుగురిని అరిష్టనేమికి ఇచ్చి వివాహమొనరించెను. ఇరువురి కన్యలను అంగిరసునకిచ్చి వివాహము చేసెను. సకల దేవతలు, మానవులు ఈ కన్యల పుత్రులు, పౌత్రులే. ద్వేషముతో రగిలిపోవుచు పరస్పరము శత్రుత్వమును పెంచుకొనుచుండిరి. మాయ అందరిని మోహమున పడవేయును.

2. శర్యాతి కథ - సుకన్య చ్యవనుల వివాహము

జనమేజయుడు వ్యాసునితో సూర్యవంశపురాజుల వంశావళిని కోరగా అతడు చెప్పసాగెను. బ్రహ్మ మొదట భగవతి జగదంబను ధ్యానించుచు పదివేల సంవత్సరములు తపమొనరించెను. మరీచి నుండి కశ్యపుడు జన్మించెను. దక్ష ప్రజాపతి యొక్క పదముగ్గురు కన్యలను కశ్యపుడు వివాహమాడెను. దేవతలు, దానవులు, యక్షులు, సర్పగణములు, పశువులు, పక్షులు ఆయన నుండి జన్మించెను. దీనినే 'కాశ్యప సృష్టి' అని చెప్పుదురు.

దేవతలలో శ్రేష్ఠుడు సూర్యుడు. ఆయన పేరు వివస్వంతుడు. ఈ వైవస్వత మనువు నుండి సూర్యవంశము వృద్ధిచెందెను. మొదట ఇక్ష్వాకుడు ఉదయించెను. నాభాగుడు, ధృష్ట, శర్యాతి, నరిష్యంతుడు, ప్రాంశుడు, నృగుడు, దిష్ప, కరూషుడు, పృషధ్రుడు, వీరందరు మనుపుత్రులుగా ప్రసిద్ధిచెందిరి.

ఇక్ష్వాకునకు వందమంది పుత్రులు కలిగిరి. అందు వికుక్షి శ్రేష్ఠుడుగా భావింపబడును. నాభాగుని కుమారుడు అంబరీషుడు. ఈతడు ధర్మజ్ఞుని, సత్యవాది, ప్రజాపాలకుడు. ద్రష్టునకు ధార్ష్టుడు జన్మించెను. ధార్ష్టుడు క్షత్రియుడయ్యెను. బ్రాహ్మణుడుగ పరిణతి చెందెను. ఆయన ద్వారా బ్రాహ్మణకర్మలు జరుగుచుండెను.

శర్యాతి నుండి అకర్తకుడు జన్మించెను. అకర్తకునికి సుకన్య పుత్రికగా ఉద్భవించెను. సుకన్యను నేత్రహీనుడగు చ్యవనునికిచ్చి వివాహము చేసెను. సుకన్యవలన చ్యవనునకు అంధత్వము తొలగిపోయెను. అశ్వని దేవతలు నేత్రములను ప్రసాదించిరి.

వ్యాసునితో జనమేజయుడు – అంధుడైన మునీంద్రునకు తన కుమార్తెనిచ్చి వివాహము చేసెను అని చెప్పితివి. మునీంద్రుడు నేత్రహీనుడని తెలిసి కూడ వివాహమొనరించుటకు సమంజసమెట్లగును అనగా వ్యాసుడు చెప్పసాగెను. శర్యాతి వైవస్వతమనువు కుమారుడు. అతనికి నాలుగువేల మంది భార్యలుండిరి. నగరమునకు కొద్దిదూరములో మానస సరోవరము అనే సరస్సు కలదు.

ఆ సరోవరమునకు సమీపముననే చ్యవనముని నివసించుచుండెను. తన మనస్సును ఏకాగ్రమొనర్ప తలంచి తపస్సు నారంభించెను. భగవతి జగదంబను ధ్యానించుచుండెను. సుకన్య బాల్యచాపల్యమున తన సఖియలతో చ్యవనమునిని సమీపించెను. ముని యొక్క శరీరము చెదపురుగులకు నివాసమయ్యెను. అ పుట్ట రంధ్రములనుండి రెండు జ్యోతులు కనిపించెను.

ముల్లును తీసికొని పైన వున్న మట్టిని తొలగింపసాగెను. ఇక్కడ ఏదో మెరయుచున్నదనుకొని ఆమె ఆ ముని నేత్రములను ముల్లుతో పొడిచెను. కళ్ళు పొడవబడగా మునికి అపారమైన కష్టము కలుగసాగెను.

రాజు శర్యాతి మిగుల చింతితుడయ్యెను. సుకన్య తండ్రితో "నేను ముల్లుతో గ్రుచ్చుట వలన ఇదంతయు జరిగియుండవచ్చును, దీనికి కారణము నేనే అని తలపోసెను. సఖియలతో ఆడుకొనుచు ఆ వల్మీకమును గాంచితిని. అందు రెండు రంధ్రముల నుండి జ్యోతి రూపమున నాకు కనబడగా వాటిని ముల్లుతో గ్రుచ్చితిని.

అప్పుడు అక్కడ 'హాహా' యను ఒక మంద స్వరము కూడా వల్మీకము నుండి వినిపించెను అని చెప్పగా సుకన్యవలననే మునికి అవమానము జరిగినదని తలచి వెంటనే శర్యాతి పుట్టదగ్గరకు పరుగిడెను.

మహారాజు చ్యవనమునీంద్రుని చూచి మునీంద్రునకు సాష్టాంగ ప్రణామము చేసెను. బ్రాహ్మణోత్తమా! నా కుమార్తె అజ్ఞానమున ఈ విధంగా చేసినది. ఆమె అపరాధమును క్షమింపుడు అని కోరెను.

చ్యవనుడు రాజుతో నేనెప్పుడును ఏ మాత్రముకోపించను. నీ పుత్రిక నాకు కష్టమును కలిగించెను. వృద్ధాప్యము నన్నావహించినది. అంధుడనగు నాకు ఎవరు సేవ చేసెదరు? అనగా రాజు మునివరా! నేను మీ సేవకు గాను అనేక మందిని నియమించెదను. ఈ అపరాధమును క్షమింపుడు అని కోరెను.

చ్యవనుడు రాజా! నీ కన్యను నా సేవకొరకునియోగింపుము. ఆమెతో ఉండి నేను తపమొనరించుకొందును. నేను సంతుష్టుడనైనచో మీ రాజ్య ప్రజలు సంతోషముగ కాలము గడిపెదరు. ఏ దోషము అంటదు. దీనికి కారణము నేను సంయమ స్వభావము గల తపస్వినగుటయే! అనెను.

రాజుశర్యాతి మిగుల చింతించెను. కుమార్తెనివ్వవలయునా, వలదా అన్న ఏ విషయము అతని నోటనుండి వెలువడలేదు. ఉదాసీనుడై తన ఇంటికి మరలిపోయెను. మంత్రులను పిలిపించి మీ అభిప్రాయమును తెలుపుడు. మునికి నా కుమార్తెనివ్వవలెనా? లేక దుఃఖము

అనుభవించవలెనా? అని అడిగెను. మంత్రులు మహారాజా! భాగ్యహీనుడైన వ్యక్తికి మిగుల సుకుమారియైన సుకన్యనిచ్చుట ఎట్లు సముచితమగును.

తండ్రియు, మంత్రులును మిగుల దుఃఖితులైయున్నారని రాజకుమారి సుకన్య అవగతము చేసికొనెను. తండ్రీ! నేను మునిదగ్గరకు వెళ్ళెదను. నన్ను సమర్పించుకొని అతనిని ప్రసన్నము చేసికొనుటకు ప్రయత్నించెదను అనగా సుకన్య పలుకులను విని రాజు శర్యాతి హృదయము ద్రవించెను.

ఆమెతో అమ్మా! నీవు మునీంద్రునెట్లు సేవించగలవు? అతడు మిగుల వృద్ధుడు, విశేషముగా ముక్కోపి, సంపన్నుడైన యోగ్యుడైన వరునితో తన కుమార్తెకు వివాహమొనరించుట తండ్రి యొక్క కర్తవ్యము. నిన్ను ఒక గ్రుడ్డివాని చేతులలో పెట్టుట నాకు సుతరాము ఇష్టము లేదు.

సుకన్య తండ్రితో వృద్ధుడు మునీంద్రుడు నాచేత భక్తి పూర్వముగ సేవింపబడును. నేను సతీధర్మమును చక్కగా నెరుగుదును, నాకు భోగములందు అభిరుచియే లేదు అని చెప్పగా, సుకన్య అభిప్రాయమును తండ్రి ఆమోదించెను. మునీంద్రుని రాజు సమీపించి స్వామీ! నా కుమార్తె మిమ్ములను సేవించుటకు సంసిద్ధముగానున్నది అని చెప్పి సుకన్య వివాహము మునీంద్రునితో జరిపించెను.

శర్యాతి తన పుత్రికను మునీంద్రునకు అప్పగించి ఇంటికి తిరిగి వెళ్ళుటకు ఉద్యమించెను. అప్పుడు సుకన్య తండ్రితో నా బట్టలు, ఆభరణములు తీసుకొనివెళ్ళుడు. నాకు నారచీరలు, మృగచర్మము ఇచ్చి వెళ్ళుడు అనెను. నేను సౌందర్యవతియు, యౌవనవతియైన నా కుమార్తెను నేత్రహీనుడు వృద్ధుడునైన మునికి అప్పగించితిని అని మీరెప్పుడు చింతించవలదు.

వశిష్ఠుని పత్ని అరుంధతి, అత్రి మహర్షి భార్యయగు అనసూయ స్వర్గమున ప్రసిద్ధురాండ్రు. అట్లే నేను కూడా ప్రతిష్ఠకు పాత్రురాలగుదును

అనగా సుకన్య మాటలను విని అతడామెకు వల్కల వస్త్రములు ఒసగెను. సుకన్య వెంటనే ముని పత్నిగా ఉండిపోయెను. కుమార్తెను అచటనే వదలి శర్యాతి మంత్రులతో కూడి నగరమునకు వెళ్ళిపోయెను.

సుకన్య పతిసేవయందే కాలము గడుపుచుండెను. కాలమునకు తగినట్లు ఆహారపదార్థములు చేసి పెట్టి యతనిని సంతృప్తుని చేసెడిది. వేసవి కాలము నందు తాటివీవనతో చల్లగా విసురుచు భర్త సేవయందు నిమగ్నురాలయ్యెడిది. చలిదినములందు కట్టెలను ప్రోగుచేసి ముని ఎదురుగా నుంచి అగ్నిని రగుల్కొల్పెడిది.

సుకన్య వలన అగ్నిదేవుడు, అతిథులు సదా గౌరవింపబడుచుండిరి. మిగుల హర్షముతో సర్వదా చ్యవనమునికి సపర్యలొనరించుచుండెను. ఒకనాడు సూర్యుని పుత్రులు అశ్వనీ దేవతలు చ్యవనముని ఆశ్రమ సమీపమునకు వచ్చిరి. సుకన్యను చూచి వారు మేము సూర్యదేవుని కుమారులము.

నీవు రెండవ లక్ష్మీదేవియా అనునట్లున్నావు. ఈ భూమిపై నీ పాదములు మోపి భూమికే వన్నె తెచ్చావు. నీ తలిదండ్రులెవరు? నీ పతిదేవుడెవరు? అని అడుగగా నేను మహారాజగు శర్యాతి యొక్క కుమార్తెను, చ్యవనుడు నా పతిదేవుడు. నా భర్తకు కనులు లేవు. రాత్రింబవళ్ళు నా పతిదేవుని సేవ యందు తత్పరురాలనయి యున్నాను అని చెప్పగా అశ్వనీ కుమారులు కళ్యాణీ! నేత్రహీనుడైన భర్త నీకెట్లు లభించెను?

ఉ. కన్నులు లేకయుం టొకట కాదుగదా కడువృద్ధుఁ డెట్టుగా
నిన్ను సుఖింపఁజేయు రమణీ వృధయయ్యెను నీదు జీవితం
బన్నిట నారచీరలకునా తగు నీదు శరీర సౌష్ఠవం
బెన్నఁ దరంబె నీదు బ్రతు కిట్లు విధించిన బ్రహ్మ నేమనన్

(మహాకవిదాసు శ్రీరాములు)

అపుడు సుకన్యకు శరీరమంతయును కంపించసాగెను. దేవతలారా! మీరు భగవంతుడగు సూర్యునిపుత్రులు. నా తండ్రి నన్ను యోగధర్మి యగు మునికి సమర్పించెను. సూర్యభగవానుడు సమస్త ప్రాణుల కర్మలకు సాక్షి. ఈ జగత్తు మిథ్య. మీరు ధర్మ నిర్ణయము ఎరిగిన మహానుభావులు. మీరిచటి నుండి వెళ్ళకపోయినచో నేను శాపమొసగెదను. పతివ్రతాధర్మమును పాలించు శర్యాతి కుమార్తెను నేను. నా పేరు సుకన్య అని గట్టిగా అనెను.

సుకన్య మాటలు విని అశ్వనీదేవతలు ఆశ్చర్యమునకు అవధులు లేకుండెను. చ్యవనుని మాట చెప్పగానే వారికి భయము కలిగినది. సుకన్యతో నీ ధర్మపాలనతో మా హృదయములు గద్గదికములగుచున్నవి. మేము నీకు వరమివ్వదలిచాము. మేము దేవ వైద్యులని నీవు తెలుసుకొనుము. నీ భర్తను ఇప్పుడే సౌందర్యవంతునిగా చేసెదము. అనగా వెంటనే సుకన్య చ్యవనుని వద్దకు వెళ్ళి జరిగినదంతయు చెప్పసాగెను.

అశ్వనీదేవతలు కామాతురులై, నాతో నీ భర్తను నవయువకునిగా దివ్య శరీరధారిగా చేసెదము. అయితే ఒక షరతు. మామువ్వురిలో ఎవరినో ఒకరిని నీవు భర్తగా ఎన్నుకొనవలెను అని చెప్పిరి. ఈ దేవతల మాయ అర్థమగుట కూడ కష్టము. మీరు సమర్థులు. నేనేమి చేయవలయునో ఆజ్ఞాపించుడు అని కోరెను.

చ్యవనుడు నీవిప్పుడే అశ్వనీ దేవతలను తీసికొని రమ్ము. విచారించవలసిన పని ఏమియు లేదని సుకన్యకు చెప్పెను. చ్యవనముని చెప్పినట్లు అశ్వనీ కుమారులతో తమ షరతులకు అంగీకరింపచేసి భర్త వద్దకు తీసికొనివచ్చెను. వారు చ్యవనునితో ఈ సరస్సులో దిగుమని కోరగా అతడట్లే చేసెను. వారును సరస్సులో దిగి ముగ్గురు బయటికి రాగానే ఒకే రూపుగల ముగ్గురిలో ఎవరో ఒకరిని భర్తగా చేసుకొనుమని చెప్పిరి.

సుకన్య "నేనేమి చేయుదును? ముగ్గురును ఒకే విధముగానున్నారు" అని మనసులో తలపోయుచు భగవతి జగదంబ ధ్యానము నందు

నిమగ్నురాలయ్యెను. దేవీ! నా సతీధర్మమును రక్షించు భారము నీ మీదే వున్నది.

ఆ.వె. శరణు శరణు నీకు జగదంబ భగవతీ!
శరణు శరణు నీకు జక్కనమ్మ
నన్ను బ్రోవుమమ్మ నా పాలిదైవమ్మ
దేవి నీవె నాకు దిక్కు సుమ్ము!

ఆ.వె. వేదమాతవమ్మ విష్ణుని ప్రియవమ్మ
యాదిలక్ష్మివమ్మ యఖిలలోక
శుభవిధాత్రివమ్మ యభయంబు నీవిమ్మ
వేగ నన్ను బ్రోవరాగదమ్మ.

శా. నీవే తల్లివి నీవె తండ్రివి ననున్జేపట్టి రక్షింపగా
నీవె దిక్కు సమస్త లోకములలో నీ కంటె లేరేరు నన్
బ్రోవంజాలుదు వార్తరక్షణకరీ భూతేశ్వరీ భూరిమా
యావిన్య స్తజగత్రయాంచదుదరీ హర్షంకరీ శాంకరీ.

మ. హరికిన్ శంభునకు న్ధితామహునకున్ వ్యావృత్తి గల్పించి సు
స్థిరవిజ్ఞానమునిచ్చి సంతతము బ్రీతి న్మూచు నీకంటె నె
వ్వరి నే వేడెద సిద్ధిదాయినివి దివ్యజ్ఞాన సంపూర్ణ వా
దిరమాదేవివి ప్రోవవే భగవతీ దేవీ దయాంభోనిధీ! (మ.క.దా.శ్రీ)

అని వేడుకొనగా త్రిపుర సుందరి సుకన్యకు జ్ఞానమును ఆవిర్భవింపచేసెను. ఆమె ఆ మువ్వురిలో తన భర్తను నిర్ణయించుకొనుటలో సఫలతచెందెను. సుకన్య చ్యవనుని వరించగా అశ్వనీ దేవతలు సంతుష్టులైరి. చ్యవనుడు సంతోషమొంది అశ్వనీ దేవతలతో మీరు నాకు నేత్రములను, యౌవనమును, అద్భుతమైన రూపమును ప్రసాదించితిరి కనుక మీకేదైన ఉపకారము చేయదలచితిని. మీరు అడిగిన పదార్థము ఇవ్వగలను అనెను.

అశ్వనీ దేవతలు మునిశ్రేష్ఠునితో మునీంద్రా! మా తండ్రి కృపతో మాకన్ని కోరికలు తీరినవి. దేవతల పంక్తిలో కూర్చొని సోమపానము చేయుకోరిక ఇంకను పూర్తి కాలేదు. మాకది సాధ్యపడలేదు అని చెప్పిరి.

చ్యవనుడు మీరిరువురు సోమరసము త్రాగగలరు. ఇంద్రుడు కపటము ననుసరించెను. అతని యెదుటనే మీరు సోమరసము త్రాగుదురు. శర్యాతి వద్ద యజ్ఞము జరుగుచున్నది. అపుడు మీ కోరిక తప్పక నెరవేరగలదు అనగా అశ్వనీ దేవతలు ఆనందముతో స్వర్గమున కేగిరి. చ్యవనుడు సుకన్యతో ఆశ్రమము చేరెను.

3. అశ్వనీ కుమారులకు సోమరసం ప్రాప్తించుట

జనమేజయుడు వ్యాసునితో మహాత్మా! అశ్వనీ దేవతలు సోమరసము పానము చేయుటకు అనధికారులని ఇంద్రుడు చెప్పెను కదా! చ్యవనముని ద్వారా ఎట్లు లభించినదని వివరింపుమని కోరగా వ్యాసుడు రాజా! శర్యాతి చేస్తున్న యజ్ఞమునకు చ్యవనుడు ఏతెంచెను. దేవతలతో సమానమైన తేజస్సు కలవాడు.

శర్యాతిభార్య తనకుమార్తె సుకన్య, ఎలా ఉందో తెలుసుకో వలసిందిగా కోరగా శర్యాతి వెంటనే చ్యవనముని ఆశ్రమమునకు వెడలెను. అక్కడ నవయువకుడగు ముని కనిపించగా తన కుమార్తె సుకన్యను శంకించి నిందనీయమగు నీచ కార్యమేమైనా చేసెనేమోయని భావించెను. మను వంశమునకు ఈమె తొలగింపరాని కళంకము తెచ్చిపెట్టెను. నేను నేత్రహీనునకు, వృద్ధుడైన మునీంద్రునకు నా కుమార్తె నిచ్చితిని. ఈ లాంటి నీచకర్మను చేసిన దుష్టచరిత్రురాలగు సుకన్యను చంపివేసినచో నాకు స్త్రీ హత్యాదోషము కలుగును. నేనేమి చేయవలయునో అర్థమగుట లేదని చింతించుచుండెను. ఆ సమయమున సుకన్య తన తండ్రితో నా పతిదేవునకు ప్రణామముచేయుడు అనగా శర్యాతి కోపముతో చ్యవన మునీంద్రుడెచటికి వెళ్ళెను.

సుకన్యా! నీవు కామమునకు వశవర్తివై ఈ నవయువకునికి దాసివైతివా? నీ భర్త వృద్ధుడైన మునీంద్రుడు కదా! అని అడుగగా సుకన్య ముఖము నందు చిరునగవు తొణికిసలాడెను. తండ్రీ! నీకు అల్లుడైన చ్యవన మునీంద్రుడితడే! అశ్వనీ కుమారుల కృపవలన ఇతనికి చక్కటి రూపము, కాంతియు కలిగినది.

మీరనుకొనినట్లు అసహ్యకరమైన పని నేనెప్పుడును చేయను. భృగువంశమును సుశోభితమొనరించు చ్యవనమునీంద్రునకు మీరు నమస్కరింపుడు. అన్నియును అతడు మీకు తెలుపును అనగా శర్యాతి వెంటనే మునీంద్రుని చెంతకేగెను. అతని చరణములకు ప్రణమిల్లెను.

భృగుకుల భూషణుడైన మునీంద్రా! మీ కనులకు దృష్టి ఎట్లు వచ్చెను. వృద్ధాప్యము ఎట్లు పోయెను. ఇప్పుడున్న మీ చక్కటి రూపము చూచి నాకు సందేహము వచ్చినది. కారణమేమి అని అడుగగా చ్యవనుడు రాజేంద్రా! అశ్వనీ కుమారులు దేవవైద్యులు. వారే దయతో నాకీ ఉపకారము చేసిరి.

'వారికి రాజగు శర్యాతి యజ్ఞమున సోమరసమును త్రాగుటకు అధికారులనుగ చేసెదను' అని వరమిచ్చితిని. దేవవైద్యుల ద్వారా నాకు యౌవనము, విమలనేత్రములు ప్రాప్తించినవి. మహారాజా! నేనొక యజ్ఞమును చేయించెదను. మీరు యజ్ఞసంభారములను సమకూర్చుకొనుడు. నా ప్రయత్నము వలన అశ్వనీ కుమారులు సోమరసము పానము చేయగలరు. నా ప్రతిజ్ఞ కూడా నెరవేరును.

రాజు యజ్ఞశాలను నిర్మింపచేసెను. వశిష్ఠాది ప్రముఖ ముని గణములను ఆ యజ్ఞమునకు ఆహ్వానించెను. ఇంద్రాది సకల దేవతలును వచ్చిరి. సోమరసము పానము చేయుకోరికతో అశ్వనీ దేవతలును అచటికేతెంచిరి. ఇంద్రుడు వారిని చూచి ఈ అశ్వనీ దేవతలు ఇచటికెందుకు

వచ్చిరి. వీరికి సోమరసమును త్రాగు అధికారము లేదు అనగా చ్యవనుడు శచీపతీ! వీరు సూర్యకుమారులు. సూర్యుని యొక్క ధర్మపత్ని నుండి జన్మించిరి. నేను సోమరసము ఇచ్చి దీనికి అధికారులను చేయుచున్నాను అని తపఃప్రభావముతో చ్యవనమునీంద్రుడు సోమరసభాగమును చేకొని అశ్వనీ దేవతలకు త్రాగించెను.

ఇంద్రుడు చ్యవనునితో అశ్వని దేవతలకు సోమరసమును ఇచ్చుటయే నీ ధ్యేయమైనచో నేనిప్పుడే నీ తలను త్రుంచి వేసెదను అనెను. నీ మీద వజ్రప్రహారమును చేసెదను. విశ్వరూపుని వధించునట్లు నిన్నును వధించెదను అని వజ్రాయుధమును సకల దేవతలు చూచుచుండగ చ్యవనుని మీద ప్రయోగించెను. చ్యవనుడు దానిని స్తంభింపచేసెను. అతడు ఒక కృత్యను ఆవిర్భవింపచేసెను.

'మధుడు' అను పేరుతో పురుషుని రూపమున ఆవిర్భావమయ్యెను. ఆ రాక్షసుడు మూడు లోకములను మ్రింగివేయునా అనునట్లుండెను. ఇంద్రుని మీదకు విరుచుకు పడెను. ఇంద్రుడు ఆదైత్యుని మీద వజ్రాఘాతము చేయవలెనని తలంచెను. కాని విఫలుడయ్యెను.

ఇంద్రుడు బృహస్పతిని మనస్సులో స్మరించెను. ఇంద్రుని పరిస్థితి బృహస్పతికి అర్థమయ్యెను. చ్యవనమునియొక్క తపస్సునకు ప్రతీకగా ఈ భయంకరమైన రాక్షసుడు యజ్ఞవేది నుండి ఉత్పన్నుడయ్యెను.

దేవేశ్వరా! నీవిపుడు చ్యవనుని శరణువేడినచో ఆ మహర్షి తాను కృత్యను ఉపశమింపచేయును. చ్యవనుడు భగవతి భక్తుడు అని బృహస్పతి చెప్పెను. ఇంద్రుడు వెంటనే మునివరా! నేటి నుండి అశ్వినీ కుమారులు సోమరసపానమునకు అధికారులని అంగీకరింపబడుదురు. మీ కృప చేత నిరంతరము అశ్వినీ కుమారులు సోమరస పానము చేసెదరు. శర్యాతి కీర్తి కూడా జగత్తునందు వ్యాపించును. ఈ అసురుని ఉపసంహరింపచేసి సకల దేవతలకు శుభమును చేయుడు అని కోరెను.

చ్యవనుడు ఆ రాక్షసుని శాంతింపచేసి అతనిని పానశాలలందు, జూదములకు నిలయములైన స్థానములందు నివసించుటకు ఏర్పాట్లు చేసెను. సోమరసమును మొదట ఇంద్రుడు తాగిన తరువాత అశ్వనీ కుమారులను త్రాగమని ఆజ్ఞాపించెను.

శర్యాతి తన రాజధానికి వెళ్ళిపోయి అచట రాచకార్యములను నిర్వహించుచుండెను. అతనికి అనర్తుడను పుత్రుడు, అనర్తునికి రేవతుడు పుట్టెను. రేవతునికి రేవతియను పుత్రిక పుట్టెను. రేవతి యౌవనవతి కాగానే తన కుమార్తెను ఎవరికిచ్చి పెండ్లి చేయవలెనని ఆలోచించి బ్రహ్మను అడుగుటకు బ్రహ్మలోకమునకు వెళ్ళెను.

4. రేవతి బలరాముల వివాహము

జనమేజయుడు వ్యాసునితో రేవతుడు తన పుత్రికను తీసుకొని బ్రహ్మలోకమునకు ఎట్లు వెళ్ళెను. మానవ శరీరముతో బ్రహ్మలోకమునకు ఎట్లు పోగలుగుదురు? అచటి నుండి తిరిగి మనుష్య లోకమునకు ఎటుల వచ్చెదరు? అని అడిగెను.

వ్యాసుడు జనమేజయునితో సుమేరు పర్వతశిఖరము మీద ఇంద్రలోకము, వహ్నిలోకము, సంయమనీపురము, సత్యలోకము, కైలాసము, వైకుంఠము, అన్ని లోకములున్నవి.

అర్జునుడు ఇంద్రలోకమునకు వెళ్ళియుండెను. ఐదు సంవత్సరములుండెను. ककుత్సుడు ఇతర రాజులెందరో స్వర్గలోకమునకు చేరియుండిరి. యజ్ఞశీలురు యజ్ఞప్రభావముతో అచటికి వెళ్ళుటకు అధికారులగుదురు.

రేవతునికి బ్రహ్మదేవుడేమని ఆజ్ఞనొసగెను. తన పుత్రికను ఎవరికిచ్చి వివాహమొనరించెను? అని వ్యాసుని అడుగగా రేవతుడు బ్రహ్మతో దేవా! నా కుమార్తె రేవతికి తగిన వరుని కోసం చూచితిని. ఎవ్వరును తగినవారుగ

తోచలేదు. సుయోగ్యుడైన రాజకుమారుని నాకు తెలుపుమని కోరెను. బ్రహ్మదేవుడు చిరునవ్వు నవ్వి ఇప్పుడు ఇరువది ఏడవ యుగమునందలి ద్వాపరము నడుచుచున్నది.

ఇప్పుడచ్చట చంద్రవంశపు రాజులు శాసనము చేయుచున్నారు. ఉగ్రసేనుడు మధురకు రాజు. యయాతి వంశము నందు అతడు జన్మించెను. అతనికొక కుమారుడు కంసుడు కలడు. ఉగ్రసేనుని కారాగారమున బంధించి రాజ్యాధికారము చేజిక్కించుకొనెను.

రాక్షసుల భూభారము మోయలేక భూదేవి శ్రీహరిని వేడుకొనగా శ్రీకృష్ణుడు అవతరించెను. కంసుని శ్రీకృష్ణుడు వధించెను. కంసుని మామ జరాసంధుడు. శ్రీకృష్ణునితో యుద్ధముచేసి విఫలమై కాలయవనుని శ్రీకృష్ణునిపైకి యుద్ధము చేయుటకు పంపెను. అప్పుడు శ్రీకృష్ణుడు మధురను వదలిపెట్టి, ద్వారకకు వెళ్ళిపోయెను. యాదవులందరు అక్కడికి చేరిరి.

శ్రీకృష్ణుని సోదరుడు బలరాముడు. అతడు శేషుని అవతారమని భావింపబడును. ఇప్పుడతడే మీ కుమార్తెకు తగిన వరుడు. అతనికిచ్చి కన్యాదానము చేసిన వెంటనే నీవు బదిరికాశ్రమమునకు వెళ్ళి తప మొనరించుము. తపస్సుచేత మానవుల కోరికలన్నియు సఫలమగును.

అనిబ్రహ్మ రేవతునకు ఇలా చెప్పగానే రేవతిని తీసుకొని ద్వారకకు వెళ్ళి తన పుత్రికను బలరామునకిచ్చి వివాహము చేసి ఆ తరువాత గంగా తీరమున తపమొనరించి దివ్యలోకమునకు వెళ్ళిపోయెను.

జనమేజయుడు వ్యాసునితో రేవతుడు తన కుమార్తెతో బ్రహ్మలోకమునకు వెళ్ళినపుడు నూట ఎనిమిది యుగములు గడిచెనని చెప్పితిరి. వారిరువురు వృద్ధులు కాలేదా? అని అడిగెను.

వ్యాసుడు జనమేజయరాజా! బ్రహ్మలోకమునందు ఆకలి దప్పులు, మృత్యువు, భయము, వృద్ధాప్యము చూపజాలవు. శర్యాతి వంశము

నశించెను. ఆ తరువాత ఇక్షువుడను మనువునకు ఇక్ష్వాకుడను కుమారుడు పుట్టెను. ఇతడు సూర్యవంశపు ముఖ్యప్రవర్తకుడయ్యెను. అతడు భగవతి ధ్యానమునందే కఠిన తపమొనరించెను.

ఇక్ష్వాకునకు వంద మంది కుమారులు. పెద్దవాడు వికుక్షి, అయోధ్యకు రాజు. వికుక్షియే శశాదుడనే నామముతో ప్రసిద్ధిచెందెను. అతని కుమారుడు ककుత్సుడు. అతని ఇతర నామములు ఇంద్రవాహుడు, పురంజయుడు. ककుత్సునకు ఏర్పడిన ఈ నామములకు కారణము – విష్ణువు ఆదేశానుసారము ఇంద్రుడు సకలదేవతలు ककుత్సుని వద్దకు వెళ్ళిరి. అప్పుడు ककుత్సుడు దేవతలారా! మీరు నేనేమి చేయవలెనో ఆదేశింపుడు అని కోరెను.

దేవతలు రాజా! నీవు ఇంద్రుని సఖుడవై దైత్యులను పరాజితులను కావింపుము. నీవు భగవతి జగదంబ కృపకు పాత్రుడవైనావు. మేము విష్ణుదేవుని ప్రేరణ చేతనే నీ వద్దకు వచ్చితిమి అనగా రాజు దేవతలారా! యుద్ధసమయమున ఇంద్రుడు నావాహనము కావలెను అని పలుకగా దేవతలందరు శచిపతీ! మీరు సిగ్గును వదలిపెట్టి వాహనమగుటకు అంగీకరింపుడు అని కోరిరి.

వెంటనే ఇంద్రుడు వృషభరూపమును దాల్చెను. అపుడు శివుని వాహనమైన నందీశ్వరుడా యను నట్లుండెను. అపుడే "ఇంద్రవాహను"డని కూడ పేరు వచ్చెను. దైత్యులమీద విజయముపొందినందున "పురంజయుడ"ని పేరు వచ్చెను.

ककుత్సుని పుత్రుడు సువిఖ్యాతుడు. అతనికి పృథువు, పృథువు పుత్రుడు విశ్వరంధ్రి, విశ్వరంధ్రికి చంద్రుడు, చంద్రుని పుత్రుని పేరు యువనాశ్వుడు, యువనాశ్వునకు శావంతుడు. శావంతుని పుత్రుడు బృహదశ్వుడు, బృహదశ్వకు కువలాశ్వుడు జన్మించెను. కువలాశ్వుడు

దుంధువను పేరుగల దైత్యుని సంహరించెను. అప్పటినుండి అతనిని దుంధుసారుడనుపేరుతో ఖ్యాతి వహించెను.

కువలాశ్వని పుత్రుడు ధృధాశ్వుడు, ధృధాశ్వనకు హర్యశ్వుడు పుట్టెను. హర్యశ్వుని కుమారుడు నికుంభుడని పిలువబడెను. నికుంభుని కుమారుడు బర్హణాశ్వుడు. ఇతని కుమారుడు కృశాశ్వుడు.

కృశాశ్వనకు ప్రసేనజిత్తు అను పుత్రుడు ఉదయించెను. ప్రసేనజిత్తు పుత్రుడు యౌవనాశ్వుడు. యౌవనాశ్వనకు శ్రీమంతుడు రాజగు మాంధాత జన్మించెను. ఇతడు జగన్మాతకు తీర్థస్థలములను నిర్మించెను. ఇతని జననము కడు చోద్యము. తల్లి గర్భమునకాక తండ్రి గర్భమున జన్మించెను అనగా వెంటనే జనమేజయుడు ఆ కథ చెప్పుమని కోరెను.

యౌవనాశ్వనకు వందమంది భార్యలుండియు ఎవరికి సంతానము కలుగలేదు. అతను ఋషుల ఆశ్రమములందు కాలము గడుపుచుండగా బ్రాహ్మణులు నీవెప్పుడు ఎందుకు చింతిస్తుంటావని రాజును అడిగిరి. రాజు నాకు సంతానము కలుగలేదు. అదియే నా దుఃఖమని చెప్పెను.

బ్రాహ్మణులందరు కలిసి ఒక యజ్ఞముచేయుటకు రాజును ఒప్పించి యజ్ఞమున ఒక కలశము ఏర్పాటుచేసి అందు అభిమంత్రించిన జలమునుంచిరి. ఆ రాత్రి మిక్కిలి దప్పిక కొన్న యౌవనాశ్వుడు ఆ అభిమంత్రించిన నీటిని త్రాగెను. మరుసటి ఉదయము బ్రాహ్మణులు ఆ నీరు ఎవరు త్రాగిరి అని అడుగగా దప్పికతో నేనే త్రాగితినని చెప్పెను.

మంత్రప్రభావముచే స్వయముగా రాజు ఉదరమున గర్భము నిలిచెను. ప్రసవకాలము దగ్గరకు రాగానే యౌవనాశ్వని దక్షిణగర్భము నుండి పుత్రుడు ఉదయించెను. ఈ కుమారునకు ఇప్పుడు ఎవడు పాలు పట్టుదురు అని మంత్రులు గట్టిగా అరవగా ఇంద్రుడు తన చూపుడువేలును బాలుని నోటిలోవుంచి నేను రక్షించెదను అనెను. అందుకే ఇతడు మాంధాత అయ్యెను. ఇది అతని జన్మరహస్యము.

5. సత్యవ్రతునకు త్రిశంకుడను పేరు కలుగుటకు కారణము

మాంధాత ధర్మపత్ని విందుమతి. వారికి ఇరువురు కుమారులు. ఒక కుమారుడుపురుకుత్సుడు, రెండవ వాడు ముచుకుందుడు. పురుకుత్సునకు అరణ్యకుడు జన్మించెను. అతనికి బృహదశ్వుడు, అతనికి హర్యక్షుడు అతనికి త్రిధన్యుడు అతనికి అరుణుడు ఉదయించిరి. అరుణునకు సత్యవ్రతుడు అనే పుత్రుడు కలిగెను. ఇతడు కాముకుడు, మూర్ఖుడు. సత్యవ్రతుని తండ్రి యతని ప్రవర్తనకు విసుగుచెంది ఇంటినుండి వెడలగొట్టెను.

వశిష్ఠుడు సత్యవ్రతుని తీరును గమనించి నీవు సమస్త ప్రాణులకు నీ పైశాచిక రూపమే కనపడును. త్రిశంకుడను పేరు నీకు వచ్చును అనెను.

వశిష్ఠునిచే శాపము పొందిన సత్యవ్రతుడు ఒక మునిపుత్రుని ఉపదేశముతో గొప్ప తపమునకు పూనుకొనెను. భగవతి జగదంబను ధ్యానము చేయుచు జపించసాగెను. శాపవశమున సత్యవ్రతునిలో సకల పిశాచ లక్షణములు ప్రవేశించెను. సత్యవ్రతుడు ఒకనాడు నవాక్షర మంత్రమును జపముచేసి బ్రాహ్మణుల వద్దకు వెళ్ళి మీరు నా యజ్ఞము నందు ఋత్విజులగుటకు దయచేసి అంగీకరింపుడు. నా పేరు సత్యవ్రతుడు. నేనొక రాజకుమారుడను అని చెప్పగా బ్రాహ్మణులు నాయనా! నీలో ఇప్పుడు పూర్తిగా పైశాచికత్వము వచ్చి చేరినది. నీవు యజ్ఞము చేయజాలవు.

సత్యవ్రతుడు దుఃఖముతో వనములో నుండి నేనేమి చేయుదును. తండ్రి నన్ను పరిత్యజించెను. గురువుచేత నేను శాపగ్రస్తుడనైతిని. పిశాచవృత్తినన్నావరించినది అని విచారించి కట్టెలను ప్రోగుచేసి పెద్దచితిని ఏర్పాటు చేసి అందు ప్రవేశించుటకు ముందుగా స్నానము చేసి మరణించుటకు సంసిద్ధుడయ్యెను. జగదంబ ఆకాశమున ప్రత్యక్షమై దర్శనమొసగెను.

సత్యవ్రతా! నీవు శాంతించుము. ఇప్పుడు మీ తండ్రి వృద్ధుడైయున్నాడు. నీకు రాజ్యమునప్పగించి వనమునకు వెళ్ళదలచుకొన్నాడు. నీ తండ్రిగారి మంత్రి గణములు నిన్ను తీసుకొని పోవుటకు వచ్చుచున్నారు. నీవు రాజ్యమున కభిషిక్తుడవు కమ్ము. నీ తండ్రి బ్రహ్మలోకమునకు వెళ్ళిపోవుటకు సిద్ధముగా నున్నాడని చెప్పి అంతర్ధానమయ్యెను.

ఉ. అంతట నంతరిక్షమున నద్భుతతేజము పుట్టి యందులో
నెంతయు వింత దోపగ సమిద్ధమృగేంద్ర తురంగయానయై
కాంత విభూషణాంబరవికాసవిరాజితయై దిగంతవి
శ్రాంతయశోవిశాల యగు శాంకరి దర్శన మిచ్చి యిట్లనున్

తే.గీ. చెల్లునా నీకుc జిచ్చులో జీవమెడల
తండ్రి ముదుసలి సుతులc బ్రధముడ నీవు
నీకు రాజ్యంబొసంగి వనికిని బోవు
తపు లే దాగుమెల్లుండి తేడ వగుదు

తే.గీ. తనదు మంత్రులగూడి నీ తండ్రి వచ్చి
తపె నినుc దోడుకొని పోవు శాప భవ పి
శాచతయు బోవు సుమి నా ప్రసాదమునను
మాను మీ చింత యని దేవి మాయమాయె (మ.క.దా.శ్రీ)

అదే సమయమున నారదుడు అయోధ్యకు వచ్చి అరుణునితో సత్యవ్రతుడు వనములలో వున్న విషయము మరణించుటకు సిద్ధమైన సమయమున దేవి ప్రత్యక్షమైన విషయమును వివరించెను. వెంటనే అరుణుడు మంత్రులతో సత్యవ్రతుని పిలచుకొనివచ్చుటకు పురమాయించెను.

మంత్రులు సత్యవ్రతునకు నచ్చచెప్పి రాజ్యమునకు తీసికొని రాగానే అరుణుడు సత్యవ్రతుని హృదయమునకు హత్తుకొనెను. నాయనా! నీవు

బ్రహ్మముహూర్తమున లేచి భగవదంబను పూజింపవలెను. సభలకు వెళ్ళుట బ్రాహ్మణులను పూజించుట, మహర్షి గణములను సదా సత్కరించవలెను. న్యాయముగ ప్రాప్తించిన ధనమునే స్వీకరింపవలయును అనెను.

సత్యవ్రతుడు తండ్రి చెప్పిన మాటలు విని తండ్రీ! మీరు చెప్పినది పాటించి నేనట్లే చేయుదును అనగానే శుభ ముహూర్తమున తన కుమారుని శాస్త్రోక్తముగ రాజసింహాసనము నధిష్ఠింపచేసెను. అరుణుడు ధర్మపత్నితో వానప్రస్థమును స్వీకరించి తపము నాచరించి స్వర్గస్థులైరి. ఇంద్రుని సింహాసనము దగ్గరనే వారికి స్థానము లభించెను.

జనమేజయుడు వ్యాసునితో వశిష్ఠుడు సత్యవ్రతునకు ఎందుకు శాపమొసగెను? పైశాచికత్వము నుండి ఎట్లు ఉద్ధరింపబడెను. అతడెట్లు శాపముక్తుడైనాడో వివరింపుమని కోరెను.

వ్యాసుడు రాజా! సత్యవ్రతునియందు పైశాచిక లక్షణములన్నియు వచ్చిచేరెను. భగవతి జగదంబను భక్తితో ఆరాధింపసాగెను. దేవి ప్రసన్నురాలగుట తోడనే గొప్పమార్పువచ్చెను. పైశాచికత్వము పూర్తిగా నశించి తేజస్సు శరీరమందు స్పష్టమయ్యెను. వశిష్ఠుడు కూడా సత్యవంతునియెడల ప్రసన్నుడయ్యెను. తండ్రి మరణించగా రాజ్యమును పాలించి యజ్ఞముల ద్వారా సనాతన స్వరూపి జగదంబను పూజించెను. ఆ త్రిశంకుని (సత్యవ్రతుని) పుత్రుడు హరిశ్చంద్రుడు.

త్రిశంకు తన కుమారునకు రాజ్యము అప్పగించి వశిష్ఠుని వద్దకు వెళ్ళి "మహర్షీ! నేను సశరీరుడైన స్వర్గలోకమునందు నివసించు సౌకర్యమును పొందుటకు తగిన యజ్ఞము నాతో చేయించుము అని కోరగా వశిష్ఠుడు రాజా! మానవ దేహముతో స్వర్గము చేరుట దుర్లభము అనగా త్రిశంకు బ్రాహ్మణోత్తమా! నీవు అభిమానముతో నాతో యజ్ఞము

చేయించనిచో నేను ఇంకొకరిని పురోహితునిగ చేసుకొని యజ్ఞము చేసెదను అనెను.

త్రిశంకు మాటలను విని మునివరుడగు వశిష్ఠుడు వెంటనే అతనికి శాపమొసగెను. దుష్టుడా! ఇప్పుడే నీవు చండాలుడవు కమ్ము అని అనిన వెంటనే చందనము గల త్రిశంకు దేహము దుర్గంధముతో నిండి, దివ్య పీతాంబరము నల్లని రంగులోనికి మారి చండాలుడుగా రూపొందెను.

త్రిశంకు తన శరీరము చూసుకొని నేను నా కుమారుని వద్దకు వెళ్ళలేను. అడవిలో నివసించుట సముచితము, అనుభవము వలన ప్రారబ్ధకర్మ సమసిపోవును. భగవతి జగదంబను స్మరించెదను. అప్పుడు నా సంచితకర్మలు తప్పక నశించును అని తలచి గంగాతీరమునకు వెళ్ళెను.

తండ్రి శాప కారణమును తెలిసికొని హరిశ్చంద్రుని మనస్సులో గొప్ప అలజడి కలిగెను. మంత్రులను త్రిశంకు వద్దకు పంపి వెంటనే తీసుకొని రావలసిందిగా కోరెను. మంత్రులు త్రిశంకుతో రాజా! మీ కుమారుడు హరిశ్చంద్రుడు యువరాజుగా వున్నాడు. మీరు అతని వద్దకు వచ్చుటకు అంగీకరింపుడు అనిరి.

త్రిశంకు మంత్రులతో నా మాటగా హరిశ్చంద్రునికి తెలుపుడు. "నేను ఈ చండాల రూపమున రాను, హరిశ్చంద్రుని రాజ్యాధికారి చేసి గౌరవించుడు" అని పలుకగా మంత్రులు అయోధ్యకు తిరిగివచ్చి హరిశ్చంద్రుని రాజ్యమునకు అధికారిని చేసిరి. తన తండ్రి నిస్సహాయస్థితిని చూసి మిక్కిలి దుఃఖితుడయ్యెను.

త్రిశంకు జగదంబను ధ్యానించుచు కాలము గడుపసాగెను. విశ్వామిత్రుడు తపస్సును పూర్తిచేసుకొని భార్యను చేరుకొనెను. సులోచనీ! దేశమునందు కరువు వచ్చియుండెను. నీ బాలకులను ఎట్లు పోషించితివి అని అడుగగా, మునీంద్రా! కొన్ని నెలలు నీవార ధాన్యముతో గడచిపోయెను.

భూమియందు ఉత్పన్నమగు కంద మూలములు కూడా లుప్తమయ్యెను. బాలకులు నిరంతరము ఏడ్చుచుండిరి. ధనవంతునకొక కుమారుని ఇచ్చెదను అని తలచి ఆ వచ్చిన ధనముతో మిగిలినవారిని పోషించుకొందము అని ముందుకెళ్ళగా రాజర్షియగు సత్యవ్రతుడు యీ బాలకుడెందుకు ఏడ్చుచున్నాడు అని అడుగగా నేను అమ్మడానికి అని బదులిచ్చాను. నీవు యీ కుమారుని తీసికొనివెళ్ళుము. ఆ తరువాత అతడే పిల్లలను పోషించును అనెను. మీరు తపఃప్రభావమున మహారాజును రక్షించుట పరమ కర్తవ్యమగును. విశ్వామిత్రుడు తన భార్యతో నీకు ఉపకారమొనరించిన రాజును తప్పక శాపముక్తిని చేసెదననెను.

విశ్వామిత్రుడు త్రిశంకు ఉన్న స్థలమునకు వెళ్ళెను. అప్పుడా చండాలుడు ముని కాళ్ళమీద పడి వేడుకొనగా కౌశికుడు త్రిశంకుతో నీవు ముని వలన శపింపబడితిని. నేను నీ కోరికను తీర్చెదను. ఏమి జరిగినదో తెలుపుడని కోరెను.

మునీంద్రా! నేను వశిష్ఠునితో నాకు మానవ శరీరముతో స్వర్గమునకు వెళ్ళుటకు తగిన యజ్ఞమును చేయించుమని కోరితిని. వశిష్ఠుడు కోపముతో సాధ్యము కాదనెను. వెంటనే ఇంకెవరినైన ఆచార్యునిగా చేసుకొని ఉత్తమ యజ్ఞమును చేయుదునని పలికితిని. వెంటనే నన్ను చండాలుడ వగుదువని శపించెను అని చెప్పెను.

గాధినందునుడగు విశ్వామిత్రుడు తన తపఃప్రభావముచే నిన్ను (చండాలుని) స్వర్గమునకు పంపుతున్నాను. ఇంద్రలోకమునకు వెళ్ళుము అనెను. అదే క్షణమున త్రిశంకు పక్షివలె వేగముగ పైకి ఎగిరెను. దేవలోకము వైపుకు వచ్చుచున్న చండాలుని చూచి దేవతలు దేవేంద్రునకు తెలిపిరి.

దేవేంద్రుడు నీవు భూమిమీదకు వెళ్ళిపొమ్మని పలుకగానే త్రిశంకు స్వర్గము నుండి క్రింద పడసాగెను. మునీంద్రా! నేను స్వర్గము నుండి

పడిపోవుచున్నానని గట్టిగా అరచెను. విశ్వామిత్రుడు నిలువుము, నిలువుము అని నిలువరించెను. తన తపః ప్రభావముచే మార్గమధ్యమున ఆగిపోయెను.

అతనికోసం రెండవ స్వర్గము సృష్టించుటకు ప్రయత్నము చేస్తుండగా శచీపతి విశ్వామిత్రునితో మీరు చేస్తున్న రెండవ స్వర్గము సృష్టివలన మీకేమి ఫలము లభించును. మీ తపోబలమును నేనెరుగుదును. ఇప్పుడు త్రిశంకుని దివ్యదేహధారిని చేసెదను అని త్రిశంకునితో కూడా ఇంద్రుడు స్వర్గమును చేరుకొనెను. విశ్వామిత్రుడు పరమానందము చెందెను.

హరిశ్చంద్రుడు తన తండ్రియైన సత్యవ్రతుడు (త్రిశంకు) స్వర్గమునకు వెళ్ళిపోయెనని విశ్వామిత్రుడే ఉపకారమొనరించెనని తెలిసికొని సంతోషపడెను. అయిననూ తన భార్య గర్భవతి కాలేకపోయెనని మిగుల సంతాపమునకు లోనయ్యెను.

వశిష్ఠుని ఆశ్రమమునకు వెళ్ళి తన దుఃఖమునంతయు అతనికి చెప్పి వినిపించెను. వశిష్ఠుడు హరిశ్చంద్రునితో నీవు సంతానమును పొందవలయునన్న వరుణుని ఉపాసింపుము. వరుణుడే నీ కార్యమును సిద్ధించును అనెను. హరిశ్చంద్రుడు గంగానదీతీరమున వరుణదేవుని ధ్యానించుచు కఠినమైన తపము నారంభించెను. వరుణదేవుడు అతని తపమునకు మెచ్చి ధర్మజ్ఞా వరమడుగుము అనగా విశ్వామిత్రుడు సంతానవరమొసగెను. పుత్రుని ప్రసాదించెను.

ఒకనాడు హరిశ్చంద్రుడు అడవికి వెళ్ళగా ఒక స్త్రీ ఏడ్చుచుండుటను చూచెను. అప్పుడతడు నీకు దుఃఖమును కలిగించినవారెవరు, వానిని వధించెదను అనెను. ఆ స్త్రీ రాజా! మునివరుడగు విశ్వామిత్రుడే. నా దుఃఖమునకు కారకుడు అని చెప్పగా ఆమెను ఊరడించి విశ్వామిత్రుని చెంతకేగి మీరింత కఠినమైన తపస్సు ఎందుకు చేయుచున్నారు. విరమింపుడు అని చెప్పి తదనంతరం తన గృహమునకు వెళ్ళెను.

హరిశ్చంద్రుడు మనలను ఈ విధముగా చేసెను గదాయని విశ్వామిత్రుడు ప్రతీకారము కొరకు యోచింపసాగెను. భయంకరుడగు దానవుని హరిశ్చంద్రుని వద్దకు పంపెను. ఆ దానవుడు పంది రూపములో హరిశ్చంద్రుని వనమును ప్రవేశించి పాడు చేయుటను చూసి తోటమాలులు తన రాజునకు తెలిపిరి.

హరిశ్చంద్రుడే స్వయముగా వచ్చి పంది చేస్తున్న వినాశనమును చూసి దాని మీద బాణము వదిలెను. కాని కనపడి కనపడకరాజును నిర్జన ప్రదేశమునకు తీసుకొని వెళ్ళి పూర్తిగా మాయమయ్యెను. ఆ అడవి నుండి వచ్చుటకు దారి తెలియక డస్సిపోయి ఒక నది కనిపించగా అందు నీరు త్రాగెను.

అపుడచట విశ్వామిత్రుడు వృద్ధ బ్రాహ్మణుడుగా అతని ఎదుటకు వచ్చెను. రాజా! నిర్జన ప్రదేశమునకు మీరెందుకు వచ్చారని విశ్వామిత్రుడు అడుగగా నేను ఒక సూకరమును వెంబడిస్తూ వచ్చి నగరమునకు వెళ్ళు మార్గము తప్పిపోయాను. నేను అయోధ్యకు రాజును. నా పేరు హరిశ్చంద్రుడు. నేనిపుడు రాజసూయ యజ్ఞము చేయుచున్నాను. మీరు అయోధ్యానగరమునకు రండు. మీకు కావలసినంత ధనమును దానము చేయుదుననెను.

మోసముతో హరిశ్చంద్రుని వద్దకు వచ్చిన విశ్వామిత్రుడు వెంటనే ఒక యువకుని ఒక కన్యను చూపి వీరిద్దరికి వివాహము చేయవలయును. నీవీ పని చేసినచో పుణ్యమునకు పాత్రుడవగుదువనెను. హరిశ్చంద్రుడు ధనమునిచ్చెదనని ప్రతిజ్ఞ చేసెను. రాజ్యమునంతయూ దానము చేసెను. విశ్వామిత్రుడంతటితో ఆగక దక్షిణ కావలెనని కోరెను. రెండున్నర బారువులు దక్షిణగా కోరెను. హరిశ్చంద్రుడు అందుకు అంగీకరించెను.

పిదప సమస్తము పోగొట్టుకొని అంతఃపురమున ప్రవేశించెను. రాణి చింతాగ్రస్తుడై వచ్చిన రాజుతో కారణమడుగగా చెప్పలేకపోయెను.

ప్రాతఃకాలమున నిద్ర లేవగానే మునీంద్రుడు వచ్చియున్నాడని ద్వారపాలకులు తెలుపగా రాజు ఎదురువెళ్ళి ఆహ్వానించెను. ముని నీవు రాజ్యమును, సువర్ణమును దానమొనరించావు. ఇంకను ఇవ్వవలసింది అప్పగించి సత్యప్రతిజ్ఞను ఋజువు పరచుకొనుము అనెను.

రాజు స్వామీ! ఈ రాజ్యమంతయు మీకు స్వాధీనపరచుచున్నాను. సువర్ణము నివ్వజాలను. తప్పక మీకు ఇవ్వవలసిన ధనము ఇత్తును అని భార్యతో మనమిపుడు వనములకు వెళ్ళవలసిన సమయము వచ్చినది. రాజ్యమంతయు మునికి దానము ఇచ్చినట్లు చెప్పెను.

హరిశ్చంద్రుని భార్య మాధవి, పుత్రుడు రోహితుడు అతనిని వెంబడించిరి. ప్రజలు హాహాకారములతో రాజ్యము నుండి నిష్క్రమించిరి. మార్గమధ్యమున విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని అడ్డగించి బంగారమును ఇప్పుడే ఇచ్చి వెళ్ళుము అనగా సత్యవ్రతుడైన హరిశ్చంద్రుడు మునివరా! మీరు కోరిన సువర్ణమును మీకు తప్పక ఒసగెదను. దయతో వేచియుండుము. కొంత సమయమునివ్వుము అని కోరెను. నేను నా భార్యాపుత్రులను విక్రయించి మీ ఋణము తప్పక తీర్చెదను. ఈ కాశీపురమున వీరిని కొనువారిని అన్వేషించవలయును అని కాశీనగరమునకు వెళ్ళిపోయెను.

ఈ పురము త్రిశూలధారి, ఉమాదేవితో ప్రసన్నతను కలిగించుచున్నది. గంగలో స్నానము చేసి దేవతలకు తర్పణమిడిచెను. మనస్సునకు స్వస్థత కలిగెను. విశ్వామిత్రుడు ఎదురుపడి రాజా! నీ ప్రతిజ్ఞ జ్ఞాపకమున్నచో దక్షిణనొసగుటకు ఇప్పుడే ప్రయత్నించుము అనెను.

రాణి గద్గద స్వరముతో రాజా! మీరు సత్యధర్మమును పాటింపుము. అసత్యవచనుడైన పురుషుని అగ్ని హోత్రము, వేదాధ్యయనము, దానము మొదలగు క్రియలన్నియును వ్యర్థములగును.

శ్లో॥ త్వజ చిన్తాం మహారాజ స్వధర్మమనుపాలయ
ప్రేత వద్వర్ణనీయోహి సరస్సత్య బహిష్కృతః
నాతః పరతరం ధర్మం వదన్తి పురుషస్య చ
యాదృశం పురుష వ్యాఘ్ర స్వసత్యస్యాను పాలనమ్
అగ్ని హోత్రమధీతం చ దానా ధ్యాస్సకలాః క్రియాః
భవన్తి తస్యవైఫల్యం వాక్యం యస్యానృతం భవేత్
సత్యమత్యన్త ముదితం ధర్మశాస్త్రేషు ధీమతామ్
తారణాయనృతం తద్వత్పాత నాయాకృతాత్మనామ్. (7/20/8-32)

నూరు అశ్వమేధయజ్ఞములు, రాజసూయ యజ్ఞములు చేసిన తరువాత ఒకసారి అసత్యము పలుకుట వలన రాజునకు స్వర్గము నుండి పతనము కావలసి వచ్చును.

రాణి హరిశ్చంద్రునితో రాజా! నన్ను ఇతరులకు అమ్మి ధనమును స్వీకరింపుము అని అనగా ఆమె మాటలకు మూర్ఛితుడయ్యెను. రోహితుడు అమ్మా! నాకు ఆకలి తీర్చుటకు అన్నము పెట్టుము అని అడుగు సమయముననే విశ్వామిత్రుడు వచ్చెను. రాజా! వంద అశ్వమేధ యజ్ఞములు త్రాసునకొక వైపు సత్యమునొకవైపు ఉంచినచో అది సత్యము వైపునకే మొగ్గుజూపును అని చెప్పి వెళ్ళిపోయెను.

అప్పుడు ఒక బ్రాహ్మణుల గుంపును చూచి రాణి ధనము కొరకు వీరిని ప్రార్థించుట మంచిదనెను. అందుకు రాజు నేను క్షత్రియుడను ఎవ్వరిని ఏమియు అడగజాలను అనెను.

నిన్ను ఈ కాశీనగర వీధులలో ఎవరికైనా అమ్ముటకు ప్రయత్నింతును అని చెప్పి, "ఈమెను అమ్ముతున్నాను, దాసి పనులను చేయుటకు కావలసిన వారు కొనండి" అని అరచెను.

వృద్ధ బ్రాహ్మణుని వేషమున వచ్చి స్త్రీ ముప్పై రెండు లక్షణములు కలిగివుంటే ఒక కోటి ముద్రలిచ్చుకొనుటకు ఇష్టపడుదురు. ఆ తరువాత రోహితుని కూడా అదే బ్రాహ్మణుడు కొనగా వారిరువు వెళుతుండగా రాజు దుఃఖితుడయ్యెను. విశ్వామిత్రుడు అప్పుడే అక్కడకు వచ్చుట గమనించి ఆ ధనమంతయు ఆతనికప్పగించెను. విశ్వామిత్రుడు ఈ ధనము కలుషితము కాదుగదా! అనగా రాజు నా భార్యా, పుత్రుని అమ్మగా వచ్చిన ధనమిది అనెను. విశ్వామిత్రుడు ఈ ధనము బహుస్వల్పము. నీవింకను చెల్లించవలెను మళ్ళీ రాగలనని చెప్పి వెళ్ళిపోయెను.

ధర్మదేవత చండాలరూపమున హరిశ్చంద్రుని ముందు నిలిచెను. హరిశ్చంద్రునితో నిన్ను దాసునిగ నియమించుకొంటాను. ఎంత మూల్యము చెల్లించవలయునో తెలుపమనగా అయ్యా! నీవెవరవు నేనేపని చేయవలయును అనగా "నేనొక చండాలుడను – నీవు కాటికాపరిగా వుండుటకు సిద్ధమేనా? అని అడిగెను.

బంగారము, మణులు, ముత్యములు చెల్లించగా వాటిని తీసి విశ్వామిత్రునకొసగి ఋణ విముక్తుడయ్యెను. కాశీకి దక్షిణభాగమున విశాలమైన స్మశాన వాటిక కలదు. శవములు దహనము చేయబడుచుండెను. హరిశ్చంద్రుడు చితులనేర్పాటు చేయుటలో మునిగి ఆకలి దప్పులు మరచిపోయెను. పండ్రెండు నెలలు గడచిపోయెను.

రోహితుడు ఒకనాడు కుశలను తెచ్చునెపముతో అడవికి వెళ్ళి పాము కాటుకు గురియయ్యెను. స్నేహితులా విషయమును అతని తల్లికి తెలిపిరి. రాణి ఏడ్చుచుండుటను చూచి సాయంకాలము లందు ఏడ్చుట అశుభ సూచకము వెళ్ళి పనులు చూడుమనెను.

అతను చెప్పిన పనులన్నియు పూర్తిచేయగా "నీవిపుడు నీ కుమారుని వద్దకు వెళ్ళవచ్చునని" బ్రాహ్మణుడు చెప్పెను. అర్ధరాత్రి సమయమున

ఒంటరిగా కాశీనగరము బయటకు వచ్చి చూసి కుమారుని కనుగొని నాయనా! నీవు జన్మించినపుడు నిన్ను పరిశీలించి బ్రాహ్మణులు నీ అరచేతిలో చక్రము, మత్స్యము, ఛత్రము, శ్రీవత్సము, స్వస్తికము, ధ్వజము, కలశము, చామరము మొదలైన శుభలక్షణములెన్నియో కలవని చెప్పగా మురిసిపోతిమి. నీకు అర్ధాంతరముగ చావు మూడినది గదా అని విలపించెను.

ఈమె బాధను చూసి ప్రక్కనున్న వారు ఇదేదో పిశాచి లాగున్నది అని హరిశ్చంద్రుని వద్దకు లాక్కొని వెళ్ళిరి. ఈ స్త్రీని వధించుము అనగా హరిశ్చంద్రుడు స్త్రీవధ మహాపాతకము. నేను చేయలేననెను. చండాలుని మాట కాదనలేక చివరి కా పనికి పూనుకొనెను.

రాణి చండాలా! ఈ నగరమునకు వెలుపల నా కుమారుడు మరణించియున్నాడు. ఇక్కడికి తెచ్చి దహన సంస్కారములు పూర్తి చేసిన పిదప నీ ఇష్టమొచ్చినట్లు నన్ను వధించుము అని కోరగా హరిశ్చంద్రుడు ఆమెకు అనుమతి నొసగెను. రాణి మరణించిన తన కుమారుని తీసుకొని తిరిగివచ్చెను. ఇతడు నా కుమారుడు రోహితుడు అనగానే అయ్యో! ఈమె నా సతియే, ఈ బాలుడు నా కుమారుడే అని ఇరువురును విలపించసాగిరి. తను చండాలుడుగా మారిన విషయమునంతా రాణికి తెలిపెను.

ప్రియురాలా! మండుచున్న అగ్నిలో కుమారునితో పాటు నేను దుమికెదను. అందుకు రాణి కూడా తానును అగ్నికి ఆహుతి అగుటకు సిద్ధమయ్యెను. ఆ భగవతిని ధ్యానించిరి. ఆ సమయమున – బ్రహ్మదేవుడు, ధర్మరాజు, సాధ్యగణములు, మరుద్గణములు, విశ్వదేవులు, చారణులతో కూడిన లోకపాలురు, నాగులు, సిద్ధులు, అనేక దేవతలు వచ్చి ఎదుట నిలిచిరి.

విశ్వామిత్రుడు కూడా వచ్చి నిలిచెను. ఇంద్రుడు – హరిశ్చంద్రా! రాజా! నీవు భార్యాపుత్రునితో ఈ సనాతన విశ్వము నందు విజయమును

పొందితివి. రోహితుడును సజీవుడయ్యెను. దివ్యమాలలతో వస్త్రములతో సుశోభితుడయ్యెను. ఇంద్రుడు మహారాజా! నీవు భార్యాపుత్రులతో స్వర్గమునకు రమ్ము. కర్మఫలముగా ఉత్తమ గతికి అర్హుడవైతివనెను.

ధర్మరాజు నేను మాయతో కూడిన చండాలునిగా రూపొందితిని అని అనగా హరిశ్చంద్రుడు నేను నా ప్రజలను వదలిపెట్టి స్వర్గమునకు రాలేను. ఆ ప్రజల కృప వలననే రాజ్యభోగము, యజ్ఞముల నిర్వహణ, దానములు చేయగలిగాను అనగా ఇంద్రుడు "అట్లే అగుగాక"యని చెప్పి మీరందరును ఇప్పుడు స్వర్గమునకు బయలుదేరుమని ప్రజలకు చెప్పెను. విమానమును అధిరోహించి స్వర్గమునకు వెళ్ళిరి.

స్వర్గమునభిలషించువారు ఈ కథ శ్రవణము చేసినచో తప్పక ఫలితమొందగలరు. పుత్రార్థులు, రాజ్యము నభిలషించువారు లబ్ధిపొందుదురని ఆర్యోక్తి.

6. శతాక్షి చరిత్ర

వ్యాసుడు జనమేజయునితో రాజా! ప్రాచీనకాలమున దుర్గముడను పేరుగల మహాదైత్యుడొకడుండెను. హిరణ్యాక్షుని వంశమున అతడు జన్మించెను. దేవతల యొక్క బలము వేదము. వేదములను నశింపచేయవలెనని బ్రహ్మను ధ్యానించుచూ వెయ్యి సంవత్సరములు కఠిన తపస్సు చేసెను.

బ్రహ్మ ప్రసన్నుడై దుర్గముని దగ్గరకు వచ్చెను. నీకు శుభము చేకూర్చుటకు వచ్చాను. వరమడుగుము కోరిక తీర్చెదను అనెను. సురేశ్వరా! సకల వేదములను నాకొసగుడు, దేవతలను ఓడించు బలమునిమ్ము అనగా బ్రహ్మ అట్లే అగుగాక అని పలికి సత్యలోకమునకు వెళ్ళిపోయెను.

బ్రాహ్మణులు వేదములు మరచిపోయిరి. వైదిక కర్మలు నశించెను. దేవతలకు వృద్ధాప్యము లేదు అయినా ముసలితనము వచ్చినది. ఆ

దుర్గముడు అమరావతి నగరమును చుట్టుముట్టెను. దేవతలందరు అసమర్థులై పారిపోయిరి.

దేవతలు భగవతి జగదంబను ధ్యానము చేయుచు కాలము గడపసాగిరి. యజ్ఞములు జరుగుట ఆగిపోయి అనావృష్టి వలన ప్రజలు, ఆవులు, ప్రాణములను వదలెను. బ్రాహ్మణులు భగవతి జగదంబను ఉపాసించుచు హిమాలయ పర్వతముల కేగిరి.

దండకం

శ్రీదేవి నీవే సతీదేవివీవే మహాకాళివీవే సురారాధ్యవీవే సదీశానివీవే

పరాశక్తివీవే నిరాలంబనీవే జగద్ధాత్రివీవే జగద్ధర్థివీవే జగత్కర్తివీవే సదాధారవీవే సమస్తంబునీవే మహోదారమాయావిధానంబునన్ లోకములుల్మించి యాడించుచున్నావు బ్రహ్మాదులున్నిన్ను బూర్ణంబుగా సంస్తవింపంజడుల్ మేము నీచాతినీచ స్వభావంబులం గూడి నిన్నెన్నగా నేర్తుమే కన్నతల్లీ దయంజూడవే యిన్నినాళ్ళింత క్షామంబులోఁ జిక్కి యన్నంబు శాకంబు లేకున్నఁ బండ్లే సమూలంబులైనం దినం జిక్కి యెందాక జీవంబులన్నిల్పి కోశక్యమమ్మా జలంబైనఁ ద్రావంగ జూపట్టదెచ్చోటనేని న్నిరుత్సాహ చిత్తంబులం దత్తరం బందుచుం బొత్తిగా మాంసము లెత్తురుల్ పోయి శల్యంబులం గట్టెలంబోలె మేనుల్పసల్ పాసె నేరీతి నీయాపదం బంపికోశక్తి మాకబ్బు నబబ్బు యిబ్బాధలం దీర్పవే యిస్సిరో యిస్సిరో తల్లి మేలైన కారుణ్యము న్వెల్లికొల్పంగదే కుప్పలుం దెప్పలుం దేల వర్షంబు హర్షంబు గూర్ప న్మహోధారలం బూని ధారా ధరంబుల్ ధరాదేవిపై జోరునంగారగా జేయవే యంబ నీకు న్నమస్కారమమ్మా!

ఇట్లు బ్రాహ్మణులు ప్రార్థింపగా దర్శన భాగ్యమొసగెను.

సీ. కురువిందములబిళ్ళ కొప్పుపై సవరించి రవలదుద్దులు చెవికవను బూని
గోమేధికవు బులాకీ ముక్కునందిడి పుష్యరాగముల జంపులు ధరించి
మైదూర్యముల బాజుబందుల ననుసరించి ముత్యాలపేరు రొమ్మున ఘటించి
పగడాల చేకట్టు దగ చేతులను దాల్చి నీలాల పైఠణీ నెమ్మిదొడిగి

తే.గీ. గరుడపచ్చల మొలనూలు గట్టి చేసి
చెలగి మేలిమి జలతారుచీరె గట్టి
లెక్కలేనన్ని కనులతోఁ జక్కనైన
యంబ భూదేవతలకుఁ బ్రత్యక్షమయ్యె (మ.క.దా.శ్రీ)

దేవతలందరు భువనేశ్వరీ! నీకు నమస్కారము, వేలకొలది నేత్రములతో నీవిపుడు శతాక్షి అనుపేరుతో విరాజిల్లుము. అంబికా! దుర్గముడను రాక్షసుని నుండి వేదములను తీసికొనుము.

భగవతి బ్రాహ్మణుల దేవతల మాటలు విని ఫలములను రుచికరములైన అన్నములను ఇచ్చెను. పశువులకు తృణములను వారికొసగెను. అందుకే భగవతికి 'శాకంభరి' అను నామము వచ్చెను.

ఇదంతయు తెలిసిన దైత్యుడు దేవతలను చుట్టుముట్టి భగవతి ఎదుటకు వచ్చెను. దేవికిని – దైత్యునకు యుద్ధము ప్రారంభమయ్యెను. దేవి విగ్రహము నుండి అనేక ఉగ్రశక్తులుద్భవించెను. కాళిక, తారిణి బాలా, త్రిపురా, భైరవీ, రమా, బగలా, మాతంగీ, త్రిపురసుందరీ, కామాక్షి, దేవి తులజి, జంభినీ, మోహినీ, ఛిన్నమస్తా, గుహ్యకాలీ, దశసహస్ర బాహుక మొదలగు పేర్లతో ముప్పది రెండు శక్తులు ఉద్భవించెను.

జగదంబ ప్రయోగించిన ఐదు బాణములు దుర్గముని వక్షఃస్థలమున చొచ్చుకొనిపోయెను. పరమేశ్వరి ఎదుట ప్రాణములను కోల్పోయి ధరాశాయి అయ్యెను. అతని శరీరము నుండి వెలువడిన తేజము భగవతి యందు ప్రవేశించెను.

బ్రహ్మమొదలగు సమస్త దేవతలు విష్ణుభగవానుని, శంకరుని ముందుంచుకొని భక్తిపూర్వకముగా బొంగురుపోయిన గొంతుకతో భగవతి జగదంబను స్తుతింపసాగిరి. శాకంభరి, శతలోచని నీకు నమస్కారములు. అప్పుడు దేవి సంతోషముతో ఆ దైత్యుని నుండి వేదములను లాగికొని వచ్చి దేవతలకు సమర్పించెను.

ఈ వేదవాణి నా శరీరము నుండి వెలువడినది. దీనిని సమగ్రముగ రక్షింపవలెను. నా చేతిలో దుర్గముడను పేరుగల దైత్యుడు వధింపబడెను. అందువలన 'దుర్గ'యని నాకు పేరు వచ్చెను. జగదంబ మాటలను విని ఆనందించగా వారి ఎదుటనే అంతర్ధానమైనది. ఈ అధ్యాయమును శ్రవణము చేసినచో, వ్రాసినచో అతనికి సకల కోరికలు సిద్ధించును. చివరకు దేవి యొక్క పరమధామమునకు చేరుకొందురు.

వేదరూప క్షీరసాగరమును మధించి ఆ రత్నములను మేము పొందితిమి. ఇతరులెవరు పంచబ్రహ్మ వేదిక మీద కూర్చొనుటకు సిద్ధముగ లేకుండిరి.

మహాదేవి దాని మీద ఆసీనురాలగుటకు అంగీకరించెను. ఈ అయిదుగురు దేవతలకు అతీతమైన వస్తువే వేదములందు అవ్యాకృతము అని చెప్పబడెను. ఆ ఆవ్యాకృతి శక్తి పేరే భగవతి భువనేశ్వరి. ఏదో ఒక నెపముతో నిదురించుచు, కూర్చొనుచు, నడచుచున్న సమయమునైనను భగవతిని నిరంతరము కీర్తించవలెను అనెను.

జనమేజయుడు వ్యాసునితో మణిద్వీప నివాసినియగు భగవతి జగదంబ గౌరి, లక్ష్మి, సరస్వతులను ప్రకటించెను, గౌరి హిమాలయమున దక్షప్రజాపతికి పుత్రికగా జన్మించెను. మహాలక్ష్మి క్షీరసాగరము నందు ఉద్భవించినదని చెప్పదురు. మూలప్రకృతియగు జగదంబచే ఆవిర్భవింపబడిన ఈ దేవీమణులు ఇతరుల పుత్రికలెట్లైరి. వివరింపుమని అడిగెను.

రాజా! భగవతి జగదంబ ముగ్గురు దేవిమణులను, ముగ్గురు దేవతల చెంత నుండు ఏర్పాటు చేసెను. ఆ దేవతలు సృష్టికార్యము నందు నిరతులైరి. హాలాహలమను పేరుతో ప్రసిద్ధిచెందిన అనేక దైత్యులు పుట్టిరి. బ్రహ్మతో వరములను పొంది కైలాసమును, వైకుంఠమును చుట్టుముట్టిరి. శంకరుడు, విష్ణుదేవుడు దానవులను సంహరించుట యందు సఫలమొందిరి. కాని శక్తిని అవహేళన చేయసాగిరి.

మహాగౌరి, మహాలక్ష్మికి ఇరువురికి నవ్వువచ్చెను. గౌరి, మహాలక్ష్మి ఇరువురు శంకరుని, విష్ణువు నుండి వేరయి అంతర్ధానమొందిరి. అప్పుడు బ్రహ్మ శంకరుని, విష్ణువు కార్యములను తనే నిర్వహించుచుండెను. బ్రహ్మ తన పుత్రులగు మనువును, సనకాదులను పిలిపించెను. నేనిపుడు అనేక పనులతో సతమతమగుచున్నాను.

భగవతి శక్తియగు పరమేశ్వరి తొలగిపోవుట వలన శివుడు, విష్ణువు, శక్తిహీనులైరి. శివకేశవులకు తమ శక్తి లభించునట్లు ప్రయత్నించవలెనని కోరెను. అప్పుడు దక్షుడు మొదలగు పుత్రులందరును భగవతి జగదంబను ఆరాధించుట జరిగెను.

మునిగణములు భగవతి భువనేశ్వరి యొక్క మాయా బీజమంత్రమును జపించసాగిరి. అప్పుడా దేవి వారి ఎదుట సాక్షాత్కరించెను. ఆమె పాశము, అంకుశము, వర, అభయముద్రలను ధరించియుండెను.

మునీంద్రులు దేవీ! నీవు విశ్వరూపవు, వైశ్వానర రూపవు, తేజోరూపవు, సూత్రరూపవు, ప్రాజ్ఞ, అవ్యకృత, ప్రత్యక్, పరబ్రహ్మల రూపములను ధరించు దేవీ! నీకు ప్రణామములు అనగా దేవి ప్రసన్నురాలై ఇట్లు పలికెను. మునిగణములారా? మీకేమి వరము కావలయునో అడుగమనెను.

దేవీ! శంకర భగవానుడు, విష్ణుదేవుడు తమతమ శక్తులను పొందవలెను అని కోరిరి. దక్షుడు అంబా! నా కులము నందు నీవు

అవతరించవలెను అని కోరగా గౌరి, లక్ష్మి అను పేర్లు గల శక్తిరూపులైన దేవీమణులు నీ ఇంటియందు క్షీరసాగరుని దేహమున జన్మించెదరు. నీవు సదా సంలగ్నుడవై యుండుమనెను. జగదంబ అదృశ్యమయ్యెను.

శివకేశవులకు తమ కార్యములనొనరించు శక్తియు ప్రాప్తించెను. భగవతి జగదంబ యొక్క జ్యోతి దక్షుని ఇంట అవతరించెను. జగత్తంతయు మంగళమయ్యెను. భగవతి సత్యము యొక్క అంశ కనుక ఆ దేవికి 'సతి' అని నామకరణము గావించిరి. ఆమె శివునిపత్ని అయ్యెను. దైవము యొక్క ప్రభావముతో సతీదేవి దక్షుని యజ్ఞమునందు మండుచున్న అగ్నిలో తన శరీరమును దహింపచేసెను.

జనమేజయుడు సతీదేవి అగ్నియందెట్లు భస్మమయ్యెను? అని కోరగా రాజా! దుర్వాసుడు జంబూ నదీతీరమున విరాజ మానురాలైన భగవతి జగదంబ దగ్గరకు వెళ్ళెను. దేవేశ్వరి కంఠసీమ యందున్న పుష్పమాలను ప్రసాదరూపమున ఆ మునీంద్రునకొసగెను.

మునీంద్రుడు సతీదేవి తండ్రి దక్షాప్రజాపతి విరాజమానుడై యున్న చోటికి చేరుకొనెను. దక్షుడు మునీంద్రునితో ఈ దివ్యమాల ఎవరిది? మీరెట్లు పొందితిరి అని అడుగగా జగదంబ అనూహ్యమైన ప్రసాదమని తెలిపెను.

మునీంద్రునితో దక్షుడు ఈ మాలను దయచేసి నాకిమ్ము అని కోరెను. దక్షుడు జగదంబ ఉపాసకుడే గదా! అని పుష్పహారమును దక్షునకిచ్చెను. దక్షుడు ఆ మాలను శయ్యమీద ఉంచి స్త్రీ సమాగము చేసెను. ఈ పాపకర్మవలన శంకరునిపై, సతీదేవిపై ద్వేషము కలిగెను. సతీదేవి సతీధర్మమును పాటించుచు తన శరీరమును యోగాగ్నిలో భస్మము చేసుకొనెను.

శంకరుని కోపాగ్నితో వీరభద్రుడు ప్రకటితుడై భద్రకాళిని వెంటనిడుకొని మూడు లోకములను నాశనమొనర్చుటకు సంసిద్ధుడయ్యెను.

బ్రహ్మాది దేవతలు శంకరుని శరణుజొచ్చిరి. దక్షుడు వధింపబడెను. మేక తలను జోడించి దక్షుని పునరుజ్జీవితుని చేయుటకు కూడా ఏర్పాటు చేసెను.

మహేశ్వరుడు సతి కాలిపోవుచుండగ ఆ స్వామి చూచెను. హా! సతీ!! అని మాటిమాటికీ శివుడామె శరీరమును తన భుజముమీద వేసుకొని దేశదేశము తిరుగాడసాగెను.

విష్ణు భగవానుడు వెంటనే సతీదేవి యొక్క అంగములు ఎచట పడివుండెనో వాటినన్నింటిని అన్వేషించి తన బాణములతో వాటిని ఖండించెను. ఇవి పడిన స్థలములు (సతి యొక్క అంగములు) జగదంబ నిరంతరము నివాసముండును. శంకరుడు, జప, ధ్యాన సమాధులందు సంలగ్నుడై కాలము గడిపెను.

7. సిద్ధపీఠములు

జనమేజయుడు వ్యాసునితో సిద్ధపీఠము ఏయే స్థలములందున్నవో తెలుపుమని కోరెను. వ్యాసుడు రాజా! మానవులు ముక్తులగుటకు 108 స్థలములందు దేవీనామములను తెలిపెదను వినుము. గౌరి ముఖము పడినచోటు వారణాశి, దేవిపేరు విశాలాక్షి. నైమిశారణ్యమునను లింగధారిణియను నామముతో ఖ్యాతి వహించెను. ప్రయాగయందు దేవిని లలితయనియు, గంధమాదన పర్వతమున కామకి యను పేరుతో, మానసమున కుమద, దక్షిణమున విశ్వకామ, ఉత్తరమున విశ్వకామ ప్రపూరణి, గోమంతమున గోమతి, మందరాచలమున కామచారిణి , చైత్రరథము నందు మదోత్కట, హస్తినాపురమున జయంతి, కన్యాకుబ్జమున గౌరి, మలయాచలమున రంభ, ఏకామ్ర పీఠమున కీర్తిమతి, విశ్వపీఠమున సన్మార్గదాయిని, హిమవాన్ పీఠమున మందా, గోకర్ణ పీఠము నందు భద్రకర్ణిక, స్థానేశ్వరి పీఠమున భవాని, బిల్వక పీఠమున బిల్వపుత్రిక, శ్రీశైలమున భ్రమరాంబ, భద్రేశ్వరమున భద్రా, వరాహపీఠమునందు జయ,

కమలాలయపీఠమునందు కపిల, రుద్రకోటియందు రుద్రాణి, కాలింజరమున కాళి, సాలగ్రామపీఠమునందు మహాదేవి, శివలింగమునందు జలప్రియ, మహాలింగమునందు కపలి, మాకోటమందు ముకుటేశ్వరి, మాయాపురమందు కుమారి, సంతాన పీఠముమందు లలితాంబిక, గయయందు మంగళ, పురుషోత్తమ పీఠమునందు విమల, సహస్రాక్షమందు ఉత్పలాక్షి, హిరణ్యాక్షమందు మహోత్పల, విశాఖయందు అమోఘాక్షి, పాండువర్ధన పీఠమునందు పాడల, సుపార్శ్వనము నందు నారాయణి, చిత్రకూటమునందు రుద్రసుందరీ, విపుల క్షేత్రమందు విపుల, మలయాచలము నందు భగవతి కళ్యాణి, సహ్యాద్రి పర్వతమునందు ఏకవీర, హరిశ్చంద్ర పీఠమునందు చంద్రిక, రామతీర్థమునందు రమణ, యమునా పీఠమునందు మృగావతి, కోటితీర్థమునందు కోటవి, మాధవవనము నందు ఉగంధ, గోదావరియందు త్రిసంధ్య, గంగాద్వారమునందు రతిప్రియ; శివకుండమునందు శుభానంద, దేవికాతటపీఠమునందు నందిని, ద్వారకయందు రుక్మిణి, బృందావనమునందు రాధ, మధురయందు దేవకి, పాతాళమునందు పరమేశ్వరి, చిత్రకూటమునందు సీత, వింధ్యాచలపర్వతమునందు వింధ్యవాసిని, కరవీరక్షేత్రమందు మహాలక్ష్మి, వినాయక క్షేత్రమందు ఉమ, వైద్యనామమందు ఆరోగ్య, మహాకాలపీఠమునందు మహేశ్వరి, ఉష్ణతీర్థమునందు అభయ, వింధ్య పర్వతమునందు నితంబ, మాండవ్య పీఠమునందు మాండవి, మహేశ్వరి పురమునందు స్వాహా, చగలండమునందు ప్రచండ, అమరకంటకమునందు చండిక, సోమేశ్వరపీఠమునందు వరారోహ, ప్రభాసక్షేత్రమునందు పుష్కరావతి, సరస్వతీ తీర్థమునందు దేవమాత, తటమనుపీఠమునందు పారావార, మహాలయమునందు మహాభాగ, పయోష్టియందు పింగళాఖ్య, కృతశౌరతీర్థమునందు సింహిక, కార్తీక క్షేత్రమునందు అతిశాంకరి, వర్తక తీర్థమునందు ఉత్పల, సుభద్రశోణసంగమములందు లోల, సిద్ధవనము నందు లక్ష్మి, భరతాశ్రమతీర్థమునందు అనంగ, జలంభర పర్వతమున

'విశ్వముఖి', కిష్కింధ పర్వతమందు తార, దేవదారువనము నందు పుష్టి, కాశ్మీరప్రదేశము నందు మేధ, హిమాచల పర్వతమునందు భీమ, విశ్వేశ్వర క్షేత్రము నందు తుష్టి, కమలలోచనతీర్థము నందు శుద్ధి, కాయవరోహణ తీర్థము నందు ధృతి, చంద్రభాగ నదీతీరమున కళ, అచ్ఛోద నామక క్షేత్రమున శివధారిణి, వేదానదీ తీరమున అమృత, బదరీవనము నందు ఊర్వశి, ఉత్తరకురు ప్రదేశమందు ఓషధి, కుశద్వీపమునందు కుశోదక, హేమకూట పర్వతమునందు మన్మథ, కుముదవనమునందు సత్యవాదిని, అశ్వత్థ తీర్థమునందు వందనీయ, వైశ్రవణాలయక్షేత్రమునందు నిధి, వేదవదన తీర్థమందు గాయత్రి, శివుని సాన్నిధ్యమున పార్వతి, దేవలోకమునందు ఇంద్రాణి, బ్రహ్మలోకమున సరస్వతి, సూర్యబింబమునందు ప్రభ, మాతృకలయందు వైష్ణవి, సతులయందు అరుంధతి, రామా మొదలగు అప్సరలయందు తిలోత్తమ, యనుపేరుతో దేవిశోభాయమానురాలగుచున్నది. సకలప్రాణులచిత్తములందు సదా విరాజమానురాలైన శక్తిని బ్రహ్మకళయందురు. ఈ నూట ఎనిమిది సిద్ధపీఠములను స్మరించి శ్రవణము చేసినవారు సమస్త పాపముల నుండి ముక్తుడగుదురు.

ఈ సకల తీర్థములందు పితరులకు తర్పణమిడి శ్రాద్ధము చేయవలెను. ప్రభూ! ఆ క్షేత్రమున నున్న చండాలుడు కూడా దేవీరూపమే! శ్రీదేవి యొక్క సిద్ధపీఠములకు ఆనందముతో యాత్ర చేయువారి పితరులు ఒక వెయ్యి కల్పములు వరకు శ్రేష్ఠమైన బ్రహ్మలోకమున నివసించెదరు. వారు ఆయువు తీరిపోగా దేవీలోకమున స్థానమును సంపాదించుకొందురు. అష్టోత్తర శతనామములను జపించి అనేకులు సిద్ధిని పొందిరి. అష్టోత్తర శతనామము స్వయముగ వ్రాసినచోట, దానిని పుస్తకముగ అంకితము చేసి ఉంచిన చోట, మహామారి మొదలగు ఉపద్రవములు భయములు చేరవు.

శ్రాద్ధ సమయమున అష్టోత్తర శతనామమును పఠించినచో శ్రాద్ధకర్మ యొక్క పితరులందరును తృప్తులై ఉత్తమగతులను పొందుదురు. సిద్ధపీఠములన్నియును జ్ఞానతీర్థములు, ముక్తిక్షేత్రములు, బుద్ధిమంతుడైన మానవుడు తప్పక సేవించవలెను. ఈ క్షేత్రములు సాక్షాత్తు భగవతి యొక్క రూపములు.

8. హిమవంతునింట దేవి ఆవిర్భావము

వ్యాసుడు జనమేజయరాజా! సతీదేవి యొక్క శరీరము యోగాగ్ని యందు భస్మమైనపుడు శివుడు దేశదేశాంతరములందు తిరుగుచుండెను. భగవతి జగదంబను ధ్యానించసాగెను. భగవతి సతీదేవి లేని కారణమున దేవతలు మానవులు విచ్చలవిడిగా సంచరించుచుండిరి. తారకుడను పేరుగల అసురుడు జన్మించెను. శంకరునికి ఔరస పుత్రుని వలననే నీకు మృత్యువు కలుగును అని మూడు లోకములకు బ్రహ్మ అతనికి వరమొసగెను.

శంకరునకు భార్యయే లేదు. ఇక కుమారుడెట్లు కలుగును. ఇట్లు చింతించుచూ దేవతలందరు వైకుంఠమున కేగిరి. శ్రీహరి వారిని చూచి భగవతి శివా మీ కోరికలను సఫలమొనరించు సాక్షాత్తు కల్పవృక్షము అని దేవతలకు చెప్పి వైకుంఠమునుండి బయలుదేరెను. దేవతలందరునూ ఆరాధనలను చేయసాగిరి. దేవీసూక్తమును పఠించుచుండిరి. నవావర్ణమంత్రమును జపించుచుండిరి.

కొందరు కృచ్ఛ్రచాంద్రాయణ వ్రతము, కొందరు అంతర్యాగ అభ్యాసపరులు, మరికొందరు న్యాసపరులైరి. జ్యోతి వారి యెదుట ప్రత్యక్షమయ్యెను. ఆ జ్యోతి నుండి వెలుగు, చల్లదనము, దివ్యకాంతి శోభిల్లుచుండెను. ఆ తేజస్సునందు చేతులుగాని, వ్రేళ్ళుగాని లేవు. ఏ రూపము స్పష్టముగా ద్యోతిత మగుట లేదు.

వడ్డాణము, కాలిఅందెలు, ఆమె శోభను అనేక విధముల పెంపొందింపచేయుచుండెను. ఆమె నోటిలో కర్పూరము యొక్క చిన్న

చిన్న ముక్కలతో నిండిన తాంబూలము నిండియుండెను. తలమీద రత్నములతో పొదిగిన మకుటముండెను. కేసరపు చుక్క లలాటమున అలరారుచుండెను. ఆ భగవతిని దేవతలు చక్కగా దర్శించి ఇలా ప్రార్థించిరి.

దేవీ! నీకు సర్వదా నమస్కారము. వేదముల ద్వారా నుతింపబడుదానవు. విష్ణుశక్తివి. స్కందమాతవు, సరస్వతి, దేవమాత అదితి దక్షకన్యపతి పాపనాశిని, కళ్యాణ దాయినియగు భగవతికి మేము ప్రణమిల్లుచున్నాము. 'తత్' పదమును ఉచ్చరించుటవలన 'త్వం' పదమును పదేపదే లక్ష్యముగా చేసికొనుచున్నాము. దేవీ! నీకు పదేపదే నమస్కారము.

శ్రీదేవి – దేవతలారా! మీరిటకు వచ్చుటకు కారణము తెలుపుడు. మీకు వరములొసగుట నా సహజ గుణము అనగా దేవతలు పరమేశ్వరీ! తారకుడను పేరుగల గొప్పదైత్యుడు రాత్రింబవళ్ళు మమ్ములను కష్టపెట్టు చున్నాడు. శంకరుని పుత్రుని ద్వారా అతడు మరణించునన్న విషయము బ్రహ్మ నిర్ణయించెను. ఇప్పుడాయన పత్ని లేకుండ కాలము గడుపుచున్నాడు. ఇదంతయు నీకు తెలియును గదా! అని చెప్పిరి.

భగవతి దేవతలారా! గౌరియను పేరుతో నాశక్తి ఖ్యాతి వహించినది. నేను హిమాలయుని ఇంట ప్రకటిత కాగలను. శివునితో కలుపుటకు ప్రయత్నము చేయుడు. మీ కార్యమునెరవేరగలదనెను. హిమాలయుడు కూడా భక్తితో నన్ను ఉపాసించవలెను. అతని ఇంట గౌరి జన్మించును. మీ అభీష్టము నెరవేరుగాక.

దేవి పలికిన మాటలు విని హిమవంతుడు జగదంబా! జడ పర్వతమగు నేనెక్కడ? భగవతి నీవెక్కడ? నేను నీ తండ్రి అగుట పూర్తి అసంభవము. నీ యొక్క అహేతుక కృపయే. జగత్తు నందు నా కీర్తిగా వ్యాపించును. జగదంబ హిమవంతుని పుత్రికయని ప్రజలు చెప్పుకొందురు.

తల్లీ! నీవు స్నేహవశమున దయతో నాకు గౌరికి తండ్రివగు సదవకాశమును ప్రసాదించితివి. నాకు భక్తియోగము, స్మృతి సంబంధమైన

జ్ఞానమును లభించుటకూడ నీ కృపయే. అనగా దేవి ఓ పర్వత రాజా! ఈ సృష్టికి పూర్వము నేనొక్కతనే ఉంటిని, నన్ను ఆత్మరూపమని, చిత్ అని, ఆనందమయ పరబ్రహ్మయని, జ్ఞానమని అందురు.

అగ్నియందు ప్రకాశము, చంద్రుని యందు వెన్నెల, రవి నుండి కిరణములు వెలువడునట్లు మాయ నా ఆత్మస్వరూపము నుండి ప్రకటితమగును. అది నా యొక్క శక్తి అంశమే. ఆ శక్తినే "తప"మని చెప్పుదురు. తమము, జడమని పలుకుచుందురు.

జ్ఞానమని, మాయయని, ప్రకృతియని, ప్రధానమని, శక్తియని, అజాయని, వివిధములుగ పలుకుదురు. మాయకు నిగమాగములందు అనేక నామములు గలవు. మాయ దృశ్యమగుట వలన జడమని, జ్ఞానమును నశింపచేయుటవలన అసత్తు, మిథ్యయని అందురు.

హిమవంతా! నా మాయాశక్తి సకల చరాచర జగత్తును సృష్టించెను. గిరీశా! నాయందే ఈ సకల సృష్టి కలిసియున్నది. నేను దేహాభిమానుడనైన ఈశ్వరుడను. లింగదేహాభిమానియగు విష్ణువును నేనే. స్థూల దేహాభిమానియగు బ్రహ్మను నేనే. విష్ణువు, రుద్రుడు, గౌరి, సరస్వతి, లక్ష్మి నా రూపములే. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రగణములు నేనే. పశువులు పక్షులు, చండాలురు, దొంగలు, బోయలు, క్రూరకర్ములు, సత్కర్మ చేయువారు మహాజనులు, స్త్రీలు, పురుషులు, నపుంసకులు ఇవన్నియును నేనే అనగా-

హిమవంతుడు దేవేశ్వరీ! నీవు నీ రూపమును చూపి దర్శన భాగ్యమునొసగుమని కోరెను. దేవతలు మేమందరమును దీనినే కోరుచున్నాము అని పలికిరి. అప్పుడు దేవి సర్వోత్తమ విరాట్ స్వరూపమును చూపగా దేవతలు కృతకృత్యులైరి.

దేవతలందరును మేమును మీ దర్శనముచే సంతోషించాము. ఆకాశము దేవి యొక్క మస్తకమునందును, సూర్యచంద్రులు నేత్రములైరి.

దిశలు చెవుల రూపముతో పరిణతమయ్యెను. వేదములు ఆమె వాక్కులుగ, వాయువులు ప్రాణములయ్యెను. విశ్వము హృదయముగ పృథివి తొడలుగనయ్యెను. పాతాళము నాభిగ జ్యోతిశ్చక్రము వక్షస్థలముగ, మహర్లోకము కంఠముగ, జనలోకము ముఖముగ నయ్యెను.

ఇంద్రుడు బాహువులైరి. అశ్వినీ కుమారులు నాసికయైరని బ్రహ్మ కనుబొమల స్థానమయ్యెను. జలములు దవడలయ్యెను. రసము నాలుక అయ్యెను. కోరలు యముడుగ శోభిల్లెను. ధర్మము వీపుగ, ప్రజాపతి లింగముగ, సముద్రము పొట్టగ రూపొందెను. మహాలోకములన్నియు జగదంబ యొక్క నడుము క్రింది రూపముగ విలసిల్లెను. భగవతి జగదంబ విరాట్ రూపమును శ్రేష్ములైన ఆ దేవతలందరును దర్శించిరి.

వేల మస్తకములు, వేల నేత్రములు, వేలాది వేల చరణములతో ఆ దేవి శోభాయమానమైయుండెను. పరాశక్తి యొక్క శిరస్సులు నేత్రములు మిగుల భయంకరముగనుండెను. దేవికి నలువైపుల వేదములు ప్రకాశమానములై యుండెను.

తల్లీ మేము నీ సేవకులము. నీ రూపమును చూచి భయపడితిమి. సూర్యుడు, చంద్రుడు, అగ్నులు, సకల ఔషధములు నీ నుండియే ఉద్భవించెను. ఏడు యజ్ఞములు, ఏడు లోకములు నీ వలననే ఉద్ధరించబడును. సౌమ్యరూపమును చూచి భయము తొలగిపోయెను.

శ్రీదేవి హిమవంతునితో రాజేంద్రా! బ్రహ్మవిద్యోపదేశము వినుము. జీవుడు నానా యోనుల యందు జన్మించుచు సుఖదుఃఖముల ననుభవించును. రకరకములైన శరీరములను ఆయన ధరించవలసివచ్చును. పురుషార్థ పూర్తిజీవన్ముక్తి దశ లభించుట అజ్ఞాననాశనము మీదనే ఆధారపడియుండును. జ్ఞానోపార్జనయందే లగ్నము చేయుట మానవుల కర్తవ్యమగును.

"కుర్వన్నేవేహ కర్మాణి" ఈ శ్రుతి వచనమున కనుగుణముగ సత్కర్మలు చేయుటమంచిదే. సకలవైదిక కర్మల పరాకాష్ఠ అంతఃకరణశుద్ధియే. తితీక్ష, వైరాగ్యము ఇవన్నియు చిత్తశుద్ధికి మిగుల అవసరము. ఈ అంతఃకరణ శుద్ధి జరిగిన తరువాత ఏమియును మిగిలియుండదు.

"తత్వమసి" ఈ వాక్యము జీవుడు, బ్రహ్మ ఒకటేనని బోధించును. "తత్" అను పదమునకు వాక్యార్థము 'నేనే'. "త్వం" అను పదమునకు వాచ్యార్థము 'జీవుడు', 'అసి' ఈ పదముతో "తత్", "త్వం" రెండింటి ఏకత్వమును తెలుపును.

రాజా! ఈ జగత్తు పూర్తిగా మిథ్య. స్థూలశరీరము నా ఆత్మయొక్క రెండవ రూపమే. ఆత్మయొక్క కారణ శరీరమును మూడవ శరీరమని చెప్పుదురు.

స్థూల, సూక్ష్మ కారణ శరీరములు. ఈ మూడు ఉపాధులు తొలగిపోగా పరమాత్మయే యుండును. ఈ ఆత్మ ఏకాలము నందు జన్మించదు, మరణించదు. జన్మలేనిది, నిత్యము, సనాతనము, పురాతనమైనది. శరీరము చంపబడినప్పటికీ ఆత్మ చంపబడదు. అణువు కంటె సూక్ష్మము. పరమేశ్వరుని కృపవలన మానవుడు దీని మహిమను తెలుసుకోగలడు.

ఆత్మ రథికుడు, శరీరము రథము, బుద్ధి సారథి, మనస్సు కళ్ళెము, ఇంద్రియములు గుఱ్ఱములు, బుద్ధిని సక్రమంగా వుంచి మనస్సను కళ్ళెమును జాగ్రత్తగా పట్టుకొనినచో విజయవంతముగ నా ధామమును చేరుకొనును.

రాజా! మొదట యోగమునభ్యసించవలెను. ధ్యానమునకు ముందే నా ఈ రూపమును ధారణ చేయవలెను. ప్రాణాపానవాయువులను సమానస్థితి యందుంచవలెను. నాసిక యొక్క అగ్రభాగము నుండి దృష్టి

చలింపరాదు. అప్పుడు నన్ను సాక్షాత్కరింప చేసికొనును, దర్శనభాగ్యముతో అజ్ఞానము తొలగిపోవును అని చెప్పెను.

9. దేవిచే జ్ఞానోపదేశము – యోగముల వర్ణన

హిమవంతుడు భగవతీ! నీవిపుడు జ్ఞానమును ప్రసాదించు సాంగోపాంగయోగమును చెప్పుమని అడుగగా దేవి గిరిరాజా! యోగము ఆకాశము నందు లేదు. పృథివి యందును లేదు. పాతాళమందును లేదు, కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములను ఆరును యోగమును విఘ్ను మొనరించునవి.

యోగమునందు యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధులను ఎనిమిది అంగములుండును. పద్మాసనము, స్వస్తికాసనము, భద్రాసనము, వజ్రాసనము, వీరాసనము, ఈ అయిదున్ను యోగాసనములు.

యోగి పదహారుసార్లు ప్రణవమును ఉచ్చరించవలెను. అంతసేపు ఎడమనాసిక ద్వారా గాలిని లోనికి పీల్చవలెను. దీనిని పూరకప్రాణాయామ మందురు. 24 సార్లు ప్రణవమును ఉచ్చరించుటకు పట్టునంతసేపు సుషుమ్నయందు ఆపి ఉంచవలెను. దీనిని 'కుంభక' ప్రాణాయామమని చెప్పుదురు. దాని తరువాత 32సార్లు ప్రణవమును ఉచ్చరించుటకు పట్టు సమయమున మెల్లమెల్లగ పింగళ–కుడి నాసిక ద్వారా ఆ గాలిని బయటకు వదలిపెట్టవలెను. దీనిని రేచకప్రాణాయామమందురు.

ప్రాణాయామము మొదట పండ్రెండు సార్లు, పదహారుసార్లు క్రమముగ ఎక్కువ చేయుచుండవలెను. ప్రాణాయామము అభ్యసించునపుడు శరీరమునందు చెమట వచ్చినచో 'అధమ'మని చెప్పబడును. కంపము ఉత్పన్నమైనపుడు 'మధ్యమ' మందురు. భూమిని త్యజించుట – పృథివి నుండి పైకి లేచిపోవుట ఉత్తమ ప్రాణాయామముగ అభివర్ణించెదరు.

ఇంద్రియములు విషయములనుండి తొలగించుట ప్రత్యాహారమని చెప్పబడును. ప్రాణవాయువును ధారణ అని చెప్పబడును. ఇష్టదైవమును ధ్యానము చేయట 'ధ్యానమ'ని అందురు. జీవాత్మ, పరమాత్మల ఐక్యతను 'సమాధి'యందురు. ఇదే 'అష్టాంగయోగ' మని చెప్పబడును.

'ఇడా' అను పేరుగల నాడి, 'పింగళ' యను నాడి 'సుషుమ్న' యను పేరు గల నాడి – వీటిపైన 'హ్రీం' అనే మాయబీజమున్నది. ఎరుపు రంగుగల 'కుండలి'ని కలదు. వ, శ, ష, స – ఈ నాలుగు అక్షరములను ధ్యానించవలెను. ఇది "మూలాధార చక్రము".

బ, భ, మ, య, ర, ల – ఈ ఆరు అక్షరములతో స్వాధిష్టానచక్రము స్వశబ్ధముతో పరమలింగరూపముగ తెలిసికొనవలెను. నాభి ప్రదేశమున "మణిపూరక చక్రము" గలదు. ఇది పది దళములతోయుండును. డ, ఢ, ణ, త, థ, ద, ధ, న, ప, ఫ – ఈ పది అక్షరములతో ఇది కూడియుండును.

దీనికిపైన సూర్యునితో సమాన తేజస్సు కలిగి "అనాహతచక్రము" గలదు. ఇది క, ఖ, గ, ఘు, ఙ, చ, ఛ, జ, ఝు, ఞ, ట, ఠ – ఈ పన్నెండు అక్షరములతో కూడియుండును. దీని మధ్యభాగమున "బాణలింగము" విరాజమైయున్నది. ఈ చక్రమునే మునిగణములు "అనాహత"మందురు.

దీనికిపైన "విశుద్ధ" మను పేరు గల పదహారు దళములతో కూడిన కమలము కలదు. ఇది అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋు, ౠ, ఌ ౡ (లు) (లూ), ఎ, ఐ, ఒ, ఓ, ఔ అం, అః అను పదహారు స్వరములతో సుసంపన్నమైయుండును. దీనిని "విశుద్ధాఖ్య" చక్రమని పిలిచెదరు. ఈ కమలమునే "ఆకాశ చక్రము" అని అందురు.

దీనికిపైన "ఆజ్ఞాచక్ర"ముండును. అవి హ, క్ష రెండు. "కైలాస" మను పేరుగల చక్రము గలదు. దానికిపైన "రోహిణీ" చక్రముగలదు. ఇంకను పైన "సహస్రార" చక్రము కలదు. ఇది బిందుమూల పరమాత్మ

స్థానము. దీనిని శూన్యచక్రమందురు. దీనియందు వెయ్యి దళములుండును. ఇది సంపూర్ణ సర్వశ్రేష్ఠయోగమార్గముగ చెప్పబడును.

ప్రాణాయామము ద్వారా లగ్నము చేసి, వాయువు ద్వారా కుండలిని శక్తిని ప్రోగుచేసి, ఆ కుండలిని శక్తిని "శూన్యచక్రము" సహస్రారము వరకు తీసికొని వెళ్ళవలెను. శంభునితో ఏకీభావమున ధ్యానించవలెను. అచటినుండి లక్కరసము వలె అమృతము ప్రవహించుచుండును. దానితో యోగసిద్ధిని కలిగించు మాయాశక్తిని తృప్తిపరచవలెను.

ఆ అమృతధార ద్వారా దేవతలకు తృప్తికలిగించవలెను. దీనివలన సాధకుడు వృద్ధాప్యము, మృత్యువు, మొదలగు దుఃఖములతో కూడిన భవబంధము నుండి ముక్తుడగును. నాయనా! వాయువును ధారణచేయు శ్రేష్టయోగము నీకు తెలిపితిని.

ఈ విధంగా చిత్తము నిలిపి దేవీ తన్మయుడైన వాడు జీవబ్రహ్మైక్య మొందును. చిత్తము ఒక్కొక్క అంగమును జయించుచు నా సమగ్రరూపము నందు మనస్సును నిలుపవలెను. ధ్యానించవలెను.

హిమాలయా! నా స్వరూపము నందు మనస్సులగ్నము అగునంతవరకు ఇష్టమంత్రమును జపించుచు యజ్ఞాదులను చేయుచుండవలెను. యోగము లేకుండ మంత్రము సిద్ధింపదు, మంత్రము లేకుండ యోగసిద్ధి కలుగదు.

చీకటి వ్యాపించినపుడు కుండ కనిపించదు. దీపమును రగిలించినచో కనబడుచుండును. ఆత్మకూడా మంత్రము ద్వారా దృష్టిగోచరమగుచుండును.

ఈ విద్యను అనుభవజ్ఞుడగు గురువు యొక్క ఉపదేశము చేతనే పొందవచ్చును. యోగసిద్ధిని పొందిన గురుదేవుని చెంత నుండి దీనిని అభ్యసించవలెను.

10. దేవిచే హిమవంతునకు బ్రహ్మస్వరూప వర్ణన

పర్వతరాజా! ఈ విధముగా యోగయుక్తుడవై బ్రహ్మస్వరూపిణిని, దేవినగు నన్ను సహజభక్తితో ఆసనము నందు చక్కగా కూర్చొని ధ్యానించవలెను. ఆ బ్రహ్మస్వరూపమును తెలిపెదను వినుము.

బ్రహ్మము స్వయంప్రకాశము, సర్వవ్యాపకము, సత్, అసత్ సమస్తమును ఆ తత్వమే. ప్రాణులు అందులోనే స్థితులై యున్నారు. అదియే "అక్షరబ్రహ్మ". ఆ అక్షర రూపమైన బ్రహ్మమునే గురిచేసి ఛేదించుము. ప్రణవము అనునది (ఓం) ధనస్సు జీవాత్మబాణము. దానికి లక్ష్యము బ్రహ్మగా చెప్పబడినది.

అంతఃకరణముతో సకల ప్రాణులతో కలిసిపోయిన ఒకే ఒక్క పరమాత్మను తెలిసికొనవలెను. ఈ ఆత్మయొక్క "ఓం"ను జపించుచు ధ్యానము చేయుము. ఆ జ్ఞానరూప అంధకారమునకు సర్వథా అతీతుడవు కమ్ము. సంసారమునకు ఆవలి ఒడ్డుననున్న బ్రహ్మను పొందుము.

పురుషుడు విజ్ఞానము ద్వారా ఆనందస్వరూపుడు, అమృతుడు, అవినాశియగు బ్రహ్మను దర్శింపనగును. స్వప్రకాశకమైన ఆ పరమధామమునందు, పరమాత్మయందు ఈ సూర్యుడు కాని, చంద్రుడు కాని, నక్షత్రములు కాని ప్రకాశింపవు. దేవి ప్రకాశితురాలైన తరువాత ఆ వెలుగుతో సకలము దేదీప్యమానమగును. ఆ ప్రకాశము చేతనే ఈ సకల జగత్తువెలుగొందును. ఆ బ్రహ్మయే ముందుండును. అతడే సకల విశ్వమునకు సర్వశ్రేష్ఠుడగు బ్రహ్మ.

నాతో ఎప్పుడును జ్ఞానియైనవాడు వేరుకాడు. అతనితో నేనెప్పుడును వేరుకాను. అతడు నేనే, నేను అతడినే. అట్టి జ్ఞాని ఉన్నచోటున నా దర్శనము కలుగ గలదు. కైలాసమునందుగాని, వైకుంఠము నందుగాని ఉండను. చిత్తస్వరూప బ్రహ్మమునందు లయమైనచో వాని కులమంతయు

పవిత్రమగును. అతని తల్లి కృతకృత్యురాలగును. అతనిని భరించు పృథివి పుణ్యవతియగును.

పర్వతశ్రేష్ఠా! నీవు బ్రహ్మజ్ఞానమును గూర్చి అడిగితివి. భక్తిసంపన్నుడు. శీలవంతుడగు జ్యేష్ఠపుత్రునికి ఇది చెప్పవలయును. ఇట్లే శిష్యునకు తెలుపవచ్చును. ఇతరులకెవ్వరికిని తెలుపరాదు. ఈ బ్రహ్మ విద్యోపదేశము చేయువాడు పరమేశ్వరుడే.

బ్రహ్మ జన్మదాతయగును. తండ్రినుండి ప్రాప్తించిన జీవనము నశించిపోవును. బ్రహ్మరూప జన్మ ఎప్పుడును అంతరించదు. బ్రహ్మ దాతయైన గురువు అందరికంటె శ్రేష్ఠమైనవాడు. శివుడు కోపగించినచో గురువు రక్షించును. గురువు రోషించినచో శివుడు కూడా రక్షింపలేడు.

అధర్వణుడను ముని ఇంద్రునితో బ్రహ్మవిద్యను యాచించెను. నేను విద్య నొసగెదను నితరులకు ఉపదేశింపరాదు. అట్లు చేసినచో నీ శిరమును ఖండించెదను అని పలికెను. అశ్వినీ కుమారులు ఆ విద్యను తమ కుపదేశింపుమని మునిని అడిగిరి. ముని వారికి విద్యను ప్రసాదించెను. ఇంద్రుడు మునిశిరస్సును ఖండించెను. అశ్వినీ కుమారులు ముని శిరస్సు ఖండింపబడి యుండుట చూచి మరల దానిని జోడించి మునిని పునరుజ్జీవితుని చేసిరి.

బ్రహ్మవిద్యను పొందినవాడు మిగుల ధన్యుడు, కృతకృత్యుడగును.

11. దేవి భక్తి విధానములు – జ్ఞానప్రాప్తి యొక్క మహిమ

హిమాలయుడు దేవిభక్తి విధానములు తెలుపుమని కోరగా దేవి రాజేంద్రా! భక్తి మార్గములు మూడు ప్రసిద్ధములు. అవి కర్మయోగము, జ్ఞానయోగము, భక్తియోగము.

భక్తియోగము మనస్సునకు, శరీరమునకు, చిత్తమునకు ఏ విధమైన కష్టమును కలిగించదు. ఈ భక్తి కూడా మూడు విధములు తామసమని, రాజసమని, సాత్విక మనబడును.

ఈర్ష్యా ద్వేషములతో నిండి చేయు భక్తిని తామసమని అందురు. ఫలాపేక్షతో శ్రద్ధ, కోరికలు నిండుగా, భోగానుభవములపై ఆసక్తి కలిగినవాడు చేయు భక్తిని రాజసమని, తన సంతోషము కొరకు కర్మచేయువాని భక్తిని సాత్వికమనబడును. ఈ సాత్వికభక్తితో సేవించువాడు నన్ను పొందుట చాలా సులభము. నా సేవకు మించినది ఎన్నడును ఏ పనిని శ్రేష్ఠమని తలంచరాదు. జీవులందరు నా రూపములే.

సకల రూపములందు సర్వత్ర, సదా నన్నే విరాజమానమైయున్నట్లు ప్రణామమొనరించవలెను. చండాలుడు కూడా భగవతి రూపమేనని పవిత్ర భావమును ఉంచుకొనవలెను. ఉచ్ఛస్వరముతో నా నామములను కీర్తించుచు నృత్యము చేయవలెను. శరీరము ఉండుట, పోవుటను గురించి ఏ మాత్రమును ఆలోచింపరాదు.

భక్తియొక్క పరాకాష్ఠనే జ్ఞానమందురు. వైరాగ్యమునందలి అంతిమదశ కూడా జ్ఞానమేయగును. జ్ఞానము ముక్తికి గురితప్పని సాధనము. వైరాగ్యముదయించినను జ్ఞానోదయము సంపూర్ణముగ కలుగక మరణించినచో అతడు బ్రహ్మలోకమున స్థానమును పొందును. ఒక కల్పము వరకు బ్రహ్మలోకమున ఉండిన తదుపరి శుద్ధమైన ఆచరణ కలిగి శ్రీమంతుల ఇళ్ళలో జన్మించును.

ఈ మానవ జన్మ మరల లభించునది కాదు. అన్ని వర్ణములలో శ్రేష్ఠమైన బ్రాహ్మణుడుగ, వేదాధ్యయనము చేయువాడుగ లభించుట దుర్లభము. జ్ఞానమార్గము నందు పయనించునపుడు అశ్వమేధ యజ్ఞఫలము ప్రాప్తించును. పాలలో ఘృతము దాగియున్నట్లు జ్ఞానము దాగియుండును. మనోరూపకవ్యముతో ప్రాణి నిరంతరము మథించుచు దానిని పొందవలెను. అప్పుడు మానవుడు కృతార్థుడగును.

12. దేవి తీర్థములు - వ్రతములు - పూజా విధానములు

హిమాలయుడు దేవితో నిన్ను దర్శించు స్థానములు, వ్రతములను, ఉత్సవములనన్నిటిని కృపతో నాకు తెలుపుమని కోరగా శ్రీదేవి -

పర్వతరాజా! "కొల్హాపుర"మను స్థలము 'లక్ష్మి' ఎల్లప్పుడు నివాసముండును. "మాతుః పురము" నందు 'రేణుక'గా, "తులజాపురము" నందు "సప్తశృంగము" స్థలమును "హింగుళ", "జ్వాలాముఖి", "శాకంభరి", "భ్రామరి", "రక్తదంతిక", "దుర్గ" ప్రసిద్ధములు.

"వింధ్యాచలి" యొక్క సర్వోత్తమ స్థానము 'వింధ్య పర్వతము' మీద కలదు. "అన్నపూర్ణ స్థలము" కాంచీపుర స్థానము శ్రేష్ఠములని భావించవలెను.

"భీమా, విమల" అను స్థలములు ఖ్యాతి వహించినవి. "శ్రీ చంద్రాల" యొక్క మహాస్థలము కర్ణాటక దేశమునందు కలదు. "కౌశికీ" స్థలము ప్రసిద్ధము. "నీలాంబా" స్థలము "నీలపర్వత" శిఖరమందు కలదు.

"జంబూనదీశ్వరీ" శ్రీనగరస్థానము దగ్గరనున్నది. "గుహ్యకాళి" యొక్క మహాస్థలము "నేపాల" దేశము నందు కలదు. మీనాక్షి యొక్క ఉత్తమ స్థలము "చిదంబర" మందు కలదు. "వేదారణ్యము" నందు "సుందరి" యొక్క శ్రేష్ఠమైన స్థానము.

"పరాశక్తి" "ఏకాంబర" మను సుప్రసిద్ధ స్థానములందు శోభిల్లుదురు. భగవతి "మహాలస", "యోగీశ్వరి" స్థానములు. వీరి పేర్లతోనే ప్రసిద్ధములు.

"నీల సరస్వతి" స్థానము చైనాదేశము నందు కలదు. "బగలా" యొక్క స్థానము వైద్యనాథ ధామమందు కలదు. "భువనేశ్వరి" స్థానము మణిద్వీప పర్వతమందు కలదు.

శంకరుడు సతీదేవి శరీరమును తీసుకొని తిరుగుచుండెను. సతియొక్క యోనిభాగము పడిన స్థలము "కామరూప" దేశము నందు ప్రసిద్ధమైనది. "త్రిపుర సుందరి" యొక్క స్థానము రత్నము వంటిది. ఈ స్థలమున ప్రతి మాసము నందు దేవి రజస్వల అగుచుండునని ప్రసిద్ధి. ఆ సమయమున దేవతలందరును ఆ పర్వతమును చేరుదురని, సమస్త భూమియందు

దేవిమయమగునని చెప్పుదురు. "కామాఖ్యయోనిమండలము" కంటె శ్రేష్ఠమైన ఇతర స్థలమేదియును లేదు.

"పుష్కర" క్షేత్రము "గాయత్రి" యొక్క ఉత్తమ స్థానమని చెప్పబడినది. "అమర కటక" దేశము నందు భగవతి "చండిక" స్థానము కలదు. "ప్రభావ" క్షేత్రము నందు భగవతి "పుష్కరేక్షణి" నివసించును.

"నైమిశారణ్యము" ప్రసిద్ధమైన స్థలము. అక్కడ "లలిత" విరాజిల్లు చుండును. "పుష్కరము" నందు "పురుహోత" "ఆషాఢి" యందు దేవి "రతి" యొక్క ఉత్తమ ధామము కలదు. "చండ, ముండ"అను శాంతింపచేయు భగవతి "పరమేశ్వరి" విరాజిల్లు చుండును. "భారభూతి" యందు దేవి "భూతి" అటులనే "నకుల" మందు "నకులేశ్వరి" యొక్క ధామము కలదు. "హరిశ్చంద్ర" మను పేరు గల స్థానము నందు భగవతి "చంద్రిక", శ్రీశైల పర్వతము దేవి భగవతి "శాంకరి" సుప్రసిద్ధులు.

జిహ్వేశ్వరమునందు దేవి 'త్రిశూల', అమ్రకేశ్వరము నందు దేవి "సూక్ష్మ" విరాజమానులైవున్నారు. మహాకాలమను క్షేత్రము నందు భగవతి "శాంకరి", మధ్యమము అనే స్థానము నందు "శర్వాణి", "కేదార" నామక్షేత్రమందు "మార్గదాయిని" శోభిల్లుచున్నది. భైరవస్థానము నందు "భైరవి", "గయ", "మంగళ" స్థానములుగ గుర్తింపబడినవి.

'స్థాణుప్రియ' కురుక్షేత్ర స్థానమునందు కలదు. 'స్వాయుంభువి' నాకుల మందు శోభిల్లుచున్నది. కనఖలమందు దేవి 'ఉగ్ర'గా విమలేశ్వరము నందు 'విశ్వేశ'గా, 'అట్టహాస' నామకస్థానము నందు 'మహానంద', 'మహేంద్ర' పర్వతము మీద 'మహాంత' భీమాపర్వతమున భగవతి 'భీమేశ్వరి' 'వస్త్రాపథ' మను స్థలమునందు 'శాంకరి'. అర్థకోటి పర్వతమున 'రుద్రాణి' అవిముక్త క్షేత్రమునందు 'విశాలాక్షి'గా మహాలయమున 'మహాభాగ'గా – గోకర్ణము నందు భద్రకర్ణిగా, 'భద్రకర్ణక' మందు 'భద్రాస్య'గా, 'సువర్ణాక్ష' మను స్థానము నందు 'ఉత్పలాక్షి'గా దేవిని చూడవచ్చును.

'స్థాణువు' నందు 'స్థానవశి'గా, 'కమలాలయ' మందు 'కమల'గా, 'ఛాగలండక' మందు 'ప్రచండ'గా, కురండలమందు 'త్రిసంధ్య'గా, 'మాకోట'మందు 'భృకుటేశ్వరి'గా మండలేశ మందు 'శాండకి'గా 'కాలంజర' పర్వతమునందు 'కాళి'గా 'శంకకర్ణ' పర్వతము నందు భగవతి 'ధ్వని'గా 'స్థూలకేశ్వర' పర్వతము నందు 'స్థూల' ధామముగా చెప్పబడుచున్నది.

ఈ సకల క్షేత్రములు కాశీనగరము నందే విలసిల్లుచున్నవి. దేవియందు శ్రద్ధగల పురుషుడు నిరంతరము కాశియందే నివసించు ప్రయత్నము చేయవలెను.

ప్రాతఃకాలమున లేచి భగవతి యొక్క యీ నామములను ఉచ్చరించిన పురుషుని సకల పాపములు అదే క్షణమున భస్మమగును. శ్రాద్ధ సమయమున యీ నామములను పఠించుట ద్విజుని కర్తవ్యమగును. పితరులందరు ముక్తులై పరమపదమును పొందుదురు.

హిమాలయా! వ్రతములన్నియు స్త్రీలు, పురుషులు చేయవచ్చును. అనంత తృతీయ వ్రతము. రసకళ్యాణినీ వ్రతము, ఆర్ద్రానందకరీవ్రతము అను మూడు నామములు కలవు. శుక్రవారము చతుర్దశి నాడు దేవివ్రతము చేయవలెను. బుధవారము కూడ దేవీవ్రతము జరుపుకుందురు.

శంకరుడు తన ప్రేయసిని ఆసనము నందు కూర్చొన బెట్టి ఆ దేవి ఎదుట దేవతలతో కూడి నృత్యము చేయును. దీనిని ప్రదోషదేవీవ్రత మందురు. ఈ వ్రతము నాకు మిగుల ప్రీతిని గూర్చును. చైత్రమాసము, ఆశ్వయుజ మాసమునందలి రెండు నవరాత్రములు నాకు ప్రియమైనవి.

వ్రతముల సమయమున ఊయలను అలంకరింపచేసుకొని శయనోత్సవము, జాగరణోత్సవము, రథోత్సవము, దమనోత్సవము తప్పక జరుపుకొనవలెను. శ్రావణమాసమున పవిత్రోత్సవమున్నది.

సువాసినులకు, కుమారి కన్యలకు, బ్రహ్మచారులకు నా స్వరూపముగా తలంచి భోజనము పెట్టవలెను. బ్రాహ్మణ కుమారీ కన్యలను

పూజించవలెను. అట్టివాడు 'ధన్యుడు, కృతకృత్యుడు'. నా యెడల శ్రద్ధలేనివాని ఎదుట ఈ ప్రసంగము చేయరాదు.

13. దేవి ప్రసంగములు – పూజలు

శ్రీదేవి ఓ పర్వతరాజా! నా పూజ బాహ్యము, అభ్యంతరము అని రెండు విధములగ చెప్పబడినది. బాహ్యపూజ కూడ రెండు విధములు. అవి వైదికి, తాంత్రికి అనబడును. వైదికీ పూజ కూడా రెండు విధములగ సంపన్నమగును. వేదమంత్రములనుచ్చరించి చేయుపూజ వైదికి అని చెప్పబడును. తంత్రములతో చెప్పబడిన (మంత్రములతో) పూజతాంత్రికి అనబడును.

అనన్య ప్రేమతో, భక్తితో నా ఉపాసన చేయుము. యజ్ఞములు చేసి సంతోషపరచుటకు ప్రయత్నింపుము. ధ్యానయోగము, కర్మయోగము, భక్తియోగము, జ్ఞానయోగము – వీటిలో దేని నుండైనను నన్ను పొందవచ్చును. శ్రుతి, స్మృతులందు ప్రతిపాదింపబడిన సత్కర్మలే ధర్మమని చెప్పబడును.

శ్రుతులయందలి అర్థమునే గ్రహించి స్మృతులు ప్రకాశితములైనవి. అది మనుస్మృతి మొదలగు నామములతో ఖ్యాతి వహించినవి. శ్రుతుల, స్మృతుల ప్రామాణికత స్వయం సిద్ధము, నా ఆజ్ఞయే శ్రుతి. వైదిక పురుషులు వేదమునే ఆశ్రయించవలెను.

సన్యాసులు, వానప్రస్థులు, గృహస్థులు, బ్రహ్మచారులు భక్తితో నా విరాడ్రూపమును సదా ఉపాసించుచుందురు. నా యందే లగ్నమైన పురుషులయొక్క అజ్ఞానము జ్ఞానమయుడగు సూర్యుని ప్రకాశము ద్వారా నశింప చేయుదును. ఇట్లు వేదాంత సిద్ధాంతముల మీద ఆధారపడిన నా ప్రథమపూజ సంపన్నమగును.

రెండవ పూజయందు హృదయ రూపకములమందు విరాజితురాలైన పరమేశ్వరిని నన్ను ధ్యానించి పూజింపవలెను. దివ్యశ్వేతవర్ణము కలది.

సకలాంగములు పరమ మనోహరములు. ప్రసన్నతతో నెమలి పింఛముతో శోభలొలుకుచుండును. ఈ తల్లి పాశము, అంకుశము, వర, అభయ ముద్రలను ధరించి యుండును. చిత్తమున కనుగుణముగ సామాగ్రిని ప్రోగు చేసుకొనవలెను. బాహ్యపూజ వదలి ఆంతరిక పూజయందు నిమగ్నము కావలెను. ఉపాధి శూన్యమైన జ్ఞానమే నా పరమరూపము.

జన్మ, మృత్యు క్రియను శాంతపరచు ఉద్దేశ్యముతో ఏక నిష్ఠుడగుచు నన్ను చింతన చేయవలయును, నేను సకలమునకు సాక్షిని. ఆత్మ స్వరూపిణిని. దీని తరువాత బ్రహ్మ పూజా ప్రసంగమును వినుము.

హిమాలయా! ప్రాతఃకాలమున లేచి తన మస్తకమునందలి బ్రహ్మరంధ్రము మీద స్వచ్ఛమైన సహస్రదళ కమలమును స్మరించవలెను. దివ్యశ్వేతవర్ణము కలది. సకల శక్తుల చేత శోభలొలుకు చున్నాడని ధ్యానించవలెను.

ఈ దేవియే ప్రథమ ప్రయాణము నందు అనగా బ్రహ్మరంధ్రమును చేరునపుడు చైతన్యకాంతులు విరజిమ్ముచుండును. అమృతస్వరూపిణి యగును. ఆ దేవిని శరణుజొచ్చుచున్నాను అని ధ్యానము చేయవలయును.

రాజా! జ్వాలామధ్యమున వెలుగొందుచున్న దేవిని నన్నే ధ్యానించవలెను. సంధ్యావందనము తరువాతనే చేయవలయును. అగ్ని హోత్రమొనరింపవలెను. హోమము తరువాత పూజయందు సంలగ్నుడు కావలయును. భూతశుద్ధి చేసిన పిదప మాతృకాన్యము చేయవలయును. ఈ మాయా బీజమును తప్పనిసరిగ ఉచ్చరించవలెను.

'హ' కారము హృదయమునందు 'ర' కారము భ్రూ మధ్యము నందు "ఈ" కారము మస్తకము నందు, 'హ్రీం' కారము న్యాసము చేయవలయును. "నా ఈ శరీరము నందే ఒక దివ్య పీఠమున్నది". ధర్మము నందున్న విజ్ఞులైన పురుషులు "ప్రాణాయామ ప్రభావమున నా హృదయ కమలము వికసించినది" అని ధ్యానము చేయవలయును.

హిమాలయా! బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, ఈశ్వరుడు, సదాశివుడు – ఈ అయిదుగురు దేవతలు పంచమహాప్రేతములని చెప్పబడుదురు. శ్రీదేవినగు నాకు జపము సర్పించి అర్ఘ్యము నొసగుటకు ఏర్పాటు చేయవలెను.

పూజకుపయోగపడు వస్తువులను "ఓంఫట్" అను మంత్రము నుచ్చరించి శుద్ధి చేయవలెను. రాజా! నా దివ్యమనోహరమూర్తి సాధకుని హృదయము నందు నిలిచియున్నది. బ్రహ్మపీఠము నందు ఆవాహము చేయవలయును. ప్రాణప్రతిష్ఠ ఒనరింపవలెను. ఆసనము, ఆవాహము, అర్ఘ్యము, పాద్యము, ఆచమనము, స్నానము, వస్త్రదానము, సంపన్నము చేయవలెను. భక్తి కనుగుణముగ దేవికి సమర్పిస్తూ విధివిధానముగ పూజింపవలెను. శుక్రవారము నాడు తప్పనిసరిగ పూజచేయవలయును.

ఇప్పుడు దేవతల ప్రసంగమును తెలిపెదను. దేవిని భావన చేయవలయును. ఆసనము, అర్ఘ్యపాద్యములు, ఆచమనము, నైవేద్యతాంబూలాదులను సమర్పించవలెను. శ్రీచక్రమందున్న దేవతలను చక్కగా పూజించవలెను. పుష్ప, చందన, ధూప, వస్త్ర, నైవేద్య, తాంబూల, దక్షిణాదులతో నన్ను సంతుష్టపరచవలెను.

రాజా! "అహం రుద్రేభిః" సూక్తముతో, దేవ్యథర్వశీర్ష్ణా" మంత్రములతో నన్ను పదేపదే ప్రసన్నురాలను చేసికొనవలెను. (కూర్మ పురాణము పండ్రెండవ అధ్యాయమున ఈ సహస్రనామము కలదు. (ఈ సహస్ర నామములను సేకరించవలసియున్నది).

సకలాంగములు పులకితములు కాగా కంఠము గద్గదికము కాగా నృత్యగానములచే నన్ను సంతోషపెట్టవలెను.

తే.గీ. వేదపాఠంబు లుత్తమ విప్రవరుల
చేత జేయింపదగు నాత్మ సిద్ధి కొరకు
భూసురుల కిడదగు మంచి భోజనంబు
మదిని హృల్లేఖ నెప్పుడు మానరాదు

క. హ్రీల్లేఖామంత్రంబును
సల్లలితముగా స్మరింప సకలార్థములన్
దల్లి యొసఁగు నెల్లప్పుడు
కల్లలుగా వంతకంటెగలదె జగమునన్ (మ.క.దా.శ్రీ)

(హ్రీల్లేఖ అనగా హ్రీంకారము) దేవినైన నన్ను ఉపాసించు పురుషునకు ఎప్పుడును, ఏ వస్తువును దుర్లభము అయి ఉండదు. ఆయువు సమాప్తము కాగా మణిద్వీపమును చేరును. రాజా! మహాదేవి పూజా విధానము వినిపించితిని. నన్ను పూజించుట యందు కృతకృత్యుడవగుదువు.

శ్రద్ధగలవాడు, దేవీభక్తుడైన జ్యేష్ఠపుత్రునకు దీనిని ఉపదేశింపవలెను. శ్రాద్ధసమయమున దీనిని వఠించినచో పితరులందరును పరమధామమునకు అర్హులగుదురు. ఇట్లు పలికి దేవి అదృశ్యమయ్యెను.

హిమవంతునికి, దేవతలకు ఈ విషయములనన్నింటిని తెలిపి దేవి అదృశ్యమయ్యెను. అప్పుడు వ్యాసుడు జనమేజయ మహారాజా! భగవతి సతీదేవి హిమాలయుని ఇంట జన్మించి హైమవతియనుపేరుతో ప్రసిద్ధిచెంది గౌరియని పిలవబడెను. ఆమెను శంకరునికిచ్చి వివాహమొనరించిరి. వారికి కార్తికేయుడు జన్మించెను. ఆ కార్తికేయునిచే తారకాసురుడు సంహరింపబడెను. గౌరి, లక్ష్మి, ఆవిర్భావములు వినినవారికి సకల కోరికలు తీరును.

శ్రీదేవీభాగవతమును తొమ్మిది భాగములుగా వ్రాయుటకు పూనుకొనగా ఐదవరోజు కథ పూర్తిచేయుటకు శ్రీదేవి దుర్గాదేవియే సహకరించినది.

సర్వే జనా స్సుఖినో భవంతు - ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

* * *

దేవీ భాగవతము

దేవీనవరాత్రులు - ఆరవరోజు కథ

1. వరాహావతారము

జనమేజయుడు వ్యాసమహర్షితో బ్రహ్మర్షీ! శ్రీదేవి ఏయే మంత్రబీజముల ద్వారా ఆరాధింపబడెను. నాకు తెలుపవలసిందిగా కోరగా వ్యాసుడు రాజా! ఈ విషయమునే నారదుడు నారాయణుని అడిగెను. అప్పుడు నారాయణుడు దేవర్షి నారదా! జగత్తునందు ఉన్న ఒకే ఒక తత్వము భగవతి జగదంబ. ఆ దేవియే జగత్తును సృష్టించి పాలించి సంహరించును. మోక్షమును ప్రసాదించుటకు కూడ ఆ దేవి సమర్థురాలు.

మనువు తన తండ్రియైన ప్రజాపతియగు బ్రహ్మను భక్తిపూర్వకముగా చేరుకొనగా బ్రహ్మ మనువుతో నాయనా! నీవు భగవతి భువనేశ్వరిని ఉపాసించవలెను. ఆ దేవి నీకు ప్రజాసృష్టి చేయు కార్యము నందు తోడ్పడగలదని చెప్పగా మనువు దేవిని స్తుతింపసాగెను.

దండకము

శ్రీ హ్రీ దయా కాంతి దాక్షాయిణీ చిన్మయీ సచ్చిదానందరూపా సదారాధ్య సర్వేశ్వరీ సర్వసంపత్కరీ సర్వశోభాకరీ సర్వవిద్యాకరీ సర్వభద్రం కరీ శాంకరీ లోక ధాత్రీ ననుం దీనునిం ద్వత్పదాంభోజ భృంగాయమానుం గటాక్షింపవే నింపవే కోరికల్ నీకు నెవ్వార లీ డీజగంబెల్ల నీ మాయచే బుట్టు గిట్టుంగదే వేద వాక్యంబులున్ ధర్మశాస్త్రంబులుం దంత్రపాఠంబులున్ న్యాయవైశేషికాదుల్, మహా కావ్యముల్ సర్వమున్ నిన్నె గీర్తించు నీవే గదా బ్రహ్మను న్విష్ణువు న్శంకరుం గంటి వో యంబ నీయందు లోకంబులు న్నీవు లోకంబులం దుందు వో తల్లి నన్నుం బ్రసన్న స్వరూపంబుతో నేలు మమ్మా సదానీపద ధ్యానమే నాకు దిక్కంచు నే నమ్మి యున్నాడ నన్పాలనే

ముంచెదో నీళ్ళనే ముంచెదో యన్యము న్నేఁదలంప నృవానీ పురాణీ సరోజాత గర్భాండముల్ నీకునుం కందుకంబుల్ విలాసార్థకంబుల్ రమాదేవియు న్గౌరియున్ భారతీదేవియుం ద్వత్కళా లేశ సంజాతలేకాదె కళ్యాణి లోకేశి లోకైక మాతా ప్రతాపాఢ్య శృంగార లీలాలసత్కామరూపాశు కాలాప రాకామృగాం కాననా సద్వరం బిచ్చి నన్నేలు మమ్మా శివా శ్రీ జయశ్రీ జయశ్రీ.

లోకేశ్వరీ! నీ కృప చేతనే బ్రహ్మవేదములకు భాండాగారము అయ్యెను. శ్రీహరి లక్ష్మికి భర్త అయ్యెను. ఇంద్రుడు త్రిలోకాధిపతిగా వరుణుడు జలచర జీవనాయకుడుగా, కుబేరుడు ధనాధిపతిగా యముడు ప్రేతశాసకుడుగా, నిర్ఋతి రాక్షసనాథుడుగా, చంద్రుడు రసాధిపతిగా, లోకవంద్యులైరి. జగదంబికా నీకు శతకోటి వందనములు అని మనువు భగవతిని స్తుతించగా దేవి ప్రసన్నురాలై రాజేంద్రా! నీకేమి వరము కావలయునో కోరుము. తీర్చెదను అనెను.

మనువు దేవీ! ఈ ప్రజాసృష్టి చేయుకార్యమునకు నన్ను అనుగ్రహింపమనెను. నీవు చేయు ప్రజాసృష్టి నిర్విఘ్నముగా నెరవేరునని ఆశీర్వదించెను. మనువు వెంటనే బ్రహ్మ దగ్గరకు వెళ్ళి ప్రశాంతమైన స్థలము చూపమని కోరెను. నేను జగత్తును సృష్టిచేయుచుండగా జలము ముంచివేయుచున్నదని తెలిపెను.

అప్పుడు బ్రహ్మ నాసిక యొక్క అగ్రభాగము నుండి చిన్న వరాహ శిశువు ఆకస్మికముగ ప్రకటమయ్యెను. అయితే ఒక అంగుళ ప్రమాణముతోనున్నది ఏనుగు వలె అయ్యెను. అపుడు దేవతలు, మరీచి మొదలగువారు ఇది పర్వతము వలె పెరుగుచున్నది. శ్రీహరియే అయి ఉండవచ్చుననిరి.

ఋక్, సామ, యజుర్వేదములతో ఉత్తమ స్తోత్రములతో వరాహస్వామిని స్తుతించిరి. ఆ వరాహస్వామి జలము నందు ప్రవేశింపగా

సముద్రుడు గొప్ప అలజడికి గురి అయ్యెను. అది మెల్లమెల్లగా సముద్రములో భూమిని వెదకుచుండెను. పృథివి లోతైన నీటియందున్నదని గ్రహించెను. ఆ భూమిని వరాహము తన కోరలతో పైకెత్తెను. గజము కమలమును దంతముల పైనుంచుకొనెనా అని తలపించెను.

బ్రహ్మ కమలలోచనా! సురవరులు నీ ఆజ్ఞచేతనే అమృతమును పొందిరి. ఇంద్రుడు స్వర్గలోకాధిపతి అయ్యెను. అగ్నిదేవుడు దహనశక్తిని సకల కర్మలకు వ్యవస్థచేయు ధర్మరాజును మీరే నియమించితిరి. వరుణుడు జలప్రాణులకు అధిపతి అయ్యెను. వాయువు ప్రాణవాయువును, కుబేరుడు సన్మానింపబడుతూ ఈశానుడు సకల రుద్రులలో ప్రముఖుడు. ఇదంతయు నీ విభూతియే!

అదే సమయమున అచటకు మహాదైత్యుడగు హిరణ్యాక్షుడు వచ్చెను. శ్రీహరి గదాఘాతముతో వాని జీవనలీలను సమాప్తమొనరించెను. పృథివిని కోరల సహాయముతో జలముపైన నిలిపెను. శ్రీహరి పృథివిని రసాతలమునుండి తెచ్చుటకు ఇట్టి లీల చేసెను. ఈ ఉత్తమ చరిత్రను అధ్యయనము చేసిన వాని సకల పాపములు నశించును. విష్ణులోకమునకు వెళ్ళుటకు అర్హులగుదురు.

2. మనువు ప్రజాసృష్టి

శ్రీహరి భూమిని జలముపై నిలిపి వైకుంఠమునకు వెళ్ళిపోయెను. బ్రహ్మ మనువుతో యజ్ఞములకు స్వామియగు పరమపురుషుని ఆరాధించి, శాస్త్రోక్త ధర్మములను పాటిస్తూ వర్ణాశ్రమ వ్యవస్థను ఆదరిస్తూ, తేజస్సు కలిగిన పుత్రులను ఉత్పన్నము చేయమని ఆదేశించెను.

మనువు మొదట ఇరువురు కుమారులకు జన్మనిచ్చెను. వారు – ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు. పిదప ముగ్గురు కుమార్తెలు కలిగిరి. పెద్దకుమార్తె అకూతి, రెండవ పుత్రిక దేవహూతి, మూడవది ప్రసూతి.

అకూతిని రుచికి, దేవహూతిని కర్దమునకు, ప్రసూతిని దక్షప్రజాపతికిచ్చి వివాహము జరిపించెను.

రుచికి అకూతి గర్భమున భగవంతుడు యజ్ఞపురుషుడు, కర్దముడు దేవహూతిలకు కపిలుడు, దక్షునకు ప్రసూతి ద్వారా అనేక కన్యలుదయించిరి. ఈ కన్యలకు దేవతలు, మానవులు, పశువులు కలిగిరి.

స్వాయుంభువు మన్వంతరమున యజ్ఞపురుషుడుదయించి రాక్షసుల నుండి తండ్రిని రక్షించెను. కపిలుడు దేవహూతికి పరమ జ్ఞానోపదేశము చేసెను. సాంఖ్యశాస్త్ర ప్రవర్తకుడు, కపిలుడు పులహుడను ముని ఆశ్రమమునకు వెళ్ళిపోయెను.

మనువు జ్యేష్ఠ కుమారుని పేరు ప్రియవ్రతుడు. విశ్వకర్మయను ప్రజాపతి యొక్క పుత్రిక బరిష్మతి ఆమెతో ప్రియవ్రతుని వివాహము జరిగెను. వారికి పదుగురు పుత్రులు కలిగిరి. ఒక పుత్రిక జన్మించెను. ఆమె ఊర్జస్వతి అనుపేరుతో ప్రసిద్ధిచెందెను. ఆమెకు పదిమంది పుత్రులు. 1) అగ్నీధ్రుడు, 2) యుధ్మజిహ్వుడు, 3) యజ్ఞబాహువు, 4) మహావీరుడు, 5) రుక్మశుక్రుడు, 6) ధ్రుతపృష్ఠుడు, 7) సవనుడు, 8) మేధాతిథి, 9) అగ్నిహోత్రుడు, 10) కవి.

ప్రియవ్రతుని రెండవ భార్యకు ముగ్గురు పుత్రులు. వారు – ఉత్తముడు, తాపసుడు, రైవతుడు, వీరు ఒక్కొక్క మన్వంతరమునకు అధిష్ఠాతలుగ జేయబడిరి. ఒకనాడు ప్రియవ్రతుడు సూర్యునితో సమానమైన తేజస్సుకల రథము నధిరోహించి ఆ ప్రకాశమును వ్యాపింపచేయుచు పృథివికి ఏడుసార్లు ప్రదక్షిణ చేసెను. రథచక్రముల వలన భూమిమీద గుంతలు పడెను. ఏడు సముద్రములయ్యెను. అవి... మధ్యనున్న భూమి ఏడుదీవు లగుట, అవి జంబూ, ప్లక్ష, శాల్మలి, కుశ, క్రౌంచ, శాక, పుష్కర నామములతో విలసిల్లుచున్నవి. ఈ ద్వీపములకు నలువైపుల ఏడు

సముద్రములున్నవి. అవి... 1) క్షారోదక, 2) ఇక్షురసోదక 3) సురోదక 4) ఘృతోదక, 5) క్షీరోదక 6) దధి మండోదక 7) శుద్ధోదకమను పేర్లతో ఖ్యాతివహించినవి.

క్షారసముద్రముతో పరివృతమైనది జంబూద్వీపము. ప్రియవ్రతుడు తన కుమారుడగు అగ్నీధ్రుని యీ ద్వీపమునకు రాజును చేసెను.

రెండవది ప్లక్షద్వీపము. దీనికి యుధ్మజిహ్వుడు అధిపతి. మూడవది సురా సముద్రముచే పరివృతమై శాల్మలి దీవికి యజ్ఞబాహుడు అధిపతి అయ్యెను.

నాల్గవది కుశద్వీపమునకు నేతి సముద్రము పరివృతమైవున్నది. హిరణ్యరేతుడు రాజయ్యెను. క్రౌంచద్వీపమునకు అధిపతి ధృతపృష్ఠుడు. శాకద్వీపమునకు మేధాతిథి అధిపతి. పుష్కరద్వీపమునకు అధిపతి వీతిహోత్రుడు.

ప్రియవ్రతుడు తన కుమార్తెయగు ఊర్జస్వతి వివాహము శుక్రాచార్యునితో జరిపించెను. దేవయాని ఊర్జస్వతి, శుక్రాచార్యుల పుత్రిక. ప్రియవ్రతుడు తన రాజ్యమును తన కుమారులకిచ్చి యోగమార్గముతో సన్యాసి అయ్యెను.

3. భూమండలము – నదులు

నారదా! ఈ భూమండలమున లక్ష యోజనములతో జంబూద్వీపము. ఇందు తొమ్మిది దేశములు. అందులో ఇలావృతము జంబూద్వీపమునకు మధ్య భాగమున కలదు. ఇచట సుమేరుపర్వతము కలదు. ఇలావృతమునకు ఉత్తర భాగమున మూడు పర్వతములు కలవని చెప్పబడినవి. ఇవి నీల, శ్వేత, శృంగవంతములను పేర్లతో విలసిల్లుచున్నవి.

ఈ పర్వతముల నుండి ఎన్నియో నదులు పుట్టుచున్నవి. దక్షణమున నిషధము, హేమకూటము, హిమాలయమను పేర్లుగల చాల వెడల్పు,

పొడవులతో పర్వతములన్నవి. హరివర్షము, కింపురుషము, భారత వర్షము, లకు నిషధము, హేమ కూటము, హిమాలయమునకు ఎల్లలు. పశ్చిమమున – మూల్యవంతము, తూర్పుగ గంధమాదన పర్వతము, నీలగిరి మొదలుకొని నిషధ పర్వతము వరకు విస్తరించియున్నవి.

మందరము, మేరు మందరము, సుపార్శ్వము, కుముదము అను పర్వతములు సుమేరుగిరికి నాలుగు వైపులయందు విరాజమానమై యుండును. ఈ పర్వతములు మీద మామిడి, నేరేడు, కదంబము, వటవృక్షము అను నాలుగు వృక్షములు కలవు. ఇవి పదుకొండు వేల యోజనములు ఎత్తున ఉన్నవి.

అక్కడ లోతైన చెరువులు అందు తేనె, చెరుకు రసము, రుచిగల జలములతో నిండియున్నవి. అక్కడ దేవతలు స్నానమాచరించుట వలన దేవతలు యోగ సంపదలను పొందుదురు. మందరాచలమునందు దివ్యమైన మామిడివృక్షము – దాని ఫలములు వాటి రసము భూమియందు ప్రవహించుచుండును. ఆ రసముతో అరుణోదయమనునది ప్రవహించుచుండును.

భగవతి శ్రీ అరుణ దేవిగ ఉపాసించెదరు. ఆద్య, మాయ, అతుల, అనంత, పుష్టి, ఈశ్వర మాలిని, దుష్టనాశకరి, కాంతిదాయిని అను నామములతో ఆ దేవి ఖ్యాతి వహించెను.

నారదా! అరుణోదనది ఇలావృత దేశమున పూర్వభాగమున ప్రవహించుచున్నది. మందరము యొక్క వక్షఃస్థలమున ఎత్తైన వృక్షములనుండి రాలిన జంబూఫలములు విశాలములు. ఆ ఫల రసములు 'జంబూనది'గా పిలవబడును.

ఈ దేవిని కోకిలాక్షి, కామకళ, కరుణ, కామపూజిత, కఠోర, విగ్రహ, ధన్యా, నాకి మాన్యా, గభస్తినీ దేవియొక్క నామములు మానవుడు నిరంతరము జపించవలెను.

జంబూనదీ తీరములందు మట్టి జంబూనద సువర్ణమని చెప్పబడును. ఇలావృతమునకు పశ్చిమమున ధారేశ్వరి అను పేరుగల మహాదేవి ఇచట విరాజిల్లుచుండును. అక్కడ దేవిని దేవపూజ్య, మహోత్సాహ, కాలరూప, మహాననా, కర్మఫలద, కాంతారగ్రహనేశ్వరి, కలాలదేహ, కాలాంగి, కామకోటి, ప్రవర్తిని అనే నామములతో జగదంబను పూజింపవలెను.

కుముద పర్వతము మీద వటవృక్షము కలదు. అక్కడ నుండి అనేక నదములు ధరాతలమునకు వచ్చెను. అందు వస్త్రము, పెరుగు, పాలు, ఘృతము, తేనె, బెల్లము, అన్నము, శయ్య, ఆసనము, పరిపూర్ణములైయుండును.

ఇలావృతము ఉత్తర భాగమునుండి ఆ తటమునందు భగవతి మీనాక్షి మందిరము కలదు. ఇక్కడ దేవిని నీలాంబర, రౌద్రముఖి, నీలాలకయుత, నాకిని, దేవసంధ, ఫలద, వరద, అతిమాన్య, అతిపూజ్య, మత్తమాతంగగామిని, మదనోన్మాదిని, మానప్రియ, మానప్రియాంతర, మారవేగధర, మారపూజిత, మారమాదిని, మయూరవరశోభాడ్య, శివవాహనగర్భవు అను నామములతో విలసిల్లును.

నారదా! పై చెప్పిన నదముల నీటిని త్రాగుటచే వృద్ధాప్య చిహ్నములు పొడసూపవు. సుమేరు పర్వతమును ఆవరించియున్న పర్వతములు – 1) శ్రుణ్వంతము 2) కురంగము 3) కురగము 4) వికంకతము 5) త్రికూటము 6) శిశిరము 7) పతంగము 8) రుచకము 9) నిశధము 10) శితీవాసము 11) కపిలము 12) శంఖము 13) వైధూర్యము 14) చారుధి, 15) హంసము 16) ఋషభము 17) నాగము 18) కాలంజరము 19) నారదము 20) కుశంభము.

సుమేరుగిరికి తూర్పు దిశయందు జఠరము, దేవకూటము అనే పర్వతములు. పశ్చిమప్రాంతమున పవమానము, పారియాత్రయని,

ఉత్తర భాగమున త్రిశంక, మకర నామములతో రెండు పర్వతములున్నది. సుమేరుగిరిని కాంచనగిరి యని కూడా అందురు.

సుమేరుగిరి మీద తొమ్మిది పురములున్నవి. మనోవతి, అమరావతి, తేజోవతి, సంయమని, కృష్ణాంగన, శ్రద్ధావతి, గంధవతి, మహోదయ, యశోవతి అని వాటికి పేర్లు.

విష్ణుదేవుడు బలిచక్రవర్తి యజ్ఞము చేయునపుడు వామనావతారము ధరించెను. విష్ణువు ఎడమకాలి బొటన వ్రేలి కొనగోటితో బ్రహ్మాండము చీల్చబడెను. గంగ ప్రకటమయ్యెను. పాపమును పెకలించి వేయు జలములతో ఇది నిండియున్నది. ఇది సకల నదులకు అధిపతి.

ఇది ప్రవహించుచు స్వర్గ శిఖరములను చేరుకొనెను. ఉత్తానపాదుని కుమారుడు ధ్రువుడు ఇప్పుడు కూడా ప్రతిష్ఠితుడైయున్నాడు. అక్కడ సప్తర్షులు కూడా ఉందురు. జటాజూటమును ధరించి వారు నిత్యం గంగలో స్నానము చేసెదరు.

గంగ వైకుంఠమునుండి చంద్రమండలము చేరుకొనెను. అచట నుండి బ్రహ్మలోకమువచ్చెను. బ్రహ్మ లోకమును చేరిన గంగ నాలుగు పాయలుగ విభజింపబడెను. సీత, అలకనంద, చక్షుష్, భద్ర అనునది వీటి పేర్లు. సీత అనుపాయ మొదట కేసరపర్వతశిఖరము ఆ తరువాత గంధమాదన పర్వత శిఖరము మీద పడును. పూర్వదిశ యందుగల భద్రాశ్వదేశమునకు వచ్చి దేవతలతో పూజింపబడి క్షీరసాగరమున కలియును. చక్షుష్ అను గంగ పాయ మాల్యవంతము అనే శిఖరము పైపడి కేతుమాల దేశమునకు ఆ తరువాత సముద్రమున కలియును.

మూడవధారయైన అలకనంద దక్షిణదిశగా పయనించి హేమ కూటపర్వతము అచట నుండి వేగముగా ప్రవహించుచు భారత దేశమునకు చేరుకొనును. ఇది దక్షిణసాగరమున కలియును. నాలుగవధార భద్ర

శృంగవంత పర్వతమునుండి బయలుదేరి సముద్రమునకు చేరును. చాలా నదుల జన్మస్థానము మేరు మందర పర్వతములు.

పై చెప్పిన తొమ్మిది దేశములలో భారతదేశము కర్మక్షేత్రము. నారదా! స్వర్గమునందు నివసించు పురుషులు వారి పుణ్యము సమాప్త మగుటతోడనే భోగములననుభవించు స్థలమునకు వచ్చెదరు. వారికి వెయ్యి ఏనుగుల బలముండును. వారికి సకలసుఖములు ప్రాప్తించును.

4. అనంతుడు, హయగ్రీవుడు, నృసింహ, మత్స్య, ప్రస్తావన

నారదా! జంబూద్వీపము నందు తొమ్మిది దేశములు కలవు. బ్రహ్మ మొదలగు వివిధ దేవతలు నివసించెదరు. ఈ దేవతలు శ్రీదేవిని ఉపాసించుచుందురు. నారాయణుడు శ్రీదేవిని ఉపాసించుచుండును. ఇలా వృతమున శ్రీహరి రుద్రరూపమున విరాజిల్లుచుండును. బ్రహ్మనేత్రముల నుండి స్వామి ప్రాదుర్భవించెను. ఆ క్షేత్రము నందు పురుషులెవ్వరూ ప్రవేశింపజాలరు.

పురుషుడెవరైనను అచటికి వెళ్ళినచో భవానిదేవి శాపమున వెంటనే స్త్రీగా మారిపోవును. రుద్రుడు సంకర్షణుని ఉపాసించుచుండును. సమస్తప్రాణుల కళ్యాణార్థము రుద్రదేవుడు సంకర్షణుని ఉపాసించుచుండును.

శంకరుడు "ఓం నమో భగవతే మహాపురుషాయ సర్వగుణ సంఖ్యానాయానంతా యావ్యక్తాయనమః" జగదుత్పత్తికి స్థితిలయములకు కారణము నీవేయని వేదమంత్రములు తెలుపుచున్నవి. నిన్ను అనంతుడు అని అందురు. నీ వెయ్యి తలల మీద భూమండలము తిలాధాన్యపు గింజవలె ఉంచబడినది. రుద్రుడగు నేను పంచభూతాదులను సృష్టించెదను.

ఈ జీవుడు మాయకు లోనై భ్రాంతితో తరుణోపాయము ఎరుంగడు. ఈ జగదుత్పత్తిలయములు నీ రూపములే. అట్టి నీకు నేడు పదేపదే నమస్కరించెదను.

భద్రాశ్వవర్షమునందు ధర్ముని పుత్రుడు భద్రస్రవుడు వాసుదేవుని హయగ్రీవనామముతో పిలిచెను. "ఓం నమో భగవతే ధర్మాయాత్మ విశోధనాయ నమః". చిత్తమును విశుద్ధమొనరించు ధర్మునకు నమస్కారము మీ విగ్రహము మానవగుఱ్ఱము యొక్క సంయుక్త రూపము. ప్రళయ కాలము నందు దైత్య గుణములు వేదములను దొంగిలించిరి. బ్రహ్మ ప్రార్థించగా మీరు రసాతలము నుండి దానిని తెచ్చి ఇచ్చితిరి. మీకు మేము నమస్కరించుచున్నాము.

ఈ పరమ పావనచరిత్రను చదివినవారు, వినిన వారు ఈ పాపమయమైన పాము కుబుసము నుండి ముక్తులై దేవీదివ్యధామమునకు వెళ్ళిపోవుదురు.

నారదా! హరి వర్షమునందు "నృసింహ" రూపమున భాసించును. ప్రహ్లాదుని హృదయము నందు ఈ స్వామిపై అనన్యమైన భక్తి కలదు. ప్రహ్లాదస్తుతి – "ఓం నమో భగవతే నారసింహాయ నమస్తేజస్తే జసే ఆవిర్భావ వజ్ర దంష్ట్ర కర్మాశయాన్ రంధయ రంధయ తమో గ్రస ఓం స్వాహా! అభయం మమాత్మని భూయిష్ఠాః ఓం క్ష్రౌం "ఓంకార స్వరూపుడు శ్రీ నరసింహునకు నమస్కరించెదను. ఓ వజ్రనఖ! ఓ వజ్రదంష్ట్రా మీరు నాకు ప్రత్యక్షము కండు. నా కర్మవాసనలను దహింపుడు.

భగవంతుని చరిత్ర సౌభాగ్యము చెవుల నుండి భగవంతుని హృదయమున ప్రవేశించును. సమస్త దేవతలు, ధర్మజ్ఞానములు మొ॥నవి సద్గుణములతో కూడి నిష్కామ భక్తుని హృదయము నందు సదా నివాసముండును. చేపలకు జలము మిగుల ప్రియమైనది. వాటి జీవనమునకు అదియే ఆధారము. శ్రీహరియే సకల దేహధారులకు ప్రియతమమైన ఆత్మ. అట్టి భగవానుడు దానవరాజగు ప్రహ్లాదుని హృదయకమలమందు విరాజమానుడై యుండును.

కేతుమాల వర్షమునందు శ్రీహరి కామదేవుని రూపమున విరాజమానుడైయుండును. ఆ దేశమునకు అధీశ్వరి సముద్రతనయ లక్ష్మీదేవి.

భగవతి లక్ష్మీదేవి శ్రీహరిని సదా ఉపాసించుచుండును. "ఓం హ్రాం హ్రీం హ్రూం ఓం నమో భగవతే హృషీకేశాయ సర్వగుణ విశేషైర్విలక్షి తాత్మనే అకూతీనాం చిత్తీనాం బేతసాం విశేషాణాం చాధిపతయే షోడశకలాయచ్ఛందో మాయా యాన్నమయా యామృతమయాయ. సర్వమాయాయ మహసే ఓజసే బలాయకాంతాయ కామాయ నమస్తే ఉభయత్ర భూయాత్"

ఓం, హ్రాం, హ్రీం, హ్రూం బీజమంత్రములతో అన్ని వైపుల నుండి నమస్కరించుచున్నాను. స్వామీ! ఇతరులను రక్షించగల శక్తి మీకే కలదు అని లక్ష్మీదేవి కేతుమాల వర్షము నందు ఉపాసించును.

రమ్యక వర్షమున శ్రీహరి మత్స్యరూపమును ధరించి విలసిల్లుచుండును. మనువు స్తుతి – "ఓం నమో ముఖ్యతమాయ నమః" ఓంకారమునకు మత్స్య భగవానునకు నమస్కారములు. ప్రళయకాలము నందు ఎగసిపడుచున్న తరంగములతో సముద్రము సుశోభితమైయుండును.

మీరు ఓషధులకు, లతలకు నెలవైన పృథివిని, నన్నును తీసికొని సముద్రమునందు క్రీడించుచుండిరి. నేను మత్స్యభగవానునకు పదేపదే నమస్కరించుచున్నాను.

5. కచ్ఛప, వరాహ, శ్రీరామచంద్ర – నారాయణ ఉపాసనలు

నారాయణుడు నారదా! హిరణ్మయ మను పేరుగల ప్రదేశమునందు యోగీశ్వరుడు కచ్ఛప రూపముతో విరాజిల్లు చుండును. ఓం నమో భగవతే అకూపారాయ సర్వసత్వ గుణ విశేషణాయ నోపలక్ష్మిత స్థానాయ నమో వర్మణే నమో భూమ్రే నమో వస్థానాయ నమస్తే, భగవన్ స్వేదజములు,

అండజములు, ఉద్భిజములు, జంగమములు, దేవతలు, ఋషులు, స్వర్గము, ఆకాశము, పృథివి – ఇవన్నియు మీరే. ఇరువది నాలుగు తత్వములు, సాంఖ్య స్వరూపుడవు అని అర్యముడు కచ్ఛపుని స్తుతించుచు ఆ ప్రభువును భజించును.

పృథ్వి స్తుతి – ఓం నమో భగవతే మంత్రతత్వలింగాయ యజ్ఞక్రతవే మహాధ్వరావయవాయ, మహా వరహాయనమః కర్మశుక్లాయ త్రియుగాయ, నమస్తే – ఆ ప్రభువు యజ్ఞ స్వరూపుడు. విద్వాంసులు ఎవరిని దర్శించు తలంపుతో మనస్సను కవ్వముతో శరీరమును మధించెదరో అట్టి మీకు నమస్కరిస్తున్నాను.

హిరణ్యకశిపుని నరసింహమూర్తివై సంహరించితివి. సాగరమునందు మునిగిన నన్ను (భూమిని) కోరలపై బంతి లాగా పైకి లేపిన ఆది వరాహమూర్తికి నీకు నమస్కారములు.

కింపురుష వర్షమందు జగత్తును శాసించు దశరథ నందనుడు శ్రీరామచంద్రుడు విరాజమానుడైయుండును. సీతాదేవి ఆ స్వామితో సుశోభితురాలైయుండును. ఆంజనేయుడు ఆ ఆదిపురుషుని స్తుతించుచుండును.

హనుమంతుడు – "ఓం నమోభగవతే ఉత్తమ శ్లోకాయ నమః. ఆర్య లక్షణ శీలవ్రతాయ నమః, ఉపశిక్షితాత్మనే ఉపాసిత లోకాయ నమః సాధువాద నికషణాయ నమో బ్రహ్మణ్య దేవాయ మహాపురుషాయ మహాభాగాయ నమః" అని శ్రీరామునకు నమస్కరిస్తున్నాడు.

ఏకైక విశుద్ధ బోధ స్వరూపుడు, అహంకార శూన్యుడు, మానవ రూపమున కేవలము రాక్షస సంహారము కొరకే మీరు అవతరించలేదు. ప్రాణులకు సుఖదుఃఖములు సహజములని చెప్పుటకే మీరుదయించిరి.

నారదా! కింపురుష వర్షము నందు ఆంజనేయుడు శ్రీరాముని స్తుతించును. ఆది పురుషుడనగు నన్ను నీవు నిరంతరము స్తుతించుచుందువు.

అప్పుడు నారదుడు శాంతస్వభావుడు, ఆత్మరాములకు అధీశ్వరుడైన నారాయణునకు పదేపదే నమస్కారములు. భగవన్. ఈ సాంసారిక పారలౌకిక భోగములందు కోరిక కలుగు వ్యక్తి స్త్రీ, పుత్ర, ధన విషయములను చింతన చేయుచు మరణించును.

దేవర్షీ! భారత దేశమునందలి నదులు – పర్వతములను తెలిపెదను వినుము – మలయ పర్వతము, మంగళప్రస్థము, మైనాకము, త్రికూటము, ఋషభము, కుటకము, కోళ్ళము, సహ్యము, దేవగిరి, ఋష్యమూకము, శ్రీశైలము, శ్రీవేంకటాచలము, మహేంద్రము, అద్రి, వారిధారము, వింధ్యము, ముక్తిమంతము, ఋక్షగిరి, పారియాత్రము, ద్రోణము, చిత్రకూటము, గోవర్ధనము, రైవతకము, కకుభము, నీలము, గౌరముఖము, ఇంద్రకీలము, కామగిరి మొదలగు పర్వతములు.

నదులు – తామ్రపర్ణి, చంద్రవంశ, కృతమాల, వటోదక, వైహాయాసి, కావేరి, వేణ, పయస్విని, తుంగభద్ర, కృష్ణవేణి, శర్కారావర్తక, గోదావరి, భీమరధి, నిర్వింధ్యపయోష్ణిక, తాపీ, దేవ, సురస, నర్మద, సరస్వతి, చర్మణ్వతి, సింధు, అంధ, శోణ, నదీనదములు కలవు. ఋషికుల్య, త్రిసామ, మహానది, వేదస్మృతి, కౌశికి, యమున, మందాకిని, దృషద్వతి, గోమతి, సరయు, రోధవతి, సప్తవతి, సుషమ, శతద్రు, చంద్రభాగ, మరుద్వర, వితస్త, అసిక్ని, విశ్వ మొ॥నదులు ప్రసిద్ధములు.

భారత దేశమునందు జన్మించిన పురుషులకు సాత్విక, రాజస, తామస కర్మల ప్రభావములచే మోక్షము లభించును. శ్రీహరి అనుగ్రహముచే భారత దేశమున మానవుల ఇంట వీరు జన్మించిరి.

భారతీయులు యజ్ఞముల, తపముల, వ్రతముల, దానముల ప్రభావముతో స్వర్గము మీద అధికారమును పొందుదుము. ఇక్కడ ఇంద్రియములకు ఒకదానికంటె ఒకటి సుఖమును కలిగించు విషయములు కలవు. అందుచే వివేకశక్తిని కోల్పోవుదము.

భారతదేశమునందు అల్పాయుష్కులమై జన్మించుటే శ్రేష్ఠమని భావించెదము. ఈ భారతదేశము నందు అట్టి జన్మను పొంది ముక్తుడగుటకు ప్రయత్నించని ప్రాణి అడవి యందలి పక్షులవలె బంధమున చిక్కుగొనకోరును. భారతీయులు మిగుల భాగ్యశీలురు. యజ్ఞములందు, మంత్రములద్వారా, యజ్ఞభాగములను సమర్పించెదరు. పూర్ణబ్రహ్మ ప్రసన్నుడయి ఆ భాగములను స్వీకరించును.

పూర్వజన్మమున చేసిన యజ్ఞఫలితములచే స్వర్గ సుఖములను పొందుదుము. జంబూద్వీపము నందున్న ఉపద్వీపములు – స్వర్గప్రస్థ, చంద్రశుక్ల, ఆవర్తన రమణక, మందర, హరిణ, పాంచజన్య, సింహళ, లంక వీటి నామములు.

ఈ జంబూద్వీపమే కాక మరియు ఆరుద్వీపములను వర్ణించెదను వినుము.

6. ప్లక్ష, శాల్మలి, కుశ, క్రౌంచ, కాక, పుష్కర ద్వీపముల వర్ణన

ప్లక్షద్వీపము – నారదా! జంబూద్వీపమునకు అన్నివైపుల క్షారజలసముద్రము కలదు. క్షారసముద్రమునకు రెండింతల పరిమాణము గల ప్లక్ష ద్వీపము చుట్టియున్నది. యుధ్మజిహ్వుడు ప్లక్ష ద్వీపశాసకుడు.

శివ, యవస, భద్ర, శాంత, క్షేమ, అమృత, అభయ అను ఏడు ప్రదేశములు ప్లక్షద్వీపమున కలవు. అరుణా, నృమా అంగిరసీ, సావిత్రీ, సుప్రభాతిక, ఋతుంభర, సత్యంభర అనే నదులు ప్రసిద్ధములు. మణికూట,

వజ్రకూట, ఇంద్రసేన, జ్యోతిష్మంతము, సువర్ణము, హిరణ్యష్ఠీవము, మేఘమాల అనే పర్వతములు ప్రసిద్ధములు.

ఈ ప్లక్షద్వీపమునందు హంస, పతంగ, ఊర్ధ్వాయన సత్యాంగములను నాలుగు వర్ణములవారుందురు. వీరు సూర్య భగవానుని పురాణ పురుషుడు, శ్రీ విష్ణుస్వరూపుడు, సత్యధర్మములకు, వేదములకు, సత్కర్మలకు, అమృతము, మృత్యువు, స్వరూపములు గలవాడని శరణు వేడెదరు.

శాల్మలి ద్వీపము – ప్లక్ష ద్వీపము కంటె రెండింతలు వైశాల్యము కలది. పక్షిరాజగు గరుడుడు విరాజిల్లుచుండును. శాల్మలి ద్వీపమును యజ్ఞబాహువను రాజు పరిపాలించును. ఈ ద్వీపము నందు సురోచన, సౌమనస్య, రమణక, దేవవర్షక, పారిభద్ర, ఆప్యాయన, విజ్ఞాన అను ఏడు ప్రదేశములు కలవు. సరస, శతశృంగ, వామదేవ, కందక, కుముద, పుష్పవర్ష, సహస్రశృతి అనునవి పర్వతములు, కుహు, రజని, నందా, రాకా అనునవి నదులు.

శ్రుతధర, వీర్యధర, వసుంధర, ఇషుంధర వర్ణములతో చంద్రుని భగవంతునిగ ఉపాసించెదరు.

కుశద్వీపము – నేతి సముద్రతో చుట్టబడినట్లు కుశలతో విరాజిల్లుచుండును. హిరణ్యరేతుడు కుశద్వీపమును పరిపాలించును. వసువు, వసుదానుడు, దృఢరుచి, నాభిగుప్తుడు, సత్యవ్రతుడు, వివిక్తుడు, భానుదేవుడు పుత్రులు.

చక్ర, చతుశృంగ, కపిల, చిత్రకూట, దేవానీక, ఊర్ధ్వరోమ, ద్రవిణమను పర్వతములు, రసకుల్య, మధ్యకుల్య, శ్రుతవింద, మిత్రవింద, దేవగర్భ, శ్రుతచ్యుతా, మంత్రమాలిక – ఏడునదులు కలవు. ఇక్కడ కుశల, కోవిద, అభియుక్త, కులక – నాలుగు వర్ణముల వారునివసింతురు.

అగ్ని స్వరూపుడగు శ్రీహరిని ఉపాసింతురు. జాతవేదుడవని చెప్పబడు భగవంతుడగు అగ్నిదేవా! నీవు పరబ్రహ్మ పరమాత్మునకు హవిష్యమును తీసుకువెళ్ళెదవు అని ప్రార్థింతురు.

క్రౌంచద్వీపము – క్రౌంచమను పర్వతమున్నచోటనే యీ ద్వీపము కలదు. ప్రియవ్రతుని కుమారుడు ఘృతపృష్ఠుడు యీ ద్వీపనిర్మాత. ఆముడు, మధురహుడు, మేఘపృష్ఠుడు, సుధామకుడు, భ్రాజిష్ణుడు, లోహితార్ణుడు, వనస్పతి వారి కుమారులు. శుక్లము, వర్ధమానము, భోజనము, ఉపబర్హణము, నందము, నందనము, సర్వతో భద్రము అనునవి పర్వతములు. అభయ, అమృతాఘు, ఆర్యక, తీర్థవతి, వృత్తిరూపవతి, శుక్ల, పవిత్రీవతి అనునవి నదులు.

పురుషులు, ఋషభులు, ద్రవిణులు, దేవకులు నాలుగు వర్ణముల వారు ఇందు నివసించెదరు. వీరు జలాధిపతియగు వరుణదేవుని ఉపాసించెదరు. భూః, భువః, స్వః అనే మంత్రముతో పవిత్రులను చేయుదురు.

శాకద్వీపము – క్షీరసముద్రమునకు నాలుగు వైపులా విస్తరించియున్నది. ఈ ద్వీపము నందు శాకము అను పేరుగల వృక్షము కలదు. మేధాతిథి యీ ద్వీపమునకు రాజు. పురోజవుడు, మనోజవుడు, పవమానుడు, ధూమానీకుడు, చిత్రరేఖుడు, బహురూపుడు, విశ్వధృక్కు ఇతని పుత్రులు.

ఈశానము, ఉరుశృంగము, బలభద్రము, శతకేశరము, సహస్ర స్రోత్రము, దేవపాలము, మహాసనము అనునవి పర్వతములు. అనఘు, ఆయుర్దా, ఉభయసృష్టి, అపరాజిత, పంచపది, సహస్రశ్రుతి, నిజధృతి అనునవి ఏడునదులు.

సత్యవ్రత, క్రతువ్రత, దానవ్రత, అనువ్రత, అను వర్ణములవారు ఇక్కడ ఉందురు. వాసుదేవుని ఉపాసింతురు. ప్రాణుల అంతరంగమును వివిధ వృత్తులతో పోషించువాడు మమ్ములను రక్షించును అని స్తుతింతురు.

పుష్కరద్వీపము – ఈ ద్వీపము నందు ఒక కమలము గలదు. లక్ష బంగారు రేకులతో యీ పద్మము ఒప్పారుచుండును. శ్రీహరి ఈ కమలమును స్థాపించును. ఇక్కడ మానసోత్తరమను ఒకే ఒక పర్వతము పదివేల యోజనముల ఎత్తు కలిగివుంటుంది.

ఇంద్రాదిలోకపాలురు నివసింతురు. సూర్యుడు సుమేరుగిరిని ప్రదక్షిణము చేయుచుండును. మానవులకు సంవత్సరకాలమనగా అదిదేవతలకు ఒక పగలు, రాత్రి, సూర్యుని రథము దేవయాన పితృయాన మార్గములనుండి ముందుకు సాగును.

ప్రియవ్రతుని పుత్రుడగు వీతిహోత్రుడు ఇచట రాజు. అతనికిరువురు పుత్రులు. రమణుడు, ధాతికి వారి పేర్లు, బ్రహ్మను సాక్షాత్తూ పరబ్రహ్మపరమేశ్వర స్వరూపుడని తలంచి ఉపాసింతురు.

స కామ కర్మయోగంతో శ్రీహరిని ఏకాంతమద్వయం శాంతం తస్మై భగవతే నమః అని ఆరాధింతురు.

7. సూర్యుని గమనము

నారాయణుడు నారదా! లోకాలోకమను పర్వతము కలదు. వెలుగు, అంధకారము అను రెండు లోకములు గలవు. ఈ స్థలము దేవతలకొరకే వినియోగింపబడును. మానవులు ఇందు నివాసముండరు. (లోకము అనగా ప్రకాశించునది. అలోకమనగా అంధకారముతో ప్రకాశించునది అని అర్థం).

సూర్యుని నుండి ధ్రువుని వరకు సకల గ్రహములు యీ పర్వతాధీనము నుండును. శ్రీహరి విరాజమానుడై, దిగ్గజముల, సాత్విక, విశుద్ధ

గుణములచేత అష్టసిద్ధులు సంలగ్నమగుచుండును. విష్వక్సేనాది పార్షదులు నిలుచొనియుందురు.

స్వర్గమునకు పృథివికి గల మధ్యభాగము నందు బ్రహ్మాండ మధ్యమున సూర్యుడు విరాజిల్లును. సూర్యమండలము ఇరువదియైదు కోట్ల యోజనముల దూరముననున్నది. అండము నందు విరాజమానుడై 'మార్తాండు'డని పిలువబడును. హిరణ్యగర్భుడని కూడా చెప్పబడును.

క. మృతమగు నండంబున ను
ద్ధితుఁడై మార్తాండుడయ్యె దినకరుడు మహా
మతియుత హిరణ్యగర్భత
నతికె హిరణ్యాండ భవము నంది మునీశా!

క. రవివలన దిక్కు లొదవెన్
రవి వలనం గాలములును రవినొందె సదా
రవి వలన గిరులు నదులును
భవమందె నస్సర్వజంతు భావము గలిగెన్

క. రవి వృక్షంబులఁ బెంచున్
రవియుదకము లిచ్చు దేవ రాజిని నరులన్
రవియె ప్రకాశింపించును
రవి తిర్యగ్జంతువితతి రాజిలజేయున్ (మ.క.దా.శ్రీ)

సూర్యుడు ఉత్తరాయణ కాలము నందు ప్రచండ తేజస్సుతో ప్రజ్వరిల్లుచునేయుండును. దక్షిణాయన మార్గమున పయనించునపుడు పగటి సమయము తక్కువగ, ఉత్తరాయణస్థానమున సమయము ఎక్కువగను, సూర్యుని గమము సమానముగా అంటే పగలు రాత్రి పరిమాణములో మార్పులేకుండా వుండే సమయమును 'విషువత్' అని అందురు.

ధ్రువుని ఆదేశానుసారం పవనుడు, పాశము సూర్యరథమును లాగును. మేరు పర్వతమునకు తూర్పు దిక్కున ఇంద్రుని పట్టణము కలదు, దక్షిణ భాగమున యమరాజు యొక్క మహానగరముయున్నది. నిమ్నలోచని యను గొప్పనగరమున వరుణదేవుడు ఉండును. విభావరి యనుపేరుతో చంద్రుని నగరము సుమేరు పర్వతమునకు ఉత్తర దిశయందు కలదు. సూర్యుడు ఇంద్రుని నగరమున ఉదయించును.

చంద్రుడు, మిగతా గ్రహములన్నియు నక్షత్రములతోపాటు ఉదయించుచుండును. అస్తమించుచుండును. సూర్యుని రథమునకు ఒకే ఒక చక్రముండును. ఇందు పన్నెండు ఆకులు, మూడు ఇరుసులు, ఆరు పూటీలు ఉండును. ఈ రథము ఇరుసుకొన సుమేరు పర్వతము మీద మరియొక ఇరుసు మానసోత్తర పర్వతము మీదయుండును.

సూర్యుడు రథము మీద కూర్చొను స్థలము ముప్పది ఆరులక్షల యోజనములపొడవును, తొమ్మిది లక్షల యోజనముల వెడల్పును కలిగియుండును. అరుణుడు ఈ రథమునకు సారథి. గాయత్రి మొదలుగా గల ఏడు ఛందస్సులు ఏడు గుఱ్ఱములుగ చెప్పబడును. ఈ అరుణుడు గరుడుని అగ్రజుడు. వాలఖిల్యాది మహర్షులు ఆదువది వేల మంది సూర్యుని ఎదుట చేసి వేదసూక్తములతో స్తుతించుచుందురు.

సూర్యుడు సర్వవ్యాపి. సుప్రసిద్ధదైవము. తొమ్మిది కోట్ల యాభైలక్షల యోజనములు నిత్యము పృథివి మీద తిరుగుచుండును. సూర్యగమనము ఒక్కక్షణమునకు రెండు వేల యోజనములు, పృథివి మీద తిరుగుచుండును.

చ. ఇరువదిరెండు ఱెక్కల నహీనత సూర్యుడు జుట్టిరాగ వ
త్సరమగు వత్సరంబునకు ద్వాదశమాసము లొక్కమాస మి
ద్ధరణి సపాదభద్వయగతామరసాప్తనిచేతఁ జెల్వగున్
బరగెడి పక్ష మర్ధమయి నన్ ఋతువయ్యెడు నాఱుమాసముల్

తే.గీ. కాలచక్రంబు సగము నక్కమలహితుడు
దిరుగ నయనంబటంద్రు సుధీవరేణ్య
లంతయును జుట్టివచ్చిన నబ్దమంద్రు
దానిc బంచవిధంబులc దలచుచుంద్రు (మ.క.దా.శ్రీ)

8. గ్రహముల గమనము

కాలచక్రముతోపాటు గ్రహములన్నియు మేరు పర్వతమునకు ప్రదక్షిణ యొనర్చుచు తమ లక్ష్యమును వదలకుండును. సూర్యభగవానుడు కాలచక్రము మీద స్థితుడై వ్యవహరించును. సూర్యుడు క్రమముగ ఈ పండ్రెండు నెలలను మాసమునకు శుక్ల, కృష్ణ అను రెండు పక్షములుండును. సంవత్సరమునందలి ఆరవ భాగమును ఋతువు అందురు.

సూర్యుని వలెనే చంద్రుడు కూడా సంచరించును, సూర్యకిరణముల కంటె చంద్రుడు ఒక లక్షయోజనములపైన ఉండును. చంద్రుని ఔషధుల స్వామియని చెప్పుదురు. చంద్రుడు అనాదియని, సోమయుడు, అన్నమయుడు, అమృతధార, సుధాకరుడు అని ఇతని నామములు. దేవతల, పితరుల, మానవుల, సరీసృపముల, వృక్షములు మొ॥ ప్రాణుల ప్రాణములను పోషించుట చంద్రుని స్వభావము.

చంద్రుని స్థానము నుండి మూడు లక్షల యోజనముల పైన నక్షత్రమండలము కలదు. ఈ నక్షత్రములు అభిజిత్ మొదలుకొని ఇరవై ఎనిమిది కలవని భావించెదరు.

నక్షత్రములకు రెండు లక్షల యోజనములపైన శుక్రుడుండును. శుక్రుడు సూర్యుని వెనువెంట తిరుగును. శుక్రుని శుభగ్రహమని చెప్పుదురు.

శుక్రుని స్థానము నుండి రెండు లక్షల యోజనములపైన బుధుని స్థానము కలదని చెప్పుదురు.

బుధునికంటె రెండు లక్షల యోజనములపైన కుజగ్రహము ఉండును. ఇతనివలన అందరికిని కీడు సంభవించును. ఇతనికి రెండు లక్షలయోజనముల దూరమున బృహస్పతి వసించును. బృహస్పతి బ్రాహ్మణ కులమునకు అనుకూలుడు. బృహస్పతి నుండి రెండు లక్షల యోజనములకు పైన భయంకరుడగు శని స్థానము కలదు. శనికి తండ్రి సూర్యుడు. శని అందరికిని కీడు చేయునని కాలజ్ఞులైన పురుషులు చెప్పుదురు. శనిగ్రహమునకు పదుకొండు లక్షల యోజనముల దూరమున సప్త ఋషిమండలము కలదని తెలుపుదురు.

సప్తర్షి మండలము నుండి పదమూడు లక్షల యోజనములపైన ఉత్తమమైన ధ్రువలోకము కలదు. దీనిని విష్ణుపదమని అందురు. ధ్రువునికిది నివాస స్థలము. తండ్రి ఉత్తానపాదుడు సకలజగత్తు, ఇంద్రుడు, అగ్ని, కశ్యపుడు, ధర్ముడు వీరందరు కలిసి దర్శించుచు ప్రదక్షిణ చేయుచుందురు.

దేవతలచే పూజింపబడు ధ్రువుడు తన తేజస్సుచేతనే ప్రకాశమానుడైయుండును. శ్రీహరి యొక్క మాయ నాధారముగ చేసికొని స్థితమై ఈ జ్యోతిశ్చక్రమును శిశుమార రూపమున వర్ణించెదరు. కుండలీభూత శరీరుని అగ్రభాగమున ధ్రువుడు వాలమునకు మూలభాగము నందు ప్రజాపతి, అగ్ని, ఇంద్రుడు, ధర్ముడు తోకకు చివరి భాగమున ధాతవిధాతయని, కటి భాగమునందు సప్తర్షి గణములు శోభిల్లుచుందురు.

పురుషుడు ప్రతిదినము సాయంకాల సమయమున "ఓం నమో జ్యోతిర్లోకాయ కాలాయానిమిషామృతియే మహా పురుషాయాభి ధీమహి" అని జపించవలెను.

సూర్యుని నుండి పదివేల యోజనముల క్రింద రాహుమండలము కలదు. సింహిక గర్భమునుండి జన్మించెను. రాహువు నక్షత్రమువలె సంచరించును. సూర్యబింబము పదివేల యోజనముల విస్తారమును,

చంద్రుడు పండ్రెండువేల యోజనముల విస్తృతిని కలిగియున్నాడు. రాహువు పదుమూడు వేల యోజనములు విస్తారము కలిగియున్నాడు.

సూర్యచంద్ర బింబములను కప్పివేయుట యందే రాహువు (గ్రహణము) లగ్నము చేయును. రాహువు క్రింద సిద్ధచారణ, విద్యాధర లోకములు శోభిల్లుచుండును. ఇవి పదివేల యోజనముల విస్తారమును కలిగియున్నవని చెప్పుదురు. ఈ లోకములకు క్రింది భాగమున యక్షరాక్షసులకు, భూతప్రేత పిశాచములకు శ్రేష్ఠమైన విహార స్థలము కలదు.

దీనికి క్రింద వాయు ప్రసారమున్నంతవరకు మేఘములు కనిపించునంతవరకు అంతరిక్షలోకమని చెప్పుదురు. ఈ అంతరిక్ష లోకమునకు క్రింద మూడు యోజనములు దూరమున పృథివి కలదని చెప్పుదురు.

ఈ పృథివి క్రింద ఏడు మహారంధ్రములున్నవి. వాటిని 1) అతలము, 2) వితలము, 3) సుతలము, 4) తలాతలము, 5) మహాతలము, 6) రసాతలమని, 7) పాతాలము అని చెప్పుదురు. ఈ సప్త రంధ్రములు విషయభోగములు, ఐశ్వర్యములకు నిలయములు.

అతలము – పృథివి క్రింద మొదటి రంధ్రము అతలము. బలుడను పేరుగల దానవుడు నివసించును. అతని తండ్రి పేరు మయుడు. అతడు తొంబదియారు రకములైన మాయలనెరుగును.

వితలము – అతలమునకు క్రింది భాగమున వితలము కలదు. హరకేశ్వరుడనుపేరుతో శంకర భగవానుడు నివసించును. భవానితో కూడి విరాజమానుడైయుండును. శంకర పార్వతుల తేజస్సుతో హాటకియను పేరుగల నది ప్రవహించును.

సుతలము – వితలమునకు క్రింద సుతలము కలదు. ఇచట విరోచనుని కుమారుడు బలిచక్రవర్తి నివసించును. శ్రీహరి ముల్లోకముల

సంపదను ఇచటకు పంపెను. బలిని ఇచట నివసించుటకు ఆదేశించెను. ఇప్పుడు కూడా బలిచక్రవర్తి ఆధిపత్యము వహించును. ఒకసారి శ్రీహరి దానపాత్ర తీసుకొని బలిచెంతకు వెళ్ళి అర్థించగా బలిచక్రవర్తి సమస్త పృథివిని దానము చేసెను. ఆ దాన ఫలములతో కూడిన ఐశ్వర్యమును ఇంద్రునికిచ్చుటకే ఈ ప్రయత్నము. అప్పుడు బలిచక్రవర్తి తన భక్తిని ఇట్లు ప్రకటించెను.

ఉ. ఎవ్వని నామ మాత్మ స్మరి యించినమాత్రన కర్మబంధముల్
ద్రెవ్వగవచ్చు నెవ్వని యుదీర్ణకృపారస మబ్బెనేనియున్
గవ్వకు లోకమెల్ల గొఱ గాదు భ్రమం బడగున్ భయాదులుం
దవ్వుల నిల్చు నట్టి పరదైవము జేర గొఱంత యుండునే

మ. తనయైశ్వర్యములెల్లఁబో విడిచి నా తాతైన ప్రహ్లాదుడ
త్యనఘశ్రీవరపాదపద్మమకరందాయత్తచిత్తంబుతో
దనరెంగావున భార్గవీవిభుని పాదద్వంద్వమే దిక్కటం
చును వై రోచని భక్తిమార్గమున బుచ్చుం గాల మో తాపసా!

ప్రహ్లాదుడు భక్తిశ్రద్ధలు కలవాడు, నా హృదయము నందు దాస్యభక్తి ఉదయించవలెనని వరమడిగెను. విష్ణు భగవానుడు అపారసంపదలను ప్రహ్లాదునకు ఇవ్వబోగా భాగవతోత్తముడగు నా పితామహుడు వాటిని స్వీకరించలేదు.

ఇపుడు గూడా సుతలలోకము నందే విరాజమానుడైయున్నాడు. శ్రీమహావిష్ణువే అతనికి ద్వారపాలకుడుగా నుండుటకు అంగీకరించెను. జగత్తును రావణుడు జయించు ఉద్దేశముతో సుతలలోకమున ప్రవేశింపచూచెను. శ్రీహరి తన కాలిబొటనవ్రేలితో ఒక్క త్రోపుతోసి పడవేసెను.

తలాతలము – సుతల లోకమునకు క్రింద వున్నది తలాతలము, ఇచట మయుడు నివసించును. శంకరుడు మూడు పురములను

భస్మమొనరించి త్రిపురమను నగరమును నిర్మించి మయుని ఇచట నుండుటకు ఏర్పాట్లు చేసెను.

మహాతలము – తలాతలమునకు క్రింద మహాతలము కలదు. కద్రువ వంశజులైన సర్పసమాజముండును. కుహుకుడు, తక్షకుడు, సుషేణుడు, కాళీయుడు అను అనేక తలలుగల పెద్దపెద్ద ఫణములుండును.

రసాతలము – మహాతలమునకు క్రింది రంధ్రమున రసాతలముండును. ఇక్కడ దానవులకు నివాస స్థలము. కాలేయులు, హిరణ్యపురవాసులు అను పేర్లతో ఖ్యాతి వహించిరి. ఇంద్రుని ఒక దూత పేరు సరమ. ఆమె అనేక మంత్రములను ఆవిష్కరించెను.

పాతాళలోకము – రసాతలము క్రింద పాతాళలోకము కలదు. ఇచట నాగలోకాధిపతియు, అనేక సర్పములు నివసించును. వీరిలో వాసుకి అతిముఖ్యుడు. శంఖుడు, కులికుడు, శ్వేతుడు, ధనంజయుడు, మహాశంఖుడు, ధృతరాష్ట్రుడు, శంఖచూడుడు, కంబలుడు, అశ్వతరుడు, దేవదత్తుడు అనువారలు. వీటికి అనేక తలలు. తలలపై మణులు మిగుల ప్రకాశవంతములు.

ఈ పాతాళమునకు క్రింద అనంతము అనే తామస కళ విరాజమానమై యుండును. అనంతుడు, ఆదిశేషుడు సమస్త మస్తకములతో శోభిల్లుచుండును. వేయి తలల మీద యీ భూమండలము నిలిచియుండును. దేవతలు, సిద్ధులు, అసురులు, నాగులు, గంధర్వులు, మానవుల ద్వారా ఆ ప్రభువు నిరంతరము ధ్యానింపబడుచుండును.

స్వామి కంఠసీమయందు వైజయింతిమాలను ధరించును. శేషుడు ప్రముఖదైవమని పురుషులు నుడివెదరు. ఏనుగు మీద అంబారిపరచినట్లు ఇతని మీద స్వర్గమయమగు పృథివిశోభిల్లుచుండును.

9. అనంతుని యశస్సు

నారదుడు బ్రహ్మ మానసపుత్రుడని చెప్పుదురు. అనంతుని ఆరాధించుచు గానము చేయసాగెను. ఆయన దర్శనమును పొంది జగదుత్పత్తి, స్థితిలయములకు హేతుభూతుడు, శేషునకు వెయ్యి మస్తకములు గలవు. పర్వతములు, నదులు, సముద్రములు, సమస్త ప్రాణులతో సుశోభితమైన ఈ భూమండలమును తన మస్తకము మీదనే నిలిపియున్నాడు. సాత్విక శ్రద్ధ యున్నచో సుఖప్రదమైన గతిని కలిగించును. రాజసశ్రద్ధ కష్టమును కలిగించు గతిని, తామస శ్రద్ధ దుఃఖమును కలిగించును. త్రిలోకములలో దక్షిణ దిశయందు పితృగణములు నివసించెదరు. తమ వంశజులకు శుభము కలుగవలయునని ఆకాంక్షించెదరు. ఇచటనే యమరాజు కూడ వశించును.

మరణించిన ప్రాణులను ఇచటకు తీసుకొని వచ్చెదరు. దండ విధానమును అమలు పరచుట యమధర్మరాజు ప్రధాన కర్తవ్యము. నారదా! నరకముల సంఖ్య ఇరువది ఒక్కటి అని చెప్పబడినది. అవి ఏమిటో వినుము.

10. నరకముల వివరణ

నారదా! నరకములు వాటి వివరణ వివరించెదను ఆలకించుము.

1. తామిస్రము : ఇతరుల ధనమును, స్త్రీలను, పుత్రులను అపహరించువాడు తామిస్రమను పేరుగల నరకమున బాధింపబడుదురు.

2. అంధతామిస్రము : భర్తను మోసగించి అతని భార్యను లోబరచుకొనినచో ఆమెతో సంగమించినచో అట్టివారు అంధతామిస్ర నరకమున పడుదురు. వారు నేత్రములు పోగొట్టుకొని అంధులగుదురు.

3. రౌరవము : ఇది నాది, ఇది నేను అని కుటుంబపోషణము నందే నిమగ్నులైనవారు, ఇతరులను ద్రోహమొనరించువారు రౌరవమను

నరకమున బడుదురు. ''రురు'' అను పేరుగల జంతువులుగ రూపొందుదురు.

4. మహారౌరవము : ఈ "రురు" అనెడి జంతువులు నరకమునపడిన జీవుని క్షతగాత్రుని చేసి ఆ మాంసమును తినుచుండును.

5. కుంభీపాకము : పశుపక్ష్యాది జీవులను చంపి వండుకొందురు. అట్టివారిని కుంభీపాకమను నరకమున త్రోసివేయుదురు.

6. కాలసూత్రము : తండ్రితో, బ్రాహ్మణునితో శత్రుత్వమును పెంచుకున్న ప్రాణిని 'కాలసూత్రము' అను పేరుగల నరకమును పొందును.

7. అసిపత్రము : వేదవిహిత ధర్మమార్గమును వదలిన వానిని "అసిపత్ర"మను నరకమున పడవేయుదురు. అంటే కత్తుల అంచులుతో వాని శరీరమంతయు ఛిన్నాభిన్నమగుచుండును.

8. సూకరముఖము : రాజులు అధర్మపూర్వకముగ శాసించినను బ్రాహ్మణులకు శారీరక దండన విధించినను సూకర ముఖము అను నరకము నందు పడవేయుదురు. చెరకు గడను పిప్పి చేసినట్లు పిప్పి చేయుదురు.

9. అంధకూపము : వేదవిహిత ధర్మమార్గమున జీవితమును గడుపువానిని కష్టపెట్టినచో అట్టివాడు అంధకూపమను నరకమునపడును. జంతువులు వారిని బాధింపసాగును.

10. క్రిమిభోజనము : భోజన పదార్థములను పంచయజ్ఞమొనరించి ఆయా దేవతలకిడి తదుపరి భుజింపవలెను. దీనిని ఆచరించని వానిని యమదూతలు ఆ పాపిని క్రిమిభోజనమను నరకమున పడవేయుదురు.

11. సందంశము : బ్రాహ్మణులనుండిగాని దొంగతనముగా బంగారము గాని, రత్నములు గాని అపహరించువానిని 'సందంశ'మను నరకమును త్రోసివేయుదురు. కాలుచున్న లోహములతో ఇక్కడ గ్రుచ్చుచుందురు.

12. తప్తమూర్తి : గమ్యమెరుగని స్త్రీతో సంగమించినను, లేక స్త్రీ అగమ్యుడగు పురుషునితో రమించినను, 'తప్తమూర్తి' అను నరకమున పడవేసి కొరడాలతో కొట్టుచుందురు. మండుచున్న లోహపు పురుష ఆకారములో స్త్రీని కౌగలింపచేయుదురు. ఎఱ్ఱగా కాలిన స్త్రీ ఆకారముతో పురుషుని కౌగిలింపచేయుదురు.

13. శాల్మలి : పశువులు మొదలగు ప్రాణులతో వ్యభిచరించువానిని శాల్మలి అను పేరుగల నరకమున పడవేయుదురు.

14. వైతరణి : రాజులు గాని, ధర్మ మర్యాదను పాలించకపోయినను వైతరణి అను నామము గల నరకమున పడుదురు. ఈ నదిలో జలచరములు నలువైపుల నుండి పీక్కుతినుచుండును.

15. పూయోదము : ఉన్నత కులము నందు జన్మించి శూద్ర స్త్రీకి భర్తయై పశువు వలె వ్యవహరించువాడు 'పూయోద'మను నరకమును ప్రాప్తించును. అక్కడ మలమూత్రములు, కషము, రక్తమాంసములను తినిపింతురు.

16. ప్రాణరోధము : వేట యందు ప్రేమ కలిగియుండువారు, పశు హననము చేయువారు 'ప్రాణ రోధ'మను నరకమున పడవేసి పదునైన బాణములతో గ్రుచ్చెదరు.

17. విశసనము : దంబాచార ప్రదర్శన కొరకు యజ్ఞముల నేర్పాటుచేసి పశువులను బలి ఇచ్చువారు విశసనము అను నరకమున పడవేయుదురు. కొరడాలతో కొట్టెదరు.

18. లాలాభక్షము : సగోత్రురాలగు స్త్రీతో సంగమించినచో లాలాభక్షమను నరకమున త్రోయుదురు. వారిని బలవంతముగ వీర్యమును త్రాగించెదరు.

19. సారమేయోదనము : రాజులు రాజపురుషులు అగ్ని నంటించినను విషము నిచ్చినను 'సారమేయోదన' అను నరకమునకు తీసికొనిపోవుదురు.

ఏడు వందల ఇరువది సారమేయములు (కుక్కలు) ప్రాణులను ముక్కలు ముక్కలు చేసి తినును.

20. అవిచి : అసత్యములు పలుకువారు, దొంగసాక్ష్యము చెప్పువారు, పాపబుద్ధి కలవారు మృత్యువు తరువాత 'అవిచి' అనుపేరు గల నరకమున పడత్రోయబడుదురు. రాళ్ళతో పరచిన భూమి జలమువలె కన్పించును. వాటిమీద పడిన ప్రాణుల అంగములన్నియు ముక్కలగును.

21. అయఃపానము : బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు మదిర త్రాగినచో అయఃపానమను నరకమున పడవేయుదురు. మండుచున్న లోహపు ఇనుప ముక్కలతో ముఖమునందు గ్రుచ్చుదురు.

22. క్షారకర్దమము : జన్మము, తపస్సు, విద్య, ఆచారములతోనున్న శ్రేష్ఠులైన పురుషులను సన్మానించనివాడు 'క్షారకర్దమము' అను నరకమున పడును.

23. రక్షోగణ భోజనము : మానవుడు నరబలి ద్వారా భైరవ యక్షులు యజనములు చేయుదురు. స్త్రీలు నరపశువుల మాంసమును తినిను 'రక్షోగణ భోజనము' అను నరకమున పడవేయుదురు. ఈ లోకమున ఎవరిని చంపుదురో తిందురో వారందరు ఈ నరకమును చేరుకొందురు.

24. శూల ప్రోతము : విలాసములకు శరీరములందు ముళ్ళను గ్రుచ్చుచు తాళ్ళతో బంధించుచు బాధించుచుందురు. అట్టివారు శూలప్రోతమను నరకమున పడిపోవుదురు. వారి అంగములన్నియు శూలములతో గ్రుచ్చబడును. వారు చేసిన పాపములు గుర్తువచ్చును.

25. దందశూకము : మానవులు సర్పములవలె ప్రాణులను భయపెట్టుచుండును. వారు మరణించి 'దందశూక'మను నరకమున త్రోయబడుదురు. సర్పములు వారిని కాటువేయుచుండును.

26. అవటారోధము : ఇతరులను వెలుతురు లేని ఇళ్ళలో నివసించుటకు వివశులను చేసినచో 'అవటారోధము'ను నరకమున పడుదురు. యమదూతలు విషాగ్ని పొగలచేత బాధించెదరు.

27. పర్యావర్తనము : గృహయజమానులైన ద్విజులు అతిథులను పాపపు దృష్టితో చూచినచో 'పర్యావర్తన'మను పేరుతో ఖ్యాతి వహించినది.

28. సూచీ ముఖము : జన్మతః ధనవంతుడనని అభిమానమదోన్మత్తుడై ఇతరులను వక్రదృష్టితో చూచువాడు 'సూచీముఖ'మను నరకమున పడవేయబడును. యమరాజు వారిని సూదులతో గ్రుచ్చి వేధించును.

మునీంద్రా! పాపులగు మనుష్యులు ఈ నరకలోకములకు వెళ్ళెదరు. ధర్మపరాయణులగు పురుషులు సుఖప్రదములగు లోకములకు వెళ్ళెదరు. వీటిని గుర్తించిన మానవుడు నరకమునకు వెళ్ళడు. జగదంబ సంసార రూప సాగరము నుండి మానవులను ఉద్ధరించును.

11. దేవ్యారాధన విధానము

నారాయణుడు నారదా! భగవతి పూజావిధానమును తెలిపెదను వినుము. ప్రతిపద తిథియందు ఆవు నెయ్యితో పూజించవలెను. షోడశోపచారములతో పూజించి గోఘృతమును నైవేద్యముగ సమర్పించవలెను. ఫలితము – రోగగ్రస్తుడు కాకుండును.

ద్వితీయ తిథియందు చక్కెరతో నివేదించిన దీర్ఘాయుష్మంతుడగును. తృతీయ తిథియందు పాలతో పూజించిన ముక్తుడగును. చతుర్థీ తథియందు అపూపములను దేవికి అర్పించిన విఘ్నములు కలుగవు. పంచమి నాడు అరటి ఫలములు నివేదించిన బుద్ధి వికసించును. షష్ఠినాడు పూజయందు తేనె వాడిన సుందర రూపము పొందుదురు. సప్తమీ తిథియందు బెల్లము సమర్పించిన శోకముక్తుడగును. అష్టమి తిథియందు నారికేళము నివేదించిన సంతాపములు కలుగవు. నవమినాడు పేలాలు సమర్పించిన ఇహపర లోకములందు సుఖింతురు. దశమి నాడు నల్లని నువ్వులు సమర్పించిన యమలోక భయము తొలగును. ఏకాదశినాడు దధిని భోగముగా పెట్టిన దేవి సంతుష్టురాలగును. ద్వాదశినాడు అటుకులు

నివేదించిన సంతాన వంతులగుదురు. త్రయోదశినాడు శనగలు సమర్పించవలెను. చతుర్దశి నాడు పేలపిండిని నివేదించిన శంకరుడు ప్రసన్నుడగును. పూర్ణిమ, అమావాస్య నాడు పాయసమును నివేదించిన పితరులు తృప్తి చెందుదురు. ఆదివారము నాడు పాయసముతో, సోమవారము పాలతో, మంగళవారము అరటిపండ్లతో, బుధవారము వెన్నతో, గురువారము కలకండతో, శుక్రవారము చక్కెరతో నివేదనలు కొనసాగించవలెను.

ఇరువది ఏడు నక్షత్రములందు దేవికి – నెయ్యి, నువ్వులు, చక్కెర, పెరుగు, పాలు, మీగడ, లడ్డు, చల్ల, బూరెలు, బెల్లము, ఉండ్రాళ్ళు, కజ్జికాయలు, వెన్న, దోసకాయలు, గుమ్మడి, పనస, నేరేడు, మామిడి, నారింజ, దానిమ్మ, రేగుపండ్లు, ఆమలకము, కొబ్బరికాయ, శనగలు, అటుకులు, పాయసము, అప్పడాలు, వడియాలు, ఖర్జూరము, పెసరలడ్డూలు, అపూపములు, ద్రాక్ష, మాదిఫలము, నైవేద్యము నందు సమర్పించుట పవిత్రములు.

కరణ సంబంధమైన నైవేద్యమును సమర్పించు విధము చెప్పెదను వినుము. కసారము, మండకము, ఫేని మోదకము, పాపడ, లడ్డు, ఘృతపూరము, నువ్వులు, పెరుగు, నెయ్యి, తేనె, ఈ పదార్థములతో నైవేద్యము సమర్పించవలెను.

చైత్ర మాస శుక్లపక్ష తృతీయ నాడు ఇప్ప వృక్షమును పూజింపవలెను. ప్రతి తృతీయ పండ్రెండు నెలలు పూజ చేయవలెను. వైశాఖ మాసమున బెల్లముతో, జ్యేష్ఠ మాసమున మధువు నర్పిస్తూ, ఆషాఢము నందు మధూకరసముతో, శ్రావణము నందు పెరుగు, భాద్రపదము నందు చక్కెర, ఆశ్వయుజము నందు పాయసము, కార్తీకము నందు పాలు, మార్గశిరము నందు ఫేని, పుష్యమాసము నందు దధికూర్చిక, మాఘమాసము నందు ఆవు నెయ్యి, ఫాల్గుణము నందు కొబ్బరికాయలు నివేదించి పూజింపవలెను.

భగవతిని మంగళ, వైష్ణవి, మాయ, కాళరాత్రి, దురత్యయ, మహామాయ, మతంగి, కాళి, కమలవాసిని, శివా, సహస్రచరణ, సర్వమంగళ రూపిణి, ఈ పండ్రెండు నామములతో మధూక వృక్షము (ఇప్పచెట్టు) నందు భగవతిని భావన చేసి పూజింపవలెను.

దేవి స్తుతి

సుగంధి -

తల్లి మమ్ము బ్రోవవమ్మ దాసకల్ప వృక్షమా
కల్లగాదు నీదు పూజకన్న వేరె యున్నదే
చెల్ల బో భవత్పదాబ్జ సీధుపానమత్తులన్
దల్లడిల్ల జేయలేరు ధర్మరాజుకింకరుల్

పంచచామరం -

జొహారు నీకు సుందరీ కృశోదరీ
జొహారు నీకు సర్వలోకశోభినీ ఖలార్దినీ
జొహారు నీకు భామయీ యశోమయీ కృపామయీ
జొహారు నీకు భక్తి రక్తి సూక్తి ముక్తిదాయినీ

పంచచామరం -

జొహారు నీకు శాంకరీ త్రిశుద్ధిమత్సుఖంకరీ
జొహారు నీకు దుష్టలోకశోషిణీ సుభాషిణీ
జొహారు నీకు భక్తలోకశోక మోహ హారిణీ
జొహారు నీకు భూర్యవార్య సూర్యబింబవర్తినీ

క. యమ నిగ్రహ రూపాధ్యవు
యమపూజ్యవు దేవి నీవు యమున గ్రజవున్
యమ నియమాది వినోదివి
యమలోకాభారకర్త్రివగుదువు తల్లీ

తే.గీ. రావి మర్రి వేము మావి వెల్లయు రేగు
పనస జిల్లెడు మరి బాల చెట్టు
నీకు నున్కివట్లు లోకైకపాలిని
కంట జూచి మమ్ము కావుమమ్మ

తే.గీ. దుగ్ధవల్లి యింటి దొరసాని వీవకా
జ్వరము లెల్ల దోలు శక్తివగుచు
రోగజాతిబట్టి రోకళ్ళదంచెడు
మ్రొక్కులిడుదుమమ్మ చక్కనమ్మ! (మ.క.దా.శ్రీ)

ఈ స్తోత్రము నిరంతరము పఠించు మానవునకు ఆధి-వ్యాధులు శత్రుభయము ఉండదు.ధనార్థి ధనమును, ధర్మార్థి ధర్మమును పొందును.

బ్రాహ్మణుని వేదసంపన్నునిగ, క్షత్రియుని విజయవంతునిగ వైశ్యుని గొప్ప ధనవంతునిగ, శూద్రుని పరమసంతుష్టునిగ చేయును. శ్రాద్ధ సమయమున ఈ స్తోత్రము పఠించినచో పితరులకు ఒక కల్పము వరకు స్థిరమైయుండు అక్షయతృప్తి ప్రాప్తించును. ఆ దేవిని ఉపాసించుట చేత పుత్రపౌత్రుల వృద్ధి కలుగుచుండును. స్వర్గమును చేరుదురు. యమ భటులవలన భయముండదు అని మనకు నారాయణుడు నారదునకు చెప్పగా మీకు తెలియజేసితిని.

12. ప్రకృతి - అంశము - కళ - వివరణ

నారాయణుడు నారదా! గణేశుని జనని దుర్గ, లక్ష్మి సరస్వతి, సావిత్రి, రాధ - ఈ దేవీమణులు ప్రకృతియని చెప్పగా నారదుడు దేవీమణులు చరిత్ర, పూజావిధానము చెప్పమని కోరాడు.

నారదా! 'ప్ర' అనగా ప్రకృష్టమని అర్థము. 'కృతి' యనగా 'సృష్టి'యన్న అర్థము బోధపడును. సత్వగుణ అర్థము నందు 'ప్ర' శబ్దము రజోగుణ అర్థము నందు 'కృ' అను శబ్దము, తమోగుణ శబ్దము 'తి' అనుశబ్దము

ప్రయోగింపబడినది. దేవియే ప్రకృతి అని చెప్పబడును. పరబ్రహ్మ దక్షణ సగభాగము పురుషుడుగ, ఎడమ సగ భాగము ప్రకృతిగా భాసిల్లినది. ఆ ప్రకృతియే బ్రహ్మస్వరూప, నిత్య సనాతని పరమయోగులు 'సత్-అసత్' సమస్తము బ్రహ్మమయమని చెబుతుంటారు. శ్రీ కృష్ణుడు మనస్సులో సృష్టించవలెనను కోరిక కలిగినతోడనే 'మూలప్రకృతి'యగు పరమేశ్వరి ప్రకటితురాలైనది. ఆ దేవి అయిదు రూపములలో పరిణతి చెందెను.

మొదటిది దుర్గ శంకరుని భార్య. నారాయణి, విష్ణుమాయ, పూర్ణ బ్రహ్మ స్వరూపిణిగా దేవి ప్రసిద్ధురాలు. యశస్సు, శుభము, సుఖము, మోక్షము, హర్షము వీరిస్వాభావిక గుణములు. సూర్యుని శక్తి వారిలో రూపము దాల్చినట్లున్నది.

సిద్ధేశ్వరి, సిద్ధిరూపా, సిద్ధిదా, సిద్ధి, ఈశ్వరి, బుద్ధి, నిద్ర, క్షుధ, పిపాసా, ఛాయా, తంద్రా, దయ, స్మృతి, జాతి, క్షాంతి, భ్రాంతి, శాంతి, కాంతి, చేతన, తుష్టి, పుష్టి, లక్ష్మి, ధృతి, మాయ - ఇవన్నియు వారి నామములే. శ్రుతులందు వీరి యశస్సు గానము చేయబడినది.

రెండవ రూపము లక్ష్మి శ్రీహరి యొక్క శక్తి. సంపదలకు అధిష్ఠాన దేవినిగాపరిగణింతురు. సహజముగనే లోభ, మోహ, కామ, క్రోధ, మద, మాత్సర్యాది దుర్గుణరహిత, భక్తులననుగ్రహించునది. స్వర్గము నందు స్వర్గ లక్ష్మి, రాజులవద్ద రాజ్యలక్ష్మి, గృహస్థుల ఇంట గృహలక్ష్మిగా ఆ దేవి విరాజమానురాలైయుండును. ఈ విషయము వేదము నందు చెప్పబడినది.

మూడవ రూపము సరస్వతి, వాక్కు, బుద్ధి, విద్య, జ్ఞానము, వ్యవస్థీకరించు దేవి. బుద్ధి, కవిత్వము, మేధస్సు, ప్రతిభ, స్మరణ శక్తి, యీ దేవి కృపవలననే మానవులకు సమకూరును. ఆమె హస్తము నందు వీణ, పుస్తకము ఉండును. ఆ దేవి శ్రీకృష్ణుని ఉపాసించును. సిద్ధి, విద్య

ఆమె స్వరూపము. ఆమె లేనిచో బ్రాహ్మణుడు మూగవానివలె మృతప్రాయుడై పడియుండును.

నాలుగవ రూపము సావిత్రి, నాలుగు వర్ణములవారికి తల్లులు, ఛందస్సు, వేదము, వారినుండియే ఆవిర్భవించినవి. ఈమె గాయత్రిగా పిలువబడును. మోక్షమును ప్రసాదించుట వారి స్వాభావిక గుణము.

అయిదవ దేవి శ్రీకృష్ణునకు ప్రాణములకంటే ప్రియమైనది. రాసక్రీడకు అధిష్టాత్రి రాధ, ఈమెను పరావర, సారభూత, పరమాద్య, సనాతని, పరమానందరూప, ధన్య, మాన్య, పూజ్య, అని పిలిచెదరు. నిత్యనికుంజేశ్వరి. గోలోకధామమున నివసించు యీ దేవి రాసేశ్వరి, సురసిక అను నామములతో ప్రసిద్ధురాలు.

ఈమె నిర్గుణ, (లౌకిక, త్రిగుణములు లేని, స్వరూపము గలది, గుణవతి) నిర్లిప్త (లౌకిక విషయ భోగరహిత) నిరాకార (పాంచ భౌతిక శరీరము లేనిది, దివ్య చిన్మయ స్వరూప) ఆత్మ స్వరూపిణి (శ్రీకృష్ణుని ఆత్మ) అను పేర్లతో విరాజిల్లుచున్నది. శ్రీ కృష్ణుని వక్షస్థలమున యీ దేవి విరాజమానయై యుండును. ఈమెను దర్శించుటకు బ్రహ్మ అరువది వేల సంవత్సరములు తపమాచరించెను. బృందావనము నందు భగవంతుని ఎదుట ప్రకటితయైనది.

దేవీమణుల యొక్క అంశలు, కళలు, కళాంశములు అనేక రూపములు. వీటి గుణములను వర్ణించెదను వినుము. గంగ వీరి అంశము. విష్ణుదేవుని పాదము నుండి ఈమె ఆవిర్భవించినది. గంగా జలములందు స్నానమాచరించుట వలన కైవల్య పదమును పొందుటకు అర్హుడగును.

శంకరుని జటాజూటమునందు నిలిచియుండెను. పాయలుపాయలుగా భారతదేశమును చేరుకొనెను. గంగ నారాయణునకు మిగుల ప్రియమైనది. మాలిన్య అహంకారములు ఈమెను లేశ మాత్రము తాకజాలవు.

శ్రీ తులసిని ప్రకృతిదేవి ప్రధాన అంశముగా భావించెదరు. విష్ణుదేవుని చరణములయందు సదా విరాజమానురాలైయుండును. తులసి స్పర్శ, దర్శనములచేత మానవులు పరమధామమునకు చేరుటకు అర్హులగుదురు. అగ్ని రూపమున యీ దేవి కలియందు ప్రవేశించినది. తులసి చరణ కమలముల స్పర్శ చేతనే యీ పృథివి పరమ పవిత్రురాలగును.

భారతదేశమునకు ఏతెంచిన కల్పవృక్ష స్వరూప, జరత్కారు కశ్యపుని మానస పుత్రిక. నాగరాజగు శేషుడు ఈమెను తన సోదరిగా అంగీకరించెను. నాగేశ్వరి, నాగమాతయని కూడా పిలిచెదరు. విష్ణువు మీద యీమెకు దృఢమైన శ్రద్ధ. ఈమె ముప్పది లక్షల దివ్య వర్షములు శ్రీహరిని గూర్చి తపమాచరించెను. జరత్కారు ముని భగవంతుడగు విష్ణ్వంశ ఆస్తీకునకు యీ దేవి తల్లి.

ప్రకృతి దేవి యొక్క ఒక్క ప్రధాన అంశను దేవసేనయని చెప్పుదురు. మాతృకలలో శ్రేష్ఠురాలు. ఈమెను షష్ఠి అను పేరుతో పిలిచెదరు. ఈమె తల్లి సంజ్ఞ. సంతానోత్పత్తి సమయమున షష్ఠియోగినిని పూజించెదరు. పుత్రోత్పత్తి జరిగిన ఆరవ దినమున లేదా ఇరువది ఒకటవ దినమున పూజ చేతురు.

ప్రకృతి దేవి యొక్క ప్రధాన అంశము మంగళచండి. ఈమె అనుగ్రహము వలన పుత్రులను, పౌత్రులను, ధనమును, సంపదలను, యశస్సును శుభమును పొందును. స్త్రీల మనోరథములను తీర్చుటయే ఈమె స్వభావము.

ప్రకృతి దేవి యొక్క ప్రధాన అంశము కాళి. భగవతి దుర్గ ఎదుట నిశుంభులను వారు ఎదుట నిలిచిరి. అప్పుడు ఈ కాళి దుర్గ లలాటము నుండి ప్రకటిత అయ్యెను. ఈమె దుర్గ యొక్క అర్ధాంశ. ఈమెను మించిన బలశాలులెవ్వరును లేరు. ఈమె నింతరము శ్రీకృష్ణుని చింతనతోనే

గడచును. కృష్ణుని రంగు కలిగివుంటుంది. ఈమె ఒక్క శ్వాసతో జగత్తును బ్రహ్మాండమను నష్టపరచగలదు. జగత్తును కాపాడుటకు దైత్యులతో యుద్ధమొనరించును. ధర్మ, అర్థ, కామ, మోక్షములన్నింటిని ప్రసాదించుటలో సంపూర్ణ సమర్థురాలు. బ్రహ్మాది దేవతలు, ముని గణములు, మనువు మొ॥వారు ఈమెను పూజింతురు.

ప్రకృతిదేవి యొక్క ప్రధాన అంశము నుండి 'వసుంధర' ప్రకటితమైనది. ఈ జగత్తంతయు ఈమె మీదనే నిలిచియున్నది. ఈమెను సర్వసస్యా, రత్నాకర, రత్నగర్భయని కూడా చెప్పుదురు. రత్నములు, గనులు ఈమెలో విరాజమానములైయున్నది. అందరికీ జీవనము సంపదలు ఇచ్చుటకే ఈమె ఈ రూపమును ధరించును.

నారదా! ప్రకృతి దేవి యొక్క కళలను వినుము. వారి పత్నులను చెబుతున్నాను. స్వాహా దేవి అగ్నికి పత్ని. యజ్ఞుని పత్ని దక్షిణ పితరులకు పత్ని స్వధా. ఈమె నామము నుచ్చరించకుండ పితరులకు సమర్పించిన వస్తువు నిష్ఫలమగును. వాయువు పత్ని పేరు స్వస్తి. ఈమె లేకుండ ఇచ్చిపుచ్చుకొనుటలు అన్నియును అసంభవములే. గణేశుని పత్ని పుష్టి. ఈమె లేనిచో స్త్రీ, పురుషులు శక్తిహీనులగుదురు.

అనంతుని భార్య తుష్టి. ఈమె లేకుండ సంతృప్తము కాదు. ఈశానుని భార్యపేరు సంపత్తి. ఈమె లేకున్నచో విశ్వము నందలి జనులు దరిద్రులని పిలువబడుదురు. కపిల ముని యొక్క పత్ని ధృతి. ఈమె లేనిచో సకల ప్రాణులు ధైర్యమును కోల్పోవుదురు. సత్వుని భార్య సతి. ఈమె లేకుంటే బంధు విహీనము కాగలదు.

దయ మోహమునకు పత్ని. ఈమె లేనిచో ప్రాణులు సర్వత్ర ఫలహీనులుగా భావించవచ్చును. పుణ్యుని సహధర్మచారిణి ప్రతిష్ఠ. ఈమె లేకపోయినచో బ్రతికి యుండి కూడ చనిపోయినవారితో సమానము.

సుకర్ముని పత్ని కీర్తి. ఈమె లేనిచో యశోవిహీనమై మృతప్రాయమగును. క్రియ ప్రయత్నమునకు పత్ని. ఈమె లేకుంటే ప్రపంచమంతయు విధిహీనమగును.

అధర్ముని పత్నిని మిథ్య అని అందురు. సత్యయుగమున ఈమె పూర్తి అదృశ్యరాలైయుండును. త్రేతాయుగమున సూక్ష్మరూపమును, ద్వాపర యుగమున అర్ధశరీరముతో, కలియుగము నందు మిథ్యాదేవిగా స్థూలముగ రూపొందును. సర్వత్ర తన ఆధిపత్యమును కలిగియుండును. బుద్ధి, మేధ, ధృతి అనునవి జ్ఞానునకు పత్నులు. వీటిని వదలిన ప్రపంచమంతయు మూర్ఖపూరితమై పిచ్చిదానివలెనుండును. సర్వత్ర తన ఆధిపత్యమును కలిగియుండును.

బుద్ధి, మేధ, ధృతి అనునవి జ్ఞానునకు పత్నులు. వీటిని వదలినచో ప్రపంచమంతయు మూర్ఖపూరితమై పిచ్చిదానివలె నుండును. ధర్ముని సహధర్మచారిణి పేరు మూర్తి. 'శ్రీ' మరియు 'మూర్తి' ఈ రెండును ఆమె స్వరూపములే. రుద్రుని పత్ని పేరు కాలాగ్ని. ఈమెను యోగనిద్ర అని కూడా చెప్పుదురు.

కాలునకు సంధ్య, రాత్రి, పగలు అను ముగ్గురు భార్యలు కలరు. వీరు లేకపోయినచో బ్రహ్మ సంఖ్యలను పరిగాగణించలేడు. క్షుధ, పిపాస లోభునకు భార్యలు. వీరు అనుకూలురు కాకపోయినచో జగత్తంతయు చింతలకు లోనగును. ప్రభ, దాహిక తేజస్సునకు పత్నులు. వీరు లేనిచో బ్రహ్మ తన కార్యము నందు అసమర్థుడగును. జ్వరమునకు జరా, మృత్యువు ఇరువురు భార్యలు. వీరు కాలునికి పుత్రికలు. వీరు లేనిచో జగద్వ్యవస్థ చెడిపోవును.

నిద్రయొక్క పుత్రిక పేరు తంద్ర. ప్రీతియును సుఖమునకు ప్రియమైనవారు. ఈ సకల జగత్తు వీరిచే వ్యాప్తమైయుండును. శ్రద్ధ,

భక్తియు వైరాగ్యమునకు భార్యలు. వీరి కృపవలన సకల జగత్తు జీవన్ముక్తమగును.

దేవమాతయగు అదితి, గోవులను ఆవిర్భవింపచేయు సురభి దైత్యులకు తల్లియైన దితి, కద్రువ, వినత, దనువు వీరందరును సృష్టికార్యమును నిర్వహించెదరు. వీరందరిని భగవతి ప్రకృతి యొక్క కళలు అని చెప్పుదురు.

చంద్రుని పత్ని రోహిణి, సూర్యుని భార్య సంజ్ఞ, మనువు భార్య పేరు శతరూప, ఇంద్రుని ధర్మపత్ని శచీదేవి. బృహస్పతి సహధర్మచారిణి తార. వశిష్ఠుని భార్య అరుంధతి. గౌతముని భార్య అహల్య. అత్రి భార్య అనసూయ. కర్ధమ ముునీంద్రుని ధర్మపత్ని దేవహుతి, దక్షుని పత్ని ప్రసూతి.

పితరుల మానసపుత్రి మేనక. లోపాముద్ర, కుంతి, కుబేరుని పత్ని వారుణి, బలి భార్య వింధ్యావళి, మరియు కాంత, దమయంతి, దేవకి, గాంధారి, ద్రౌపది, శైభ్య, సత్యవతి, వృషభానుప్రియ, రాధ, తల్లియగు కులీన, సాధ్వి, యశోద, మండోదరి, కౌసల్య, సుభద్ర, రేవతి, సత్యభామ, కాళింది, లక్ష్మణ, జాంబవతి, నాగ్నజితి, మిత్రవింద, రుక్మిణి, లక్ష్మియని పిలవబడు సీత, కాళీ, వ్యాసునకు జన్మనిచ్చిన యోజనగంధి, భానుని పుత్రిక ఉష, ఆమె సఖి చిత్రలేఖ, ప్రభావతి, భానుమతి, మాయావతి, పరశురాముని తల్లియగు రేణుక, బలరాముని జనని రోహిణి, ఏకనంద, శ్రీకృష్ణుని సోదరి పరమసాధ్విదుర్గ, భారతదేశము నందు ప్రకృతికి ఈ కళలన్నియు ప్రసిద్ధములు. గ్రామ దేవతలందరును ప్రకృతియొక్క కళలే.

ఎక్కడ స్త్రీలకు అవమానము కలుగునో అక్కడ ప్రకృతికి అవమానమగును. ఎనిమిది సంవత్సరములుగల బ్రాహ్మణ కుమారిని వస్త్రాలంకార చందనములతో పూజించినచో భగవతి ప్రకృతిని స్వయముగ పూజించినట్లగును.

శ్రేష్ఠ ఆచరణగల పతివ్రతా స్త్రీలు ఉత్తములుగ, భోగానుభవములు ఇష్టపడువారు మధ్యమ శ్రేణికి, సుఖమునను భవించుటకు నిమగ్నమైనవారు అధములని చెప్పబడుదురు. వీరు కులటలని చెప్ప బడుదురు.

సురథుడను మహారాజు దుర్గాదేవిని ఉపాసించెను. రావణుని వధించు కోరికతో శ్రీరాముడు ఈ దేవిని పూజించెను. ఈ దేవి మొదట దక్షుని యింట ప్రకటితమయ్యెను. శంకరుని దక్షుడు అవమానించగా ఈ దేవి తన శరీరమును పరిత్యజించెను.

ఆ తరువాత హిమాలయుని భార్య ఉదరమున జన్మించెను. శంకరుని తన భర్తగా చేసికొనెను. గణేశుడు, స్కందుడును వీరికి పుత్రులైరి.

మంగళుడు అను రాజు మొదట లక్ష్మీదేవిని ఆరాదించెను. రాజగు అశ్వపతి ముందుగా గాయత్రి అనుష్ఠానము చేసెను. బ్రహ్మ మొదట సరస్వతిని సత్కరించెను. గోలోకము నందలి రాస మండలమున భగవతి రాధ పూజింపబడెను.

గోపికలతో, గోపకుమారులతో శ్రీకృష్ణుడు రాధను పూజించెను. తదుపరి బ్రహ్మ, దేవతలు, ముని గణములు పుష్పధూపాది సామగ్రితో ఈ దేవిని పూజించి నమస్కరించిరి. శ్రీ కృష్ణుని ఆదేశానుసారము మునిగణములు భక్తితో ఆ దేవి పూజయందు తత్పరులైరి. అప్పటి నుండి ప్రతి గ్రామము నందు గ్రామదేవతల పూజలు జరుగుచున్నవి.

13. సరస్వతి పూజావిధానము

నారదుడు నారాయణునితో మర్త్యలోకము నందు ఏ విధమైన పూజలు ప్రచారము నందు కలవు తెలియజేయమని కోరగా భగవంతుడగు శ్రీ కృష్ణుడు ఆ సరస్వతిని పూజించెను. ప్రతి బ్రహ్మాండమునందు మాఘ శు క్ల పంచమి విద్యారంభమునకు శుభ సమయమని మిగుల గౌరవముతో నిన్ను విస్తృతముగా పూజింతురు.

కుండయందుగాని, పుస్తకము నందు గాని నిన్ను ఆవాహనము చేయుదురు. నీ కవచమును భోజపత్రము మీద లఖించి దానిని సువర్ణ పాత్రయందు ఉంచుదురు. గంధ చందనాదులచే చక్కగా పూజించి ప్రజలు తమ కంఠసీమలందు గానీ, దక్షిణ భుజమునందు గానీ దానిని ధరించెదరు. విద్వాంసులు సమగ్రముగా నిన్ను స్తుతింతురు.

శ్రీ కృష్ణుడు స్వయముగా సరస్వతీ దేవిని పూజించెను. ఈ సరస్వతి పూజ కణ్వశాఖ యందు చెప్పబడిన పద్ధతిని తెలిపెదను. వినుము. మాఘ శుక్ల పంచమి శుభకరమైన తిథి. పూర్వాహ్ణకాలము నందే సంయమన శీలుడు కావలెను. నిత్యక్రియల తరువాత కలశస్థాపన చేయవలెను. మొదట గణేశుని పూజింపవలెను. ఇష్టదైవమగు సరస్వతిని పూజించుట సముచితమైనది.

షోడశోపచారములతో నైవేద్యము, వెన్న, పెరుగు, పాలు, పేలాలు, నువ్వుల లడ్లు, తెల్లని చెఱకు గడలు, బెల్లముతో చేసిన మధుర పక్వాన్నములు, పటిక బెల్లము, తెల్లని మధుర పదార్థములు, సాత్వికమగు అటుకులు, హవిష్యాన్నము, పరమాన్నము, మృష్టాన్నములు, కొబ్బరికాయలు, కొబ్బరినీరు, కంద మూలములు, అల్లము, వివిధ రకములైన పండ్లు నైవేద్యమునకుపయోగించు పదార్థములు.

శ్వేత పుష్పములు, కొత్త ధవళవస్త్రములు, శంఖము తప్పనిసరిగ ఉంచవలెను. సరస్వతి యొక్క శ్రీ విగ్రహము శుక్లవర్ణమైయుండును. ఒక చేతిలో వీణ, మరొక చేతిలో పుస్తకము రత్నములతో చేసిన ఆభరణములు, ప్రముఖ దేవతలతో ఆమె పూజింపబడుచుండును. అట్టి భగవతి సరస్వతీ దేవికి నేను ప్రణమిల్లుచున్నాను అని పూజా పదార్థములను సమర్పించవలెను.

"శ్రీ హ్రీం సరస్వత్యై స్వాహా" అని వైదిక అష్టాక్షర మూల మంత్రమును నారాయణుడు వాల్మీకి మునికి ఉపదేశించెను. సూర్యగ్రహణ సమయమున

పుష్కర క్షేత్రమునందు పరశురాముడు దీనిని శుక్రునకు ఉపదేశించెను. మారీచుడు చంద్రగ్రహణ సమయమున ప్రసన్నుడై దీనిని బృహస్పతికి తెలిపెను. బ్రహ్మదేవుని కృపతో భృగువు దీనిని తెలిసికొనగలిగెను. జరత్కారుముని ఆస్తీకునకు ఈ మంత్రమును బోధించెను. ఋష్యశృంగుడు విభాండకముని వలన ఈ మంత్రమును పొందెను. శివుడు కణ్వమునీంద్రునకు దీనిని ఉపదేశించెను. యాజ్ఞవల్క్యుడు, కాత్యాయనుడు సూర్యుని దయతో ఈ మంత్రమును పొందిరి.

శేషుడు పాతాళము నందు బలిచక్రవర్తి సభాభవనమున పాణినిని, భరద్వాజుని, శకటాయునికి ఈ మంత్రమును అధ్యయనము చేయించెను. సరస్వతీ కవచము విశ్వవిజేతను చేయును. భృగువు బ్రహ్మ ప్రార్థనతో అతనికీ మంత్రమును తెలిపెను. నేను నీకు తెలిపెదను వినుము.

శ్రీకృష్ణుడు బృందావనము నందు రాసమండలమున నాకీ కవచమును వినిపించెను. దీనిని ధారణ చేసిన ప్రభావముతో శుక్రాచార్యుడు సకలదైత్యులకు పూజనీయుడయ్యెను. బృహస్పతికి ఈ కవచ మహిమయే కారణము. వాల్మీకి మహర్షి సదా సరస్వతిని ధ్యానించుచుండును.

స్వాయంభువ మనువు, కణాదుడు, గౌతముడు, కణ్వుడు, పాణిని, శాకటాయణుడు, దక్షుడు, కాత్యాయనుడు ఈ కవచమును ధరించియే రచనలు చేసిరి. వ్యాసుడు వేదములను విభజించెను. సకల పురాణములను రచించెను.

శాతాతపుడు, సంవర్తకుడు, వశిష్ఠుడు, పరాశరుడు, యాజ్ఞవల్క్యుడు, ఋష్యశృంగుడు, భరద్వాజుడు, ఆస్తీకుడు, దేవలుడు, జైగీషవ్యుడు, యయాతి, ఈ కవచముతోనే సకల గ్రంథములను అధ్యయనము చేసిరి. ఈ కవచమునకు ఋషిప్రజాపతి, ఛందస్సు స్వయముగా బృహస్పతి మాత శారద అధిష్ఠాత్రిదేవి.

సరస్వతీ కవచము –

శ్రీం–హ్రీం–భగవతి సరస్వతి నా శిరస్సును రక్షించు గాక!
శ్రీమయియగు వాగ్దేవి నాలలాటమును రక్షించుగాక!
ఓం–హ్రీం–భగవతి సరస్వతి నా శ్రోత్రేంద్రియములను కాపాడు గాక!
ఓం–శ్రీం–హ్రీం–భగవతి సరస్వతి నా రెండు నేత్రములను రక్షించుగాక!
ఐం–హ్రీం–వాణి సదా నా నాసికను రక్షించుగాక!
ఓం–హ్రీం–తో విద్యకు అధిష్ఠాత్రి దేవి నా పెదవులను రక్షించుగాక!
ఓం–శ్రీం–హ్రీం–భగవతి బ్రాహ్మీదేవి దంతపంక్తిని రక్షించు గాక!
ఐం ఈ దేవి సరస్వతి ఏకాక్షర మంత్రము నా కంఠమును రక్షించుగాక!
ఓం–శ్రీం–హ్రీం–నాగళమును నా భుజములను సదా కాపాడుగాక!
ఓం–హ్రీం–సరస్వతి నా వక్షస్థలమును సదా రక్షించుగాక!
ఓం–హ్రీం–మయాదేవి నా నాభిని రక్షించుగాక!
ఓం–హ్రీం–క్లీం–దేవి వాణి సదా నా చేతిని కాపాడు గాక!
ఓం–స్వరూపిణి భగవతి నా రెండుకాళ్ళను సురక్షితముగా నుంచు గాక!
ఓం–వాక్–అధిష్ఠాత్రి దేవి ద్వారా అన్నివిధముల రక్షింపబడుదును గాక!
ఓం–స్వరూపాదేవి పూర్వదిశయందు నన్ను సదా రక్షించు గాక!
ఓం–స్వరూపిణియగు దేవి అన్ని కోణములందు కాపాడు గాక!
ఓం–ఐం–హ్రీం–శ్రీం–క్లీం–సరస్వత్యై బుధజనైః స్వాహా!

ఇది మంత్రరాజము. ప్రాచీన కాలమున గంధమాదన పర్వతము నందు ధర్మదేవుని ముఖము నుండి నాకు దీనిని విను సౌభాగ్యము కలిగినది. నీవు నాకు పరమ ప్రియమైనవాడివి. నీకు వినిపించితిని. గురువును పూజించి ఆయనతో ఈ కవచమును అధ్యయనము చేయవలెను. అప్పుడు ఈ కవచము సిద్ధించగలదు. ఇది కణ్వశాఖాంతరతము.

14. యాజ్ఞవల్క్య సరస్వతిస్తుతి

నారాయణుడు నారదా! ప్రాచీన కాలమున యాజ్ఞవల్క్యుడను ముని ఉండెను. అతడు సరస్వతిని స్తుతించినా గురుదేవుల శాపముతో అతనికి విద్యను నశింపచేసిరి. లోలార్క కుండలమునకు వెళ్ళి తపము చేయగా సూర్యుడు యాజ్ఞల్క్యునకు వేదములను, వేదాంగములను బోధించెను. మునీంద్రా! సరస్వతిని స్తుతింపుము. ఇట్లు పలికి సూర్యుడు అంతర్ధానమయ్యెను.

యాజ్ఞవల్క్యుడు సరస్వతీ దేవిని స్తుతిచేస్తూ నాకు స్మరణశక్తి, విద్యను గ్రంథ రచనచేయుటకు నేర్పును. సజ్జన సభలందు వివేకముతో పాల్గొనుటకు ఉత్తమయోగ్యతను కల్పించమని కోరెను. ఒకసారి సనత్కుమారుడు బ్రహ్మతో జ్ఞానము యొక్క రహస్యమును గూర్చి అడిగెను. బ్రహ్మ చెప్పలేకపోయెను. శ్రీ కృష్ణుడు అచటికేతెంచెను. బ్రహ్మతో ఇట్లు చెప్పెను. ప్రజాపతీ! నీవు భగవతి సరస్వతిని ఇష్టదేవతగా తలంచి ఆమెను స్తుతింపుము. బ్రహ్మ వెంటనే సరస్వతిని స్తుతించి ఉత్తమ సిద్ధాంత పరిశీలన యందు సఫలుడయ్యెను.

పృథివి అనంతుని జ్ఞాన రహస్యమడిగెను. శేషుడు మూగవానివలె ఉండిపోయెను. కశ్యపుని ఆదేశానుసారము సరస్వతి కృపతో నిర్మలమైన సిద్ధాంతము వివేచన చేయగలిగెను. వ్యాసుడు వాల్మీకితో పురాణ సూత్రముల విషయమున ప్రశ్నించగా అప్పుడతడు ఏమియు చెప్పలేకపోయెను. వాల్మీకి సరస్వతిని స్మరించి వాల్మీకి సిద్ధాంతమును ప్రతిపాదింపగలిగెను. వ్యాసుడు భగవంతుడగు శ్రీ కృష్ణుని అంశ. వాల్మీకి ముని నోటి నుండి అతడు పురాణ సూత్రములు వినెను.

మ. ఘనుడై నట్టిసనత్కుమారుడు కరుద్గర్భున్ దగంజూచి ధీ
ధనమున్ వేడిన మూకుడై యజుడు సిద్ధాన్తంబుసేయంగజా

లనటంచుండగ గృష్ణుడేగి నిను నుల్లాసంబునన్ గొల్వుమం
చును దెల్పన్ విని యాతడట్లు సలుపన్ బోషింపవే శారదా!

ఉ. ప్రాకటసూత్రకారుడయి వ్యాసుడు వర్తి లె నిన్నుగొల్చి వా
ల్మీకి మహాకవిత్వనిధి మేధ వహించెను నిన్ను గొల్చి కా
దే కరుణామయీ శివుని దేవవిభుండును బ్రజ్ఞ వేడినన్
మూకత నుండి నీ వలన బొందుఁ దుదిన్ బరవిద్య శారదా!

శా. నిన్నున్ స్తోత్రముచేయ బ్రహ్మయు భవానీభర్తయున్ లచ్చి రే
డు న్నాగేంద్రుఁడు నింద్రుడుం బవలు రేడుందక్కు వేల్పుల్ భ్రమా
చ్చన్నుల్ మూఢులు గాక మాదృశులకున్ శక్యంబె మా తల్లి నీ
విన్నాణంబగు సత్కృపన్ వినుము నా విజ్ఞాపనల్ శారదా!

పుష్కరక్షేత్రము నందుండి ఉపాసన చేసి వ్యాసుడు కవీశ్వరుడయ్యెను. ఇంద్రునకు శంకరుడు తత్వజ్ఞానోపదేశము చేసెను. ఇంద్రుడు బృహస్పతిని శబ్దశాస్త్ర విషయము అడిగెను. బృహస్పతి శబ్దశాస్త్రమును బోధించెను.

మునీంద్రులు, మనువులు, మానవులు, అందరును నిన్ను పూజించి స్తుతించిరి. బ్రహ్మ, విష్ణువు, శివుడు, దేవతలు నిన్ను ఉపాసించిరి. శేషుడు, పంచముఖుడైన శంకరుడు, చతుర్ముఖుడగు బ్రహ్మ నీ యశోగానము నందు విఫలులైరి. నేను ఏకముఖుడను. నిన్నెట్లు స్తుతించగలనని సరస్వతికి నమస్కరించెను.

అప్పుడు సరస్వతి మునీంద్రా! నీవును ప్రసిద్ధమగు కవిగా గమ్ము అని పలికి వైకుంఠమునకు వెళ్ళిపోయినది. యాజ్ఞవల్క్యుడు రచించిన యీ సరస్వతీ స్తోత్రమును పఠించినవాడు కవీంద్రుడగును.

శ్లో॥ ఇత్యుక్త్వాయాజ్ఞవల్క్యశ్చ భక్తి నమ్రాత్మకన్ధరః
ప్రణనామ నిరాహారో రురోద చ ముహుర్ముహుః

జ్యోతీరూపా మహామాయా తేన దృష్టాప్యువాచతమ్
సుకవీన్ద్రో భవేత్యుక్త్వా వైకుణ్ఠం చ జగామ హ
యాజ్ఞవల్క్యకృతం వాణీస్తోత్రమేతత్తు యః పఠేత్
మహామూర్ఖశ్చ దుర్బుద్ధిర్వర్షమేకం యదా పఠేత్
సపణ్డితశ్చమేధావీ సుకవీన్ద్రో భవేద్ధ్రువమ్ (9/5/26)

15. లక్ష్మి, సరస్వతి, గంగ - శాపములు

నారదా! భగవతి సరస్వతి శ్రీహరి దగ్గర వున్నపుడు గంగ ఈమెకు శాపమొసగెను. భారతదేశమున నదీరూపమున అవతరించెను. పుణ్యరూప, పుణ్యతీర్థ, మానవులు చేసే పాపములన్నియు పోగొట్టేశక్తి కలిగివున్నది. ఈ నదినెరిగి మానవులు నదీతీరమునందైనను శరీరములు వదలుటకు పూనుకొందురు. అట్టివారికై వైకుంఠమున అనేక దినములకు నివశించే అవకాశము లభించును.

పూర్ణిమ, దినములందు, గ్రహణ సమయములలో స్నానమాచరించిన శ్రీహరి యొక్క సారూప్యమును పొందుదురు. మహామూర్ఖుడైనప్పటికి ఒకనెల ప్రతిదినము సరస్వతీ నదిలో స్నానమొనరించి మంత్రమును జపించిన మానవుడు కవీంద్రుడగును. సరస్వతి నదీ స్నానమొనరించిన తల్లి గర్భవాసము అతనికి ఉండదు. అనగా నారదుడు గంగ సరస్వతికెందుకు శాపమొసగెను. ఆ ఇరువురి దేవీమణుల వివాదమునకు కారణమేమి? అని అడిగెను.

నారదా! ఒక ప్రాచీన కథను వినుము. లక్ష్మి, సరస్వతి, గంగ - యీ ముగ్గురునూ భగవంతుడగు శ్రీహరికి భార్యలు. ఒకనాడు సరస్వతిపై ప్రేమ ఎక్కువని గమనించి గంగ శ్రీహరి ఎదుటనే కఠోరమైన మాటలు పలికినది. అప్పుడు లక్ష్మి అద్దురాగా నదిరూపము గాని, వృక్షరూపముగాని పొందుదువని శపించెను. లక్ష్మి సరస్వతి మాటలకు కోపము రవ్వంతైనను

చూపలేదు. ఇదంతయు గమనిస్తున్న గంగ లక్ష్మితో ఈ సరస్వతి కూడా నది రూపమౌతుందని శపించెను. సరస్వతి మళ్ళీ గంగకు శాపమిచ్చెను. ఈలా మువ్వురు ఒకరినొకరు శాపము లిడుకొనిరి.

శ్రీహరి అచటికి వచ్చి లక్ష్మీ! నీ కళతో ధర్మధ్వజుని గృహమునకేగుము. అయోనిజవై ప్రకటితవు కమ్ము. వృక్షరూపమున నివసింపుము. శంఖ చూడుడను ఒక అసురుడు నా అంశతో జన్మించగలడు. నీవు అతనికి భార్యవు కమ్ము. ఆ తరువాత జన్మలో నాకు భార్యవగు సౌభాగ్యమును పొందెదవు. తులసి నామముతో నీకు ప్రసిద్ధి కలుగును. పద్మావతి అనుపేరుతో నదిపై వెళ్ళి పొమ్ము.

గంగతో భారతదేశమున భాగీరథీ అను నామముతో పిలిచెదరు. సరస్వతీ! సముద్రము నా అంశ. నీవతనికి పత్నివి కమ్ము. తదుపరి పూర్ణఅంశతో బ్రహ్మకు కాంతవు కమ్ము.

గంగ పూర్ణ అంశతో శివునికి పత్నియగును. లక్ష్మియే ఇచటనుండును. కోపమునకు లోనుకాదు. నామీద తరగని శ్రద్ధ కలదు. విశ్వమునందలి సకల స్త్రీలు ధర్మాత్మలు అని చెప్పి శ్రీహరి తన అభిప్రాయమును చెప్పసాగెను.

విభిన్నస్వభావులగు ముగ్గురు స్త్రీలు, ముగ్గురు పరిచారికలు, ముగ్గురు బంధువులు ఒకచోట కలిసియుండుట వేదానుమతికి విరుద్ధము కదా! భార్య దుష్టముఖి. దుష్టయోని, కలహప్రియయైనచో అట్టివాని గృహమున కంటే అడవియే సుఖవంతమగును.

స్త్రీకి వశుడైన వ్యక్తి పగలంతయు చేసిన కర్మఫలమునకు అతడు బాధ్యుడు కాని భాగస్వామి కాజాలడు. గంగా! నీవు శివుని దగ్గరకు వెళ్ళుము. సరస్వతీ! నీవు బ్రహ్మచెంతకు చేరుకొనుము. నా భవనము నందు కేవలము లక్ష్మియే యుండును. సౌశీల్యవతి, పరమసాధ్వి, పతివ్రత. ఇట్టి స్త్రీకి భర్తయైన పురుషుడు స్వర్గసుఖములను అనుభవించును.

పతివ్రతయైన భార్యగల పురుషుడు పరమ పవిత్రుడు, సుఖవంతుడు, ముక్తుడు అని తలంచవలెను.

16. భక్తుల గొప్పదనము

నారాయణుడు చెప్పినవన్ని విని, గంగా, లక్ష్మీ, సరస్వతులు పరస్పరము ఆలింగనము చేసుకొనుచూ ఏడవసాగిరి. సరస్వతి శ్రీహరితో ప్రభూ! యోగసాధనతో భారతదేశము నందు యీ శరీరమును వదలిపెట్టెదను. గంగ – మీరు నన్ను పరిత్యజించుచున్నారు. నేను జీవింపజాలను అనెను. లక్ష్మి – నాథా నేను ఒక్కకళతో తులసిరూపమును స్వీకరించెదను. ధర్మధ్వజుని పుత్రికనయ్యెదను. నాకు మీ దర్శన భాగ్యము ఎప్పుడు కలుగును.

లక్ష్మీ! నీవు పద్మావతి నదిగా తులసి వృక్షముగ రూపొంది విరాజమానురాలవగుము. ఏబది వేల సంవత్సరములు కలియుగము గడచిపోగా నదీ రూపిణులగు మీరు నా భవనమునకు తిరిగివచ్చెదరు.

భారతదేశపు భూమి మిగుల పవిత్రము. ప్రాణులను పవిత్రులను చేయుట ఆ నదుల కర్తవ్యమగును. నా భక్తులుండు చోటు గొప్ప తీర్థమగును. పాపి కూడా నా భక్తుని దర్శన, స్పర్శల ప్రభావమున పవిత్రుడై జీవన్ముక్తుడు కాగలడు.

శ్లో॥ మద్భక్తా యత్ర తిష్ఠన్తి పాదం ప్రక్షాళయన్తి చ ।
తత్థానం చ మహాతీర్థం సుపవిత్రం భవేద్ధువమ్ ॥ (9/7/26)

వట వృక్షమును వారు, నీచులైన బ్రాహ్మణులు, అసత్యం చెప్పువారు, విశ్వాసఘాతకులు, మిత్రద్రోహులు, అత్త, మామలను పోషించుటకు నిరాకరించిన పాపులు నా భక్తుల దర్శన స్పర్శవలన పవిత్రులగుదురు.

మట్టితో, రాతితో చేసిన దేవతా విగ్రహములు అవన్నియు దేవతలు కారు. సాక్షాత్తూ దేవతలనిన విష్ణుభక్తులే. వారి ప్రభావమున వెంటనే పవిత్రత చేకూరును.

శ్లో॥ న హ్యమ్మయాని తీర్థాని న దేవా మృచ్ఛిలామయాః
తే పునన్త్యపి కాలేన విష్ణుభక్తాః క్షణాదహో ॥ (9/7/42)

మహాలక్ష్మి మాటలను విన్న శ్రీహరి లక్ష్మీ! భక్తుల లక్షణములు శ్రుతులయందు, పురాణముల యందు దాగియున్నది. నీవు పవిత్ర స్వరూపవు. నీకు తెలిపెదను వినుము. సద్గురువు ముఖము నుండి విష్ణుమంత్రమును పొందినవాడు నన్నే సర్వస్వమని భావించువానిని వేదములు పుణ్యాత్ముడని, శ్రేష్ఠుడని తెలుపుదురు. వారికి జీవన్ముక్తి, పరమధామమును సదా నా కథల యందు లగ్నమగుదురు. నాపై పద్యములను గానము చేయుచు పరవశులగుచుందురు.

పద్మా! నేను నీ ప్రశ్నకు సమాధానమొసగితిని. అనగా ఆ దేవీమణులు శ్రీహరి ఆదేశము శిరసావహించిరి. తరువాత భగవంతుడు తన ఆసనమున విరాజమానుడయ్యెను.

17. కలియుగములో జరుగు విపరీతములు

నారాయణుడు నారదా! సరస్వతి ఒక కళతో భారతదేశము చేరుట వలన 'భారతి'యని, బ్రహ్మ ప్రేమకు పాత్రురాలగును. కనుక 'బ్రాహ్మీ'యని వచనములకు అధిష్ఠాత్రి కనుక 'వాణి'యని ఖ్యాతి వహించును. శ్రీహరికి 'సర్వస్వాన్' అను పేరు వచ్చును.

గంగ తన కళతో, భగీరథుని సత్ ప్రయత్నముతో, మొదట శంకరుని తలపై జటాజూటమున బంధించి భూమికి చేరును. లక్ష్మీదేవి ఒక కళతో ధర్మధ్వజుని ఇంట పుత్రికగా పుట్టి తులసిరూపమున వృక్షముగా సంతోషముతో పుడమిపై కీర్తిపొందెను.

కలియుగమున ఐదు వేల సంవత్సరములు వరకు భారత దేశమున ఈ దేవిమణులు నివసించిరి. తదుపరి నదీరూపములను పరిత్యజించి వైకుంఠమునకు వెళ్ళిపోయిరి. కాశి, బృందావన తీర్థములు ఇక్కడే నిలిచిపోవును.

భగవంతుడైన పురుషోత్తముడు, శివుడు, శక్తి – ఇవన్నియు పదివేల సం॥ల తరువాత భారతదేశమును వదలి తమతమ స్థానములకు వెళ్ళిపోయెదరు. సాధువులు, పురాణములు, శంఖము, శ్రాద్ధములు, తర్పణములు, వేదోక్త కర్మలు – ఇవన్నియు భారతదేశమును వదలి వెళ్ళిపోవును. సత్యము, ధర్మము, గ్రామదేవతలు, వ్రతములు, తపములు, ఉపవాసములు ఇవన్నియును ఈ భారతదేశము నుండి అదృశ్యమగును.

ప్రజలందరు మద్యమాంసములు, అసత్యములు, శఠులు, అహంకారులు, దొంగలు, హింసించువారు, ప్రపంచమంతయు వ్యాపించెదరు. జాతి భేదము తొలగిపోవును. భయరహితులై ఏ వర్ణపు స్త్రీనైనను వివాహము చేసుకొందురు. పురుషులందరు స్త్రీలకు అధీనులై ప్రవర్తిల్లెదరు.

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనబడు నాలుగు వర్ణములవారు తమ ఆచార విచారములను వదలిపెట్టుదురు. యజ్ఞోపవీతాది సంస్కారములు ఆగిపోవును. భూమి మీద ధాన్యము మొలవదు. వృక్షములు ఫలహీనములగును. ఆవులకు పాలనిచ్చుశక్తి ఉండదు. లక్షమందిలో ఒక్కడు కూడా పుణ్యము చేసుకొన్నవాడు కనిపించడు.

నదీ తీరములందు చెఱువు గట్టులందే ధాన్యము పండును. వర్షములు పడవు. కలియుగమున మానవులు అశ్లీలముగ భాషించుట, ధూర్తులు, శఠులు, అసత్యవాదులు, నాస్తికత్వము కలవారు, అల్పాయుష్కులు, రోగగ్రస్థులు, పదహారు సం॥లకే వృద్ధాప్యము, ఎనిమిది సంవత్సరములకే స్త్రీలు గర్భవతులు విరివిగా సంభవించును. వ్యభిచారిణులు, కులటలు, మ్లేచ్ఛులు నిండిపోవుదురు.

విష్ణుయశుడను పేరుగల బ్రాహ్మణుని యింట అతనికి పుత్రుడుగా కల్కి ప్రకటితుడగును. నారాయణుని అంశతో ఎత్తైన గుఱ్ఱమునెక్కి మూడు రాత్రులలోనే పృథివి యందు మ్లేచ్ఛులు లేకుండా చేయును. ఆరు రాత్రులు,

పగలు ఎడతెరిపి లేని వర్షము కురిసి ప్రాణులన్నియు నశించును. ప్రకృతి సర్వనాశనమగును. ఆ శూన్యపు సమయమున పండ్రెండుగురు సూర్యులు ఒక్కసారిగా ఉదయించెదరు. సూర్యుల తేజస్సుతో భూమి ఎండిపోవును. ఇంచుమించు కలియుగము సమాప్తమైనట్లే.

చాలాకాలము తరువాత తపములు, సత్వసంపన్నములగు ధర్మములు, సంపూర్ణ రూపములలో ప్రకటితములగును. స్త్రీలు పవిత్రులై ధర్మాత్ములగుదురు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వంశములవారు శక్తిస్వరూపిణి భగవతి జగదంబను శ్రద్ధాభక్తులతో ఉపాసించెదరు. శ్రుతి, స్మృతి, పురాణముల సంపూర్ణ జ్ఞానముండును. దీనినే సత్యయుగము అందురు.

ధర్మము సంపూర్ణ రూపముతో సత్యయుగము నందు, మూడు పాదములతో త్రేతాయుగము, రెండు పాదములతో ద్వాపర యుగము, ఒక పాదముతో కలియుగము సంచరించును. కలి ప్రవేశించగానే పాద విహీనమగును.

కాలపరిమాణము – దినములు, తిథులు, పండ్రెండు నెలలు, ఋతువులు, శుక్ల, కృష్ణ పక్షములు, ఉత్తర, దక్షిణాయనములు, పగలు నాలుగు జాములు, రాత్రి నాలుగు జాములు, ముప్పది దినములు, ఒక నెల – సంవత్సరము, సంవత్సర కాలాన్ని – దేవతలకది పగలుగ, రాత్రిగ అగును. ఈ విధంగా యుగములు నాలుగు, డెబ్బది ఒక్క దివ్యయుగములు, మన్వంతరము – ఒక మన్వంతరమున ఒక్కొక్క ఇంద్రుడు, ఇరువది మన్వంతరములు బ్రహ్మకది ఒకదినము. ఒక రాత్రియగును.

బ్రహ్మకు ఒక వంద ఎనిమిది సంవత్సరములు గడచినచో ఆయన ఆయువు పూర్తియగును. ప్రాకృతలయమని వచించెదరు. ఆ సమయమున సమస్త బ్రహ్మాండము జలమునందు విలీనమగును. బ్రహ్మయందే ప్రకృతియును విలీనమగును. ప్రకృతి పురుషుడు ఒకటగుదురు. ఇదే

ప్రాకృతప్రళయము. బ్రహ్మఆయువు సమాప్తమగును. ఈ సమయమంతయు జగదంబకు ఒక్క నిమిషమగును. దేవి యొక్క నిమిషకాలముననే అనేక బ్రహ్మాండములు, సృష్టి, ప్రళయములు జరుగుచునేయుండును.

అన్ని బ్రహ్మాండములకు ఒకే ఈశ్వరుడు కలడు. సత్, చిత్, ఆనందమయము. బ్రహ్మ, దేవతలు, పరమాత్మ అంశలే! ఆ పరమాత్మనే 'పరాశక్తి' యని పిలిచెదరు. అర్ధనారీశ్వర శ్రీకృష్ణ రూపమున విలసిల్లినది. శివుడు మృత్యుంజయుడని, గొప్ప తపస్వియని, సంహార కార్యమునందు సఫలుడగునని నమ్మకము.

ప్రకృతిని సర్వశక్తి స్వరూపిణి, మహామాయ, సర్వేశ్వరి అని పలుకుదురు. ఆమెను తెలిసికొని భక్తితో తపస్సు చేసి సేవించుట వలననే దేవమాత సావిత్రి వేదములకు అధిష్ఠాన దేవత అయ్యెను. సరస్వతి సమస్త విద్యలకు అధిష్ఠాత్రి దేవి అయ్యెను. తపమొనరించియే లక్ష్మీదేవి సర్వత్ర పూజితురాలయ్యెను.

శ్రీరాధ శ్రీకృష్ణుని వామభాగము నందుయుండును. శ్రీరాధ శ్రీకృష్ణుని పత్నియై ఆ స్వామి వక్షస్థలమున నివసించు సౌభాగ్యమును పొందినది. శతశృంగ పర్వతమునకు వెళ్ళి అచట తపమొనరించినది. శ్రీకృష్ణుడు చంద్రకళతో శోభిల్లు రాధను శ్రీకృష్ణుడు తన హృదయమునకు హత్తుకొనెను.

భగవతి దుర్గ హిమాలయము నందు తపమొనరించును. అందరికి ఆరాధ్యురాలయ్యెను. సరస్వతీదేవి గంధమాదన పర్వతమున తపస్సు చేసెను. సర్వవంద్య కాగలిగెను. లక్ష్మి పుష్కరక్షేత్రము నందు తపమాచరించెను. సకల సంపదలను ప్రసాదించు యోగ్యతను పొందెను. సావిత్రి మలయగిరి మీద తపమొనరించెను. ప్రజలు ఆమెను పూజింతురు.

18. భూమి

నారదుడు భూమి ఆవిర్భావ చరిత్ర తెలుపమని కోరగా, జగదంబయే అఖిల జగత్తును సృజించును. ప్రళయ సమయమున సకల ప్రాణులు

ఆమెలోనే విలీనమగును. ఈ పృథ్వి మధుకైటభుల మేథస్సుతో ఆవిర్భవించినదని కొందరు చెప్పుదురు. సూర్యుని తేజస్సుతో మేధస్సు ఎండిపోయెను. అపుడు మేదిని అని పిలువసాగిరి.

మహావిరాట్ పురుషుని రోమకూపములనుండి ఈ పృథివి బయటకు వచ్చినది. ఏడు సముద్రములతో చుట్టుకొనియున్నది. హిమాలయములు, సుమేరు పర్వతములు, సూర్య చంద్రాదులు, గ్రహములు సుశోభితము చేయుచుండును. ఇందు భారతదేశమున గల పుణ్యక్షేత్రములు విలసిల్లుచున్నది. దీనిమీద ఏడు స్వర్గములు, నిమ్నభాగమున సప్తపాతాళములు, పైనున్నవి బ్రహ్మలోకము, ధ్రువలోకమున్నది, ప్రాకృత ప్రళయ సమయమున బ్రహ్మ కూడా వెళ్ళిపోవును.

అప్పుడు అదృష్టశక్తి అధీనమున నుండును. వరాహ కల్పము నందు ఇదిమూర్తిమంతమైయుండెను. సకలదేవతలు యీమెను పూజించిరి. వరాహావతారమెత్తెను. పృథివి పత్నియై విలసిల్లెను. మంగళుడను కుమారుడుదయించెను. మంగళునకు ఘటేశుడు జన్మించెను.

వరాహావతారమెత్తిన శ్రీహరి హిరణ్యాక్షుని వధించి పృథివిని రసాతలము నుండి బయటకు తెచ్చెను. పృథివి మీదనే కూర్చొని విశ్వమును సృజించెను. ఆ దేవిని చూచి శ్రీహరి మనస్సులో ప్రేమించవలెనన్న భావము జనించెను. పృథ్వీదేవి రతీదేవిలాగా కనిపించగా ఆమెతో ఒక దివ్య సంవత్సరము ఏకాంతమున గడిపెను.

శ్రీహరి పృథ్వీదేవితో నీవు అందరికిని ఆశ్రయము ప్రసాదించు సుపూజితవు కమ్ము. సౌరమానము ప్రకారము ఆర్ద్రా నక్షత్ర ప్రథమ చరణము నందు పృథివి ఋతుమతియగును. దీనినే అంబువాచి అందురు. గృహప్రవేశము, గృహారంభమున సమస్త ప్రజలు నిన్ను పూజించెదరు. నిన్ను పూజించనివారు నరకము పొలగుదురు.

అప్పుడు పృథివి గర్భవతిగా ఉండి మంగళుడను పేరు గల గ్రహము జన్మించెను. మూడు లోకములందు పృథివిని కణ్వశాఖ యందు చెప్పబడిన మంత్రములను ధ్యానిస్తూ స్తుతిస్తుండిరి. మొదట వరాహ భగవానుడు పూజించెను. బ్రహ్మ ఈ పూజయందు సంలగ్నుడయ్యెను. మునిగణములు, మనువులు, మానవులు ఈమెను పూజించిరి. "ఓం హ్రీం శ్రీం వసుధాయై స్వాహా" అను మంత్రముతో విష్ణు భగవానుడు ఈమెను పూజించెను.

నారాయణుడు భగవతీ! నీవు జలమునకు ఆధారము. శ్రీహరి యజ్ఞవరాహ రూపమున నీచెంతకేతెంచును. స్వామికి పత్నివైతివి. నేను శుభములను పొందుటకు నిన్ను ప్రార్థించెదను. దేవీ! నీవు సర్వజ్ఞవు. సర్వశక్తి, సమన్వితవు, నీ విగ్రహము పుణ్యప్రదము. దేవీ! సకల పంటలు నీ మీద ఆధారపడును. సస్యములను పండించుదానవు.

శ్లో॥ జయ జయే జలధారే జలశీలే జయప్రదే ।
యజ్ఞసూకరజాయే చ జయం దేహి జయవహే
మజళే మజ్ఞ ళాధారే మాజ్గళ్యే మజ్గళ ప్రదే।
మజ్గళార్థం మజ్గళేశే మజ్గళం దేహి మే భవే ॥
సర్వాధారే చ సర్వజ్ఞే సర్వశక్తి సమన్వితే ।
సర్వకామప్రదే దేవి సర్వేష్టం దేహి మే భవే ॥
పుణ్యస్వరూపే పుణ్యానాం బీజరూపే సనాతని ।
పుణ్యాశ్రయే పుణ్యవతా మాలయే పుణ్యదే భవే ।
సర్వ సస్యాలయే సర్వససాధ్యే సర్వసస్యదే ।
సర్వ సస్యహరే కాలే సర్వసస్యాత్మికే భవే।
భూమే భూమిపసర్వస్వే భూమిపాల పరాయణే
భూమిపానాం సుఖకరే భూమిం దేహి చ భూమిదే

(9వ స్కంధము/9 అధ్యాయము/52-58 శ్లోకాలు)

నారాయణుడు స్వయంగా భూమిని స్తుతించెను. ప్రాతఃకాలమన దీనిని పఠించిన పురుషుడు రాజగును. భూదానము చేసిన దాని వలన కలుగు పుణ్యమునకు అధికారియగును. సంధ్యావందనము చేత పవిత్రుడైన బ్రాహ్మణునకు ఒక విశ్వామాత్రపు భూమిని దానము చేసిన పురుషుడు శివమందిర నిర్మాత పొందు పుణ్యమును పొందును.

బ్రాహ్మణునకు ఇవ్వబడిన భూమిని హరించు వ్యక్తి నరకముఉ అనుభవించును. గోవులు చరించు భూమిని దున్ని వచ్చిన ధాన్యమును బ్రాహ్మణునకిచ్చినచో ఆ కర్మవలన కుంభీపాక నరకమున పడుదురు. గోశాలను, తటాకమును, త్రోవను దున్ని పండించినవాటిని దానమొసగిన అసిపత్ర నరకమునపడును. కామాంధుడు, వీర్యపాతము చేసినవాడు రౌరవ నరకము ననుభవించును.

శివలింగము, దేవతా విగ్రహములు, తులసిదళము, జపమాల, కర్పూరం, గోరోచనం, రుద్రాక్షమాల, కుశలు, పుస్తకములు, యజ్ఞోపవీతములు భూమి పైనుంచిన నరకమునపడెదరు. భూమి, కాశ్యపి, విశ్వంభర, అనంత, పృథ్వి అని పిలువబడును.

19. గంగ పవిత్రత

నారదుడు స్వామీ! గంగ సరస్వతీ దేవి శాపమున భారత దేశమునకెట్లు వచ్చి చేరెను. అనగా నారాయణుడు నారదా! సగరుడు సూర్యవంశపు సమ్రాట్టు, అతనికి వైదర్భి, శైభ్య ఇద్దరు రాణులుండిరి. శైభ్యవలన శైభ్యపుత్రుడు అసమంజసుడు. వైదర్భికి శంకర వర ప్రభావమున వంద సంవత్సరముల తరువాత గర్భము నుండి ఒక మాంసపిండముదయించెను. శివుడు ఆ మాంసపిండమును ఆరు వేల భాగములుగ విభజించెను. పుత్ర రూపములలో పరిణతిచెందెను. ఆ పుత్రులను కపిలముని తన శాపముచే దహించి భస్మము చేసెను.

సగర మహారాజు ఇదంతయు విని అడవులకు వెళ్ళిపోయెను. అసమంజసుడు గంగను తీసుకొని వచ్చుటకు తపమాచరించగా కాలునికి ఆహారమైపోయెను. అసమంజసుని పుత్రునిపేరు అంశుమంతుడు గంగకోసం తపమాచరించి కాలునికి ఆహారమయ్యెను.

అంశుమంతుని పుత్రుడు భగీరథుడు. గంగను భూమిపైకి తెచ్చుటకు తపమొనరించగా శ్రీకృష్ణుడు గోపసుందరి రూపమున దర్శనమొసగగా భగీరథుడు ప్రణమిల్లెను. పూర్వజులు ఉద్ధరింపబడవలెనని కోరెను.

శ్రీహరి గంగతో సురేశ్వరీ! సరస్వతి శాపమును శిరసావహించి భారతదేశమున సగరపుత్రులందరిని పవిత్రమొనరింపుము. గంగా స్పర్శమాత్రమున మానవుల పాపములు నశించును. గంగానదిలో ప్రవేశించి చేష్టారహితుడు కావలెను. అనగా చేతులు కాళ్ళను కదల్చకుండ శాంతభావముతో స్నానమొనరించవలెను. దీనినే మౌసల స్నానమందురు.

చంద్ర గ్రహణ సమయమున గంగలో స్నానము చేయుటవలన కోటి రెట్లు అధిక పుణ్యము లభించునని చెప్పబడినది. సూర్యగ్రహణ సమయమున దీనికంటె పది రెట్లు పుణ్యము ఎక్కువ.

గంగ, భగీరథుల ఎదుట శ్రీహరి ఇదంతయు చెప్పగా గంగ నాథా! మీ ఆజ్ఞ మేరకు నేను భారత దేశమునకు వెళ్ళుచున్నాను మానవుల పాపములు నా మీద పడవేయుదురు. ఆ పాపములన్ని నశించి నేను నీ ధామమును చేరుకొనుట ఎప్పుడు? అని కోరెను.

గంగా! భారత దేశమున సముద్రుడు నీకు భర్త కాగలడు. కలియుగము నందు అయిదు వేల సంవత్సరములు భారతదేశమున ఉండవలసి వచ్చును. నీవు లక్ష్మీరూపవు. సముద్రుడు నా స్వరూపుడే.

అతనికి ప్రియురాలివై సంగమించెదవు. భగీరథుడు నిన్ను స్తుతించగా ప్రజలు నీచే స్తుతింపబడినపుడు అశ్వమేధ యజ్ఞము చేసిన ఫలితము

లభించును. గంగా – గంగాయని స్నానము చేసినవారు పాపముల నుండి విముక్తులగుదురు. దేవి మంత్రానుష్ఠానముతో స్నానము చేయుటవలన నీ పాపములన్నియు ప్రక్షాళనమగును. సరస్వతీ మొదలగు శ్రేష్ఠములైన నదులన్నియును నీకు సహకరించును. నీ ధూళి కణములు ఎన్నికలవో అన్ని సంవత్సరములు పాపి పవిత్రుడై దేవలోకమున నివసించుటకు అధికారి కాగలడు.

దేవీ! నా నామమును స్మరించుచు ప్రాణములను వదలి పెట్టిన వాడు అతని శరీరమునందలి ఒక్కొక్క ఎముక ఎన్ని దినములు నీయందుండునో అన్ని దినములు అతడు వైకుంఠమున నివసించును. ఎవరైనా అజ్ఞాని నీ జలమును స్పృశించి ప్రాణములను పరిత్యజించినచో అతడు నా కృప వలన సాలోక్యపదమునకు అధికారి కాగలడు. ఎక్కడ మరణించినను చనిపోవు సమయమున నీ నామమును స్మరించినచో బ్రహ్మ ఉన్నంతకాలము అతడు నా ధామమున ఉండును.

శ్రీహరి గంగతో ఇట్లు పలికి భగీరథునితో రాజా! గంగను స్తుతించి పూజింపుము. ధ్యాన స్తోత్రములతో అతడు గంగాపూజను సంపన్నము చేసెను. గణేశుడు, సూర్యుడు, అగ్ని, విష్ణువు, శివుడు, భగవతి, శివా అని పూజించుటకు కారణములు విఘ్నేశుని విఘ్నములు దూరము చేయుటకు సూర్యుని ఆరోగ్యం పొందటానికి, అగ్నిని పవిత్రతకు, లక్ష్మిని పొందుటకు విష్ణువును, జ్ఞానార్జనకు జ్ఞానేశ్వరుడైన శివుని, ముక్తిని పొందుటకు భగవతి శివాదేవిని పూజించవలెను. కణ్వశాఖోక్తంబున ఈలా ఉంది.

ఉత్సాహ – మల్లెమొల్ల జాజి విరుల మాడ్కి నీ ప్రవాహముల్
తెల్లనై పవిత్రమై యతిద్యుతిం దలిర్చెడిన్
గల్లగాదు నీవు కృష్ణగాత్రమందు బుట్టితో
తల్లి గంగ నిన్ దలంచెదన్ సతంబు గొల్చెదన్

ఉత్సాహ – తెల్ల మాయె నీదు కీర్తి దేవదేవుడే నినున్
బల్ల వింపజేసె నమ్మ భక్తకల్పభూమిరు
హ్వల్లివైతి వో సమస్తవాహినీమతల్లి మా
తల్లి గంగ నిన్ దలంచెన్ సతంబు గొల్చెదన్

ఉత్సాహ – విల్లువంటి కన్నుబొమయు వేదివంటి జఘనమున్
జల్లి మెకముతోకవంటి చక్కనైన వేణియున్
పిల్లలేడివంటి కనులు పేర్మి మీరునట్టి మా
తల్లి గంగ నిన్ దలంచెదన్ సతంబు గొల్చెదన్

కం. అమ్మా శివకరరూపిణి
సమ్ముగ్ధ మురారిదేహసంభూతా గై
కొమ్మా నా మ్రొక్కులు
గంగమ్మా రాదాంగరససమాయుక్త దయన్

తే.గీ. క్షీర వర్ణయనగ గృతమున, నిందు
సన్నిభ యమరియు త్రేత, నెమ్మిం జంద్ర
నాభ ద్వాపరమున, నలువౌ జలప్రభ
గలియుగమున నట్టి గంగగొల్తు! (మ.క.దా.శ్రీ)

విష్ణుపదమును ప్రసాదించు జనని, విష్ణుపదీ నామముతో ప్రసిద్ధులాలైన తల్లి. గంగాదేవిని నేను ఉపాసించెదను. గంగాదేవిని ఉపాసించిన పురుషుడు భాగ్యవంతుడుగ, అశ్వమేధ ఫలము లభించును. ప్రాతఃకాలమున గంగాస్తోత్రము పఠించినచో అట్టి వ్యక్తికి గంగాస్నాన ఫలము లభించును.

గంగ భగీరథునికి ప్రసన్నమై సగరుని పుత్రులను స్పృశించగానే ఆ రాజకుమారులు వైకుంఠమునకు వెళ్ళిపోయిరి. అప్పుడు భాగీరథి అని గంగకు పేరువచ్చెను. ఈ కథ మోక్షమునకు చక్కటి సాధనము.

శ్రీకృష్ణుని అంగము నుండి శ్రీ గంగాదేవి ప్రకటిత అయ్యెను. రాధ మేని చెమటయే ద్రవరూపమైన గంగ శంకరుని సన్నిధిలో విరాజమానమై యుండును. కార్తీక పౌర్ణమి రోజు రాధామహోత్సవము జరుగును. గోపికలు గంగకు నమస్కరించెదరు.

సత్యయుగము నందు పాలతో సమానముగ, త్రేతాయుగమున చంద్రునివలె, ద్వాపరము నందు చందనము వలె, కలియుగము నందు జలముతో సమానముగ తలచి స్తుతించవలెను.

ఒకనాటి విషయమును వినుము. బ్రహ్మాది దేవతలు, మునిగణములు, శ్రీకృష్ణుని శ్రీరాధను పూజించిరి. సరస్వతీదేవి వీణను ధరించి గీతముల నాలపించసాగెను. బ్రహ్మ రత్నహారమును, శివుడు ఉత్తమమైన మణిని, శ్రీకృష్ణుడు కౌస్తుభమణిని నొసగిరి. బ్రహ్మచే ప్రేరితుడై శంకరుడు శ్రీకృష్ణునకు సంబంధించిన పద్యములను గానము చేయసాగెను. దేవతలు తమ్ము తాము మరచిపోయిరి. రాసమండల స్థలమంతయు జలమయమైనదని చూచిరి. రాధాకృష్ణుల జాడయే తెలియలేదు.

అప్పుడు ఆకాశవాణి వినిపించెను. నేను – రాధ జలరూపమును ధరించితిమి. శంభుడు నా ఆజ్ఞను పాలించును. విధాతా! వేదములకు అంగభూతములగు తంత్రశాస్త్రములను నిర్మించమని శంకరునితో చెప్పుము.

దానితో స్తోత్రములు, పూజావిధానము, మంత్రములు, కవచములు ఉండవలెను. శంకరుడు దేవసభ యందు ఇట్లొనరించుటకు దృఢమైన ప్రతిజ్ఞ చేసినచో నా దర్శనభాగ్యము ప్రాప్తించును. ఆకాశవాణి ద్వారా ఇట్లు పలికి శ్రీహరి మౌనమును వహించెను, శంకరుడు గంగాజలము తీసికొని ప్రతిజ్ఞచేసెను.

నారదా! గోప్యమైన ప్రసంగమును వినిపించితిని. పరబ్రహ్మ భగవంతుడగు శ్రీకృష్ణుడే గంగగా రూపొందెను. అంటే శ్రీరాధాకృష్ణులే

గంగరూపముగ ప్రకటితులైరి. శ్రీరాధా శ్రీకృష్ణుల అంగముల నుండి ప్రకటితమైన గంగ భుక్తిముక్తులను రెండింటిని ప్రసాదించును. సకల బ్రహ్మాండము నందలి ప్రజలు పూజించెదరు.

కలియుగమున అయిదు వేల సంవత్సరములు గడచిన తరువాత సరస్వతిశాపము వలన గంగ భారతదేశమున కేతెంచును. గడువు పూర్తికాగానే శ్రీహరి ఆజ్ఞతో వైకుంఠమును చేరుకొనును. అట్లే సరస్వతి భారతదేశమును వదలి శ్రీహరిధామమును, శాపము పూర్తికాగానే లక్ష్మి పరమాత్ముని దగ్గరకు వచ్చును. గంగ, సరస్వతి, లక్ష్ములే శ్రీహరికి ప్రియమైన భార్యలు. తులసిని కలుపుకొనినచో నలుగురు పత్నులని వేదములందు ప్రసిద్ధము.

నారదా! ప్రాచీనకాలము నాటి విషయము వినుము. ఒకనాడు శ్రీకృష్ణుని రూపమును చూచి గంగ పులకితురాలయ్యెను. ఇంతలో రాధిక అచటికి వచ్చి విరాజమానయైయుండెను. గోపకులు రాధికకు నమస్కరించిరి. శ్రీకృష్ణుడు కూడా రాధికను స్తుతించెను. శ్రీకృష్ణుని వద్ద వరమును పొంది గంగాదేవి స్థిరచిత్త అయ్యెను.

రాధిక శ్రీకృష్ణునితో వరమును పొందియుండుటను గంగ చూచి తృప్తి చెందలేకపోయెను. శ్రీరాధ ప్రాణేశ్వరా! నేను ప్రేమతో ఈమెను క్షమించుచున్నాను. మీరు "విరజా" దేవిని ప్రేమించితిరి. అప్పుడామె తన శరీరమును పరిత్యజించి నదీరూపముగ, అది సప్తసముద్రములుగా ఉదయించినవి. మీరు "శోభ"యను కన్యను ప్రేమించితిరి. ఆమె శరీరమును వదలి చంద్రమండలమును చేరుకొనెను. మీరు "ప్రభ"తో ప్రేమ వ్యవహారములు నడుపుచుండగా చూచితిని, ఆమె శరీరమును వదలి సూర్యమండలమున ప్రవేశించెను. శ్రీకృష్ణ, నీ నుండి దూరమైన ప్రభ, అగ్ని, యక్షులు, నరేశులు, దేవతలు, వైష్ణవజనులు, నాగులు, బ్రాహ్మణులు, మునులు, తాపసులు, సౌభాగ్యవతులైన స్త్రీలు, యశోభూషణులైన

పురుషులు, వీరందరికిని కొంత కొంత ఆ తేజస్సు లభ్యమయ్యెను. 'శాంతి' యను గోపికను ప్రేమించుచుండగా చూచితిని. ఆమె శరీరమును త్యజించి మీలో లీనమయ్యెను. "క్షమ"ను కూడి మీరు ప్రేమగా కనిపించితిరి. ఆమె శరీరమును వదలి పృథివికి వెళ్ళిపోయెను. ఆమె దేహము ఉత్తమమగు రూపమున పరిణతి చెందెను. ఇట్లు రాధ శ్రీకృష్ణునితో చెప్పి గంగతో సంభావింపసాగెను.

గంగయోగమునందు పరమప్రవీణురాలు, సభామధ్యముననే అదృశ్యమై జలములందు ప్రవేశించెను. రాధ గంగను వెదకెను. అన్నిచోట్లా జలము లేకుండా పోయెను. బ్రహ్మ, విష్ణువు, శంకరుడు, దేవతలు, గోలోకమునకు వచ్చిరి. శ్రీకృష్ణునకు వారందరును ప్రణమిల్లిరి. శ్రీకృష్ణుడు శ్రీరాధతో గూడి విరాజమానుడైయుండెను. శ్రీకృష్ణుడు రాధరూపమును, రాధ శ్రీకృష్ణుని రూపమును ధరించి దర్శనమివ్వగా బ్రహ్మ నిర్ణయించుకొనలేకపోయెను.

శ్రీకృష్ణుడు బ్రహ్మదేవా! మీరందరు గంగను తీసుకొనిపోవుటకు ఇచటికేతెంచిరని నేనర్థము చేసుకొంటిని. ఆమె నా చెంతనుండగా రాధ రోషపూరిత అయ్యెను. గంగను త్రాగివేయుటకు ఆమె ఉద్యమించెను. గంగ ఇచటనే ఉండిపోయెను. బ్రహ్మ భగవతి రాధనిట్లు స్తుతించెను. దేవీ! ఈ గంగ శ్రీకృష్ణుని శ్రీ అంగము నుండి జన్మించినది. శంకరభగవానుని సంగీతముచే గంగద్రవరూపమున ప్రకటిత అయ్యెను. మీ యొక్క శ్రీకృష్ణుని యొక్క ప్రియపుత్రికతో సమానము.

బ్రహ్మ ప్రార్థనను విని రాధ నవ్వెను. గంగ శ్రీకృష్ణుని బొటనవ్రేలి అగ్రభాగము నుండి బయటకు వచ్చి అచటనే విరాజమానురాలయ్యెను. గంగ రాధను పూజించి వైకుంఠమునకు బయలుదేరెను.

లక్ష్మి, సరస్వతి, గంగ, తులసి – ఈ నలుగురు నారాయణునకు పత్నులు.

శ్రీకృష్ణుడు బ్రహ్మదేవా! గోలోకమున కాలచక్ర ప్రభావముండదు. వైకుంఠము తప్ప మిగిలినదంతయును జలమయమైనది. బ్రహ్మదేవా! నీవు దేవతలతో కలసి లోకాదులను సృష్టింపుము అని చెప్పెను.

శ్రీహరి చరణ కమలముల నుండి గంగ ప్రకటిత అయ్యెను. ప్రజలు ఆమెను "విష్ణుపది" అని పిలిచెదరు. ఈ కథనంతా విన్న నారదుడు గంగ విష్ణుదేవుని పత్ని ఎట్లయ్యెను? అని అడుగగా బ్రహ్మ ఇలా బదులిచ్చెను. ద్రవరూపిణియగు గంగ సుశీలయగు ఒక దేవి రూపమున విరాజిల్లుచున్నది.

శ్రీకృష్ణుని అంగము నుండి ప్రకటిత అయిన గంగ ఇతరులను ఎవ్వరిని భర్తగా వరింపకోరుట లేదు. రాధ దీనిని అంగీకరించుట లేదు. గంగ బుద్ధి కుశలతతో శ్రీకృష్ణుని చరణ కమలములందు ప్రవేశించెను. అప్పుడు గంగ రక్షింపబడెను. నేనప్పుడు రాధను పూజించు మంత్రమును గంగకు ఉపదేశించితిని.

శ్రీవిష్ణువు స్వయముగ రెండు భాగములుగా విభజితుడయ్యెను. సగ భాగముతో ద్విభుజధారియగు శ్రీకృష్ణుడు అయ్యెను. రెండవ రూపము శ్రీహరిగా ప్రకటితుడయ్యెను. శ్రీకృష్ణుని వామాంగము నుండి శ్రీరాధ ఆవిర్భవించెను. శ్రీరాధ దక్షిణాంశముతో ఆ దేవి స్వయముగ సంసిద్ధ అయ్యెను. వామాంగము నుండి లక్ష్మి ప్రకటిత అయ్యెను. గంగ మిమ్ములనే వరింప గోరుచున్నదని శ్రీహరి చెంత వదలి వెళ్ళిపోయెను. శ్రీహరి గంగను పాణిగ్రహణము చేయగా ప్రియమైన భర్త అయ్యెను. గంగ పృథివికి వచ్చి ఆ తరువాత వైకుంఠమునకు మరల తిరిగివచ్చెను.

గంగ 'విష్ణుపది' నామముతో ప్రసిద్ధి చెందినది. తరువాత తులసికి కూడా ప్రియ పత్నియగు సౌభాగ్యము ప్రాప్తించినది.

20. తులసి కథ

నారదుడు ప్రభూ! తులసి శ్రీహరికి పత్ని ఎట్లయ్యెను. వృక్షముగ ఎట్లు పరిణతి చెందెను. అనగా నారాయణుడు స్వామీ! దక్షసావర్ణిపుత్రుడు

మనువు, మనువు పుత్రుడు బ్రహ్మసావర్ణి, బ్రహ్మసావర్ణిపుత్రుడు ధర్మసావర్ణి, అతని పుత్రుడు రుద్రసావర్ణి అతనికి దేవసావర్ణి, అతినికి వృషధ్వజుడు జన్మించెను. శంకరునియందు శ్రద్ధ ఉండెను. నారాయణుని, లక్ష్మిసరస్వతుల యందు శ్రద్ధాభక్తులు లేవు. మాఘ శుక్ల పంచమినాడు సరస్వతి పూజ చేయలేదు. వృషపర్వుని సూర్యుడు 'రాజా! నీ సంపదలు నశించుగాక' అని శాపమొసగెను.

శంకరుడు సూర్యుని మీద విరుచుకుపడెను. బ్రహ్మ, కశ్యపుడు, సూర్యుడు భయభీతులైరి. అపుడు నారాయణుని శరణువేడగా – నేను బ్రహ్మరూపముతో సదా ఈ విశ్వమును సృష్టించెదను. శంకరుని రూపముతో సంహరించెదను. సృజించుట, పాలించుట చేయుచుందును. శంకరుని వలన మీకు భయము కలుగదని నేను మాట ఇచ్చుచున్నాను.

బ్రహ్మదేవా! సుదర్శన చక్రము, శంకరుడు నాకు ప్రియమైనవి, ఈ శంకరుడు కోరినచో కోట్ల కొలది సూర్యులను, బ్రహ్మలను సృష్టించగలరు. బాహ్య జ్ఞానము పట్టించుకొనక నా ధ్యానమునందే మంత్రములను జపించును.

"యే యథా మాం ప్రపద్యన్తే తాం సథైవ భజామ్యహమ్"
9వ స్కంధము, 15వ అధ్యాయము, 29వ శ్లోకము

ఇంతలో శంకరుడు త్రిశూలముతో వచ్చి నారాయణునకు ప్రణమిల్లెను. అప్పుడు మహదేవుడు భగవన్ వృషధ్వజుడు నా పరమభక్తుడు. సూర్యుని శాపము వలన ఇతని శాపములన్నియు నశించును. అనగా విష్ణువు శంభో! ఇరువది యొక్క యుగములు గడిచెను. మీ స్థానములకు వెళ్ళుడు. కాలము ఆగదు. వృషధ్వజుని మృత్యువు ఆహారముగ చేసికొనినది.

అతని పుత్రుడు రథధ్వజుడు జగత్తునందు లేదు. అతని కిరువురు పుత్రులు కలరు. ధర్మధ్వజుడు, కుశధ్వజుడు, వారి భార్యల నుండి లక్ష్మి ప్రకటితయగును. ఇట్లు పలికి అంతఃపురమునకు వెళ్ళిపోయెను.

ధర్మధ్వజుని భార్యపేరు మాధవి. ఆమెకు కార్తీకపూర్ణిమ నాడు ఒక కన్య ప్రకటిత అయ్యెను. 'తులసి' యని నామకరణముగా వించిరి. ఆమె బదరికాశ్రమమున నారాయణుని భర్త కావలెనని వేల సంవత్సరములు తపములు చేసెను. బ్రహ్మ బదరికాశ్రమమునకు వచ్చెను. బ్రహ్మకు తులసి ప్రణమిల్లెను. తులసి పితామహా! రాధ నాకు నీవు మానవయోనియందు జన్మించుమని శపించెను. నా అభిలాష నారాయణుడు నా భర్త కావలెననియే అనగా బ్రహ్మ సుధాముడను గోపకుడు కూడా రాధ శాపమున భూలోకమున జన్మించెను. శంఖచూడుడను పేరుతో ప్రసిద్ధుడయ్యెను. పూర్వజన్మ స్మృతి కలిగియుండెను. నారాయణుని భర్తగా పొందగలవు.

వృక్షముగా రూపొంది బృందావని యని నిన్ను పిలిచెదరు. నీ నుండి పుట్టిన ఆకులతో మాధవుని పూజ సంపన్నమగును. రాధ యొక్క షోడశాక్షర మంత్రమును నీకు ఉపదేశించెదను. నీవు రాధకు ప్రియురాలవగుదువు. అప్పుడు తులసి భగవతి రాధను ఉపాసించెను. ఫలము ప్రాప్తించెను.

వృషధ్వజుని కుమార్తె తులసి బదరీవనమున తపము చేయుచుండగా అక్కడికే వచ్చి జైగీషైన మునికృప వలన శ్రీకృష్ణుని మంత్రము పొందెను. తులసి దృష్టి అతనిమీద పడెను. శంఖచూడుడు కూడా తులసిని చూచి దేవీ! నీవెవరవు? నిన్ను పరిచయము చేసుకొనుము. అనగా తులసి నేను ధర్మధ్వజ రాజు కుమార్తెను. ఇచటనుండి వెళ్ళి పొమ్ము. ఉన్నత కులము వారు కన్యలతో ఏకాంతముగా సంభాషించుట మంచిది కాదు. మోక్షమును కోరు వ్యక్తులు స్త్రీలను చూడగోరరు అని చెప్పి మౌనము వహించెను.

శంఖ చూడుడు దేవీ! నీవు చెబుతున్నది వాస్తవమే. లక్ష్మి, సరస్వతి, దుర్గ, సావిత్రి, రాధిక – ఈ ఐదు మంది దేవీమణులు సృష్టిసూత్రములు. సృష్టి జరుపుటయే వీరి పని, సకల శుభములకు తల్లులు, శతరూప, దేవహూతి, స్వధా, స్వాహా, దక్షిణ, ఛాయావతి, రోహిణీ, వరుణాని, శచి, కుబేరుని భార్య, అదితి, దితి, లోపాముద్ర, అనసూయ, కోట, తులసి,

అహల్య, అరుంధతి, మేన, తారా, మండోదరి, గంగ, దమయంతి, వేదవతి, మనసా, పుష్టి, తుష్టి, స్మృతి, మేధ, కాళిక, వసుంధర, షష్టీ, మంగలచండి, ధర్మపత్నీ, మూర్తి, స్వస్తి, శ్రద్ధా, శాంతి, కాంతి, క్షమ, నిద్ర, తంద్ర, క్షుధ, పిపాస, సంధ్య, దివా, రాత్రి, సమృత్తి, ధృతి, కీర్తి, క్రియ, శోభ, ప్రభ, శివా, వీరంతా ప్రతి యుగమునందు ఉత్తములుగా చెప్పుదురు.

జగదంబ కళాంశము నుండి దివ్య అప్సరసలు కులటలుగా విఖ్యాతలైరి. నేను బ్రహ్మ ఆజ్ఞానుసారమే నీచెంతకు వచ్చితిని. గాంధర్వ వివాహ విధానము ననుసరించి నిన్ను నా సహధర్మచారిణిగ చేసికొందును. నేను శంఖచూడుడను. శ్రీహరివెంట నుండెడివాడను, సుధాముడను పేరుగల గోపకుడను. ఇపుడు దానవుడనైతిని, నీవు ముందు జన్మలో శ్రీకృష్ణుని చెంతనుండెడి తులసివి అనెను.

తులసికాంతుడా! సద్విచారముగల నీ వంటి పురుషునితో ఓడిపోతిని. అశౌచముతో ఉన్న బ్రాహ్మణుడు 10 దినముల తరువాత, క్షత్రియుడు 12 దినముల తరువాత, వైశ్యుడు 15 దినముల తరువాత, శూద్రులు ఒక మాసము తరువాత శుద్ధులగుదురు, పతిస్వీకరణ చేయునపుడు నిశితముగా ఆలోచించవలెను, ఇట్లు పలికి తులసి మౌనము వహించెను.

బ్రహ్మ అక్కడకు వచ్చి నీవు తులసిని గాంధర్వ వివాహముతో స్వీకరింపుము, నారాయణుని వద్ద లక్ష్మి, శ్రీకృష్ణుని చెంత రాధిక, నా దగ్గర సావిత్రి, వరాహస్వామి వద్ద పృథివి, యజ్ఞుని చెంత దక్షిణ, అత్రి వద్ద అనసూయ, నలుని దగ్గర దమయంతి, చంద్రుని చెంత రోహిణి, కామదేవుని వద్ద రతి, కశ్యపుని వద్ద అదితి, వశిష్టుని చెంత అరుంధతి, గౌతముని దగ్గర అహల్య, కర్దముని వద్ద దేవహూతి, బృహస్పతి వద్ద తార, మనువు వద్ద శతరూప, అగ్ని వద్ద స్వాహాదేవి, ఇంద్రుని చెంత శచీదేవి, గణేశుని చేరువ పుష్టి, స్కందుని వద్ద దేవసేన, ధర్ముని దగ్గర సాధ్వీమూర్తి శోభిల్లుచున్నారు. ఇప్పుడు శంఖచూడుని పత్నిగా పొంది

శ్రీకృష్ణుని దగ్గరకు, శంఖచూడుడు వైకుంఠమునకు చేరి విష్ణువు నందు లీనమగుదురు.

నారాయణుడు నారదా! శంఖచూడునకు తులసికి ఆశీర్వాద రూపమున తెలిపి బ్రహ్మ తన లోకమునకు వెళ్ళిపోయెను. అప్పుడు తులసిని పెళ్ళి చేసుకొనెను. తులసితో చాలాకాలము రాజ్యము చేసెను.

శ్రీహరి బ్రహ్మదేవునితో ఈ సుదాముడు గోపకుడు. నా పార్షదులలో అతడు ప్రముఖుడు, శ్రీరాధ శాపము అతనిని దానవయోనియందు జన్మించుటకు వివశుని చేసినది. సఖియలు తిరస్కరించిన కారణమున ఆమె అతనికి శాపమొసగెను. రాధ కృపాచిత్తయై ప్రసన్నురాలయ్యెను. నేను రాధకు నచ్చచెప్పగా అర్ధక్షణములో శాపము ననుభవించి సుదామా! నీ విచటకు తిరిగిరమ్ము. అంటే గోలోకమున అర్ధక్షణమంటే మన్వంతర కాలము.

శంకరుడు త్రిశూలముతో రాక్షసుని సంహరించును. అయితే శంఖచూడుడు కవచమును ధరించియుండును. అతని కంఠమున నా కవచమున్నంతవరకు ఎవ్వరును సంహరింపలేరు. నేనే బ్రాహ్మణ వేషమును ధరించి కవచ మిమ్మని యాచించెదను. అతని పత్ని యొక్క సతీత్వము నశించినప్పుడే అతనికి మృత్యువు కలుగును. అతని భార్య గర్భమున నేను నా వీర్యముంచుదును. 'తులసి' నాకు చిరకాల ప్రియురాలు. శంఖచూడునికి మృత్యువు సంభవమగును. ఆ దానవుని భార్య ఆ శరీరమును త్యజించి నా ప్రియపత్ని యగును.

నారాయణుడు నారదా! చిత్రరథుడు శంకరునకు ప్రియమైనవాడు. అతని దూత పుష్పదంతుని శంఖచూడుని వద్దకు పంపి అతనితో శంకరుడు చెప్పిన మాటలను వినిపించెను. నీవు దేవతల రాజ్యమును అప్పగించుడు లేక యుద్ధమునకు సిద్ధము కమ్ము. అనగా శంఖచూడుడు దూతా! నేను

రేపు ప్రాతఃకాలమున బయలుదేరెదను. నీవు వెళ్ళుము అనెను. శంఖచూడుడు శంకరునికి చెప్పగా అప్పుడే శంకరుని వద్దకు కార్తికేయుడు, వీరభద్రుడు, నందీశ్వరుడు మొదలగువారందరు అచటికి వచ్చిరి.

అక్కడ శంఖచూడుడు తులసితో యుద్ధమునకు సంబంధించిన విషయములను తెలిపెను. శ్రీ కృష్ణుని కృపతో తనకు ప్రాప్తించిన ఉత్తమజ్ఞానమును శంఖచూడుడు తులసికి తెలిపెను.

సర్వే జనా స్సుఖినో భవంతు - ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

* * *

దేవీ భాగవతము

దేవీనవరాత్రులు - ఐదవరోజు కథ

1. శంఖచూడుడు శంకరుల సంభాషణ

శంఖచూడుడు గురువరులను ముందుంచుకొని శంకరుని సేవించుటకై బయలుదేరెను. పుష్పభద్రానదీతీరమున సిద్ధక్షేత్రమున శంకరుని దర్శించెను. శంకరుని వామభాగమున భద్రకాళి విరాజిల్లుచుండెను. కార్తికేయుడు కూడ ఉపస్థితుడైయుండెను.

మహాదేవుడు శంఖచూడునితో రాజా! ధర్మజ్ఞుడైన పుత్రుని పేరు ధర్ముడు. ధర్ముని పుత్రుడు మరీచి. కశ్యపుని పుత్రుని రూపమును పొందెను. దక్షుడు తన పదముగ్గురు కన్యలను ఇతనికొసగెను. ఆ వంశమును వృద్ధి చేయు పరమసాధ్వి దనువు. ఆమెకు నలుబది పుత్రులు కలిగిరి. వారు దానవులని పిలువబడిరి. విప్రచిత్తి ఆ పుత్రులలో సుప్రసిద్ధుడు. విప్రచిత్తి కుమారుడు దంభుడు. అతడు శుక్రాచార్యుని గురువుగా చేసికొని శ్రీకృష్ణుని ఉత్తమ మంత్రమును లక్ష సంవత్సరములు జపించెను. శంఖచూడా! నీవు పూర్వజన్మము నందు శ్రీకృష్ణుని పార్షదుడవు. రాధిక శాపమున భారతదేశమున దానవేశ్వరుడవైతివి. రాజా! నీవు దేవతల రాజ్యమును వారికిచ్చివేయుము. దేవ దానవులందరు కశ్యపుని వంశము వారే.

రాజేంద్రా! ఈ సంపదలు స్థిరముగా నుండజాలవు. ప్రళయ సమయమున బ్రహ్మ కూడా అంతర్ధానమగును. అప్పుడు బ్రహ్మకు స్మృతి కూడా లోపించియుండును. తపమొనరించి పరమజ్ఞానియై సృష్టి జరుపును. బ్రహ్మకు స్రష్టయను బిరుదు లభించును.

సత్యయుగము నందు ఎవ్వరును అసత్యమాడరు. ధర్మము సకల అంశలతో విరాజిల్లుచుండును. త్రేతాయుగమున మూడు భాగములతో

ద్వాపరమున రెండు భాగములుగా కలియుగమున ఒక్క భాగముతో ధర్మము నిలిచివుండునని చెప్పుదురు.

పరబ్రహ్మ పరమాత్మచేతనే కాలము యొక్క సమానత్వము నెరపబడును. దీనికి పరమేశ్వరుడే కారణము. ఆ స్వామి వలననే నేను కూడా మృత్యుంజయుడనగు సౌభాగ్యమును పొందితిని. ప్రాకృత ప్రళయములను నేను చూచితిని, శంఖచూడునితో ఇట్లు పలికి శంకరుడు సభా మధ్యమున మౌనము వహించెను.

అప్పుడు శంఖచూడుడు భగవన్ – మీరు జాతి ద్రోహము పాపమని చెప్పితిరి. నేను బలిచక్రవర్తి సకల ఐశ్వర్యములను పాతాళమునుండి తీసుకొని వచ్చితిని. దేవదానవుల మధ్య శత్రుత్వమునందు మీరు కల్పించుకొనుట సముచితము కాదని తెలియుచున్నది. అనగా అతని మాటలను విని త్రిలోచనుడు నవ్వసాగెను.

రాజా! ఓడిపోయినచో అపకీర్తి ఎట్లగును? మునుపు మధుకైటభులతో శ్రీహరి కూడా యుద్ధమొనర్చెను కదా! హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షునితో శ్రీహరి యుద్ధమొనర్చెను. త్రిపురుడను పేరుగల దైత్యునితో యుద్ధము చేసితిని. జగదంబ శుంభ నిశుంభాది అసురులతో యుద్ధము చేసెను. నీవు శ్రీకృష్ణుని అంశవు.

రాజా! నీతో యుద్ధము చేయుటవలన నేను సిగ్గుపడవలసినదేమున్నది. దేవతలు శ్రీహరిని శరణు జొచ్చిరి. అప్పుడే స్వామి నన్ను నీ చెంతకు పంపి దేవతలరాజ్యమును తిరిగి వారికిచ్చివేయుము. లేదంటే యుద్ధమునకు సిద్ధముగా వుండుమని పలికి శంకరుడు మౌనము వహించెను.

2. శంఖచూడుని యుద్ధము – గోపకుడై గోలోకము చేరుట

శంఖచూడుడు మహాదేవునకు నమస్కరించెను. రథారూడుడై తన సైన్యమును దేవతలతో యుద్ధమొనరింపుమని ఆజ్ఞాపించెను. మహేంద్రుడు

వృషపర్వునితో, భాస్కరుడు విప్రచిత్తితో, దంభునితో చంద్రుడు, కాలస్వనునితో కాలకి, గోకర్ణునితో అగ్నిదేవుడు, కాలకేయునితో కుబేరుడు, మయునితో విశ్వకర్మ, భయంకరునితో మృత్యువు, సంహారకునితో యముడు, విశంకునితో వరుణుడు, చంచులునితో సమీరణుడు, ధృతపృష్ణునితో బుధుడు, రక్షాకునితో శనేశ్వరుడు, రత్నసారునితో జయంతుడు, వర్చసీ గణములతో వసుగణములు, దీప్తిమంతునితో అశ్వినీకుమారులు, ధూమ్రునితో నలకూబరుడు, దురందునితో ధర్ముడు, ఉషాక్షునితో మంగళుడు, శోభాకరునితో భానుడు, పిఠరునితో మన్మథుడు తలపడిరి.

అనేక దానవులతో ఆదిత్యులును, ఏకాదశరుద్రులును, దానవ స్త్రీలతో సకల నందీశ్వరులకును, యుద్ధము జరుగసాగెను. శంకరుడు, కార్తికేయునితో వటవృక్షము క్రింద కూర్చొనియుండెను. దానవులధాటికి దేవతలు భయపడుచుండగా కార్తికేయుడు వారితో యుద్ధము చేయసాగెను. భద్రకాళి రాక్షసులను అఘాతములతో ధరాశయనులను చేసెను.

శంఖచూడుడు స్వయంగా బాణవర్షము కురిపించసాగెను. ఆగ్నేయాస్త్రమును ప్రయోగించెను. దేవతలందరు నిలువలేకపోయిరి. కాళి ప్రయోగించిన వారుణాస్త్రమును మహేశ్వరాస్త్రమును దానవేంద్రుడు నివారించెను. కాళి నారాయణాస్త్రము ప్రయోగించగా శంఖచూడుడు క్రిందపరుండి ఆ అస్త్రమునకు ప్రణామము చేసెను. బ్రహ్మాస్త్రమును ప్రయోగించగా దానవేంద్రుడు ఉపశమింపచేసెను.

దేవి మంత్రపూతమగు పాశుపతాస్త్రము చేబూనెను. ఆకాశవాణి స్వామీ! ఇతని భార్య పరమసాధ్వి. ఇతనిని సంహరించు శక్తి పాశుపతాస్త్రమునకు లేదు. అతని కంఠసీమయందు శ్రీహరి మంత్ర కవచమున్నంత వరకు భార్యసతీత్వము రక్షింపబడి ఇతని జరామృత్యువులు సమీపింపజాలవు. ఇది బ్రహ్మవచనము అనెను.

క. తులసీ పాతివ్రత్యం
బలరుచు నున్నన్నినాడు లసురుం డెందుం
జలియింప డిద్ది మున్నే
జలజభవునివరము మీకు సంశయమేలా!

చ. తలపడి బాహుయుద్ధమున దైత్యునితోడను గాళి దా మహా
ప్రళయభయంకరాకృతిని భాసిలి పోరుచు రాక్షసేంద్రునిన్
బలువిడి బట్టి వైళము నభంబునకుం గొనియేగి కూల్పగా
నిలబడి లేచి ధైర్యమున నెక్కొని కాళికి మ్రొక్కి గ్రక్కునన్

తే.గీ. మరల రథమెక్కి యసురుండు మహితలీల
వెలుగగా గాంచి కాళి తా విస్మయంబు
నొంది శంకరు సన్నిధియందు చేరి
శంఖచూడు రణాద్యంతసరణి నుడివి

చ. కదనమునందు రాక్షసుని గ్రక్కదలింప దరంబుగాదు శుం
భదురుమహోగ్రమై యెసగుబాశుపతంబున కంచు వాణి యొ
ప్పిదముగ బల్కె నాత డతిభీకరుడయ్యెను జ్ఞానియౌట నా
ప్రదరము ద్రుంచెగాని తన బాణము నాపయి నేయ డొక్కడున్

భద్రకాళి సలిపిన యుద్ధమునంతయు విని శంకరుడు స్వయంగా సంగ్రామరంగమును చేరెను. శివునకు శంఖచూడునకు చాలాకాలము యుద్ధము జరుగసాగెను. కొంతకొంత సేపు ఇరువురు విశ్రమిస్తూ మరలయుద్ధమునకు పూనుతుండిరి. అపుడు శ్రీహరి వృద్ధ బ్రాహ్మణుని వేషమున వెళ్ళి శంఖచూడునితో రాజా! నీవు నాకు దయతో భిక్షనొసగుదునని ప్రతిజ్ఞ చేయుము. తరువాతనే నా కోరికను తెలిపెదను అనెను.

శంఖచూడుడు ప్రసన్నుడై నీవు దేనిని కోరినను నేనిచ్చుటకు సంసిద్ధుడను అనగానే వృద్ధ బ్రాహ్మణుడు నేను నీ 'కృష్ణ కవచమును'

కోరుచున్నాననగానే వెంటనే శంఖచూడుడు ఇచ్చిన మాట ప్రకారం ఆ దివ్యకవచమును అతనికొసగెను.

శ్రీహరి శంఖచూడుని వేషము దాల్చి తులసి వద్దకు వెళ్ళి కపటముతో ఆమెతో నవ్వుచూ పరిహాసములు చేయగా తులసీ సతీత్వము భంగమయ్యెను.

అదే సమయమున శంకరుడు త్రిశూలముతో శంఖచూడునిపై ప్రయోగించగా అతడు తన ధనుస్సును భూమి మీద విసరివేసి శ్రీకృష్ణుని చరణకమలములను ధ్యానించసాగెను. త్రిశూలము శంఖచూడుని మీద పడగానే దానవేశ్వరుడు కాలి భస్మమయ్యెను.

భస్మమగుటతోడనే అతడొక దివ్యగోపకునిగా వేషము ధరించెను. అతనిచేతిలో మురళి దేదీప్యమానముగానుండగ ఒక దివ్యవిమానము గోలోకము నుండి దిగివచ్చెను. అందులో గోపికలు ఆసీనులైయుండిరి. శంఖచూడుడు దాని నధిరోహించి గోలోకమునకు వెళ్ళిపోయెను.

ఆ సమయమున శ్రీకృష్ణుడు రాధికతో బృందావనములో విరాజమానుడైయుండెను. శంఖచూడుడు భక్తితో తలవంచి ప్రణామము చేసెను. తమ చిర సేవకుడగు సుధాముని తమ ఒడిలోనికి ఆ ఇరువురు తీసికొనిరి.

శంఖచూడుని అస్తికలు శంఖములుగా ఉత్పన్నములయ్యెను. నేడు శంఖజలమును శ్రేష్ఠముగ భావించెదరు. శంఖమున్నచోట శ్రీహరి భగవతి లక్ష్మిని కూడి సదా నివాసముండును. శివుడు కూడా శంఖచూడుని సంహరించి తన లోకమునకు వెళ్ళిపోయెను. దేవతలు, మునిగణములు శంకరుని అనేక విధములుగ ప్రశంసించిరి.

3. తులసి మహిమ

నారదుడు ప్రభూ! నారాయణుడు ఏ రూపమును ధరించి తులసితో హాస విలాసము లొనరించెను. శంఖచూడుని రూపముతో శ్రీహరి తులసి

ఇంటికి వెళ్ళెను. శంఖచూడుని సంహరించుటకు తులసి పాతివ్రత్య భంగమొనర్చుటే ఏకైక సాధనము.

తులసి అప్పుడు తన భర్త తిరిగి వచ్చెనని భావించి ముదముతో హాసవిలాసములు జరిపెను. కాని తులసికి ఆ స్థితి లేకుండుట గమనించిమాయావీ! నీవెవరవో నా సతీత్వమును నష్టపరచితివి, నీకు శాపము నిస్తున్నానని పాషాణ స్వరూపులగుదురుగాక! యని శపించెను.

అయ్యో! నిరపరాధియగు మీ భక్తుని మీరే సంహరించితిరి గదా! అప్పుడు శ్రీహరి నీతి వచనములతో సమాధానమొసగెను. భద్రురాలా! నీవు భారతదేశమునందు అనేక సంవత్సరములు తపమొనర్చితివి, శంఖచూడుడు కూడా తపమొనరించుచుండెను. అతడు నా అంశయే. నిన్ను స్త్రీ రూపమున పొంది గోలోకమునకు వెళ్ళిపోయెను. నీవిపుడు లక్ష్మితో సమానముగా నాతోనుండుము. యీ శరీరము గండకీనదీ రూపమున ప్రసిద్ధమగును.

నీ కేశకలాపములు పవిత్ర వృక్షమగును. ఆ చెట్టు తులసియనుపేరుతో ప్రసిద్ధి వహించును. తులసిచెట్టు క్రింది భాగము పరమ పవిత్రమగును. రాలిన ఆకులను పొందుటకు దేవతలు ఆ చెట్టుక్రింద వేచివుందురు.

తులసి పత్రములు కూడిన జలముతో అభిషేకము జరిగినచో సకల తీర్థములందు స్నానమొనరించి సమస్తయజ్ఞములందు దీక్షితుడయ్యెనని తలంచవలెను.

మరణించు సమయమున తులసి ఆకుతో నీరు పోసి త్రాగించినచో వాని సర్వపాపములు దూరమగును. వైకుంఠధామమును చేరుటకు అర్హుడగును. తులసిని తనయందుంచుకొని ప్రాణత్యాగము చేసినవాడు విష్ణులోకమునకు వెళ్ళును. తులసిమాల మెడలో ఉన్నవాడు అశ్వమేధఫలమును పొందును. అయితే స్నానము చేయకుండా తులసీ ఆకులను త్రెంపరాదు, తాకరాదు.

శ్లో॥ స్వర్గే మర్త్యే పాతాళే గోలోకే మమ సన్నిధౌ
భవ త్వం తులసీవృక్ష వరా పుష్పేషు సుందరీ
గోలోకే విరజాతీరే రాసే బృన్దావనే వనే
తులసీ పత్రపతన ప్రాప్తయే చ వరాననే
సస్నాతస్సర్వతీర్థేషు సర్వయజ్ఞేషుదీక్షితః
తులసీపత్రతోయేన యోఽభిషేకం సమాచరేత్
ప్రాణాంస్త్యజతి తీర్థేషు విష్ణులోకం స గచ్ఛతి
తులసీకాష్ఠనిర్మాణమాలాం గృహ్ణాతి యో నరః
తులసీం యే విచిన్వన్తి తే ఛిన్దన్తి హరే శ్శిరః
త్రిరాత్రం తులసీపత్రం శుద్ధం పర్యుషితం సతి
శ్రాద్ధే వ్రతే చ దానే చ ప్రతిష్ఠాయాం సురార్చనే
భూగతం తోయపతితం యద్దత్తం విష్ణవే సతి

గోలోకమున అధిష్ఠాదేవివై శ్రీకృష్ణుడనగు నన్ను నిరంతరము క్రీడింపుము. అచట లక్ష్మితో సమానముగా విరాజమానురాలవగుదువు. నీ శాపమును సత్యమొనరించుటకు నేను భారతదేశమున పాషాణముగా రూపొందెదను.

నీలమేఘాకార పాషాణముగ లక్ష్మి నారాయణులను లక్ష్మీ విష్ణువులుగ, రాఘవేంద్రునిగ, వామనుడుగ, శ్రీధరుని రూపముగ, దామోదరునిగ, రామునిగ, అనంతునిగ, మధుసూదనుడుగ, గంగాధరునిగ, హయగ్రీవునిగ, నరసింహునిగ, శ్యామవర్ణముతో కూడిన ప్రద్యుమ్ననిగ, సంకర్షణుడుగ, అనిరుద్ధునిగ తలంచవలెను.

సాలగ్రామమున్నచోట శ్రీహరి లక్ష్మి కూడ నివసించును. సాలగ్రామ సమక్షముననున్న పురుషుడు సమస్త తీర్థములందు, స్నానమొనరించిన పుణ్యమును, సకల యజ్ఞములు చేసిన ఫలములను పొందును. నాలుగు

వేదములను పఠించుట వలన పుణ్యము సాలగ్రామ శిలను ఉపాసించినచో ప్రాప్తమగును.

సాలగ్రామ శిలను జలముతో అభిషేకించిన పురుషుడు సమస్త దానముల వలన కలుగు పుణ్యములను పృథివికి ప్రదక్షిణ చేసిన ఉత్తమ ఫలమునకు అధికారి కాగలడు.

మృత్యుసమయమున సాలగ్రామ జలము పానము చేసినచో సమస్త పాపములనుండి ముక్తుడగును. సాలగ్రామము మీద నున్న తులసీ పత్రమును తొలగించువానికి రెండవ జన్మయందు భార్య సహకరించదు. తులసితో ఇట్లు పలికి శ్రీహరి మౌనము వహించెను. తులసి తన శరీరమును వదలి శ్రీహరి వక్షస్థలమున లక్ష్మివలె శోభిల్లసాగెను.

నారదా! లక్ష్మి, సరస్వతి, గంగ, తులసి ఈ నలుగురు దేవీమణులు భగవంతుడగు శ్రీహరికి పత్నులైరి. తులసి దేహము నుండి గండకీనది ఉత్పన్నమయ్యెను. శ్రీహరి కూడా ఆ నదీతీరమున సాలగ్రామముగా పరిణమించెను.

4. తులసి పూజ - నామాష్టకము

నారాయణుడు తులసిని తన ప్రియురాలినిగ చేసికొని పూజించెను. తులసిని గౌరవించి, లక్ష్మిని వెంటనిడుకొని ఆనందించుచుండెను. లక్ష్మి గంగలు తులసి యొక్క నవసమాగమును సహించుచుండిరి. సరస్వతి క్షోభకు గురిఅయ్యెను. సరస్వతి ద్వారా అవమానింపబడి తులసి అంతర్ధానమయ్యెను. దేవి తులసికి సకల యోగసిద్ధులు ప్రాప్తించెను.

శ్రీహరి నచ్చజెప్పి తులసి వనమునకు బయలుదేరెను. లక్ష్మి బీజము (శ్రీం) మాయా బీజము (హ్రీం) కామ బీజము (క్లీం) వాణీ బీజము (ఐం) (బృందావనీ) అని (స్వాహా) పదములతో

"ఓం శ్రీం హ్రీం క్లీం ఐం బృందావన్యై స్వాహా "

ఈ దశాక్షర మంత్రమును ఉచ్చరించవలెను. నేతి దీపము, ధూపము సింధూరము, చందనము, నైవేద్యము, పుష్పములు మొదలైన షోడశోపచారములతో తులసి సుపూజిత అగును.

తులసి చెట్టు నుండి ప్రసన్నురాలై శ్రీహరి చరణ కమలములను శరణుజొచ్చెను. భగవానుడామెకు దేవీ! నీవు సర్వపూజ్యవగుదువు. నా మస్తకమున, వక్షస్థలమున ధరించెదను అని శ్రీహరి బృందావనమునకు వెళ్ళి తులసినిట్లు స్తుతించెను.

బుధులు బృందాయని పిలిచెదరు. బృందావని అని, విశ్వపూజితయని, పేరొంది అనంతుని పవిత్రమొనరించి, విశ్వపావనివైతివి. నందని నామముతో నీవు ప్రసిద్ధురాలవు. తులసిగా పిలువబడితివి. కృష్ణజీవని అనిపేరుతో ఖ్యాతి చెందినది.

తే.గీ. బృందరూపంబుగా వృక్ష వితతి యగుచు
పృథివి నేదేవి జనియించి వృద్ధిగాంచు
గతమునం జేసి బృందాఖ్య గాంచి మించె
నట్టి తులసిని బ్రార్థింతు ననుదినంబు

తే.గీ. సమ్మదమ్మున బృందావనమ్ము నందు
తొల్లి యేదేవి తా నుద్భవిల్లి లలిత
కలిత బృందావనాభిఖ్య గాంచిమించె
నట్టి తులసిని బ్రార్థింతు ననుదినంబు

తే.గీ. అఖిలవిశ్వంబులందును నఖిలజనుల
వలన బూజింపబడుచు నిర్మలత గాంచి
పృథివిపై విశ్వపూజితాభిఖ్య గాంచె
నట్టి తులసిని భజియింతు ననుదినంబు

తే.గీ. వివిధవిశ్వంబులకును బావిత్ర్యమిచ్చి
పృథివి నేదేవి విశ్వపావని యనంగ
ఖ్యాతి వహియించె నట్టి సత్కాంతిసహిత
యైన తులసిని భజియింతు ననుదినంబు

తే.గీ. పువ్వులెన్ని యున్న బురుహూతముఖ్యులు
నీవు లేని పూజ నిష్ఫలం బ
టంచు దలతు రట్టి యఖిల కుసుమ సార
వైన నిన్ను గొలువ నభిలషింతు

తే.గీ. ప్రియతమవు నీవు గావున బృథివియందు
కృష్ణజీవని యనియెడి కీర్తి నీకు
గలిగె నావల్ల నిది నీకు గాదు మిథ్య
కావుననె నన్ను రక్షించుగాత దేవి (మ.క.దా.శ్రీ.)

విష్ణువిట్లు పలుకగా తులసి మిగుల సంతుష్టురాలయ్యెను. సరస్వతి తులసిని చేయు పట్టుకొని తన వద్ద కూర్చొనబెట్టుకొనెను. గంగ, లక్ష్మీదేవి-ల ముఖము నందు చిరునగవు వ్యాపించెను.

వృంద, వృందావని, విశ్వపూజిత, విశ్వపావని, పుష్పసార, నందిని, తులసి, కృష్ణ జీవని అని దేవికి ఎనిమిది నామములు. ఈ దేవీ నామాష్టకమును పఠించినవాడు అశ్వమేధయజ్ఞఫలమును పొందును. కార్తిక పౌర్ణమినాడు తులసి ప్రకటితమయ్యెను. మొదట శ్రీహరి ఆ దేవిని పూజించెను.

కార్తీకమాసము నందు తులసీపత్రము సమర్పించిన పురుషుడు పది వేల గోవులను దానము చేసిన ఫలము నిశ్చితముగా పొందును. తులసి నామాష్టకమును వినినంత మాత్రమున సంతానహీనుడు పుత్రవంతుడగును. పాపిముక్తుడగును.

నారదా! పూజ, ధ్యాన విధానములు వినుము. వేదమునందలి కణ్వశాఖ యందు దీనిని ప్రతిపాదించిరి. తులసి వృక్షము నందు షోడశోపచారములతో ఆ దేవిని పూజింపవలెను.

క. తులసీదేవీ భవ ని
ర్మలమగు గార్తికిని బూర్ణిమను హరి దానే
తులసిం బూజించెను ద
త్తులసి ప్రభావంబు సర్వతోభద్రమగున్

క. కీర్తించుచు శ్రీతులసిం
గార్తిక బూర్ణిమను బూజగావించు నెవం
డార్తి దొలగి యా మనుజుడు
వర్తించును సౌఖ్యపదవి వైకుంఠమునన్

క. పురుషు డెవడు కార్తికమున
పురుషోత్తమునకు భక్తిబొదలగ దులసీ
వరదళము నొసగు నాతడు
బరగు సయుత ధేనుదానఫలమంది ధరన్

మ. తులసిం గార్తికమందు గొల్చు నరు డొందుం బుత్రపౌత్రాభయో
జ్వలదారోగ్యసుఖాయురున్నతులు దత్ప్రోతంబు ధ్యానంబు పూ
జలు నెల్లన్ నిగమంబునందె తెలియన్ జాలంగ గణ్యోక్తిమై
తులసీ వృక్షము దృష్టిగోచరము నిర్దుష్టప్రభావంబునై
మెలగుం దానికి మించు భద్రతము భూమిన్ వేరె లే దెన్నగన్

ఆ.వె. తులసికి దుల లేదు తులసి పావనమూర్తి
తులసి ముక్తిదాత్రి తులసి వంద్య
తులసి సర్వపూజ్యతులసి శిరోధార్య
తులసి విష్ణుభక్తి కలన కర్తి

భగవంతుడు ఈ దేవిని తన మస్తకమునందుంచుకొనెను. శ్రీహరి భక్తియును ప్రసాదించుట సహజగుణము. పూజ, స్తవనము చేసి దేవికి ప్రణామముగావించవలెను.

5. వేదవతి – సీత – ద్రౌపది పూర్వజన్మలు

నారాయణుడు మునీంద్రా! ధర్మధ్వజుడు, కుశద్వజుడు లక్ష్మిని ఉపాసించిరి. కుశధ్వజుని భార్యపేరు మాళవతి. ఆమెకొక పుత్రిక జన్మించెను. జన్మించిన వెంటనే ఆ కన్య వేదమంత్రములనుచ్చరించు చుండెను. వేదవతియని నామకరణము గావించిరి.

పుట్టగనే తపమునకు వెళ్ళి మన్వంతరము తపోనిష్ఠురాలై ఉండగా ఆకాశవాణి సుందరీ! రాబోవు జన్మలో శ్రీహరి భర్తకాగలడు అనెను. వేదవతి మునుపటి కంటే కఠినమైన తపము ప్రారంభించెను. ఒకదినము ఆమె రావణుని చూచెను. వేదవతి అతిథి ధర్మము చేయగా అతడు ఆమెతో దుష్టప్రవర్తనతో నడచుకొనగా ఆ దేవి దురాత్ముడా! నీవు కామభావముతో నన్ను స్పృశించితివి, నీవు నా నిమిత్తముగానే మృత్యువునకు ఆహారమగుదువు.

వేదవతి ఇట్లు పలికి యోగాగ్ని ద్వారా అచటనే తన శరీరమును పరిత్యజించెను. రావణుడు ఆమె మృత శరీరమును గంగలో పడవేసెను. ఆ వేదవతియే రెండవ జన్మమున జనకుని కన్యకగా ఆవిర్భవించినది. ఆ దేవి పేరే సీత. పూర్వజన్మతపః ప్రభావమున స్వయముగా శ్రీరాముడు ఆమెకు భర్త అయ్యెను.

శ్రీరామునితో కూడి సుఖములను అనుభవించెను. పూర్వజన్మ విషయములు ఆమెకు జ్ఞాపకముండెను. శ్రీరాముడు తండ్రి వచనములను సత్యము చేయుటకై అడవులకు వెళ్ళిపోయెను. బ్రాహ్మణ వేషములో అగ్నిదేవుడు రామునితో శ్రీరామా! సీతాపహరణ సమయము ఇప్పుడు

మీకు సమీపించుచున్నది. ఈ సీతాదేవిని నా యందు అప్పగించుడు. ఛాయామయి యగు సీతను మీ వద్ద ఉంచుకొనుడు. సమయానుగుణముగ ఈ మాతను మీకు తిరిగి సమర్పించెదను. నేను బ్రాహ్మణుడనుకాను, సాక్షాత్తు అగ్నిని అనెను.

అప్పుడు శ్రీరాముడు సీతాదేవిని అగ్నికి అప్పగించెను. అగ్నినుండి మాయారూపము గల ఛాయా సీత ప్రకటిత అయ్యెను. సకల అంగములు, రూపురేఖలు సీతవలెనే ఉండెను. గోపనీయమగు రహస్యమును ప్రకటించవలదని మాయాసీతను రాముడు ఆపివేసెను.

ఇంతలో సీత ఒక బంగారు లేడిని చూచెను. సీత ఆ బంగారు లేడిని తెచ్చి ఇమ్మని రామునితో పట్టుబట్టెను. జానకి రక్షణ కొరకు లక్ష్మణుని నియమించెను. తాను ఆ మృగము వైపుకు పరుగిడెను. బాణముతో కొట్టి చంపివేసెను. ఆ మాయామృగము నోటినుండి హా లక్ష్మణా! అను శబ్ధము వెలువడెను. ఆ మృగ శరీరమును వదలిపెట్టి దివ్యదేహ సంపన్నుడయ్యెను. ఆ మృగరూపమున వున్న మారీచుడు పూర్వ జన్మమున ద్వారపాలునకు అనుచరుడై వైకుంఠద్వారము దగ్గర ఉండెను. ఇప్పుడు మళ్ళీ వైకుంఠ ద్వారమునకు చేరుకొనెను.

'హా లక్ష్మణా' అను శబ్దమును విని సీత రాముని దగ్గరకు వెళ్ళమని లక్ష్మణుని ప్రేరేపించెను. లక్ష్మణుడు రాముని దగ్గరకు వెళ్ళగానే రావణుడు సీతను అపహరించెను. సీత వారికి కనిపించకపోగా దుఃఖితులైరి. గోదావరీ నదీ తీరమున సీత జాడ వారికి లభించెను. వానరుల సహాయముతో సముద్రముపై వారధిని నిర్మించిరి.

రాముడు, వానరులందరు కలిసి లంకలో ప్రవేశించి రావణునితో యుద్ధము జరిగెను. రావణుడు అతని సోదరులు, బంధువులు అందరును మరణించిరి. సీతాదేవికి అగ్ని పరీక్ష జరిగెను. అగ్నిదేవుడు నిజమైన సీతను

శ్రీరామ చంద్రునకు అప్పగించెను. ఛాయాసీత నమ్రతతో నేనిప్పుడు ఏమి చేయవలయునో దయతో సెలవీయుడు అనగా అగ్నిదేవుడిట్లు పలికెను.

దేవీ! నీవు అత్యంత పుణ్యప్రదయగు పుష్కర క్షేత్రమునకు వెళ్ళుము. నీకు స్వర్గలక్ష్మీయగు అవకాశము ప్రాప్తించును. అగ్ని దేవుని మాటను విని ఛాయాసీత పుష్కర క్షేత్రమునకు వెళ్ళెను. తపస్సును మొదలుపెట్టెను.

తపస్సు ఫలితముగా ఛాయా సీతయే ద్రుపదుని ఇంట యజ్ఞవేది నుండి ప్రకటిత అయ్యెను. ఆమె పేరే ద్రౌపది. అయిదుగురు భర్తలు ఆమెకు భర్తలైరి. వేదవతి సత్యయుగమున కుశధ్వజుని కుమార్తెగా, త్రేతాయుగమున ఛాయా రూప సీతగ, శ్రీరామునితో సాహచర్యమును పొందెను. ద్రౌపదిగా ద్రుపదుని పుత్రికయై ద్వాపరయుగమున వుండగా ఈమెను "త్రిహా"యని అందురు. మూడు యుగములలోను ఈమె విద్యమానురాలై యుండెను.

నారదుడు – అయిదుగురు ద్రౌపదికి ఎట్లయ్యిరి తెలుపమని కోరగా శ్రీరాముని చెంతయుండిన ఛాయాసీత అగ్నిదేవుని ఆదేశానుసారము శంకరుని ఉపాసనయందు లగ్నమయ్యెను. పతిని పొందుటకు త్రిలోచనా! నాకు పతిని ప్రసాదింపుమనే మాటను అయిదుసార్లు ఉచ్చరించెను.

ఛాయాసీత ప్రార్థనను విని అయిదుగురు భర్తలు లభించెదరని వరమిచ్చెను. త్రేతాయుగమున సీతయే ద్వాపరయుగమున ద్రౌపది అయ్యెను. పంచపాండవులు భర్తలైరి.

రాముడు మనోహరియగు సీతను తిరిగిపొంది లంకను విభీషణున కప్పచెప్పి ఆ స్వామి స్వయముగ అయోధ్యకేతెంచెను. రామచంద్రుడు పదకొండువేల సంవత్సరములు రాజ్యము చేసెను. పురజనులతో సహా వైకుంఠధామమునకు వెళ్ళిపోయెను. ఇది పుణ్యప్రదమైన పవిత్రమైన ఆఖ్యానము. దీనిని చదివినవారికి సర్వపాపములు నశించును.

6. సావిత్రీదేవి పూజా విధానము

నారదుడు భగవన్! సావిత్రి ఉపాఖ్యానమును దయతో తెలుపుడు. సావిత్రి వేదములకు జనని అని వింటిని. ప్రప్రథమముగా దేవినెవరు పూజించిరి. నారాయణుడు మునీంద్రా మొట్టమొదట బ్రహ్మ, వేద జననియగు సావిత్రిని పూజించెను. దేవతలచే విద్వాంసులు పూజించిరి. భారత దేశమునందు అశ్వపతి యామెను ఉపాసించెను. నాలుగు వర్ణములు వారు ఆరాధించుట యందు పూనుకొనిరి.

అశ్వపతి మద్రదేశపు నరేశుడు. రాణి పేరు మాలతి, వశిష్ఠుని ఆదేశానుసారము రాణి భగవతి సావిత్రిని ఆరాధించెను. దేవి దర్శనము కాలేదు. అశ్వపతి ఆమెను దుఃఖితగా చూచి సావిత్రీదేవిని తపమొనరించుటకు పుష్కర క్షేత్రమునకు వెళ్ళిపోయెను.

అప్పుడు ఆకాశవాణి రాజా! నీవు లక్ష గాయత్రులను జపింపుమనెను. అదే సమయమున పరాశర మహర్షి వచ్చి రాజా! గాయత్రిని ఒకసారి జపించిన ఆ దినము చేసిన పాపములు నశించును. ఒక లక్ష గాయత్రులను జపించినచో యీ జన్మలో చేసిన పాపములు, పది లక్షల జపించినచో ఇతర జన్మలందు చేసిన పాపములు నశింపచేయు శక్తి గలదు.

పది కోట్ల గాయత్రీ జపములు బ్రాహ్మణులను ముక్తులను చేయును. బ్రాహ్మణుడు పూర్వాభిముఖుడై కూర్చొని చేతిముద్ర నుంచి అనామిక నడిమి కణుపు నుండి తర్జనీమూలము దాకా జపము లెక్కించవలెను. ఇది జప క్రమమగును. దేవతల సమక్షమునగాని, మట్టి పత్రమున గాని, కమల పత్రము నందు గాని మాల నుంచి ఆలేపనము చేయవలెను. తరువాత గాయత్రీ జపమొనరించి మాలకు స్నానము చేయవలెను. వందసార్లు గాయత్రిని జపించవలెను.

రాజర్షీ! నీవు పది లక్షలు గాయత్రిని జపించుము. మూడు జన్మముల పాపములు నశించును. సావిత్రిని సాక్షాత్తు దర్శించగలవు.

సంధ్యాకాల సంధ్యలను సలుపని బ్రాహ్మణుడు వెలివేసినట్లు భావించబడును. త్రికాల సంధ్యలొనర్చు బ్రాహ్మణునియందు సూర్యునితో సమానమైన తేజస్సు వచ్చిచేరును. త్రికాల సంధ్యలు చేయని ద్విజుడు ఒసగిన పిండతర్పణములు, అతని పితరులు ఇష్టముగ స్వీకరించరు. పరాశరుడు ఇట్లు పలికి రాజు వెళ్ళిపోయిన వెంటనే సావిత్రిని ఉపాసించెను.

నారాయణుడు నారదా! జ్యేష్ఠ కృష్ణత్రయోదశినాడు చతుర్దశీ దినమున వ్రతము చేసి భగవతిని పూజింపవలెను. ఇది పదునాలుగు సంవత్సరముల వ్రతము. పదునాలుగు పండ్లు, పదునాలుగు నైవేద్యములను సమర్పించవలెను. అవాహిత కలశము మీద సావిత్రిని ధ్యానించవలెను. సావిత్రి యొక్క ధ్యానము మాధ్యందినీ శాఖయందు కలదు.

ఈ దేవిని సుఖదా, ముక్తిదా, శాంతా, సర్వసంపత్స్వరూప సర్వసంపత్ ప్రదాత్రి అని అందురు. వేద బీజ స్వరూప, వేదమాత, భగవతి సావిత్రిని నేను ఉపాసించెదను. ధ్యానించి నైవేద్యమును సమర్పించవలెను.

షోడశోపచారములు – ఆసనము, పాద్యము, అర్ఘ్యము, స్నానము, అనులేపనము, ధూపము, దీపము, నైవేద్యము, తాంబూలము, శీతలజలము, వస్త్రము, భూషణము, మాల, చందనము, ఆచమనము, శయ్యలతో భగవతిని పూజింపవలెను.

(ఆసన మంత్రము) కర్రతోగాని, సువర్ణముతో గాని నిర్మించి వుండవలెను.

(పాద్యము) పవిత్రజలము పూజకు ప్రముఖ అంగముగా భావించ బడును.

(అర్ఘ్యము) ధూపము, పుష్పములు, తులసి శంఖజలముతో నివేదించాలి

(స్నానము) చందనముతో కలిపిన జలము ఉండాలి.

(అనులేపనము) పరిమళవస్తువులతో ఉండాలి.

(ధూపము) ఉత్తమ ధూపము సకల శుభదాయకము.

(దీపము) ప్రకాశమును వ్యాపింప చేయునదిగా ఉండాలి.

(నైవేద్యము) తుష్టిపుష్టిప్రీతి, పుణ్యమును ప్రసాదించునదిగా ఉండాలి.

(శీతలజలము) దప్పిక తీర్చునదై ఉండాలి.

(వస్త్రము) దూదితో, పట్టుతో గాని ఉండాలి.

(భూషణము) సువర్ణాది రత్నములతో ఉండాలి.

(ఫలము) వివిధ రూప ఫలములుగా ఉండాలి

(పూలమాల) వివిధ పుష్పములతో ఉండాలి (మాల రూపంగా)

(చందనము) పరిమళముతో కూడినదిగా ఉండాలి.

(సింధూరము) లలాట శోభను కలిగించేదిగా ఉండాలి.

(యజ్ఞోపవీతము) పవిత్ర సూత్రములతో చేయబడినది, వైదిక మంత్రములతో శుద్ధి చేయబడినది.

"ఓం, హ్రీం, క్లీం, శ్రీం, సావిత్ర్యై స్వాహా" ఈ మంత్రమును చెప్పవలెను. సావిత్రి స్తోత్రము మాధ్యందినీ శాఖయందు వర్ణించబడినది.

శ్రీకృష్ణుడు చెప్పగా బ్రహ్మ భక్తితో వేదమాతయగు సావిత్రిని స్తుతింపసాగెను. సావిత్రి సంతుష్టురాలై బ్రహ్మను తన భర్తగా పొందుటకు అంగీకరించెను. బ్రహ్మదేవుడు సరస్వతిని ఇట్లు స్తుతించెను.

సుందరీ! నీవు మూలప్రకృతివి. నీ దివ్య విగ్రహము హిరణ్మయము. తేజో రూపవు, ప్రసన్నరాలువు కమ్ము. నీవు నిత్యవు. నిత్యప్రియవు. నిత్యానంద స్వరూపవు. బ్రాహ్మణులకు సర్వస్వము, మంత్రసారతత్వము నీవే. నీ ఉపాసన వలన సుఖము, మోక్షతత్వము సులభము.

ఇట్లు స్తుతించి బ్రహ్మ అచటనే సభాభవనము నందే విరాజమానుడయ్యెను. సావిత్రి బ్రహ్మలోకమునకు వెళ్ళుటకు సంసిద్ధురాలయ్యెను. అశ్వపతి భగవతి సావిత్రిని స్తుతించెను.

సంధ్యాసమయము తరువాత పురుషుడు దీనిని పఠించినచో నాలుగు వేదములు అధ్యయనము చేసిన ఫలము లభించును.

7. సావిత్రి సత్యవంతుల కథ

అశ్వపతి సావిత్రిని పూజించగా అతని భక్తికి మిగులప్రసన్నురాలయ్యెను. సావిత్రిదేవి మహారాజా! నీ పత్ని కన్యను కోరుచున్నది. నీవు పుత్రుని కోరుచున్నావు. ఇరువురిని పొందుదురుగాక అని చెప్పి బ్రహ్మలోకమునకు వెళ్ళిపోయెను. మొదట వారికి కన్య ఉదయించగా సావిత్రి అని నామకరణము చేసిరి. ద్యుమత్సేనుని కుమారుడగు సత్యవంతుని ఆమె పతిగా పొందెను.

ఒకనాడు సత్యవంతుడు తన తండ్రి ఆజ్ఞతో అడవికి వెళ్ళెను. సత్యవంతుడు చెట్టు నుండి క్రిందపడెను. అతని ప్రాణములు పోయెను. యమధర్మరాజు అతని సూక్ష్మశరీరమును తీసికొని యమపురమునకు బయలుదేరెను. సాధ్వి సావిత్రికూడా అతనివెంట వెళ్ళెను.

యమ (ధర్మ) రాజు సావిత్రీ! నీవీ మానవ దేహముతో ఎచటికి వచ్చుచున్నావు? పాంచభౌతిక దేహముతో నా లోకమునకు రాజాలరు. అన్ని యోనుల ప్రాణములు తమ కర్మఫలమును పొందుచుందురు. ఇట్లు సావిత్రితో చెప్పి యమరాజు మౌనమును వహించెను.

సావిత్రి! భగవన్ దేహమెవరు? దేహి ఎవరు? ప్రాణి ఎవరి ప్రేరణచేత కర్మచేయును. జీవుడెవరు? పరమాత్మ ఎవరు? ఇదంతయు దయతో తెలుపమనికోరెను.

ధర్మరాజు సావిత్రీ! భక్తి కూడా శ్రుతియందు రెండు విధములుగ చెప్పబడినది. ఒకదానిని నిర్వాణ ప్రదము రెండవ దానిని సారూప్య ప్రదమని చెప్పెదరు.

వైష్ణవులు శ్రీహరిని కొలిచెదరు. సారూప్యమును ప్రసాదించు భక్తి, యోగపురుషులు నిర్వాణ పదభక్తిని కోరుదురు. నిరంతరము ఫలమును ప్రసాదించుట దీని సహజగుణము.

ఈ దేహము నశ్వరమైనది. పృథివి, తేజస్సు, జలము, వాయువు. ఆకాశము, పంచ భూతములు సూత్ర రూపములు. కర్మచేయు జీవుడే దేహియనబడును. వివేచనాశక్తిని బుద్ధియందురు. పరమాత్ముని యొక్క అంశము. సకల కర్మలను మనస్సు ప్రేరేపించును. దుఃఖములను కలిగించుటకు కారణమైన శత్రువు.

జ్ఞానేంద్రియములను మనస్సు ప్రేరేపించును. పృథివి, బ్రహ్మ, ఇంద్రియములకు అధిష్ఠాన దేవతలు. ప్రాణమును ధరించువాడే జీవుడు. సర్వమును వ్యాపించినవాడే నిర్గుణబ్రహ్మ; ఆ స్వామినే పరమాత్మయందురు. అమ్మా నేను శాస్త్రానుగుణముగ తెలిపితిని. నీవు నీ గృహమునకేగుము అనెను.

సావిత్రి స్వామీ! నేను నా పతిని వదలివెళ్ళను. జీవుడు ఏ కర్మ ప్రభావముతో ఏయే యోనులందు జన్మించును. స్వర్గమును ప్రసాదించు కర్మ ఏది? నరకమును ప్రసాదించు కర్మ ఏది? ఏ కర్మతో మానవుడు అంగహీనుడు, ఏకాక్షి, చెవిటి, గ్రుడ్డి, కుంటి, ఉన్మాది, పిచ్చివాడు, లోభి, దొంగయగును. ఏ కర్మ చేసిన ప్రాణి బ్రాహ్మణుడగును? తపస్విగా, స్వర్గలోకప్రాప్తి, వైకుంఠపదవి, ఎవరికి లభించును? నరక యాతనలు తెలిపి నన్ననుగ్రహింపుము అని కోరెను.

సావిత్రి వచనములను విని యమధర్మరాజు ఆశ్చర్యముతో పుత్రీ! సావిత్రి వర ప్రసాదమున నీవు జన్మించితివి. ఈ రాజు తపస్సుతో నిన్ను

పొందెను. ఇప్పుడు నీ పాతివ్రత్యమునకు నేను ముగ్ధుడనైతిని నీకేమి వరము కావలయునో కోరుకొనుము అనగా సావిత్రి సత్యవంతునితో నాకు వందమంది పుత్రులు కలుగవలయును మా మామగారికి చూపు రావలెను. రాజ్యలక్ష్మి ప్రాప్తించవలెను. సత్యవంతునితో జీవితము గడిపి చివరికి హరిధామమును చేరుకొనవలెను. ఈ వరములను ప్రసాదింపుము అనెను.

ధర్మరాజు సాధ్వీ! నీ సకల మనోరథములు ఫలించుగాక. శుభాశుభ కర్మల ఫలితముగా జీవుడు భారతదేశమున జన్మించును. కర్మలు నిశ్శేషములైనప్పుడు భక్తి ఉత్పన్నమగును. పూర్వకర్మల కనుగుణముగ సౌఖ్యవంతుడుగ, అంధుడుగ, అంగహీనుడుగ ప్రాప్తించును. అందరికి భారతదేశమున మానవ జన్మను పొందుట దుర్లభమగును.

బ్రాహ్మణుడు శ్రేష్ఠుడుగ సకామిగ, నిష్కామిగ ఉండును. కోరికలున్న బ్రాహ్మణుడు ప్రతిష్ఠను, నిష్కామి భక్తుడగును. నిష్కామికి ప్రపంచమునకు మాటిమాటికి రాకపోకలు జరుగవు. తీర్థస్థానములందుండి సదా తపమొనరించు ద్విజుడు బ్రహ్మలోకమునకు వెళ్ళును.

మానవుడు ముక్తుడగుటకు తటాకమును దానము చేయవలెను. దిగుడు బావిని దానమొనరించినచో పదిరెట్లు ఫలమును పొందును. తగిన వరునకు కన్యనిచ్చినచో పది బావులను దానము చేసిన పుణ్యము కలుగును.

వట వృక్షమును నాటి ప్రతిష్ఠించినచో విష్ణులోకమునకు వెళ్ళును. పూతోటలను వేయించిన ధ్రువలోకమున స్థానము పొందును. శ్రీహరికి పల్లకి చేయించి ఇచ్చినచో, ఆలయము కట్టించిన విష్ణు లోకప్రాప్తి కలుగును. బ్రాహ్మణులకు ఇవ్వబడిన దానము భారతదేశము నందు జన్మించు భాగ్యము కలుగును. క్షత్రియుడు, వైశ్యుడు తపఃప్రభావమున బ్రాహ్మణత్వము పొందును. నీవింకను వినదలచినవి ఏమైనా ఉంటే అడుగుము అనెను.

సావిత్రి ధర్మరాజా! ఏ కర్మచేసినచో స్వర్గమును పొందును అనగా, ధర్మరాజు – పతివ్రతా! బ్రాహ్మణునకు అన్నము దానము చేయు పురుషుడు

శివలోకమునకు వెళ్ళును. అన్నదానమును మించిన దానమేదియును లేదు.

బ్రాహ్మణునకు ధేనువు దానము చేసినచో పర్వదినములందు నాలుగు రెట్లు, తీర్థములందు వంద రెట్లు, నారాయణ క్షేత్రమునందు కోటిరెట్లు అధిక ఫలమునొసగును. విసనకఱ్ఱ, చామరమును బ్రాహ్మణునకు సమర్పించిన పురుషుడు వాయులోకమున సమ్మానితుడగును.

భగవతి మంత్రమునుపాసించువారు జనన మరణములనుండి విముక్తులగుదురు. మణిద్వీపము నందు నివసించెదరు. కార్తీక మాసమున శ్రీహరికి తులసి సమర్పించినవాడు మూడు యుగముల వరకు భగవంతుని భవనమందు విరాజమానుడగును. అరుణోదయ మధ్యకాలమున గంగ యందు స్నానమొనరించిన వాడు భగవద్ధామమునకు వెళ్ళును.

వైశాఖ మాసము నందు సత్తు పాత్రను బ్రాహ్మణునకు దానము చేసిన పురుషుడు శివమందిరమున ప్రతిష్ఠితుడగును. శ్రీ కృష్ణాష్టమి వ్రతము సలిపినచో నూరు జన్మల పాపములు నశించును. చైత్ర మాసమున, మాఘ మాసమున శంకరుని పూజిస్తూ బెత్తము చేతబట్టి నృత్యము చేసినచో శివలోకము నందు సుఖములు పొందును.

ఏకాదశి వ్రతము చేయువారు వైకుంఠమునందు నివసించు సౌకర్యము కలుగును. ఆదివారము, సంక్రాంతి నాడు సూర్యుని పూజించిన బ్రహ్మలోకమున వైభవ సంపన్నుడగును. సకల యజ్ఞములందు భగవతి భువనేశ్వరి యజ్ఞము శ్రేష్ఠమైనది.

అమ్మా! మూల ప్రకృతియగు నిర్గుణ పరబ్రహ్మను నిరంతరము ఉపాసింపుము. నీకు నీ పతిదేవుని తిరిగి ఇచ్చుచున్నాను. మానవుల మంగళకరమగు కర్మవిపాకమును నేను నీకు వినిపించితిని. తత్వజ్ఞానమును ప్రసాదించునది అని ధర్మరాజు నోటినుండి వెలువడిన మాటలను సావిత్రి వినెను.

అప్పుడు ఆనందంతో నమ్రతతో సావిత్రి వేదోక్తములను పఠిస్తూ ధర్మరాజును స్తుతింపసాగెను. వెంటనే ధర్మరాజు సావిత్రికి భగవతి మూల ప్రకృతి మంత్రమును అట్లే శుభ కర్మల పరిపక్వతా ప్రసంగమును వినిపించెను. ప్రాతఃకాలమున యమాష్టకమును పఠించినవాడు యమరాజు భయమును పొందకుండును. యమరాజు అతనిని పరిశుద్ధుని చేయును.

ధర్మరాజు సావిత్రికి అశుభకర్మ గురించి చెప్పసాగెను. పతివ్రతా! అశుభ కర్మల విపాకములు నరకమునకు వెళ్ళుటకు వివశులగుదురు. నరకములందు అనేక కుండలములు వహ్నికుండలము మొదలు నాగవేష్ట కుండలము వరకు ఎనుబది యారు నరక కుండలములను వాటి లక్షణములను వివరించెదను వినుము.

సాధ్వీ! యోగులు, సిద్ధులు, వ్రతములు సలుపువారు తాపసులు బ్రహ్మచారులగు పురుషులు నరకమునకు వెళ్ళరు. బ్రాహ్మణునకు భోజనము పెట్టనివాడు తప్తకుండ నామ నరకమునపడును. తల్లిదండ్రులను, గురువును, భార్యను, పుత్రులను, పుత్రికలను పోషింపనివాడు గరళకుండమను నరకమునకు వెళ్ళును.

బ్రహ్మహత్యలాంటి ఘోరపాపమును చేసినవాడు దూషికా ఖండమను నరకమునకు వెళ్ళును. స్త్రీ పురుషునికతో గాని, పురుషుడు పరాయి స్త్రీతో గాని అక్రమ సంబంధము గలిగియుండినచో వారు శుక్రకుండమను పేరుగల నరకమునకు వెళ్ళుదురు.

గురువును గాని, బ్రాహ్మణుని గాని చంపిన వాడు అస్రుక్ కుండమను నరకమును పొందును. చెవిటివానిని చూచి నవ్వువాడు కర్ణవిట్‌కుండమున పడును.

తన కుమార్తెను అమ్మివేయువాడు మాంసకుండమను నరకమున పడిపోవును. మాంసమును తినువాడు, దైవమునకు పెట్టకుండా భోజనము

చేయువాడు క్రుమికుండ నరకమున పడిపోవును. కామ భావముతో పరస్త్రీని చూచువాడు కాక కుండమను నరకమున నివసించును. దేవతా విగ్రహమును అపహరించువాడు వజ్రకుండమను నరకమున నివసించును.

వ్యభిచారిణి వలన అన్నము తినువాడు లాలాకుండమను నరకమున పడియుండును. ఆవులను, మేకలను, గొఱ్ఱెలను అపహరించువాడు గోకాముఖమను నరకమున పడును. వృక్షములను నరుకువాడు గజదంశమను పేరుగల నరకమున నివసించును.

గోవులను, గర్భవతులను వధించువాడు కుంభీపాక నరకమున పడును. బ్రహ్మ స్వరూపిణి, మూలప్రకృతి, భగవతి భువనేశ్వరి సర్వశక్తి స్వరూప, సకల చరాచర జనని, భార్యను, పుత్రుని పోషించనివాడు బ్రహ్మహత్య చేసిన వాడగును. ఎవరైనను గోవును హత్యచేస్తుండిన చూసి నివారించనివాడు గోహత్య హత్యపాతకమును పొందును. సంధ్యావందనము చేయనివాడు గోహత్య పాతకముననుభవించును. బ్రాహ్మణులను చూచి నమస్కరించకపోయిన గోహత్య పాతకము కలుగును.

కులట, ధర్షిణి, పుంశ్చలి, పుంగి, వేశ్యలు, మహావేశ్యలు 'మత్సోద'మను నరకమున పడుదురు. సూర్యగ్రహణ, చంద్ర గ్రహణములలో అన్నము చేసినచో అరుంతుదమను నరకమున పడుదురు. తన కుమార్తెను చెప్పినవారికివ్వక మాట తప్పి వేరొకరికిచ్చి వివాహము జరిపించినచో పాంసుకుండమను నరకమునపడుదురు.

తులసిని పట్టుకొని అసత్యప్రతిజ్ఞ చేసినచో జ్వాలాముఖమను నరకమున పడుతురు. మిత్రద్రోహి, చేసిన మేలు మరచినవాడు, అసత్య సాక్ష్యము చెప్పువాడు, జ్వాలాముఖ నరకమును పొందుదురు. దేవ, బ్రాహ్మణ ధనమును అపహరించువాడు ధూమ్రాంధమను నరకమును పొందును.

ధర్మరాజు సావిత్రితో! వేదములు, ధర్మశాస్త్రములు, సంహితలు, పురాణములు, ఇతిహాసములు, పాంచరాత్రములు, పంచదేవోపాసనలు,

జనన, మరణ, జరావ్యాధులను నశింపచేయును. ఏకాదశి వ్రతము చేయువాడు విష్ణులోకమునకు వెళ్ళును.

ఆగమశాస్త్ర ప్రకారం పృథివి, జలము, తేజస్సు, వాయువు, ఆకాశము, కృత్రికము, అగ్నితో దహింపబడి బూడిదయగును. జీవుడు మాత్రం అంగుళీయ ఆకారము కలిగి సూక్ష్మరూపముతో సంయమనీపురమునకు వెళ్ళును.

సావిత్రి నీకు కొన్నింటిని మాత్రమే నరకకుండములను గురించి తెలిపితిని. 86 నరక కుండములున్నవని ముందే తెలిపియుంటిని.

8. భువనేశ్వరి మాహాత్మ్యము

సావిత్రి ధర్మరాజుతో ముక్తిని వివరింపమనికోరగా! అమ్మా! సనక సనందన, సనాతన, సనత్కుమారులు, ధర్ముడు, కపిలుడు, సూర్యుడు, వీరందరూ దేవి మాహాత్మ్యము తెలుపలేకపోయిరి. అయితే శ్రీకృష్ణుని చేత ఆ దేవి గురించి జ్ఞానము ప్రాప్తించినది. శంకరుడు శ్రీ కృష్ణుని ద్వారా జగదంబ గుణములను తెలిసికొనెను.

శివుడు ధర్మునకు, అతడు సూర్యునికి, సూర్యుడు నాకు (యమధర్మరాజు) కొంత ఆ జ్ఞానము వినిపించెను. ఆ భగవతియే తన గుణములను ఎరుగజాలదు. భగవతి, జగదంబ, ఏ రూపమును లేదు. భక్తులకొరకు వివిధ రూపములుగ దర్శనమిచ్చును.

శివుడు మృత్యుంజయుడు, శ్రీ కృష్ణుని వలన సర్వజ్ఞుడు, అతని ఆదేశముతో పవనుడు సంచరించును. సూర్యుడు నిరంతరము తపించుచుండును. ఇంద్రుడు వర్షింపచేయును. మృత్యువు, ప్రాణులమీద తన ప్రభావము చూపును. అగ్ని కాల్చును, జలము శీతలము కలుగచేయును. దిక్పాలురు దిశలను రక్షించుచుందురు. స్వామి భయముతో గ్రహములు రాశిచక్రములందు పరిభ్రమించుచుండును. వృక్షములు పుష్పించి ఫలముల నందించుట జరుగును.

ప్రభువు ఆజ్ఞతో జలము తాబేలును, కచ్ఛపము శేషనాగుని, శేషనాగుడు పృథివిని, పృథివి సముద్రములను, పర్వతములను ధరించియుండును. పృథివి రత్నములను ధరించును. సకల ప్రాణుల ఉత్పన్నము, నాశనము జరుగుచుండును.

పతివ్రతా! డెబ్బది యొక్క యుగములు ఇంద్రునికి ఆయువగును. ఇరువది ఎనిమిది ఇంద్రులు వెళ్ళిపోగా బ్రహ్మకు ఒక పగలు, రాత్రియగును. బ్రహ్మ పతనము శ్రీహరికి రెప్పపాటు కాలమగును. సకల శక్తులు విష్ణుమాయయగు దుర్గయందు తిరోహితములగును. విష్ణుమాయయగు దుర్గ శ్రీకృష్ణునియందు చోటుచేసుకొనును. కార్తికేయుడు నారాయణుని అంశ.

వేదములందు ఒకటి 'సాలోక్యమును', రెండవది 'సారూప్యమును', మూడవది 'సామీప్యము', నాలుగవది 'నిర్వాణపదము'నకు చేర్చును. భక్తుడు పరమాత్మ సేవను వదలి ముక్తులను ఇచ్చగింపడు, శివత్వమును, అమరత్వమును, బ్రహ్మత్వమును అవహేళన చేయును. ముక్తిసేవను కూడియుండదు. భక్తియందు నిరంతర సేవాభావము కూడియుండును.

భక్తి, ముక్తులందు యిదియే భేదము, నిషేక ఖండన ప్రసంగమును వినుము. చేసిన కర్మలననుభవించుటయే, శ్రీదేవి ఉత్తమసేవ దీనికి ఉపాయము. ఇట్లు పలికి ధర్మరాజు సావిత్రి భర్తయగు సత్యవంతుని పునరుజ్జీవతుని గావించెను. సావిత్రి ప్రణమిల్లగా ఆశీర్వదించెను.

ధర్మరాజు సంతోషముతో సావిత్రీ! పుణ్యక్షేత్రమగు భారతదేశము నందు సుఖభోగములననుభవించెదవు. జ్యేష్ఠ మాస శుక్లపక్ష చతుర్దశీ తిథియందు ఈ వ్రతమాచరించవలెను. భాద్రపదమున శుక్లపక్ష అష్టమీ తిథియందు మహాలక్ష్మి వ్రతము పదహారు సంవత్సరములు చేయవలెను.

ప్రతి మంగళవారము మంగళ చండికను పూజించవలెను. ప్రతి మాస శుక్లపక్ష షష్ఠినాడు షష్ఠి దేవసేనను ఉపాసన చేయవలెను. ఆషాఢ మాస సంక్రాంతి సమయమున భగవతి మనసా దేవిని పూజింపవలెను.

కార్తీక మాస శుక్ల పక్షమి పూర్ణిమ నాడు శ్రీ కృష్ణ ప్రాణేశ్వరి రాధాదేవిని ఆరాధించవలెను. ప్రతినెలా శుక్లాష్టమి దినమున దుర్గవ్రత మాచరించవలెను. నీవు నిరంతరము శ్రీ భువనేశ్వరిని ఉపాసింపుము.

ఇట్లు పలికి ధర్మరాజు తన లోకమునకు వెళ్ళిపోయెను. సావిత్రి కూడ పతిదేవుని వెంటనిడుకొని, తన గృహమునకు తిరిగివెళ్ళెను. సావిత్రి తండ్రి పుత్రవంతుడుగ, మామకు చూపువచ్చెను. అతడు తన రాజ్యమును కూడ పొందెను. సావిత్రి అనేక పుత్రులను పొంది తన భర్తతో భగవతి భువనేశ్వరీ లోకమునకు వెళ్ళిపోయెను. గాయత్రి మంత్రమునకు అధిదేవత అగుటవలన సావిత్రి అని పేరు వచ్చెను. సావిత్రి ఉపాఖ్యానము ప్రాణులను అనేక కర్మల నుండి విముక్తులను చేయును.

9. మహాలక్ష్మి పూజ

నారదుడు భగవన్! ధర్మరాజు సావిత్రి సత్యవంతుల వృత్తాంతముతో భువనేశ్వరి, గాయత్రియశస్సులను వింటిని. లక్ష్మిని ఎవరు పూజించిరి? ఏ మంత్రముతో పూజింపవలెనో తెలుపమని కోరగా నారదా! శ్రీ కృష్ణుని వామభాగమునుండి రాధ ప్రకటిత అయ్యెను. ఆ దేవి రెండు రూపములలో వామాంశమున లక్ష్మి ప్రాదుర్భవించెను. దక్షిణాంశమున రాధ స్వీకరించెను.

లక్ష్మి సౌభాగ్యములతో 'మహాలక్ష్మి'గా వైకుంఠమున ఉండెను. స్వర్గలక్ష్మిగా 'రాజ్యలక్ష్మి'గా, 'గృహలక్ష్మి'గా విరాజిల్లెను. గోవులందు 'సురభి' యజ్ఞములందు 'దక్షిణ'గా, కమలములందు 'శ్రీ' రూప చంద్రుని యందు 'శోభా'గా తేజరిల్లెను.

భూషణములలో, రత్నములలో, ఫలములలో, జలములలో దివ్యస్త్రీల గృహములందు, ధాన్యములందు, వస్త్రములందు, పవిత్ర స్థానములందు, దేవతా ప్రతిమలందు, కలశములందు, మాణిక్యములందు, ముత్యములందు, మాలలందు, వజ్రములందు, చందనమందు, వృక్షముల ఫలములయందు, తొలకరి మేఘములందు భగవతి లక్ష్మి అంశ విద్యమానమైయుండును.

ప్రప్రథమముగ నారాయణుడు మహాలక్ష్మిని పూజించెను. బ్రహ్మ భక్తితో దేవిని అర్చించెను. శివుడు దేవి ఉపాసకుడు, మనువు, ఋషులు, మునులు, గృహస్థులు మహాలక్ష్మిని ఆరాధించిరి, గంధర్వులు, నాగులు పూజించిరి.

భాద్రపద మాస శుక్ల పక్షమున, చైత్ర, పుష్య, భాద్రమాస మంగళవారములందు, పుష్యమాస సంక్రాంతి నాడు దేవిని పూజింతురు, రాజగు మంగళుడు మంగళాదేవిగా, కేదారుడు, నీలుడు, బలుడు, సుబలుడు, ధ్రువుడు, ఉత్తానపాదుడు, శక్రుడు, బలి, కశ్యపుడు, దక్షుడు, కర్దముడు, వివస్వంతుడు, ప్రియవ్రతుడు, చంద్రుడు, కుబేరుడు, వాయువు, యముడు, అగ్ని, వరుణుడు, మహాలక్ష్మి పూజిత అయ్యెను.

భూలోకమున సముద్రుని కన్యగా అవతరించుటకు సంసిద్ధురాలయ్యెను. సముద్రునకు కుమార్తె ఎట్లయ్యెను. దుర్వాసుని శాపముతో ఇంద్రుని దగ్గరనుండి వెళ్ళిపోయెను. లక్ష్మి స్వర్గమును పరిత్యజించెను. దేవతలు బ్రహ్మను ముందిడుకొని వైకుంఠమునకు వెళ్ళిరి. అప్పుడు వారి గోడు విని శ్రీహరి తన ఆదేశానుసారము లక్ష్మి తన కళచే సముద్రునికి పుత్రిక అయ్యెను. దేవతలు, దైత్యులు కలిసి క్షీరసాగరమును మథించిరి. మహాలక్ష్మి ప్రాదుర్భవించెను. విష్ణుభగవానునికి వరమాలను సమర్పించగా దేవతలంతా సంతోషమొందిరి.

నారదుడు బ్రహ్మదేవునితో దుర్వాసుడు ఎందుకు ఇంద్రునకు శాపమిచ్చెను అని అడుగగ నారదా! దుర్వాసుడు వైకుంఠము నుండి కైలాస శిఖరమునకు వెళ్ళుచుండెను. విష్ణువు ద్వారా ప్రాప్తించిన పారిజాత పుష్పమును అతనికొసగెను. రాజ్యలక్ష్మి గర్వముతో దానిని ఇంద్రుడు ఐరావత గజము మస్తకమున ఉంచెను.

ఐరావతము విష్ణుసమానురాలై ఇంద్రుని వదలి ఘోరవనములకు వెళ్ళిపోయెను. ఇంద్రుడు ఆ దివ్య పుష్పమును తిరస్కరించెను. దుర్వాసుని రోషమునకు అంతులేకపోయెను.

దుర్వాసుడు ఇంద్రా! నేను నీకీ పారిజాత పుష్పమునొసగితిని. గర్వముతో దీనిని నీవు ఉపయోగించలేదు. విష్ణువుకు సమర్పించిన నైవేద్యము పరిత్యజించి బ్రహ్మహత్యతో సమానమగు దోషమును పొందితివి. శ్రీనిపోగొట్టుకొనువాడవైతివి. నీ బుద్ధిభ్రష్టమైపోయెను.

శ్రీహరికి నివేదించకుండా తినిన అన్నము దోషమగును. అతిథులు భుజింపని ఇంట లక్ష్మియుండనొల్లదు. మిత్రద్రోహి, విశ్వాసఘాతకుడు, కృతఘ్నుడు, అసత్యము పలుకువారి ఇండ్లలో లక్ష్మి నిలువదు.

చండాలుడైనా విష్ణువును ఉపాసించినా విపరీత శక్తివచ్చును. లక్ష్మి నిన్ను వదలి శ్రీహరి చెంతకు వెళ్ళిపోవును. నీ తండ్రి ప్రజాపతి కశ్యపుడు కూడా నన్నేమియు చేయలేడు. బృహస్పతి నాకే హానియును తలపెట్టలేదు అని అనగానే ఇంద్రుని మనస్సులో అలజడి ప్రారంభమై మునీంద్రునితో ఈ శాపము వల్ల నాకు పోయిన సంపద రాదు. జ్ఞానమును ఉపదేశింపమని కోరెను.

ముని – ఇంద్రా! ప్రవృత్తి మార్గము జరామృత్యువులకు మూల కారణము. సత్సంగము, సాగరమును దాటుటకు పరమ సాధనము. ఏ ఒక్కడో సాధుపురుషుడు ముక్తిమార్గమును అవలోకించగలడు.

సత్సాంగత్యము ఈ అవకాశమును పొందును. పురందరా! ఈ విషయములనన్నింటిని నేను గురుముఖమున వింటిని అనెను. అపుడు ఇంద్రుడు వీతరాగుడై వైరాగ్యభావముతో తన భవనమునకు చేరుకొనెను.

దైత్యులతో, అసురులతో నిండియుండగా, దేవతలందరు దిక్కుతోచక, అన్నివైపుల శత్రువులే కనిపించగా దేవరాజగు ఇంద్రుడు బృహస్పతి దగ్గరకు వెళ్ళెను. బృహస్పతి అప్పుడు పరమాత్ముని ధ్యానించుచుండగా ఇంద్రుడు దృగ్గోచరుడయ్యెను. దేవేంద్రుడు నమస్కరిస్తూ దుర్వాసుడు తనకొసగిన శాపసంబంధ విషయములనన్నిటిని బృహస్పతికి తెలిపెను.

బృహస్పతి సురశ్రేష్ఠా! నేనంతయును వింటిని. కోట్లకొలది జన్మలయందు చేసిన కర్మప్రాణులను వెంబడించుచునే యుండును. విధాత కర్మసూత్రములతో ప్రాణులకు ఫలమును ప్రసాదించును. నారాయణుని ఆదేశానుసారము ఈ సృష్టి జరిగెను. త్రిలోకములందు విధాతకు విధాత, రక్షకునకు రక్షకుడు, స్రష్టకు స్రష్ట, సంహారకునకు సంహారకుడు పురుషులు గొప్ప ఆపదలు వచ్చినపుడు మధుసూదనుని స్మరించవలెను. శంకర భగవానుడు కూడా ఇదేమాట ఇలా చెప్పెను.

శ్లో॥ మహా విపత్తౌ సంసారే యస్స్మరేన్మధుసూదనమ్
విపత్తౌ తస్య సమ్భూతిర్భవేదిత్యాహ శంకరః (స్క.9, అ.40, శ్లో.91)

బృహస్పతి ఇట్లు పలికి దేవేంద్రుని హృదయమునకు హత్తుకొనెను. శుభాశీస్సులతో అతనికి నచ్చచెప్పెను. తదనంతరము ఇంద్రుడు శ్రీహరిని ధ్యానించెను. బృహస్పతిని ముందుంచుకొని బ్రహ్మసభకు వెళ్ళి బ్రహ్మను దర్శించి జరిగినదంతయు చెప్పగా బ్రహ్మ వత్సా! నీవు నా వంశములోని వాడివి. నాకు ప్రపౌత్రుడవు. బృహస్పతి నీకు గురువు, దక్ష ప్రజాపతి నీకు మాతామహుడు.

తండ్రి, మాతామహుడు, గురువు – ఈ ముగ్గురును దోషులైనచో అట్టివారు శ్రీహరి యెడల ద్రోహులగుదురు. భగవంతుడగు శ్రీహరి సకల

ప్రాణుల శరీరములందు విరాజమానుడైయుండును. ఆ స్వామి దేహము నుండి వెళ్లిపోయిన క్షణముననే ప్రాణి శవమగును, భోగ శరీరమును ధరించును. శరీరమునకు స్వామి ఆత్మ.

భగవంతుడగు శ్రీకృష్ణుని చరణ కమలములనుండి జారిన పుష్పము ఎవరి తలమీద పడునో అతడు భాగ్యశాలియగును. శ్రీకృష్ణుని పరిత్యజించితివన్న రోషముతో భగవతి శ్రీదేవి నిన్ను వదలి వెళ్ళిపోయెను. నీవు నాతో కలిసి బృహస్పతితో కూడి వైకుంఠమునకు రమ్ము. అనగా అందరు అక్కడకు చేరుకొనగానే వారినంతా శ్రీహరి చూసి బ్రహ్మదేవా! భక్తులు నా భజన చింతనలయందు కినుక వహించినచో వారి ఇంట (నేను లక్ష్మి) నిలువ జాలము.

దుర్వాసుడు శంకరుని అంశ. శ్రీహరి గూర్చి చర్చించు చోట శంఖము, సాలగ్రామము, తులసి నివసించు స్థలమున, శివలింగము పూజించు చోట, దుర్గా పూజలు జరుగు స్థలమున లక్ష్మి నివసించును.

శ్రీహరి లక్ష్మితో దేవీ! నీవు క్షీరసాగరునింట జన్మింపుము. బ్రహ్మదేవా! నీవు సముద్రమును మథింపుము. అనగా దేవతలు మందర పర్వతమును మథించు కర్రగా కచ్ఛపమును ఆధారము చేసుకొని శేషనాగుని, కవ్వపుత్రాడుగా క్షీరసాగరమును మథింపసాగిరి.

అప్పుడు ధన్వంతరియను వైద్యుడు, ఉచ్చైశ్రవమను గుఱ్ఱమును, వివిధ రత్నములు, ఐరావతము, లక్ష్మి, సుదర్శన చక్రము, వనమాల, అమృతము అమూల్యపదార్థములు వారికి లభించినవి. శ్రీహరి కంఠసీమ యందు లక్ష్మిచే వరమాల అలంకరించబడెను. దైవలీలలను చూసి దేవతలు బ్రహ్మ, శంకరులు పూజా స్తుతులు చేసిరి. అప్పుడు దూర్వాసుని శాపము నుండి విముక్తి లభించి ఇంద్రుడు శ్రీ లక్ష్మీనారాయణులు సంతోషమొందిరి. దైత్యులు అపహరించిన రాజ్యమును తిరిగి దేవతలంతా పొందిరి. మహాలక్ష్మి కృపతో సుఖమును పొందిరి.

నారదుడు శ్రీహరిని, లక్ష్మీ ధ్యాన స్తోత్రములను వినిపింపమని కోరగా నారాయణుడు శ్రీలక్ష్మి స్తోత్రములను వినిపించెను.

10. ఇంద్రుడు లక్ష్మీదేవిని స్తుతించుట

నారదా! ఇంద్రుడు తీర్థములందు స్నానమొనరించిన తరువాత గణేశుడు, సూర్యుడు, అగ్ని, విష్ణు, శివుడు, దుర్గ – ఈ ఆరుగురు దేవతలను గంధపుష్పాది పుష్పములతో పూజించెను. మహాలక్ష్మిని ఆవాహనము చేసెను. బృహస్పతి బ్రహ్మ చెప్పినట్లు పూజను నిర్వహించెను. అప్పుడు అనేక మునిగణములు, దేవతా సమూహములు, శ్రీహరి, శంకరుడు విరాజమానులై యుండిరి.

దేవేంద్రుడు పారిజాత పుష్పమును తెచ్చి మహాలక్ష్మిని పూజించెను. శ్రీహరి బ్రహ్మకు ఒసగిన సామవేదాంతరమైన దానితో ఇంద్రుడు భగవతిని చింతనచేసెను. విశ్వకర్మ దివ్యమైన ఆసనము నేర్పరచెను. పాపమును కాల్చుటకు గంగా జలము ఇది అగ్ని స్వరూప తైలము, ఉసిరిక చూర్ణము, నూలు పట్టు వస్త్రములు గ్రహింపుము.

శ్రీకృష్ణుని ప్రియురాలా! పవిత్ర ధూపమును స్వీకరింపుము. మంచి గంధమును స్వీకరింపుము. దీపమును స్వీకరింపుము. నైవేద్యమును స్వీకరింపుము. తుష్టి, పుష్టి అన్నము ప్రసాదము స్వీకరింపుము. చక్కెర, ఘృతము, పాలు, పండ్లు, చెఱకు రసము, పక్వము చేసిన బెల్లము, మృష్టాన్నము, అపరధాన్యములతో చేయబడినవి స్వీకరింపుము. పట్టు వస్త్రములతో సువర్ణ ఆభరణములతో చేయబడిన శయ్యను, అలంకరించుకొను వస్తువులను మీ సేవకొరకు ఉంచాను. స్వీకరించుము అని లక్ష్మిని ప్రార్థించెను.

సీ. తతచారుసాహస్రదళపద్మ సంస్థితశారదేందు ప్రభాశాలిని పర
తప్త కాంచనని భతనుసుషమోపేత భూరిమాణిక్యవిభూషణాఢ్య

వివిధదాసీభూతవిబుధనారీగణ సకలగుణాఢ్య ప్రసన్నవదన
నిరుపమ కల్యాణి నిత్యయౌవనయు క్త సర్వసంపద్ధాత్రి సరసగాత్రి

తే.గీ. దేశకాలానవచ్ఛిన్న దేవదేవి
కన్నతల్లి నిజాశ్రితకల్పవల్లి
భవభయంబుల బోనెట్టు పాలవెల్లి
నీశ్వరిని లక్ష్మిమదిని ధ్యానింతు నిన్ను

సీ. నవరత్న సింహాసనం బిదే నీకిత్తు గైకొనుమా మహాకమలనిలయ
భాగీరథిజలంబు పాద్యంబు నీ కిత్తు గైకొనుమమ్మ గోలోక నిలయ
అమలజాహ్నవితోయ మర్ఘ్యంబు నీకిత్తు చేకొనగదవమ్మ లోకమాత
వరశుభ్రకార్పాసవస్త్రద్వయం బిత్తు ధరియించుమమ్మ కందర్పజనని

తే.గీ. యజ్ఞసూత్రద్వయము ధూప మందుమమ్మ
దీపమును జాపెదను మహాదేవి కనుము
చందన మలందు మా పుష్పసమితి నిడుమ
సరస నైవేద్యమిచ్చెద శక్తికొనుమ

క. అన్నంబు ప్రాణరక్షక
మెన్నగ బ్రహ్మస్వరూప మిష్టము పుష్టిన్
జెన్నొంద జేయు దల్లీ
యన్నము గొనుమమ్మతుష్టి నందగదమ్మా!

సీ. పరమాన్నమును మంచి భక్ష్యముల్ కజ్జముల్ శర్కరాన్నమును
సరసనిడితి
ఆవడలను బూరె లతిరసంబులును చిత్రాన్నంబు పెట్టితి
నంతికమున
పక్వాన్నములు కొన్ని పణ్ణేరములు కొన్ని యారగింపుము
తల్లి యాదరమున
చెఱకు బెల్లము దేనె చెలువైన పోళీలు భక్షించ గదవమ్మ పరమసాధ్వి

తే.గీ. చామరము బట్టి విసరెద జల్లగాలి
ననుభవింపుము నిర్మలంబైన ముకుర
మందియిచ్చెద చూచుకొమ్మమ్మలమ్మ
యీశ్వరీ చారుతాంబూల మిదియ కొనుము

క. తల్లీ నాపాపంబుల
నెల్లం బారంగదోలి యిష్టార్థంబుల్
కొల్లలుగ నిమ్ము నీవే
ముల్లోకంబులకు నాదిమూలవు లక్ష్మీ

నీవు లక్ష్మివి, నీవు మాయవు. నీవు కమలవాసినివి. నీవు దక్షసావర్ణి పూజితవు. ప్రియవ్రతోత్తాన కేదారుల చేతను బూజింపబడి వారలకు రాజ్యలక్ష్మీ ప్రదవైతివి. అట్లింద్రుడు అతిభక్తి పూర్వకంబుగా వ్రతంబాచరించినందేవి రత్నమయంబయిన విమానంబున నుండి నవ్వు మొగంబుతో బ్రహ్మాదులు సేవింపుచుండ దర్శనంబిచ్చినం గనియత్యానందంబునం బురందరుండు.

దండకము

శ్రీ మన్మహారాజరాజేశ్వరీ – సర్వలోకేశ్వరీ – సాధుభక్తౌఘసంపత్కరీ – సుందరీ – శాంకరీ – ముఖ్యసర్వామరీ – శక్తిదా – రక్తిదా – భక్తిదా – భుక్తిదా – ముక్తిదా – మంజుమంజూక్తిదా – ధ్యాసదా – నూన సమ్మానదా – మానదా – జ్ఞానదా – దీన సంతాన సౌభాగ్యదా – శత్రుషడ్వర్గ సంహారిణీ – లోకసంచారిణీ – విష్ణువక్షస్థలావాసినీ – పద్మపద్మప్రియా – పద్మమాలా ప్రభా సంచయా – పద్మహస్తద్వయా – పద్మపాదద్వయా – పద్మగర్భాండ సృష్టి స్థితి ప్రోస మూలాశ్రయా – రాధికా కారకృష్ణప్రియా తే నమో తే నమో – తే నమో యంచు బల్మారు నీకుంజోహారుల్ దగం జేతునమ్మా – చరం బీవకావే – స్థిరం బీవకావే – గుణద్రవ్యమున్నీవకావే

– ధరాద్యూర్థ్వలో కంబులేడున్ – సదాయే డధోలోకముల్ – నీకు వశ్యంబులైయుండు ముమ్మూరులున్నీవెకా – నీవు లేకున్ననుం బీలు వేదు – గోలోకమందున్న కృష్ణుండు నీ భర్తయే కాదె వైకుంఠమందున్న విష్ణుండు నీకుం బ్రియుం డెంతగా నిన్నువర్ణింతు – నీ పాదపద్మంబె నాకున్ శరణ్యంబు – నాకున్ బ్రతాపప్రభావంబులం గూర్పుమమ్మా – జయంబున్ – జయంబున్ ఘటింపంగదమ్మా – మహైశ్వర్యమిమ్మా – యిదే మ్రొక్కెదన్ – మ్రొక్కెదన్ – మ్రొక్కెదన్ – శ్రీకరీ – భక్త రక్షాకరీ – యిందిరా – లోకమాతాయటంచుం భజింతున్.

క. ఈగతి నింద్రుడు గొలువగ
సాగరకన్యకయు సకలసంపదలును వే
వేగమ విబుధుల కిడి కృ
ష్ణా గారంబునకు జనియె హరి సేవించెన్

తే.గీ. మనుజుడీ స్తోత్రమును శుద్ధమానసుడయి
మూడు సంధ్యల జదివిన నేడు దీవు
లేలు నైశ్వర్యమును జెందునిది నిజంబ
టంచు నారాయణుడు జెప్పె నమరమునికి

మునీంద్రా! దేవరాజగు ఇంద్రుడు ఈ మంత్రమును పఠించెను. ఆ దేవి మూలమంత్రము పది లక్షలు జపించెను. బ్రహ్మ కృపవలన ఇతనికి లభించెను. శ్రీ బీజమును (శ్రీం), మాయాబీజమును (హ్రీం), కామబీజమును (క్లీం), వాణీ బీజమును (ఐం)ను ప్రయోగించెను (ఓం శ్రీం హ్రీం క్లీం ఐం కమలవాసిన్యై స్వాహా)

ఈ మంత్రరాజమును కుబేరుడు ఆరాధించి పరమైశ్వర్యమును దక్షసావర్ణి రాజాధిరాజుగ, మంగళుడు సప్తద్వీపములకు రాజుగ, ప్రియవ్రతునకు, ఉత్తానపాదునకు రాజగు కేదారునకు రాజేంద్రులని

పిలిపించుకొను సౌభాగ్యమును ఈ మంత్రము ప్రసాదించినది. భగవతి మహాలక్ష్మిని చూచి దేవేంద్రుడు ఆ దేవిని స్తుతింపసాగెను.

కమలవాసినికి నమస్కారము. నారాయణికి వందనములు, మహాలక్ష్మికి ప్రణామములు. పద్మాసన, పద్మినీ, వైష్ణవి నామముతో శోభిల్లు భగవతికి ప్రణామములు. బుద్ధి స్వరూప, బుద్ధి ప్రదాతవు, క్షీరసాగరుని ఇంట లక్ష్మివి, రాజ్యలక్ష్మివి, స్వర్గలక్ష్మివి, గృహలక్ష్మివి, సురభివి, అదితివి, స్వాహాయనియు స్వధాయనియు నీ నామములే. పృథివి నీవే.

నిన్ను వరదా, శారదా, శుభా, పరమార్థప్రదాయిని, హరిదాస్య ప్రదాయనీ అని పిలిచెదరు. హరిప్రియా! నీ దర్శనము నాకు కలుగునంతవరకు నేను బంధహీనుడను, భిక్షుకుడను, సంపదలు లేనివాడినైయుంటిని. ఇప్పుడు నాకు జ్ఞానము, పరమైశ్వర్యము, నాకు విజయము ప్రాప్తించవలెను.

ఇట్లు పలికి దేవేంద్రుడు పదేపదే ప్రణామము చేసెను. బ్రహ్మ, శంకరుడు, శేషనాగుడు, ధర్ముడు, కేశవుడు భగవతి మహాలక్ష్మిని ప్రార్థించిరి. మహాలక్ష్మి శ్రీహరి దగ్గరకు చేరుకొనెను.

మునీంద్రా! బ్రహ్మ, శంకరుడు దేవతలకు శుభాశీస్సులు నొసగిరి. ఈ స్తోత్రము మిగుల పవిత్రమైనది.

ఇంద్రుడు చెప్పిన లక్ష్మీ స్తోత్రం – (వ్యాసులవారిచే)

నమః కమలవాసిన్యై, నారాయణ్యై నమో నమః
కృష్ణప్రియాయై సతతం మహాలక్ష్మ్యై నమో నమః
పద్మపత్రేక్షణాయై చ పద్మాస్యాయై నమో నమః
పద్మాసనాయై పద్మిన్యై వైష్ణవ్యై చ నమో నమః
సర్వసమ్పత్స్వరూపిణ్యై సర్వాధ్యై నమో నమః
హరిభక్తిప్రదాత్ర్యై చ హర్షదాత్ర్యై నమో నమః

కృష్ణవక్షస్స్థితాయై చ కృష్ణేశాయై నమో నమః
చన్ద్రశోభాస్వరూపాయై రత్నపద్మే చ శోభనే
వైకుణ్ఠే యా మహాలక్ష్మీ ర్యా లక్ష్మీః క్షీరసాగరే
స్వర్గలక్ష్మీ రిన్ద్రగేహే రాజ్యలక్ష్మీ ర్నృపాలయే
గృహలక్ష్మీ శ్చ గృహిణాం, గేహే చ గృహదేవతా
సురభి స్సాగరే జాతా, దక్షిణా యజ్ఞకామినీ,
అదితి ర్దేవమాతా త్వం, కమలా కమలాలయా,
స్వాహా త్వం చ హవిర్దానే, కవ్యదానే స్వధాస్మృతా
త్వం హి విష్ణుస్వరూపా చ సర్వధారా వసున్ధరా
శుద్ధసత్త్వస్వరూపా త్వం, నారాయణ పరాయణా
యథా మాతా స్తనన్ధానాం శిశూనాం శైశవే సదా
తథా త్వం సర్వదా మాతా, సర్వేషాం సర్వరూపతః
సుప్రసన్నస్వరూపా త్వం, మాం ప్రసన్నా భవామ్బికే
వైరిగ్రస్తం చ విషయం దేహి మహ్యం సనాతని
అహం యావత్త్వయా హీనో బన్ధుహీన శ్చ భిక్షుకః
సర్వసంపద్విహీన శ్చ తావ దేవ హరిప్రియే
జ్ఞానం దేహి చ ధర్మం చ సర్వసౌభాగ్య మీప్సితమ్
ప్రభావం చ ప్రతాపం చ సర్వాధికార మేవ చ
జయం పరాక్రమం యుద్ధే పరమైశ్వర మేవ చ
ఇత్యుక్త్వా చ మహేన్ద్ర శ్చ సర్వై స్సురగణై స్సహ

(9 స్క. 42అ. 51-68 శ్లో)

త్రికాలములందు ఈ స్తోత్రము పఠించిన పురుషుడు కుబేరుని వలె రాజాధిరాజు కాగలడు. అయిదు లక్షలు జపించినచో మానవులకు ఈ స్తోత్రము సిద్ధించును. ఎవరైనను ఈ సిద్ధి స్తోత్రము పఠించినచో మహాసౌఖ్యము పొంది రాజేంద్రుడగుటలో సందేహము లేదు.

11. స్వాహాదేవి, స్వధాదేవి – పూజ – స్తోత్రములు

నారదుడు ప్రభూ! నారాయణా! స్వాహా, స్వధా మహత్త్వము తెలపవలసిందిగా మునీంద్రా! సృష్టి సమయపు నాడు దేవతలకు భోజనము లభించకుండెను. వారు ఆహారమునకై బ్రహ్మను ప్రార్థించిరి. బ్రాహ్మణులు హవనములు చేయుదురు. వాటివలన మీ భోజనమునకు ఏర్పాట్లు జరుగును అనెను. దీనికొరకు బ్రహ్మ శ్రీకృష్ణుని స్తుతించగా శ్రీహరి యజ్ఞరూపమున ప్రకటమయ్యెను.

నారాయణుడు మునివరా! బ్రాహ్మణులు, క్షత్రియులు చేయు హవనములు దేవతలకు లభ్యమగుట లేదు అని బ్రహ్మకు చెప్పగా అతడు మూలప్రకృతిని ఉపాసించసాగెను. స్వాహాదేవి భగవతి భువనేశ్వరి కళతో ప్రకటిత అయ్యెను. భగవతి స్వాహాబ్రహ్మ వద్దకు వెళ్ళి పద్మయోనీ! వరమడుగుము అనగా బ్రహ్మ దేవీ! అంబికా నీవు అగ్నికి దహనశక్తివి కమ్ము. అగ్నికి పత్నివి. దేవతలు, మానవులు నిన్ను సదా పూజించెదరు. నీవు జగత్తును రక్షించెదవు. శంకరుడు మృత్యువు మీద విజయమును పొందెను. శేషనాగుడు విశ్వమును మోయును, ధర్మమునకు ధార్మిక పురుషులను తెలుసుకొను యోగ్యత ప్రాప్తించెను. గణేశుడు దేవసమాజమునందు ప్రథమముగా పూజలందుకొనెను. ప్రకృతి దేవి అందరిచేత పూజింపబడును. ఇదంతయు శ్రీకృష్ణుడు ఉపాసించిన ఫలమే.

బ్రహ్మతో ఇట్లు పలికి స్వాహాదేవి శ్రీహరిని గురించి తపమొనరించుటకు అనేక సంవత్సరములు తపమొనరించెను. శ్రీకృష్ణుడు ఆమెకు దర్శనమొనగగా అతడామెను లేవనెత్తి తన ఒడిలో కూర్చొనబెట్టుకొనెను.

కాంతా! వరాహకల్పము నందు నాకు ప్రియురాలువు కమ్ము. నీ పేరు 'నాగ్నజితి' యగును. నీవు దహనశక్తితో సంపన్నువై అగ్నికి

ప్రియపత్నివగుము. అగ్నిదేవుడు నిన్ను తన గృహస్వామినిగా చేసికొని పూజించును.

ఇట్లు స్వాహాదేవితో సంభాషించి శ్రీకృష్ణుడు అంతర్ధానుడయ్యెను అగ్ని దేవుడచటకి వచ్చెను. భగవతి స్వాహాదేవికి, అగ్నిదేవునకు వివాహసంస్కారము సంపన్నమయ్యెను. స్వాహాదేవి గర్భవతి అయ్యెను.

దక్షిణాగ్ని, గార్హపత్యాగ్ని, ఆహవనీయాగ్ని పుత్రులు వారికి కలిగిరి. మునులు, బ్రాహ్మణులు, క్షత్రియులు, స్వాహాంత మంత్రముల నుచ్చరించుచూ హవనములు చేయసాగగా దేవతలకది ఆహార రూపమున లభ్యమగుచుండెను.

బ్రాహ్మణులందరునూ మిగుల సంతుష్టులైరి. దేవతలకు ఆహుతులు లభింపసాగెను. నారాయణుడు... మునీంద్రా! స్వాహాదేవి సామవేదము నందు, ధ్యాన స్తోత్రపూజావిధానములు చెప్పబడినవి. సాలగ్రామ ప్రతిమను గానీ లేక కలశము నందు గాని భగవతి స్వాహాదేవిని పూజించి యజ్ఞము నారంభించవలెను.

"ఓం హ్రీం శ్రీం వహ్ని జాయాయై దేవై స్వాహా" ఇది మూలమంత్రము. అగ్నిదేవుడు స్వాహి, వహ్నిప్రియా, వహ్నిజాయా సంతోషకారిణి, శక్తి, క్రియ, కాళదాత్రి, పరిపాకకరి, ధ్రువ, గతినరదాహిక, దహనక్షతు, సంసార సారరూప, ఘోర సంసారతారిణి, దేవ జీవన రూప, దేవపోషణకారిణి – ఈ పదహారు నామములు స్వాహాదేవికి కలవు.

శ్లో॥ స్వాహా వహ్నిప్రియా వహ్నిజాయా సంతోషకారిణీ
శక్తిఃక్రియకాలదాత్రీ పరిపాకకరీ ధ్రువా!
గతిస్సదానరాణాంచ దాహికా దహనక్షమా
సంసారసారరూపా చ ఘోరసంసారతారిణీ
దేవజీవనరూపా చ దేవపోషణకారిణీ

షోడశైతానినామాని యః పఠేద్భక్తిసంయుతః
సర్వసిద్ధిర్భవేత్తస్య ఇహలోకే పరత్ర చ॥ (9 స్క.43అ.50-53)

ఈ శ్లోకములు చెప్పని ఏ శుభకార్యము అసంపూర్ణముగనుండదు. పుత్రులు లేనివారు పుత్రవంతులగుదురు. భార్య లేనివారు భార్యను కూడి ఉందురు. స్వధాదేవి ఉత్తమ ఉపాఖ్యానము చెప్పెదము వినుమని నారాయణుడు పూనుకొనెను.

బ్రహ్మ సృష్ట్యారంభమున ఏడుగురు పితరులను సృజించెను. నలుగురు మూర్తిమంతులు, ముగ్గురు తేజోరూపులు, స్నానము, తర్పణము, శ్రాద్ధము, దేవపూజనము, అటులనే ప్రతిదినము త్రికాలసంధ్యలు - బ్రాహ్మణుల పరమ కర్తవ్యము. ఈ విషయము శ్రుతియందు ప్రసిద్ధము. నిత్యము త్రికాల సంధ్యలు, శ్రాద్ధము, తర్పణము, బలి, వేదఘోష చేయని బ్రాహ్మణుడు అజగర సర్పముతో సమానమని తెలిసికొనవలెను. దేవి సేవ చేయకుండా నైవేద్యమును సమర్పించకుండా భుజించు వ్యక్తి జీవన పర్యంతము అపవిత్రమైయుండును.

బ్రాహ్మణులు మొదలగు వ్యక్తులచే ఇవ్వబడిన కవ్యపదార్థములను పితరులు పొందలేకపోయిరి. వారందరునూ ఆకలితో బ్రహ్మసభకు వెళ్ళిరి. అన్ని విషయములను బ్రహ్మకు నివేదించిరి. అప్పుడు విధాత ఒక మానసకన్యను ప్రకటించెను.

ఆమె మూల ప్రకృతి జగదంబ అంశమున జన్మించి ఆ దేవి చిరునగవుతో శోభిల్లుచుండెను. 'స్వధా'యని నామకరణము చేయబడెను. ఆమె పితరులకు పత్నిగా చేయబడినది. బ్రహ్మ పితరులను సంతృప్తి కలిగించుటకు తుష్టి స్వరూపిణియగు యీమెను పత్నిగా అతనికి సమర్పించెను. మంత్రము యొక్క చివర 'స్వధా'ను జోడించి ఉచ్చరించవలెను.

స్వాహా శబ్దమును, పితరులకు స్వధాశబ్దము ఉచ్చరించుట, శ్రేష్ఠముగ భావింపబడును. దేవతలు, పితరులు, బ్రాహ్మణులు, మునులు, మానవులు, శాంత స్వరూపయగు స్వధాను పూజించిరి, స్వధాదేవి యొక్క సంపూర్ణ ఉపాఖ్యానమును నీ ఎదుట ఉంచితిని.

నారదుడు స్తోత్రములు వినిపింపమని కోరగా – అశ్వనీ మాస కృష్ణపక్ష త్రయోదశి నామ నక్షత్రమున శ్రాద్ధదినము భగవతి స్వధాను పూజింపవలెను. ఇట్లు ధ్యానమొనరించి రాయిమీదకు గాని మంగళప్రదమగు కలశము మీదకు గాని ఈ దేవిని ఆవాహనము చేయవలెను.

ఓం హ్రీం శ్రీం క్లీం స్వధా దేవ్యై స్వాహా. ఈ మంత్రమునుచ్చరించి బ్రాహ్మణుడు ఈమెను పూజించి స్తుతించి, ప్రణామము చేయవలెను. నారదా! ఇప్పుడు స్తోత్రమును వినుము. బ్రహ్మ దీనిని పఠించెను.

స్వధా శబ్దమును ఉచ్చరించినంతమాత్రముననే మానవుడు తీర్థ స్నాతుడయ్యెను. వాజపేయ యజ్ఞఫలమునకు అధికారియగును. 'స్వధా, స్వధా, స్వధా' అని మూడు సార్లు ఆ దేవినామమును స్మరించినచో శ్రాద్ధము బలి, తర్పణముల ఫలమును పురుషుడు పొందగలడు. శ్రాద్ధ సమయమున పురుషుడు సావధానుడై స్వధాదేవి స్తోత్రమును వినినచో అతడు శ్రాద్ధఫలమును పొందును.

స్వధా, స్వధా, స్వధా అను పవిత్రనామమును త్రికాల సంధ్యా సమయములందు పఠించు మానవునకు పుత్రుడు సద్గుణ సంపన్నురాలు వినయముగల పతివ్రతయగును. ప్రియమైన భార్య లభించును. బ్రాహ్మణులకు జీవన స్వరూపిణివి. నిన్ను శ్రాద్ధ అధిష్ఠాత్రిదేవిగా చెప్పుదురు.

స్వస్తి, స్వాహా, స్వధా, దక్షిణామయివగు దేవీ నీకు నమస్కరించెదను. కర్మలను సంపూర్ణమొనరించుటకే ఈశ్వరుడు ఈ నాలుగు రూపములను తయారుచేసెను.

శ్లో॥ స్వధా స్వధా స్వధేత్యేవం త్రిసంధ్యం యః పఠేన్నరః
ప్రియాం వినీతాం సలభేత్సాధ్వీం పుత్రగుణాన్వితామ్
పిత్రూణాం ప్రాణ తుల్యాత్వంద్విజ జీవన రూపిణీ
శ్రాద్ధాధిష్ఠాతృదేవీ చ శ్రాద్ధాదీనాం ఫలప్రదా॥
పుణ్యరూపాసి నిత్యాత్వం సత్యరూపాసి సువ్రతే ॥
ఆవిర్భావ తిరోభావౌ సృష్టౌచ ప్రళయే తవ
ఓం స్వస్తిశ్చ నమః స్వాహా స్వధా త్వం దక్షిణా తథా!
నిరూపితాశ్చతుర్వేదైః కర్మిణాంపునః
కర్మపూర్త్యర్థమే వైతా ఈశ్వరేణ వినిర్మితా (9 స్క, 44 అ: 30-34)

ఇట్లు దేవి స్వధా మహిమను గానము చేసి బ్రహ్మ తన సభయందు విరాజమానుడయ్యెను. భగవతి స్వధా ఆయన ఎదుట ప్రకటిత అయ్యెను. ఆ దేవిని పితరులిట్లు నమస్కరించెదరు.

తే.గీ. శ్రాద్ధకాలంబునను స్వధాస్తవము విన్న
శ్రాద్ధఫలమును బొందును స్వధ స్వధ స్వధ
యని త్రిసంధ్యల జపియింప నలఘుగుణసమన్వితయు
సాధ్వియునునైన యాలు గల్గు

ఉత్సాహ- పితల ప్రాణతుల్యవమ్మ ప్రీతీ జననివమ్మ నీ
వతులగుణగణాధ్యవమ్మ యఖిలపుణ్యరూపవున్
సతతసత్యరూపవమ్మ శ్రాద్ధఫలదవమ్మ స
న్మతివి శ్రాద్ధదేవివమ్మ మంగళాంగియో స్వధా

ఉత్సాహ - అనఘ వీవు సృష్టిమొదల నవతరించినావుగా
ఘనలయంబునందు నీవు కానరాకయుండగా
యెనయ స్వస్తి నీవు ప్రణవ మీవు స్వాహా వీవుగా
జనని దక్షిణవును నీవు సర్వమంగళా స్వధా!

ఆ దేవిని పొంది పితరులకు సమర్పించెను. పితరులు అప్పుడు అత్యంత ప్రసన్నులైరి. సమాహితచిత్తముతో ఈ స్తోత్రమును శ్రవణము చేసిన పురుషుడు సకలతీర్థములందు స్నానము చేసిన వాడగును. అతనికి సకల మనోరథములు ఫలించును.

12. భగవతి దక్షిణ స్తోత్రము – ఫలశ్రుతి

నారాయణుడు మునీంద్రా! దక్షిణ యొక్క ప్రసంగమును సావధానుడై వినుము. శ్రీ కృష్ణుని యొక్క ప్రేయసి పేరు సుశీల. ఆమె లక్ష్మితో సమానురాలు. శ్రీ కృష్ణుడు ఆమెను ప్రేమించుచుండెను. అప్పుడు రాధ సుశీలతో నీవు నేటి నుండి గోలోకమునకు రాజాలవు అని చెప్పెను. శ్రీ కృష్ణుడు అచటనుండి అంతర్ధానుడయ్యెను. విరహ వ్యాకులత అయ్యెను. కరుణాపూర్ణయై ఇట్లు ప్రార్థించెను.

శ్రీకృష్ణా! నీవు నా ప్రాణ నాథుడవు. శాశ్వత సుఖము, ప్రేమ, శాంతి, పతివ్రతలు తమ స్వామియందే పొందుచుందురు. వారే వారికి సర్వస్వము. ఆమెకు పరమ బంధువగును. భర్తయనియు, పతియనియు, స్వామియనియు, కాంతుడనియు, బంధువు అనియు, ఈశుడని అందురు. ప్రాణనాయకుడని, రమణుడనియు పిలిచెదరు.

గురువు, బ్రాహ్మణుడు, దైవములలో స్త్రీకి భర్తయే శ్రేష్ఠుడు, నాథానాథాయని కరుణతో పిలుచుచుండెను. ప్రభూ దర్శనమొసగుడు అని ఆమె పలుకుచుండెను. శ్రీకృష్ణుడు రాధ విరహతాపమును శాంతమొనర్చెను. సుశీలయను పేరుగల రాధకు ఒక సఖియుండెను. రాధ గోలోకమును వదలిపెట్టి పొమ్మని చెప్పెను, ఆ దేవి దక్షిణయను పేరుతో ప్రకటిత అయ్యెను.

నారాయణుడు మహాలక్ష్మి యొక్క దివ్య విగ్రహము నుండి మర్త్యలక్ష్మిని ప్రకటింపచేసెను. ఆమెకు దక్షిణ యని నామకరణము చేసి

బ్రహ్మకు సమర్పించెను. బ్రహ్మ దక్షిణను యజ్ఞ పురుషుని వద్దనుండుటకు ఏర్పాట్లు గావించెను. యజ్ఞపురుషుడు దక్షిణా దేవిని పూజించి స్తుతించెను.

తదుపరి యజ్ఞ పురుషుడు ఆ దేవిని తన సహధర్మచారిణిగ చేసికొనెను. దక్షిణాదేవి గర్భవతి అయ్యెను. పండ్రెండు దివ్య సంవత్సరములు గడువగా ఆమె ఒక కుమారునికి జన్మనిచ్చెను. యజ్ఞుడు, దక్షిణను భార్యగా బడసి పుత్రునితో గూడి కర్మఫలమును నొసగుచుండెను. ఈ విషయమంతయు ధర్మదేవుని నోటి నుండివింటిని. అందువలన ఎవరైనను కర్మ చేసిన వెంటనే యజ్ఞకర్త దక్షిణను తప్పక ఇవ్వవలెను.

బ్రాహ్మణులకు దక్షిణ నివ్వలేకపోయినచో యజమాని తలపెట్టిన కర్మ అంతయూ నిష్ఫలమగును. లక్ష్మి వానికి భయంకర శాపమునొసగి అతని ఇంటినుండి వెళ్ళిపోవును. అతనిచే ఇవ్వబడిన శ్రాద్ధమును, తర్పణమును పితరులు స్వీకరించరు. దేవతలు అగ్నిలో వ్రేల్చిన ఆహుతులను గ్రహింపరు. యజ్ఞము చేయునపుడు దక్షిణనిచ్చెదనని సంకల్పించును. కాని ఇవ్వడు. ఇమ్మని అడగడు. వారిరువురును నరకమున పడిపోవుదురు.

నారాయణుడు మునీంద్రా! ఫలము నొసగు యోగ్యత దక్షిణతో కూడిన కర్మయందే ఉండును. భక్తి లేని పురుషుల కర్మ - ఇవన్నియు బలికి ఆహారమగును. దక్షిణ యొక్క ధ్యాన, స్తోత్ర, పూజావిధానములు కణ్వశాఖ యందు వర్ణించబడింది. దక్షిణ, యజ్ఞ పురుషుని భర్తగా పొందెను. ఆ సుందరరూపమును చూచి యజ్ఞపురుషుడు మోహితుడై దేవిని స్తుతించెను.

యజ్ఞపురుషుడు సౌభాగ్యవతీ! పూర్వకాలమున గోలోకము నందు ఒక గోపికవు, శ్రీ కృష్ణుడు నిన్ను ప్రేమించుచుండెను. నీవు మహాలక్ష్మి దక్షిణ భాగము నుండి ప్రకటితవైతివి. శోభనాంగీ! రాధాదేవి శాపము వలన గోలోకమును వీడితివి. దక్షిణయను పేరుతో నాకు ప్రాప్తించితివి. నన్ను భర్తగా స్వీకరింపుమని కోరెను.

నీవు లేకపోయినచో కర్మఫలముల నొసగుటకు అసమర్థులగుదురు. కాంతా నీవే నా శక్తివి. వరాననా! జన్మజన్మాంతరములలో నిరంతరము నీవు నా సమీపమున నుండుము అని ప్రార్థించగా దక్షిణ ప్రసన్నురాలయ్యెను. ఇది దక్షిణా స్తోత్రము. దీనిని పఠించిన పురుషునకు సకలయజ్ఞముల ఫలము సులభమగును.

తే.గీ. దక్షిణను పూజసేయుట తలచుటయును
స్తవముసేయుట మొదలగు ధర్మములను
గణ్వ శాఖను గనవచ్చు గాన దాని
దెలిపెదను విను మింక నో యలఘుచరిత

మత్తకోకిల- నీవు గోపివి నీవు గోవుల నేత్రివౌదు దయానిధీ
నీవు రాధకు సాటిదానవు నిత్య సౌఖ్య విధాయినీ
నీవు కృష్ణుని ముద్దురాలవు నిన్ను గొల్చెద మానినీ
నీవు కీర్తి వహించినావు వినిర్మలమ్ముగ దక్షిణా!

మత్తకోకిల- పుట్టినావుగ నీవు కార్తిక పూర్ణిమన్ శుభరాసమం
దెట్టివారునునిన్ననోమెద రీప్సితంబులపంటకై
ముట్టి కొల్చెద లక్ష్మి కింగుడి మూప వీవు సుశీలవా
గట్టిదానవు నన్ను వేగమ కావరాగదె దక్షిణా!

మత్తకోకిల - ధర్మకర్మఫలంబు లిచ్చెడి ధాత్రివైతివి శంభుడుం
భర్మగర్భుడు దిక్కులేలెడివారు సత్ఫల దాతలే
కర్మకోటికి కర్మరూపిణి కర్మకర్తృ శుభాకృతీ
శర్మదాయిని లోకపావని జ్ఞానబోధిని దక్షిణా!

ఉ. జానుగ సర్వకర్మఫల సంపదలన్ దయసేయు దక్షిణా
ఖ్యానము నీకు జెప్పితిని హర్షముతో త దుదార భక్తి న
జ్ఞానము బాసి మానవుడు శాంతి వహించి సుఖంబు లందు నెం
దేని కొరంత రాదు వినుమీ యిది వ్రాసిన విన్న జెప్పినన్

ఉ. పుత్రులులేనివాడు గను భూరిగుణాఢ్యుల సుందరాంగులన్
క్షేత్రములేని మానవుడు జెందు బతివ్రత సుందరాంగినిం
బుత్రవతిన్ బ్రియన్ విమల బుణ్యవతిన్ గుణధన్య సత్కులన్
జిత్రముగా నిరక్షరుడు సెందును విద్యను దీని విన్నచోన్

తే.గీ. భూమిలేనివాడు భూమి సంపాదించు
బంధు హానియందు బంధనమున
నాపదలను మాసమరలేక వినువాడు
సంశయంబు లేక సౌఖ్య మందు

పురుషుడు సాలగ్రామములందు లేక కలశము నందు భగవతి దక్షిణను ఆవాహము చేసి పూజించవలెను. దక్షిణ భుజము నుండి ప్రకటితయైన కారణమున దక్షిణయనునామముతో ఖ్యాతి వహించినది.

శుభ, శుద్ధిగ, శుద్ధిరూప, సుశీల నామములతో ప్రసిద్ధి పొందిన భగవతి దక్షిణను నేను ఉపాసించెదను. అర్ఘ్య పాద్యాదులన్నియును ఈ వేదోక్త మంత్రముతో సమర్పించవలెను. "ఓం శ్రీం క్లీం హ్రీం దక్షిణాయై స్వాహా" అనునది మంత్రము.

ఏ పురుషుడైనను దక్షిణాదేవి యొక్క ఈ చరిత్రను సావధానుడై వినినచో అతని కర్మ ఏదియును అసంపూర్ణముగనుండదు. కుమారుని పొందు సౌభాగ్యము, సౌశీల్యవతి సుందరమైన పత్ని లభించును.

భూమిహీనుడు భూస్వామియగును. ప్రజావంతుడగును. ఒక నెల వరకు దీనిని శ్రవణము చేయు పురుషుడు ముక్తుడగును.

13. షష్ఠీదేవి, ధ్యాన, స్తోత్రములు

నారాయణుడు ప్రభూ! షష్ఠి, మంగళ, చండిక, మనసా అనువారు మూలప్రకృతి కళల నుండి పుట్టిరి. మూల ప్రకృతి యొక్క షష్ఠి ప్రకటిత అయ్యెనని తెలుపుదురు. అధిష్ఠాత్రిదేవి, విష్ణుమాయ, పుత్రదాయిని యని

ఈమెను పిలిచెదరు. మాతృకల యందు 'దేవసేన' నామముతో ప్రసిద్ధురాలు. కార్తికేయునకు పత్నియగు సౌభాగ్యము ప్రాప్తించినది. ఈమె ఉత్తమ చరిత్రను కూడా వినుము. ధర్మదేవత నోటి నుండి నేను వింటిని.

ప్రియవ్రతుడు అను పేరుగల ఒకరాజు ఉండెను. తండ్రి స్వాయంభువ మనువు. ప్రియవ్రతుడు తపస్సు నందు అతనికి విశేషమైన అభిరుచి యుండెను. బ్రహ్మదేవుని ఆజ్ఞతో వివాహము చేసికొనెను. సంతానము కలుగలేదు.

కశ్యపుడు అతనితో పుత్రకామేష్టి యజ్ఞమును చేయించెను. రాజు యొక్క పత్ని పేరు మాలిని. ముని ఆమెకు యాగచరువును ప్రసాదించెను. రాణి మాలిని గర్భవతి అయ్యెను. కుమారుడు జన్మించెను. కాని ఆ బాలుడు మరణించియుండెను. నేత్రములు తిరగబడియుండెను.

ప్రియవ్రతుడు మరణించిన ఆ బాలకుని తీసుకొని శ్మశానమునకు వెళ్ళెను. ఇంతలో దివ్య విమానము కనిపించెను. అందులో ఆశీనురాలైన దేవి రాజు ప్రియవ్రతుని చూచెను. ఆ దేవుని చూచిన వెంటనే బాలకుని భూమి మీద పడుకోబెట్టెను. షష్ఠిదేవితో ప్రియవ్రతుడు వరారోహా! నీవెవరవు? నీవెవరి కన్యవు? అభినందనీయవు అనెను.

నారదా! ఆమెయే భగవతి దేవసేన. దేవతలు దైత్యులతో పరాజయమును పొందిరి. అప్పుడు దేవి తానే సైన్యముగా రూపొంది దేవతల పక్షమున పోరాడి యుద్ధమొనరించెను. దేవతలు విజయులైరి. అందువలన ఆమెకు 'దేవసేన' యని పేరువచ్చెను.

రాజా! నేను బ్రహ్మ మానసపుత్రికను. నా పేరు దేవసేన. విధాత నన్ను ఆవిర్భవింపచేసి కార్తికేయునకు సమర్పించెను. స్కందునకు భార్యనగు సౌభాగ్యము నాకు కలిగినది. మూల ప్రకృతి యొక్క ఆరవ అంశను, షష్ఠినామమున ప్రసిద్ధురాలనైతిని.

రాజా! సుఖము, దుఃఖము, భయము, శోకము, హర్షము, శుభము, సంపదలు, ఆపదలు – ఇవన్నియు కర్మననుసరించియే కలుగుచున్నవి. పుత్రులు కలుగుట, పుత్రహీనులగుట, మరణించిన కుమారుడు జన్మించుట, దీర్ఘజీవి ఉదయించుట, ఇవన్నియు కర్మఫలమే. రాజా! అన్నిటికంటె కర్మ బలీయమైనది అని చెప్పి షష్ఠిదేవి ఆ బాలకునెత్తుకొనెను. జ్ఞానప్రభాదేవి గొప్పదనము జ్ఞానప్రభావమున లీలగ అతనిని బ్రతికించెను. ఆ బాలుడు నవ్వుచుండగా ప్రియవ్రతుడు ఆ బాలకుని చూచుచునేయుండెను. దేవి రాజుతో కర్మనిష్ఠితవేదవచనమును పలికెను.

రాజా! నీవు స్వాయంభువ మనువు పుత్రుడవి. మూడు లోకములందును నీ శాసనము కలదు. అన్ని చోట్ల నన్ను పూజించునట్లు చేయుము. నీవును నన్ను స్వయముగా పూజించుము. ఇప్పుడు చక్కని పుత్రుని ప్రసాదించెదను. అతని పేరు సువ్రతుడు. నారాయణుని కళ యొక్క అవతారము. అతడు ప్రముఖ యోగియగును. పూర్వజన్మ స్మృతి అతనికుండును. వంద అశ్వమేధ యజ్ఞములనుచేయును. యోగులలో, జ్ఞానులలో, తాపసులలో సిద్ధరూపుడు. ఏడు లోకములందు అతని కీర్తి వ్యాపించును అని ప్రియవ్రతునితో ఆ దేవి పలికెను.

భగవతి దేవసేన ఉత్తమ వరములనొసగి స్వర్గమునకు వెళ్ళిపోయెను. రాజు మంత్రులతో కూడి ఈ విషయమునంతయు అందరికి చెప్పగా పరమానందభరితులైరి. రాజు పుత్రప్రాప్తి సందర్భమున సర్వత్ర శుభకార్యములనారంభించెను, భగవతిని పూజించెను.

బ్రాహ్మణులకు చాలా ధనమును దానము చేసెను. షష్ఠి తిథి రోజున భగవతి షష్ఠిదేవి యొక్క మహోత్సవము జరుగుచుండెను. బాలకుల ప్రసవగృహమునందు ఆరవదినము ఇరువది ఒకటవ దినము, అన్న ప్రాశన, దేవికి పూజలు జరుగుచుండెను.

సువ్రతా! దేవసేనయొక్క ధ్యానపూజా స్తోత్రములను తెలిపెదను వినుము. కౌథుమ శాఖయందు వర్ణించబడినది. ధర్మదేవుని ముఖము నుండి విను సౌభాగ్యము నాకు కలిగినది. సాలగ్రామ ప్రతిమ, కలశము లేక వట వృక్ష మూలభాగమున షష్ఠీదేవి నావాహము చేసి లేక గోడమీద చిత్రమును గీసి ప్రకృతి యొక్క ఆరవ అంశ నుండి ప్రకటిత అయిన శుద్ధస్వరూపిణి భగవతిని ఇట్లు పూజింపవలెను. సుందరమైన పుత్రుని, శుభమును దయను ప్రసాదించు ఈ దేవి జగజ్జనని.

భగవతి దేవసేనను నేను ఉపాసించెదను అని పుష్పాంజలి సమర్పించవలెను. పాద్యము, అర్ఘ్యము, ఆచమనీయము, గంధము, పుష్పము, దీపము, వివిధములైన నైవేద్యములను మధురమైన ఫలములను సమర్పించి భగవతిని ఆరాధించవలెను.

"ఓం హ్రీం షష్ఠీ దేవ్యై స్వాహా" ఈ మంత్రమును పఠించవలెను. పురుషుడు పూజతో శక్తికొలది ఈ అష్టాక్షరి మంత్రమును కూడా జపించవలెను. ఈ ఉత్తమ స్తోత్రము సామవేదము నందు వర్ణింపబడినది. లక్షసార్లు జపించిన ఉత్తమ పుత్రప్రాప్తి కలుగునని బ్రహ్మ నుడివెను. ఇపుడు స్తోత్రమును వినుము. ఈ స్తోత్రము వేదములందు గోప్యమైయున్నది.

దేవికి నమస్కారము, మహాదేవికి నమస్కారము, శాంతస్వరూపిణి, భగవతి సిద్ధాదేవికి నమస్కారము. శుభాంగి షష్ఠికి పదేపదే వందనములు, వరద పుత్రదాయిని, ధనదాయిని, సుఖప్రధాత, మోక్షప్రదాత యగు భగవతి షష్ఠీదేవికి పదేపదే నమస్కారములు. మాయ, సిద్ధ, యోగిని, సార, శారద, పరాదేవి భగవతి షష్ఠీదేవికి పదేపదే కైమోడ్కులు.

సకల కార్యములందు పూజలందుకొనుటకు అధికారిణి కార్తికేయునకు, షష్ఠిదేవికి పదేపదే నమస్కారములు. హింస, క్రోధము లేని భగవతి షష్ఠికి పదేపదే వందనాలు. నీవు నాకు గౌరవమును విజయమును, విజయమును ప్రసాదింపుము.

ధనము, యశస్సు ప్రసాదించు భగవతి షష్ఠికి పదేపదే ప్రణామములు, నీవు భూమి నిమ్ము. సంతానమునిమ్ము, విద్యనిమ్ము. జయమును, శుభమును ప్రసాదింపుము. ఈ స్తుతి ముగించిన ప్రియవ్రతునకు షష్ఠిదేవి కృపవలన యశస్వియగు పుత్రునిపొందెను.

ఈ స్తోత్రమును వివినవాని సకలపాపములును నశించును. రోగపీడితుడైన పుత్రుని తలితండ్రులు ఒక నెల వరకు ఈ స్తోత్రమును శ్రవణము చేసినచో షష్ఠిదేవి కృపవలన ఆ బాలకుడు ఆరోగ్యవంతుడగును.

షష్ఠి స్తోత్రంబు తెలిపెద వినుడు –

సీ. సేగి బాపెడి దేవసేనకు దండంబు భద్రంబు లిచ్చు నంబకు జోహారు
వరము లొసగు దేవవందినికిని మ్రొక్కు సిరులిడునట్టి షష్ఠికిని జోత
పుత్రదాయినియైన ధాత్రికి జేజేలు మేలోర్చు తల్లికి గేలుమోడ్పు
మాయ తానైన యమ్మకు నమస్కారంబు బాలపోషిణికిని వందనంబు

తే.గీ. శారదకు భక్తరక్షా విశారదకును
సారకును గరుణారసాసారమతికి
సిద్ధకును బూజ్యకును నిత్యశుద్ధమతికి
వేదవేద్యకు నిదె యభివాదనంబు

వసంతతిలక – జోహారు నీకు వరదా సురసేవ్యపాదా
జోహారు నీకు సుమతీ శుభవాగ్విభూతీ
జోహారు నీకు పరమాసురవైరిభీమా
జోహారు నీకు సుకటీ సుఖమూర్తి షష్ఠీ!

ద్విపద – ధనమును నాకిమ్ము తనయుల నిమ్ము
మనమున నిను గొల్తు మానక షష్ఠి
మానంబు మాకిమ్ము మరి జయ మిమ్ము
మానుగా యశమిమ్ము మహిమతో షష్ఠి

జ్ఞానమ్ము నాకిమ్ము సంపదలిమ్ము
ధ్యానంబు జేతునే దయ జూడు షష్ఠి
గానమోదిని నాకు గల్యాణ మిమ్ము
మానుగా నన్ను నేమరకమ్మ షష్ఠి

క. ధాత్రిని మనుజుడు షష్ఠీ
స్తోత్రంబును జదివెనేని శుభగుణయుతుడౌ
పుత్రుండు గలుగు వత్సర
మాత్రం బొనరింపవలయు మానక వ్రతమున్

షష్ఠీదేవి యొక్క స్తోత్రమును ఒక సంవత్సరము భక్తితో శ్రవణము చేసినచో సకల పాపములు నశించునని ముక్తులగుదురనుటలో సందేహము లేదు.

14. భగవతి మంగళ చండి ఉపాఖ్యానము

నారాయణుడు బ్రహ్మపుత్రా! మంగళచండి ఉపాఖ్యానమును పూజా విధానము ధర్మదేవుని నోటి నుండి వింటిని. మంగళయనగా శుభప్రదం చండియనగా ప్రతాపవంతురాలు. మనువంశము నందు మంగళుడను రాజు దేవిని మిగుల భక్తిశ్రద్ధలతో ఆరాధించెడివాడు. దుర్గ అని పిలువబడు మూల ప్రకృతి రూపాంతర భేదమే యీ మంగళ చండిక.

మొట్టమొదట యీ దేవిని శంకరుడు ఆరాధించెను. ఈ ప్రసంగము త్రిపుర సంహారకాలమునాటిది. శంకరుడు మిగుల సంకట స్థితియందుండెను. దైత్యుడు రోషముతో ఆ స్వామి విమానమును ఆకాశము నుండి క్రిందపడవేసెను. బ్రహ్మ విష్ణువులతనిని సంహరించుటకు ప్రేరేపించిరి. వారి ఉపదేశములను స్వీకరించి శంకరుడు భగవతి దుర్గను స్తుతించెను. ఆ దేవి శంకరుని ఎదుట ప్రత్యక్షమయ్యెను.

ప్రభూ! శ్రీహరియే వృషభరూపమును దాల్చి మీ ఎదుట ఉపస్థితుడగును. వృషధ్వజా! నేను శక్తి స్వరూపనై నీకు సహకరించెదను. నేనును శ్రీ హరియు మీకు యుద్ధరంగమున సహాయమొనర్చెదము. మీరు ఆ దానవుని సంహరింపుడు.

శక్తి స్వరూపిణియగు ఆ దేవితో శంకరుడు కూడియుండెను. శ్రీహరి ఆయనకొక అస్త్రమొసగెను. దానివలన త్రిపుర సంహారము నందు ఆ స్వామి సఫలుడయ్యెను. దైత్యులు చంపబడగ సకల దేవతలు శంకరుని స్తుతించిరి.

శంకరుని మీద పుష్పవర్షము కురియసాగెను. బ్రహ్మ, విష్ణులు పరమ సంతుష్టులైరి. శంకర భగవానుడు స్నానమొనరించి మంగళచండిని ఆరాధించసాగెను. పాద్యము, అర్ఘ్యము, ఆచమనము, వివిధ వస్త్రములు, పుష్పములు, చందనము, నైవేద్యములు, బలి, వస్త్రము, అలంకారము, పుష్పమాల, బాణము, పిష్టకము, మధువు, అమృతఫలముల ద్వారా ఆ దేవిని పూజించెను.

నృత్య, గాన, వాద్య, నామ, కీర్తనలను కూడ చేయించెను. ఇది మధ్యందిన శాఖయందు చెప్పినట్లుగ చండిని భక్తితో ధ్యానించెను. మూల మంత్రము ఇట్లున్నది.

"ఓం హ్రీం శ్రీం క్లీం సర్వపూజ్యే దేవి మంగళచండికే హుం హుం ఫట్ స్వాహా" ఇరువది ఒక్క అక్షరములు గల ఈ మంత్రముతో సుపూజితయై ఆ దేవి సమస్త కోరికలను తీర్చును.

మంగళచండిక ఎప్పుడూ పదహారు సంవత్సరముల వయస్సుతోనే కనిపించును. మహాదేవుడు మంగళ చండికా నీవు సకల విపత్తులను ధ్వంసమొనరించుదానవు. మంగళదక్షవు, మంగళాదేవివి. మంగళయోగ్యవు. సర్వమంగళ మంగళవని పిలువబడుదురు. నీవు అందరికిని మోక్షరూప శుభమును ప్రసాదించెదవు.

ఇట్లు స్తుతించి శంకరుడు దేవి మంగళచండికను ఉపాసించెను. మంగళవారము నాడు ఆ దేవిని పూజించెను. మొదటి ఉపాసకుడు శంకరుడు. రెండవ ఉపాసకుడు మంగళగ్రహము, మూడవ ఉపాసకుడు రాజగు మంగళుడు. నాలుగవ వారు స్త్రీలు మంగళవారమునాడు ఈ దేవిని పూజించిరి.

దేవతలు, మునిగణములు, మనువు, మానవులు, సర్వత్ర ఈ పరమేశ్వరిని పూజింపసాగిరి. అమంగళములు దరిచేరనీక ప్రతిదినము మంగళములే జరుగుచుండును. ఇది ఆగమశాస్త్రములందు వర్ణితములు. ధర్ముని నోటినుండి నేను మనసా దేవి చరిత్రను వింటిని. దానిని తెలిపెదను వినుము.

కశ్యపుని మానస పుత్రిక 'మనసా' అను పేరుతో ఖ్యాతి వహించెను. ఆత్మలో రమించు ఈ సిద్ధయోగిని వైష్ణవీదేవి మూడు యుగములు శ్రీకృష్ణుని గురించి తపమాచరించెను. ఆమె శరీరము జీర్ణమైయున్నది చూచి ఈమెకు జరత్కారువు అని పేరిడెను.

స్వయముగ కూడ ఆ దేవిని ఈ స్వామి పూజించెను. స్వర్గము నందు పూజింపబడి ఈమె బ్రహ్మలోకమున కేగెను. భూమండలమునకు, పాతాళమునకు చేరుకొనెను. గౌరి నామముతో జగత్తునందు నిరంతరము పూజలందుకొనసాగెను.

'జగత్ గౌరి' నామముతో ప్రసిద్ధురాలయి 'శైలి' అని పిలువబడెను. విష్ణువు యొక్క అనన్య ఉపాసిక. ప్రజలు వైష్ణవి అని పిలిచెదరు. జనమేజయుని యజ్ఞమునందు ప్రాణములు రక్షింపబడెను.

'నాగేశ్వరి', 'నాగభగిని' అను పేర్లు వచ్చెను, విషమును హరించుట వలన 'విషహరి' అను నామము కలిగెను. శంకరుని చేత ఈమెకు యోగసిద్ధి కలిగెను. 'సిద్ధయోగిని' అని పిలువబడెను. విద్వాంసులు ఈమెను

'మృతసంజీవని', 'మహాజ్ఞానయుత' అని చెప్పుదురు. ఆస్తీకుని తల్లి 'ఆస్తీకుని మాత' యను పేరుతో ఖ్యాతి వహించెను.

అతని వద్ద ఈ దేవి 'జరత్కారుప్రియ' అని పిలువబడెను. శైవి, నాగేశ్వరి, జరత్కారుప్రియ, ఆస్తీకుని మాత, విషహరి, మహాజ్ఞానయుక్త – ఈ పండ్రెండు పేర్లతో విశ్వమునందు ఈ దేవిని పూజించెదరు. ఈ పండ్రెండు నామములు పఠించినవానికి వాని వంశము నందలివారికి కూడా సర్వ భయముండదు.

శ్లో॥ జరత్కారు ర్జగద్గౌరీ! మానసా సిద్ధయోగినీ
వైష్ణవీ నాగభగినీ శైలీ నాగేశ్వరీ తథా
జరత్కారుప్రియాఽస్తీకమాతా విషహరేతి చ
మహాజ్ఞానయుతా చైవ సా దేవీ విశ్వపూజితా॥
ద్వాదశైతాని నామాని పూజాకాలే తు యః పఠేత్
తస్య నాగభయం నాస్తి తస్యవంశోద్భవస్య చ ॥
(9 స్కం, 47 అ, 51-53 శ్లో)

ఈ స్తోత్రమును సిద్ధింపచేసి కొనినవాడు విషమును భుజించినను నాగభూషణుడగును. సర్పము మీద స్వారీ చేయ సమర్థుడగును. నాగాసనుడు, నాగతల్పుడు, మహాసిద్ధుడు కాగలడు.

మానసాదేవి పూజా విధానమును సామవేదమున చెప్పిన ధ్యాన పద్ధతిని తెలిపెదను వినుము. "భగవతి మానసా" శ్వేతచంపక పుష్పవర్ణము గలది. అట్టి సిద్ధిని ప్రసాదించు సిద్ధ స్వరూపిణి భగవతి మానసా దేవిని నేను ఉపాసించెదను.

"ఓం హ్రీం శ్రీం క్లీం ఐం మనసా దేవ్యై స్వాహా" అని అయిదు లక్షల మంత్రములను జపించినచో ఈ మంత్రము సిద్ధించును. విషము కూడా అమృత తుల్యమగును. ఇది ధన్వంతరితో పోల్చవచ్చును.

బ్రాహ్మణోత్తమా! సంక్రాంతి శుభసమయమున స్నానము చేసి భక్తితో భగవతి మనసాదేవిని ఆవాహనము చేసి పూజించవలెను. పంచమి తిథి నాడు మనస్సులో ధ్యానించి ఆ దేవికి బలిని సమర్పించవలెను. అట్టివాడు పుత్రవంతుడు, కీర్తిని పొందును.

మునుపు మానవులందరు సర్పభీతితో వణకిపోవుచుండిరి. కశ్యపుని శరణుజొచ్చిరి. బ్రహ్మ వేద బీజాను గుణముగ మంత్రములు రచింపబడెను. ఆ దేవిని ఆ మంత్రమునకు అధిష్ఠాత్రిని చేసెను. కుమారిగానున్నప్పుడే శంకరుని ధామమునకు వెళ్ళిపోయెను. చంద్రశేఖరుని స్తుతించెను.

వెయ్యి దేవ వర్షములు శంకరుని ఉపాసించెను. ఆ స్వామి ప్రసన్నుడై ఈమెకు జ్ఞానమును ప్రసాదించెను. సామవేదమును ప్రబోధించెను శ్రీకృష్ణుని కల్పవృక్ష స్వరూపగు అష్టాక్షరి మంత్రమునుపదేశించెను.

మంత్రరూపమిట్లున్నది. లక్ష్మీబీజము, మాయాబీజము, కామ బీజము ముందు ప్రయోగించవలెను. "ఓం హ్రీం శ్రీం క్లీం కృష్ణాయై స్వాహా" అనునది కృష్ణ మహామంత్రము. శంకరుడు మనసాకు త్రైలోక్య మంగళమును కవచమును పురశ్చరణ విధానమును తెలిపెను. ఆ సాధ్విస్వామితో అనుమతిని పొంది పుష్కర క్షేత్రమునకు తపమొనరించుటకు వెళ్ళిపోయెను.

శ్రీకృష్ణుని మూడు యుగముల వరకు ఉపాసించెను. శ్రీ కృష్ణుడు ఆ బాలమీద కృపా దృష్టిని బరపెను. స్వయముగ తానును పూజించెను. దేవీ! నీవు జగత్తునందు పూజలను పొందుము అని వరమొసగెను.

మొట్టమొదట శ్రీ కృష్ణుడు, శంకరుడు, కశ్యపుడు, దేవతలు, మునిగణములు, మనువు, నాగులు, ఆ తరువాత మానవులు ఈ దేవిని పూజించిరి. కశ్యపుడు జరత్కారు మునీంద్రునకు ఆమెనిచ్చి వివాహమొనర్చెను. ఆ మునీంద్రుడు ఒకనాడు ఆయన పుష్కర క్షేత్రము

నందు వటవృక్షము క్రింద మనసాదేవి తొడలమీద పడుకొనెను. సాయంకాలమయ్యెను. సూర్యనారాయణుడు క్రుంక సాగెను.

ద్విజుడు ప్రతినిత్యము సాయంకాలము సంధ్య చేసుకొను విధానము కలదు. ప్రాతఃకాలము, సంధ్యాకాలము సరియైన సమయమునకు సంధ్య చేసికొనవలెనని నియమము కలదు. అట్లు చేయనివాడు అపవిత్రుడై పాపియగును.

ఇట్లు యోచించి ఆ పరమ సాధ్వి మనసాదేవి పతిదేవుని నిద్రలేపెను. మునీంద్రా! మునివరుడగు జరత్కారు నిద్రాభంగమయ్యెనని కోపభరితుడయ్యెను.

మునీంద్రుడు సాధ్వీ! నీవు నా నిదురనెందుకు భగ్నపరచితివి? తన స్వామికి అపకారమొనరించు స్త్రీ యొక్క వ్రతము, తపస్సు, ఉపవాసము, దానము, సత్కర్మలు వ్యర్థమగును. భర్తకు అప్రియమొనరించు స్త్రీ ఏ విధమైన సత్కర్మల ఫలమును పొందలేదు.

సకల దానములు, యజ్ఞములు, తీర్థ సేవనము, వ్రతములు, తపములు, ఉపవాసము, ధర్మము, సత్యము, దేవపూజనము, భర్త సేవ యొక్క పదహారవ కళకు కూడా సరితూగగలవు. భర్తకు సేవచేయు స్త్రీ స్వామితో కూడి వైకుంఠమునకు వెళ్ళును.

మహానుభావా! మీకు సంధ్యాలోపము కాకూడదను భయముతో నేను మిమ్ములను మేల్కొలిపితిని. ఇది తప్పక నా దోషమే అగును. ఇట్లు పలికి దేవి మనసా భక్తితో తన భర్తయగు జరత్కారు మునిచరణముల మీద పడెను.

సూర్య భగవానుడు సంధ్యాదేవిని వెంటనిడుకొని అచటికి వచ్చెను. ధర్మ లోపము కాగలదను. భయముతో ఈ సాధ్వి మిమ్ములను మేల్కొల్పెను. మునీంద్రా! బ్రహ్మ జ్యోతియగు బ్రాహ్మణుని ద్వారా నిరంతరము సనాతన

భగవానుడగు శ్రీకృష్ణుని ఆరాధన జరుగుచుండును. అనగా సూర్యుని వచనములను విని జరత్కారు ప్రసన్నుడయ్యెను.

జరత్కారు చేసిన ప్రతిజ్ఞ మనసాదేవిని పరిత్యజించెను. ఆ ఆపద సమయమున ఆ దేవి శంకరుని, బ్రహ్మను, శ్రీహరిని, జన్మదాతయగు కశ్యపుని స్మరించెను. శ్రీకృష్ణుడు, శంకరుడు, బ్రహ్మ, కశ్యప మునీంద్రుడు అచటకు వచ్చిరి.

కశ్యపుడు దేవతలారా! మీరందరూ ఇచటకే కారణమున ఏతెంచితిరి? అని అడిగెను. మునీంద్రా! నీ ధర్మపత్ని మనసా పరమసాధ్వి. ఈమెను నీవు పరిత్యజించ తలచినచో యీమెను పుత్రవతిని చేయుము. పురుషుడు పుత్రోత్పత్తిని ప్రసాదించకుండా భార్యను విడిచిపెట్టినచో రంధ్రము నుండి బయటకు వెళ్ళు నీటివలె అతని పుణ్యము అతనిని వదలిపెట్టును.

బ్రహ్మ వచనములను విని జరత్కారు మంత్రమును పఠించి యోగబలముతో మనసాదేవి నాభిని స్పృశించెను. మనసా! యీ గర్భము నుండి నీకు పుత్రుడు ఉదయించును. బ్రహ్మజ్ఞాని, తేజస్వి, తపస్వి, యశస్వి, వేదవేత్తలలో, జ్ఞానులలో యోగులలో ప్రముఖుడు, విష్ణుభక్తుడు. జ్ఞానోపదేశము ద్వారా ముక్తిని కలిగించు స్త్రీనే గర్భధారిణియందురు. యమరాజు భయమునుండి ప్రాణికి ముక్తి కలిగించునదే భగిని (సోదరి) విష్ణుమంత్రమును ప్రసాదించునదే గురువు. శ్రీకృష్ణుని చింతన చేయు యోగ్యతను సమకూర్చినవాడే జ్ఞానదాతయగు గురువని పిలువబడును.

శ్రీహరి ఉపాసన తప్ప మిగిలిన దంతయునూ విడంబనమే. ప్రియురాలా! నేను నిన్ను పరిత్యజించితిని. నేను తపమొనరించుటకు పుష్కరక్షేత్రమునకు వెళ్ళుచున్నాను. ఆమె కనులలో నీరు నిండి పతిదేవునితో పలికెను. నేను మిమ్మెప్పుడు స్మరించినను వెంటనే నాకు మీ దర్శన సౌభాగ్యమును కలుగచేయుము. ఇది నా ప్రార్థన.

పతివ్రతా స్త్రీల మనస్సు సదా తన స్వామిసేవయందే లగ్నమై యుండును అని పలికి మనసా దేవి భర్త పాదముల మీద వ్రాలెను.

జరత్కారువు ఆమెను తన ఒడిలోనికి తీసికొనెను. సాధ్వి మనసా దేవి అలజడికి లోనయ్యెను. ఆ భార్యాభర్తలు ఇరువురూ జ్ఞానులగుటచే శోకముక్తులైరి.

మనసాకు నచ్చ చెప్పగా తపమొనరించుటకు వెళ్ళిపోయెను. మనసా కైలాస పర్వతమును చేరి శంకరుని మందిరమునకు వెళ్ళిపోయెను. పార్వతి, శంకరులు ఆమెకు ఉత్తమ జ్ఞానము ప్రాప్తించిరి. ఆ దినము మంగళవారము.

ఆ సాధ్వి ఆ క్షణమున పుత్రునికనెను. బాలునకు గర్భములోనుండగనే శంకరుని నోటినుండి జ్ఞానము ఉపలబ్ధమయ్యెను. శంకరుడు అతనికి జాతకర్మ నామ కర్మాది మాంగళిక సంస్కారములొనరించెను. ఆ శిశువు మేలును కోరి వేదమును చదివించెను.

శివుడు స్వయముగ ఆ బాలునకు నాలుగు వేదములు వేదాంగములను నిరంతరము బోధించుచుండెను. మృత్యుంజయుడు శ్రేష్ఠమగు జ్ఞానమును కూడా ఉపదేశించెను.

తండ్రి అస్తమించిన తరువాత పుత్రుడు జన్మించెను. గనుక అతని పేరు ఆస్తీకుడయ్యెను. జరత్కారు శంకరుని ఆదేశానుసారము విష్ణు భగవానుని గూర్చి తపమొనరించుటకు పుష్కర క్షేత్రమునకు వెళ్ళిపోయెను. మనసాదేవి ఆ బాలుని తీసుకొని తండ్రియైన కశ్యపముని ఆశ్రమమునకు వచ్చెను.

పరంతపా! దితి, అదితి, ఇంకను కశ్యపుని భార్యలందరి మనస్సులును మిగుల సంతోషించెను. అభిమన్యుని కుమారుడగు పరీక్షిన్మహారాజు బ్రాహ్మణుని వలన శాపగ్రస్తుడయ్యెను. తక్షకుడను సర్పము ఆ మహారాజును కాటు వేయమని బ్రాహ్మణుడు శపించెను.

ఏడవ దినమున తక్షకుడా రాజును కాటువేసెను. రాజు శరీరమును వీడి పరలోకమునకు వెళ్ళెను. జనమేజయుడు సర్పయాగమును ప్రారంభించెను. అగ్నిలో పడి ప్రాణములను కోల్పోవుచుండెను. ఇంద్రుని శరణుజొచ్చెను. ఇంద్రుడు, దేవతలు అంతా మనసాదేవి వద్దకు వెళ్ళిరి.

అందరు మనసాను స్తుతించగా ఆస్తీకుడు తల్లి ఆజ్ఞతో జనమేజయుని యజ్ఞమునకు వచ్చెను. జనమేజయునితో ఇంద్రుని తక్షకుని ప్రాణములు రక్షింపమని యాచించెను. యజ్ఞములందు పూర్ణాహుతి కావింపబడెను. రాజు ప్రసన్నుడయ్యెను.

యజ్ఞాంత దక్షిణలను పొందిరి. ఇంద్రునితో కలసి మనసాదేవిని స్తుతించి పూజించిరి.

ఇంద్రుడు ఏ స్తోత్రముతో మనసాదేవిని స్తుతించిరని నారదుడు కోరగా – నారాయణుడు – నారదా! – ఇంద్రుడు స్నానాదులు ముగించి మనసాదేవిని స్వర్ణంగా జలమును రత్న కలశముతో వేదమంత్రములు ఉచ్చరించుచూ ఆ జలముతో దేవికి స్నానము చేయించెను.

చిన్మయ వస్త్రములు, చందనములు, అర్ఘ్యపాద్యములను ఆ దేవికి నివేదించెను. ఇంద్రుడు, గణేశుడు, సూర్యుడు, అగ్నిని, విష్ణువును, శివుని, గౌరిని. ఈ ఆరుగురు దేవతలను పూజించి సాధ్వి మనసాదేవిని పూజించెను.

"ఓం హ్రీం శ్రీం మనసాదేవ్యై స్వాహా" ఈ దశాక్షర మూల మంత్రము నుచ్చరించి పూజించిదేవికి సమర్పించెను. ఇంద్రుడు మనసాదేవిని స్తుతించెను. దేవీ! నీ స్తోత్ర లక్షణములు వేదములలో వర్ణించబడినవి. లెక్కింపజాలను. శుద్ధస్వరూపవు.

నీలో కోపము, హింస ఏమాత్రమును లేవు. జరత్కారు పరిత్యజింపబడి అసమర్థుడయ్యెను. తల్లి అదితితో సమానముగా నాకు పరమపూజ్యురాలవు. నీ పూజలను గురించి నేను ప్రచారము చేసెదను.

ఆషాఢ మాస సంక్రాంతి సమయమున మనసా పేరుగల పంచమి అనగా నాగపంచమి మరియు మాసాంతమున ప్రతిదినము భక్తితో నిన్ను పూజింతురు. పుత్ర, పౌత్ర, ధనాభివృద్ధి, యశస్వి, కీర్తిమంతుడు, విద్వాంసుడు, గుణవంతుడగును.

జరత్కారు సాక్షాత్తు నారాయణుని అంశ. సకలదేవతలు భక్తితో నిరంతరము నిన్ను మనసాదేవిని పూజించెదరు. మునీంద్రా! యీ విధముగా ఇంద్రుడు మనసాదేవిని స్తుతించెను.

క. నిను గొనియాడ దరంబే
ఘనశక్తిని ప్రకృతి వఖిల కారణమౌ నీ
కనికరము వలన విభవము
గొని బ్రతికెదనమ్మ నిన్ను గొల్చెదనమ్మా!

క. నీ పూజయందు బ్రీతియు
నీ పాదాబ్జముల గొలుచు నీతియు భక్తి
వ్యాపారము గల రీతియు
జేపట్టితి తక్కువేమి చెప్పుము తల్లీ

తే.గీ. వినుము నీ పూజ నిత్యంబు విబుధ సేవ్య
మైన లోకత్రయంబున నఖిలజనులు
నీవ్రతం బాచరింపగ నే నొనర్తు
దద్విధానంబు దెలిపెద దల్లి వినుము

మనసాదేవి కశ్యపుని ఆశ్రమమున దీర్ఘకాలము వరకు నివసించెను. సురభి అనే గోవు గోలోకము నుండి వచ్చెను. మనసాదేవికి స్నానము చేయించెను. సన్మానించి పూజించెను. గోపనీయమగు జ్ఞానమును ఆ దేవికి ఉపదేశించెను. మనసా సురభి చేతను దేవతల చేతను సుపూజితయై స్వర్గలోకమును పొందెను.

మనసాదేవిని ఉపాసించిన పురుషునకు సర్పభయము ఉండదు. ఈ స్తోత్రము పది లక్షలు జపించినచో యీ స్తోత్రము సిద్ధించును. పురుషుడు శేషశాయియగును. సర్పవాహనుడు కాగలడు అని ఇంద్రుడు చెప్పెను.

15. ఆదిధేనువు సురభి కథ

నారాయణునితో నారదుడు సురభిదేవి ఎవరు? ఆమె గోలోకము నుండి ఎట్లు వచ్చెను? జన్మచరిత్ర తెలపమని కోరగా ఆమె గోవులకు అధిష్ఠాత్రిదేవి. బృందావనము నందు ఆ సురభి జన్మించెను.

శ్రీ కృష్ణుడు రాధతో కూడి గోపాంగనలతో బృందావనమునకు ఏతెంచెను. అలసిపోయి ఏకాంత స్థలమునకు వెళ్ళెను. ఆ ప్రభువు మనస్సులో పాలు త్రాగవలెనను కోరిక కలిగెను. వామభాగము నుండి లీలగా సురభి గోవును ప్రకటింపచేసెను. దూడ కూడా ఆ గోవు వెంట ఉండెను. ఆ దూడ పేరు మనోరథ.

శ్రీదాముడు క్రొత్త పాత్రలో దాని పాలను పిదికెను. జనన మరణములు దూరమొనర్చు రెండవ అమృతమే. శ్రీకృష్ణుడు ఆ పాలు త్రాగెను. అప్పుడు ఆ పాత్ర స్వామి చేతినుండి జారిపడెను, భూమిమీద పడగనే సరోవర రూపమున పరిణితి చెందెను.

ఆయా సరోవరములు క్షీరసాగరమను పేరుతో ప్రసిద్ధిచెందెను. గోపికలకు రాధకు క్రీడాసరోవరమయ్యెను. శ్రీకృష్ణుని ఇచ్ఛతో అనేకములగు ధేనువులు ప్రకటితమయ్యెను.

సురభి నుండి గోవులు సృష్టింపబడి జగత్తునందు వ్యాపించెనని తెలుపుదురు. శ్రీకృష్ణుడు సురభిని పూజించెను. దీపావళి యొక్క రెండవ దినమున శ్రీకృష్ణుని ఆదేశముతో దేవి సురభి పూజ సంపన్నమయ్యెను.

నేను మా తండ్రియగు ధర్ముని నోటి నుండి వింటిని. 'ఓం సురభ్యై నమః' అని ఒక లక్ష జపములు చేసినచో మంత్రము సిద్ధించును. యజుర్వేదమునందు చక్కగా వర్ణించబడినది.

భగవతి సురభిని కలశము నందు, ఆవు మస్తకమునందు గోవులను కట్టు స్తంభమునందు, సాలగ్రామ మూర్తియందు, జలము నందు, అగ్నియందు దేవి సురభిని భావన చేసి ద్విజుడు పూజింపవలెను. సురభిని పూజించువాడు ఈ జగత్తు నందు పూజ్యుడగును.

వరాహ కల్పము జరుగు సందర్భమున సురభి పాలిచ్చుటను ఆపివేసెను. బ్రహ్మ ఆజ్ఞతో దేవి సురభిని స్తుతించ ప్రారంభించెను. ఇంద్రుడు సురభికి పదేపదే నమస్కారములు చేసెను. రాధకు ప్రియురాలవైన నీకు ప్రణామములు, క్షీరమును, ధనమును, బుద్ధిని ప్రసాదించుటకు ఆ దేవి తత్పరురాలు.

పురందరుడు సురభిని యిలా స్తుతిస్తున్నాడు –

శ్లో।। నమో రాధాప్రియాయై చ, పద్మాంశాయై నమో నమః
నమః కృష్ణప్రియాయై చ, గవాం మాత్రే నమో నమః
కల్పవృక్షస్వరూపాయై, సర్వేషాం సతతం పరే
క్షీరదాయై ధనదాయై, బుద్ధిదాయై నమో నమః
శుభదాయై సుభద్రాయై, గోప్రదాయై నమో నమః
యశోదాయై కీర్తిదాయై, ధర్మదాయై నమో నమః
(9 స్కం, 49 అ, 24-27 శ్లో)

ఈ స్తుతిని వినుట తోడనే భగవతి సురభి సంతుష్టురాలయ్యెను. బ్రహ్మలోకముననే ప్రకటిత అయ్యెను. ఆ సనాతనీ దేవి గోలోకమునకు వెళ్ళిపోయెను.

విశ్వము పూర్తిగా పాలతో పరిపూర్ణమయ్యెను. పాలతో నెయ్యి, ఘృతముతో యజ్ఞములు సంపన్నము కాబడెను. ఈ స్తోత్రమును పఠించిన పురుషుడు గోధనమునే సంపన్నుడగును.

యశస్వి, పుత్రవంతుడగును. తీర్థములందు స్నానము చేసిన ఫలము, ఈ లోకము నందు అన్ని సుఖములననుభవించి శ్రీకృష్ణ ధామమునకు వెళ్ళిపోవును. మరల ఈ ప్రపంచము నందు జన్మించు అవసరముండదు, బ్రహ్మపుత్రుడై అచటనే నివసించును.

16. శ్రీరాధ, దుర్గా స్తోత్రములు

నారదుడు నారాయణునితో శ్రీరాధ, దుర్గమంత్రానుష్ఠాన ప్రయోగమును శ్రుతులయందు చెప్పబడిన దాని వినగోరుచున్నానని కోరగా – నారదా! వేదములలో వర్ణించబడిన ఈ రహస్యమును నీకు తెలిపెదను. మిగుల గుహ్యమైనది.

భువనేశ్వరి నుండి జగదుత్పత్తి సమయమున ఈ ఇరువురి శక్తులను ప్రకటితలైరి. రాధ శ్రీకృష్ణుని ప్రాణములకు అధిష్ఠాత్రీ దేవి అయ్యెను. దుర్గ ఆ స్వామి బుద్ధికి అధిష్ఠాత్రీదేవి. వీరిరువురు సకల జగత్తును నియంత్రించెదరు.

రాధామంత్రము బ్రహ్మ, విష్ణువు మొదలగు దేవతలు సదా ధ్యానించిరి. 'శ్రీరాధా' 'స్వాహా' శబ్దమును జోడించి హ్రీం తో కలిపిన 'హ్రీం శ్రీ రాధాయై స్వాహా' అని అగును.

శ్రీకృష్ణుడు భక్తితో ఈ మంత్రమును జపించెను. శ్రీకృష్ణుడు విష్ణువునకు విష్ణుదేవుడు విరాట్ బ్రహ్మకు, బ్రహ్మ ధర్మదేవునకు, ధర్ముడు నాకు దీనిని ఉపదేశించిరి. నేను ఈ మంత్రమును నిరంతరము జపించుచుందును.

సకలదేవతలు నిత్యము భగవతి రాధను ధ్యానించెదరు. రాధను పూజించని పురుషుడు భగవంతుడగు శ్రీకృష్ణుని పూజకు అనర్హుడని భావింపబడును. రాధ లేకుండా భగవంతుడగు శ్రీకృష్ణుడు ఒక్క క్షణము కూడా నిలువ జాలడు.

శ్రీరాధా మంత్రమునకు నేను నారాయణుడను ఋషిని – ఛందస్సు గాయత్రి. శ్రీరాధ ధ్యాన విధానమును సామవేదమున వర్ణించబడినది. శ్రీ రాధ యొక్క శరీర వర్ణము శ్వేత చంపకమువలె నుండును. ఈ దేవి శ్రీ విగ్రహము అసంఖ్యాకములగు చంద్రులతో సమానముగ వెలుగొందుచుండును.

ఈ దేవి సదా పండ్రెండు సంవత్సరముల వయస్సుతో అలరారుచుండును. తన కేశములందు మల్లిక, మాలతీ పుష్పమాలలను ధరించియుండును. పరమేశ్వరీదేవి శ్రీకృష్ణుని ప్రాణములకు అధిదేవత. వేదములు ఈ దేవి మహిమను వర్ణించినవి.

హృదయమునందు ధ్యానించి సాలగ్రామమూర్తిని అష్టదళయంత్రమును స్థాపించవలెను. ఆవాహనము, ఆసనాదులను, మూలమంత్రము, అర్ఘ్యము మస్తకమున ఇవ్వవలెను.

ముఖము దగ్గరగా జలమును తీసికొని వెళ్లి మూలమంత్రముతో మూడుసార్లు ఆచమనము చేయించవలెను. మధుపర్కము నివేదించి రాధకు పయస్వినియగు ఆవునివ్వవలెను. స్నానగృహమునకు తీసుకొని వచ్చి అచటనే పూజింపవలెను. తైలము మొదలగు సుగంధిత ద్రవ్యములను తీసుకొని వచ్చి స్నానము చేయించవలెను. రెండు వస్త్రములను సమర్పించవలెను.

రకరకములైన పుష్పమాలలను, తులసిని ఆ దేవికి నివేదించవలెను. పారిజాతము, కమలము మొదలైన పుష్పములను ఆ దేవికి సమర్పించవలెను.

పరమేశ్వరియగు రాధయొక్క పవిత్ర పరివారమును ఆరాధించవలెను. తూర్పున అగ్నికోణము, వాయవ్య దిశామధ్యమున శ్రీరాధ యొక్క దిశాసంబంధమైన అంగమును పూజింపవలెను. అష్టదళ యంత్రమును

ముందుంచుకొని అగ్ని కోణమందు మాధవి, దక్షిణ దిశయందు రత్నమాల, వాయవ్య కోణమునందు సుందరిప్రియకారిణిని పూజింపవలెను. ఈ దేవి సహస్ర నామములు పఠించి స్తుతించవలెను.

ఈ దేవి మంత్రమును నిత్యము వెయ్యిసార్లు జపించు విధానము కలదు. పాలు, మధువు, ఘృతము, రుచికర పదార్థములతో కూడిన తిలల ద్వారాభక్తితో హవనము చేయవలయును.

నారదుడు అడుగగా నారాయణుడు భగవతీ! పరమేశానీ! నీవు రాసమండలమున విరాజమానురాలవైయున్నావు. నీకు నమస్కారము. రాజేశ్వరీ! శ్రీకృష్ణుడు నిన్ను ప్రాణముల కంటె అధిక ప్రియమైన దానినిగ భావించును. నీకు నమస్కారము.

త్రైలోక్యజననివి. నీకు ప్రణామము, నన్నునుగ్రహింపుము. విష్ణువు మొదలగు సకల దేవతలు నీ చరణ కమలములను ఉపాసించెదరు. నీవు సరస్వతి, సావిత్రి, శంకరి, గంగ, పద్మావతి, షష్ఠి, మంగళచండిక రూపములలో విరాజిల్లుచున్నావు, నీకు వందనములు.

తులసీరూపా నీకు ప్రణామములు, లక్ష్మీస్వరూపిణీ నీకు నమస్కారము. మూల ప్రకృతి స్వరూపవు. కరుణా సాగరివి. నిన్ను ఉపాసించెదము.

త్రికాల సంధ్యలయందు రాధను స్మరించుచు ఈ స్తోత్రమును పఠించు పురుషునకు ఎప్పుడును ఏ వస్తువు కూడా ఏ మాత్రము దుర్లభము కాదు.

నారాయణుడు చెప్పిన స్తోత్రం -

నమ స్తే పరమేశాని! రాసమణ్డలవాసిని!
రాసేశ్వరి! నమ స్తేఽస్తు కృష్ణప్రాణాధికప్రియే ॥
నమ స్త్రైలోక్యజనని! ప్రసీద కరుణార్ణవే!

బ్రహ్మవిష్ణ్వాదిభి ర్దేవై ర్వంద్యమానపదాంబుజే ॥
నమ స్సరస్వతీరూపే! నమ స్సావిత్రి! శంకరి!
గంగాపద్మావతీరూపే! షష్ఠిమంగళచణ్డికే ॥
నమ స్తే తులసీరూపే నమో లక్ష్మ్యైస్వరూపిణి!
నమో దుర్గే! భగవతి! నమ స్తే సర్వరూపిణి ॥
మూలప్రకృతిరూపాం త్వాం, భజామః కరుణార్ణవామ్
సంసారసాగరా దస్మా నుద్ధ రాంబ! దయాం కురు॥
ఇదం స్తోత్రం త్రిసంధ్యం యః పఠేద్ రాధాం స్మర రాన్నరః
న తస్య దుర్లభం కించిత్ కదాచి చ్చ భవిష్యతి ॥
దేహాంతే చ వసే న్నిత్యం గోలోకే రాసమణ్డలే
ఇదం రహస్యం పరమం న చాఖ్యేయం తు కస్యచిత్॥

(9 స్క, 50అ, 46-52 శ్లో)

ప్రతి పురుషుడు ఆయువు పూర్తి అగుట తోడనే శరీరమును పరిత్యజించి గోలోకమునకు వెళ్ళి రాసమండలమున నిత్యము స్థానమును పొందును. ఈ స్తోత్రమును అనర్హులకు చెప్పరాదు సుమా! అనెను.

సర్వే జనా స్సుఖినో భవంతు - ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

* * *

దేవీ భాగవతము

దేవీనవరాత్రులు - ఎనిమిదవరోజు కథ

1. శ్రీ దుర్గామంత్రములు - పూజలు - స్తోత్రములు

నారదా! భగవతి దుర్గ పూజ - శ్రవణము చేసినవారికి అన్ని ఆపదలు తొలగిపోవును. ఈమె అందరికి జనని, శైలీ, శక్తి, అత్యంత అద్భుతమైనది. దుర్గ అందరియొక్క బుద్ధికి అధిదేవి. అంతరంగము నందు నివసించి సంకటములనుండి దరిచేర్చును.

శైవులు, వైష్ణవులు నిరంతరము ఉపాసించెదరు. శ్రీదుర్గాదేవి సత్ప్రయత్నము చేత జగత్ సృష్టి, స్థితి, సంహారములు జరుగుచుండును. నవాక్షర మంత్రమును చెప్పెదను.

సరస్వతీ బీజము (ఐం), భువనేశ్వరీ బీజము (హ్రీం), కామబీజము (క్లీం) 'చాముండాయై' ఈ పదము నుంచి 'విచ్చే' ఈ రెండక్షరములను జోడించవలెను.

(ఓం ఐం హ్రీం క్లీం చాముండాయై విచ్చే) ఇదే మనువు చెప్పిన నవాక్షరమంత్రము. ఈ నవాక్షర మంత్రమునకు ఋషులు - బ్రహ్మ, విష్ణు, రుద్రులు. ఛందస్సు - గాయత్రి, ఉష్ణిక్, త్రిష్టుప్ అనునవి. మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి - దేవతలు, రక్తదంతిక, దుర్గ, భ్రామరీ - బీజములు, నంద, శాకంభరి, భీమ - శక్తులుగ చెప్పబడిరి.

ధర్మ, అర్థ, కామ, మోక్షములు పొందుటకు ఐం హ్రీం క్లీం - ఈ మూడున్ను బీజమంత్రములు. ఇందు 'చాముండాయై' (నాలుగు అక్షరములు) 'విచ్చే' (రెండక్షరములు) మంత్రము యొక్క అంగములు.

ప్రతి ఒక్కదానితో నమః స్వాహా, వషట్, హుం, వౌషట్, ఫట్, ఈ ఆరింటి జాతి సంజ్ఞక వర్ణములను జోడించి శిఖ రెండు నేత్రములందు,

చెవులు రెండింటి యందు నాసిక, ముఖము, గుదము మొదలగు స్థానములందు ఈ మంత్రవర్ణములను న్యాసము చేయవలెను. ధ్యానమిట్లు చేయవలెను.

మహాకాళి ధ్యానము : త్రినేత్రములతో శోభిల్లు భగవతి మహాకాళిని నేను ఉపాసించెదను. చేతులలో ఖడ్గమును, చక్రమును, గదను, బాణమును, ధనస్సును, పరిఘను, శూలమును, భుషుండిని, మస్తకమును, శంఖమును ధరించును. పదిముఖములతో పదికాళ్ళతో, దివ్యాభరణములతో శోభించుచుండును.

బ్రహ్మ మధుకైటభులను సంహరించుటకై ఈ మహాకాళిని ఉపాసించెను అని కామబీజస్వరూపిణి భగవతి మహాకాళిని ధ్యానించవలెను.

మహాలక్ష్మీ ధ్యానము : అక్షమాల, పరశు, గద, బాణము, వజ్రము, పద్మము, ధనువు, కుండి, దండము, దండి, శక్తి, ఖడ్గము, చర్మము, ఘంటిక, మధుపాత్ర, త్రిశూలము, పాశము, సుదర్శన చక్రమును ధరించును.

ఎఱ్ఱకమలము మీద విరాజమానయైయుండును. ఆ మహిషాసుర మర్దనిని, భగవతి మహాలక్ష్మిని నేను భజించెదను.

మహాసరస్వతీధ్యానము : ఈ దేవి కరము నందు ఘంటిక, శూలము, నాగలి, శంఖము, ముసలము, చక్రము, ధనుస్సు, బాణములను ధరించి యుండును. శుంభుడు మొదలగు దైత్యులను ఈమె సంహరించినది. వాణీ బీజము ఈమె స్వరూపము. అట్టి భగవతి మహాసరస్వతిని నేను ధ్యానించెదను.

ప్రాజ్ఞుడా! యంత్రమును గూర్చి తెలిపెదను వినుము. ఆరు కోణములతో కూడి త్రికోణ యంత్రముండవలెను. నాలుగువైపుల అష్టదళ కమలము శోభిల్లవలెను. కమలమునకు ఇరువది నాలుగు దళములుండవలెను.

సాలగ్రామము, కలశము, యంత్రము, ప్రతిమ, వీనిలో దేనియందైనను నిశ్చలబుద్ధితో దేవిని భావించి పూజించవలెను.

యంత్ర పూర్వకోణము నందు సరస్వతీ సహితుడైన బ్రహ్మను నైరుతి కోణమునందు లక్ష్మితో కూడిన శ్రీహరిని, వాయవ్యకోణము నందు పార్వతితో విరాజిల్లు శంభుని పూజించవలెను. దేవికి ఉత్తర భాగమున సింహమును, దక్షిణమున మహిషాసురుని పూజింపవలెను.

ఆరు కోణములందు క్రమముగ నందజ, రక్తదంత, శాకంభరి, శివా, దుర్గ, భీమా, భ్రామరిని పూజింపవలెను.

అష్టదళములందు బ్రాహ్మీ, మహేశ్వరీ, కౌమారీ, వైష్ణవీ, వారాహీ, నారసింహీ, ఐంద్రీ, చాముండికలను ఆరాధించవలెను.

ఇరువది నాలుగు దళములందు మొదటి క్రమముతోనే విష్ణుమాయ, చేతన, బుద్ధి, నిద్ర, ఆకలి, ఛాయ, పరాశక్తి, తృష్ణ, శాంతి, జాతి, లజ్జ, క్షాంతి, శ్రద్ధ, కీర్తి, లక్ష్మి, ధ్రుతి, వృత్తి, శ్రుతి, స్మృతి, దయ, తుష్టి, పుష్టి, భ్రాంతి, ఈ దేవతలను పూజించవలెను.

భూగృహ కోణము నందలి గణేశుని క్షేత్రపాలుని, వటుకుని, యోగినిని కూడా పురుషులు పూజించెదరు. వజ్రము మొదలగు ఆయుధములతో ఇంద్రాది దేవతలను పూజించెదరు.

భగవతి శ్రీదుర్గను ప్రసన్నమొనరించుటకు రాజోపచారములను ఆ దేవికి సమర్పించవలెను. సప్తశతీ స్తోత్రమును పఠించవలెను. ఈ స్తోత్రముతో భగవతి శ్రీదుర్గను ప్రసన్నురాలిని చేసికొనుట యందు లగ్నమైయుండవలెను. ధర్మ, అర్థ, కామ మోక్షములకు నిలయుడగును.

విప్రేంద్రా! సకల దేవతలు, భగవంతుడగు శ్రీహరి, బ్రహ్మ, ప్రముఖ మునిగణములు, మునులు, యోగులు, లక్ష్మి మొ॥ దేవీమణులు భగవతి శ్రీదుర్గను దేవిని ధ్యానించెదరు.

శ్రీ దుర్గాచరణములను ధ్యానించియే మనుపదమును పొందిరి. దేవీస్వరూపములు, అంశములు వర్ణింపబడినవి. నిత్యము శ్రవణము చేసిన వారికి నాలుగు పురుషార్థములు లభించును.

నవరాత్రులందు మనస్సును సావధానపరచుకొని భగవతి దుర్గ ఎదుట ఈ స్తోత్రమును పఠింపవలెను. ప్రతి దినము ఈ సప్తశతీ స్తోత్రమునందు ఒక అధ్యాయమును పఠించినను భగవతి అనుకూలవతియగును.

శాస్త్రోక్తముగా పూజించి స్వర్ణకలశమును సమర్పించవలెను. ఆ దేవి ప్రసన్నతకు, అప్రసన్నతకు ఉదాసీనతకు కర్మయొక్క శుభాశుభ ఫలములను నిశ్చయించుకొనవచ్చును.

సీ. ఖడ్గ చక్ర గ దాశుగ శరాస పరిఘ శూల భుశుండికా శిరోలలిత శంఖ
హస్త త్రినేత్ర మహాకాళి వివిధభూషణయుతయు నసితాంజన సమేత
తత సమప్రఖ్యయు దశపాద దశముఖి కామబీజమహాప్రకాశమూర్తి
మధుకైటభాసురమర్దని కాలసంతోషితపరమేష్ఠి దురితరహిత

తే.గీ. నక్షమాలా పరశు గదాబ్జశని
శరకుండికా శక్తి చ ర్మోరుదండ ఘంటి
కా సురాపాత్ర చక్రాసి పాశ
శూలధారిణిని రక్తవర్ణను దలతు మదిని

సీ. అరుణాబ్జపీఠ మాయాబీజరూపిణి మహిషరక్షోహంత్రి మహిత లక్ష్మి
హల శంఖ చక్ర ముసల శూల చాప శరాది ధారిణి కుందహసితలసిత
శుంభవిదారిణి సుఖశాలినిని వాణి నవరూప సచ్చిదానందమూర్తి
సంయమిధ్యానగోచర నిత్య నిరుపమ పరిశుద్ధ నిఖిలైకపాలిని సతి

తే.గీ. పరమ కల్యాణి ఆగమ పంజ రస్థ
శుకుని నాద్యంత శూన్య మాన్య

విష్టపత్రయధన్య సద్విద్వరేణ్య ధన్య
ముక్తి వదాన్య ముక్తజనగణ్య
పుణ్యభక్తశరణ్య నే బూని గొల్తు

సీ. నందజ రక్తజ సుందరియైన శాకంభరి మఱియు దుర్గయును భీమ
యారు కోణంబుల నర్చింపబడుదురు బ్రాహ్మి మహేశి కౌమారి యవల
వైష్ణవీదేవియు వారాహియును నారసింహియు నైంద్రియు జేర నంత
చాముండయు మఱి యష్టదళపద్మంబున బూజింపబడుదురు భూతి దనర

తే.గీ. ఇరువదియు నాల్గుదళముల గృష్ణమాయ
ధీయు నిద్రయు ఛాయయు దృష్ట క్షుధయు
జాతి లజ్జయు శాంతియు శ్రద్ధ కీర్తి
లక్ష్మి ధృతి వృత్తి శ్రుతి స్మృతి లలిత దయయు
దుష్టి పుష్టియు మాతయు దొడరి భాతి
పూజ గావింపబడుదురు పుణ్యమహిమ

క. భూపురములను గణేశుని
నేపారగ క్షేత్రపాలు నెసగగ వటుకున్
బ్రాపగు యోగిని బూజా
వ్యాపారము నందు గొలువవలె జుమ్ము మునీ

క. నవరాత్రంబుల రాధా
స్తవమును గావించెనేని తప్పక నరు డా
భువనేశ్వరి దయచే వై
భవపరిపూర్ణుడయి సకలభాగ్యములందున్ (మ.క.దా.శ్రీ)

2. స్వాయంభువ మనువు జననము

నారదుడు నారాయణా! మహేశ్వరి ఎట్లు ప్రాదుర్భవించెను? ఈ చరిత్రను నేను వినగోరుచున్నాను. అనగా నారాయణుడు చక్రపాణి,

దేవాధిదేవుడు శ్రీహరి నాభికమలము నుండి బ్రహ్మ ప్రకటితుడయ్యెను. అతడు స్వాయంభువ మనువును మానస పుత్రునిగ ప్రకటితము చేసెను. శతరూపను ఆవిర్భవింపజేసెను. ఆమెను మనువుకు పత్నిగ చేసెను.

స్వాయంభువమనువు దేవియొక్క మృణ్మయమూర్తిని రూపొందించి ఆమెను పూజించెను. ఆమె యొక్క వాగ్భవమంత్రమును జపించనారంభించెను. వ్రతములను, నియమములను పాటించుచుండెను. ఒంటి కాలిమీద నిలుచుని తపమొనరించుచుండెను.

తపస్సునకు జగన్మయి భగవతి జగదంబ ప్రసన్నురాలై ప్రత్యక్ష మయ్యెను. స్వాయంభువమనువు దేవతల కొరకు శ్రేష్ఠమైన వరమును యాచించెను. జగత్తును భరించుదానవు. నీ కనుబొమలు సంకేత మాత్రమున బ్రహ్మదేవుడు సృష్టిని, విష్ణువు పరిపాలనను, రుద్రుడు సంహారకార్యమును నిర్వహించెదరు.

ఇంద్రుడు మూడు లోకములను శాసించును. యమరాజు ప్రాణులను శిక్షించును. వరుణుడు మావంటి వారిని పాలించుటకు ఆసక్తుడైయుండును. కుబేరుడు సంపదలకు అధిపతి అయ్యెను. అగ్ని, నిర్ఋతి, వాయువు, ఈశానుడు, శేషనాగుడు నీ అంశయే. అందరిలోను నీ శక్తియే వ్యాపించి యున్నది.

దేవీ! నీవు నాకు వరము నివ్వదలచినచో ఇట్లు చేయుము. శివే! సృష్టి కార్యమునందు ఏ విధమైన విఘ్నమును కలుగకూడదు. దేవీ! నీ వాగ్భవ మంత్రమును ఉపాసించు మానవుని అన్ని కార్యములందు సిద్ధి కలుగవలయును.

దేవీ! నీ ఈ సంవాదమును చదివిన, వినిన పురుషునకు భుక్తి, ముక్తి సులభము కావలయును. దేవీ! నీ ఉపాసనకు పూర్వజన్మ స్మృతియుండ వలయును. భాషించుటయందు అతడు గొవ్వ నేర్పరియైయుండవలెను.

అతనికి కర్మసిద్ధి, జ్ఞానసిద్ధి ప్రాప్తించవలెను. పుత్రపౌత్ర సమృద్ధి కలుగవలెను. నీ ఉపాసకుడు సదా సంపన్నుడైయుండవలెను అని స్వాయంభువ మనువు కోరెను.

3. వింధ్యాచల వృత్తాంతము

శ్రీదేవి – భూపాలా! నీ ప్రార్థనకు అనుగుణముగా అన్నియు జరుగును. దైత్యులను సంహరించుట నా స్వాభావిక గుణము. నీవు తపమొనరించితివి. నేను పరమ సంతుష్టురాలనైతినని చెప్పి భగవతి స్వాయంభువమనువుకు వరమొసగి భగవతి వింధ్యాచలమునకు వెళ్ళిపోయెను.

ఆ వింధ్యాచలము సూర్యుని మార్గమునకు అడ్డు తగిలి తను గొప్ప అని విర్రవీగుటమాని బుద్ధిగా అగస్త్యుని శరణువేడిన కథను వినుము – అనగా ఋషులు సూత మహర్షీ! వింధ్యాచలమెవరు? ఎందుకు ఆకాశము వరకు పెరిగినది? అగస్త్యుని వల్ల గర్వమణచుకొన్నది ఆ కథ తెలపమని కోరగా సూతుడు చెప్పటానికి పూనుకొనెను.

సమస్త పర్వతములలో శ్రేష్ఠమైనది, వింధ్యాచలము అందు పెద్ద పెద్ద వనములుండెను. వృక్షములతో, లతలతో, మృగములు, వరాహములు, మహిషములు, వ్యాఘ్రములు, శార్దూలములు, వానరములు, కుందేళ్ళు, భల్లూకములు, నక్కలు తిరుగాడుచుండెను.

నదీనదములు నిండి పారుచుండెను. ఫలములిచ్చు వృక్షములతో వింధ్యగిరి సుశోభితము చేయుచుండెను, నారదుడు భూమండలమున విహరించుచుండెను. నారదుని చూచి వింధ్యాచలము వెంటనే లేచెను.

పర్వతరాజు అతనితో దేవర్షీ! మీరు ఎచట నుండి వచ్చినారు అని అడుగగా పర్వతరాజా! నేను సుమేరుగిరి నుండి వచ్చుచున్నాను. హిమాలయముగాని, సుమేరు పర్వతము గాని గొప్ప మహిమలు

కలిగినవని చెప్పగా వింధ్యాచలమునకు మనస్సులో ఈర్ష్య ఉత్పన్నమయ్యెను.

సుమేరు పర్వతమును ఈ సూర్యుడు ప్రదక్షిణ చేయుచున్నాడు. నేను నా ఉన్నతమైన శృంగములతో ఈ సూర్యుని మార్గమును ఆపివేసెదను అని తన శిఖరములను ఆకాశము వరకు వ్యాపింపచేసెను.

అప్పుడు సూర్యుడు ముందుకు సాగలేక పోయెను ఈ వింధ్యాచలము సుమేరు పర్వతము ఎడల స్పర్ధ వహించి వింధ్యాచలము తన మార్గమును అవరోధించెనని సూర్యునికి తెలిసివచ్చెను.

సూర్యుడు ఆగిపోగా జగత్తు స్వాహా, స్వధాకారములతో వంచిత అయ్యెను. పూర్వోత్తర దిశల యందు ప్రాణులు సూర్యుని తీక్షణ తాపముతో కాలిపోవుచుండిరి. జగత్తునందంతయు హాహాకారములు వ్యాపించెను.

జగత్తంతా ఆపదలతో చిక్కుకొనెను. సకల దేవతలు బ్రహ్మను, రుద్రుని ముందిడుకొని విష్ణువు చెంతకు వైకుంఠమునకు బయలుదేరివెళ్ళిరి. మహావిష్ణూ! మీరు ధ్రువేశులు. జగదుత్పత్తికి కారణమైన వారు.

మీరు మత్స్యావతారమున వేదములను కాపాడితిరి. హిరణ్యాక్షుని వధించుటకు సూకరరూపమునెత్తితిరి. పృథివిని ఉద్ధరించుటకు వరాహమూర్తివైతిరి. ప్రహ్లాదుని కాపాడుటకు నృసింహుడై హిరణ్య కశిపుని సంహరించితిరి. ఇంద్రుని కోసం బలిని అణగత్రొక్కుటకు వామనుడైతిరి.

దుష్టక్షత్రియులను, కార్తవీర్యుని తునుమాడుటకు పరశురాముడైతిరి. రావణవధకోసం రామచంద్రుడుగా అవతరించితిరి. దుష్టులను తునుమాడి ధర్మసంస్థాపన కోసం శ్రీకృష్ణుడుగా అవతరించితిరి.

పశుహింసను ఆపివేయుటకు బుద్ధావతారమునొందితిరి. రాజులు ప్రజలను పీడించుట చూచి కల్కిరూపముగా రానున్నారని లోకప్రతీతి. మీకు ప్రణామములు.

భక్తుల ఆపదలు తొలగించుటకు అమృతమును పంచుటకు మోహినీ రూపముగ, హంస రూపమును ధరించిన మీకు జయమగుగాక! అని పీతాంబరధారియైన శ్రీహరిని దేవతలు స్తుతించిరి.

శ్లో॥ జయ విష్ణో రమేశాద్య మహాపురుష పూర్వజ
దైత్యారే కామజనక సర్వకామఫలప్రద॥
మహావరాహ గోవింద మహాయజ్ఞస్వరూపక
మహావిష్ణో ధ్రువేశాద్య జగదుత్పత్తికారణ ॥
మత్స్యావతారే వేదానా ముద్ధారాధారరూపక
సత్యవ్రత ధరాధీశ మత్స్యరూపాయ తే నమః ॥
జయ కూపార దైత్యారే సురకార్యసమర్పక
అమృతాప్తిక రేశాన కూర్మరూపాయ తే నమః
జయాదిదైత్యనాశార్థ మాదిసూకరరూపధృక్
మహ్యుద్ధారకృతోద్యోగకోలరూపాయ తే నమః ॥
నారసింహవపుః కృత్వా మహాదైత్యం దదార యః
కరజై ర్వరదృప్తాంగం తస్మై నృహరయే నమః॥
వామనం రూప మాస్థాయ త్రైలోకైశ్వర్యమోహితమ్
బలిం సంఛలయామాస తస్మై వామనరూపిణే ॥
దుష్టక్షత్రవినాశాయ సహస్రకరశత్రవే ।
రేణుకాగర్భజాతాయ జామదగ్న్యాయ తే నమః॥
దుష్టరాక్షస పౌలస్త్య శిరశ్ఛేదపటీయసే
శ్రీమద్దాశరథే తుభ్యం నమోఽనంతక్రమాయ చ ॥
కంసదుర్యోధనాద్యై శ్చ దైత్యైః పృథ్వీశలాంఛనైః

భారాక్రాంతాం మహీం యోఽసౌ వుజ్జహార మహావిభుః ॥
ధర్మం సంస్థాపయామాస పాపం కృత్వా సుదూరతః
తస్మై కృష్ణాయ దేవాయ నమోఽస్తు బహుధా విభో ॥
దుష్టయజ్ఞవిఘాతాయ పశుహింసానివృత్తయే
బౌద్ధరూపం దధౌ యోఽసౌ తస్మై దేవాయ తే నమః ॥
మ్లేచ్ఛప్రాయేఽఖిలే లోకే దుష్టరాజన్యపీడితే
కల్కిరూపం సమాదధ్యౌ దేవదేవాయ తే నమః ॥
దశావతార స్తే దేవ భక్తానాం రక్షణాయ వై
దుష్టదైత్యవిఘాతాయ తస్మాత్ త్వం సర్వదుఃఖహృత్ ॥

అని దేవతలందరూ సాష్టాంగ ప్రణామమొనరించిరి అప్పుడు దేవతలారా! నేను మీ స్తుతులచే ప్రసన్నుడనైతిని. నన్ను పరమ దుర్లభమగు వరము అడుగుడు అనెను.

ఓ దేవతలారా! ప్రాతః కాలమున లేచి ఈ స్తుతిని నా యెడల అపారశ్రద్ధ కలిగి పఠించిన మానవునకు శోకము లెప్పుడును దరిదాపునకు రాజాలవు. అతడెప్పుడు అకాల మృత్యువు పాలుకాడు. ఈ స్తోత్రము పఠించినవారికి భోగసామగ్రి సతతము సమృద్ధిగానుండును అని చెప్పిన, శ్రీహరి వచనములు విని దేవతలు సంతోషముతో మహావిష్ణూ! ఇప్పుడు వింధ్యపర్వతము సూర్యుని రాకను అడ్డు తగిలియున్నది.

యజ్ఞాది భాగములు దుర్లభములైనవి. ఇప్పుడు మేమేమి చేయవలెను. ఎక్కడికి వెళ్ళవలెను? అనగా శ్రీహరి దేవతలారా! జగత్తునకు జనని భగవతి ఆద్యాదేవి, ఆమెను ఉపాసించు అగస్త్యముని కాశియందు విరాజమానుడై యున్నాడు. వింధ్య పర్వతము యొక్క ఉధృతిని ఆయనయే ఆపగలడు. దేవతలారా! కాశి కల్యాణప్రదమగు సర్వోత్తమస్థానము.

అగస్త్యుని ప్రసన్నుని చేసికొని ఈ విషయమున ఆయనను ప్రార్థింపుడు. విష్ణువు ఆదేశమును పొంది దేవతలు కాశీనగరమునకు వెళ్ళిరి. మణి కర్ణికా ఘట్టము నందు గంగలో స్నానమాచరించిరి. అగస్త్యునికి ప్రణామమొనర్చిరి.

దేవతలు వారితో భూదేవా! మీరు ద్విజగణములకు స్వామి. మీరు వాతాపి బలమును నాశనమొనర్చితిరి. ఘటమునందు ప్రకటితులైన మీకు నమస్కారము. మీరు లోపాముద్రకు ప్రాణనాథులు. వింధ్య పర్వతము ద్వారా దుఃఖములననుభవించుచున్నాము. అనగా, అప్పుడు అగస్త్యమహాముని దేవతలతో మీరందరూ మహానుభావులు.

అమరావతీ పురమునకు అధిపతి మహేంద్రుడు. అగ్ని దేవునకు కష్టమైన పని ఏముంటుంది. యమధర్మరాజు రాక్షస గణములకు అధిపతి. సకల ప్రాణుల కర్మలకు సాక్షి. అతడెప్పుడూ వ్యగ్రుడైయుండును.

నాశక్తితో సిద్ధించు కార్యమేదియైనను ఉండినచో తెలుపుడు అని చెప్పగా దేవతలకు ధైర్యము వచ్చి మహర్షీ! వింధ్య పర్వతుడు సూర్యుని మార్గమునకు అడ్డుతగిలెను.

మూడు లోకములందు హాహా కారములు వ్యాపించెను. ఆ పర్వతము పెరుగుదలను దయతో ఆపివేయుడు. అగస్త్య మునీంద్రా! మీ తేజస్సు వలన ఆ పర్వతేంద్రుడు తప్పక వినమ్రుడగును. ఇదియే మా ప్రార్థన అని దేవతలు నివేదించిరి.

ముని వారితో "మీ ఈ కార్యమును సఫలమొనర్చెదను" అని పలికెను. కుంభోద్భవుడగు అగస్త్యుడు దేవతల కోసం కాశీనగరమును వదలిపెట్టుటకు దుఃఖించెను.

కాశీ విశ్వనాథుని దర్శించి, కాలభైరవుని ప్రార్థించి, సాక్షి వినాయకునకు నమస్కరించి కాశీ విశాలాక్షిని మనసున నిలిపి, తన సతి లోపాముద్రతో కలిసి కాశిని వదలిపెట్టెను.

అగస్త్యమునీంద్రునకు కాశి నగరమును వదలిన అర్ధ నిమిషములో వింధ్య పర్వతమును సమీపించెను. ఆ పర్వతము ఆకాశమును తాకుచుండగా మునీంద్రుని ఎదుట దర్శించిన వింధ్యాచలుడు దండము వలె భూమిమీద పడి మునికి సాష్టాంగ ప్రణామముగావించెను

ఆ వింధ్యపర్వతము పడియుండగా చూచి మునివరుడగు అగస్త్యుడు ప్రసన్నుడయ్యెను. ఇట్లు పలికెను – నాయనా! నేను తిరిగి వచ్చునంతవరకు నీవిటులనే పరుండియుండుము. నేను నీ శిఖరములను అధిరోహించలేను అని చెప్పి అగస్త్యుడు దక్షిణ దిశకు వెళ్ళుటకు సంసిద్ధుడయ్యెను.

అచటి నుండి దక్షిణవైపున వున్న శ్రీశైలపర్వతము కనిపించెను. మలయాచలమునకు వెళ్ళి తన ఆశ్రమమును నిర్మించుకొనెను. అక్కడనే ఉండిపోవుటకు నిర్ణయించుకొనెను. అప్పుడు వింధ్య పర్వతమునకేతెంచిన దేవి మనువు చేత పూజింపబడెను. దేవికి వింధ్యవాసినియని పేరు వచ్చెను.

అగస్త్యుడు తిరిగి రానులేదు. వింధ్య పర్వతము పెరగనులేదు. స్వాయంభువమనువు దేవి నారాధించి మన్వంతర పర్యంతము పృథివిని పరిపాలించెను. ఇది భగవతి శ్రీదేవి యొక్క మొదటి చరిత్ర. ఈ కథను శ్రవణము చేసిన వారి మనోరథములన్నియును సఫలమగును.

4. మనువంశ క్రమము

స్వాయంభువ మనువు దేవి భగవతిని ఆరాధించి రాజ్యలక్ష్మిని అనుభవించెను. అతనికి ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనే పుత్రులు కలిగిరి.

ప్రియవ్రతుడు పండ్రెండు సంవత్సరములు తపముచేయగా ఆ దేవి ప్రత్యక్షమై సకల మన్వంతరమునకు అతనిని రాజును చేసెను. చివరకు రాజ్యమును అనుభవించి స్వర్గమునకేగెను.

ప్రియవ్రతుని పుత్రుడు ఉత్తముడు మూడవ మనువయ్యెను. మూడు సంవత్సరములు ఆరాధించిన తరువాత భగవతి అతనిని అనుగ్రహించెను

రాజర్షులు పొందు స్థానమును మనువగు ఉత్తముడు పొందెను. నాలుగవ మనువు తామసుడనుపేరుతో ఖ్యాతిచెందెను.

రైవతుడు అయిదవ మనువుగ చెప్పబడెను, తామసునకు తమ్ముడు. రైవతమనువు దేవినారాధించి రాజ్యసుఖములననుభవించి స్వర్గమునకేగెను.

అంగుని పుత్రుని పేరు చాక్షుసుడు. ఇతడు ఆరవ మనువు. ఇతడు బ్రహ్మర్షి పులహుని శరణుజూచ్చి "శ్రీ" ప్రాప్తించునట్లు ఉపదేశింపమని కోరగా మంత్ర రహస్యమును సరస్వతీ బీజ జపము, వాగ్భవ బీజమును నిత్యము జపించుచుండెను.

పరమేశ్వరి జగదంబ అతనికి సాక్షాత్తు తన దర్శన భాగ్యమును కలుగచేసెను. ఆ దేవి రాజేంద్రా! నేను నీకు మన్వంతరము రాజ్యము ఇచ్చివేసితిని. అనేక పుత్రులను పొందుదువు. నీవు నాధామమును చేరుకొందువు అని చెప్పగా ఆ రాజు అట్లే రాజ్యభోగములననుభవించి పరమధామమునకు చేరుకొనెను.

నారాయణుడు నారదా! వైవస్వతుడు ఏడవ మనువుగా ప్రసిద్ధిచెందెను. ఇతనిని శ్రాద్ధదేవుడని కూడా చెప్పుదురు. భగవతి కృపచేత మన్వంతర అధిపతియగు సౌభాగ్యము ప్రాప్తించినది.

ఎనిమిదవ మనువు సావర్ణియను పేరుతో భూమండలమున ఖ్యాతి వహించెను. పూర్వజన్మమున దేవి నారాధించి సకల రాజులచేత సమ్మానితుడయ్యెను. ఇతడు భగవతి జగదంబ పరమోపాసకుడు.

సావర్ణి మనువు పూర్వజన్మమున సురథుడను రాజు. సురథుని కథను వినుము. శ్రీ నారాయణుడు సురథ – సుమేధ సంవాదమును,

మధుకైటభ సంహారమును, మహిషాసుర శుంభ నిశుంభులవధ మొదలగు గాథలను తెలిపెదను.

సువర్ణమహారాజు యీ జన్మలో సావర్ణిమనువయ్యెను. వైవస్వత మనువుకు ఆరుగురు కుమారులు. వారు కరూషుడు, పృషధ్నుడు, నాభాగుడు, దిష్టుడు, శర్యాతి, త్రిశంకుడు అనువారలు.

ఈ ఆరుగురు భగవతిని ఉపాసించసాగిరి. తపఃఫలస్వరూపముగా వారికి సకల మోహములును నశింపచేయు నిర్మలమగు బుద్ధి ప్రాప్తించెను.

మనుపుత్రుల ఏకైక లక్ష్యము దేవీచరణ చింతనయే అయియుండెను. సకల జగత్తునూ తమ ఆత్మలందే సాక్షాత్కరింప చేసుకొనసాగిరి. తదుపరి వేలకొలది సూర్యుల సమానతేజస్సుతో వెలుగొందు ఆ దేవేశ్వరి వారి ఎదుట ప్రత్యక్షమయ్యెను. వారు భగవతిని స్తుతింపసాగిరి.

దేవీ! నీవు 'క్లీమ్' అను బీజ మంత్రమును ఉపాసించుటచే అపారమగు ప్రేమను ప్రసాదించెదవు. ఇట్లు రాజపుత్రులు స్తుతింపగా భగవతి శ్రీదేవి రాజ కుమారులారా! మీకు కావలసిన కోరికలను వరములుగా అడుగుడు. అనగా రాజపుత్రులు దేవీ! మాకు రాజ్యమును, దీర్ఘాయుస్సుగల సంతానము, యశస్సును, తేజస్సును, బుద్ధిని, అజేయత్వమును దయతో ప్రసాదింపుము. ఇదియే మా ప్రార్థన అనిరి.

శ్రీదేవి – రాజ కుమారులారా! మీరు కోరిన వన్నియు ఫలించును. మీరు మన్వంతరములకు అధిష్ఠాతలగుదురు అని చెప్పగా వారు భగవతి భ్రామరిని స్తుతించిరి. ఆ దేవి కృప వలన రాజ్యమును, సకల భోగములను ఉత్తమ సంతానము పొందిరి.

రెండవ జన్మయందు సావర్ణిమనువులుగా పిలువబడిరి. మొదటి రాజకుమారుని పేరు దక్ష సావర్ణి తొమ్మిదవ మనువయ్యెను. రెండవ కుమారుడు 'మేరు సావర్ణి' ఇతడు పదవ మనువు అయ్యెను.

మూడవ రాజకుమారుడు సూర్యసావర్ణి నామముతో ఖ్యాతి వహించెను. పదకొండవ మనువుగా చెప్పబడెను. నాలుగవవాడు ఇంద్రసావర్ణి పండ్రెండవ మనువుగా పరిగణింపబడెను. ఐదవ రాజ కుమారుడు రుద్రసావర్ణి నామముతో ఖ్యాతి వహించెను. పదమూడవ మనువుగా పరిగణింపబడెను.

ఆరవ రాజకుమారుని పేరు విష్ణుసావర్ణి. ఇతడు పదునాలగవ మనువుగా చెప్పబడెను. మనువులందరూ భగవతి 'భ్రామరి'ని నిత్యము ఉపాసించుచుండిరి. భగవతీ 'భ్రామరీ' ప్రసాదమున వీరందరూ మహావీరులైరి.

నారదుడు నారాయణునితో భ్రామరీదేవి ఎవరు? ఆ దేవి ఉపాఖ్యానములు నాకు వినిపింపుమని కోరగా – నారాయణుడు నారదా! భగవతి శ్రీదేవి యొక్క చరిత్ర జగత్తునందు హితభరితమైయుండును.

చాలాకాలమునాటి విషయము అరుణుడను ఒక దైత్యుడుండెను. పాతాళమున వుండెను. దేవతలను జయింపవలెనన్న కోరికతో బ్రహ్మను ప్రసన్నత చేసుకొనుటకు పదివేలసంవత్సరములు తపస్సు చేసెను. సకల దేవతలు వణకసాగిరి.

బ్రహ్మ గాయత్రిదేవితో హంసవాహనారూఢుడై బయలుదేరెను. శరీరము చిక్కిపోయిననూ అగ్నిదేవునివలె అతడు ప్రజ్వరిల్లుచుండెను. బ్రహ్మ వానితో వత్సా! నీ మనస్సులోనున్న కోరికను వెలిబుచ్చుమని అడిగెను.

అరుణుడు బ్రహ్మకు నమస్కరించి 'నేనెప్పుడును మరణించకూడదు' అని కోరెను. బ్రహ్మ ఆదరముతో అతనికిట్లు నచ్చచెప్పెను. వత్సా! ఈ జగత్తునందు పుట్టినవారు మరణించడం సహజం. నేనివ్వగలిగిన ఇంకేదైనా వరమును అడుగుమని పలికెను.

ప్రభూ! నేను యుద్ధములో మరణించకూడదు. శస్త్రాస్త్రములతో సంహరింపకుండునట్లు, స్త్రీతోగాని, పురుషునితోగాని, మృత్యువు కలుగకుండునట్లు, ద్విపాద, చతుష్పాద ప్రాణులతో నాకు మరణము లేకుండునట్లు వరమును ప్రసాదింపుము అని కోరగా బ్రహ్మ అరుణుడు కోరిన వరములనిస్తూ తథాస్తు అని పలికెను. అంతర్ధానుడై తనలోకమున కరిగెను.

అరుణుడు దైత్యులందరితో కూడి అవలీలగా దేవతలను పరాజితులను చేసెను. అనేక రూపములను ధరించి సూర్యుడు చంద్రుడు, యముడు, అగ్ని దేవుల సమస్త అధికారములను చేజిక్కించుకొని స్వయముగా అందరిని శాసింపదొడగెను.

దేవతలందరూ తమ దుఃఖగాథలను శంకరునకు వినిపించిరి. ఆ దానవుని ఎట్లు అంతము చేయుట అని చింతింపసాగిరి.

అదే సమయమున ఆకాశవాణి పలికెను. మీరు దేవి భువనేశ్వరిని ఉపాసింపుడు. ఆ దానవరాజు గాయత్రీమంత్రరహితుడైన తప్ప అతనిని వధించుట కుదరదు అని వాణి పలుకగా దేవతలు బృహస్పతిని పిలిపించిరి. ఇంద్రుడు గురువర్యా! మీరు అరుణుని వద్దకు వెళ్ళిగాయత్రీ జపము నుండి విరతుని చేయుడు. మేము పరమేశ్వరిని ఉపాసించెదమనిరి.

వెంటనే బృహస్పతి అరుణిని వద్దకు వెళ్లి దానవేంద్రా! మేము ఉపాసించు దేవినే నీవునూ నిరంతరము ఉపాసించుచున్నావు. ఇప్పుడు నీవు మా పక్షము వాడివే అయితివి. అనగానే దానవేంద్రుడు దేవమాయచే మోహితుడై అయితే నేనిప్పటినుండి గాయత్రిని ఉపాసించనే ఉపాసించను అని అభిమానముతో పలికెను.

అప్పటినుండి ఆదైత్యుడు గాయత్రిని జపించుట మానివేసెను. గాయత్రీజపము వీడినంతనే అతని శరీరము నిస్తేజము అయ్యెను.

బృహస్పతి అమరావతికి చేరుకొనెను. దేవతలందరూ భగవతి పరమేశ్వరిని ఉపాసింపసాగిరి.

అప్పుడు జగదంబ ప్రకటిత అయ్యెను. ఆమె పిడికిలి భ్రమరములతో నిండియుండెను. నాలుగు వైపుల నుండి అసంఖ్యాకములైన భ్రమరములు పరివృతమైయుండెను. 'హ్రీమ్' అను శబ్దమును గానము చేయుచుండెను.

దేవతలు విశ్వముతో కూడిన తైజస ప్రాజ్ఞమయ విరాట్ రూపమును ధరించు దేవీ! నీకు అనేక ప్రణామములు. జగన్మాతా! నీకు జయమగుగాక, పరాత్పరస్వరూపిణీ, భగవతీ, భువనేశ్వరీ! సర్వోత్తమోత్తమురాలా! కళ్యాణమయమగు గుణములకు నిలయమైన దానా! భగవతి, భువనేశ్వరీ! నీకు జయమగు గాక! అని దేవతలిట్లు స్తుతించిరి –

నమో దేవి మహావిద్యే సృష్టిస్థిత్యంతకారిణి
నమః కమలపత్రాక్షి సర్వాధారే నమోఽస్తు తే॥
సవిశ్వతైజసప్రాజ్ఞవిరాట్సూత్రాత్మికే నమః
నమో వ్యాకృతరూపాయై, కూటస్థాయై నమో నమ॥
దుర్గే సర్గాదిరహితే దుష్టసంరోధనార్గళే
నిరర్గళప్రేమగమ్యే భర్గే దేవి నమోఽస్తు తే॥
నమఃశ్రీకాళికే మాత ర్నమో నీలసరస్వతి
ఉగ్రతారే మహోగ్రే తే నిత్య మేవ నమో నమః ॥
నమః పీతాంబరే దేవి నమస్త్రిపురసున్దరి
నమో భైరవి మాతంగి ధూమావతి నమో నమః॥
ఛిన్నమస్తే నమస్తేఽస్తు క్షీరసాగరకన్యకే
నమ శ్శాకంభరి శివే నమ స్తే రక్తదంతికే॥
నిశుంభశుంభదళని రక్తబీజవినాశిని
ధూమ్రలోచననిర్ణాశే వృత్రాసురనిబర్హిణి ॥

చండముండప్రమథిని దానవాంతకరే శివే
నమ స్తే విజయే గంగే శారదే వికచాననే।
పృథ్వీరూపే దయారూపే తేజోరూపే నమో నమః
ప్రాణరూపే మహారూపే భూతరూపే నమోఽస్తు తే।
విశ్వమూర్తే దయామూర్తే ధర్మమూర్తే నమో నమః
దేవమూర్తే జ్యోతిర్మూర్తే జ్ఞానమూర్తే నమోఽస్తు తే।
గాయత్రి వరదే దేవి సావిత్రి చ సరస్వతి
నమ స్స్వాహే స్వధే మాత ర్దక్షిణే తే నమో నమః ॥
నేతి నేతీతి వాక్యై ర్యా బోధ్యతే సకలాగమైః
సర్వప్రత్యక్ప్యరూపాం తాం భజామః పరదేవతామ్।
భ్రమరై ర్వేష్టితా యస్మాః భ్రామరీ యా తత స్మృతా
తస్యై దేవ్యై నమో నిత్యం నిత్యమేవ నమో నమః ॥
నమ స్తే పార్శ్వయోః పృష్ఠే నమ స్తే పురతోఽంబికే
నమ ఊర్ధ్వం నమ శ్చాధ స్సర్వత్రైవ నమో నమః।
కృపాం కురు మహాదేవి మణిద్వీపాధివాసిని
అనంతకోటిబ్రహ్మాండనాయికే జగదంబికే।
జయ దేవి జగన్మాత ర్జయ దేవి పరాత్పరే
జయ శ్రీభువనేశాని జయ సర్వోత్తమోత్తమే।
కల్యాణగుణరత్నానామాకరే భువనేశ్వరి
ప్రసీద పరమేశాని ప్రసీద జగతో రణే ॥

(10స్క. 13అ. 87-103 శ్లో)

భగవతి జగదంబ దేవతల స్తోత్రములు విని వారితో – దేవతలారా! మీరు ఏమి కోరదలచినారో దానిని అడుగుము. మీకు ప్రసాదించెదను. అనగా – దేవతలు తమ దుఃఖమునకు కారణము – బ్రహ్మ దానవరాజగు అరుణునకు విచిత్రములైన వరములనొసగెను. ఆ అరుణుని వలన అందరు పీడింపబడుచున్నామనిరి.

అప్పుడు భగవతి మహాదేవి భ్రామరి తన చేతిలోనున్న భ్రమరములను ప్రేరేపించెను. భ్రమరముల కారణమున పృథివినందంతటను అంధకారము వ్యాపించెను.

భ్రమరములన్నియునూ వెంటనే వెళ్ళి దైత్యుల వక్షస్థలమును చీల్చివేసెను. వాటిని ఎదుర్కొనుటకు దైత్యులకు అవకాశములేకుండెను. వారు ఒకరితో ఒకరు మాట్లాడుటకు అవకాశమే లేకుండెను. దైత్యులు ఏయే రూపములనుండిరో ఆయా స్థలములందు అదే సమయమున, అదే రూపములలో ప్రాణములను పోగొట్టుకొనుచుండిరి. క్షణములోనే దానవులందరునూ నశించిరి.

అద్భుతమైన కార్యమును సాధించి ఆ భ్రమరములు తిరిగి దేవిని చేరుకొనెను. బ్రహ్మ, విష్ణువు మొదలైన సకల దేవతలు ఆనందసాగరమున మునిగి భగవతి జగదంబను ఉపాసించిరి. దేవిపైన పుష్పవృష్టి కురియసాగెను.

గంధర్వులు ఆ దేవి యశస్సును గానము చేయుచుండిరి. దేవతలు నానావిధ స్తోత్రముల ద్వారా ఆ దేవిని స్తుతించిరి. "మాతా ఈశానీ నీకు జయమగు గాక! నీకు జయమగుగాక!" అని భగవతికి జయజయ స్తుతులు గావించిరి.

దీని ప్రభావమున మానవుడు సంసార రూపసాగరమునుండి తరించును. సకల మనువుల చరిత్రలు కూడ పాపవిచ్ఛేదనము చేయును. దేవీ మాహాత్మ్యమునకు సంబంధించిన విషయము చదివినను, వినినను కళ్యాణ ప్రదమగును. పఠించువాడును, వినువాడును, సకల పాపములనుండి ముక్తుడగును. భగవతి యొక్క పరమధామమును పొందును.

5. సదాచారము

నారదుడు నారాయణునితో ప్రభూ! ఏ సదాచారములచేత భగవతి ప్రసన్నురాలగును. సదా భక్తులను రక్షించును. నేనా సదాచారములను వినగోరుచున్నాను. దయతో తెలుపమని కోరగా – తత్వజ్ఞానివగు నారదా! ద్విజుడు ప్రతిదినము ప్రాతఃకాలమున లేచి పాటించవలసిన సదాచారము వినుము.

ఉదయము నుండి సాయంత్రం వరకు ధర్మసాధన యందు సత్కర్మయందు లగ్నము కావలెను. తల్లిదండ్రులు, పుత్రులు, భార్య, బంధు బాంధవులు. వీరెవ్వరును కూడ ఆత్మకు సహాయమొనరించలేరు. ధర్మమొక్కటియే సముపార్జించవలెను.

శ్లో॥ ఆత్మైవ న సహాయార్థం పితా మాతా చ తిష్ఠతి
న పుత్రదారా న జ్ఞాతి ర్ధర్మ స్తిష్ఠతి కేవలమ్ (11స్క.1అ.7 శ్లో)

ఆచారమునే మొదటి ధర్మముగ భావించబడును. శ్రుతి, స్మృతులయందు సిద్ధమగును. ఆచారవంతుడైన పురుషుడు ఇహపర లోకములందు సుఖముననుభవించును.

ధర్మముతో కూడిన ఆచారము గొప్పదీపమై ముక్తికి మార్గము చూపును. మానవుని సత్కర్ముని చేయును. కర్మమువలననే జ్ఞానము వృద్ధి పొందును. ఇది మనువు చెప్పిన వాక్యము.

శాస్త్రీయము, లౌకికము అని ఆచారము రెండు విధములు. ఈ రెండింటిని పాటించవలెను. సత్పురుషులు గ్రామ ధర్మమును, జాతి ధర్మమును, దేశధర్మమును, కులధర్మమును – ఆదరించవలెను. దురాచారియైన పురుషుడు నిందాపాత్రుడుగ తలంచవచ్చును. వ్యాధులెప్పుడును అతని నుండి తొలగిపోవు. అర్థ, కామ, ధర్మ హీనుడగువానిని పరిత్యజించవలెను.

నారదా! శ్రుతులు, స్మృతులు రెండు నేత్రములు. పురాణము హృదయమని చెప్పబడినది. ఈ మూడింట చెప్పబడినదే ధర్మము. ఋషిగణములు ధర్మమని చెప్పిన దానిని మనము స్వీకరించవలెను. వేదమే సముచితముగ ధర్మమార్గమునకు ప్రమాణము. వేదోక్త ధర్మమునే ఆశ్రయించవలెను.

నేడు నేనేమి పనులు చేసితిని? నేనెవరికేమి ఇచ్చితిని? ఏమి ఇప్పించితిని? ఏమైనా సహాయము చేసితినా? అని స్వయముగ ఆలోచన చేయవలయును.

రాత్రి నాలుగవ జామున లేచి బ్రహ్మను ధ్యానము చేయవలయును. వీరాసనమున కూర్చొని ధ్యానము చేయవలయును. రెండు లేక మూడు సార్లు ప్రాణాయామము చేయవలయును. దీపమువలె హృదయము నందు నిలిపి శ్రీ భగవానుని ధ్యానించవలయును. నా హృదయము నందు పరమాత్మ తప్పక విరాజమానుడైయున్నాడని మనస్సులో ధారణ చేయవలయును.

ప్రాణాయామమునందు రేచక, పూరక, కుంభకములను అనుసరించ వలెను. ఇడానాడితో గాలిని పైకి లాగి ఉదరమున సంపూర్ణముగ నుంచవలెను. తదుపరి (పింగళ) నాడి నుండి మెల్లమెల్లగ పదహారు మాత్రల కాలము వాయురేచనము అనగా వదలిపెట్టవలయును.

కుండలినీ స్వరూప భగవతి జగదంబ ఒక్కసారైనను చిత్తమున నిలిచిన పురుషుడు జీవన్ముక్తుడగును. ఆమె యే స్థితి, రతి, ఆమెయే యాత్ర, మతి, చింత, స్తుతి, వాణియును అగును. దేవీ నేను సర్వాత్మను. నేను చేయు స్తుతి మీ పూజయే నేను మీ స్వరూపమే. నేను సచ్చిదానంద స్వరూపుడను అని తన ఆత్మయందు ధ్యానము చేయవలెను.

బ్రహ్మారంధ్రమందు ఈశ్వర గుణధ్యానము చేయవలెను. మంత్రముతో గురువును ప్రార్థించవలెను. గురువే బ్రహ్మ, గురువే విష్ణువు, గురువే దైవము, గురువే మహేశ్వరుడు.

శ్లో॥ గురుర్ బ్రహ్మా గురు ర్విష్ణు ర్గురు ర్దేవో మహేశ్వరః
గురురేవ పరం బ్రహ్మ తస్మై శ్రీగురవే నమః

గురుదేవునకు నమస్కరిస్తున్నాను అని ధ్యానము చేయవలెను.

వేదములు, వేదాంతములు అధ్యయనము చేసి ఉండవచ్చును కాని ఆచారహీనుడైన వ్యక్తిని అవి పవిత్రమొనరింపలేవు. సదాచారము గలవాడు బ్రహ్మ ముహూర్తమున రాత్రి నాలుగవ జామున వేదము నధ్యయనము చేయుట పరమధర్మము.

యోగియైన పురుషుడు బ్రహ్మను ధ్యానించవలెను. అట్టివాడు జీవన్ముక్తుడగును. జీవుడు బ్రహ్మనిరంతరము ఒకటిగా వుండును. ద్విజుడు నైరుతి దిశగా వెళ్ళి మలమూత్రములు విసర్జించవలెను. గృహస్థుడు జంధ్యమును వెనుకకు వేసుకొని, చెవికి తగిలించుకొని విసర్జించవలెను.

దంతములను శుభ్రము చేయుకుంచెను. మామిడి, మేడి, కడిమి, రేగు, లొద్దుగ, సంపంగి పుల్లలు ఉపయోగించవలెను. నీటితో పాదములను శుద్ధి చేసి మూడుసార్లు ఆచమనము చేయవలెను.

నీటిని తీసికొని అంగుష్ఠము చూపుడు వ్రేళ్ళతో సిసికాఛిద్రముల రెండింటిని బొటన వ్రేలితో కన్నులు, చెవులను బొటన వ్రేలితో చిటికెన వ్రేలుతో బొడ్డును, అరచేతితో హృదయమును అన్ని వ్రేళ్ళతో తలను తాకవలయును.

6. రుద్రాక్షల మాహాత్మ్యము

నారాయణుడు నారదా! పవిత్రత కొరకు చేయు ఆచమనము 'శుద్ధ' ఆచమనమని చెప్పబడును. 'స్మార్తము' 'పౌరాణికము' అని చెప్పెదరు. బ్రహ్మ యజ్ఞమును ప్రారంభించుటకు ముందు 'వైదిక' 'శ్రౌత' ఆచమనము చేయబడును. అస్త్రవిద్యను మొదలుపెట్టినపుడు 'తాంత్రిక' ఆచమన విధానము కలదు.

గాయత్రి మంత్రము మూడుసార్లు పఠించి, శిఖను ముడివేసుకొన వలెను. ఆచమనము చేసి హృదయమును, బాహువులను భుజములను తాకవలెను. శుద్ధిని పొందుటకు కుడి చెవిని తాకవలెను. అగ్ని, జలము, వేదము, సోముడు, సూర్యుడు, పవనుడు, ఈ దేవతలందరును బ్రాహ్మణుని కుడి చెవియందు విరాజమానులైయుందురు.

ప్రాతఃకాలమున తప్పక స్నానము చేయవలయును. అలా చేయనివారి సకలక్రియలు నిష్ఫలమగును. స్నానము, సంధ్యావందనము దర్భలతో సంపన్నము చేయు విధానము కలదు.

ఏడురోజులు స్నానము చేయనివాడు, మూడు రోజులు సంధ్యనాచరించనివాడు, పండ్రెండు రోజులు హవనము చేయని ద్విజుడు శూద్రునితో సమానమగును.

గాయత్రి జపముతో సమానమైన శ్రేష్ఠకార్యము ఏదియును లేదు. స్నానము చేయునపుడు దేవతలను, పితరులను సంతృప్తిపరచుటకు స్నానాంగ తర్పణము చేయవలయును.

శుద్ధ వస్త్రములను ధరించవలెను. రుద్రాక్షమాలను ధరించవలెను. సదా జపము చేయవలయును. రుద్రాక్షకు గొప్ప మాహాత్మ్యము కలదు. కంఠమునందు ముప్పదిరెండు, మస్తకమున నలువది, చెవులు రెండింటి యందు ఆరు, ఆరు, రెండు చేతుల యందు పండ్రెండు పండ్రెండు,

రెండు భుజములయందు పదహారు పదహారు, శిఖయందు ఒక్కొక్కటి, వక్షస్థలము నందు నూటఎనిమిది రుద్రాక్షలను ధరించవలెను.

ప్రణవముతో కూడిన పంచాక్షర "ఓం నమః శివాయ" మంత్రమును జపించవలెను. రుద్రాక్షలు ధరించుట శంకరుని జ్ఞానమును పొందుటకు సాక్షాత్తు సాధనము. ద్విజుడు మంత్రసహితముగ దీనిని ధరించవలెను. శూద్రుడు మంత్రము లేకుండ ధరించవచ్చును.

కార్తికేయుడు శంకరుని అడిగెను. శంకరుడు షడాననా! మునుపు త్రిపురుడను ఒక దైత్యుడుండెను. అతడు బ్రహ్మవిష్ణువులను, దేవతలను కష్టముల పాలుచేసెను. నేను త్రిపురుని వధించుటకు, దేవతల నుద్ధరించుటకు అఘోరమను అస్త్రమును స్మరించితిని.

చాలాసేపటివరకు నా కనులు మూసియేయుండెను. తదుపరి నా నేత్రముల నుండి కొన్ని జలబిందువులు భూమి మీద పడెను. ఆ అశ్రు బిందువులే రుద్రాక్ష వృక్షములగా ఆవిర్భవించెను. నా ఆజ్ఞతో ముప్పది ఎనిమిది రకముల రుద్రాక్షలు ఫలరూపమున ఏర్పడినవి.

సూర్యుని నేత్రము నుండి 12 రకములు, కపిల వర్ణము కలవి.

చంద్రుని నుండి 16 రకములు, తెల్లనివి

అగ్నిదేవుని నేత్రము నుండి 10 రకములు – కృష్ణవర్ణము గలవి.

శ్వేతవర్ణము గలవి బ్రాహ్మణులు, రక్తవర్ణము గలవి క్షత్రియులు, కలిసిన రంగుగలవి వైశ్యులు, కృష్ణరుద్రాక్షలు – శూద్రులు ధరించవలెను.

ఏకముఖ రుద్రాక్ష శంకరుని విగ్రహముగ, రెండు ముఖము గలవి శంకర పార్వతి రూపమని, త్రిముఖ రుద్రాక్ష అగ్ని స్వరూపమని నాలుగు ముఖములు గలవి బ్రహ్మరూపమని, పంచముఖ రుద్రాక్ష రుద్రుడుగ భావించబడును.

ఆరు ముఖముగల రుద్రాక్ష కార్తికేయుని స్వరూపము. దానిని పురుషుడు దక్షిణ హస్తమున ధరించవలెను. ఏడు ముఖము గల రుద్రాక్ష అనంగుడు (మన్మధుడు). అష్టముఖ రుద్రాక్ష గణేశుని ప్రతిమగ చెప్పుదురు. ఎనిమిది ముఖము గల రుద్రాక్ష ధరించుట వలన సమస్త గుణములు సులభమగును.

తొమ్మిది ముఖము గల రుద్రాక్ష భైరవ స్వరూపము. పది ముఖము గల రుద్రాక్ష జనార్దనుని విగ్రహము. పదకొండు ముఖములు గల రుద్రాక్ష పదకొండు రుద్రులుగా, పండ్రెండు ముఖము గల రుద్రాక్ష చెవి యందు ధరించవలెను. పదమూడు ముఖము గల రుద్రాక్ష కార్తికేయునితో సమానము.

పదనాలుగు ముఖములు గల రుద్రాక్ష లభించినచో తన మస్తకమున ధరించవలెను.అది నా రూపమే. రుద్రాక్ష తలను ధరించువాడు దేవతలచేత సుపూజితుడగును. నూట ఎనిమిది రుద్రాక్షలు గల మాలను ధరించినవాడు అశ్వమేధయజ్ఞము చేసిన ఫలము ప్రాప్తించును.

రుద్రాక్షను ధరించిన మానవుడు మద్యమాంసములను సేవించరాదు. వెల్లుల్లిని, ఉల్లిని, మునగను తినకూడదు. గ్రహణ, తుల, మేష, సంక్రాంతులందు, అమావాస్య, పౌర్ణమి, పర్వదినములందు, రుద్రాక్షలను ధరించవలెను. దీనివలన సకల పాపములనుండి ముక్తుడగును.

7. భూతశుద్ధి – భస్మము – ప్రాతఃసంధ్యలు

భూతశుద్ధి : దేవి కుండలిని మూలాధారము నుండి లేచి సుషుమ్నా మార్గమున పయనించుచు బ్రహ్మరంధ్రమును చేరుకొనెనని చింతన చేయవలెను. 'సోఽహం' అను మంత్రముతో జీవుని బ్రహ్మయందు అనుసంధానము చేయవలెను.

పాదములు మొదలుకొని మోకాళ్ళ వరకు పృథివీ స్థానము ఇది 'లం' బీజము అంకితమైయున్నది.

మోకాళ్ళనుండి నాభివరకు జలస్థానమని జలమండలము 'బం' అను బీజమంత్రముతో అంకితమైయున్నది.

నాభి నుండి కంఠము వరకు గల భాగమును అగ్ని మండల 'రం' బీజముతో కూడియుండునని భావన చేయవలయును.

హృదయము నుండి పై కనుబొమలవరకు వాయుమండలముగ ధూమ్ర వర్ణముతో 'యం' అను బీజముతో అంకితమై ఉన్నట్లుగ భావించవలెను.

కనుబొమల మధ్య నుండి బ్రహ్మ రంధ్రమువరకు ఆకాశ మండలము 'హం' అను బీజము అంకితమైయున్నట్లు ధ్యానించవలెను.

పృథివిని జలమునందు, జలమును అగ్నియందు, అగ్నిని వాయువు నందు, వాయువును ఆకాశమునందు, ఆకాశమును అహంకారము నందు, అహంకారమును మహత్వము నందు, మహత్వమును ప్రకృతి యందు విలీనము చేయవలెను.

భస్మము : పరమజ్ఞాన సంపన్నుడై అనాది జన్మముల నుండి ప్రోగైన పాప సముదాయమును పురుషుని రూపమున ఎడమ కుక్షియందు కూర్చొని యున్నాడు. అంగుష్ఠ ప్రమాణముగల ఆ పాపపురుషుడు కృష్ణ వర్ణము కలవాడు.

పాపుల యొక్క సాంగత్యమే రెండు చర్మములు, ఉపపాతకము అతని మస్తకము. చేతులలో డాలును, ఖడ్గమును కలిగియున్నాడు. 'యం' అను మంత్రమును ప్రాణాయామముతో వాయువును నింపి శరీరమును శుష్కింపచేయవలయును. 'రం' అను వహ్నిబీజము ద్వారా అగ్నిని ప్రకటితము చేసి పాపపురుషుని భస్మము చేయవలయును.

కుంభకజపము చేత పాపపురుషుడు భస్మమయ్యెను. 'యం' అను వాయు బీజ జపముతో రేచక ప్రాణాయామము ద్వారా బయటకు తీసుకొని రావలెను. శరీరము నుండి ఉత్పన్నమైన భస్మమును 'వం' అను సుధాబీజమునుచ్చరించుటవలన అమృతముతో దానిని తడుపవలెను. 'లం' అను భూ బీజముతో 'హం' అను ఆకాశబీజము నుచ్చరించి ఆ అండమును వికసిత రూపమున మార్చవలెను.

'సోఽహం' అను ఈ మంత్రము ద్వారా హృదయకమలము మీద ఆత్మను విరాజమానము చేయవలయును. రక్తవర్ణముతో కూడిన జలముతో ఒక సముద్రము కలదు. అందు ఒక నౌక ఉన్నది. దాని మీద ఒక కమలము వికసించినది. దానిపైన ఈ దేవి విరాజమానురాలైయున్నది. ప్రాణశక్తి స్వరూప భగవతి కుండలిని మాకు సుఖమును ప్రసాదించు గాక.

పరమాత్మ స్వరూపిణి, ప్రాణశక్తి యగుదేవి కుండలిని ధ్యానించవలెను. భస్మధారణను చేయవలెను. విభూతిని అలదుకొన్నచో గొప్ప ఫలము కలుగును.

నారాయణుడు భస్మమాహాత్మ్యమును, భస్మభేదమును, భస్మధారణ విస్తృతముగ వర్ణించి త్రిపుండ్ర మహిమను తెలిపెను.

నారదా! భస్మధారణ విస్తృత మాహాత్మ్యమును నేను నీకు వినిపించితిని. సంధ్యోపాసన యొక్క ప్రసంగమును వినుము.

సంధ్యోపాసన : ప్రాతఃకాల సంధ్య తారలు ప్రకాశించుచుండగా, మధ్యాహ్న సంధ్య సూర్యుడు ఆకాశముననుండగా, సూర్యుడు పశ్చిమ దిశకు వెళ్ళినపుడు సాయంకాలపు సంధ్య చేయు విధానము కలదు.

తారలు కనిపించునంత వరకు సంధ్యకు ఉత్తమకాలము. సూర్యోదయము వరకు మధ్యమకాలము. సూర్యోదయమైన తరువాత అధమకాలముగ ప్రాతఃకాల సంధ్యలు చెప్పబడినవి.

సూర్యుడు కనిపించుచుండగా సాయంకాలపుసంధ్య ఉత్తమము, సూర్యాస్త సమయము తరువాత చేయు సంధ్య నిమ్నశ్రేణికి చెందినది.

క. చుక్కలు గ్రుంకకమునుపే
చక్కగ బ్రొద్దుటను నాకసమున నడిమికిఁ బ్రొ
ద్దెక్క బగలు మునుమాపున
నొక్కింత యినుండు తోప నొప్పును సంధ్యల్

తే.గీ. ఉత్తమము చుక్కలుండగ నుదువు లేగ
మధ్యమ మటంద్రు బుధు లధమంబు సూర్యు
దుదితుడైన పదంపడి యో మునీంద్ర!
పుణ్యదము సుమ్ము ప్రొద్దుటిపూట సంధ్య

తే.గీ. ఉత్తమము సూర్యుడుండగా నుగ్రకరుడు
గ్రుంక మధ్యమమని రార్యకోటి మరియు
నధమమగు దారకోపేతమగుచు నింగి
వెలుగ మునుమాపు సంధ్య యుర్వీసురేంద్ర

ఉ. పారుడు చెట్టు ధర్మములు పత్రము లో మునినాథ వేదవి
స్తారము శాఖికాచయము జ్ఞానము పండు సమస్త తీర్థసం
చారతపోవ్రతాదికవిచారము పుష్పగణంబు సంధ్య దా
వేరదిగాన వేరునుప వృక్షమునందును సంధ్య యల్పమే.

తే.గీ. సంధ్య నేరనివాడును సంధ్య మరచిపో
వువాడును సంధ్యను బూని వార్చ
నట్టివాడును బ్రాహ్మణులందు బుట్టి
శూద్రుడగు నేడు వరముని శునకమగును

క. ఉదయాస్తమయములకునుం
బదపడి ఘటికాత్రయంబు వార్చగవచ్చున్

దదనంతరమున నిష్ఠతి
నొదవింపగవలయునందు రూఢితబుద్ధుల్

క. కాలాతిక్రాంతికి దగు
వీలెన్నగ నాల్గవదయి వెలసెడి యర్ఘ్యం
బేలీలాష్టోత్తరశత
కీలిత గాయత్రియే నొగిం బాచితమౌ

తే.గీ. ధామమందలి సంధ్య సాధారణంబు
మందలోనైనయెడ నది మధ్యమంబు
వాహినీతీరమందైన వరమటంద్రు
ధర్మశాస్త్రమ్ములెఱిగిన ధన్యులనఘ

క. దేవీసమీపమున సం
ధ్యావందనమాచరింపనందుల ఫలమున్
దేవాదీశ్వరులును స్తుతి
గావింపగలేరు ముక్తి గలుగుటకతనన్

బ్రాహ్మణులకు గాయత్రీదేవి తప్ప ఇతర దైవమెవరునూ లేదు. విష్ణువు, శివుని నిత్యము ఉపాసించిన కూడ గాయత్రిని ఆరాధించిన దానితో సమానము కాగలదు. ఇది శ్రుతివచనము, గాయత్రి ఉపాసన సకల వేదముల సారము.

బ్రహ్మ మొదలగు దేవతలు గాయత్రిని ధ్యానించి జపించెదరు. వేదముల ద్వారా ఈ దేవి యొక్క జపము నిత్యము జరుగుచుండును. 'వేదోపాస్యా' అని పిలువబడును. గాయత్రి వేదములకు తల్లి, ఆదిశక్తి.

సంధ్యోపాసన : నారదా! సంధ్యావిధాన క్రమము తెలిపెదను. కేశవ మొదలగు నామములను ఉచ్చరించి ప్రాణాయామము చేసిన తరువాత సంధ్యోపాసన యందు ప్రవృత్తుడు కావలెను.

కేశవా! నారాయణా! మాధవా! గోవిందా! మధుసూదనా! త్రివిక్రమా! వామనా! శ్రీధరా! హృషీకేశా! పద్మనాభా! దేమోదరా! సంకర్షణా! వాసుదేవా! ప్రద్యుమ్నా! అనిరుద్దా! పురుషోత్తమా! అధోక్షజా! నారసింహా! అచ్యుతా! ఉపేంద్రా! జనార్దనా! హరి! శ్రీకృష్ణా! ఈ ఇరువది నాలుగు నామములకు ముందు ఓంకారమును చివరకు స్వాహా నమః జోడించి ఉచ్చరించి నామమును ఆచమనము చేయవలయును.

ఓం కేశవాయ నమః ఓం నారాయణాయ నమః ఓం మాధవాయ నమః – మూడు నామమంత్రములతో ఆచమనము చేసి ఓం గోవిందాయ నమః, ఓం మాధవాయ నమః – ఈ రెండు మంత్రములతో చేతిని ప్రక్షాళనము చేసికొనవలెను. మధుసూదనుడు త్రివిక్రముడు ఈ రెండు నామములతో బొటనవ్రేలియొక్క మూలము ద్వారా పెదవిని అట్లే 'వామన', 'శ్రీధర' నామములతో ముఖమును తుడుచుకొనవలెను.

హృషీకేశుని ఉచ్చరించి ఎడమచేతిని పద్మనాభుని రెండు పాదములను, దామోదర మంత్రముతో మస్తకమును, వాసుదేవ ప్రద్యుమ్న ఈ రెండు నామములతో అంగుష్ఠమును, చూపుడువ్రేలి ద్వారా రెండు నాసాపుటములను, అనిరుద్ధ పురుషోత్త నామములు రెండిటితో బొటనవ్రేలిని, అనామిక ద్వారా రెండు నేత్రములను తాకవలెను.

అధోక్షజ, నారసింహ ఈ రెండు మంత్రముల ద్వారా రెండు చెవులను, అచ్యుత నామముచ్చరించుచు కనిష్ఠను, అంగుష్ఠము ద్వారా నాభిని, జనార్దన మంత్రముతో అరచేతి ద్వారా హృదయమును ఉపేంద్రనామముతో తలను, ఓం హరయే నమః ఓం కృష్ణాయ నమః ఈ రెండు నామములతో దక్షిణ వామ భుజములను తాకవలెను. ఈ విధంగా నామముల ద్వారా ప్రతి అంగము తాకవలెను.

కుడి చేతితో నీరు త్రాగునపుడు ఎడమ చేతితో కూడా ఆ పాత్రను తాకవలెను, చేతిముద్ర గోవు చెవి ఆకారమున ఉండవలెను. మినుప గింజ మునుగునంత నీరు త్రాగు విధానము కలదు.

ప్రాణాయామము ఓంకారము నుచ్చరింపవలెను. ప్రణవము స్మరించుచు గాయత్రిని జపించవలెను. నాసిక యొక్క దక్షిణ (కుడి) రంధ్రము నుండి వాయువును పీల్చుకొనవలెను. వామ (ఎడమ) రంధ్రము నుండి వాయువును నింపవలెను. ఈ ప్రక్రియనే రేచక, పూరక, కుంభక, ప్రాణాయామమని అందురు.

వాయువును పీల్చునపుడు దక్షిణ నాసికను అంగుష్టముతో అణచి పట్టుకొనవలెను. కనిష్ఠక, అనామిక రెండు వ్రేళ్ళతో ఎడమనాసికను మూసివేయవలెను.

వాయువును సృష్టించునది రేచకము, పూరించునది పూరకము, సమస్థితిలో ధరించునది కుంభకము అని ఈ ప్రాణాయామము వలన తెలియును. పూరకమును చేయునపుడు విష్ణువును నాభి ప్రదేశమున ధ్యానించవలెను.

కుంభకము చేయునపుడు బ్రహ్మను హృదయము నందు ధ్యానించవలెను. రేచకము చేయు సమయమున మహాదేవుని లలాటము నందు ధ్యానించవలెను. పూరక ప్రాణాయామముతో పురుషుడు విష్ణువు సాయుజ్యమును, కుంభకముతో బ్రహ్మపదమును రేచకముతో శంకరుని మూడవ పదమునకు అధికారి కాగలడు.

గృహస్థుడు, వానప్రస్థుడు, ప్రణవమునుచ్చరించుచు ఐదు వ్రేళ్ళతో నాసికాగ్రభాగమును ఒత్తి పట్టుకొనవలెను. ఈ ముద్ర వలన సమస్త పాపములు భస్మమగును.

దోసిలియందు నీటిని తీసుకొనవలెను. తర్జని అంగుష్ఠములను దోసిలినుండి నేరుగా నుంచవలెను. సూర్య నారాయణుని వైపునకు చూచి గాయత్రి మంత్రముతో అభిమంత్రించిన జలమును ఆ స్వామికి అర్పణ చేయవలయును.

ఉపాసకుడు సూర్యమంత్రమును పఠించుచు స్వామికి ప్రదక్షిణ చేయవలయును. ప్రాతఃకాలమునందు కొంత నమ్రుడై (వంగి) మధ్యాహ్న సమయమున దండము వలె నిటారుగ నిలుచుని, సాయంకాలము నందు కూర్చొనియే ద్విజుడు భగవంతుడగు సూర్యునకు జలము నర్పించవలెను.

అర్ఘ్యము నిచ్చుటకు కారణము వినుము. మందేహులను రాక్షసులు సూర్యుని తినవలెనని తలంచిరి. మునిగణములు మహాసంధ్యను ఉపాసించిరి. దోసిలిలో జలమును నింపుకొని వదలిరి. ఆ జలము వజ్రముతో సమానము, దైత్యులు భస్మమైరి.

సంధ్యోపాసన క్రియ మహాపుణ్యముల జనని. అర్ఘ్యధ్యానమంత్ర మిట్లు చెప్పబడినది. ఆ సూర్యుడను నేనే. నేనే ఆత్మజ్యోతిని, నేనే శివబంధమైన జ్యోతిని. ఆత్మజ్యోతి నా రూపమే. నేను శర్వశుక్ల జ్యోతిని. నేను రసస్వరూపుడను. భగవతి గాయత్రి నీవు బ్రహ్మస్వరూపిణివి.

ఈ జలమయ అనుష్ఠానమును సఫలమొనరించుటకు నీవిచటకు యేతెంచుము. నా హృదయమున ప్రవేశింపుము, దేవీ లెమ్ము. ఈ అర్ఘ్యజలము నందు దయచేసి ప్రవేశింపుము. దేవీ! మరలా నాకు దర్శనమొసగుము.

క. నే నర్కుడ నే జ్యోతిని
నే నాత్మను జ్యోతి శివుడ నిక నెన్నంగా
నే నాత్మజ్యోతిని తెలు
పై నట్టిడ రసము నేన యఖిలజ్యోతిన్ ॥

తే.గీ. బ్రహ్మరూపిణి గాయత్రి వరదదేవి
స్మరణ సేయంగ సిద్ధించుకొరకు నాదు
హృదయమధ్యంబునను బ్రవేశించుమమ్మ
రమ్ము రారమ్ము భగవతీ రమ్ము రమ్ము.

తే.గీ. దేవి భగవతి కల్యాణి దివ్యమూర్తి
మరలి వచ్చుటకై నీవు తరలిపొమ్ము
అర్ఘ్య జలముల నా హృదయంబు సేరు
లెమ్ము లేలెమ్ము గాయత్రి లెమ్ము లెమ్ము ॥ (మ.క.దా.శ్రీ.)

అర్ఘ్యము ఒసగిన పిమ్మట పవిత్ర స్థలము నందు ఆసనారూఢుడై వేదమాత గాయత్రిని జపించవలెను. మునీంద్రా! ప్రాణాయామము ఖేచరీ ముద్రను సంతరించుకొనవలెను. మమతానురాగములను, హృదయము నుండి పరిత్యజించి ఆసనారూఢుడై స్థిరచిత్తుడైయుండవలెను.

సిద్ధాసన మెట్లనిన ఒక పాదము వృషణముల క్రిందను, వేరొక పాదము లింగముపైన గట్టిగా నుంచి ఏకాగ్రచిత్తముతో శరీరము నిలువుగ దండమువలె నుంచవలెను. చూపులను కనుబొమల నడుమ నిలుపవలెను.

గాయత్రి ఆవాహనము, నమస్కారమంత్రము వినుము.

ఆ.వె. వరదయైన దేవి వచ్చుగావుత నక్ష
రమ్ము బ్రహ్మ సమ్మితమ్ముగాగc
గరము వెలయునట్టి గాయత్రి గొల్చెద
వేదమాత దీని వినుము కనుము

క. రేపొనరించిన పాపము
రేపే పోగొట్టుమమ్మ శ్రీమతి దేవీ
మాపొనరించిన పాపము
మాపే వెడలింపుమమ్మ మా జనయిత్రీ!

తే.గీ. సర్వవర్ణ మహాదేవి సంధ్య యో స
రస్వతీ దేవి యజరామరా సమస్త
దేవి నీ కిదే మ్రొక్కెద త్రిజగదీశి
యని నమస్కార మొనరింపనగు మునీంద్ర (మ.క.దా.శ్రీ.)

దేవిని ఆవాహనము చేసి, నేను చేసిన యీ అనుష్ఠాన మంత్రమును పూర్తియగు గాక! ఇట్లు క్షమాప్రార్థన చేయవలయును. బ్రహ్మను స్మరించుటతో బ్రహ్మ శాపనివృత్తి, విశ్వామిత్రుని స్మరించిన అతనివలన కలిగిన శాప నివృత్తి, వశిష్టుని తలచినచో అతనివలన కలిగిన శాపము నశించును.

చిద్రూపుడు, పరమాత్ముడని నేను ధ్యానించుచున్నాను అని హృదయము నర్పించవలెను.

న్యాసవిధానము : సంధ్యోపాసనకు ప్రముఖ అంగము, మొదట ఓంకారమును ఉపయోగించి మంత్రమునుచ్చరించవలెను.

'ఓం భూః పాదాభ్యాం నమః' ఇదియే ఉచ్చారణా విధానము, నియమము, 'ఓం మహః నాభ్యై నమః' 'ఓం జనః హృదయాయనమః' 'ఓం తపః కంఠాయ నమః' 'ఓం సత్యం లలాటాయ నమః' 'ఓం వరేణ్యం తర్జనీభ్యాం నమః' 'ఓం భర్గోదేవస్య మధ్యమాభ్యాం నమః' 'ఓంధీమహి అనామికాభ్యాం నమః' 'ఓంధియో యోనః కనిష్ఠికాభ్యాం నమః' 'ఓం ప్రచోదయాత్ కరతల కరపృష్టాభ్యాం నమః' ఇట్లు అంగుష్ఠాదిన్యాసము చేయవలెను.

'ఓం బ్రహ్మాత్మనే తత్సవితుర్ హృదయాయ నమః'

'ఓం విష్ణవాత్మనే వరేణ్య శిరసే నమః' 'ఓం రుద్రాత్మనే భర్గో దేవస్య శిఖాయై నమః' 'ఓం సత్యాత్మనే ధీమహి కవచాయ నమః ఓం సర్వాత్మనే ప్రచోదయాత్ నమః అస్త్రాయఫట్" ఈ విధంగా హృదయాదిన్యాసములు చేయవలెను.

భగవతి గాయత్రీ ధ్యానము : పరమేశ్వరి శ్రీ విగ్రహము, జపాకుసుమ ప్రతిభతో ప్రకాశిస్తున్నది, దేవి కుమారి అవస్థయందు విరాజిల్లుచున్నది.

ఎఱ్ఱచందనము ఆ లేపనముతో, ఎఱ్ఱనిమాల కలిగి, నాలుగు ముఖములతో, రెండు భుజములతో ఎర్రని వస్త్రములు ధరించియున్నది.

ఈమె ప్రతి ముఖమునందు రెండు రెండు నేత్రములు గలవు. ఈమె స్రుక్కు, స్రువం, జపమాల, కమండలములను ధరించియున్నది. ఈమె ఋగ్వేదము నధ్యయనము చేయుచున్నది. ఈమె వాహనము హంస, బ్రహ్మను ఈ దేవి తనహృదయమునందు చేసుకొని ఉపాసించును.

ఋక్, యజు, సామ, అధర్వ వేదములు నాలుగు పాదములు. పూర్వ, దక్షిణ, పశ్చిమ, ఉత్తర, ఊర్ధ్వ, అధః, అంతరిక్ష, అవాంతర మొదలగు దిశలు ఎనిమిది కుక్షులందు శోభిల్లుచుండును. వ్యాకరణము, శిక్షా, కల్పము, నిరుక్తము, జ్యోతిషము, ఇతిహాస పురాణములు, ఉపనిషత్తులు – ఇవి, భగవతి యొక్క ఏడు శిరములు. అగ్ని ముఖము నందు, రుద్రుని శిఖ యందు, విష్ణు చిత్తము నందు శోభిల్లుచుందురు. ఇట్లు భగవతిని ధ్యానించవలెను.

ఆ దేవి ఆదిత్య మండలమున విరాజమానయైయుండును. ఆ భగవతిని హృదయము నందు ధ్యానించవలెను.

దేవిని ప్రసన్నురాలిని చేయు ముద్రలు 24 :

1. సుముఖము, 2. సంపుటము, 3. వితతము, 4. విస్తృతము, 5. ద్విముఖము, 6. త్రిముఖము, 7. చతుర్భుజము, 8. పంచముఖము, 9. షణ్ముఖము, 10. అధోముఖము, 11. వ్యాపకాంజలి, 12. శకటము, 13. యమపాశము, 14. గ్రంథితము, 15. సమ్ముఖోన్ముఖము, 16.ప్రలంబము, 17. ముష్టికము, 18. మత్స్యము, 19. కూర్మము, 20. వరాహము, 21. సింహాక్రాంతము, 22. మహాక్రాంతము, 23.ముద్గరము, 24. పల్లవము. ఇవి ఇరువది నాలుగు ముద్రలు.

ఆ తరువాత విద్వాంసులు నూరు అక్షరములతో గల గాయత్రిని ఆవృతి చేయవలయును. గాయత్రి యొక్క ఇరువది నాలుగు అక్షరములు వర్ణించబడియేయున్నవి.

"జాతవేధసే సునవామ సోమ" "త్ర్యంబకం యజామహే" ఈ వైదిక మంత్రములతో పాటే ఉచ్చరించినచో నూరు అక్షరముల గాయత్రి మంత్రము సంపన్నమగును.

ఈ జపమునకు ముందు "ఓం భూర్భువః స్వః తత్సవితుర్వ రేణ్యం భర్గో దేవస్యధీమహి ధియో యో నః ప్రచోదయాత్" అను గాయత్రి మంత్రమును జపించవలెను. ఇట్లు నిత్యము జపించు శ్రేష్ఠమానవుడు సంధ్య యొక్క సకలఫలములను పొంది పరమసౌఖ్యమును పొందును.

8. గాయత్రి మహిమ - పూజ చేయుట

నారదా! సువ్రతా! ధర్మశాస్త్రములందు పురాణములందు ఇతిహాసములందు గాయత్రిజపము అనేకవిధములుగా చెప్పబడినది. ఐదు ప్రణవములు గల గాయత్రిని ఆరాధించవలెనని కూడ శాస్త్రముల ఆదేశమున్నది.

గృహస్థుడు, బ్రహ్మచారి మోక్షగామియైన పురుషుడు ఓంకారముతో కూడిన తురీయపాదమును జపించవలెను. గాయత్రి యొక్క తురీయ పాదము 'పరోరజసే సావదోమ్' అనునదియే.

చిదానందమగు హృదయము నందు సూర్యుడు, చంద్రుడు, అగ్నుల రూపమైన ప్రణవరూపము, అచలము, పరమ సూక్ష్మము, జ్యోతి స్వరూపము, సచ్చిదానందమగు బ్రహ్మ నా ఆనందమునకు సాధకుడు అగును గాక.

త్రిశూలము, యోని, సురభి, అక్షము, మాల, లింగము, అంబుజము - ఈ ఏడు మహాముద్రల చేత తురీయగాయత్రిని ప్రదర్శింపవలయును.

మనస్సునందు ధ్యానించి అయిదు రకముల ఉపచారములతో ఈ దేవికి మానసిక పూజ చేయవలెను.

'లం' పృథ్వీ స్వరూపిణియగు జీవికి గంధము నర్పించెదను. 'హం' ఆకాశస్వరూపిణి యగు దేవికి పుష్పముల నొసగెదను. 'యం' ఈ వాయు స్వరూపిణీ దేవికి ధూపమిడిదెను. 'రం' అగ్ని స్వరూపిణియగు ఈ దేవికి దీపమును సమర్పించవలెను.

అమృత స్వరూపిణియగు ఈ దేవికి నైవేద్యమిడిదెను. 'యం, రం, లం, వం, హం – వీటిని ఉచ్చరించి పుష్పాంజలిని సమర్పించవలెను. నూట ఎనిమిది లేక అరువది ఎనిమిది. శక్తి లేనిచో పది సార్లైనను గాయత్రిని జపించవలెను.

జలము నుండి నిలబడి ఎప్పుడు కూడా గాయత్రిని జపించరాదు. జపము తరువాత సురభి, జ్ఞాన, శూర్ప, కూర్మ, యోని, పంకజ, లింగ – ఈ ఎనిమిది ముద్రలను ప్రదర్శింపవలెను.

ఆ తరువాత క్షమాప్రార్థన చేయవలెను. కశ్యపునితో ప్రియవచనములు పలుకు దేవీ! నా ఉచ్చారణలో అక్షర, పద, స్వర, వ్యంజనములందు దోషములు దొర్లించువాటిని దయతో క్షమింపుము.

శ్లో॥ యదక్షరపదభ్రష్టం స్వరవ్యంజనవర్జితమ్
తత్సర్వం క్షమ్యతాం దేవి కశ్యపప్రియవాదిని!
(11స్క. 17 1. 19-20 శ్లో)

ఆ తరువాత గాయత్రి తర్పణము చేయు నియమము కలదు. దీనికి ఛందస్సు గాయత్రియే.

తర్పణ నియమము : 'భూః తో ఋగ్వేద పురుషుని', 'భువః చేత యజుర్వేద పురుషుని', 'స్వర్ చేత సామవేద పురుషుని మహఃతో అధర్వవేద పురుషుని,

జనః చేత ఇతిహాసపురుషుని తపః చేత సకల ఆగమ శాస్త్రములను 'సత్యం' దీనితో సత్యలోకమను పేరుగల పురుషుని

ఓం భూః చేత భూర్లోకమను పేరుగల పురుషుని, భువఃతో భువర్లోక పురుషుని, 'స్వర్' చేత 'స్వర్లోక పురుషుని

ఓం భుః చేత ఏకపద నామముగల గాయత్రిని 'ఓం భూర్భువః' చేత చతుష్పద గాయత్రి తర్పణము విడుచుచున్నాను. ఉషసి, గాయత్రి, సావిత్రి, సరస్వతి, వేదమాత, పృథ్వి, అజా, కౌశికి, సాంకృతి, సార్వాజతి – ఈ నామములను ఉచ్చరించి భగవతికి గాయత్రికి తర్పణమిడవలెను.

ప్రాతఃకాలీన సంధ్యయని చెప్పుదురు. సంధ్య పూర్తయినవెంటనే అగ్ని హోత్రమును కూడ చేయవలయును. అంబికను, శంకరుని, గణేశుని, సూర్యుని, విష్ణువును, దేవతలను పూజించవలెను.

'శ్రీశ్చతే' ఈ మంత్రముతో పూజ చేయవచ్చును. భవానిని, మాధవుని, శంకరుని, గణేశుని, సూర్యుని స్థాపించి పూజింపవలెను, పదహారు రుక్కులను పఠించి దేవతలకు సమర్పించవలెను. మొట్టమొదట దేవిని పూజించి ఆ తరువాత దేవతలను పూజింపవలెను.

దేవర్షీ! భూతశుద్ధి, మాతృకాన్యాసమును, షడంగన్యాసమును ప్రోక్షణచేసి గురువాజ్ఞతో పూజను ప్రారంభించవలెను. పీఠమును పూజించి దేవిని ధ్యానించు విధానము కలదు.

పంచామృతము, పౌండ్రమను చెఱకు రసముతో మహేశ్వరికి స్నానము చేయించవలెను. ద్రాక్షారసముతో మహేశ్వరిని అభిషేకించినచో, అగరు, కుంకుమ పువ్వు, కస్తూరి, కర్పూరముతో నీటితో వేద పారాయణచేయుచు నభిషేకించినచో పాలతో నిండిన కలశముతో దేవికి స్నానము, పెరుగుతో అభిషేకము, తేనె నెయ్యితో అభిషేకము, రెండు పట్టు వస్త్రములు, బిల్వపత్రములు సమర్పించవలెను.

బిల్వపత్రము మీద రక్తచందనముతో 'హ్రీం' మూడు సార్లు వ్రాయవలెను. నమః శబ్దమును జోడించవలెను. 'ఓం హ్రీం భువనేశ్వర్యై నమః' అని ధ్యానిస్తూ, అనేక పుష్పములతో పూజించవలెను.

కాలాగురు, కర్పూరము, చందనము, కేసరము, ఘృతము, గుగ్గిలముతో మహాదేవికి ధూపమును సమర్పించి మందిరము పరిమళ భరితము చేయవలెను. భగవతి దేవేశ్వరి సాధనకు మూడు లోకములను సమర్పించును. తాంబూలము సమర్పించినచో భగవతి ప్రసన్నురాలగును.

వాద్యధ్వనులతో సంగీతముతో జగదంబను సంతోష పరచవలెను. దేవికి ఛత్రము పట్టవలెను. చామరమును వీవవలెను. అనేక దక్షిణలివ్వవలెను. పదేపదే నమస్కరించి క్షమించవలెనని ప్రార్థన చేయవలెను. ఈ విషయము చెప్పునపుడు బృహద్రథుని కథ ఒకటి ఉన్నది. నీకు తెలిపెదను వినుము. రాజు బృహద్రథునకు సంబంధించిన కథ. అతడొకసారి హిమాలయ పర్వతము నందు చక్రవాక పక్షిగా జన్మించియుండెను. అనేక దేశములు తిరుగుతూ కాశీనగరము చేరెను. ఆ చక్రవాక పక్షి అదృష్టవశాత్తు అన్నపూర్ణ దివ్యస్థానమున తిరుగుచు దేవీ మందిరము ప్రదక్షిణము చేసెను. అక్కడనే వుండిపోయెను. ఆ తరువాత కొన్ని దినములకు మరణించి స్వర్గమునకు వెళ్ళెను.

స్వర్గములో రెండు కల్పములుండెను. ఉత్తమ క్షత్రియ వంశము నందు ఆవిర్భవించి బృహద్రథుడను పేరుతో ప్రసిద్ధి చెందెను. అయితే అతనికి పూర్వజన్మ విషయములన్నియు జ్ఞాపకముండెను. ముని గణములు అచటికి వచ్చిరి.

రాజా! ఏ పుణ్య ప్రభావమున మీరు పూర్వజన్మ స్మృతిని కలిగియున్నారు? మీ జ్ఞాన రహస్యము నెరుగుటకే మేమిచటకు వచ్చితిమి అని కోరగా మునివరులారా! నేను త్రికాలజ్ఞుడను. ఈ జన్మకు ముందు

చక్రవాకమను నీచయోని యందు నా జన్మము జరిగెను. నేను కాశిదేవి మందిరమునకు ప్రదక్షిణ చేసితిని.

ఆ పుణ్య ప్రభావముతో నేను స్వర్గమునకు వెళ్ళితిని. రెండు కల్పములచట సుఖముల ననుభవించితిని. ఇప్పుడు ఈ భూమండలమున జన్మించితిని. నాకు మూడు కాలములందు జరుగు విషయములు తెలిసికొను శక్తి లభించినది. భగవతిని నిరంతరము ధ్యానించడమే శ్రేష్ఠమైన కార్యము అని మునులందరికి చెప్పగా సంతోషించిరి.

9. మధ్యాహ్న సంధ్య - సాయంసంధ్య

మధ్యాహ్న కాలీన సంధ్య పుణ్యప్రదము. భగవతి గాయత్రి నిరంతరము యౌవన సంపన్న. త్రిశూలమును చేతియందు ధరించి వృషభ వాహనా రూఢయైయుండును. యజుర్వేద సంహిత యందు ఈ జనని మహిమగానము చేయబడినది.

మధ్యాహ్న సమయమున ''ఆకృష్ణేన'' ఈ మంత్రముతో పుష్పములను జలమును సూర్యునకు నివేదించవలెను. యత్నపూర్వకముగ అర్ఘ్యమిచ్చుట వలన పురుషుడు సాంగోపాంగ సంధ్యాఫలమునకు అర్హుడగును.

తర్పణ విధానము "భువః పురుషం తర్పయామి నమోనమః", "యజుర్వేదం తర్పయామి నమోనమః" ఓం మండలం తర్పయామి ఓం హిరణ్య గర్భం తర్పయామి. ఓం అంతరాత్మానం తర్పయామి, ఓం సావిత్రీం తర్పయామి, ఓం దేవసేనా తర్పయామి, ఓం సాంకృతి తర్పయామి, ఓం సంధ్యాంతర్పయామి, ఓం యువతిం తర్పయామి, ఓం రుద్రాణీం తర్పయామి, ఓం నిమ్రజాం తర్పయామి, ఓం సర్వార్థ సిద్ధికరీం తర్పయామి, ఓం సర్వమంత్రార్థ సిద్ధిదాంతర్పయామి, ఓం భూర్భువః పురుషంతర్పయామి, నమోనమః శబ్దములను జోడించి తర్పణమివ్వవలెను. ఇదియే మధ్యాహ్న తర్పణవిధానము.

ప్రాతఃకాల జపసమయమున రెండు చేతులను పైకెత్తి, సాయంకాలము నందు క్రిందికి ఉంచి, మధ్యాహ్న సమయమున హృదయముపై నుంచి జపించవలెను. వెయ్యి గాయత్రులను జపించినచో మహాపాపియగు బ్రాహ్మణుడు కూడా పవిత్రుడగును.

త్రాసునందు నాలుగు వేదములు పఠనములను, రెండవ వైపు గాయత్రీ జపము నుంచి తూచినచో గాయత్రి జపమే ఉత్తమమని గోచరమగును.

బ్రహ్మయజ్ఞము చేయుచున్నానని సంకల్పము చేసి మూడుసార్లు గాయత్రిని జపించి 'ఓం అగ్నిమీళే, యదంగే, అగ్నిర్వై, అథ మహావ్రతంచైవ పంథా' మొదలగు మంత్రములను పఠించవలెను.

దేవతలకు తర్పణమిడి ప్రదక్షిణ చేయవలయును. ప్రజాపతి యమధర్మరాజు మొదలగు నామములనుచ్చరించి తర్పణ మిడవలెను.

ఋషులకు తర్పణము ఇవ్వవలెను. శతర్చి, విశ్వామిత్ర, వామదేవ, అత్రి, భరద్వాజ, వశిష్ట మొదలగు అశ్వలాయన వరకు ఆచార్యులందరిని గుర్తు పెట్టుకొని తర్పణమివ్వవలెను.

నా వంశమునందు ఎవరైనను పుత్రులు లేనివారు నా గోత్రమునకు సంబంధించినవారు దివంగతులైయున్నచో వారందరికి తర్పణమివ్వవలెను.

ఈ బ్రహ్మయజ్ఞము ఉత్తమ విధానమును పాటించవలెను. అట్టివానికి వేదముల నధ్యయనము చేసిన ఫలితము లభించును. ప్రతిదినము అతిథులకు అన్నము పెట్టుట, గోవులకు గ్రాసము పెట్టుట, బ్రాహ్మణులతో కూర్చుని భోజనము చేయుట, దినమునందలి అయిదవ భాగమున ఈ ఉత్తమ కార్యమొనరించవలెను.

దినము ఆరవ, ఏడవ భాగములందు ఇతిహాస పురాణాది స్వాధ్యయనము నందు కాలము గడుపవలెను. ఎనిమిదవ భాగము

మాత్రమే లౌకిక కార్యములకు వినియోగించవలెను. దీని తరువాతనే సాయంసంధ్య చేయవలయును.

సాయంకాలము సంధ్య చేయు విధానము – సరస్వతిని ధ్యానించి భగవతి కృష్ణవర్ణ వస్త్రములతో హస్తములందు శంఖము, చక్రము, గద, పద్మములు ధరించియున్నది. గరుడ వాహనము మీద అమరియున్నది. సూర్యమండలము నుండియే ఇపుడిచటకు వచ్చుచున్నది.

"అపో హిష్టా" మంత్రముతో 'అగ్నిశ్చేతి' మంత్రముతో ఆచమనము చేయవలయును. మిగిలిన కర్మలన్నియు ప్రాతఃకాలసంధ్యతో సమానముగా చెప్పబడినది. సాధకుడు ప్రసన్నతతో గాయత్రీమంత్రమును పఠించి సూర్యునకు అర్ఘ్యమివ్వవలెను, సూర్యమంత్రముతో ఉపస్థానమొనరించి గాయత్రిని జపించవలెను.

స్వః పురుష, సామవేద, మండల, హిరణ్యగర్భ, పరమాత్మ, సరస్వతి, వేదమాత, సాంకృతి, సంధ్య, విష్ణు స్వరూపిణి, వృద్ధ సరస్వతి, ఉషసీ, నిమృజీ, సర్వసిద్ధకరీ, సర్వమంత్రాధీశ్వరి, భూర్భువః స్వః పురుషుడు ఈ నామములను ఉచ్చరించి తర్పణములివ్వవలెను. సాయంకాల తర్పణము శ్రుతితర్పణము. సంధ్యా ప్రభావమున దేవి ప్రసన్నురాలై భక్తుల కోరికలు తీర్చును.

10. గాయత్రి – ప్రాణాగ్ని హోత్ర విధానము

ఈ విధానము పఠించు వారు జనన, మరణ, జరా, రోగముల నుండి ముక్తులగుదురు. ఇరువది యొక్క తరముల వారిని ముక్తులను చేయును. హృదయ కమలమును అరణిగా, మనస్సును మంథనపు కర్రగా, వాయువును త్రాడుగా భావించవలెను.

ప్రాణరూప అగ్నియందు ఆహుతిని వేయవలెను. ప్రాణాగ్ని కొరకు ఆహుతులను సమర్పించవలెను. మొదట ఓంను, చివర స్వాహాశబ్దమును ఉచ్చరించవలెను. 'ఓం ప్రాణాయస్వాహా' పలుకవలెను.

ఆహవనీయాగ్ని, గార్హపత్యాగ్ని, దాక్షిణాగ్ని, విద్యమానమై యున్నట్లు చింతన చేయవలెను.

1. 'ఓం ప్రాణాయ స్వాహా' అని పలికి ఇదమ్ ఆదిత్యదేవాయ న మమ అని చెప్పవలెను.
2. 'ఓం అపానాయ స్వాహా' అని పలికి ఇదం సోమాయ న మమ అని చెప్పవలెను.
3. 'ఓం వ్యానాయ స్వాహా' అని పలికి 'ఇదమగ్నయే న మమ' అని ఉచ్చరించవలెను.
4. 'ఓం ఉదానాయ స్వాహా' 'ఇదం వాయవే న మమ' ఇట్లు ద్విజుడు పఠించవలెను.
5. 'ఓం సమానాయ స్వాహా' 'ఇదం పర్జన్యాయ న మమ'

   'ఓం పరమాత్మనే స్వాహా' 'ఇదమాత్మనే న మమ'

ప్రాణాగ్నిహోత్ర విద్యను నీకు తెలుపుతున్నానని నారాయణుడు పలికెను. ఈ విషయాన్నే మహాకవి దాసు శ్రీరాములు గారు యిలా చెప్పారు. హృత్పుండరీకంబరణియు, మనంబు మంథనంబు, వాయువు రజ్జువుగా నొనర్చి యగ్ని మథించి చక్షువను నధ్వర్యుండు తర్జనీమధ్యమాంగుష్ఠంబులచే ప్రాణంబునకు, మధ్యమానామికాంగుష్ఠంబులచే నపానంబునకు, గనిష్ఠానామికాంగుష్ఠంబులచే వ్యానంబునకు గనిష్ఠాతర్జన్యంగుష్ఠంబులచే నుదానంబునకు, నర్దాంగుళచే సమానంబునకు నాహుతులుగా నన్నంబు గొనవలయు నివియ ప్రాణాహుతులు నాబడు. ఆదిని ప్రణవంబు, నంతంబున స్వాహాకారంబని కణంబులు బుచ్చికొనవలయుc జతుర్థ్యంతంబులగు నామంబులే మంత్రంబులగు. మరియు నీ యజ్ఞంబునకు ముఖంబున

నాహవనీయంబును. హృదయంబున గార్హపత్యంబును నాభిందక్షిణాగ్నియు ధ్యానించునది.

ఇది ప్రాణాగ్నిహోత్ర విధానంబు, సంగ్రహంబుగా నీకుందెల్పితినని చెప్పి నారాయణుండు వెండియునిట్లనియె.

11. ప్రాజాపత్యాదివ్రతము

భోజనము తరువాత ఉత్తమసాధకుడు 'ఓం అమృతాపిధానమపి' ఈ మంత్రము నుచ్చరించి ఆచమనము చేయవలెను. పితరులకు అర్పించవలెను. మా కులమునందు ఉద్భవించిన దాసదాసీజనములు మా అన్నము నభిలషించువారందరు భూతలము నందుంచిన నా అన్నముతో తృప్తులగుదురుగాక. ఈ మంత్రముతో జలము నిడవలెను.

ప్రాణాగ్నిహోత్ర విశేషమగ్నుడైన బ్రాహ్మణునకు అన్నదాన మొనరించినచో పుణ్యమునకు భాగస్వామియగును. దాత, భోక్త ఇరువురికి స్వర్గము ప్రాప్తించును.

పవిత్రమును ధరించి భుజించు ప్రతికబళమును మూడువేళల అనగా ప్రాతఃకాలమున, మధ్యాహ్న సమయమున, సాయంకాలమునందు ప్రతి దినము జపము, తర్పణము, హోమము చేయవలయును. నేలమీద నిదురించవలెను. ఎల్లప్పుడు సర్వదా సర్వత్రా మైథునమును పరిత్యజించవలెను. అది బ్రహ్మచర్యకు కట్టుబడియుండినట్లే.

ఋణత్రయము – అంటే దేవఋణము, ఋషిఋణము, పితృఋణము అనునవి మూడు. వీటినుండి ముక్తుడుగాక, పుత్రుని కనక, యజ్ఞానుష్ఠానము చేయక – సన్యాసమును స్వీకరింపకూడదు.

బ్రహ్మచర్యము వలన ఋషి ఋణము, తిలోదకదానము చేత పితృఋణము, యజ్ఞములచేత దేవఋణమును పురుషుడు తీర్చుకొనును. ఆశ్రమములందుండి ధర్మము నాచరించవలెను.

చాంద్రాయణాది వ్రతములు చేయువాడు శ్రుతి, స్మృతులకు విరుద్ధముగ వ్యవహరించుట, రాత్రులందు వైదిక మంత్రములను జపించరాదు.

దైవపూజలు, స్తుతులు, శాస్త్రావలోకనము, నేలమీద శయనించుట, బ్రహ్మచర్యనియమము పాటించుట, మౌనము వహించుట, మూడు సార్లు స్నానము చేయుట, నీచకర్మలు పరిత్యజించుట, పూజలు, దానము స్తుతి, కీర్తనలు నిత్యము అతనివలన జరుగుచుండవలెను. గురువుపై దేవతలపై విశ్వాసముంచవలెను.

పరమసిద్ధిని ప్రసాదించు పండ్రెండు ధర్మములు

ప్రతిదినము సూర్యున కభిముఖముగ సావిత్రిని జపించవలెను. సకల కర్మలను దైవమునకు సమర్పించవలెను. పురశ్చరణ నియమము పాటించవలెను.

జప, హోమ, తపస్సును చేయుచు ప్రాణులమీద దయచూపవలెను. తపమొనరించు పురుషుని సకల కర్మలు సిద్ధించును. శాంతి కర్మలనన్నిటికి పురశ్చరణ చేసి ప్రారంభించవలెను.

ద్విజుడు మొదట ప్రాజాపత్యము, శిరోముండనము, గడ్డమును చేసుకొనవలెను. గోళ్ళు తీయించి పవిత్రుడు కావలెను. రాత్రి, పగలు సంపూర్ణ ధ్యానముంచవలెను. వాక్కుమీద అధికారము, సత్యము పలుకవలెను. పవిత్రమంత్రములను వ్యాహృతులను జపించవలెను.

గాయత్రి మూడు ఋక్కులు – 'ఓంకారము' చేర్చి 'ఆపోహిష్ఠా' 'పునంత్యః స్వస్తి మత్యశ్చ' 'పావమాన్య' ఇవి కూడా పవిత్రమంత్రములు. శాంతికొరకు వెయ్యిసార్లు, ఓంకారమును, త్రిపదగాయత్రిని, జపించవలెను.

ఆచార్యులకు, ఋషులకు, వేదములకు, దేవతలకు జలముతో తర్పణమిడవలెను. తల్లిదండ్రులను ద్వేషించువారితో వార్తాలాపము చేయరాదు.

ప్రాజాపత్యకృచ్ఛ్రము, తప్తకృచ్ఛ్రవ్రతము చేయుట వలన సకల పాపములు భస్మమగును.

మూడు దినములు ప్రాతఃకాలమున, మూడు దినములు సాయంకాలమున, మూడు దినములు అప్రయత్నముగ లభించు భోజనము చేయవలెను. మూడు దినములు ఉపవాసముండవలెను. ఇట్లు ప్రాజాపత్య వ్రతమొనరింపవలెను.

సాంతపన వ్రతస్వరూపము – మొదటి దినమున గోమూత్రమును, గోమయమును, గోవుపాలను, పెరుగును, నెయ్యిని, కుశోదకమును కలిపి త్రాగవలెను, రెండవ దినము ఉపవాసమొనరింపవలెను. ఇట్లు రెండు రాత్రులు కృచ్ఛ్ర, సాంతపన వ్రతములు పూర్తియైనదని భావించవలెను.

కృచ్ఛ్రవ్రతము అంటే మూడు దినముల వరకు ఒక్కొక్క కబలము, మూడు దినముల వరకు రెండు రెండు కబళములు, మూడు దినముల వరకు మూడుమూడు కబళములు తినుచు ఉపవాసముండవలెను. ఇట్లు ద్విజుడు కృచ్ఛ్రవ్రతము చేయవలెను.

పండ్రెండు దినములు ఉపవాసముండవలెను. ఇలా చేసినచో సకల పాపములు నశించును.

చాంద్రాయణ వ్రత విధానము – కృష్ణ పక్షము నందు ఒక్కొక్క కబళము తక్కువ చేసి, శుక్లపక్షమున ఒక్కొక్క గ్రాసము ఎక్కువ చేసి, అమావాస్య ఏమియు తినరాదు. ఈ చాంద్రాయణ వ్రతము నందు త్రికాల స్నానమాచరించు నియమము గలదు.

గాయత్రి పురశ్చరణముతో సకల కోరికలు సిద్ధించును. పాపములను పెకలింపచేయు ఈ గాయత్రి ఉపాసనశుద్ధి కొరకు వ్రతము నాచరించవలెను. గోపనీయమైన, శ్రుతుల సారమైన దీనిని సాధారణ మానవునకు తెలుపరాదు.

12. శాంతి కొరకు గాయత్రి మంత్రము

నారాయణుడు నారదునితో గాయత్రి శాంతికోసం ఏమేమి చేయవలెనో చెప్పుటకు పూనుకొనెను. గాయత్రిని జపించి ద్విజుడు హవనము చేసిన భౌతికరోగములు నశించి గ్రహశాంతికి జపహోమముల తరువాత దోసిలియందు నీటిని ఉంచుకొని సూర్యభగవానునకు తర్పణమివ్వవలెను.

మోకాలిలోతు నీటి యందు గాయత్రిని జపించిన పురుషుడు సకల దోషముల నుండి ముక్తుడగును. కంఠము వరకు నీటి యందు మునిగి జపము చేసినచో ప్రాణాంతకభయము తొలగును.

బంగారము, వెండి, రాగి, మట్టి లేక పాలు గల కర్రపాత్ర యందు పంచగవ్యము నుంచవలెను. మండుచున్న అగ్నియందు పాలవృక్ష సమిధలతో ఒక వెయ్యి గాయత్రి మంత్రములను ఉచ్చరించి పంచగవ్యముతో హవనము చేయవలయును.

భూమి మీద చతురస్ర మండలమును లిఖించి గాయత్రి మంత్రమును చదివి దాని మీద త్రిశూలము నలంకరించి ఉంచవలెను. ఆ త్రిశూలమును నేలలో పాతవలయును. దివ్య కలశమును స్థాపించవలెను. వెయ్యి గాయత్రీ మంత్రములతో నభిమంత్రించవలెను. అభిషేకము సమాప్తమగుట తోడనే ఋత్విజులకు దక్షిణగా వందగోవుల నివ్వవలెను.

ద్విజుడు శనివారము నాడు మర్రివృక్షము క్రింద వందసార్లు గాయత్రిని జపించవలెను. తిప్పతీగను క్షీరము నందు కలిపి అగ్నియందు ఆహుతి నివ్వవలెను. ఇట్టి హోమమును 'మృత్యుంజయ'మందురు.

మట్టిపెళ్ళను నూరుసార్లు గాయత్రితో అభిమంత్రించి, దానిని ఏ దిశకు విసరిన ఆ దిశనుండి అతనికి అగ్నిభయము, గాలి భయము, దొంగల భయముండదు. గాయత్రిని జపించి దర్భలతో ఎవరికైన తాకించిన విషభయము తొలగి పోవును.

మౌనముగ నుండి అన్నపానీయములు స్వీకరించకుండ నిరాహారియై మూడు రాత్రులు జపము చేసినచో యమపాశము నుండి ముక్తుడగును.

ఒక సంవత్సరము జపము చేసిన ఋషియగును. రెండు సంవత్సరములు చేసిన పలికిన పలుకు తప్పక అయి తీరును. మూడు సంవత్సరములు జపించిన త్రికాలదర్శియగును. నాలుగు సంవత్సరములు జపించిన సూర్యుడు ప్రత్యక్షమగును. అయిదు సంవత్సరములు జపించిన అణిమాది సిద్ధులు ప్రాప్తించును. ఆరు సంవత్సరములు జపించిన తన కిష్టమైన రూపము పొందవచ్చును.

ఏడు సంవత్సరములు జపించిన దైవత్వము, తొమ్మిది సంవత్సరములు జపించిన మనుత్వము (మనువు) పొందును. పది సంవత్సరములకు ఇంద్ర పదవి. పదకొండు సంవత్సరములకు ప్రజాపతి, పండ్రెండు సంవత్సరములకు బ్రహ్మపదము పొందుయోగ్యత కలిగించును. ఆచారవంతుడైన పురుషుడు ఎల్లవేళలా ధన్యుడగుట సత్యము. మానవునకు సుఖము సులభమగును.

13. గాయత్రి ప్రాముఖ్యత

నారదుడు ప్రభూ! సదాచార విధానము, భగవతి యొక్క అమృతగాథను, చాంద్రాయణ వ్రతములను తెలిపితిరి. గాయత్రి యొక్క

ఇరువది నాలుగు వర్ణములను, ఋషులను, ఛందస్సులు వాటి దేవతలు ఇదంతయు తెలుపమని కోరెను.

నారాయణుడు మునీంద్రా! ఏ అనుష్ఠానము చేయకపోయినను గాయత్రిని అనుష్ఠించి, మూడు సంధ్యలందు సూర్య భగవానునికి అర్ఘ్యమివ్వవలెను.

గాయంత్రి యందలి 24 అక్షరములకు సంబంధించి వేరువేరుగా ఋషులు

1) వామదేవుడు, 2) అత్రి, 3) వశిష్ఠుడు, 4) శుక్రుడు, 5) కణ్వుడు, 6) పరాశరుడు, 7) విశ్వామిత్రుడు, 8) కపిలుడు, 9) శౌనకుడు, 10) యాజ్ఞవల్క్యుడు, 11) భరద్వాజుడు, 12) జమదగ్ని, 13) గౌతముడు, 14) ముద్గలుడు, 15) వేదవ్యాసుడు, 16) లోమశుడు, 17) అగస్త్యుడు, 18) కౌశికుడు, 19) వత్సుడు, 20) పులస్త్యుడు, 21) మాండుకుడు, 22) దుర్వాసుడు, 23) నారదుడు, 24) కశ్యపుడు - వీరు 24 ఋషులుగ చెప్పబడుదురు.

గాయత్రి 24 అక్షరములకు సంబంధించిన ఛందస్సులు

1) గాయత్రి, 2) ఉష్ణిక్, 3) అనుష్టుప్, 4) బృహతీపంక్తి, 5) తిష్టుప్, 6) జగతి, 7) అతిజగతి, 8) శక్వరి, 9) అతిశక్వరి, 10) ధృతి, 11) అతిధృతి, 12) విరాట్, 13) ప్రస్తార, 14) పంక్తి, 15) కృతి, 16) ప్రకృతి, 17) ఆకృతి, 18) వికృతి, 19) సంకృతి, 20) అక్షరపంక్తి, 21) భూః, 22) భువః, 23) సువః, 24) జ్యోతిష్మతి - ఇవి ఇరువది నాలుగు ఛందస్సులు.

గాయత్రి ఇరువది నాలుగు అక్షరములకు సంబంధించిన దేవతలు

1) అగ్ని, 2) ప్రజాపతి, 3) చంద్రుడు, 4) ఈశానుడు, పంచమ షష్ఠమలందు సూర్యుడు, 7) బృహస్పతి, 8) మిత్రావరుణుడు, 9) భవుడు, 10) ఈశ్వరుడు, 11) గణేశుడు, 12) త్వష్ట, 13) పూష,

14)ఇంద్రాగ్నులు, 15) వాయువు, 16) వామదేవుడు, 17) మైత్రావరణి, 18) విశ్వేదేవులు, 19) మాతృక, 20) విష్ణువు, 21) వసుగణములు, 22) రుద్రుడు, 23) కుబేరుడు, 24) అశ్వనీకుమారులు – ఈ విధముగ ఇరువది నలుగురు దేవతలు.

గాయత్రి 24 వర్గముల శక్తులు

1) వామదేవి, 2) ప్రియా, 3) సత్యా, 4) విశ్వా, 5) భద్రవిలాసిని, 6) ప్రభావతి, 7) జయా, 8) శాంతా, 9) కాంతా, 10) దుర్గా, 11) సరస్వతి, 12) విద్రుమా, 13) విశాలేశా, 14) వ్యాపినీ, 15) విమలా, 16) తమోపహారిణీ, 17) సూక్ష్మా, 18) విశ్వయోనీ, 19) జయా, 20) వశా, 21) పద్మాలయా, 22) భద్రా, 23) పరాశోభా, 24) త్రిపదా – ఇరువది నాలుగు వర్ణములకు ఇరువది నాలుగు శక్తులుగ చెప్పబడినవి.

గాయత్రి 24 వర్ణములకు చెందిన పుష్పములు

1) చంపా! అతసీ పుష్పములు, 2) పగడము, 3) స్ఫటికము, 4) కమలపుష్పము, 5) బాలసూర్యుడు, 6) శంఖ కుందేందులతో సమానము, 7) పగడము, 8) పద్మపత్రము, 9) పద్మరాగము, 10) ఇంద్ర నీలమణి, 11) ముత్యము, 12) కుంకుమ, 13) కాటుక, 14) రక్తము, 15) వైడూర్యము, 16) తేనె, పసుపు, 17) కుందము, 18) పాలమిశ్రణము, 19) సూర్యకాంతము, 20) చిలుక తోక, 21) శతపత్రము, 22) కేతకీ, 23) మల్లిక, 24) కరవీరము – ఇవి ఇరువది నాలుగు వర్ణములు. మహాపాపములను నశింపచేయు శక్తి వీటికి కలదు.

గాయత్రి 24 వర్ణముల తత్త్వములు

1) పృథివీ, 2) జలము, 3) తేజస్సు, 4) వాయువు, 5) ఆకాశము, 6) గంధము, 7) రసము, 8) రూపము, 9) శబ్దము, 10) స్పర్శ,

11) ఉపస్థ, 12) పాయువు, 13) పాదము, 14) హస్తము, 15) వాగింద్రియము, 16) నాసిక, 17) జిహ్వా, 18) చక్షువు, 19) త్వక్కు, 20) శ్రోత్రము, 21) ప్రాణము, 22) అపానము, 23) వ్యానము, 24) సమానము – ఇవన్నియు ఇరువది నాలుగు తత్వములు.

గాయత్రి 24 వర్ణముల ముద్రలు

1) సుముఖము, 2) సంపుటము, 3) వితతము, 4) విస్తృతము, 5) ద్విముఖము, 6) చతుర్ముఖము, 7) పంచముఖము, 8) షణ్ముఖము, 9) అధోముఖము, 10) శకటము, 11) వ్యాపకాంజలికము, 12) యమపాశము, 13) గ్రథితము, 14) సన్ముఖోన్ముఖము, 15) ప్రలంబము, 16) ముష్టికము, 17) మత్స్యము, 18) కూర్మము, 19) వరాహకము, 20) సింహాక్రాంతము, 21) మహాక్రాంతము, 22) ముద్గరము, 23) తురీయ 24) పాదగాయత్రి ముద్రలుగా చెప్పబడినవి.

14. గాయత్రీ ధ్యానము – గాయత్రి కవచము

నారదుడు స్వామీ! ఏ పుణ్యప్రభావమున మానవుడు పాపముల నుండి ముక్తుడగునో అతడు బ్రహ్మరూపుడగుటకు ఉపాయమేది? అతని దేహము దేవరూపము, విశేషముగ మంత్రరూపమగుటకు సాధనమేది? ఇదంతయు నేను వినదలచుకున్నాను. న్యాసమును, విధానమును, ఋషిని, ఛందస్సున అధిదేవతను ధ్యానము విధిగా తెలుపమని కోరగా–

కం. గాయత్రీ కవచంబన
యో యతివర దానిఁ జదువ నురుదోషంబుల్
పాయును గోరిక లొదవున్ ।
శ్రేయం బది దేవిరూపు సెందినకతనన్

వ. దానికి బ్రహ్మవిష్ణు మహేశ్వరులు ఋషులు, ఋగ్యజుస్సామాథర్వణంబులు ఛందంబులు, బ్రహ్మరూపయగు గాయత్రి దేవత బీజంబు.

భర్గయనునది కీలకంబు. దియోయనునది మోక్షార్థంబున వినియోగము. నాలుగు వర్ణంబులచే హృదయంబును, నాలుగింట శిఖయు మూడింట గవచంబును, నాలుగింట నేత్రంబును, నాలుగింట నస్త్రకంబును మరియు ధ్యానంబు వినుము.

సీ. పరగ ముత్తెపుచాయ పగడంపు జాయయు హేమంబు చాయయు
నింద్ర నీల
ముల చాయయును మంచి తెలుపైన చాయయు గల ముఖంబులు
గల్గి వెలుగునెద్ది
వరలెడు తత్వార్థవర్ణరూపినియయి వరదాభయాంకుశ వరకళలను
మూడుకన్నులు గల్గి మొనసి చంద్రనిబద్ధ తతరత్నమకుటంబు
దాల్చునెద్ది

తే.గీ. శుభ్రమైన కపాలంబు శోభిత గద
శంఖ చక్రాబ్జయుగళముల్ చారులీల
మొనసి హస్తంబులనుదాల్చు మూర్తి యెద్ది
యట్టి గాయత్రి భజియింతు ననుదినంబు

సీ. తూర్పున గాయత్రి తొడరి రక్షించును వెస దక్షిణమును సావిత్రి యేలు
బ్రహ్మసంధ్యాదేవి పాలించుఁ బడమర నొగి సరస్వతి యేలు నుత్తరంబు
పార్వతి కాపాడు పావకదిక్కును యాతుధాన భయదయాతుధాన
దిక్కును గన్పెట్టుఁ దివురుచు వాయువిలాసిని దా ననిలదిశ బ్రోచు

తే.గీ. జెలగి రుద్రాణి కాచును శివుని దిశను
నుపరి బ్రహ్మాణి వైష్ణవి యెనరఁ గ్రింద
నన్నుఁ జూచుచునుందురు కన్నుఁగలిగి
సరవి నింకనుఁ దెలిపెద సంయమీంద్ర!

మరియు దత్వదంబు పాదంబులను, సవితుః పదంబు జంఘులను, వరేణ్యపదంబు కటిదేశంబును, భర్గః పదంబు నాభిని, దేవస్య పదంబు హృదయంబును, ధీమహిపదంబు గల్లంబులను ధియఃపదంబు నేత్రంబులును, యఃపదంబు లలాటంబను, నఃపదంబు మూర్ధంబును, ప్రచోదయాత్పదంబు శిఖను, రక్షించుగాక.

పదంపడి తత్తు మూర్ధంబును, సకారంబుషాలంబును, వికారంబు చక్షువులును, తుకారంబు కపోలంబులను, ర్వకారంబు నాసాపుటంబులను, వికారంబు చక్షువులను, తుకారంబు కపోలంబులను, ర్వకారంబు నాసాపుటంబులను, రేఫంబు ముఖంబును, ణికారం బూర్ధ్వోషంబను, యకారంబధ దోషంబును, భకారంబు తన్మధ్యంబును, ర్గోకారంబు చుబుకంబును, దేకారంబు కంఠదేశంబును, వకారంబు స్కంధదేశంబును, స్యకారంబు దక్షిణ హస్తంబును, ధీకారంబు వామహస్తంబును, మకారంబు హృదయంబును, హికారం బుదరంబును, ధికారంబు నాభియు, యోకారంబు కటిని, ద్వితీయయోకారంబు గుహ్యంబును, నఃకారం బూరువులను, ప్రకారంబు జానువులను, చోకారంబు జంఘులను, దకారంబు గుల్ఫదేశంబును, యాకారంబు పదయుగ్యంబును, తకారంబు వ్యంజనంబును, బరి రక్షింతురుగాత అను నియ్యది గాయత్రి కవచంబు. దీనిం బఠించినవాడు సర్వపాప విముక్తుండై బ్రహ్మనధిగమించునని చెప్పిన నారదుడు విన్నాడు.

15. గాయత్రీ హృదయము

తే.గీ. భూతభవ్యభవత్ప్రభూభూరిమహిమ
వింటి నీ వల్ల గాయత్రి విధము కొంత
దెలుపుమిక దాని హృదయంబు దేటపడగ
బాపముల దోలి పుణ్యంబు పడయగలను

కం. నారద యిదియధర్వణ । సారము నీవడిగితివి సుసాధంబుగనే
గూరిమి విన్పించెద సం । సారమహారణ్య పరశుసాధనము గదా!

సీ. ఉరు విరాడ్రూప యయ్యును మహాదేవి యయ్యును వేదమాతయై
తనరునట్టి
ఘనశుభకారిణి గాయత్రి ధ్యానించి సర్వాంగములయందు సరణిఁ దెలసి
దేవతలను వేడి భావింపవలయు బ్రహ్మాండ పిండాండము లైక్యమగుట
దేహంబులన్నియు దేవీమయంబులు నాదంబుచేత దిన్నగ భజింప

తే.గీ. వలయు నంగంబులెల్ల దేవమయములగు
దానిఁ జెప్పెద వినుమయ్య తప్పకీవు
పాపవిచ్ఛేది పుణ్యసంపాదకంబు
హిత మనంతంబు గాయత్రి హృదయమెన్న

గాయత్రి హృదయంబున కహమ్మునది ఋషి. గాయత్రి ఛందంబు పరమేశ్వరి దేవత. అంగంబులారును పూర్వోక్తంబులైతగు. విజన దేశంబునం గూర్చుండి యేకాగ్రమానసుండై ధ్యానింపవలయు. దీనియర్థన్యాసంబు సెప్పెద. మూర్ధంబున స్వర్గంబు దైవంబు, దంత పఙ్తి యశ్వినులు, నోష్ఠంబుల నుభయసంధ్యలు, ముఖంబున నగ్ని, జిహ్వాయందు సరస్వతి, కంఠంబున బృహస్పతి, స్తనంబులను అష్టవసువులు, బాహువులు మరుత్తులు.

హృదయంబునం బర్జన్యుండు, ఉదరంబున నాకాశంబు, నూరువుల గైలాస మలయంబులు, విశ్వేదేవతలు జానువులందు, గౌశియందు జంఘుంబులందు, గుహ్యంబున నయనంబులు, ఊరువుల బితరులు, పాదంబులం బృథివి, యంగుళుల వనస్పతులు, రోమంబుల ఋషులు నఖంబుల ముహూర్తంబులు, అస్థులు గ్రహంబులు గల్గి, అగ్మాసంబులు ఋతువులునై, రెప్పలు వత్సరంబులై, అహోరాత్రాదిత్యచంద్ర

స్వరూపిణియై, ప్రవరయై, దివ్యయై, సహస్రనేత్రయైన గాయత్రిం ధ్యానించెదను.

అని వెండియు తత్సవితృవరేణ్యుండును, తత్పూర్వాజయుండును, తత్ప్రాతరాదిత్యుండును, తత్ప్రాతరాదిత్య ప్రతిష్ఠయునగు తేజంబునకు మ్రొక్కెదననియిట్లు ప్రాతఃకాలంబున ధ్యానించి, రాత్రికృత పాపంబులం దొలగించుకొనుది.

సాయంకాలంబున ధ్యానించి, దినకృత పాపంబులడంచి సాయఃప్రాతఃకాలంబులం ధ్యానించి పాపంబులు లేనివాడగు, సర్వతీర్థంబుల స్నానంబు చేసినవాడగు, సర్వదేవతల నెరింగినవాడగు, నవాచ్య వచనంబువలనను, అభక్ష్యభక్షణంబు వలనను, అచోష్యదోషంబు వలనను, అభోజ్య భోజనంబు వలనను, అసాధ్య సాధనంబు వలరను, గలిగిన దోషంబు వలన నుండి పవిత్రుండగునింతియుకాక. దుష్ప్రతి గ్రహశత సహస్రంబు నుండి పూతుండగు.

సర్వ ప్రతి గ్రహదోషంబు వలన నుండి పూతుండగు. పఙ్క్తి దూషణం వలన నుండి పూతుండగు, ననృతవాదంబునుండి పవిత్రుండగు. బ్రహ్మచారి నియతాచారంబులు విడిచిన దోషంబు నుండి శుద్ధుండగు, గ్రతు సహస్రఫలంబగు, షష్ఠి శతసహస్ర గాయత్రీ జపంబు వలన గలుగు ఫలంబు లభించు, నెనమండుగురు బ్రాహ్మణులు సమ్యగ్రాహంబు సేయ దానిఫలంబు తప్పక సేకూరును.

ప్రాతస్సాయంసమయంబుల గాయత్రీ హృదయంబు జపించినవాడు పాపవిముక్తుండై బ్రహ్మలోకంబు నొందునని శ్రీమన్నారాయణుడు చెప్పిన విని నారదుండు గాయత్రీ స్తోత్రంబు సెలవిండని యడిగిన నారాయణుడు చెప్పుటకు పూనుకొన్నాడు.

16. గాయత్రీ స్తోత్రము

నారదుడు నారాయణునితో ప్రభూ! గాయత్రీ హృదయమును చెప్పి ధన్యుని చేసితివి. గాయత్రీ స్తోత్రము వినిపింపుమని కోరగా నారదా! ఆది శక్తీ నీవు జగత్తునకు జననివి.

తే.గీ. ఆదిశక్తి జగన్మాత యఖిలభక్త
లోకపోషిణి సకలలోకైకవర్తి
నియుఁ ద్రిసంధ్య సదా నిన్ను నే భజింతు
నీకు మ్రొక్కెద గాయత్రి నిఖిలధాత్రి

తే.గీ. నీవ సంధ్యవు గాయత్రి వీవ మరియు
రమ్య సావిత్రి వీవ సరస్వతివియు
బ్రాహ్మివియు వైష్ణవివియును రౌద్రివీవ
తనర రక్తపు నీవ శ్వేతవును నీవ

కం. ప్రొద్దుట బాల నడుప గటి
ప్రొద్దున యువతి మునుమాపు ప్రొద్దు ముసలియై
తద్దయ నొప్పెడి నిన్నుం
బ్రొద్దామతఁ గొల్తు రెల్ల మునులునుఁ దల్లీ

ఆ.వె. హంసమీదనుండి యా తార్క్ష్యపై నెక్కి
యెద్దు నధిగమించి ఋక్‌శ్రుతంబు
చదువుకొనుచుఁ దోతు సంతోషమున ముని
ప్రవరులకును భువిని బరమశక్తి

ఆ.వె. అంతరిక్షమందు న య్యజుర్వేదంబు
చదువుకొనుచుఁ దోతు సకలకళల
సర్వలోకములను సామగానముతోడ
దిరుగుచుందువమ్మ దివ్యశక్తి

ఆ.వె. రుద్రలోకమందు రూఢిగా నీ వుండు
విష్ణులోకమందు విడువ కుందు
బ్రహ్మలోకమందు బాయక యుందువు
తల్లి నీవు మనుజతతిని బ్రోవ

సీ. సప్తర్షులకు నీవు సంతోషజననివి బహువరంబుల నిచ్చి పరగబ్రోతు
శివునకు శివకును జెన్ను మీరగ నీవు కరయుగంబున దృగ్యుగంబునందు
ఘనతరాశ్రువులయందును స్వేదమందును జనియించితివి
సునిశ్చలత మీర
నానంద జననివి యా దుర్గవును బదివిధముల నొప్పెదు వెసనరేణ్య

తే.గీ. వెన్న వరదవును నరిష్ట వింకను వర
వర్ణినివియు గరిష్ఠవు నరవరాహ
వును వరారోహవును నీలవును సుగంగవు
దగుసంధ్యవు భోగమోక్షదపు తల్లి

సీ. మర్త్యలోకంబున మహిత భాగీరథి పాతాళమున భోగవతియు స్వర్గ
మునను మందాకిని మూడులోకంబులం బ్రవహించుదానవు భక్తజనని
భూలోకమున నీవు పొసగ ధరిత్రివై శోకదారిణివయి చొప్పడితివి
అలర భువోలోకమందు శక్తి వయితి స్వర్గంబునను దేజసాంనిధివియు
నా మహర్లోకంబు నందు మహా సిద్ధి జనలోకమందును జననివగుదు

తే.గీ. వరతపోలోకమందు దపస్వినివయి
సత్యమున సత్యవాక్కున జాలకీర్తి
దనరితివి నిన్ను బోలిన దైవమెద్ది
తల్లి గాయత్రి నిన్ను నే దలతునమ్మ

ఉ. పత్రికురంగులోకమునఁ బద్మపు పద్మజులోకమందు గా
యత్రివి శంభులోకమున నద్రిజ వెన్నగ నీ చరిత్రముల్

చిత్రము లయ్యహంకృతికిఁ జేరె మహత్తునకుం బ్రదానసం
ధాత్రివి నిన్ను గొల్చెదను తల్లి సమస్తము నీవ యెన్నఁగన్

క. సామ్యావస్థాత్మిక వతి । రమ్యవు నీ వెన్నగ శబల బ్రహ్మకళా
సౌమ్య స్వరూపిణివి స । ద్గమ్యవు పరశక్తి వఖిలధాత్రివి తల్లీ!

గాయత్రీమాతా! నీవిచ్ఛాశక్తివి, విజ్ఞానశక్తివి, క్రియాశక్తివి – గంగవు, యమునవు. విపాశవు, సరస్వతివి, సరయువవు. దేవికవు, సింధువవు, నర్మదవు, ఇరావతివి, గోదావరివి, శతద్రువవు, కావేరివి, మందాకినివి, కౌశకివి, చంద్రభాగవు, నితస్తవు, గండకివి, తపినివి, కృష్ణవు, గోమతివి, వేత్రవతివి, ఇడవు, పింగళవు, సుషుమ్నవు, గాంధారివి, హస్తిజిహ్వవు, పూషవు, అలంబవు.

హృత్పద్మస్థవగు ప్రాణశక్తివి నీవ, కంఠస్థవగు స్వప్ననాయికవు. తాలుస్థవగు సదాధారవు, బిందుస్థవగు బిందుమాలినివినీవు, మూలంబైనఁ గుండలీశక్తివినీవ, కేశమూలంబున వ్యాపినివి నీవ, శిఖామధ్యంబున శేఖరవు నీవ, శిఖాగ్రంబున మనోన్మణివి నీవు.

జగంబెల్ల నీవ తల్లీ, నీకు నమస్కరించెదనని గాయత్రీ స్తోత్రంబు సేసినవారికి బహుపుణ్యంబులు గలుగు, మహాపాపంబులు శమనంబులగు, అపుత్రకులు పుత్రవంతులగుదురు, దరిద్రులు ధనికులగుదురు. సర్వతీర్థగమన తపోదాన యజ్ఞ ఫలంబు గల్గు, భూలోకవిభవ భోగానంతరంబున మోక్షంబు గలుగును.

క. ఈ గాయత్రీస్తవమును । బాగుగ గావించెనేని ఫల మెన్నదరం
బే గురుకామదమగుఁ। మీగతి మును లనిరి సత్యమిది సత్యమగున్

తే.గీ. పతగరాజగమన శ్రుతి స్మృతి పురాణ
గోచరరహస్యము నెరింగికొంటి ముదము
గంటి మోక్షైకహేతువుగా దలిర్చు
పరమసాధన మింకొండు బలుకు మనిన.

అని పలికిన నారాయణుని మాటలు విని నారదుడు సంతోషము చెంది ప్రభూ! మానవులు, తాపసులు తప్పక ఈ స్తోత్రమును స్నాన సమయము నందు చదివినవాడు ఎక్కడైనను నీటియందు స్నానమాచరించినచో సంధ్య చేసిన ఉత్తమ ఫలములను పొందుదురు అని తెలియుచున్నది.

భక్తితో ఈ స్తోత్రమును వివినవాడు పాపముల నుండి ముక్తుడగును. సంధ్యనుద్దేశించి చెప్పబడిన ఈ స్తోత్రము అమృతముతో సమానమని పఠితలు గమనించగలరు.

17. గాయత్రీ సహస్రనామములు

నారాయణుడు నారదునితో అనఘా! నీకు సావిత్రియొక్క ఒక వెయ్యి ఎనిమిది నామములను వర్ణించెదను. చాలాకాలము క్రిందట సృష్ట్యాదియందు భగవంతుడు యీ సహస్రనామములను ప్రతిపాదించెను. వెయ్యి ఎనిమిది నామముల స్తోత్రమునకు ఋషి బ్రహ్మయని చెప్పెదరు. ఇది అనుష్టుప్ ఛందమున్నది.

భగవతి గాయత్రి దీని అధిష్ఠానదేవత. హల్ అక్షరము దీనికి బీజము స్వరములే దీనికి శక్తియని నుడివెదరు. మాతృకామంత్రమునందలి ఆరు అక్షరములే దీని అంగన్యాస, కరన్యాసులుగ చెప్పబడును. రక్త, శ్వేత, పీత, నీల, దవళ వర్ణములతో శ్రీముఖములతో సంపన్నమైనది. హంసవాహనా రూఢయైన భగవతి గాయత్రిని నేను ఉపాసించెదను.

సీ. రక్తావదాతహిరణ్య నీలధవళ వర్ణంబులును గల్గి వన్నెకెక్కి
మూడునేత్రంబులు మొగినొప్పరక్తమై రక్తమాలికలతో రహివహించు
మణిగణంబులతోడ మహిమయై సత్కుమారీ రూపమును దాల్చి పేరుగల్గి
కరతలంబున గుండికయు దమ్మిపూవును దనర నబ్జాననస్థయయి మించి

తే.గీ. మంచి పేరులు మెడc జుట్టి యంచనెక్కి
తిరుగులోకైకధాత్రి నుదీర్ణసౌఖ్య

రసవిధాత్రి నమిత కాంతిలసితగాత్రి
సాధుజనయిత్రి గాయత్రి సంస్మరింతు.

1. అచింత్యలక్షణా, 2. అవ్యక్తా, 3. అర్ధమాతృమహేశ్వరీ, 4. అమృతా, 5. అర్ణవమధ్యస్థా, 6. అజితా, 7. అపరాజితా, 8. అణిమాదిగుణాధారా, 9. అర్కమండల సంస్థితా, 10. అజరా, 11. అజా, 12. అపరా, 13. అధర్మా, 14. అక్షయసూత్రధరా, 15. అధరా, 16. అకారాదిక్షకారాంతా, 17. అరిషడ్వర్గ భేదినీ, 18. అంజనాద్రి ప్రతీకాశా, 19. అంజనాద్రినివాసినీ

20. అదితీ, 21. అజపా, 22. అవిద్యా, 23. అరవిందనిభేక్షణా, 24. అంతర్బహిఃస్థితా, 25. అవిద్యాధ్వంసినీ, 26. అంతరాత్మికా, 27. అజా, 28. అజముఖావాసా, 29. అరవింద నిభాననా, 30.అర్ధమాత్రా, 31. అర్ధదానజ్ఞా, 32. అరిమండల మర్దినీ,

33. అసురఘ్నీ, 34. అమావాస్యా, 35. అలక్ష్మీఘ్నం త్యజార్జితా, 36. ఆదిలక్ష్మీ, 37. ఆదిశక్తీ, 38. ఆకృతి, 39. అయతాననా, 40. ఆదిత్యపదవీచారా, 41. ఆదిత్యపరిసేవితా, 42. ఆచార్యా, 43.ఆవర్తనా, 44. ఆచారా, 45. ఆదిమూర్తినివాసినీ

46. ఆగ్నేయా, 47. అమరీ, 48. ఆద్యా, 49. ఆరాధ్యా, 50.ఆసనస్థితా, 51. ఆధారనిలయా, 52. ఆధారా, 53. ఆకాశాంత నివాసినీ, 54. ఆద్యక్షర సమాయుక్తా, 55. ఆంతరాకాశరూపిణీ, 56.ఆదిత్యమండలగతా, 57. ఆంతరధ్వాంతనాశినీ, 58. ఇందిరా, 59.ఇష్టదా, 60. ఇష్టా, 61. ఇందీవరనిభేక్షణా, 62. ఇరావతీ, 63. ఇంద్రప్రదా, 64. ఇంద్రాణీ, 65. ఇందురూపిణీ,

66. ఇక్షుకోదండసంయుక్తా, 67. ఇషు సంధానకారిణీ, 68. ఇంద్రనీల సమాకారా, 69. ఇడాపింగళ రూపిణీ, 70. ఇంద్రాక్షీ,

71. ఈశ్వరీదేవీ, 72. ఈహాత్రయ వివర్జితా, 73. ఉమా, 74. ఉషా, 75. ఉదునిభా, 76. ఉర్వారుకఫలాననా

77. ఉడుప్రభా, 78. ఉడుమతీ, 79. ఉడుపా, 80. ఉడుమధ్యగా, 81. ఊర్ధ్వచారిణీ, 82. ఊర్ధ్వకేశా, 83. ఊర్ధ్వాధోగతి భేదినీ

84. ఊర్ధ్వబాహుప్రియా, 85. ఊర్మిమాలా, వాగ్రంధదాయినీ, 86. ఋతా, 87. ఋషిః, 88. ఋతుమతీ, 89. ఋషిదేవనమస్కృతా, 90. ఋగ్వేదా, 91. ఋణహర్త్రీ, 92. ఋషి మండలచారిణీ, 93. ఋద్ధిదా, 94. ఋజుమార్గస్థా, 95. ఋజుధర్మా, 96. ఋతుప్రదా

97. ఋగ్వేద నిలయా, 98. ఋజ్వీ, 99. లుప్తధర్మప్రవర్తినీ, 100. లూతారివరసంభూతా, 101. లూతాదివిషహారిణీ.

102. ఏకాక్షరా, 103. ఏకమాత్రా, 104. ఏకా, 105. ఏకనిష్ఠా, 106. ఐంద్రీ, 107. ఐరావతారూఢా, 108. ఐహికా ముష్మిక ప్రదా

109. ఓంకారా, 110. ఓషధీ, 111. ఓతా, 112. ఓతప్రోతని వాసినీ, 113. ఔర్వా, 114. ఔషధసంపన్నా, 115. ఔపాసన ఫలప్రదా

116. అండమధ్యస్థితా, 117. అఃకారమనురూపిణీ, 118. కాత్యాయినీ, 119. కాలరాత్రిః, 120. కామాక్షీ, 121. కామసుందరీ

122. కమలా, 123. కామినీ, 124. కాంతా, 125. కామదా, 126. కాలకంఠినీ, 127. కరికుంభస్తనభరా, 128. కరవీరసువాసినీ

129. కల్యాణీ, 130. కుందలవతీ, 131. కురుక్షేత్ర నివాసినీ, 132. కురువింద దళాకారా, 133. కుండలీ, 134. కుముదాలయా

135. కాలజిహ్వా, 136. కరాలాస్యా, 137. కాళికా, 138. కాలరూపిణీ, 139. కమనీయగుణా, 140. కాంతిః, 141. కలాధారా, 142. కుముద్వతీ

143. కౌశికీ, 144. కమలాకారా, 145. కామచారప్రభంజనీ, 146. కౌమారీ, 147. కరుణాపాంగీ, 148. కకుబంతా, 149. కరిప్రియా

150. కేసరీ, 151. కేశవనుతా, 152. కదంబకుసుమప్రియా, 153. కాలిందీ, 154. కాళికా, 155. కాంచీ, 156. కలశోద్భవ సంస్తుతా

157. కామమాతా, 158. క్రతుమతీ, 159. కామరూపా, 160. కృపావతీ, 161. కుమారీ, 162. కుండనిలయా, 163. కిరాతీ, 164. కీరవాహనా

165. కైకేయీ, 166, కోకిలాలాపా, 167. కేతకీ, 168. కుసుమప్రియా, 169. కమండలుధరా, 170. కాళీ, 171. కర్మనిర్మూలకారిణీ

172. కలహంసగతిః, 173. కక్షా, 174. కృతకౌతుకమంగళా, 175. కస్తూరీ తిలకా, 176. క్రమా, 177. కరీంద్రగమనా, 178. కుహూః

179. కర్పూరలేపనా, 180. కృష్ణా, 181. కపిలా, 182. కుహరాశ్రయా, 183. కూటస్థా, 184. కుధరా, 185. క్రమా, 186. కుక్షిస్థాఖిలవిష్టపా

187. ఖడ్గభేటకరా, 188. ఖర్వా, 189. ఖేచరీ, 190. ఖగవాహనా, 191. ఖట్వాంగధారిణీ, 192. ఖ్యాతా, 193. ఖగరాజోపరిస్థితా

194. ఖలగ్నీ, 195. ఖండితజరా, 196. ఖండాఖ్యాన ప్రదాయినీ, 197. ఖండేందుతిలకా, 198. గంగా స్వర్గత్ గాంగతవతీతిగంగా, 199. గణేశగుహ పూజితా

200. గాయత్రీ, 201. గోమతీ, 202. గీతా, 203. గాంధారీ, 204. గానలోలుపా, 205. గౌతమీ, 206. గామినీ, 207. గాధా, 208. గంధరాప్సర సేవితా

209. గోవింద చరణాక్రాంతా, 210. గుణత్రయ విభావితా, 211. గంధర్వీ, 212. గహ్వారీ, 213. గోత్రా, 214. గిరీశా, 215. గహనా, 216. గమీ

217. గుహావాసా, 218. గుణవతీ, 219. గురుపాపప్రణాశినీ, 220. గుర్వీ, 221. గుణవతీ, 222. గుహ్యా, 223. గోప్తన్యా, 224. గుణదాయినీ

225. గిరిజా, 226. గుహ్యమాతంగీ, 227. గరుడధ్వజవల్లభా, 228. గర్వాపహారిణీ, 229. గోదా, 230. గోకులస్థా, 231. గదాధరా

232. గోకర్ణనిలయాసక్తా, 233. గుహ్యమండలవర్తినీ, 234. ఘర్మదా, 235. ఘనదా, 236. ఘంటా, 237. ఘోరదానవమర్దినీ

238.ఘృణిమంత్రమయీ, 239. ఘోషా, 240. ఘనసంపాతదాయినీ, 241. ఘంటారవప్రియా, 242. ఘ్రాణా, 243. ఘృణిసంతుష్టకారిణీ

244. ఘనారిమండలా, 245. ఘూర్ణా, 246. ఘృతాచి, 247. ఘనవేగినీ, 248. జ్ఞానధాతుమయీ, 249. చర్చా, 250. చర్చితా, 251. చారుహాసినీ

252. చటులా, 253. చండికా, 254. చిత్రా, 255. చిత్రమాల్య విభూషితా, 256. చతుర్భుజా, 257. చారుదంతా, 258. చాతురీ, 259. చరితప్రదా

260. చూలికా, 261. చిత్రవస్త్రాంతా, 262. చంద్రమఃకర్ణకుండలా, 263. చంద్రహాసా, 264. చారుదాత్రీ, 265. చకోరీ, 266. చంద్రహాసినీ

267. చంద్రికా, 268. చంద్రధాత్రీ, 269. చౌరీ, 270. చౌరా, 271. చండికా, 272. చంచద్వాగ్వాదినీ, 273. చంద్రచూడా, 274. చోరవినాసిని

275. చారుచందనలిప్తాంగీ, 276. చంచచ్చామర వీజితా, 277. చారుమధ్యా, 278. చారుగతిః, 279, చందిలా, 280. చంద్రరూపిణీ

281. చారుహోమ, 282. చారుచరితా, 283. చక్రబాహుకా, 284. చంద్రమండల మధ్యస్థా, 285. చంద్రమండల దర్పణా

286. చక్రవాకస్తనీ, 287. చేష్టా, 288. చిత్రా, 289. చారువిలాసిని, 290 చిత్స్వరూపా, 291. చంద్రవతీ, 292. చంద్రమా, 293. చందన ప్రియా

294. చోదయిత్రా, 295. చిరప్రజ్ఞా, 296. చాతకా, 297. చారుహేతుకీ, 298. ఛత్రయాత్రీ, 299. ఛత్రధరా, 300. చాయా.

301. చందఃపరిచ్ఛదా, 302, ఛాయాదేవి, 303, ఛిద్రనఖా, 304. ఛనేంద్రియ విసర్పిణీ, 305. చందోఽనుష్టుప్ ప్రతిష్ఠాంతా, 306. ఛిద్రోపద్రవభేదినీ

307. ఛేదా, 308. ఛత్రేశ్వరీ, 309. ఛిన్నా, 310. ఛురికా, 311. ఛేదనప్రియా, 312. జననీ, 313. జన్మరహితా , 314. జాతవేదాః, 315. జగన్మయీ

316. జాహ్నవీ, 317. జటిలా, 318. జేత్రీ, 319. జరామరణవర్జితా, 320. జంబూద్వీపవతీ, 321. జ్వాలా, 322. జయంతీ, 323. జలశాలినీ

324. జితేంద్రియా, 325. జితక్రోధా, 326. జితామిత్రా, 327. జగత్ప్రియా, 328. జాతరూపమయీ, 329. జిహ్వా, 330. జానకీ, 331. జగతీ

332. జరా, 333. జనిత్రీ, 334. జహ్నుతనయా, 335. జగత్త్రయ హితైషిణి, 336. జ్వాలాముఖీ, 337. జపవతీ, 338. జ్వరఘ్ని, 339. జితవిష్టపా.

340. జితాక్రాంతమయీ, 341. జ్వాలా, 342. జాగ్రతీ, 343. జ్వరదేవతా, 344. జ్వలంతీ, 345. జలదా, 346. జ్యేష్ఠా, 347. జ్యాఘోషాస్ఫోటదిఙ్ముఖీ, 348. జంభినీ, 349. జృంభణా, 350. జృంభా.

351. జ్వలన్మాణిక్యకుండలా, 352. ఝింఝికా, 353. ఝణనిర్ఘోషా, 354. ఝంఝూమారుతవేగినీ

355. ఝల్లరీ వాద్యకుశలా, 356. ఞరూపా, 357. ఞభుజా, 358. టంకబాణ సమాయుక్తా, 359. టంకినీ, 360. టంకభేదినీ

361. టంకీగణ కృతాఘోషా, 362. టంకనీయ మహోరసా, 363. టంకారకారిణి, 364. ఠఠశబ్ద నినాదిని,

365. డామరీ, 366. డాకినీ, 367. డింబా, 368. డుండుబమారైక నిర్జితా, 369. డామరీతంత్ర మార్గస్థా, 370. డమడ్డమరు నాదినీ

371. డిండీరవసహా, 372. డింభలసత్క్రీడా పరాయణా, 373. డుంఢివిఘ్నేశజననీ, 374. ఢక్కాహస్తా, 375. డిలిమ్రజా

376. నిత్యజ్ఞానా, 377. నిరుపమా, 378. నిర్గుణా, 379. నర్మదా, 380. నదీ, 381. త్రిగుణ, 382. త్రిపదా, 383. తంత్రీ, 384. తులసీ తరుణాతరుః, 385. త్రివిక్రమపదాక్రాంతా, 386. తురీయ పదగామినీ, 387. తరుణాదిత్యసంకాశా, 388. తామసీ, 389. తుహినా, 390. తురా

391. త్రికాలజ్ఞాన స్వరూపా, 392. త్రివేణీ, 393. త్రిలోచనా, 394. త్రిశక్తిః, 395. త్రిపురా, 396. తుంగ, 397. తుంగవదనా,

398. తిమింగిల గిలా, 399. తీవ్రా, 400. త్రిసోత్రా, 401. తామసాదినీ, 402. తంత్రమంత్ర విశేషజ్ఞా, 403. తనుమధ్యా, 404. త్రివిష్టపా, 405. త్రిసంధ్యా, 406. త్రిస్తనీ, 407. తోషాసంస్థా, 408. తాలప్రతాపినీ, 409. తాటంకినీ, 410. తుషారాభా, 411. తుహినాచలవాసినీ, 412. తంతుజాలసమాయుక్తా, 413. తారాహారావళిప్రియా, 414. తీర్థా, 416, తమాలకుసుమాకృతిః, 417.తారకా, 418. త్రియుతా, 419. త్రిశంకు పరివారితా, 420. తన్వీ, 421. తలోదరీ, 422. తిలాభూషా, 423. తాటంకప్రియవాహినీ, 424. త్రిజటా, 425, తిత్తిరీ, 426. తృష్ణా, 427. త్రివిధా, 428. తరుణాకృతిః, 429. తప్తకాంచన సంకాశా, 430. తప్తకాంచనభూషణా

431. త్ర్యయంబకా, 432. త్రివర్ణా, 432. త్రివర్ణా, 433. త్రికాలజ్ఞానదాయినీ, 434. తర్పతా, 435, తృప్తిదా, 436. తృప్తా, 437. తామసీ, 438. తుంబురస్తుతా, 439. తార్క్షస్థా, 440. త్రిగుణాకారా, 441. త్రిభంగీ, 442. తనువల్లరీ, 443. థాత్కారీ, 444. థారవా, 445. థాంతీ, 446. దోహినీ, 447. దీనవత్సలా, 448. దానవాంతకరీ, 449. దుర్గా, 450. దుర్గాసుర నిబర్హిణీ, 451. దేవరీతి, 452. దివారాత్రిః, 453. ద్రౌపదీ, 454. దుందుభిస్వనా, 455. దేవయానీ, 456. దురావాసా, 457. దారిద్ర్యభేదినీ, 458. దివా, 459. దామోదరప్రియా, 460. దీప్తా, 461. దిగ్వాసా, 462. దిగ్విమోహినీ, 463. దండకారుణ్యనిలయా, 464. దండినీ, 465. దేవపూజితా, 466. దేవవంద్యా. 467. దివిషదా, 468. ద్వేషిణీ, 469. దానవాకృతిః, 470. దీనానాథస్తుతా, 471. దీక్షా, 472. దైవతాదిస్వరూపిణి, 473. ధాత్రీ, 474. ధనుర్ధరా, 475. ధేనుః, 476. ధారిణీ, 477. ధర్మచారిణీ, 478. ధురంధరా, 479. ధరాధరా, 480. ధనదా.

481. ధాన్యదోహినీ, 482. ధర్మశీలా, 483. ధనాధ్యక్షా, 484. ధనుర్వేద విశారదా, 485. ధృతీ, 486. ధన్యా, 487. ధృతిపదా, 488. ధర్మరాజ ప్రియా, 489. ధ్రువా, 490.ధూమావతీ, 491. ధూమకేశీ, 492. ధర్మశాస్త్ర ప్రకాశిని, 493. నందా, 494. నందప్రియా, 495. నిద్రా, 496. నృనుతా, 497. నందనాత్మికా, 498. నర్మదా, 499. నలినీ, 500. నీలా.

501. నీలకంఠ సమాశ్రయా, 502. నారాయణ ప్రియా, 503. నిత్యా, 504. నిర్మలా, 505. నిర్గుణా, 506. నిధిః, 507, నిరాధారా, 508. నిత్యశుద్ధా, 509. నిరుపమా, 510. నిరంజనా, 511. నాదబిందు కళాతీతా, 512. కళాత్మికా, 513. నాదబిందు నృసింహినీ, 514. నగధరా, 515. నృపనాగవిభూషిత, 516. నరకక్లేశశమనీ, 517. నారాయణ పదోద్భవా, 518. నిరవద్యా, 519. నిరాకారా, 520. నారదప్రియకారిణి.

521. నానాజ్యోతి సమాఖ్యాతా, 522. నిధిదా, 523. నిర్మలాత్మికా, 524. నవసూత్రధరా, 525. నీతిః, 526. నిరుపద్రకారిణీ, 527. నందజా, 528. నవరత్నాధ్యా, 529. నైమిషారణ్యవాసినీ, 530. నవనీతప్రియా, 531. నారీ, 532. నీలజీమూతస్వనా, 533. నిమేషిణీ, 534. నదీరూపా, 535. నీలగ్రీవా, 536. నిశేశ్వరీ, 537. నామావళిః, 538. నిశుంభఘ్నీ, 539. నాగలోక నివాసినీ, 540. నవజాంబూనదప్రఖ్యా.

541. నాగలోకాధిదేవతా, 542. నూపురాక్రాంతచరణా, 543. నరచిత్తప్రమోదినీ, 544. నిమగ్నారక్త నయనా. 545. నిర్ఘాత సమనిస్వినా, 546. నందనోద్యాన నిలయా, 547. నిర్వ్యూహోపచారిణీ, 548. పార్వతీ, 549. పరమోదారా, 550. పరబ్రహ్మాత్మికా, 551. పరా, 552. పంచకోశ నిర్ముక్తా, 553. పంచపాతక నాశినీ, 554.

పరచిత్తవిధానజ్ఞా, 555. పంచికా, 556. పంచరూపిణీ, 557. పూర్ణిమా, 558. పరమా. 559. ప్రీతీ:, 560, పరతేజా:.

561. ప్రకాశినీ, 562, పురాణీ, 563. పౌరుషీ, 564. పుణ్యా, 565. పుండరీక నిభేక్షణా, 566. పాతాళతల నిర్మగా, 567. ప్రీతా, 568. ప్రీతివివర్ధినీ, 569. పావనీ, 570. పాదసహితా, 571. పేశలా, 572. పవనాశినీ, 573. ప్రజాపతి:, 574. పరిశ్రాంతా, 575. పర్వతస్తనమండలా, 576. పద్మప్రియా, 577. పద్మసంస్థా, 578. పద్మాక్షీ, 579. పద్మసంభవా, 580. పద్మపత్రా.

581. పద్మపదా, 582. పద్మినీ, 583. ప్రియభాషిణీ, 584. పశుపాశ వినిర్ముక్తా, 585. పురంద్రీ, 586. పురవాసినీ, 587. పుష్కలా, 588. పురుషా, 589. పర్వా, 590. పారిజాతసుమప్రియా, 591. పతివ్రతా, 592. పవిత్రాంగీ, 593. పుష్పహాస పరాయణా, 594. ప్రజ్ఞావతీసుతా, 595. పౌత్రీ, 596. పుత్రపూజ్యా, 597. పయస్వినీ, 598. పట్టిపాశధరా, 599. పంక్తీ, 600. పితృలోకప్రదాయినీ.

601. పురాణీ, 602. పుణ్యశీలా, 603. ప్రణతార్తివినాశినీ, 604. ప్రద్యుమ్నజననీ, 605. పుష్టా, 606. పితామహ పరిగ్రహా, 607. పుండరీక పురావాసా, 608. పుండరీక సమాననా, 609. పృథుజంఘా, 610. పృథుభుజా, 611. పృథుపాదా, 612. పృథూదరీ.

613. ప్రవాళశోభా, 614. పింగాక్షీ, 615. పీతవాసా, 616. ప్రచాపలా, 617. ప్రసవా, 618. పుష్టిదా, 619. పుణ్యా, 620. ప్రతిష్టా.

621. ప్రణవాగతి:, 622. పంచవర్ణా, 623. పంచవాణీ, 624. పంచికా, 625. పంజరస్థితా, 626. పరమాయా, 627. పరంజ్యోతి:, 628. పరప్రీతి, 629. పరాగతి:, 630. పరాకాష్ఠా, 631. పరేశానీ,

632. పావినీ, 633. పావకద్యుతీ, 634. పుణ్యభద్రా, 635. పరిచ్ఛేదా, 636. పుష్పహాసా, 637. పృథూదరీ, 638. పీతాంగీ, 639. పీతవసనా, 640. పీతశయ్యా.

641. పిశాచినీ, 642. పీతక్రియా, 643. పిశాచఘ్నీ, 644. పాటలాక్షీ, 645. పటుక్రియా, 646. పంచభక్ష ప్రియచారా, 647. పూతనా ప్రాణఘాతిని, 648. పున్నాగ వనమధ్యస్థా, 649. పుణ్యతీర్థనిషేవితా, 650. పంచాంగీ, 651. పరాశక్తీ, 652. పరమాహ్లాదకారిణీ, 653. పుష్పకాండస్థితా, 654. పూషా, 655. పోషితాఖిలవిష్టపా, 656. పానప్రియా, 657. పంచశిఖా, 658. పన్నగోపరిశాయినీ, 659. పంచమాత్రాత్మికా, 660. పృథ్వీ.

661. పథికా, 662. పృథుదోహినీ, 663. పురాణన్యాయ మీమాంసా, 664. పాటలీ, 665. పుష్పగంధినీ, 666. పుణ్యప్రజా, 667. పారదాత్రీ, 668. పరమార్థిక గోచరా, 669. ప్రవాళశోభా, 670. పూర్ణాశా, 671. ప్రణవా, 672. పల్లవోదరీ, 673. ఫలినీ, 674. ఫలదా, 675. ఫల్గు, 676. పూత్కారీ, 677. ఫలకాకృతీ, 678. ఫణీంద్రభోగశయనా, 679. ఫణిమండల మండితా, 680. బాల బాలా.

681. బహుమతా, 682. బాలాతప నిభాంశుకా, 683. బలభద్రప్రియా, 684. వంద్యా, 685. బడబా, 686. బుద్ధిసంస్తుతా, 687. బందీదేవీ, 688. బిలవతీ, 689. బడిశఘ్నీ, 690. బలిప్రియా, 691. బాంధవీ, 692. బోధితా, 693. బుద్ధీ, 694. బంధూక కుసుమప్రియా, 695. బాల భానుప్రభాకారా, 696. బ్రాహ్మీ, 697. బ్రాహ్మణ దేవతా, 698. బృహస్పతిస్తుతా, 699. వృందా, 700. వృందావనవిహారిణీ.

701. బలాకినీ, 702. బిలాహారా, 703. బిలవాసా, 704. బహూదకా, 705. బహునేత్రా, 706. బహుపదా, 707. బహుకర్ణావతంసికా,

708. బహుబాహుయుతా, 709. బీజరూపిణి, 710. బహురూపిణీ, 711. బిందునాద కళాతీతా, 712. బిందునాద స్వరూపిణి, 713. బద్ధగోధాంగుళిత్రాణా, 714. బదర్యాశ్రమవాసినీ, 715. వృందారకా, 716. బృహత్స్కంధా, 717. బృహతీ, 718. బాణపాతినీ, 719. వృందాధ్యక్షా, 720. బహునుతా.

721. వనితా, 722. బహువిక్రమా, 723. బద్దపద్మాసనాసీనా, 724. బిల్వపత్రతలస్థితా, 725. బోధిద్రుమ నిజావాసా, 726. బడిస్థా, 727. బిందుదర్పణా, 728. బాలా, 729. బాణాసనవతీ, 730. బడబానలవేగినీ, 731. బ్రహ్మాండబహిరంతఃస్థా, 732. బ్రహ్మకంకణసూత్రిణీ, 733. భవానీ, 734. భీషణవతీ, 735. భావినీ, 736. భయహారిణీ! 737. భద్రకాళీ, 738. భుజంగాక్షీ, 739. భారతీ, 740. భారతాశయా.

741. భైరవీ, 742. భీషణాకారా, 743. భూతిదా, 744. భూతిమాలినీ, 745. భామినీ, 746. భోగనిరతా, 747. భద్రదా, 748. భూరివిక్రమా, 749. భూతనివాసా, 750. భృగులతా, 751. భార్గవీ, 752. భూసురార్చితా, 753. భాగీరథీ, 754. భోగవతీ, 755. భవనస్థా, 756. భిషగ్వరా, 757. భామినీ, 758. భోగినీ, 759. భాషా, 760. భవానీ.

761. భూరిదక్షిణా, 762. భర్గాత్మికా, 763. భీమవతీ, 764. భవబంధ విమోచినీ, 765. భజనీయా, 766. భూతధాత్రీరక్షితా, 767.భువనేశ్వరీ, 768. భుజంగవలయా, 769. భీమా, 770. భేరుండా, 771. భాగదేయినీ, 772. మాతా, 773. మాయా, 774. మధుమతీ, 775. మధుజిహ్వా, 776. మధుప్రియా, 777. మహాదేవీ, 778. మహాభాగా, 779. మాలినీ, 780. మీనలోచనా.

781. మాయాతీతా, 782. మధుమతీ, 783. మధుమాంసా, 784. మధుద్రవా, 785. మాననీ, 786. మధు సంభూతా, 787. మిథిలాపురవాసినీ, 788. మధుకైటభ సంహార్త్రీ, 789. మేదినీ, 790. మేఘమాలినీ, 791. మండోదరీ, 792. మహామాయా, 793. మైథిలీ, 794. మసృణప్రియా, 795. మహాలక్ష్మీ, 796. మహాకాళీ, 797. మహాకన్యా, 798. మహేశ్వరీ, 799. మహేంద్రీ, 800. మేరుతనయా.

801.మందారకుసుమార్చితా, 802. మంజుమంజీరచరణా, 803. మోక్షదా, 804. మంజుభాషిణీ, 805. మధురద్రావిణీ, 806. ముద్రా, 807. మలయా, 808. మలయాన్వితా, 809. మేధా, 810. మరకతశ్యామా, 811. మాగధీ, 812. మేనకాత్మజా, 813. మహామారీ, 814. మహావీరా, 815. మహాశ్యామా, 816. మనుస్తుతా, 817. మాతృకా, 818. మిహిరాభాసా, 819. ముకుందపదవిక్రమా, 820. మూలధారస్థితా.

821. ముగ్ధా, 822. మణిపూరకవాసినీ, 823. మృగాక్షీ, 824. మహిషారూఢా, 825. మహిషాసురమర్దనీ, 826. యోగాసనా, 827. యోగగమ్యా, 828. యోగా, 829. యౌవనకాశ్రయా, 830. యౌవనీ, 831. యుద్ధమధ్యస్థా, 832. యమునా, 833. యుగధారిణీ, 834. యక్షిణీ, 835. యోగయుక్తా, 836. యక్షరాజ ప్రసూతిని, 837. యాత్రా, 838. యానవిధానజ్ఞా, 839. యదువంశ సముద్భవా, 840. యకారాదిహకారాంతా.

841. యాజుషీ, 842. యజ్ఞరూపిణీ, 843. యామినీ, 844. యోగనిరతా, 845. యాతుధాన భయంకరీ, 846. రుక్మిణీ, 847. రమణీ, 848. రామా, 849. రేవతీ, 850. రేణుకా, 851. రతి, 852. రౌద్రీ, 853. రౌద్రప్రియాకార, 854. రామమాతా, 855. రతిప్రియా, 856. రోహిణీ, 857. రాజ్యదా, 858. రేవా, 859. రమా, 860. రాజీవలోచనా.

861. రాకేశీ, 862. రూపసంపన్నా, 863. రత్నసింహాసనస్థితా, 864. రక్తమాల్యాంబరధరా, 865. రక్తగంధానులేపనా, 866. రాజహంస సమారూఢా, 867. రంభా, 868. రక్తబలిప్రియా, 869. రమణీయయుగాధారా, 870. రాజితాఖిలభూతలా, 871. రురుచర్మపరీధానా, 872. రథినీ, 873. రత్నమాలికా, 874. రోగేశీ, 875. రోగశమనీ, 876. రావిణీ, 877. రోమహర్షిణీ, 878. రామచంద్రపదాక్రాంతా, 879. రావణచ్ఛేదకారణీ, 880. రత్నవస్త్రపరిచ్ఛన్నా.

881. రథస్థా, 882. రుక్మభూషణా, 883. లజ్జాధిదేవతా, 884. లోలా, 885. లలితా, 886. లింగధారిణీ, 887. లక్ష్మీ, 888. లోలా, 889. లుప్తవిషా, 890. లోకినీ, 891. లోకవిశ్రుతా, 892. లజ్జా, 893. లంబోదరీదేవి, 894. లలనా, 895. లోకధారిణీ, 896. వరదా, 897. వందితా, 898. విద్యా, 899. వైష్ణవీ, 900. విమలాకృతిః

901. వారాహీ, 902. విరజా, 903. వర్షా, 904. వరలక్ష్మీ, 905. విలాసినీ, 906. వినతా, 907. వ్యోమమధ్యస్థా, 908. వారిజాసన సంస్థితా, 909. వారుణీ, 910. వేణుసంభూతా, 911. వీతిహోత్రా, 912. విరూపిణీ, 913. వాయుమండలమధ్యస్థా, 914. విష్ణురూపా, 915. విధిప్రియా, 916. విష్ణుపత్నీ, 917. విష్ణుమతీ, 918. విశాలక్షీ, 919. వసుంధరా, 920. వామదేవప్రియా.

921. వేలా, 922. వజ్రినీ, 923. వసుదోహినీ, 924. వేదాక్షర పరీతాంగీ, 925. వాజపేయఫలప్రదా, 926. వాసవీ, 927. వామజననీ, 928. వైకుంఠనిలయా, 929. వరా, 930. వ్యాసప్రియా, 931. వర్మధరా, 932. వాల్మీకి పరిసేవితా, 933. శాకంబరీ, 934. శివా, 935. శాంతా, 936. శారదా, 937. శరణాగతిః, 938. శాతోదరీ, 939. శుభాచారా, 940. శుంభాసురవిమర్దిని.

941. శోభావతీ, 942. శివాకారా, 943. శంకరార్ధశరీరిణి, 944. శోణా, 945. శుభాశయా, 946. శుభ్రాణీ, 947. శిరః సంధానకారిణి, 948.శరావతి, 949. శరానందా, 950. శరజ్యోత్స్నా, 951. శుభాననా, 952. శరభా, 953. శూలినీ, 954. శుద్ధా, 955. శబరీ, 956. శుకవాహనా, 957. శ్రీమతీ, 958. శ్రీధరానందా, 959. శ్రవణానందదాయినీ, 960. శర్వాణీ.

961. శర్వరీవంద్యా, 962. షడ్భాషా, 963. షడ్ఋతుప్రియా, 964. షడాధారస్థితాదేవీ, 965. షణ్ముఖప్రియకారిణి, 966. షడంగ రూపసుమతి సురాసుర నమస్కృతా, 967. సరస్వతీ, 968. సదాదారా, 969. సామగానప్రియా, 970. సర్వమంగళకారిణి, 971. సూక్ష్మా, 972. సావిత్రీ, 973. సామసంభవా, 974. సర్వావాసా, 975. సదానందా, 976. సుస్తనీ, 977. సాగరాంబరా, 978. సర్వైశ్వరప్రియా, 979. సిద్ధిః, 980. సాదుబంధు పరాక్రమా.

981. సప్తర్షిమండల గతా, 982. సోమమండలవాసినీ, 983. సర్వజ్ఞా, 984. సాంద్రకరుణా, 985. సమానాధిక వర్జితా, 986. సర్వోత్తుంగా, 987. సంగహీనా, 988. సద్గుణా, 989. సకలేష్టదా, 990. సరఘా, 991. సూర్యతనయా, 992. సుకేశీ, 993. సోమసంహతిః, 994. హిరణ్యవర్ణా, 995. హరిణీ, 996. హ్రీంకారీ, 997. హంసవాహినీ, 998. క్షేమవస్త్రపరీతాంగీ, 999. క్షీరాబ్ధితనయా, 1000. క్షమా, 1001. గాయత్రీ, 1002. సావిత్రీ, 1003. పార్వతీ, 1004. సరస్వతీ, 1005. వేదగర్భా, 1006. వరారోహా, 1007. శ్రీగాయత్రీ, 1008. పరాంబికా.

ఓ నారదా! ఇవి భగవతి గాయత్రీ సహస్రనామములు. మహాపుణ్యప్రదమైన, సకల పాపములనశింపచేయు, గొప్ప సంపదలను ప్రసాదించు యీ నామములు గాయత్రీమాతను సంతుష్టపరచును.

బ్రాహ్మణులతో కూడి అష్టమీతిథియందు విశేషముగా దీనిని పఠించవలెను, యోగ్యులైన భక్తులకు, ఆజ్ఞను పాలించు శిష్యునకు దీనిని ఉపదేశించవలెను.

గాయత్రీ శాస్త్రము లిఖించు, పఠించు ఇంటి యందు భయమనునది నిలువజాలదు. చంచల అయి కూడా లక్ష్మి అతని ఇంట విరాజమాను రాలగును.

బ్రహ్మహత్య, సురాపానము, బంగారమును దొంగిలించుట మొ॥ పాపముల నుండి విముక్తి చేయు గాయత్రీ స్తోత్రము నిత్యము పఠించవలెను.

గాయత్రీపఠనముతో మానవులు బ్రహ్మసాయుజ్యమును పొందుదురు.

సర్వే జనా స్సుఖినో భవంతు - ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

* * *

దేవీ భాగవతము

దేవీనవరాత్రులు - తొమ్మిదవరోజు కథ

1. గాయత్రి దీక్షా విధానము

శ్రీమన్నారాయణునితో నారదుడు ప్రభూ! శ్రీ గాయత్రీదేవి యొక్క దీక్షా విధానము, ఉత్తమ లక్షణములను తెలిపినచో పురుషుడు జపించుటకు అధికారము పొందగలడని కోరెను.

నారాయణుడు నారదా! దీక్షను స్వీకరించు విధానమును తెలిపెదను వినుము. దేవతలను, అగ్నిని, గురువును, పూజించుటకు అర్హులు అగుదురు. గురుశిష్యులిరువురు అత్యంత శుద్ధులు కావలెను. గురువు ప్రాతఃకాలమున సకల కార్యములను విధిగా నిర్వహించవలెను. శాస్త్రోక్తముగ స్నానసంధ్యాది సకల కృత్యములను సముచితముగ నెరవేర్చవలెను.

నదీతీరము నుండి కమండలమును తీసికొని గృహమునకు వచ్చి యజ్ఞమండపమున ఉత్తమ ఆసనము నందు అమరి ఆచమన ప్రాణాయామములు చేసి జలముతో "ఓం ఫట్" అను ఈ అస్త్ర మంత్రముతో ఏడుసార్లు జపించి అభిమంత్రించవలెను. ఆ మంత్రించిన జలమును పూజా సామగ్రి యందు చల్లవలెను.

గణేశుని, భగవతి లక్ష్మిని, సరస్వతిని పూజింపవలెను. ద్వారమునకు దక్షిణ శాఖయందు భగవతి గంగను గణేశుని, వామశాఖ యందు క్షేత్రపాలుని, సూర్యతనయయగు యమునను పూజింపవలెను. గడప దగ్గర "ఓం ఫట్" అను మంత్రము నుచ్చరించి అస్త్రదేవతను పూజించవలెను. సమస్తము దేవిమయమని భావన చేయవలెను.

ఈ అస్త్రమంత్ర జపము ద్వారా దేవి విఘ్నములను పెకలించి వేయవలెను. మొదట దక్షిణ పాదము నుంచి మండపమున ప్రవేశింపవలెను. వాస్తు దేవతకు అర్ఘ్యమివ్వవలెను. నైఋతి దిశయందు గంధము, పుష్పములు, అక్షతలు అర్ఘ్యజలముతో స్వామియైన పద్మయోని బ్రహ్మను పూజింపవలెను. అర్ఘ్యమున మిగిలిన జలముతో పంచగవ్యమును చేయవలెను.

గురుదేవులు జలముతో తోరణము, స్తంభము, మండపము నంతయు ప్రోక్షణ చేయవలయును. ఇదంతయు దేవిమయమని భావించవలెను. 'ఓంఫట్' అను మంత్రమును చ్చరించుచు ప్రోక్షణము చేయు నియమము కలదు.

"ఓంఫట్", "ఓం హుం" మంత్రమును చదివి దానిమీద జలమును చిలకరించవలెను. ధూపముచే విఘ్నశాంతికి, జలము, చందనము, అక్షతలు, భస్మము చల్లవలెను. కుశలతో చేసిన కట్టతో స్థానమును శుభ్రము చేయవలెను.

ద్రవ్యములను ఈశాన్యదిశయందు ఉంచవలెను, పుణ్యాహవాచనము చేసి పేదలను, నిరాశ్రితులను సంతుష్టులను చేయు ప్రయత్నము చేయవలయును, గురుదేవునకు ప్రణామమొనరించి పూర్వాభిముఖుడై కూర్చొనవలెను. భూతశుద్ధి అవసరము, మంత్రఋషిని న్యాసము చేయవలయును.

మస్తకము నందు దేవమంత్రఋషిని, ముఖమునందు ఛందమును, హృదయరూపకమలము నందు దేవతను, గుహ్యము నందు బీజమును, పాదముల రెండింటియందు శక్తిని న్యాసము చేసి మూడు సార్లు చప్పట్లు కొట్టవలెను. మూడుసార్లు చిటికెలు వేసి దిగ్బంధనము చేయవలయును.

ప్రాణాయామమొనరించి మూలమంత్రమును స్మరించుచు మాతృకా న్యాసము చేయవలెను. 'ఓం నమః' నుచ్చరించి శిరస్సునందు

మాతృకాన్యాసము చేయవలెను. నమః, స్వాహా, వషట్, హుం, వౌషట్, ఫట్ – ఈ పదములకు 'ఓం' ను జతచేయుట వలన మంత్రరూపముతో పరిణతినొందును. ఈ ఆరుమంత్రములతో షడంగన్యాసము చేయవలెను.

దక్షిణభాగమున ధర్మము, వామభాగమున జ్ఞానము, ఊరువునందు వైరాగ్యము, దక్షిణ ఊరువు నందు ఐశ్వర్యము, ముఖప్రదేశమున అధర్మము విరాజమానములైయున్నవని చింతన చేయవలయును.

'ఓం అధర్మాయనమః' అజ్ఞానాయనమః, అవైరాగ్యాయనమః 'అనైశ్వరాయనమః' అని చెప్పి న్యాసము చేయవలెను. సూర్యచంద్రులకును, అగ్నికిని, మంత్రోచ్చారణ పూర్వకముగ న్యాసము చేయవలెను. సూర్యునికి పండ్రెండుకళలు, చంద్రునికి పదహారు, అగ్నికి పది కళలు చెప్పబడినవి. సత్వ, రజస్ తమో గుణములను న్యాసము చేయవలయును. ఆ పీఠమునకు నాలుగు దిశలందు ఆత్మ, అంతరాత్మ, పరమాత్మ, జ్ఞానాత్మలను కల్పన చేయవలెను.

ఓం అముకాసనాయ నమః యీ మంతమ్రును పఠించి జగదంబను ధ్యానించవలెను. సంతోషము చేకూర్చు ముద్రలను ప్రదర్శించి భగవతిని ప్రసన్నురాలను చేసికొనవలెను. షట్‌కోణచక్రమును, వర్తులాకార చక్రమును వేయవలెను. చతురస్రకోణమండలమును లిఖించవలయును. షట్‌కోణమధ్యమమున త్రికోణమును గీసి శంఖముద్రను ప్రదర్శింపవలెను.

అగ్ని మొదలగుకోణములందు ఆరు అంగములను అర్చించవలెను. శంఖము నుంచు పాత్రను తీసుకొని 'ఓం ఫట్' యీ అస్త్రమంత్రముతో ప్రోక్షణ చేసి ఓం మం వహ్నిమండలాయ నమః అని పఠించి 'దశకళాత్మనే అముక దేవ్యా అర్ఘ్య పాత్ర స్థానాయ నమః దీనిని ఉచ్చరించి విద్వాంసుడు శంఖమునకు ఆధారమును స్థాపించవలెను. ప్రదక్షిణముగా వహ్నిమండల మందున్న పది వహ్నికళలను ఆరాధించవలెను.

ఓం సూర్యమండలాయ నమః అని పలికి 'ద్వాదశాంశే కళాత్మనే అముక దేవ్యర్ఘపాత్రాయ నమః అని ఉచ్చరింపవలెను. ఓం శం శంఖాయ నమః అని ఉచ్చరించి శంఖమును ప్రోక్షణ చేయవలయును. ఆ శంఖము నందు ద్వాదశాదిత్యులను పూజింపవలెను.

జలముతో శంఖమును నింపవలెను, చంద్రకళలను న్యాసము చేయవలెను. ఓం సోమ మండలాయ షోడశ కళాత్మనే అముకార్ఘామృతాయ హృదయాయ నమః అను మంత్రమును పఠించి అంకుశముద్రతో జలమును పూజింపవలెను. ఎనిమిదిసార్లు మనువుచే చెప్పబడిన మంత్రమును జపించవలెను.

'హృదయాయనమః' అను ఈ మంత్రముతో జలమును పూజింపవలెను. మత్స్యముద్రతో నీటిని కప్పివేయవలెను. 'సర్వతో భద్ర మండలము లిఖించి మధ్యలో బియ్యపు ధాన్యముతో నింపవలెను.

"ఓం ఆధారశక్తయే నమః' 'ఓం మూల ప్రకృత్యై నమః' 'ఓం కూర్మాయ నమః' 'ఓం శేషాయ నమః' 'ఓం క్షమాయై నమః' 'ఓం సుధాసింధవే నమః' 'ఓం దుర్గాదేవీ యోగపీఠాయ నమః"

'ఓం పట్' అస్త్రమంత్రముతో ప్రక్షాళనము చేసి ఎర్రని త్రాడుతో ఆ కలశము నుంచి పూజించి ప్రణవమునుచ్చరించుచు మాతృకామంత్రముతో ఆకులతో ముఖభాగము రెండు వస్త్రములతో చుట్టి ప్రాణప్రతిష్ఠ చేయవలెను.

దేవిని ప్రసన్నమొనరించుకొని పాద్యము, అర్ఘ్యము, ఆచమనము, మధుపర్కము, అభ్యంగస్నానము దేవికి నివేదించవలెను. మణులను సమర్పిస్తున్నట్లు భావనచేసి, మాతృకాన్యాసమొనరించి కస్తూరి, కుంకుమ, కప్పురము, కుందపుష్పములు, చందనము, కస్తూరితో కూడిన కేసరములు భగవతికి సమర్పించవలెను.

అగరు, సాంబ్రాణి, కర్పూరము, చందనము, చక్కెర, తేనె, బెల్లము, ధూపములతో జగన్మాతను సేవింపవలెను, ప్రోక్షణతో జలమును చల్లి దేవిని విశ్వదేవుల పూజింపవలెను. దక్షిణ దిశయందు అగ్నిని స్థాపించవలెను.

వ్యాహృతితో కూడిన మూలమంత్రమునుచ్చరించి, నెయ్యితో పాయసమును ఇరువది అయిదు సార్లు ఆహుతినిచ్చి హవనము చేయవలెను. దేవిని పీఠము మీదకు తీసికొనరావలెను. నాలుగు వైపుల పాయసముతో బలినివ్వవలెను. గంధపుష్పాది ఉపచారముల నర్పించవలెను. తాంబూలము, ఛత్రము, చామరమును సమర్పించవలెను. దేవీమంత్రమును వెయ్యిసార్లు జపించవలెను. గురుదేవుడు భోజనం చేసి మౌనముగా వేదిక మీదనే శయనించవలెను.

'ఓంఫట్' ఈ అస్త్రమంత్రమును పఠించి, 'ఓం హుం' అను కవచ మంత్రముతో తాకవలెను. తూర్పు పడమరలందు మూడేసి గీతలు గీయవలెను.

'ఓం ఆధారశక్తయే నమః ఓం అముకదేవీ యోగపీఠాయ నమః 'మంత్రములతో పీఠమును పూజించవలెను. గంధాది ఉపచారములతో జాగ్రత్తగా వారిని పూజించవలెను. 'పార్వతి శంకరుని వద్ద విరాజమానయై మహానుభావులిరువురు హాసవిలాసములతో కాలము గడుపవలెనని కోరుచున్నాను' అని భావింపవలెను.

మునుపు చెప్పిన వీక్షణాదిక్రియలతో అగ్నిని సంస్కరించి 'ఓం రం' ఈ బీజమంత్రమును పఠించి ఆ అగ్నియందు చైతన్యమును కల్పన చేయవలయును.

'ఓం ఫట్' ఈ అస్త్రమంత్రమును ఉచ్చరించి 'ఓం హుం' అను కవచ మంత్రముతో కప్పివేయవలయును. ఈ అగ్ని శివుని యొక్క బీజ స్వరూపము అని తలంచి కుండ రూపయైన దేవి యోని యందు వదలిపెట్టవలయును.

'ఓం చిత్ పింగళ హన – హన దహ – దహ పచ – పచసర్వజ్ఞా జ్ఞాపయా స్వాహా' అను మంత్రమును చదివి అగ్నిని రగుల్కొలపవలయును. 'జాతివేద' నామముతో అగ్ని దేవునకు నేను ప్రణమిల్లుచున్నాను.

అగ్నిదేవుడు బంగారుతో సమానమైన పీతవర్ణముగలవాడు. నిర్మలుడు దేదీప్యమానముగ వెలుగొందువాడు సర్వతోముఖుడు.

శ్లో॥ అగ్నిం ప్రజ్వలితం వందే జాతవేదం హుతాశనమ్
సువర్ణవర్ణ మమలం సమిద్ధం విశ్వతోముఖమ్ ॥

అని అగ్నిని స్తుతిస్తూ "ఓం సహస్రార్చిషే హృదయాయ నమః ఓం స్వస్తి పూర్ణాయ శిరసే స్వాహా, ఓం ఉత్తిష్ఠ పురుషాయ శిఖాయై వషట్, ఓం ధూమవ్యాపినే కవచాయ హుం ఓం సప్తజిహ్వాయ నేత్రాయ వౌషట్, ఓం ధనుర్ధరాయ అస్త్రాయ ఫట్" ఈ విధంగా షడంగ న్యాసములు చేయవలయును.

నమః స్వాహా, వషట్, హుమ్, వౌషట్, ఫట్ ఈ పదములతో కూడి ఆరు అంగములందుంచవలెను తరువాత అగ్నిని ధ్యానించవలెను. వరముద్ర, శక్తి, స్వస్తిక, అభయ, ధారక, పరమ మంగళ ముద్రలను ప్రదర్శించి జల బిందువులను చల్లవలెను. దర్భలతో తుడువవలెను.

త్రికోణమును, షట్కోణమును, అష్టదళకములమును భూపురముతో కూడిన యంత్రమును విధించవలెను. అగ్నిని స్థాపించి లిఖించవలెను.

"ఓం వైశ్వానరో జాతవేదా ఇహావహా లోహితాక్షః సర్వకర్మాణి సాధయ స్వాహా" హిరణ్య, గగన, రక్త, కృష్ణ, సుప్రభ, బహురూప, అతిరక్తిక అను అగ్ని యొక్క సప్త జిహ్వాలను పూజించవలెను. జాతవేదుడు, సప్తజిహ్వుడు, హవ్యవాహనుడు, అశ్వోదరజుడు, వైశ్వానరుడు, కౌమారతేజుడు, విశ్వముఖుడు, దేవముఖుడు – ఈ ఎనిమిది అగ్నులు ప్రసిద్ధములైనవి.

'ఓం అగ్నయే నమః స్వాహా' ఈ పదములనుచ్చరించు పూజించు విధానము కలదు. 'ఓం అగ్నయే సప్తజిహ్వాయ నమః స్వాహా' ఓం అగ్నయే హవ్యవాహనాయ నమః స్వాహా" ఓం అగ్నయే అశ్వోదరజాయ నమః స్వాహా" ఓం అగ్నయే వైశ్వానరాయ నమః స్వాహా' ' ఓం అగ్నయే కౌమార తేజసే నమః స్వాహా" ఓం అగ్నయే విశ్వముఖాయ నమః స్వాహా" ఓం అగ్నయే దేవ ముఖాయనమః ఇట్లు అష్టమూర్తులను పూజింపవలెను.

"ఓం అగ్నయే స్వాహా"తో అగ్ని యొక్క దక్షిణ నేత్రమునందు వామ భాగము నుండి తీసికొని ఓం సోమాయ స్వాహా'తో వామ నేత్రము నందు అటులనే మధ్యనుండి ఘృతమును తీసికొని 'ఓం అగ్నీషోమాభ్యాం స్వాహా' ఈ మంత్రమునుచ్చరించుచు అగ్ని యొక్క మధ్య నేత్రమున హవనము చేయవలయును.

గర్భాధానము, పుంసవనము, సీమంతోన్నయనము, జాతకర్మ నామకరణము, నిష్క్రమణము, అన్నప్రాశనము, చూడావ్రత బంధము – ఇవి ఎనిమిది సంస్కారములు.

అగ్ని మంత్రముతో 'వౌషట్'ను జోడించి దానినే ఉచ్చరించి ఆహుతినివ్వవలెను. "ఇప్పుడు దేవి నా యెడల ప్రసన్నురాలైనది. అట్లే ఆవరణ దేవి, అగ్ని దేయ మంత్ర సంబంధమగు దేవతకూడా ప్రసన్నతనొందినవి అని మనస్సులో భావింపవలెను.

శిష్యుడు సంధ్యావందనాది క్రియలతో, వస్త్రములను ధరించి సువర్ణాభరణము కమండలము కలిగియుండవలెను. శిష్యుని ఆచార్యుడు కుండము దగ్గరకు పిలువవలెను.

విద్వాంసుడైన ఆచార్యుడు దివ్యదృష్టిని శిష్యుని మీద ప్రసరింపచేసి శిష్యుని శరీరమును శోధించవలెను. శిష్యుడు దేవతల కృపకు చక్కని అర్హుడు కాగలడు.

అంతేవాసి పాదమునందు కళాధ్వమును, లింగమునందు తత్త్వాధ్వమును, నాభియందు భువనాధ్వమును, హృదయమునందు వర్ణాధ్వమును, లలాటమునందు పదాధ్వమును, మస్తకమునందు మంత్రాధ్వమును చింతన చేయవలెను.

కూర్చతో (దర్భ కొన) శిష్యునితాకుచు 'ఓం అముం అధ్వానం శోధయామి స్వాహా' ఈ మంత్రము ద్వారా నేతితో కలిపిన తిలలను హవనము చేయవలెను.

చైతన్య రూపమును శిష్యుని యందు ప్రవేశపెట్టుట గురువుకు మిక్కిలి అవసరము. పూర్ణాహుతి ఒసగి ఆవాహనము చేసి దేవతలను కలశము మీద స్థాపించవలెను.

'ఓం వౌషట్' ఈ మంత్రమును పఠించి వస్త్రముతో శిష్యుని రెండు కళ్లు కప్పి కలశమువద్దకు వెళ్ళమని ఆజ్ఞాపింపవలెను. 'మంత్రోక్త న్యాసమొనరించి కలశములందుంచిన ఆకులను శిష్యుని తలమీద ఉంచి మాతృకా జపమొనరించవలెను.

కలశము నందలి దివ్య జలములతో స్నానమొనరించుటకు శిష్యుని ఆజ్ఞాపించవలెను. శిష్యుడు భస్మము మొదలగువాటిని అలదుకొని గురుదేవుని వద్ద కూర్చొనవలెను. శిష్యుడు ఈ మంత్రమును 108 సార్లు జపించవలెను. గురువును దైవస్వరూపునిగా తలంచి భూమి మీద పడుకొని ఆయనకు సాష్టాంగ నమస్కారము చేయవలెను. తనను తాను ఆ స్వామికి అర్పించుకొనవలెను. తనను కృతార్థునిగ తలంచి మంత్రమును నిత్యోపాసన చేయవలెను.

నారదా! నీవు దేవిచరణ కమలములను ఉపాసించుట యందు నిమగ్నుడవు కమ్ము. బ్రాహ్మణునకు దీనినిమించిన పరమ ఉపయోగకరమగు రెండవ ధర్మము లేదు. తాంత్రికుడు తత్వరీతితో ఉపదేశించవలెను.

నారదా! భగవతియగు జగదంబ యొక్క చరణ కమలములను నిత్యము ఉపాసింపుము. నేను ఆ దేవిని నిరంతరము ఆరాధించి నివృత్తి మార్గమును చేరుకొంటిని.

వ్యాసుడు జనమేజయ మహారాజా! ఈ ఉత్తమ ప్రసంగమును సంపూర్ణముగా నారదునకు తెలిపి నారాయణుడు కనులు మూసికొనగానే నారదుడు కూడా భగవతిని దర్శించు కోరికతో అదే క్షణమున తపమొనరించుటకు వెళ్ళిపోయెను.

2. దేవతల గర్వమును గమనించి దేవి జ్ఞానోపదేశము చేయుట

జనమేజయుడు శక్తిని ఉపాసించుట అవసరమని శాస్త్రములు చెబుతున్నది కదా! భగవన్! నాకీ విషయములను దయతో తెలుపుము అని కోరగా – సూతుడు మునివరులతో వేదవ్యాసుడిట్లు చెప్పెను. రాజా! వేదములయందు శ్రద్ధ గలవాడవుగ గోచరించుచున్నావు. పూర్వకాలమున దైత్యులు – దేవతలకు వంద సంవత్సరములు యుద్ధము జరిగెను.

భగవతి కృపవలన దేవతల ద్వారా దానవులు పరాజితులైరి. పాతాళమునకు వెళ్లిపోయిరి. దేవతలు మోహముతో విజయమదముతో కన్ను మిన్ను గానరాక పరస్పరము పొగడుకొనసాగిరి. పరాశక్తి ప్రభావమును తెలిసికొనలేక దేవతలను మోహము కప్పివేసియుండెను.

జగదంబ యక్షిణి రూపమున ప్రకటిత అయ్యెను. విద్యుల్లతలతో సమానముగ తేజరిల్లు ఆ జనని శ్రీ విగ్రహము చూచి దేవతలు ఆశ్చర్యపడిరి.

నీవు ఎవరవని యీ యక్షుని వద్దకు వెళ్ళి అడుగుట సమంజసమని వారు నిర్ణయించిరి. దేవరాజగు ఇంద్రుడు అగ్నిని అగ్నిదేవా! నీవు మేము వచించినట్లు అచటకు వెళ్లి ఆ యక్షుడెవరో తెలిసికొనుటకు ప్రయత్నము చేయుము అనగా అగ్నిదేవుడు యక్షుని వద్దకు వెళ్ళి నీవెవవరవు అనెను,

యక్షుడు నేను అగ్నిదేవుడను. విశ్వమును భస్మము చేయు శక్తి నాయందు కలదు అని పలుకగా యక్షుడు ఒక గడ్డి పోచ నుంచి అగ్నీ! నీవు ఈ తృణమును కాల్చుము అని చెప్పిన వెంటనే అగ్ని దేవుడు ఆ గడ్డిపోచను కాల్చలేకపోయెను. అగ్ని అవమానముతో దేవతల వద్దకు వెళ్ళి జరిగినదంతయు చెప్పెను.

ఇంద్రుడు వాయుదేవుని పిలిచి యక్షుడెవరో తెలిసికొని రావలసిందని ఆజ్ఞాపించగా వాయుదేవుడు యక్షుని సమీపించి నీవెవరవు? నీలో ఎట్టిశక్తి గలదు? అనగా యక్షుడు అతనితో వాయుదేవా! నీ ఎదుట గడ్డిపోచ ఉన్నది కదా! కదిలించుము లేదా తిరిగి ఇంద్రుని వద్దకు వెళ్ళిపొమ్ము అనెను.

వాయుదేవుడు గడ్డిపోచను కదిలించలేక సిగ్గుతో తిరిగి దేవతల వద్దకు వెళ్ళి ఈ యక్షుని తేజస్సు సహించరానిది. దేవేంద్రా! మీరే యక్షుని చెంతకు వెళ్ళి తెలిసికొనుడు అని చెప్పెను. దేవేంద్రుడు యక్షుని వద్దకు వెళ్ళగానే, యక్షుడు అంతర్ధానుడయ్యెను. ఇంద్రుని మనస్సులో లజ్జ కలిగెను. తిరిగి దేవతల వద్దకు వెళ్ళుటకు సిగ్గుపడి అభిమానమును విడనాడి పరమదైవమును శరణుజొచ్చెను.

అప్పుడు ఆకాశవాణి సహస్రాక్షా! మాయా బీజమును ధ్యానించుము. నీకు సుఖము కలుగగలదు అనగానే ఇంద్రుడు మాయాబీజమును జపింపనారంభించెను. దేవిని ధ్యానించుచు నిరాహారుడై దేవిని ఆరాధించసాగెను.

చైత్రమాస శుక్లపక్ష నవమి తిథియందు మధ్యాహ్న సమయమున ఆకస్మికముగ యౌవనముతో విరాజిల్లు ఆ దేవి ప్రకటితమయ్యెను. 'ఉమా' నామముతో ప్రసిద్ధురాలైన కల్యాణ స్వరూపిణి భగవతి జగదంబ. భగవతి జగదీశ్వరి యొక్క చరణముల మీద దండము వలె పడి అతడాదేవికి ప్రణమిల్లెను. భగవతిని స్తుతించెను.

దేవీ! ఈ యక్షుడెవరు? ఎందులకు ప్రకటమయ్యెను అనగానే దేవి ఇంద్రునితో ప్రకృతి మొదలుగా గల ఆ బ్రహ్మ నా రూపమే, అతడు మాయకు అధిష్ఠానము, సమస్తమునకు సాక్షి, నిరామయుడు.

వేదములు, తపస్సులు ఆ పదమును (అంటే ఆస్థానము) పొందు కోరికతోనే బ్రహ్మచర్యము పాటింపబడును. సంక్షిప్తముగా నీకు తెలిపెదను. "ఓం హ్రీం" ఈ రెండును ముఖ్య బీజమంత్రములు. దీనియందలి ఒక భాగము "సచ్చిదానంద బ్రహ్మ" రెండవ భాగమును "మాయా ప్రకృతి" అందురు. సమస్త జగత్తును శాసించెడి శక్తిశాలియగు దేవిని నేనే.

"మాయ", లేక "యోగమాయ" మొదలగు నామములతో వ్యవహరించెదరు. మాయను తమస్ (అవిద్య) అందురు. మాయచేతనే ఈ ప్రాణి జగత్తు సృష్టింపబడును. రజో గుణాధిక్యము చేత బ్రహ్మ, సత్వగుణాధిక్యము చేత విష్ణువు, తమో గుణాధిక్యము చేత రుద్రుడను నామములతో ప్రసిద్ధులు.

బ్రహ్మ, విష్ణువు, కారణాత్మకుడైన రుద్రునకు సృష్టి, స్థితి, లయములనొనరించు ప్రేరణ నా వలననే కలుగును. వాయువు నా భయముచేతనే వీచును. నా భయము వలననే సూర్యుడు ఆకాశమున సంచరించును. ఇంద్ర, అగ్ని, యములు నా వలన భయభీతులై తమతమ కార్యములను నిర్వహించుచుందురు.

నేను సర్వోత్తమను - నా కృపవలననే మీకు అన్ని విధముల విజయము ప్రాప్తించినది. మీరందరును కర్రబొమ్మల వంటివారు. నేను మిమ్మందరిని ఆడించెదను. ఒకసారి దేవతలకు, మరొకసారి దైత్యులకు విజయమును చేకూర్చెదను.

మీరు అభిమాన గర్వముతో సర్వాత్మికను, మాయను, శక్తిని విస్మరించితిరి. బుద్ధి అహంకారముతో కప్పబడియుండెను. మిమ్ములను

అనుగ్రహించుటకై యక్ష రూపమున ప్రకటితమైనది. అది నా రూపమే. అభిమానమును విడనాడి సచ్చిదానంద స్వరూపిణి దేవినగు నన్నే శరణు పొందుడు అని మూలప్రకృతి ఈశ్వరి చెప్పెను.

వ్యాసుడు జనమేజయ మహారాజా! భగవతి మహాదేవి దేవతల ద్వారా భక్తి పూర్వకముగా పూజింపబడి అంతర్ధానమయ్యెను, సకల దేవతలు తమ అభిమానమును విడనాడి, భగవతి జగదంబ యొక్క సర్వోత్తమ చరణ కమలములను అన్ని విధముల ఆరాధింపసాగిరి.

సత్యయుగమున గాయత్రీ జపము నందు సంలగ్నులైయుండెడివారు, బ్రాహ్మణుడు గాయత్రీ మంత్రము చేతనే అతడు కృతకృత్యుడగును, ముక్తుడగును అని మనువు స్వయముగా దీనిని ప్రకటించెను. సకల ద్విజులు గాయత్రీ జపమును భగవతి చరణములను ఉపాసించుట యందే సదా సంలగ్నులగుచుండిరి.

3. గాయత్రిదేవి – గౌతముడు – బ్రాహ్మణుల శాపము

వ్యాసుడు రాజా! ఇంద్రుడు పదిహేను సంవత్సరముల వరకు వర్షములు ఆపివేసెను, ఇంటింటిలో లెక్కలేనన్ని శవములు ప్రోగవుచుండెను. అప్పుడు బ్రాహ్మణులందరూ ఒక చోట కూడి మన దుఃఖములను దూరమొనర్చగలడని తలచి గౌతముని ఆశ్రమమునకు తరలివెళ్ళిరి.

బ్రాహ్మణ సమాజమును చూచి గౌతముడు వారికి నమస్కరించెను. దుఃఖితులైన వారందరినీ చూచి అతడిట్లు చెప్పెను. విప్రులారా! మీరందరు నా ఆశ్రమమునకేతెంచుట వలన నేను కృతకృత్యుడనైతిని. నా గృహమును పవిత్రమొనరించుచున్నారు. మీ అనుగ్రహము వలన నేను ధన్యుడనైతిని. మీరందరును సుఖముగా ఇచట నుండి నన్ననుగ్రహింపుడు అని బ్రాహ్మణులనందరిని ఊరడించి వినమ్రుడై భగవతి గాయత్రిని ప్రార్థింపసాగెను.

దేవీ! ప్రణవము నీ రూపము. 'హ్రీం' రూపమును ధరించిన దేవివగు నీకు నమస్కరించుచున్నాను. 'స్వాహా', 'స్వధా' రూపములతో శోభిల్లుదానవు. నీ స్వరూపము ప్రాతఃకాలమున కుమారివిగా మధ్యాహ్నమున యవ్వనమున, సాయంకాలమున వృద్ధురాలి రూపమున విరాజిల్లు చుందువు.

నీవు నా అపరాధములను క్షమింపమని గౌతముడు స్తుతించగా భగవతి అతని ఎదుట సాక్షాత్కరించి ఆ దేవి మునీంద్రునకు సమస్తమును పోషించు ఒక సంపూర్ణ పాత్రను ఒసగెను. మునీంద్రా! ఈ పాత్ర నీవు కోరు పదార్థములనన్నిటిని ఇవ్వగలదు. నీ కోరికలనన్నిటిని నెరవేర్చగలదు అని పలికి గాయత్రి మాత అదృశ్యమయ్యెను.

రాజా! ఆ పాత్రవలన పర్వతము వంటి అన్నపురాశులక్కడ ఆవిర్భవించెను. యజ్ఞములకు కావలసిన సామగ్రి అన్నపూర్ణ పాత్రనుండి వెలువడెను. మునులందరికి ధనధాన్యములు, వస్త్ర భూషణాదులను ఇవ్వగా బ్రాహ్మణులు సంతోషమెంది అతని ఆదేశముతో యజ్ఞము ఒనరింపసాగిరి.

ఆ ఆశ్రమము ఆశ్రయమొసగు క్షేత్రమయ్యెను. మునిపత్నులందరును దేవాంగనల వలె శోభిల్లుచుండిరి. బ్రాహ్మణ గణములు ఇంద్రుని తలపించుచుండిరి. అపుడాశ్రమము వందయోజనముల విస్తారముతో అనేక ప్రాణులు అచటికి చేరగా, వారిని పోషించు సౌఖ్యములను గౌతముడు కలుగచేసెను.

ఆశ్రమము నందు బ్రాహ్మణులచే యజ్ఞములు శాస్త్రోక్తముగా జరుగుచుండెను. దేవతలు కూడా సంతుష్టులగుచుండిరి. గౌతముని యశస్సును ప్రశంసించుచుండిరి.

శ్లో॥ అహో అయం నః కిల కల్పపాదపో
మనోరథాన్ పూరయతి ప్రతిష్ఠితః

నో చే దకాండే క్వ హవిర్వపా వా
సుదుర్లభా యత్ర తు జీవనాశా (12 స్క. 9అ, 36 శ్లో)

ఈ విధముగ మునివరుడగు గౌతముడు పండ్రెండు సంవత్సరములు ఆ మునులను పోషించు వ్యవస్థను ఏర్పాటు చేసెను.

గౌతముడు శ్రేష్ఠమైన స్థలము నందు ప్రాతఃకాల, మధ్యాహ్న, సాయం సమయములందు పురశ్చరణాది కర్మలు సంపన్నము చేయుచుండెను. ఆ స్థలము నందు ఇప్పుడు కూడా దేవి మూడు వేళలందు మూడు రూపములతో కనిపించును.

ఒకరోజు నారదుడచటికి రాగా మునులందరూ చూసి శాస్త్రోక్తముగా స్వాగతమును పలికిరి. నారదుడు గౌతముని యశస్సునకు సంబంధించిన వివిధ ప్రసంగములను వర్ణించసాగెను. నేను దేవ సభకు వెళ్ళినపుడు ఇంద్రుడు నీ యశస్సును గానము చేసెను, భగవతి జగదంబ కృపా ప్రసాదమున నీవు ధన్యవాదములకు పాత్రుడవు అని చెప్పి నారదుడు గాయత్రీ సదనమునకు వెళ్ళిపోయెను.

కొంత కాలానికి కొంతమంది కృతఘ్నులగు బ్రాహ్మణులు గౌతముని ఈ ఉన్నతిని విని ఈర్ష్యతో దహించుకొనిపోవుచుండిరి. వారి మనస్సులలో ద్వేషము నిండియుండెను, కృతఘ్నులైన ఆ బ్రాహ్మణులు తమ మాయ చేత ఒక గోవును సృష్టించిరి. అది బాగా చిక్కిపోయి మరణించుటకు సిద్ధముగానుండెను.

యజ్ఞము జరుగుతున్న సమయమున ఆ గోవు గౌతముని ముందుకు పోవునట్లు చేసిరి. గౌతముడు 'హుం హుం' అను శబ్దముతో దానిని నివారించెను. ఆ ఆవు ప్రాణములు పోయినవి. బ్రాహ్మణులందరూ గౌతముడు గోవును హత్యచేసెనని కోలాహలము వ్యాపింపచేసిరి.

గౌతముడు యజ్ఞము సమాప్తమైన వెంటనే ఆ గోవును చూసి మిగుల ఆశ్చర్యమునకు లోనయ్యెను. గౌతముడు కళ్ళు మూసుకొని సమాధిస్థితుడై

అందుకు కారణమును పరిశీలింపసాగెను. ఇదంతయు బ్రాహ్మణుల కుట్రయేయని అతనికి తెలిసిపోయెను. రుద్రునకువలె అతని మనస్సులో కోపము అధికమయ్యెను. తన్ను ద్వేషించెడి బ్రాహ్మణులకందరికి ఇట్లు శాపమొసగెను.

ఓరీ! నీచులైన బ్రాహ్మణులారా! నేటి నుండి మీరు వేదమాతయగు గాయత్రీ ధ్యానమునకు, ఆ దేవి మంత్ర జపమునకు పూర్తిగా అనర్హులగుదురు. వేద కార్యకలాపములను నిర్వహించుటయందు మీరు పూర్తిగా అధికారమును కోల్పోవుదురు. శివోపాసన, శివమంత్రజపము చేయుట యందు అధికారమును పోగొట్టుకొందురు.

భగవతి శ్రీదేవిని ధ్యానించుట యందు ఆమె కథాశ్రవణము నందు మీకెట్టి అధికారమును ఉండదు. మీరు శాశ్వతముగ నీచులుగ తలంపబడుదురు. శివుని ఉత్సవములు చూచుటకు శివభక్తుల నాదరించుటకు మీరు అనర్హులగుదురు. రుద్రాక్షలను, బిల్వపత్రములను, శుద్ధభస్మమును ధారణ చేయుటకు అర్హులుకారు.

నీచ బ్రాహ్మణులై మీలో నిష్ఠలేక, అగ్నిహోత్రాదిసాధనములకు కూడా మీరు దూరమగుదురు. ప్రాయశ్చిత్త వ్రతములను పూర్తిగా విడనాడెదరు. వేదములను విక్రయించుచు, తీర్థములను ధర్మములను అమ్ముకొనెడి నీచ వ్యక్తుల గతి మీకు పట్టును. మీపై భగవతి జగదంబ మిక్కిలి కోపము వహించినది. మీరు అంధకూపాది నరక కుండలములందు నివసింప వలసి వచ్చును.

అని నీచ బ్రాహ్మణులను శపించిన తరువాత నీటితో ఆచమనము చేసి గాయత్రిని దర్శించుటకు దేవాలయమునకు వెళ్ళెను. మహాదేవి చరణములకు ప్రణమిల్లెను. దేవి కూడా బ్రాహ్మణుల ఈ కృతఘ్నతను చూచి స్వయముగ తన మనస్సులో విచారమును వ్యక్తము చేయుచుండెను.

భగవతి గాయత్రి గౌతమునితో మహానుభావా! సర్పమున కొసగిన పాలు కూడా విషమునే వృద్ధిచేయును. నీవు ధైర్యమును వహింపుము. కర్మగతి ఇటులనే విపరీతముగనుండును అనెను. గౌతముడు జగదంబకు నమస్కరించి ఆశ్రమమునకు వెళ్ళిపోయెను.

ఆ తరువాత బ్రాహ్మణులు వేదాధ్యయ నమునంతయును మరచిపోయిరి. గాయత్రీమంత్రము వారి అభ్యాసమునుండి తొలగిపోయెను. పశ్చాత్తాపముతో వారు దండము వలె ఆ మునీంద్రుని యెదుట భూమిమీద పడి ప్రణామమొనరించగా మునీంద్రుని హృదయము కరుణతో బ్రాహ్మణులారా! శ్రీకృష్ణుడు అవతరించునంత వరకు మీరు కుంభీపాక నరకము నందు నివసింపవలసివచ్చును.

భగవంతుడైన శ్రీకృష్ణుడు ఎప్పుడు అవతరించునా అని మీరు ఎదురుచూడుడు. కలియుగము నందు భూమండలమున జన్మించెదరు. మీరు శాపము నుండి ముక్తులు కాదలచినచో భగవతి గాయత్రీ చరణములను నిరంతరము ఉపాసించుట మిగుల అవసరము అని పలికి మునీంద్రుడు బ్రాహ్మణులను పంపివేసెను.

రాజా! భగవంతుడగు శ్రీ కృష్ణుడు పరమధామమును చేరిన పిమ్మట కలియుగము వచ్చెను. ఆ బ్రాహ్మణులకు ముక్తి లభించెను. భూమండలమున వారు జన్మించిరి. రాజా! అన్ని విధముల భగవతి పరమేశ్వరిని ఆరాధించవలెను.

ఆదిశక్తి భగవతి భువనేశ్వరి నివసించు దివ్యమైన పరమధామము మణిద్వీపమును గూర్చి తెలిపెదను శ్రద్ధగా వినుము అనెను.

4. మణి ద్వీపము

(మహాకవి దాసు శ్రీరాములు గారి వచనం యథాతథం)

వక్రగతి రగడ -

బ్రహ్మలోకమునకు నూర్ధ్వ భాగమందుఁ జెల్వు మీఱు
బ్రహ్మమైన సర్వవిష్టపంబు దానినే మణి
ద్వీపమంద్రు సర్వ జగదతీతమహిమ నొప్పియుంట
లోపమెందు లేమి సర్వలోక నామ మిడిరి తొల్లి
దేవిచేత నద్ది నిర్మితి న్వహించి మించె నిచ్చ
దేవినెన్నఁ గలడె బ్రహ్మదేవుఁడైన శేషుడైన
నీ సమస్త దేశములు మహీతలంబు నింగి కై
లాస లోకమెన్న నవ్విలాసము ల్మనంగలే వ
కుంఠలీలఁ దనరు దాని గొప్పదనము సెప్ప నవ్వి
కుంఠమైనఁ బోలలేదు గోజగంబు పొగడనగునె
జగమునకును గొడుగువలెనె చల్ల దనము నిచ్చుచుండు
నొగిఁ దలిర్చుచుండుఁ బెక్కు యోజనములు నిడివి గలిగి
పరగ దానిఁ జుట్టియుండుఁ బాలవెల్లి దట్టమగుచు
దరగలందుఁ జల్లదనము దరుగకుండు నిరత మోలి
జరుగుచుండు లెక్కపెట్టఁ జాల మెన్ని యోడ లెపుడు
గురుతు మీరు గొప్ప రత్న కుజము తీరమందుఁ దనరు
కోట యేడు యోజనములఁ గొమరు మిగులు దానియెత్తు
దాటనీరు వివిధ శస్త్రధారులైన భటులు గాచి
మీరు నాల్గు ద్వారములును మెప్పుగాంచుచుండు దాని
ద్వారపాలకులును నచటఁ దప్పకుండ్రు నూర్వురెలమి
వాసి మీర దేవభక్తవరులు వారు దేవిఁ జూడ

నానతోడ వచ్చువారి సంపుచుండ్రు దీనిజాడc
దత విమాన శతము నాదితంబు ఘంటికాయుతంబు
గతులయందుc జక్కదనము గలుగు హయము లెన్నియెన్ని
కెరలివేత్ర హస్తకోటి కిలకిలారవంబులెన్ని
అరుగు వారు వచ్చువారు నమరవరుల పంజ్తులెన్ని
కొలcకు లెన్ని బావులెన్ని గుంట లెన్ని చెరువు లెన్ని
అలవి కాదు లెక్క సేయ నలరుc దోట లెన్నియెన్ని
గోపురంబు లెన్ని వృక్ష కోటు లెన్ని పక్షు లెన్ని
పూప లెన్ని కాయ లెన్ని పూవు లెన్ని ఫలము లెన్ని
యెల్ల శాల మొక్కరీతి నెలమి నందు గల్గియుండు
జల్లగాలి విసరుచుండు సర్వఋతువులందు నిండి
కమ్మతావులెల్ల యెడలc గలిగియుండు సంతతంబు
కొమ్మలందుc గోకిలములు గూయుచుండు మెండుగాను
నిమ్మ దబ్బ జేమ పనస నీప వకుళ లోధ్ర పాద
వమ్మ లామ్ర కర్ణి కార పారిజాత పాటలంబు
లగరు దేవదారు కాంచ నాశ్వకర్ణ తాలకోల
భృగు తమాల నాగ కుంద బిల్వ పిప్ప లాబ్జ బంధు
జీవ కనక సప్తవర్ణ శింశుమార వృక్ష సమితి
చేవమీఱc గనులకింపు సేయుచుండు నెల్లయెడల.

రాజా! బ్రహ్మలోకమునకు పై భాగము నందు సర్వలోకము కలదు. అదియే మణిద్వీపము. అచట భగవతి జగదాంబ విరాజమానమై యుండును. సకల లోకములందును శ్రేష్ఠమైనది. అందుకే దీనికి సర్వలోకమను పేరువచ్చెను.

ఈ మణిద్వీపమునకు నాలుగువైపుల అనేక యోజనములతో అమృత సముద్రము, తరంగములు దీని శోభను ఇనుమడింపచేయును.

రత్నములతో, ఇసుకతో, చేపలతో, శంఖములతో నిండియుండును. ఆ సుధాసాగరము యొక్క సౌందర్యమును పెంపొందించుచుండును.

భగవతి జగదంబను దర్శించుటకు వచ్చుదేవతలు సౌఖ్యాలకోసం నివాసస్థానములు గలవు. వాహనములు, విమానములు ఇచటనుండును. సరోవరములు, కాంస్య నిర్మిత ప్రాకారము గలదు. అందు అనేక వృక్షములు, కోకిలలు, భ్రమరములు, పక్షులు, అనేక నదులు, పావురములు, చిలుకలు, హంసలు మిక్కిలి శోభను కలిగియుండును. ఈ లోహ ప్రాకారమునకు ముందు కాంస్య ప్రహరీ కలదు.

కాంస్య ప్రాకారము తరువాత రాగి ప్రాకారము కలదు. దీని మధ్య సుందరమైన వాటిక కలదు. దీనిమధ్య సుందరమైన వాటిక కలదు. అక్కడ వసంత ఋతువు ద్వారా వసంతుడు సింహాసనారూఢుడైయుండును. అతనికి మధుశ్రీ, మాధవశ్రీ అనే ప్రసిద్ధులైన ఇరువురు భార్యలు కలరు. ఆ దేవీమణులు పుష్పగుచ్ఛములు బంతితో ఆడుకొనుచుందురు, గంధర్వులు తమ పత్నులతో అచట విరాజమానులైయుందురు.

దాని తరువాత ఆ వాటికకు స్వామి 'గ్రీష్మ' ఋతువు ఇతనికి 'శుక శ్రీ', 'శుచి శ్రీ' అను ఇరువురు భార్యలు కలరు. అచట సిద్ధులు, దేవతలు నిండియుందురు.

ఈ గాజు ప్రాకారమునకు ముందు ఇత్తడి ప్రాకారము కలదు. ఈ ప్రాకారమునకు మధ్యభాగమున మలయగిరి వృక్షవాటిక కలదు. వర్షఋతువు దీనిని వ్యవస్థీకరించును. వర్షరాజు ఇంద్రధనుస్సుతో వేలకొలది జలధారలను వర్షించును.

నభఃశ్రీ, నభస్యశ్రీ, స్వరస్యా, రస్యమాలినీ, అంబాదులా, నిరత్ని, అభ్రమంతి, మేఘయంతిక, వర్షయంతి, చివునిక, వారిధార, సమ్మత, ఈ పండ్రెండు శక్తులు వర్షఋతువు యొక్క పత్నులుగ చెప్పబడుదురు.

దేవతలు, సిద్ధులు, దేవియజ్ఞములకు సంబంధించిన కార్యములందు నిరతులైయుందురు.

ఇత్తడి ప్రాకారమునకు ముందు భాగమున పంచలోహములతో ప్రాకారము కలదు. దీని మధ్యభాగమున దివ్యమైన వృక్షవాటిక కలదు. దీనికి అధిష్ఠాత 'శరద్ ఋతువు'. ఇతనికి 'ఇషు లక్ష్మి, ఊర్ణ లక్ష్మి' అను పేర్లు గల ఇరువురు దేవీమణులు గలరు. ఈ ఆరు ప్రాకారముల ఎదుట ఏడవది రజిత ప్రాకారము కలదు. దీని మధ్య భాగమున పారిజాత ఉపవనము కలదు. హేమంత ఋతువు ఈ ప్రాకారమునకు యజమాని.

ఈ హేమంత ఋతువునకు 'సహస్రి', 'సహస్య శ్రీ' అను పేర్లతో రెండు శక్తులు గలవు. భగవతి యొక్క కృచ్ఛ్ర మొదలగు వ్రతములను ఉపాసించు సిద్ధపురుషులిచట ఉందురు. ఈ రజిత ప్రాకారము తరువాత ఎనిమిదవది సౌవర్ణశాల అని పిలువబడును, మధ్యలో సుందరమైన కదంబ వాటిక కలదు. శిశిర ఋతువు యొక్క ఆదరణీయమైన దైవము కార్యములను నిర్వహించును.

"తపఃశ్రీ' 'తపస్యశ్రీ' అను పేర్లతో ప్రతిష్ఠితలైన ఇరువురు భార్యలు ఇతని వెంటనుందురు. దేవిని ప్రసన్నత కొరకు గోదాన, భూదానములొనరించు మహాసిద్ధపురుషులకు నివాస స్థానమైయున్నది.

ఈ బంగారు ప్రాకారమునకు ముందు కుంకుమతో, అరుణ కాంతులతో, పుష్పరాగమణులతో ప్రాకారము కలదు. తరువాత ఇంకొకటి లక్ష రెట్లు అధిక తేజస్సుతో విరాజిల్లుచుండును. ఇంద్రాది దిక్పాలకులు సమాజమేర్పరచుకొని ఉత్తమమైన ఆయుధములను ధరించి ఇచట నివసించెదరు, ఈ మణిద్వీపమునకు తూర్పు దిశయందు అమరావతి నగరమున్నది. నగరశోభను వనములతో ఇనుమడింపచేయును. ఇది ఇంద్రుని పట్టణము.

సీ. రాజితంబగు పుష్యరాగంపు cగోటలో నఖిలసరోజగర్భాండములను
గల దిశాపతులు వర్తిలుదురుసుమి సమష్ట్యాత్మరూపులగుచు
నతిముదమున
నందు నింద్రుండుండు నామకంబునకు నెక్కుడై యొప్పు నై
రావతాధిరూడు
డై వజ్రహస్తుడై యమరసేనాపరివృతుడయి యా శత క్రతుడు పొల్చు

తే.గీ. అచ్చరలతోడ, శచితోడ నతని వలెనె
యంగనల గూడి వహ్నియుయముడు రాక్ష
సుండు వరుణుం డనిలుడు శ్రీదుండు శివుడు
నందు నుందురు భటులతో నవని నాథ!

అగ్ని యాగ్నేంబున స్వాహా స్వధాయుక్తుండై, నిజవాహన భూషాధ్యుండై, నిజదేవగణ పరివృతుడైయుండు. యముడు యామ్యదిశను దండధరుండై, స్వభట పరివేష్టితుండై, చిత్రగుప్తపురోగముండై, నిజశక్తితోc గూడి విహరించును.

నిర్ఋతి నైరుతి దిగ్భాగంబున రాక్షస పరివృతుండై, పడమటి దిక్కున వరుణుడు వారుణ దిగ్భాగంబునంబ్రవర్తిల్లును.

వాయుదేవుండు వాయవ్యకోణంబున వాయుసాధన సంసిద్ధులగు యోగులచే బరివృతుండగుచు, ధ్వజహస్తుండై, విశాలాక్షుండై మృగవాహనంబునెక్కి మరుద్గణంబులు గొలువ భాసమానుండైయుండును. కుబేరుండుత్తరంబున యక్షాధిపత్యంబు సేయుచు వృద్ధియు, బుద్ధియు నను శక్తులం గూడి నవవిధులతో నలరుచుc దుందిలుండై మణిభద్రుండును బూర్ణభద్రుండును, మణిమంతుడును, మణికంధరుండును, మణి భూషణుండును, మణిమాలుండును, మణికార్ముకుండును, యక్ష సేనాపతులంగూడి నిజశక్తియుతుండై క్రీడించును.

రుద్రుండు ఈశానకోణంబున అధీశ్వరుండై నిజచాపశరధి బాణాన్వితుండై, శూలధరులును, వికృతాస్యులును, గరాళవదనులును, వమద్వహ్ని ముఖులును, దళహస్తులును, శతపాణులును, సహస్ర భుజులను, దశపాదులను, ద్రినేత్రులు, ఉగ్రమూర్తులును రుద్రాధ్యాయంబునంజెప్పపడిన భూచరులు నుండును.

వియచ్చరులును నగు రుద్రులతోడంగూడి రుద్రాణీకోటిసహితుండై, భద్రకాళ్యాదిమాతృకలతో నానాశక్తి సమావిషడామర్వాది గణావృతుండై, వీరభద్రాది సమన్వితుండై ముండమాలాధరుండై, నాగవలయుండై, నాగకంధరుండై, వ్యాఘ్రచర్మపరీధానుండై, గజచర్మోత్తరీయుండై, చితాభస్మలిప్తాంగుండై ప్రమథాది గణావృతుండై, డమరునాదంబు సేయుచు భూతసంఘసమావృతుండై భూతవాసుండై నర్తించుచుండును.

ఆ.వె. పుష్యరాగసాలమునకు నవ్వలఁ బద్మ
రాగమణులతోట రహి వహించు
దానియెత్తు సూడ దశయోజనంబులు
విమల రమ్యగోపురములు గలవు

సీ. పద్మరాగస్తంభ భాసితంబైయుండు మండపశతక సన్మండితంబు
విద్య లర్వదినాల్గు వీరులైనడుమను నానాభరణసాధనముల బూని
ప్రత్యేకవిష్టపపాలినులై పరిచారికలను గూడి స్వస్వలోక
జనులతో మరియు వాహనహేతిధనముతో వారిపేళ్ళను విను వరుస నధిప

తే.గీ. పింగళాక్షి విశాలాక్షి వృద్ధియును న
మృద్ధయును శ్రద్ధయును దాని నెనసి స్వాహా
స్వధయు మాయ వసుంధర సంజ్ఞలోక
ధాత్రి సావిత్రి పిదప గాయత్రి మరియు

సీ. ఒగి త్రిదశేశ్వరి యును రూప బహురూఢ సొరిది చస్కంద
యచ్యుతయు బ్రియయు
విమలయు నరుణియు నమలయు నారుణి ప్రకృతియు సృష్టియు
వికృతియు స్థితి
సంహృతి సంధ్యయు సతి, హంసి, మర్థిక, వజ్రికయును నాకవాసమాత
భగవతి దేవకి పంకజాసనమును ద్రిముఖి యన్యయును సత్తముఖి యవల

తే.గీ. దేవతా పూర్వదేవ మర్దినియు నూర్ధ్వ
కేశిలంబోష్ఠి బహుశీర్ష గీతచరిత
యగు వృకోదరి రథరేఖ యబ్జరేఖ
గగనవేగయు బవనవే గయును నంద్రు

సీ. పయిపయి మదనాతురయు ననంగయు నంగమథనయు నంగ
సుమయు ననంగ
మేఘులయును బేరుమించిన విశ్వరూపయు సురాదికయును
క్షయకరియును
నక్షోభ్య సత్యవా గంచిత వివిధ రూపయు శుచివ్రతయును వాగదీశ
యును నుదారయు నాఁగ లొప్పారుదురు వీరు జిహ్వాల నిప్పులు
చెరగు చుంద్రు

తే.గీ. ఏడు సంద్రంబులను ద్రావి యినుని మ్రింగి
గాలి స్తంభించి సకల జగంబు నమిలి
వైతు మనుదురు నరుణేక్షణాతతలయి
విహరణ మొనర్చుచుందు రుర్వీతలేశ

వీరందరును శరశరాసనధారిణులును, యుద్ధోత్సుకలును దంష్ట్రాకటకటారవబధిరీకృతదిఙ్ముఖులును, పింగోర్ధ్వకేశలును అక్షౌహిణీ సేనాసమేతలు నైయుందురు. ఒక్కొక్కశక్తి లక్షబ్రహ్మాండంబుల నాశనంబు సేయు సామర్థ్యంబుగలిగియుందురు.

శత అక్షౌహిణుల సేనయు అంతియె సామర్థ్యము గలిగియుందురు. రథగజతురగంబులు లెక్కింప నలవిగాదు. పద్మరాగ సాలంబునకు బిమ్మట గోమేధిక మణినిర్మిత సాలంబు గలదు. దాని యెత్తు పదియోజనములు. ఈ రెండు కోటల నడిమి భూమి జపాపుష్ప సన్నిభంబు కలదు. సకల పక్షి, వృక్ష, కుడ్య, స్తంభ సదన, గోపురాదులు, గోమేధికమయములు.

అందుండు భగవతికి ముప్పది ఇద్దరు శక్తులుగలదు. గోమేధిక మయములగు శస్త్రములు ధరియింతురు. వారికి ప్రత్యేక లోకములు కలవు. వారు పిశాచవదనలు, స్వలోకవాసులచే నిరతములు పూజింపబడుచుందురు. భింది భింది, ఛింది, ఛింది, దహదహయని పలుకు చుందురు. నిరంతర యుద్ధోత్సుకలైయుందురు.

ఒక్కొక్క శక్తికి పదేసియక్షౌహిణుల బలగంబుండు. ఒక్కొక్కశక్తికి లక్ష బ్రహ్మాండముల నశింపచేయు సామర్థ్యము గలిగియుండును. అచ్చటి రథగజాశ్వాదులగణ్యంబులు. వారి నామములు వివరించెద వినుము.

1. విద్య, 2. హ్రీ, 3. పుష్టి, 4. ప్రజ్ఞ, 5. శినీవాలి, 6. కుహువును, 7. రుద్ర, 8. వీర్య, 9. ప్రభ, 10. నంద, 11. పోషణి, 12. బుద్ధిద, 13. శుభ, 14. కాళరాత్రి, 15. మహారాత్రి, 16. భద్రకాళి, 17. కపర్దిని, 18. వివృతి, 19. దండిని, 20. ముండిని, 21. చంద్రఖండధారిణి, 22. శిఖండిని, 23. నిశుంభ శుంభమధిని, 24. మహిషాసుర మర్దిని, 25. ఇంద్రాణి, 26. రుద్రాణి, 27. శంకరార్ధశరీరిణి, 28. నారాయణి, 29. త్రిశూలిని, 30. పాలిని, 31. అంబిక, 32. ఆహ్లాదిని అని చెప్పుచుందురు.

వీరికి కోపంబు కల్గినప్పుడు బ్రహ్మాండనాశనంబు కలుగును. వీరలకు పరాజయము లేదు. గోమేధిక సాలంబున కవ్వల వజ్రమణిమయా వరణంబు గలదు. అది నవవృక్ష సముజ్వలంబు. అందుండు గృహారామక్షేత్ర

వృక్షాల వాలాదులన్నియు వజ్రమయంబులు, అందు జగదంబ పరిచారికలు చరియింతురు, ఒక్కొక్కతెకు లక్ష దాసులుందురు.

కొందరు వీవనల, కొందరు బంగారు గిన్నెల, కొందరు తాంబూలదళంబుల, కొందరు ఛత్రంబుల, కొందరు చామరంబుల, కొందరు వస్త్రంబుల, కొందరు పుష్పంబుల, కొందరు ముకురంబుల, కుంకుమ లేపంబుల, కజ్జల పాత్రంబుల ధరించికొని కనిపెట్టియుందురు.

కొందరు పాద సంవాహనంబులును, అలంకారంబులు చేయుచుందురు. దేవీకృపా విశేషంబున వారు తుచ్ఛీకృత జగత్త్రయులై యుందురు. వారి పేర్లు వివరించెద వినుము. అనంగ రూప, అనంగ మదన, సుందరీ, మదనాతుర, భువనవేద, భువన పాలిక, సర్వ శిశిర, అనంగ వేదన, వీరందరును, విద్యుద్వల్లీ సమనాంగులును, క్వణత్కాంచీ గుణాన్వితలును, రణన్మంజీరచరణులును, సర్వకార్యకుశలలును, వేత్రహస్తంబులును నై పరగుచుందురు.

వీరు ప్రాకార బహిర్దేశంబు నెనిమిది దిక్కుల నుందురు. వీరికి వజ్రమయ గృహంబులు గలవు. వజ్రప్రాకారంబు గడచిపోవ వైడూర్యసాలంబు గలదు. అందు వాపీ కూప తటాకాదులన్నియు వైడూర్యమయంబులు. బ్రాహ్మ్యాది నామంబుల నిజగణంబులతో శక్తులు వసింతురు.

బ్రాహ్మియు, మహేశ్వరియు, కౌమారియు, వైష్ణవియు, వారాహియు, ఇంద్రాణియు, చాముండయు, ఎనిమిదవదై మహాలక్ష్మి, వీరుమాతలు, బ్రహ్మ రుద్రాది దేవతలకు సమాకారలై ప్రవర్తిల్లుదురు. వీరు స్వస్వసేనా సమావృతలైయుందురు. వారికి గజ, తురగ, శిబికా, హంస, సింహ, గరుడ, మయూర, వృషభ, స్యందనాదులు కోటుల తరబడినుండును, బహు చిహ్నచిహ్నితంబులగు విమానంబులు అనేకములు గలవు.

వైడూర్యమణి సాలంబునకుం బిమ్మట దశ యోజనోన్నతంబై ఇంద్ర నీల మణిసాలంబు గలదు. దాని నడుమ అన్నియు ఇంద్రనీలమయంబులు మరియు బహుయోజన విస్తృతంబై షోడశారంబై, దీప్యమానంబై, సుదర్శన సమంబై పద్మంబు దనరారు. దానియందు షోడశ శక్తుల స్థానంబులు గలవు.

అవి సర్వోపస్కరయుక్తంబులు. కరాళియు, కరాళివియు, ఉమయు, సరస్వతియు, శ్రీయు, దుర్గయు, సుషయు, లక్ష్మియు, శ్రుతియు, స్మృతియు, ధృతియు, శ్రద్ధయు, మేధయు, మతియు, గాంతియు, నార్యయు నను పదియార్వురు శక్తులు. నీలనీరదసంకాశలు, కరవాలహస్తలు, ఖేటక ధారిణులు, యుద్ధోత్సాహసమేతలు, వీరు జగదంబ సేనా నాయికలు.

వీరలెల్లరు బ్రహ్మాండ శక్తులం బాలించుచుందురు. నానావిధ రథసమారూఢలై, పరాక్రమవతులై, నానాశక్తులం గూడివసింతురు, ఇంద్రనీల సాలంబున కవల దశ యోజనోన్నతంబైన ముక్తాప్రాకారంబు గలదు. మధ్యప్రదేశంబు పూర్వోక్త విధంబ. అందు జగద్యార్థ ప్రబోధికలగు జగదంబ మంత్రిణులుందురు.

వీరుదేవితో సమానంబులైన భోగంబులు గలవారు, ఇంగితజ్ఞలు, పండితలు, సర్వకార్యకుశలలు, స్వామికార్యపరాయణలు, చతురలు, అతిసుందరులు, నానాశక్తి సమాయుక్తలునయి జ్ఞానశక్తిచే సర్వసమాచారంబులు గ్రహింతురు. అనంగకుసుమ, అనంగకుసుమాతుర, అనంగ మదన, అనంగమదనాతుర, భువనపాలిని, గగనవేగ, శశిరేఖ, గగనరేఖ, పాశాంకుశ, పరాభయధారిణి, అరుణవిగ్రహ అను నామంబులచే వర్తిల్లుదురు.

ముక్తాసాలానంతరంబు మరకతసాలంబు వర్తిల్లు. దాని పొడవు దశయోజనప్రమాణంబు. అది షట్కోణయుతంబు, పూర్వకోణంబున

జతుర్వక్త్రుండై, గాయత్రీసహితుండై, కుండికాక్షపాశాభయదండాయుధ ధరుండై ధాతయు, గదాయుధ ధారిణియగు గాయత్రీదేవతయు, మూర్తి మంతంబులైన వేదశాస్త్ర పురాణేతిహాసంబులును వానిం గొల్చుచుండు

రెండవదగు నిఋతికోణంబున సావిత్రీసహితుండై మహావిష్ణుండుండు. మూడవ కోణంబగు వాయుకోణంబున సరస్వతీ సహితుండై రుద్రుడుండు.

రుద్రభేదంబులును, గౌరీ భేదంబులును మూర్తిమంతంబులైన చతుష్షష్ట్యాగమంబులు నందుండు. నాల్గవదియగు నగ్ని కోణంబున రత్నకుంభమణికరండకంబులంబూని ధననాయకుండగు కుబేరుండు మహాలక్ష్మీ సమేతుండైయుండు. నైదవదియగు వారుణకోణంబున రతీసమేతుండై, పాశాంకుశధనుర్బాణ సమేతుండై, శృంగారమూర్తియైన మన్మథుడుండును.

ఆరవదియగు నీశానకోణంబున బుష్టినమన్వితుండై, పాశాంకుశధరుండై, వీరుండై విఘ్నహర్తయైన గణేశుండుండు. మరకతసాలంబు గడచిన నూరామడయెత్తుగల్గి కుంకుమారుణంబైన ప్రవాళసాలంబు వర్తిల్లు. అందు పంచభూతాధి దేవతలగు హ్రీల్లేఖయు, గగనయు, రక్తయు, గరాళికయు, మహుచ్ఛుష్మయు, బాశాంకుశపరాభయ ధారిణులై, మితభూషణలై, దేవీ సమానవేషాధ్యలై, నవయౌవన గర్వితలై వసియింతురు.

ప్రవాళసాలంబు విడిచిచన బహుయోజన విస్తీర్ణంబై నవరత్నమయ సాలంబు వర్తిల్లు. అందు దేవ్యవతారంబులుండ్రు. వారు దేవీ సమాన ప్రభలు, జ్ఞాన రూపిణులైయుందురు, సప్తకోటి మహామంత్ర దేవతలు నిచ్చటనయుందురు. నవరత్న మయ సాలంబు దాటిపోవ, మహనీయ చింతామణి ప్రాకారంబు వర్తిల్లు. అదియనుపమానంబు దాని వర్ణింపనెవ్వరి తరంబు అదియే దేవీసదనంబు.

సీ. చింతామణులకోట యంతరంబున నాల్గు
మండపంబులు మహామణియుతములు
కోటిసూర్యులతోడ దీటైన ప్రభలతో
జను సహస్ర స్తంభ సంయుతములు
మహితమౌ శృంగారమండపం బొక్కటి
నలువైన ముక్తి మండపము నొకటి
మండిత సుజ్ఞాన మండపం బొక్కటి
యేకాంతమండపం బెసగ నొకటి

తే.గీ. మొరయు వానికి జుట్టు గాశ్మీర వనిక
మల్లి కాకుందవనికయు నుల్లసద్వి
తానపంక్తియుఁ బుష్కలస్థానములును
వాని వర్ణింప వేనోళ్ళవాని తరమె?

మరియు గురునింద మణిసోపానశోభితములగు మహాపద్మాటవి సుధారస సంపూర్ణంబైయుండు. హంసకారండవాదిపక్షిసంకులంబు లక్షీణంబులై యుండు. శృంగారమండపంబున వివిధస్వరంబులతో దేవీ సమూహంబులు గానంబు సేయుచుందురు. సభాసదులు దేవతలు, సభామధ్యంబున జగదంబ కొలువు సేయుచుండు, ముక్తిమండపమధ్యంబున శివ, బ్రహ్మానందమయిమై యుండును.

జ్ఞానమండపంబున జ్ఞానోపదేశంబు సేయుచుండు, చతుర్థంబగు నేకాంతమండపంబున జగన్మాత మంత్రిణులతోగూడి జగద్రక్షాచింతనంబు సేయుచుండును, చింతామణిమయంబగు గృహంబున శక్తితత్వాకంబులగు సోపానదశ కంబుతో నలరు మంచకం బొక్కటి శోభిల్లును.

బ్రహ్మయు, విష్ణుండు, రుద్రుండును, ఈశ్వరుండును మంచకంబునకు ఖురంబులుగానుందురు. ఫలకంబు సదాశివుండు దాని పై మహాదేవుండగు పరమపురుషుండు వర్ధిల్లును, లీలార్థంబు శక్తియొక్కతయు స్త్రీ

పురుషదేహంబుల రాజిల్లునని తెలియునది. ఆ మహాదేవి నభినుతింప నెవ్వని తరంబు?

సీ. శతకోటికందర్పసమసుందరాంగుండు ముక్కంటియును
నైదుమోములాడు
రత్నభూషణుఁడు సారంగాభయపరశు వరముల బాహుల వరలువాడు
పదియునారైన యబ్దముల యీడగువాడు నఖిలలోకాధీశు డైనవాడు
కోటిసూర్యులతోడ దీటైన ప్రభవాడు శీతాంశుశతకోటిశీతలుండు

తే.గీ. ననుపమాక్షస్ఫటికమూర్తి యైనవాడు
మోమునందున జిరునవ్వుమొలచువాడు
మేలు వారలలోనెల్ల మేలునాడు
నైన పురుషు నెడమతొడ నంబ కులుకు

సీ. నవనవరత్నగణ ప్రాంచితంబయి రాణ జెన్నొందునొడ్డాణమొప్ప
వైడూర్యమణివిభావ్యాప్తి దిగ్వలభులౌ నపరంజిభుజకీర్తు లవఘళింప
మెరుగు చెక్కుల కాంతు లొరసెడి శ్రీచక్ర తాటంకములు తళ తళ యనంగ
నరచందమామయొయ్యారంబు దెగడు లలాటకాంతులు బలు నీటు చూప

ఆ.వె. మోవిదొండపండు మురువును హసియింప
నెమిలికుంచె చూడ నిమిడి మెరయ
సొంపుమీర మృగమదంపు నామము గుల్క
రవలు చెక్కుముక్కెరయు రహింప

సీ. గాటుచింతామణి గాగ సుపాణిముత్తెమువ్రేలెడి బులాకి దీప్తి గుల్క
కర్పూరమును మంచిగందంబు కుంకుమ మలదిన చనుకట్టు చెలువుమీర
చిత్రచిత్రములైన చిన్నారినగలతో దరసమంబైన గంధర దలిర్ప
దాడిమీఫలబీజ దంతపంక్తి యనంగ రత్నకిరీటశిరస్క యగుచు

తే.గీ. అబ్జగత భృంగ సమవదనాలక యయి
శారదేందునిభాస్యయై జాహ్నవీన

దీజలావర్తనాభియై దివ్యరత్న
ముద్రికాంగుళియై జగన్మోహినియయి

సీ. వెలిదమ్మిరేకులవలె నున్న మూడుకన్నులతోడ మాలికావలులతోడ
మణికింకిణీయుక్త మణికంకణముతోడ మణిసరంబులతోడ మహిమ తోడ
మణికంచుకముతోడ మల్లి కామోదధమ్మిల్లంబుతోడ మైమరపుతోడ
వృత్తస్తనయుగ మహిత కాంతితతులతో సర్వశృంగార వేషములతోడ

తే.గీ. ననుపమవరాభయేద్ధ పాశాంకుశ విల
సద్భుజలతోడ గరుణారసంబుతోడ
జారు సుకుమారతనులతాస్ఫారకాంతి
పుంజములతోడ మహనీయ భూతితోడ

సీ. సల్లాపనిర్జిత పల్లకి యగుచు మహోల్లాసహాససంపుల్ల యగుచు
బహువయస్యలతోడఁ బరిచారికలతోడ సురభామినులతోడ సురలతోడ
సమధికేచ్ఛాశక్తి జ్ఞానశక్తి క్రియాశక్తులతోడ లజ్జయును దుష్టి
పుష్టియుఁ గీర్తియు బుద్ధియుఁ గాంతియు దయయును క్షమయు
మేధయును స్మృతియు

తే.గీ. మూర్తిమతులయి లక్ష్మియు మొగి జయమును
విజయ యజితాపరాజితల్ వినుము నిత్య
యును విలాసిని మంగళ యొనర దోర్ధి
ఘోరయును భీరశక్తులై కొలుచుచుండ

సీ. ఇరుపార్శ్వములయందు నెలమి శంఖంబును బద్మంబునను నిధుల్
పరగుచుండు
సప్తధాతువులు కాంచనరసంబులు మణుల్ నిధులయందును బుట్టి
నెమ్మి నేరు
లగుచు సుధాంభోధియందుఁ బ్రవేశింప దేవీగృహంబు విస్తీర్ణ మహిమఁ
దనరారు వేయియోజనములై యదియెల్ల చింతామణులతోడ జేయబడియె

తే.గీ. దాని కవ్వలc గోటలు తనరుచుండు
మును వచించిన వానికి నినుమడించి
తగు వియత్పథమున నిరాధారమగుచు
విచ్చుముడుచు సృజన లయ విధము లెరిగి

అయ్యయి బ్రంహ్మాండంబుల వర్తిల్లు, దేవ్యోపాసకుల తంబునం జెందునది చింతామణి గృహంబు. అందు ఘృతకుల్యలును, దుగ్ధకుల్యలును, దధికుల్యలును, మధుకుల్యలును, నమృత ద్రాక్షా జంబూరస ప్రవాహంబులు, నామ్రేక్షురస ప్రవాహంబులునుంబ్రవహించుచుండును.

మనోరథఫలదంబులగు వృక్షంబులును, బావులును, నూతులు, యథేష్టాపానఫలదంబులై యుండు. రోగంబును, ముసలితనంబును లేవు, చింతా మాత్సర్య కామ క్రోధాదికంబు సెప్పరాదు. ఎల్లరు సశ్రీకులై సహస్రాదిత్య వర్చస్సులై యవ్వనవంతులై యా చింతామణీగృహంబునం గొలువుండు భువనేశ్వరిం గొల్చుచుందురు.

కొందరు సాలోక్యంబును, కొందరు సామీప్యంబును, కొందరు సారూప్యంబును బొంది యుందురు. తక్కిన వారు పార్శ్వగతులైయుందురు. సామ్యావస్థాత్మికయు, కారణ బ్రహ్మరూపయు, మాయాశబల విగ్రహయునగు నా భువనేశ్వరిం గొల్చు మూర్తిమంతంబులై సప్తకోటి మహామంత్రంబులు, మహావిద్యలు నందుండును.

అదితేజోమయంబు, సూర్యచంద్రాగ్ని విద్యుత్తులు దాని తేజంబులో కోటి వంతును లేవు. ఒక్కచో బగడంపుజాయ, ఇంకొకచో గరుడపచ్చవన్నె. మరియొకచో మెరపుడాలు, వేరొకచో సూర్యకాంతి, ఒండొకచో నింద్రనీలమణి ప్రభ, యన్యస్థలంబున వజ్రంపు డంబు, దావానల కాంచన శోభ లందంద పొడసూపును.

చంద్రోపల, సూర్యోపలోద్గారంబు లయ్యె యెడల గనృట్టు సర్వంబును నచ్చట రత్నమయంబై యుండు సకలానందపరిపూర్ణంబు, సకలైశ్వర్య విరాజితంబు, సమస్తసుఖప్రదంబు నై యొప్పుచుండును.

రాజా! మణిద్వీపమును స్మరించినంతనే సకల పాపములు నశించును. మరణసమయమున మణిద్వీపమును స్మరించిన ప్రాణి ఆ ధామమునకే వెళ్ళును. ఈ విషయమును 'అధ్యాయపంచక'యని చెప్పుదురు.

నిత్యము దీనిని పఠించిన ప్రాణులు భూత, ప్రేత, పిశాచాది బాధలనుండి ముక్తులగుదురు. నూతన గృహనిర్మాణము వాస్తుదేవతను పూజించు సమయమున దీనిని పఠించిన వారికి శ్రేయస్సు లభించును.

5. జనమేజయుడు అంబాయజ్ఞము చేయుట

వ్యాసుడు జనమేజయ మహారాజా! ఎనిమిదవ స్కంధము నుండి ఈ విషయములనంతటిని నారాయణుని ద్వారా మహాత్ముడైన నారదునకు చెప్పబడెను. దీనిని వినిన మానవుడు కృతకృత్యుడగును. రాజేంద్రా! ఇప్పుడు నీవు నీయొక్క నీ తండ్రి యొక్క ఉద్ధారమునకు దేవీయజ్ఞమొనరింపుము.

దేవియొక్క సర్వోత్తమము ఉత్తమము అగు మంత్రదీక్షను చేకొనుట నీ పరమ కర్తవ్యము. విధి విధానముగ గ్రహించిన ఈ మంత్రము మానవజన్మను సఫలమొనరించును, వ్యాసుని వచనములను వినిన తరువాత జనమేజయుడు మంత్రదీక్ష నొసగమని ఆ మునీంద్రుని ప్రార్థించెను.

దేవి యొక్క 'ప్రణవ' మని పేరు గలిగిన మహామంత్ర దీక్ష విధివిధానముగ గ్రహించెను. నవరాత్రుల పుణ్యసమయమున ధౌమ్యుడు మొదలుగాగల మునులను రావించెను. అంబాయజ్ఞమును ఆరంభించెను.

శ్రీమద్దేవీ భాగవత పురాణమును బ్రాహ్మణుల ద్వారా పఠింపచేసెను. బ్రాహ్మణులను భోజనములతో తృప్తులను చేసెను. ముత్తైదువులగు స్త్రీలు, కుమారీకన్యలు, బ్రహ్మచారులకు కూడా భోజనము పెట్టబడెను. దీనులు, దిక్కులేని వారు భుజించి తృప్తులైరి. దాన ధర్మములతో తృప్తినిచెందిరి.

ఒకనాడు జనమేజయుడు యజ్ఞమును పూర్తిచేసి ఆసనమున విరాజమానుడైయుండగా నారదుడు ఏతెంచెను, రాజు మునికి నమస్కరించి ఆసనాది ఉపచారములతో కుశల ప్రశ్నలతో మునిరాకకు కారణము తెలుపమని కోరగా నారదుడు రాజేంద్రా! నేను దేవలోకమునందు అద్భుత దృశ్యమును చూచితిని. ఆ విషయము తెలుపుటకే నేను వచ్చితిని.

రాజా! మీ తండ్రిగారు దివ్యశరీరధారులైరి. వారు మిగుల పుణ్యాత్ములు. సకల దేవతలచే స్తుతింపబడుచున్నారు. ఉత్తమ రథారూఢులై వారిరువురు మణిద్వీపమునకు వెళ్ళుచున్నారు. ఇదంతయు దేవీభాగవతము వినుట వలన, దేవీయజ్ఞము సంపూర్ణమొనర్చినందువల్లనే నీతండ్రికి పరమసద్గతి కలిగెను. నీవు ధన్యుడనైతివి. కృతార్థుడనైతివి. నీ జీవితము సఫలతచెందెను. నీవు నీ తండ్రిని ఉద్ధరించితివి.

దేవలోకము నందు మహిమాన్వితమైన నీ కీర్తి విస్తరించియున్నది అని నారదుడు చెప్పిన మాటలు విని జనమేజయుని హృదయమున ప్రేమ గద్గదికమయ్యెను. వ్యాసుని చరణ కమలములకు అతడు ప్రణమిల్లెను. భగవన్ మీ కృపతోనే నేను ఈ కార్యమునందు సఫలతను పొందితిని అని ధన్యవాదములు తెలిపెను.

పాదరాయణుడు రాజుతో రాజా! నీవు సమస్తమును పరిత్యజించి భగవతి చరణకమలములను ఉపాసింపుము, శ్రీమద్దేవి భాగవతమును పఠించుట నీకు నిత్యము నియమము కావలెను. భక్తితో అంబాయజ్ఞము నందు తత్పరుడవు కమ్ము. సంసార రూపబంధము నుండి నీవు అప్రయత్నముగనే ముక్తుడగుదువు. జనమేజయమహారాజా! పురుషునకు వేదపఠనముతో సమానమైన పుణ్యము లభించును అని చెప్పి వ్యాసుడు అచటి నుండి వెళ్ళిపోయెను.

ఆ మునుల ముఖముల నుండి శ్రీమద్దేవి భాగవతమును గురించిన శ్రేష్ఠమైన ప్రశంసయే చర్చింపబడుచుండెను, జనమేజయ మహారాజు నిరంతరము శ్రీమద్దేవీ భాగవతమునే పఠించుచు వినుచుండెను.

6. దేవీ భాగవత మహిమ

"సర్వ ఖల్విదమేవాహం నాన్యదస్తి సనాతనమ్" అను ఈ అర్ధశ్లోకమే శ్రీమద్దేవీ భాగవతమను పేరుతో ప్రసిద్ధిగాంచినది. దేవి వటపత్రశాయియైన విష్ణువునకు దీనిని ఉపదేశించెను.

మొదట దీనిని బ్రహ్మ వందకోట్ల శ్లోకములతో విస్తృతముగ వర్ణించెను. వేదవ్యాసుడు శుకదేవునికి బోధించుటకోసం దీనియొక్క సారమును ప్రోగుచేసి పదునెనిమిది వేల శ్లోకములతో ఈ పురాణమును రచించెను. పండ్రెండు స్కంధములుగా దీనిని విభజించెను. అప్పుడు దీనికి శ్రీమద్దేవి భాగవతము అని పేరు పెట్టిరి.

శ్రీదేవి భాగవతము పరమ పవిత్రము, పాపనాశకము. పుణ్యప్రదమైన దీనికి మరేదియు సాటిరాదు. మానవుడు పఠించుట వలన అశ్వమేధయజ్ఞ ఫలము లభించును.

సీ. పౌరాణికుని బిల్చి వస్త్ర భూషల నిచ్చి వ్యాసమహర్షిగా వానిఁ దలచి
పూజలు గావించి పొలుపుగా నీ భాగవత మాలకింపంగ వలయు మున్ను
లిఖియించయేనియు లిఖియింపంగాజే యేనియు భక్తినిఁ బూని యొక్క
ప్రౌష్ఠపదవి వచ్చు పౌర్ణమియందును బంగారు సింగంపుఁబ్రతిమ తోడ
బాడి మొదపుతోడ బరగ దక్షిణతోడ బౌరాణికునకు ని బ్భాగవతము

తే.గీ. పొనరఁ దుభ్యం దదామి యంచును నొసంగ
వలయు నధ్యాయసంఖ్యను బ్రాహ్మణుల
సువాసినులఁ గన్నియల మరి వటువులను వి
శేష దానాదితృప్తుల జేయవలయు (మ.క.దా.శ్రీ.)

ఈ పురాణమును తెలిసిన బ్రాహ్మణునకు దానమివ్వవలెను. దక్షిణగా పాలిచ్చుదానిని అలంకృతమైన దానిని బంగారు హారముతో విభూషితయైన దూడతో కూడిన కపిలగోవును వ్యాసునకు సమర్పింపవలెను. ఈకథ సమాప్తమైనపుడు ఇందు ఎన్ని అధ్యాయములున్నవో అంతమంది బ్రాహ్మణులకు భోజనము పెట్టవలయును. వస్త్రములతో చందన, మాలలతో, పాయసాన్నము నిడి పూజింపవలెను.

ఈ పురాణగానము చేత పృథివిని దానమొనరించిన ఫలము లభించును. ఈ లోకమున సుఖములను భవించి చివరకు దేవీలోకములకు చేరుకొనును. నిత్యము శ్రవణము చేయు భక్తునికి ఏదియును దుర్లభము కాదు.

పుత్రులు లేనివారు పుత్రవంతులగుదురు. ధనము కోరువారు ధనవంతులగుదురు. విద్యార్థులు విద్వాంసులగుదురు. ఈ పురాణమున్న చోట లక్ష్మీసరస్వతులెప్పుడును వదలిపెట్టరు. బేతాళ, డాకిని, రాక్షసుల దృష్టి ఆ ఇంటి మీదపడదు. ప్రతి సంధ్యయందు పఠించిన జ్ఞానప్రాప్తి కలుగును. వైష్ణవులు, శైవులు, సౌరులు, గాణాపత్యులు, లక్ష్మిని, పార్వతిని, ఛాయను, బుద్ధి, సిద్ధులను సంతుష్టపరచుటకై ఈ పురాణమును పఠించెదరు. చైత్రము, ఆషాడము, ఆశ్వయుజము, మాఘము, ఈ మాసములందలి శుక్ల పక్షము నందలి నాలుగు నవరాత్రములందు నిత్యము ఈ పురాణమును పఠించవలెను.

శ్లో॥ సచ్చిదానందరూపాం తాం గాయత్రీప్రతిపాదితామ్
నమామి హ్రీంమయీం దేవీం ధియో యో నః ప్రచోదయాత్

భగవతి సచ్చిదానంద స్వరూపిణి. ఆ దేవియే భగవతి గాయత్రీ నామముతో ఖ్యాతివహించెను. 'హ్రీం' స్వరూపమైన ఆ జగదంబకు నేను ప్రణమిల్లుచున్నాను.

నైమిశారణ్యవాసులగు మునులు శ్రీదేవీ భాగవతము సూతుని వలన విని ఆయనను సత్కరించిరి.

ఈ కథను వినిపించుటకు సూతుడు పడిన శ్రమను క్షమించమని మునులందరు సూతుని పదేపదే ప్రార్థించిరి. అయ్యా! ఈ సంసారరూప సముద్రమును దాటుటకు మా కొరకు మీరే నౌకా రూపమున ఇచటకు ఏతెంచితిరి. శ్రీమద్దేవీ భాగవత పురాణము సకలవేదముల గుహ్యతర విషయము.

మాలిని – ఇతి స మునివరాణా మగ్రత శ్శ్రావయిత్వా
సకలనిగమగుహ్యం దౌర్గ మేతత్పురాణమ్
నత మథ మునిసంఘం వర్థయిత్వాశిషాంబా
చరణకమలభృంగో నిర్జగా మాథ సూతః

శ్రీమద్దేవీభాగవతము నందు పన్నెండు స్కంధముల కథ సమాప్తము,

'సర్వే జనా స్సుఖినోభవంతు'

7. దేవీ భాగవతంలో ఇమిడి ఉన్న సంక్షిప్త విషయాలు

దేవీ భాగవతమందు 12 స్కంధములు కలవు. పురాణాలు తెలపబడినవి. శుకుని జననం, హయగ్రీవుని అవతారం. మధుకైటభుల జననం. విష్ణువు యోగనిద్ర, బుధుడు, సుద్యుమ్నుని విషయాలు, శుకుడు సంసారాన్ని తిరస్కరించుట – జనకునిచే అవగాహన, ఇరువది ఎనిమిది వ్యాసుల పేర్లు.

వ్యాసునకు నారదునిచే ఉపాసన తెలుపుట, హయగ్రీవావతారముచే రాక్షసుడైన హయగ్రీవుని చంపుట, బ్రహ్మ దేవిని స్తుతించు విషయము, పురూరవ ఊర్వశిల పెళ్ళి, పురూరవుని ఊర్వశి పరిత్యజించుట, శుకుని వివాహము – నలుగురు కుమారులు పుట్టుక, వ్యాసుని విషాదము – శ్రీ శంకరుని అనుగ్రహము.

స్కంధము-2 : వ్యాసునిచే శంతనుని కథతో భారత కథ మొదలగుట. శంతన గంగల వివాహము - భీష్మజననం - సత్యవతి శంతనుల వివాహము, కౌరవ పాండవుల జననం, ధృతరాష్ట్రుని మరణం - పరీక్షిత్తు సర్పకాటు, జనమేజయుని పాలన, రురుడు - ప్రమద్వర - కశ్యపుడు - తక్షకుడు - జనమేజయుని ఉద్దంకు సర్పయాగమునకు ప్రేరేపించుట, అస్తీకుని వలన సర్పయాగము నిలుపదల.

స్కంధము-3 : జనమేజయుడు బ్రహ్మాండము యొక్క ఉత్పత్తిని గూర్చి వ్యాసుని ప్రశ్నించుట. దేవిచే బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులకు దివ్యవిమానము ఇచ్చుట. జగదంబిక తన స్వభావము తెలిపి మహాసరస్వతి, మహాలక్ష్మిని, మహాకాళిని, బ్రహ్మ, విష్ణు, శంకరులకిచ్చుట - బ్రంహ్మాండోత్పత్తి, సత్వాదిగుణములు - సత్యవ్రతోపాఖాన్యము, దేవియజ్ఞవిధి తెలుపుట.

మూర్ఖుడైన ఉతథ్యుడు - గొప్ప పండితుడగుట, సారస్వతమంత్రము పొందుట, జనమేజయునికి మూడు యజ్ఞములు తెలుపుట, విష్ణువును అంబికాయజ్ఞము చేయమని ఆకాశవాణి పలుకుట.

జనమేజయునకు వ్యాసుడు దేవి మహిమను తెలుపుట, రాజైన ధ్రువసంధి కథ. యుధాజిత్తు వీరసేనుల యుద్ధము, వీరసేనుడు మరణించే ఘట్టము.

మనోరమను సుదర్శనుని, వారి మంత్రి విదల్లుడు భరద్వాజ ఆశ్రమమునకు చేర్చుట, భరద్వాజ ఆశ్రమమునకు యుధాజిత్తు వెళ్లి సుదర్శన మనోరమల కోసం మునితో పలికిన మాటలకు, ముని ఇచ్చిన సమాధానము.

సుదర్శనునికి జగదంబ కృప లభించగా, శశికళను పరిణయ మాడుదునని రాణితో పలుకుట, చివరికి రాజు అంగీకారముతో శశికళ

సుదర్శనుల వివాహము, అప్పుడు స్వయంవరమునకు వచ్చిన రాజులు సుదర్శనునితో యుద్ధమునకు దిగుట. అదే సమయమున దేవి ప్రకటితమై యుధాజిత్తు, శతృజిత్తులను వధించుట వివరించబడింది.

సుదర్శనుని దేవీస్తుతి, దేవిచే వరములు పొందుట, తక్కిన రాజులకు దేవిని గూర్చి మహిమలు సుదర్శనుడు చెప్పుట, సుబాహుని ద్వారా కాశి యందు దుర్గ ప్రతిష్ఠింపబడుట.

వ్యాస మహర్షి నవరాత్రివ్రత విధానము తెలుపుట, పూజకు నిషిద్ధరాండ్రైన కన్యలను గూర్చి తెలుపుట, సుశీలుడను వైశ్యునియెడల దేవి ప్రసన్నురాలగుట.

నవరాత్రి వ్రత ప్రసంగమున శ్రీరాముని చరిత్ర వర్ణనను గూర్చి వివరించుట. శ్రీ రామావతారము, సీతాపహరణము, దైవమును గూర్చి రామలక్ష్మణుల సంభాషణ, నారదమునీంద్రుని ద్వారా నవరాత్రి వ్రతము గూర్చి వివరణ, శ్రీరాముడు నవరాత్రి వ్రతమును చేయుట, నారదుడు శ్రీరామునితో రాఘవా! నీవు సామాన్యమానవుని వలె దుఃఖపడవలదు, రావణుని వధించుటయే నీ అవతారమునకు ప్రయోజనము. శ్రీరాముడు నవరాత్రి వ్రతమును చేయుట. నారదుడు శ్రీరామునితో రాఘవా! నీవు సామాన్య మానవుని వలె దుఃఖపడవలదు, రావణుని వధించుటయే నీ అవతారమునకు ప్రయోజనము అనిచెప్పుట, శ్రీరాముడు నవరాత్రి వ్రతము కిష్కింధ పర్వతమున నిర్వహించెను. అష్టమి తిథినాడు దేవి ప్రత్యక్షమగుట, దేవి స్వయముగ అవతారములలో గొప్ప అవతారమని, మిగిలినవి కూడా చెప్పుట విశదీకరింపబడింది.

దేవి పలుకులు విన్న శ్రీరాముడు దశమి రోజున యుద్ధమునకు సన్నద్ధుడగుట, పూజలు నిర్వహించి సముద్రముపై సేతువును నిర్మించి లంకను చేరి రావణుని వధించుట నవరాత్రి ఉత్తమ చరిత్ర విన్నవారికి సకల భోగములు కలుగునని తెలియజేయబడింది.

స్కంధము-4 : జనమేజయ వ్యాసమహర్షుల అవతారములకు సంబంధించిన ప్రశ్నలు అడుగుట – వాటికి వివరణలు, వరుణ, బ్రహ్మలు కశ్యపునకు శాపములిచ్చుట – అదితికి కూడా దితి శాపమిచ్చుట, వ్యాసమహర్షి మాయ యొక్క మహిమను తెలుపుట.

శ్రీనరనారాయణుల తపస్సు ఇంద్రుడు విఫలము చేయుట, నారాయణుడే ఊర్వశి జన్మకారకుడగుట. చ్యవన ప్రహ్లాదుల సంవాదము. ప్రహ్లాదునితో నారాయణుడు వెయ్యి సంవత్సరములు యుద్ధము చేయుట, ప్రహ్లాదుడు నైమిశారణ్యమునకు వెళ్ళుట.

దేవతలకు దైత్యులకు యుద్ధము, దైత్యులు ఓడిపోగా శుక్రాచార్యుడు అభయమిచ్చుట, శంకరుడు తపస్సు చేయగా – దైత్యులు మళ్ళీ శుక్రమాతను శరణు కోరుట. విష్ణువు శుక్రమాతను వధించుటను చూచి భృగువు విష్ణువుకు శాపమిచ్చి, శుక్రమాతను భృగుపత్ని బ్రతికించుట.

శుక్రాచార్యునికి ఇంద్రకన్య జయంతి సేవ, బృహస్పతి దైత్యులను వంచించుటకు శుక్రాచార్యుడుగా అదే రూపములో రూపొందుట, దైత్యులు శుక్రాచార్యుని తిరస్కరించుట, శుక్రాచార్యుడు ఇది గమనించి దైత్యులకు శాపమివ్వగా దైత్యులు శరణువేడుట. శుక్రుడు మళ్ళీ ప్రసన్నుడవుట.

దేవాసుర యుద్ధమును వలదని దేవి చెప్పు అంశము, వ్యాసుడు భగవంతుని అవతారములు జనమేజయునకు చెప్పుట, అప్సరసల పూర్వవృత్తాంతము, పాపులు ఎక్కువైపోయినపుడు పృథివి భగవంతుని శరణుకోరగా యోగమాయ పృథివిని ఊరడించు అంశము.

శ్రీకృష్ణావతార కథా ప్రసంగము– వసుదేవుడు – దేవకిని కంసుని నుండి కాపాడే బుద్ధికుశలత, అయినా పుట్టిన బిడ్డలను కంసుడు చంపే విషయం. దేవకి బిడ్డలైన ఆరుగురు పూర్వజన్మ వృత్తాంతములు.

శ్రీకృష్ణుడు దేవకి వసుదేవులకు కారాగారమున జన్మించే సన్నివేశము– శ్రీకృష్ణుడిని రాత్రికి రాత్రే వసుదేవుడు నందుని భవనమునకు చేర్చగా – యోగమాయగా వచ్చి కంసునికి అతని మరణమును గూర్చి తెలపడము, నవజాత బాలకులనందరిని చంపమని రాక్షసులను కంసుడు పురమాయించడము శ్రీకృష్ణావతారము నుండి ప్రద్యుమ్నుడు పుట్టేంతవరకు వివరించబడింది. శ్రీకృష్ణుడు శివుని కోసం తపము చేయగా శివుడు శ్రీకృష్ణునకు వరములిచ్చుట.

స్కంధము–5 : రంభ, కరంభులు, మహిషాసురుడు, రక్తబీజుల పుట్టుక, మహిషాసురుడు దేవతపై యుద్ధమునకు వెళ్ళగా – ఇంద్రుడు బృహస్పతిని సంప్రతించగా, బృహస్పతి ఇంద్రునకు మంచి మాటలు చెప్పి, బ్రహ్మ, శంకరులతో విష్ణువు వద్దకు వెళ్ళుట.

బ్రహ్మ, శంకరుడు, విష్ణువు, మహిషాసురునితో యుద్ధము చేయగా దేవతలందరూ ఓటమి పాలైపోయిన విషయము, త్రిమూర్తులు వారివారి ధామములకు వెళ్ళుట, మళ్లీ విష్ణువును ప్రార్థించగా – విష్ణుదేవుడు మూడు దేవీమణుల రూపములు ఒక్కటిగా దుర్గాదేవి ప్రకటితమగు విషయములున్నవి.

దేవికి మహిషాసురుల మధ్య మంత్రుల సంభాషణ, దేవి వాష్కలుని, దుర్ముఖిని చంపుట, చిక్షురాఖ్య, తామ్రాక్ష, అసిలోమ, బిడాలాక్షుల సంహారము, మండోదరి చరిత్ర చండిక ద్వారా మహిషాసురుడు వధింపబడుట, దేవతలు దేవీస్తుతి, దేవి మణిద్వీపమునకు చేరుట, శత్రుఘ్నుని సర్వోత్తమ రాజ్యపాలనను వ్యాసుడు చెప్పుట.

దేవి కౌశికిగ, కాళికగ ప్రకటితమగుట, శుంభనిశుంభుల దూత సుగ్రీవుడు జగదంబతో సంభాషించుట, ధూమ్రలోచనుని మరణము, చండముండులు వధింపబడుట, రక్తబీజునితో దేవి సంభాషణ, చివరికి రక్తబీజుడు వధింపబడుట, శుంభ, నిశుంభుల మరణము చెప్పబడింది.

రాజైన సురథుడు, వైశ్యుడైన సమాధి, సుమేధుడను ముని ఆశ్రమమునకు వెళ్ళగా – దేవీమహిమ వర్ణన తెలిసికొనుట.

దేవియొక్క పూజావిధానమును తెలిసికొని సురథుడు, సమాధి తపమొనరించుట, దేవీకృపవలన సురథునకు రాజ్యము సమాధికి జ్ఞానప్రాప్తి కలుగుట.

స్కంధము-6 : వృత్రుని జననము – ఇంద్రుడు విశ్వరూపుని వధించుట, వృత్రుని ద్వారా ఇంద్రుడు పరాజితుడగుట, వృత్రుడు చేసిన తపము – దేవతలతో విజయము, ఆనక దేవతలు వృత్రుని చంపుటకు ప్రణాళిక ఏర్పరచుకొనుట, వృత్రుని ఇంద్రుడు వధించుట, ఇంద్రునికి బ్రహ్మహత్యాదోషము కలుగుట, సహుషుడు ఇంద్రపదవిని పొందుట, అంతటితో నుండక శచీదేవినే కోరుట.

నహుషుడు మునులతో పల్లకిని మోయించుట, మునుల శాపమున నహుషుడు పతనమగుట. వసిష్ఠ, విశ్వామిత్రుల కలహమునకు కారణములు. వివిధకర్మలు, యుగధర్మములు, తీర్థములు, చిత్తశుద్ధి, వాటి మాహాత్మ్యము.

వసిష్ఠునికి మైత్రావరుణుడు అని పేరువచ్చుటకు కారణము, నిమి యొక్క కనురెప్పలయందు నివసించు కథ. హైహయవంశము నందలి క్షత్రియులు భృగువంశీకులయిన బ్రాహ్మణులను సంహరించుట, దేవీకృపతో ఒక భార్గవ బ్రాహ్మణుని తొడనుండి తేజస్సంపన్నుడైన బాలకుడు పుట్టుట.

శంకరుని ద్వారా లక్ష్మీదేవి వరమును పొందుట, అశ్వరూపమును ధరించిన విష్ణుభగవానుని ద్వారా అశ్వరూపముననున్న లక్ష్మీదేవి పుత్రునిగనుట, లక్ష్మి మరలా తన స్వరూపమును పొందుట.

లక్ష్మీపుత్రుడగు ఏకవీరుని చరిత్ర, రాజకుమారి ఏకావళి చరిత్ర, ఏకావళిని కాలకేతుడు అపహరించుట, ఏకవీరుని ద్వారా కాలకేతువు వధింపబడుట, ఏకావళి, ఏకవీరుల వివాహము.

వ్యాసనారద సంవాదము, నారదుడు, పర్వతుడు ఒకరినొకరు శపించుకొనుట, నారదుడు వానరముఖుడగుట, దమయంతితో వివాహము, నారదునకు పర్వతునకు శాపవిమోచనములు కలుగుట, నారదుడు మాయకు లోనై స్త్రీగా మారుట, రాజైన తాలధ్వజునితో వివాహము జరుగుట, అనేక పుత్రులు కలుగుట, భగవంతుని కృపతో నారదునకు మరలా తన స్వరూపము ప్రాప్తించుట.

మాయ యొక్క మాహాత్మ్యమును విష్ణు భగవానుడు వర్ణించుట, వ్యాసుడు జనమేజయునకు భగవతి మహిమను తెలుపుట.

స్కంధము-7 : జనమేజయుడు వ్యాసునితో సృష్టిరహస్యమును గూర్చి చర్చించుట, శర్యాతి కథ, చ్యవనునకు సుకన్య వలన నేత్రములు పోవుట, చ్యవనుడు సుకన్యను పెండ్లి చేసుకొనుట.

అశ్వనీకుమారుల వలన చ్యవనునకు మళ్ళీ కళ్ళు వచ్చుట, యౌవనము వచ్చుట, చ్యవనుని నేత్రయుక్తునిగ యౌవనవంతుడైనాడని గమనించి శర్యాతికి సందేహము కలుగుట, శర్యాతి యజ్ఞము చేయుటకు పూనుకొనుట, అశ్వనీకుమారులకు సోమరసాధికారము లభించుట, రాజు రేవతుడు బ్రహ్మలోకమునకు వెళ్ళుట.

రాజగు రేవతుడు బ్రహ్మదగ్గరకు వెళ్ళుట, ఆ స్వామి అంగీకారముతో రేవతి బలరాముల వివాహము, ఇక్ష్వాకు వంశము - యౌవనాశ్వుని దక్షిణ కుక్షి నుండి మాంధాత పుట్టుట.

సత్యవ్రతునకు త్రిశంకుడను పేరు కలుగుటకు కారణము. శాపముక్తి, సత్యవ్రతుడు సశరీరుడై స్వర్గమునకు వెళ్ళుదునని పట్టుబట్టుట. వసిష్ఠుడు సత్యవ్రతుని శపించుట, హరిశ్చంద్ర కథా ప్రారంభము.

సత్యవ్రతుని (త్రిశంకుని) తపోబలముతో స్వర్గలోకమునకు పంపుట, హరిశ్చంద్రుని మీద విశ్వామిత్రునికి కోపము కలిగి అతని రాజ్యము దానము

చేయమనుట, అతనితో కఠినముగా ప్రవర్తించి, అతని కుమారుని పాముకాటుకు గురిచేయుట, హరిశ్చంద్రుడు చండాలుడుగా మారి తన భార్య ఎడల శ్మశానవాటికలో కటువుగ ప్రవర్తించుట.

హరిశ్చంద్రుడు, రాణి ఒకరినొకరు గుర్తెరిగి దేహత్యాగమునకు సిద్ధమగుట, దేవతలు ప్రత్యక్షమై వారిరువురిని, అయోధ్యావాసులతో కలిపి స్వర్గమునకు ఆహ్వానించుట.

దుర్గ, శతాక్షి, శాకంభరీ, నామముల చరిత్ర, మహాగౌరి, మహాలక్ష్మి, వారి ప్రకటితములు – సిద్ధపీఠముల వాటి వివరణ, శక్తిపీఠములు,

తారకాసురుడు దేవతలను పీడించుట, హిమవంతుని గృహమున దేవి ప్రకటమగుట, హిమాలయునకు దేవి జ్ఞానోపదేశము చేయుట, తన విరాట్ స్వరూపమును హిమవంతునకు చూపుట, సౌమ్యరూపమును చూపుట, వివిధయోగముల వర్ణన, బ్రహ్మస్వరూప వర్ణన, భక్తి విధానములు, జ్ఞానప్రాప్తి, మహిమలు తెలుపుట,

దేవీతీర్థములు, వ్రతములు, ఉత్సవములు, పూజావిధానము, దేవిని పూజించిన తరువాత వివిధ ప్రసంగములు, దేవికి చేయు పూజలకు కలుగు ఫలములు (ఫలశ్రుతి).

స్కంధము-8 : సృష్టి ప్రారంభము, స్వాయంభువ మనువు దేవిని స్తుతించుట, వరాహావతార సంక్షిప్తగాథ, మనువు పుత్రికల వంశముల సంక్షిప్త పరిచయము, సప్తద్వీపముల వ్యవస్థీకరణ.

భూమండలము, వాటి విస్తారణము, మామిడి, జంబూ, కదంబ, వటవృక్ష ఫలరసములు నుండి పుట్టిన నదులు, గంగానది అవతరించిన కథ.

శంకరుని ద్వారా శ్రీహరి యొక్క సంకర్షణ రూపస్థితి, భద్రశ్రవుడు, హయగ్రీవ స్తోత్రము, ప్రహ్లాదుడు, మనువు మత్స్యరూపమును స్తుతించి

ఉపాసించుట, కచ్ఛపరూపము, వరాహ రూపము, శ్రీరామచంద్ర రూపము, నారాయణ రూపము, భారతదేశ మహిమలను వివరించుట. ప్లక్ష, శాల్మలి, కుశ, క్రౌంచ, శాక, పుష్కర ద్వీపముల వర్ణన చేయబడింది.

లోకాలోక పర్వత వ్యవస్థ, సూర్యగమన వర్ణన, చంద్రాదిగ్రహముల గమనము, శిశుమార చక్రము, రాహుమండలము, వీటిని గూర్చి తెలుపుట.

అతల, వితల, సుతల, తలాతల, మహాతల, రసాతల, పాతాళ వర్ణనలు. నరకముల వర్ణన, దేవీఉపాసన.

స్కంధము-9 : పంచవిధ ప్రకృతులను, కళ, కళాంశములను వివరించుట, శ్రీకృష్ణుని శ్రీరాధ వలన ప్రకటితులైన చిన్మయాదేవి, దేవతల చరిత్ర చెప్పబడినది. శ్రీకృష్ణుడు చిన్మయురాలైన శ్రీరాధ నుండి ప్రకటితుడైన విరాట్ స్వరూపుడు బాలకుడైన ఆ స్వామివర్ణన, సరస్వతీదేవి యొక్క పూజావిధానం కవచము, యాజ్ఞవల్క్యుడు భగవతి సరస్వతిని స్తుతించు విషయాలు కనపడతాయి.

విష్ణుపత్ని లక్ష్మి, సరస్వతి, గంగా పరస్పరము శాపవశమున భారతదేశమున ప్రవేశించుట, భక్తుల మహత్వమును భగవంతుడే విశదపరచును, కలియుగము యొక్క భావిచరిత్ర, కాలమానము - గోలోకమున శ్రీకృష్ణలీలలు, పృథ్వి యొక్క పుట్టుక, ధ్యానములు, పూజలు, స్తుతులు, పృథ్వి యెడల శాస్త్ర విరుద్ధముగా వ్యవహరించినచో ప్రాప్తించు నరకములు గూర్చి తెలుపబడినది. గంగోత్పత్తి విస్తృత ప్రసంగముగా వుంటుంది.

శ్రీరాధ గంగను కోపగించుట, రాధ శ్రీకృష్ణుని ఎత్తిపొడుచుట. రాధ వలన భయముతో గంగాచరణముల నాశ్రయించుట, జలము లోపించుట వలన పీడితులైన దేవతలు గోలోకమునకు వెళ్ళుట, బ్రహ్మస్తుతి చేత రాధిక ప్రసన్నురాలగుట, గంగ ప్రకటితురాలగునట్లు, దేవతలను శ్రీకృష్ణుడు ఆదేశించుట. గంగ విష్ణుపత్నియగు విషయములతో వివరించబడింది.

తులసి కథాప్రసంగమున రాజగు వృషధ్వజుని చరిత్రను వర్ణించబడింది. వేదవతి కథ. శ్రీరాముని చరిత్ర, సీత, ద్రౌపదిలతో కూడుకున్న వారి పూర్వజన్మల వృత్తాంతమంతయు విపులీకరించబడింది. భగవతి తులసిప్రాదుర్భావము

తులసికి స్వప్నమునందు శంఖచూడుడు దర్శనమిచ్చుట. శంఖచూడునితో తులసి యొక్క వివాహము చేసికొనుటకు బ్రహ్మదేవుని ఆదేశమును వారు గౌరవించుట, వారిరువురి పూర్వజన్మ వృత్తాంతములతో వివరించబడుతుంది.

పుష్పదంతుడు దూతయై శంఖచూడుని వద్దకు వచ్చుట, శంఖచూడుడు తులసికి జ్ఞానోపదేశముచేయుట, శంఖచూడుడు పుష్పభద్రానదీ తీరమున కేగుట. అచట భగవంతుడగు శంకరుని దర్శించుట. ఆ స్వామితో విశదముగ సంభాషించుట.

భగవంతుడగు శంకరుని, శంఖచూడుని ఇరుపక్షములయందు భయంకరమైన యుద్ధము, శంకర శంఖచూడుల యుద్ధము, శంకరుడు వదలిన త్రిశూలముతో శంఖచూడుడు భస్మమగుట. సుదాముడు గోపకుని స్వరూపముతో విమానము ద్వారా గోలోకమును చేరుకొనుట.

శంఖచూడ వేషధారియగు శ్రీహరి ద్వారా తులసి పాతివ్రత్యము భంగమగుట. శంఖచూడుడు తిరిగి గోలోకమునకు వెళ్ళుట, తులసి వృక్షమగుట, శ్రీహరి సాలగ్రామపాషాణముగ రూపొంది భారతదేశమున నివసించుట. తులసీమహిమ, సాలగ్రామము యొక్క వివిధ లక్షణములు, మాహాత్మ్యము తెలపబడినది.

తులసీపూజ, ధ్యానము, నామాష్టకము, తులసీస్తవము, సావిత్రీపూజా విధానము, స్తోత్రములు, అశ్వపతి మహారాజును సావిత్రిని ఉపాసించుట, తత్ఫలితముగ సావిత్రియను కన్యక జన్మించుట, సత్యవంతునితో సావిత్రి

వివాహము, సత్యవంతుడు మృతుడగుట, సావిత్రి యమధర్మరాజుల సంవాదము చెప్పబడింది.

సావిత్రి ధర్మరాజును ప్రశ్నించిన విధానములు – సావిత్రి వరములను పొంది – ధర్మరాజును స్తుతించుట, నరకకుండములు – వాటియందు ప్రవేశించు పాపులు, పాపముల వర్ణనము, పంచదేవోపాసకులు, నరకమునందు ప్రవేశింపరని తెలుపుట, ఎనుబది ఆరు నరక కుండములను గూర్చి వివరించుట.

భగవతి భువనేశ్వరి స్వరూపము – మాహాత్మ్యము – అనిర్వచనీయమగు ఆమె సుగుణములు. భగవతి మహాలక్ష్మి ప్రకటమగుట, విభిన్న మహాలక్ష్మి దేవలోకమున పరిత్యజించుట, ఇంద్రుడు దుఃఖితుడై బృహస్పతి వద్దకు వచ్చుట.

లక్ష్మీదేవి సముద్రుని యందు ప్రకటమగును. ఇంద్రుడు మహాలక్ష్మిని ధ్యానించి స్తుతించుట, మరల అధికారమును పొందుట, దేవి స్వాహా, స్వధాదేవీల ఉపాఖ్యానములు – వారి ధ్యాన పూజావిధానములు – స్తోత్రములు వివరణలు.

భగవతి దక్షిణ ప్రకటమగుట, ఆ దేవి ధ్యానాపూజా విధానములు – స్తోత్రములు వర్ణన – చరిత్ర శ్రవణములు, ఫలశ్రుతి, షష్ఠీదేవి యొక్క ధ్యాన, పూజ, స్తోత్రమహిమల విశద వర్ణనములు.

భగవతి మంగళచండి, మానసాదేవి ఉపాఖ్యానములు ఆదిదేవి, సురభి దేవి ఉపాఖ్యానములు. భగవతి శ్రీరాధ, శ్రీదుర్గా మంత్రములు – ధ్యానము – పూజా విధానములు – స్తోత్రములు.

స్కంధము-10 : స్వాయంభువ మనువు – జననము – అతడు భగవతినారాధించి ఆమె అనుగ్రహము పొందుట, భగవతి వింధ్యాచలమున కేతెంచుట. వింధ్యకు నారదుడు సుమేరు పర్వత మహిమను తెలుపుట –

వింధ్య ప్రేరణతో సూర్యుడుమార్గము నవరోధించుట – దేవతలు భగవంతుడగు విష్ణువు దగ్గరకు వెళ్ళుట. విష్ణుదేవుని అంగీకారముతో దేవతలు కాశీయందు అగస్త్యమునిని శరణుజొచ్చుట. అగస్త్యుని కృపతో సూర్యుని మార్గము సుగమమగుట.

స్వారోచిషమనువు, ఉత్తముడు, తామసుడు, రైవతుడు, చాక్షుసుడు – అను మనువుల వర్ణన. వైవస్వతుడు – సావర్ణి, దక్షసావర్ణి, మేరుసావర్ణి, సూర్యసావర్ణి, ఇంద్రసావర్ణి, రుద్రసావర్ణి, విష్ణుసావర్ణి, నామములతో ప్రసిద్ధులైన మనువుల వర్ణన – అరుణుడను దానవుడు వరములను పొందుట. దేవతలను జయించుట. భ్రామరీదేవి ద్వారా అతడు సంహరింపబడుట.

స్కంధము-11 : సదాచారములతో భగవతి ప్రసన్నురాలగుట. వివిధ సదాచారములను వివరిస్తూ రుద్రాక్ష మాహాత్మ్యమును, భూతశుద్ధి, భస్మమాహాత్మ్యము, ప్రాతఃసంధ్యల వర్ణన, గాయత్రీ మహిమ, పూజావిధానములు, మధ్యాహ్న సంధ్య, తర్పణము, సాయంకాల సంధ్యావర్ణన, గాయత్రీ పురశ్చరణము, ప్రాణాగ్ని హోత్రవిధానములు తెలుపబడినవి.

ప్రాజపత్యాది వ్రతములు – కామ్యసిద్ధి, ఉపద్రవ శాంతి కొరకు గాయత్రీ మంత్రవిధానము – వివిధ ప్రయోగములు, చక్కగా చెప్పబడింది.

స్కంధము-12 : గాయత్రీ మంత్రమును గురించి నారదుడు భగవంతుడగు నారాయణుని ప్రశ్నించుట, నారాయణుడు గాయత్రీ ప్రాముఖ్యతను ప్రతిపాదించుట, ఇరువది నాలుగు వర్ణముల ఋషులు, ఛందములు, దేవతలు, వారి వర్ణములశక్తి, రూపము, ముద్రలను వర్ణించుట, గాయత్రీ ధ్యానము, గాయత్రీ కవచ వర్ణన, గాయత్రీ హృదయ విన్యాసము, గాయత్రీ స్తోత్రము, శ్రీ గాయత్రీ సహస్ర నామములు వరుస క్రమంలో అక్షర

క్రమంలో చెప్పబడినవి. అయితే వాటికి అర్థములతో వివరణలలో ప్రత్యేక అనుబంధము చేర్చబడును.

దీక్షా విధానములు ఉత్తమ లక్షణములు నారదుడు అడుగగా నారాయణుడు చెప్పెను.

దేవతలకు విజయగర్వము వచ్చి ఈ శక్తి అంతా తమదేనని భ్రాంతి చెందిరి. జగదంబ యక్షిణి రూపమున ప్రకటితయై – అగ్ని, వాయువులను గడ్డిపోచను దహించుటకు, కదలించమని కోరగా – అగ్ని, వాయువు అసమర్థులైనవి.

ఇంద్రునకు భగవతి ఉమ దర్శన భాగ్యమును కలిగించుట, అతనికి ఆ దేవి జ్ఞానోపదేశము చేయుట. గాయత్రీ దేవి అనుగ్రహము వలన గౌతమునిచే అసంఖ్యాక బ్రాహ్మణ పరివారములు రక్షింపబడుట, బ్రాహ్మణులు కృతఘ్నులగుట, గౌతముడు బ్రాహ్మణులను ఘోరముగా శపించుట.

మణిద్వీప వర్ణనము, విస్తారముగా తెలుపబడినది. జనమేజయుని ద్వారా అంబాయజ్ఞము జరుగగా దేవీ మహిమ, దేవీ భాగవత మహిమలు చెప్పబడినవి.

"సర్వే జనా సుఖినో భవంతు"

"ఓం శాంతి, శ్శాంతి, శ్శాంతిః"

శ్రీ దుర్గాయై నమః

8. శ్రీ దుర్గాష్టోత్తర శతనామ స్తోత్రమ్

ఈశ్వర ఉవాచ –

శతనామ ప్రవక్ష్యామి శృణుష్వ కమలాసనే
యస్య ప్రసాదమాత్రేణ దుర్గా ప్రీతా భవేత్ సతీ – 1

ఓం సతీ సాధ్వీ భవప్రీతా భవానీ భవమోచనీ
ఆర్యా దుర్గా జయా చాద్యా త్రినేత్రా శూలధారిణీ - 2

పినాకధారిణీ చిత్రా చండఘంటా మహాతపాః
మనో బుద్ధి రహంకారా చిత్తరూపా చితాచితిః - 3

సర్వమన్త్రమయీ సత్తా సత్యానందస్వరూపిణీ
అనంతా భావినీ భావ్యా భవ్యాభవ్యా సదాగతిః - 4

శాంభవీ దేవమాతా చ చింతారత్నప్రియా సదా
సర్వవిద్యా దక్షకన్యా దక్షయజ్ఞవినాశనీ - 5

అపర్ణా ఽనేకవర్ణా చ పాటలా పాటలావతీ
పట్టాంబరపరీధానా కలమఞ్జీరరఞ్జనీ - 6

అమేయవిక్రమా క్రూరా సుందరీ సురసుందరీ
వనదుర్గా చ మాతంగీ మతంగమునిపూజితా - 7

బ్రాహ్మీ మాహేశ్వరీ చైంద్రీ కౌమారీ వైష్ణవీ తథా
చాముండా చైవ వారాహీ లక్ష్మీ శ్చ పురుషాకృతిః - 8

విమలోత్కర్షిణీ జ్ఞానా క్రియా నిత్యా చ బుద్ధిదా
బహులా బహులప్రేమా సర్వవాహనవాహనా - 9

నిశుమ్భశుమ్భహననీ మహిషాసురమర్దినీ
మధుకైటభహంత్రీ చ చండముండవినాశినీ - 10

సర్వాసురవినాశా చ సర్వదానవఘాతినీ
సర్వశాస్త్రమయీ సత్యా సర్వాస్త్రధారిణీ తథా - 11

అనేకశస్త్రహస్తా చ అనేకాస్త్రస్య ధారిణీ
కుమారీ చైకకన్యా చ కైశోరీ యువతీ యతిః - 12

అప్రౌఢా చైవన ప్రౌఢా చ వృద్ధమాతా బలప్రదా
మహోదరీ ముక్తకేశీ ఘోరరూపా మహాబలా - 13

అగ్నిజ్వాలా రౌద్రముఖీ కాలరాత్రి స్తపస్వినీ
నారాయణీ భద్రకాళీ విష్ణుమాయా జలోదరీ - 14

శివదూతీ కరాలీ చ అనంతా పరమేశ్వరీ
కాత్యాయినీ చ సావిత్రీ ప్రత్యక్షా బ్రహ్మవాదినీ - 15

య ఇదం ప్రపఠే న్నిత్యం దుర్గానామశతాష్టకమ్
నాసాధ్యం విద్యతే దేవి త్రిషు లోకేషు పార్వతి! - 16

ధనంధాన్యం సుతం జాయాం హయం హస్తిన మేవ చ
చతుర్వర్గం తథా చాంతే లభే న్ముక్తిం చ శాశ్వతీమ్ - 17

కుమారీం పూజయిత్వా తు ధ్యాత్వా దేవీం సురేశ్వరీమ్
పూజయేత్ పరయా భక్త్యా పఠే న్నామశతాష్టకమ్ - 18

తస్య సిద్ధి ర్భవేద్ దేవి సర్వైః సురవరై రపి
రాజానో దాసతాం యాంతి రాజ్యశ్రియ మవాప్నుయాత్ - 19

గోరోచనాలక్తకకుంకుమేన సిందూరకర్పూరమధుత్రయేణ
విలిఖ్య యంత్రం విధినా విధిజ్ఞో భవేత్ సదా ధారయతే పురారిః - 20

భౌమావాస్యానిశా మగ్రే చంద్రే శతభిషాం గతే
విలిఖ్య ప్రపఠేత్ స్తోత్రం స భవేత్ సంపదాం పదమ్ - 21

॥ ఇతి శ్రీవిశ్వసారతంత్రే దుర్గాష్టోత్తరశతనామస్తోత్రం సమాప్తమ్ ॥

9. మహిషాసురమర్దినీస్తోత్రమ్

అయి గిరినందిని! నందితమేదిని! విశ్వవినోదిని! నందినుతే!
గిరివరవింధ్యశిరోఽధినివాసిని! విష్ణువిలాసిని! జిష్ణునుతే!

భగవతి! హే శితికంఠకుటుంబిని! భూరికుటుంబిని! భూరికృతే!
జయ జయ హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే!

సురవరవర్షిణి! దుర్ధరధర్షిణి! దుర్ముఖమర్షిణి! హర్షరతే!
త్రిభువనపోషిణి! శంకరతోషిణి! కల్మషమోచని! ఘోరరతే!
దనుజనిరోషిణి! దుర్మదశోషిణి! దుఃఖనివారిణి! సింధుసుతే!
జయ జయ హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే!

అయిజగదంబ! కదంబవనప్రియవాసవిలాసిని! హాసరతే!
శిఖరిశిరోమణితుంగహిమాలయశృంగనిజాలయ మధ్యగతే!
మధుమధురే! మధుకైతవభంజని! కైటభభంజని! రాసరతే!
జయ జయ హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే!

అయినిజహుంకృతిమాత్రనిరాకృతధూమ్రవిలోచనధూమ్రశతే!
సమరవిశోణితబీజసముద్భవబీజలతాధిక బీజలతే!
శివ శివ శుంభనిశుంభమహాహవదర్పితభూతపిశాచపతే!
జయ జయ హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే!

అయి శతఖండవిఖండితకుండవితుండితశుండగజాధిపతే!
రిపుగజగండవిదారణచండపరాక్రమశౌండమృగాధిపతే!
నిజభుజదండ విపాతితఖండ విపాతితముండ భటాధిపతే!
జయ జయ హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే!
అయి రణదుర్మదశత్రువధోత్థితదుర్ధరనిర్జరశక్తిభృతే!
చతురవిచారధురీణమహాశివదూతకృతప్రమథాధిపతే!
దురితదురీహదురాశయదుర్మదదానవదూతకృతాంతగతే!
జయ జయ హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే!

అయి శరణాగతవైరివధూవరవీరవరాభయదాయకరే!
త్రిభువనమస్తకశూలవిరోధిశిరోధికృతామలశూలకరే!
ధిమిధిమితామరదుందుభినాదమహోముఖరీకృతతిగ్మకరే!
జయ జయ హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే!

సురలలనాతతధేయితధేయితధాభినయోత్తరనృత్యరతే!
ककుభాం పతివరథోంగతతాలకతాలకుతూహలనాదరతే!
ధుధుకిటధుధుకిట ధింధిమితధ్వనిధీరమృదంగనినాదరతే!
జయ జయ హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే!

జయ జయ జప్యజయే జయశబ్దవరస్తుతితత్పరవిశ్వనుతే!
ఝణ ఝణ ధింధిమిధింకృత నూపురశింజితమోహితభూతపతే!
నటితనటార్ధనటీనటనాయకనాటితనాటకనాట్యరతే!
జయ జయ హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే!

దనుజసుసంగరరక్షణసంగపరిస్ఫురదంగనటత్కటకే!
కనకపిశంగపృషత్కనిషంగరసద్భటశృంగహతావటుకే
కృతచతురంగబలక్షితిరంగఘటద్బహురంగవలత్కటకే
జయ జయ హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే!

మహితమహాహవమల్లమతల్లికమల్లితరల్లకమల్లరతే!
విరచితవల్లికపల్లికభిల్లికమిల్లకభిల్లకవర్గవృతే!
సితకృతఫుల్లసముల్లసితారుణపల్లవతల్లజసల్లలితే!
జయ జయ హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే!

అయిసుమనస్సుమనస్సుమనస్సుమనస్సుమనోహరకాంతియుతే!
నుతరజనీరజనీరజనీరజనీకరవక్త్రవిలాసవృతే!

సునయనవిభ్రమరభ్రమరభ్రమరభ్రమరభ్రమరాధిపతే!
జయ జయ హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే!

అవిరళగండగలన్మదమేదురమత్తమతంగజరాజగతే!
త్రిభువనభూషణభూతకళానిధిరూపపయోనిధిరాజసుతే!
అయి సుదతీజనలాలసమానసమోహనమన్మథరాజనుతే!
జయ జయ హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే!

కమలదళామలకోమలకాంతికళాకలితాకులబాలలతే!
సకలవిలాసకళానిచయక్రమకేళిచలత్కలహంసకులే!
అళికులసంకులకువలయమండలమౌళిమిళద్వకుళాళికులే!
జయ జయ హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే!

కలమురళీరవవీజితకూజితలజ్జితకోకిలమంజురతే!
మిళితపులిందమనోహరగుంజితరంజితశైలనికుంజగతే!
నిజగుణభూతమహాశబరీగణసద్గుణసంభృతకేళిభృతే!
జయ జయ హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే!

కటితటపీతదుకూలవిచిత్రమయూఖతిరస్కృతచంద్రరుచే!
నిజకనకాచలమౌళిపదోర్జితనిర్జరకుంజరకుంభకుచే!
ప్రణతసురాసురమౌళిమణిస్ఫురదంశులతాధికచంద్రరుచే!
జయ జయ హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే!

విజితసహస్రకరైకసహస్రకరైకసహస్రకరైకనుతే!
కృతసురతారకసంగరతారకసంగరతారకసూనునుతే!
సురథసమాధిసమానసమాధిసమానసమాధిసుజాతరతే!
గజముఖషణ్ముఖరంజితపార్శ్వసుశోభితమానసకంజపుటే!
జయ జయ హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే!

పదకమలం కరుణానిలయే వరివశ్యతి యో ఽనుదినం సశివే!
అయి కమలే! కమలానిలయే! కమలానిలసేవ్యముఖాబ్జశివే!
తవ పద మద్య హి శివదం దృష్టిపథం గత మస్తు మభిన్నశివే!
జయ జయ హే మహిషాసురమర్దిని! రమ్యకపర్దిని! శైలసుతే!

స్తుతి మిమాం స్తిమిత స్సుసమాధినా నియమితో యమతో ఽనుదినం పఠేత్!
పరమయా రమయా స నిషేవ్యతే, పరిజనోఽపి జనోఽపి చ తం భజేత్!

॥ ఇతి మహిషాసురమర్దినీస్తోత్రమ్ ॥

సర్వే జనా స్సుఖినో భవంతు - ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

* * *